తెలుగు పలుకు

*

23rd తానా మహాసభల జ్ఞాపిక 2023

23 TANA Conference



July 7, 8 & 9, 2023 Philadelphia









* YOUR JEWELER FOR EXQUISITE DESIGNS
* BEST IN QUALITY AND PRICES
* HALLMARK JEWELRY
* EXCELLENT CUSTOMER SERVICE
* WE BUY AND EXCHANGE OLD GOLD
* WE BUY AND SELL 24K GOLD AND SILVER BARS/COINS



BUY ONLINE
@ WWW.SWARNAJEWELS.COM



SWARNA JEWELS

Quality our Tradition
22K Gold & Certified Diamond Jewelry Showroom

2101 STREET ROAD BENSALEM PA 19020
TIMINGS : 11:30 AM - 7:30 PM
TUESDAY CLOSED
PHONE : 215 633 0708
FOR MORE DETAILS CONTACT OUR STORE

తెలుగు పలుకు

23వ తానా మహాసభల జ్ఞాపక సంచిక

23rd TANA Conference
SOUVENIR

సంపాదకులు

సాయి బ్రహ్మానందం గొర్తి

శ్రీనివాస్ సగరం

సలహా సంపాదకులు

వాసిరెడ్డి నవీన్



July 7, 8 & 9, 2023

Pennsylvania Convention Center

1101 Arch St, Philadelphia, PA 19107, USA



TELUGU PALUKU

Volume 23, 2023

Souvenir of the 23rd TANA Conference

Editor
SAI BRAHMANANDAM GORTI
SRINIVAS SAGARAM

Advisory Editor from India
VASIREDDY NAVEEN

Cover Painting
Kapu Rajaiah

Illustrations
Chary PS, Hyderabad
charycart@gmail.com

Souvenir Layout and Design
Sita Ponnapalli
Akshara Creators
AG-2, Hyderguda, Hyderabad-500 029, India
Phone: +91 99496 56668; sakshara@gmail.com

Proudly Printed by
Kalyani Group
Amit Shah
Phone: 908 313 2434
Email: ashah3@yahoo.com

© Telugu Association of North America (TANA)

Souvenir Committee

Saibrahmanandam Gorti - Chair
Srinivas Sagaram - Chair
Vasireddy Naveen - Member
Sita Ponnapalli - Member
Ranjit Mamidi - Member
Ravi Theja Mathu - Member
Nayudamma Chowdary Yalavarthi - Member



Thanks...

The leadership of 23rd TANA Conference, especially Anjaiah Chowdary Lavu, Ravi Potluri for their confidence in and unwavering support.

Ranjit Mamidi, Ravi Theja Muthu, and Nayudamma Chowdary Yalavarthi for editorial support.

Also Chowdary Jampala for all along support.

All the advertisers, donors and supporters for your generosity that makes this souvenir possible.

All the writers, poets and artists who kindly and promptly shared their creations.

Sita Ponnapalli for layout designing and type-setting.

P.S. Chary for cover painting illustrations.

Amit Shah of Kalyani Group for printing.


సంస్కృతి మన వరం - సేవ మన బలం
23
TANA CONFERENCE
PHILADELPHIA, JULY 7-9, 2023


VITEL GLOBAL
COMMUNICATIONS

The Ultimate Business Cloud Voice & Data Services

AMERICA'S FASTEST-GROWING Inc. 5000 PRIVATE COMPANIES

Fastest Growing Business Phone Service Company

Best Business Phone Service
Packed With 60+ Business Phone Features



Scan For More Information

855-558-4835

sales@vitelglobal.com

www.vitelglobal.com

Best Compliments From
Vijaya & Praveen Andapalli

USA CANADA MEXICO INDIA

Contents

1.	TANA President's Message	6-9
2.	23rd TANA Conference Co-ordinator's Message	10-11
3.	23rd TANA Conference Chairman's Message	13
4.	Editorial	14-15
5.	Messages from Dignitaries	17-26
6.	TANA Leadership Messages	28-30
7.	23rd TANA Conference Leadership Messages	31-34
8.	Pictures of 23rd TANA Conference Leadership	35
9.	Pictures of TANA Leadership	36-39
10.	Pictures of 23rd TANA Conference Committees	41-71
11.	Pictures of 23rd TANA Conference Donors	73-110
12.	23వ తానా మహాసభల ఆరంభ నృత్యరూపకం - జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు	113-116
13.	23వ తానా మహాసభల ముఖ్య అతిథుల పరిచయాలు శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు, శ్రీ నందమూరి బాలకృష్ణ జస్టిస్ ఎన్.వి. రమణ	117-125
14.	తెలుగు రాష్ట్రాల్లో తానా చైతన్య స్రవంతి - సునీల్ పంత్ర	126-127
15.	తానా పురస్కారాలు	129-141
16.	Hope of Future - Introducing Young Talents of USA	143-147
17.	కెమెరాకు రంగులద్దిన తమ్మా శ్రీనివాసరెడ్డి ఫోటో ఫీచర్	149-154
18.	శతజయంతి నందనాలు ఎన్టీఆర్, ఘంటసాల, అల్లు రామలింగయ్య సంస్మరణ వ్యాసాలు	155-209
19.	సాహిత్య లోకం వివిధ సామాజిక, సాహిత్య అంశాలపై వ్యాసాలు	213-252
20.	కథలు, కవితలు	255-324



అధ్యక్షుని సందేశం

అంజయ్య చౌదరి లావు

అందరికీ నా వినమ్ర ప్రణామాలు!

సేవకు కులం లేదు... సేవకు మతం లేదు.

సేవకు జాతి లేదు... సేవకు వర్ణం లేదు. ఉండవలసింది సాయం చేయాలన్న అభిమతమే

మనసా వాచా మంచిని కాంక్షించే మనసు మాత్రమే!

తానాలో సేవ అనేది ఒక నిరంతర ప్రక్రియ. ప్రతి మనిషి విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగాలు, ఎంతోమంది సహాయ సహకారాలు ఉంటాయి. సప్త సముద్రాలు దాటాక మనకి ఇంత ఉన్నత స్థానం కల్పించిన ఊరిని, బడిని, గ్రామస్తులను, పరిసరాలను ఎప్పుడూ మరిచిపోకూడదు. 'ఫలానోడు మనూరోడే' అని వాళ్లు గర్వంగా చెప్పుకునే పనులు మనం చేయాలి. సాయం చేయాలంటే అన్నిటికంటే ముఖ్యమైనది డబ్బు కాదు. సాయం చేయాలన్న మనసు, పక్కవారి కోసం నిస్వార్థంగా మనం కేటాయించే కొద్దిపాటి సమయం. మన చుట్టూ ఉన్నవారు అందరూ బాగుంటేనే సమాజం బాగుంటుంది. అటువంటి సమాజంలో రేపు మన బిడ్డలు కూడా జీవిస్తారు. వారికోసం సంఘంలోని సమస్యలకు మనవంతు సాయం చేస్తూ మన ఆనందాల్లో చుట్టూ ఉన్నవారిని భాగస్వాములను చేస్తూ ఒక నందనవనంలాంటి సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నది నా జీవనసూత్రం.

అమెరికాలోని భారతీయులకీ ఒక విశ్వాసపాత్రమైన వెన్నుదన్నుగా తానా అనే ఒక మాహా సంస్థ రూపొందటం వెనుక 46 సంవత్సరాల అవిరళ కృషి దాగి వుంది. సేవ అనేది ఒక భాగ్యం. అధికారం అనేది ఒక సామాజిక బాధ్యత. తెలుగు మిత్రులు అందరూ కలిసి ఇచ్చిన ఈ బాధ్యతని గత రెండేళ్లుగా అత్యంత శ్రద్ధతో, సమన్వయంతో, సమర్థవంతంగా నిర్వహించాను అని మనసావాచా నమ్ముతున్నాను. ఈ ప్రయాణంలో ప్రతి క్షణం నాకు, నా సభ్యులకు లభించిన సంతృప్తి మాటల్లో వర్ణించలేనిది. 2021-23 కార్యవర్గం తన పనితీరుతో అన్ని విభాగాల్లోనూ తానా చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో అటు రాసిపరంగానూ ఇటు వాసిపరంగానూ కొనియాడదగ్గ స్థాయిలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

'వట్టి మాటలు కట్టిపెట్టోయ్... గట్టి మేల్ తలపెట్టవోయ్,' అన్న గురజాడ వారి మాటలను నిత్యం మననం చేసుకుంటూ ముందుకు సాగుతూ, ప్రతిభను ప్రోత్సహిస్తూ, నైపుణ్యానికి మెరుగులు దిద్దుతూ, రుగ్మతలను రూపుమాపుతూ, అసమానతల అంతానికి కృషి చేస్తూ, అసహాయులకు చేయూతనిస్తూ, ప్రకృతి వైపరీత్యాలకు తక్షణం స్పందిస్తూ, తన శక్తిని పెంచుకుంటూ, ఇంతింతై వటుడింతై అన్నట్లు విస్తరిస్తూ సాగుతున్న ఈ తానా ప్రయాణం ఏ ఒక్కరి అద్భుతమో కాదు. మేటి నాయకత్వానికి ధీటైన బృందం తోడైతే అద్భుతాలు వాటంతట అవే సాధ్యమవుతాయి అన్న నిజం మరోసారి నిరూపితమైంది.

మన సంకల్పం గట్టిదైతే విశ్వం మన వశం అవుతుంది అంటారు. నాయకుడి గొప్పదనం అతని వెనకున్న బృందం బలమే. దశాబ్దాలుగా జరిగిన సేవా కార్యక్రమాలు ఒక ఎత్తయితే గత రెండేళ్లుగా (2021-23) వివిధ రంగాల్లో తెలుగువారి కోసం చేసిన కృషి మరొక ఎత్తు. దీనికంతటికీ నా వెనకున్న నిస్వార్థ బృందం పనితీరే కారణం. సమాజ హితం కోసం స్వంత పనులు సైతం పక్కన పెట్టడానికి

క్షణం కూడా ఆలోచించని స్వచ్ఛంద శ్రామికులు మా తానా సైనికులు. 2021లో నేను తానా అధ్యక్షునిగా ఎన్నికైనప్పుడు నా మనసులో ఉన్నది ఒకటే ఆలోచన– తానా చేస్తున్న గొప్ప కార్యక్రమాలను మరింతమందికి చేరువ చెయ్యటమే కాకుండా, భావి తరాలను తానాలో భాగస్వామ్యం చేసి తానాకి ఒక ఉజ్వల భవిష్యత్తు కల్పించాలి అని. మనం చేసే పని మనం పదవిలో ఉన్నప్పుడే కాకుండా ముందు తరాలకు సైతం ఒక దిక్సూచిలా నిలిస్తేనే మన నాయకత్వానికి నిజమైన కొలబద్ద అనేది నేను నమ్ముతాను. దానికోసం మా బృందం అంతా అహర్నిశలు శ్రమించాం. ఆ శ్రమను పదవులకు అతీతంగా కొనసాగిస్తూనే ఉంటాం.

2021–23 కార్యవర్గం హయాంలో తానా ఆర్థికంగా ఎంతో పటిష్ట స్థాయికి చేరటమేకాక గతంతో పోలిస్తే ఎంతో మిన్నగా సేవా కార్యక్రమాలు చేయగలిగింది. 46వ పుట్టినరోజు జరుపుకుంటున్న తానాలో గత 44 సంవత్సరాలుగా 36 వేలమంది సభ్యులు చేరగా, కేవలం గత రెండేళ్ల కాలంలో (2021–23) మరో 36 వేలమంది జీవితకాల సభ్యులు అదనంగా చేరి తానా బలాన్ని రెట్టింపు చేశారు. వీరితోపాటు పదివేల డాలర్లు చందాగా ఇచ్చి మరొక 60 మందికి పైగా జీవితకాల డోనర్ సభ్యులుగా చేరి తానా సంస్థకు ఈ రెండేళ్లలో దాదాపు 4 మిలియన్ డాలర్లు సమకూరడానికి దోహదపడ్డారు. తానా కొత్తతరం తెలుగువారి హృదయాల్లో ఎంత గొప్ప విశ్వాసం చూరగొందో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

తానా ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టబోతున్న 23వ తానా కన్వెన్షన్ జులై 7,8,9 తేదీల్లో పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియాలో జరగబోతున్న సందర్భంగా అమెరికాలో దాదాపు ప్రతి రాష్ట్రానికి వెళ్లి తెలుగు వారందరికీ ప్రత్యేక ఆహ్వానం పలకటం జరిగింది. తెలుగువారు ఐకమత్యంగా ఉంటే ఏదయినా సాధించగలం. మనమంతా ఒక్కటే అని దిక్కులు పిక్కటిల్లేలా చెప్పే గొప్ప అవకాశం ఈ మహాసభలు కల్పిస్తాయి. కోవిడ్ మహమ్మారి కారణంగా 2021లో జరగాల్సిన తానా మహాసభలు రద్దు కావడం వల్ల 4 సంవత్సరాల తర్వాత మళ్లీ తానా మహాసభలు జరగబోతున్నాయి.

ప్రత్యేక ఆహ్వానితులుగా తెలుగుభాషకు, తెలుగు రాష్ట్రాలకు వన్నె తెచ్చిన పేరెన్నికగన్న ప్రముఖ కళాకారులు, కవులు, విద్యావేత్తలు, ఆధ్యాత్మిక గురువులు, పండితులు ఎందరో ప్రపంచ నలుమూలల నుండి తానా సమావేశాలకు రాబోతున్నారు. దీనికోసం అమెరికాలోని తెలుగు మిత్రులెందరో సహృదయంతో ఆర్థికంగా, హార్ధికంగా చేయూతనిచ్చి, ఇందులో భాగస్వాములై తెలుగు పతాకాన్ని రెపరెపలాడించడానికి ప్రోత్సాహం అందించారు.

నిర్వహణా సౌలభ్యం కోసం తానాలోని సేవా కార్యక్రమాలు నాలుగు విభాగాలుగా విభజించబడ్డాయి. ఆ నాలుగు విభాగాలు 1) TANA Foundation 2) TANA Team Square 3) TANA Cares 4) TANA Cultural. తానాలో చేసే ప్రతి సేవా కార్యక్రమం వీటిలో ఒక విభాగం కిందకు వస్తాయి.

TANA Foundation ద్వారా ఈ రెండేళ్లలో చేసిన మహోపయోగమైన కార్యక్రమాలు తానా ఖ్యాతిని ప్రపంచం మొత్తం దాటి చెప్పాయి. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్న నిజాన్ని గుర్తించి తానా ఎంతో కాలంగా EYE కాంపులను నిర్వహిస్తూ శంకర నేత్రాలయ, రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో వేలమందికి కంటి పరీక్షలు చేయించి లక్షకు పైగా కళ్లజోళ్లు అందించడం జరిగింది. దీనిని మరో స్థాయికి తీసుకెళ్తూ 50 క్యాంపులు చేయాలన్న లక్ష్యాన్ని దాటి ఇప్పటికే ఈ రెండేళ్ల క్యాలంలో 70కి పైగా కాంపులు నిర్వహించామంటే మా బృందం యొక్క పనితీరుని ఎంత కొనియాడినా తక్కువే. దీనితోపాటు నేటి తరంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాన్సర్ మహమ్మారిని రూపుమాపే ప్రయత్నంలో భాగంగా 70కి పైగా కాన్సర్ క్యాంపులు బసవతారకం ఇండో–అమెరికన్ కాన్సర్ ఆసుపత్రి మరియు గ్రేస్ ఫౌండేషన్ ద్వారా చేయడం జరిగింది. మా ముఖ్య కార్యవర్గ సభ్యుడు జానీ నిమ్మలపూడి ప్రజల్లో కాన్సర్ చికిత్సకు అవగాహన కల్పించే క్రమంలో 50 ఏళ్ల వయసులో అనారోగ్యాన్ని సైతం పక్కన పెట్టి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి బసవతారకం కాన్సర్ ఆసుపత్రికి కాన్సర్ బాధితుల కోసం కోటి రూపాయలు సమకూర్చారు. అన్ని దానాల్లోనూ విద్యాదానం గొప్పదన్న విషయం ఉన్నత చదువులు చదువుకున్న ప్రవాసులకు తెలియంది కాదు. ఎంతో కష్టపడి చదువుతూ పేదరికం వల్ల పై చదువుకు చదువుకోలేని విద్యార్థులు దాదాపు 1600 మందికి భారతదేశంలోను, అమెరికాలోను స్కాలర్‌షిప్స్ మంజూరు చేయడం జరిగింది. తానా 'ఆదరణ'

ద్వారా దివ్యాంగులకు సైకిళ్లు, మూడు చక్రాల బళ్లు, తానా 'అన్నపూర్ణ' ద్వారా విజయవాడ, గుంటూరు, తెనాలి గవర్నమెంటు హాస్పిటళ్ల దగ్గర ప్రతిరోజూ దాదాపు 600 మందికి పైగా రోగులకు అన్నదానం చేయడం జరుతుంది. తానా 'ఆరుణ్య' ద్వారా బధిర, మూగ రుగ్మతలున్న 5 ఏళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వ సంస్థల సహకారంతో ఆపరేషన్లు చేయించడం జరిగింది.

తానా ఫౌండేషన్ కార్యకలాపాల్లో భాగంగా మిలియన్ డాలర్లతో తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో ప్రాంతాల్లో డిజిటల్ క్లాస్ రూములు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేయడం జరిగింది. తానా ప్రతి రెండేళ్లకోసారి మహాసభలకు ముందు చేసే 'చైతన్యస్రవంతి' ఒక పెద్ద హైలెట్. ఎన్నో వ్యయప్రయాసలతో తానా బృందం నుండి ఎంతోమంది భారతదేశం వచ్చి ఎన్నో సహాయ కార్యక్రమాలను దగ్గరుండి జరిపిస్తారు. ఇందులో భాగంగా ఈసారి దాదాపు 12 నగరాల్లో సాంస్కృతిక కళోత్సవాలు, మరుగున పడిన కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులను గౌరవిస్తూ 40 రోజులపాటు నిరంతరాయంగా సాగాయి. తొలిసారిగా 5 దక్షిణ భారత రాష్ట్రాల నుండి విచ్చేసిన దివ్యాంగులకు 'వీల్ చైర్స్' టోర్నమెంటును వైజాగ్ గీతం యూనివర్సిటీలో నిర్వహించడం ఇంతకు ముందెన్నడూ చూడని గొప్ప విషయం. తానా 'కళారాధన' పేరిట తెలుగు సినీపరిశ్రమకు చెందిన ముఖ్య కళాకారులను సన్మానించుకోవడం జరిగింది. రైతుల కోసం పవర్ స్ప్రేయర్లు, రక్షణ పరికరాలు, 'రైతుకోసం' కార్యక్రమాలు కృష్ణాజిల్లా పాల సంఘం సహకారంతో నిర్వహించడం జరిగింది. తానా చరిత్రలోనే నభూతో అన్న రీతిలో 3 మిలియన్ డాలర్లతో ఎన్నో వినూత్న కార్యక్రమాలతో ఈసారి 'చైతన్యస్రవంతి' నిర్వహించడం జరిగింది అని చెప్పడానికి మిక్కిలి సంతోషిస్తున్నాను.

తానా అత్యవసర విపత్కర విభాగ సంస్థ (TANA TEAM SQUARE) అమెరికాలో తానా నిర్వహించే కార్యక్రమలు అన్నింటిలోకీ చాలా కీలకమైనది. ఎన్నో ఆశలతో అమెరికా వచ్చే యువతీ యువకులు, వారిని చూడటానికి వచ్చే పెద్ద వయసు తల్లిదండ్రులు అనుకోని కారణాల వల్ల చనిపోవడం జరిగితే వారికి తానా అన్ని విధాలా చేయూతనిస్తూ చనిపోయిన వారి పార్థివ దేహాన్ని సముచిత రీతిలో భారతదేశం చేర్చే విషయంలో ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుంది. తెలుగువారే కాక వివిధ రాష్ట్రాలకు చెందిన భారతీయులెందరో ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో అమెరికాలో పోలీసులకంటే ముందు TANA TEAM SQUAREకి ఫోన్ చేయడం తానా సంస్థపై వారికి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుంది. ఇటువంటి అనుకోని సంఘటనలు వల్ల తానాకి ప్రతి వారం 3 నుండి 5 ఫోన్ కాల్స్ వస్తాయి అంటే అమెరికాలోని తెలుగువారికి తానా గుండె చప్పుడుగా మారింది అనటంలో అతిశయోక్తి లేదు.

అలాగే సరైన లైసెన్సులు లేని యూనివర్సిటీలకు పై చదువుల కోసం వచ్చి ఇబ్బందుల్లో చిక్కుకునే తెలుగు విద్యార్థులకు, వీసా సమస్యలతో ఇబ్బంది ఎదుర్కునేవారికి, అనుకోని పరిస్థితుల్లో వీసా అయిపొయ్యాక అమెరికాలో ఉండాల్సి వచ్చి సరైన మందులు లేని తల్లిదండ్రులకు అమెరికాలో తానా ఎంతో సహాయకారిగా ఉంటుంది. కోవిడ్ సమయలో తానా భారతదేశంలో చేసిన మహత్తర సేవను గుర్తించి భారత ప్రభుత్వం బంగారు పతకాన్ని ఇచ్చి గౌరవించడం తానా సభ్యులే కాక తెలుగు వారందరూ గర్వించదగ్గ విషయం.

TANA Cares కార్యక్రమాల్లో భాగంగా కొత్త తరం యువతీ యువకుల కోసం SAT/ACT ట్రైనింగ్ క్యాంపులు, స్కూలు విద్యార్థుల కోసం దాదాపు 35 సమ్మర్ క్యాంపులు ఇమ్మిగ్రేషన్ కి సంబంధించిన సెమినార్లు, వీలునామాకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, మహిళల ఆరోగ్యం కోసం, ఆర్థిక నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం ఎన్నో సెమినార్లు, వెబినార్లు నిర్వహించడం జరిగింది. బోన్‌మారో డ్రైవ్‌లు, బ్లడ్ డ్రైవ్‌లు, టాక్స్ సెమినార్లు, కాలేజీలో చేరబోయే హైస్కూల్ విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు, అవసరంలో ఉన్న వేలాదిమంది పేద విద్యార్థులకు టాయ్ డ్రైవ్‌లు, ఫుడ్ డ్రైవ్‌లు, బ్యాక్‌పాక్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ 5ఎ వాక్‌లు, యోగా తరగతులు, అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో క్రికెట్, టెన్నిస్, త్రో బాల్, 3-ఆన్-3 బాస్కెట్ బాల్ వంటి 100కు పైగా ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది.

తానా సాంస్కృతిక (TANA Cultural) విభాగం గురించి ప్రత్యేకంగా పేర్కొనాలి. తానా అంటేనే తెలుగుదనానికి ఒక ప్రతీక. దశాబ్దాలుగా అమెరికాలోని తెలుగువారికి ఒక చిరునామాగా మారిన తానా సంస్థ తెలుగుభాషకు, సాంప్రదాయాలకు, సంస్కృతికి ఎప్పుడూ పెద్ద పీట వేస్తూనే ఉంది. భావితరాలకు తెలుగు నేర్పడం ద్వారా వారి తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో తెలుగులో సంభాషించే వీలును కల్పిస్తూ 'పాఠశాల'ను స్థాపించి అమెరికాలోని రాష్ట్రాలతో పాటు మొత్తం 5 దేశాల్లో అతి తక్కువ ఖర్చుతో ప్రతి విద్యార్థి కోసం ఏటా 200 డాలర్లు ఖర్చు చేస్తూ అమ్మ భాష శిక్షణకు, పరిరక్షణకు తానా తన వంతు కృషి చేస్తుంది. ప్రతి నెలా చివరి ఆదివారం తానా నిర్వహించే 'నెల నెలా తెలుగు వెన్నెల' అనే వినూత్న సాహిత్య కార్యక్రమం తానా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒక కలికితురాయి. సరికొత్త ఆలోచనలతో సాహిత్యంలోని వివిధ కోణాల్ని స్పృశిస్తూ చేసే ఈ కార్యక్రమం కోసం ప్రతి నెల సాహిత్యాభిమానులెందరో ఎదురుచూస్తూ ఉంటారు. 'కేవలం మహిళా సభ్యులతో అష్టావధానం/శతావధానం', 'సాహిత్యంలో మానవవాదం', 'విదేశీ కవితాప్రక్రియలు' మొదలైనవి ఇందులో భాగంగా జరిగిన గొప్ప ప్రయోగాల్లో మచ్చుకి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రముఖ కవి, సినీ గేయ రచయిత శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి అకాల మరణం తరువాత వారి కుటుంబసభ్యులు మరియు తానా సభ్యుల సహకారంతో 'సిరివెన్నెల సమగ్ర సాహిత్యం' పేరిట వారి సినీ గేయమాలికలను 6 భాగాలుగా ముద్రించి మొదటి భాగాన్ని అప్పటి భారత దేశ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడుగారి చేతుల మీదగా, రెండవ భాగాన్ని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎన్.వి. రమణగారి చేతుల మీదగా ఆవిష్కరించడం జరిగింది. ప్రతి నెల రెండవ శనివారం 'తెలుగు సాంస్కృతిక సిరులు' కార్యక్రమం పేరిట కళాకారులను ప్రోత్సహించడం జరుగుతుంది. గత రెండేళ్లుగా అమెరికాలో కిక్కిరిసి ఉండే న్యూయార్క్ నగరం నడిబొడ్డున ఉన్న టైం స్క్వేర్‌లో బతుకమ్మ నిర్వహణ ఒక అద్భుత ఘట్టం. తెలుగువారి సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే ఈ గొప్ప వేడుక అమెరికాలోని తెలుగువారిని ఎంతగానో అలరించింది.

తెలుగువారి గుండె చప్పుడు, శక పురుషుడు, శ్రీ నందమూరి తారకరాముని శత జయంతి ఉత్సవం నేను అధ్యక్షునిగా ఉన్న కాలంలో జరగడం భగవత్ సంకల్పంగా భావిస్తున్నాను. ఆ యుగపురుషుడికి నీరాజనం అర్పిస్తూ అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లోని తెలుగు వారందరితో కలిసి పండుగలా జరుపుకుని ఆ మహనీయుని స్మరించుకోవడం ఒక జీవితకాలపు అనుభూతి.

ఈ లోకంలోకి రావడం... లోకం నుండి నిష్క్రమించడం మన చేతుల్లో లేదు. కానీ మనం ఉన్నంత కాలం ఎలా జీవించాం, మానవాళి ప్రగతికి మన వంతు ఏమి చేశాం అనేది మాత్రమే మనం ఈ పుడమిపై చేసే చెరగని సంతకం. ఆ సంతకం బలంగా ఉండాలి అంటే మన సంకల్పం దృఢంగా వుండాలి. ఇది ప్రతి ఒక్కరి నైజంగా మారితే మానవాళి వికసిస్తుంది. ఈ నేల తల్లి పులకరిస్తుంది. మన జీవితానికి ఒక సార్థకత లభిస్తుంది. చివరిగా నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, నాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, ఒక తల్లి కడుపున పుట్టకపోయినా నా వెంట నిలిచి నన్ను ముందుకు నడిపించిన ఎందరో సోదర సోదరీమణులకు, స్నేహితులకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. సమాజసేవకు ఎప్పుడూ ప్రోత్సాహాన్ని అందించే నా కుటుంబసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ అందరి ఆదరాభిమానాలు నాపై ఇలాగే వుండాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి సేవలో మరింత భాగమయ్యేలా నన్ను దీవించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను...

సదా మీ సేవలో,

అంజయ్య చౌదరి లావు
తానా అధ్యక్షులు
2021-2023

సమన్వయకర్త సందేశం



రవి పొట్లూరి

సంస్కృతి మన వరం – సేవ మన బలం!

ఇది ఈ 23వ తానా మహాసభల ఆశయ నినాదం. తానా ఏర్పడిన 46 సంవత్సరాలుగా మన సంస్కృతి పరిరక్షణకు, తెలుగుభాష వికాసానికి, యువశక్తి గొప్పతనాన్ని చాటేందుకు, సమాజసేవకు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు తానా అహరహం కృషి చేస్తూనే ఉంది. ఆ కృషి ఫలితమే, తానా పట్ల తెలుగువారికున్న ఆ నమ్మకమే ఈనాడు 70 వేలమంది సభ్యులతో విదేశీగడ్డపై ఉత్తర అమెరికా తెలుగు సంఘం – తానా ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థగా అవతరించి అలరారుతోంది.

ఒక వ్యక్తి జీవితంలో 46 సంవత్సరాలు తక్కువ వయసే కావచ్చు. కానీ సమాజ జీవనగతిలో ఒక సంస్థ 46 సంవత్సరాలు మనగలగటం, అందనంత ఎత్తుకు ఎదగగలగటం అంత చిన్న విషయం కాదు. ఎదురవుతున్న ఆటుపోట్ల మధ్య, అసమానతల మధ్య, ప్రతికూలతల మధ్య ఈ స్థాయికి వచ్చిన తానా ఈ 23వ మహాసభలను జులై 7, 8, 9 తారీకుల్లో పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా పట్టణంలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జరుపుకుంటోంది.

ఈ మహాసభలను అత్యంత వైభవంగా, ఆశయసాధన లక్ష్యంగా జరుపుకోవాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. వీటి నిర్వహణ బాధ్యతను నామీద ఎంతో నమ్మకం ఉంచి నాకు అప్పగించినందుకు తానా కార్యవర్గానికి, అధ్యక్షులు లావు అంజయ్య చౌదరిగారికి ఎనలేని కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం నేను కాలు పెట్టిన ఫిలడెల్ఫియాలోనే ఈ సభల నిర్వహణకు బాధ్యత వహించటం యాదృచ్ఛికమే అయినా అదృష్టంగా భావిస్తున్నాను.

ఈ మూడు రోజులు అమెరికా గడ్డపై తెలుగు సంస్కృతి విరాజిల్లబోతోంది. భారతదేశ పూర్వ ఉపాధ్యక్షులు శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రధాన అతిథిగా ఈ సభలు జరగబోతున్నాయి. ఆంధ్రుల అభిమాన నటుడు, ప్రజానాయకుడు, తెలుగుజాతి ఆత్మగౌరవ పతాకను సమున్నత స్థాయిలో నిలబెట్టిన మన అన్న నందమూరి తారక రామారావుగారి శతజయంతి సంవత్సరం ఇది. ఈ సందర్భంగా ఆయన రాజకీయ, నటవారసుడు బాలయ్య బాబు అంటూ ప్రజల జయ

జయధ్వానాలు అందుకునే శ్రీ నందమూరి బాలకృష్ణ ఈ సభలకు ముఖ్యఅతిథిగా విచ్చేయటం సందర్భానికి సన్నివేశం తోడయింది. తెలుగు గౌరవాన్ని, తెలుగుభాష ఔన్నత్యాన్ని నిత్యం స్మరించే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ నూతలపాటి వెంకటరమణ మరో ముఖ్య అతిథి. ఇందరు పెద్దల ఆశీర్వచనాలతో జరగబోయే ఈ సభలు తెలుగు సంస్కృతిని నిలబెట్టటంలో ప్రముఖపాత్ర పోషించగలవని బలంగా నమ్ముతున్నాను.

కోవిడ్ మహమ్మారి వలన 2021లో ఇదే ఫిలడెల్ఫియాలో జరగవలసిన తానా సభలు రద్దుకావటంతో నాలుగు సంవత్సరాల తరువాత తిరిగి ఇక్కడే జరగటం మా అదృష్టంగా భావిస్తున్నాము. ఈ సభలకు అమెరికా దేశంతో పాటు ప్రపంచం నలుమూలల నుండి తెలుగు ప్రజలు వేలాదిగా తరలి వస్తున్నారు. ఈ సభల సమన్వయకర్తగా వీరందరికీ మన:పూర్వకంగా స్వాగతం పలుకుతున్నాను.

తానా మహాసభలకు ఒక ప్రత్యేకత ఉంది. తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూనే విజ్ఞానదాయంగాను, వినోదాన్ని పంచుతూ, ఆధ్యాత్మిక చింతనామృతాన్ని చిలకరిస్తూ ఆత్మీయ వాతావరణంలో జరిగే సభలుగా వీటికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయి. ఈ అభిప్రాయాన్ని ఇనుమడింపజేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందించాము. ఎంతోమంది ప్రముఖులు, రాజకీయనాయకులు, సినీ కళాకారులు, సాహితీవేత్తలు, ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇతర రంగాల కళాకారులు సభల్లో పెద్ద ఎత్తున పాలుపంచుకొంటున్నారు.

ఈ సభలు ఇంత వైభవంగా జరుపుకోవడానికి పెద్ద ఎత్తున విరాళాలు అందజేసిన దాతలకు, తానా అభిమానులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఇంత పెద్ద ఎత్తున జరిగే ఈ సభలకు నేను సమన్వయకర్తగా ఉన్నప్పటికీ ఏర్పాట్లన్నిటిని చూస్తున్నదీ, వాటికి బాధ్యత వహిస్తున్నదీ వందలాది యువ కార్యకర్తలు.వారి నిర్వహణాసామర్థ్య బలమే నాకు వెన్నుదన్ను. వారికి మార్గనిర్దేశనం చేస్తూ ప్రోత్సహించే పెద్దలందరికీ కృతజ్ఞతలు. వీరందరి సహాయ సహకారాలతో ఈ సభలు దిగ్విజయంగా జరుగుతాయని బలంగా నమ్ముతున్నాను.

గత ఆరు నెలలుగా సభల నిర్వహణలో పూర్తిగా నిమగ్నమైన నాకు అండగా నిలిచిన నా శ్రీమతి ఇందుమతి, పిల్లలు ఇరశ్రీ, అథిరలకు ఎనలేని కృతజ్ఞతలు.

వీటిలో పాలుపంచుకోవడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్న మీ అందరికీ స్వాగతం పలుకుతూ...

రవి పొట్లూరి

Bobba's

www.bobbas.com

Rice ★ Pulses ★ Spices

Vegetables ★ Fruits ★ Indian Mangoes

Culinary Pastes ★ Chef Curated Sauces

Wholesale & Retail



శ్రీనివాస్ లావు
ఛైర్మన్
తానా కాన్ఫరెన్స్

తానా కాన్ఫరెన్స్ ఛైర్మన్ సందేశం

జులై 7, 8, 9 తేదీల్లో పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలో జరగబోతున్న 23వ తానా మహాసభలకు కాన్ఫరెన్స్ లీడర్‌షిప్ తరఫున స్వాగతం పలుకుతున్నాను. ఈ సభల్లో ఎంతో విజ్ఞానదాయకమైన, వినోదదాయకమైన కార్యక్రమాలను మీకోసం ఏర్పాటుచేసాం. గత ఆరు నెలలుగా వందలాది వాలంటీర్లు ఈ సభలను విజయవంతం చేయడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. ఇంతమంది కృషితో జరగబోతున్న ఈ సభలు విజయవంతం కావాలని, ఈ సభలు మీకు మధుర జ్ఞాపకాలను మిగల్చాలని మన:స్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీనివాస్ లావు

సంపాదకీయం



సంస్కృతి మన వరం - సేవ మన బలం

తరతరాల భారతీయ సంస్కృతి, మనకు సంక్రమించిన వరం. అందునా తెలుగు సంప్రదాయాలు మనకు లభించిన సౌభాగ్యాలు. వాటిని పదిలంగా దాచుకుని, ఆచరించడానికి మన శాయశక్తులా ప్రయత్నించడం మన ధర్మం, కర్తవ్యం కూడా..అయితే, కాల ధర్మాన్ననుసరించి మార్పులు, చేర్పులు చేసుకోవడం సహజం. కానీ, సమూలంగా మర్చిపోవడం, మార్చుకోవడం మన అస్తిత్వానికే అంతం కలిగే పరిస్థితి రావడం శోచనీయం.

అటువంటి సమయం రాకుండా వెలుగుబాటలో నడుస్తూ, నడిపిస్తూండే, మన తెలుగు సంఘాలు, సమితులు వందనీయం.

వలస వచ్చిన దేశంలో కూడా సేవా సద్భావాలతో మన సంస్కృతిని నిలుపుకుంటూ, మన తోటివారితో పంచుకుంటూ, మన భావితరానికి తెలుగుతనం నేర్పాలనే ఆకాంక్షతో జరుపుకుంటున్న సంబరాలివి.

కేవలం భాష నేర్చుకోవడమే కాక సేవాభావం, మానవత్వపు విలువలను గౌరవించడం మనం మన భావితరానికి ఇవ్వగలిగిన సంపదలు.

మన పత్రికల ద్వారా అందించే సందేశం, మన సంస్కృతిని నిలుపు కుంటూ, పరదేశపు పద్ధతులని గౌరవిస్తూ, పరిపూర్ణ జీవితం గడపాలని, మన కథలు, కవితలు, వ్యాసాల ద్వారా అందుతుందని ఆశిద్దాం.

శ్రీనివాస్ సగరం
సంపాదకులు

సంపాదకీయం



నేను సైతం...

ఇల్లు దాటితే మనిషి పేరూ, కుటుంబం పేరూ; పాలిమేరలు దాటితే ఊరి పేరూ, సరిహద్దులు దాటితే దేశం పేరూ- మనిషి వ్యక్తిత్వానికీ, గుర్తింపుకీ సంకేతాలుగా మారుతాయి.

'ఒక దేశ సంస్కృతి ఆయా ప్రజల నడవడిలోనూ, హృదయాల్లోనూ ప్రతిబింబిస్తుంది,' అంటాడు మహాత్మాగాంధీ.

ఎక్కడ నివసించినా, అందుకే మన మూలాలు కాపాడుకోవడం అవసరం. ముందు తరాలకి అందించే వెలకట్టలేని ఆస్తులవి.

గత యాభై యేళ్లుగా అమెరికాలో తెలుగువారి సాంస్కృతిక చిహ్నంగా మారింది తానా. అమెరికా నలుమూలలా వుండే తెలుగువారికొక గుర్తింపు చిహ్నంగా రూపొందింది. అందులో భాగంగానే ప్రతి రెండేళ్లకొకసారి జరిపే ఉత్సవాలు ఈ తానా మహాసభలు.

సంస్కృతి అనగానే కొట్టచ్చినట్లు కనిపించేవి వేషభాషలు. సాహిత్యమే భాష ఉనికికి సంకేతం. అందుకే తానా సభలకి ప్రత్యేక జ్ఞాపిక ఈ సాహిత్య సంచిక.

తెలుగువారి ప్రగతినీ, విజయాలనీ పొందుపరిచే ఈ తానా 23వ మహా సభల సాంస్కృతిక జ్ఞాపిక ఈ (సావనీరు) ప్రత్యేక సంచిక.

ఈ రంగురంగుల సంచికలో వ్యాసాలూ, కవిత్వమూ, కథలతో నిండిన సాహిత్యమూ, తెలుగువారి జయకేతనాన్ని ఎగురవేసిన ఎంతోమంది ప్రముఖుల విజయాలూ, తానా సంస్థ ప్రగతి- ఇవన్నీ పొందుపరిచాము.

ఈ జ్ఞాపిక వెనుక ఎంతోమంది శ్రమ, కృషీ వున్నాయి.

అడగ్గానే తమ రచనలు అందించిన రచయితలకి ప్రత్యేక ధన్యవాదాలు.

అలాగే ఈ 23వ తానా సభల ప్రత్యేక సంచిక బాధ్యత నాకిచ్చిన అంజయ్య చౌదరి లావుగారికీ, ఈ మహాసభల నిర్దేశకులు రవి పాట్లూరిగారికీ ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ రంగుల సాహిత్య జ్ఞాపికని తీర్చిదిద్దిన సీత పాన్నపల్లికీ, సూచనలూ, సలహాలకీ సహకరించిన శ్రీ వాసిరెడ్డి నవీన్‌కి ధన్యవాదాలు.

ఈ జ్ఞాపిక నిర్మాణానికి వీరందరి సహాయ సహకారాలే ఊపిరి. ఇందులో నా పాత్ర నిమిత్త మాత్రమే.

ఈ ప్రత్యేక సంచిక మిమ్మలందర్నీ అలరిస్తుందన్న ఆశా, నమ్మకం మాకుంది.

అభినందనలతో...

సాయి బ్రహ్మానందం గొర్తి
సంపాదకులు

LOVI

LOGON KA VISHWAS

REALTY GROUP

WE CATER TO ALL SECTORS OF REAL ESTATE

BUY / SELL / RENT

LOVI REAL ESTATE

TOP REAL ESTATE CONSULTANT IN HYDERABAD



MAKE LOVI YOUR REAL ESTATE FRIEND

CALL US ON +91 - 888 666 1955/4955 | WWW.LOVIGROUP.IN

Flat#W1, Tapasya Apartment Gayatri Enclave, Kokapet, Telangana - 500075

LOVI Realty, 390 New Brunswick Ave , Fords NJ 08863



ముప్పవరపు వెంకయ్యనాయుడు
త్యాగరాజ మార్గ్, న్యూఢిల్లీ 110 011

హైదరాబాద్
4 జూన్ 2023

సందేశం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే తానా మహాసభలు ఈ ఏడాది (2023) జులై 7 నుంచి 9 వరకూ నిర్వహించ తలపెట్టారని తెలిసి ఎంతో ఆనందించాను. ఫిలడెల్ఫియా నగరంలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న 23వ తానా మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

45 ఏళ్లకు పైగా ఉత్తర అమెరికాలో తెలుగుభాష, సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ కోసం పాటుపడుతూ, వాటిని ప్రవాసాంధ్ర భావితరానికి అందించే క్రమంలో ఆహరహం కృషి చేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం చొరవ అభినందనీయం. ఈ దిశగా ఈ మహాసభలు చక్కని వేదిక కాగలవని భావిస్తున్నాను.

ప్రవాస భారతీయులకేగాక స్వదేశంలోని వారికి కూడా మన భాషా సంస్కృతులను చేరువ చేయటంతోపాటు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ సేవా కార్యక్రమాలను తానా చేపడుతున్న తీరు ఆనందదాయకం. ప్రపంచ సాహిత్య వేదిక ద్వారా, ప్రపంచ సాంస్కృతిక మహోత్సవాల ద్వారా మన భాషా సంస్కృతులను విశ్వవ్యాపితం చేయటంతో పాటు వివిధ రంగాల్లో కృషి చేసినవారికి తానా అందిస్తున్న గౌరవ సత్కారాలు దిశగా మరెంతో మందిని ప్రోత్సహిస్తున్నాయని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు.

మన ఆట, మన పాట, మన భాష, మన యాస, మన గోస, మన కట్టు, మన బొట్టు, చివరకు మన తిట్టు సహా సంప్రదాయాలను పునరుజ్జీవింప చేసుకోవాల్సిన అవసరం ఉందని నా ప్రగాఢ విశ్వాసం. ఈ దిశగా ఇప్పటికే కృషి చేస్తున్న తానా... '23వ తానా మహాసభలు' ద్వారా ఈ చొరవను మరింత పెంచుతుందని ఆశిస్తూ... తానా మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ... తానా అధ్యక్షులు శ్రీ లావు అంజయ్య చౌదరిగారికి, తానా మహాసభల సమన్వయకర్త శ్రీ రవి పొట్లూరి సహా సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

(ముప్పవరపు వెంకయ్యనాయుడు)



eficens

digital transformation, reimagined

Eficens Systems is a **global technology leader** headquartered in USA. We operate globally with footprints in Canada, Dubai, Europe and India.

We have 3000+ technology experts engaged in helping the world's leading nations and corporations create innovative solutions to address businesses and societies' most pressing social, economic and product needs, accelerating human progress meaningfully.

सत्यमेव जयते



Tamilisai Soundararajan
Governor
Telangana State

27 June 2023

MESSAGE

I am happy to learn about and extend warm wishes to Telugu Association of North America (TANA) for their upcoming mega convention being organized at the Philadelphia Convention Centre from 7th July, 2023 to 9th July, 2023.

I take this opportunity, to commend TANA, for its tireless efforts in preserving and promoting the rich culture and heritage of Telugu speaking people all around the world. I also appreciated TANA for its, staunch support to the students of Telugu states in USA.

I am very happy to know that, are many members of TANA who have made Telugu community proud, by putting both the Telugu states on the world map with their remarkable achievements. I sincerely extend my wishes, that that the convention a resounding success and once again extend my warmest wishes to all Telugu speaking individuals residing in North America and beyond.

Hoping you all will continue to uphold the Telugu traditions, culture, language, arts, literature and spread good will, peace and happiness as far as your influence extends.

As the Governor of Telangana State, I feel privileged and once again wish TANA and its Leadership all the very best for its forthcoming event grand successful.

Tamilisai Soundararajan

Vadilal

Since 1907

రుచికరమైన అనుభూతి

Relish the most authentic Indian treats from Vadilal, a brand with a 100-year-old legacy of serving goodness and happiness.



- NO PRESERVATIVES.
- NO EGGS.
- NO ARTIFICIAL FLAVORS.

Made From 100% Milk



డా॥ హరిబాబు కంభంపాటి
గవర్నర్, మిజోరం

రాజ్‌భవన్, ఐజ్వాల్, మిజోరం
6 జూన్ 2023

సందేశం

అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జులై 7-9 తేదీలలో జరిగే అమెరికా తెలుగు సంఘం (తానా) 23వ ద్వైవార్షిక సమావేశాలకు నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. 46 సంవత్సరాల క్రితం ప్రారంభించిన సంఘ కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగించడం అభినందనీయం.

భారతదేశంలోని తెలుగువారు కొన్ని వేల కిలోమీటర్ల సుదూరంలో ఉన్న అమెరికా వెళ్లి వివిధ వృత్తులలో స్థిరపడి, తమ మూలలను మరచిపోకుండా ఆచార వ్యవహారాలను పాటిస్తూ, పండుగలు, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను సజీవంగా ఉంచే మీ ప్రయత్నం అభినందనీయం.

అమెరికాలో తెలుగువారందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చి వారి ద్వారా తానా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అక్కడున్న తెలుగువారిని ఆపదల్లో ఆదుకోవడం, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో ప్రతి సంవత్సరం తానా ఫౌండేషన్ ద్వారా పెద్ద మొత్తంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం కొనియాడ తగినది.

తానా సాహిత్య విభాగం ప్రపంచ సాహిత్య వేదిక డా॥ తోటకూర ప్రసాద్‌గారి ఆధ్వర్యంలో 'నెలనెలా తెలుగు వెలుగు' పేరుతో ప్రతి నెలా నిర్వహించే సాహిత్య కార్యక్రమాలు తెలుగు భాషా పరిరక్షణకు, తానా చేస్తున్న కృషికి నిదర్శనం.

తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు, 23వ తానా సభల సమన్వయకర్త రవి పొట్లూరి, మరియు వారి బృందం ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ...

కంభంపాటి హరిబాబు

(కంభంపాటి హరిబాబు)



With Best Compliments From

yoda DIAGNOSTICS

Our Services

- Bio Chemistry
- Biochemical Genetics
- Cytogenetics
- COVID-19
- Genomics
- Pharmacogenomics
- Pathology
- Molecular Diagnostics
- Flow Cytometry
- Microbiology
- Radiology
- Cytopathology
- Transplant Immunogenetics

040-35353535 | www.yodadiagnostics.com
Lal Bungalow add on,Ameerpet, Hyderabad - 500016



నారా చంద్రబాబునాయుడు
ప్రతిపక్ష నాయకులు, ఆంధ్రప్రదేశ్

అమరావతి
27 జూన్ 2023

సందేశం

తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా వారికి,

తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, భవిష్యత్తు తరాలకు తెలుగు గొప్పదనం తెలియజేయడానికి, తెలుగు సాహిత్య, సాంస్కృతిక, విద్య, సాంఘిక, సేవా చర్యలకు ఒక వేదికగా నిలవడానికి 1977లో తానా ఏర్పాటయింది. 1978లో లాభాపేక్ష లేని సంస్థగా గుర్తింపు పొంది, గత 40 ఏళ్లుగా అనేక సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కేవలం నార్త్ అమెరికాకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది జులై 7, 8, 9 తేదీలలో 23వ మహాసభ నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది.

తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి నార్త్ అమెరికాలో తెలుగు వారందరూ ఒక బృందంగా ఏర్పడిన తానా నేడు దాదాపు 70 వేల సభ్యులతో సమాజానికి అవసరం అయిన విద్య, వైద్యం, పేదలకు చేరువ చేసేందుకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తోంది. సమాజానికి సవాలుగా మారిన నిరక్షరాస్యత సమస్య దూరం చేసేందుకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తోంది. స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ సహాయం చేయాలనే ఎంతోమందికి నార్త్ అమెరికా తెలుగు సంఘం స్ఫూర్తిగా నిలిచినందుకు చాలా గర్వంగా ఉంది. పేదలకు విద్య, వైద్యం అందించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో పేదలకు పెద్ద ఎత్తున కంటి శస్త్రచికిత్సలు చేయించి ఎంతోమంది జీవితాలలో తానా వెలుగులు నింపింది. నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన విషయంలో తానా చూపిన చొరవ అభినందనీయం.

తానా 23వ మహాసభ విజయవంతం కావాలని, భవిష్యత్తులో తానా మరిన్ని సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుకుంటూ...

మీ

(నారా చంద్రబాబు నాయుడు)



GOVERNOR JOSH SHAPIRO

Philadelphia, Pennsylvania

June 27, 2023

Greetings:


It is my honor to join the Telugu Association of North America (TANA) in celebration of the 23rd Biennial National Conference. I would like to extend my gratitude to all those who helped to make this conference possible.

Pennsylvania thrives on its vibrant cultural heritage, and each person's story offers a wealth of cultural knowledge about the world. Indo-Americans have been an integral part of Pennsylvania and have generously shared their rich history, heritage, and time-honored traditions. TANA has made tremendous strides in advancing inclusion and promoting Telugu heritage, and this annual convention stands as a remarkable opportunity for all to appreciate Telugu culture. Most notably, this event allows recognition of four distinguished individuals: Muppavarapu Venkaiah Naidu, Nuthalapati Venkata Ramana, Nandamuri Balakrishna, and Krishna Ella who have contributed greatly to the mission of TANA. It is my hope that our Commonwealth will continue to recognize the innumerable contributions that Indo-Americans have made to Pennsylvania, and I am confident that the Telugu Association of North America will continue its legacy of service for years to come

On behalf of all Pennsylvanians, I am honored to join in celebration of this festival. Please accept my best wishes for continued success.

GIVEN under my hand and the Seal of the Governor, at the City of Harrisburg, this seventh day of July two thousand twenty-three, the year of the Commonwealth the two hundred forty-eighth.

Governor Josh Shapiro



Christofer A. Coons
United States Senator
Delaware

May 07, 2023

Dear Friends,

It is my distinct pleasure to welcome all attendees to the 23° Telugu Association of North“America (TANA) conference. To all those fortunate enough to be gathering in Philadelphia over“these few days, I hope you enjoy what will undoubtedly be a delightful and meaningful series of““programs.

This conference will serve to highlight the incredible work that TANA does on a daily basis in“preserving and promoting the rich Telugu culture and language throughout North America. This“organization has made our nation a better place, contributing to the cultural fabric of our“communities while also engaging in service activities and charitable endeavors. Your impact here in the U.S. and in the home states of the Telugu people truly cannot be overstated. It is no surprise that TANA is looked up to as a model for other Telugu and Indian ethnic organizations around the world.

To Anjaiah Chowdary Lavu and Ravi Potluri, thank you for your leadership and congratulations“on another successful conference. I am proud to offer my support and best wishes to all those in“attendance, and I look forward to seeing all that TANA will accomplish in the years to come.

Sincerely,

Christopher A. Coons



డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

రాజ్యసభ పూర్వ సభ్యులు

8 జూన్ 2023

ఆశంస

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానాతో నాకు సుదీర్ఘమైన అనుబంధం ఉన్నది. 1985లో లాస్ ఏంజెల్స్‌లో జరిగిన తానా ద్వైవార్షిక సదస్సులో నేను మొదటిసారి పాల్గొన్న నాటి నుండి నేటి వరకు రెండుసార్లు తప్ప అన్ని ద్వైవార్షిక సభలలో పాల్గొన్నాను. తానా అమెరికాలోని తెలుగువారికే కాక తెలుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగువారి సంక్షేమం, తెలుగుభాష సాహిత్య, సంస్కృతుల అభ్యున్నతికి చేస్తున్నటువంటి కృషి ఎనలేనిది. ఈ విషయంలో మీరు స్పృశించని రంగమంటూ లేదు. ఈ విషయంలో మిమ్ములను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సంఘాలకు మీరు దిక్సూచిగా పనిచేస్తున్నారు. గత 40 సంవత్సరాలుగా మీరు నిర్వహిస్తున్న కార్యక్రమాలను నేను చాలా దగ్గరగా గమనిస్తున్నాను. సమయం సందర్భాలకు అనుగుణంగా మీరు విశేషంగా స్పందిస్తున్నారు. మీరు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో, టీమ్ స్వేర్ ద్వారా అమెరికాలోలోని తెలుగువారు మరణించినప్పుడు, వారి భౌతికకాయాలను మన దేశానికి పంపడం, వారి కుటుంబాలకు అండగా నిలబడడం అభినందనీయం. సంగీతం, నాట్యం మరియు వివిధ తెలుగు జానపద కళారూపాలను పరిరక్షించడంలో మీరు అగ్రగాములుగా ఉన్నారు. ముఖ్యంగా వ్యవసాయరంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మీరు చర్చించి, సమీక్షించి వాటిని మాకు అందించడంలో ముందున్నారు.

ఇక్కడ నేనొక సూచనను మీ ముందు ఉంచతలచాను. మీరు తెలుగు రాష్ట్రాలలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, అమెరికాలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లో కూడా ముందుండాలని కోరుతున్నాను. మీరు తెలుగు రాష్ట్రాలలో వెచ్చిస్తున్న సమయం, ధనంలో సగభాగాన్ని ఇక్కడ వెచ్చించవలసిన అవసరం ఉంది. మీ పిల్లల భవిష్యత్తు కోసం మీరు అమెరికా రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించండి. మీ పిల్లలు అమెరికన్లుగా జన్మించారు. వారి జీవితాలు, వారి పిల్లల జీవితాలు ఇక్కడే గడుపుతారు. అందుచేత సెనేటర్లుగా, కాంగ్రెస్ సభ్యులుగా, మేయర్లుగా స్కూల్ కమిటీలలో ప్రధాన భాగస్వాములుగా ఉండాల్సిన అవసరం ఉంది.

స్వర్గీయ ఎన్టీ రామారావుగారు 1993లో న్యూయార్క్‌లో జరిగిన తానా సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని, భవిష్యత్తులో అమెరికన్ తెలుగువారు, లేదా అమెరికన్ భారతీయులు ఏనాటికైనా అమెరికా అధ్యక్షుడు కావాలని ఆకాంక్షించారు. భారతదేశంలో కొంతమంది ఈ విషయంలో రామారావుగారిని విమర్శించారు. కానీ నేడు జరుగుతున్నది ఏమిటి? మీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, చివుకుల ఉపేంద్ర, రాజా కృష్ణమూర్తి, కాట్రగడ్డ అరుణా మిల్లర్ వంటి మరికొంతమంది దీనికి ఉదాహరణ. దయచేసి మీ దృష్టిని ఈ విషయంలో సారించవలసిందిగా మిమ్ములను కోరుతున్నాను.

ఇప్పుడు జరుగుతున్న ఈ ఇరవై మూడవ ద్వైవార్షిక మహాసభలు విజయవంతం కావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. ప్రస్తుత తానా అధ్యక్షులు లావు అంజయ్య చౌదరిగారు, ఈ సమ్మేళన సమన్వయకర్త పొట్లూరి రవిగారు ప్రత్యేకంగా విశాఖపట్నం వచ్చి నన్ను ఆహ్వానించినందుకు, వారికి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఈ సమావేశానికి వచ్చే ప్రముఖుల ఏర్పాట్లు చూడటంలో సమన్వయకర్తగా ఉన్న వెలువోలు శ్యాంబాబు గత నాలుగు నెలలుగా గౌరవనీయులు వెంకయ్యనాయుడిగారిని ఈ కార్యక్రమానికి రప్పించే విషయంలో నిరంతరం శ్రమించారు. ఆయనకు, ఆయనతో పాటు మిగిలిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ సమావేశాలు దిగ్విజయం కావాలని నా ఆశంస.

(ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్)

EB5 Investor Green Card

Your Gateway to one of the Most Powerful Passports in the World



- 1 Billion dollar plus portfolio under development.
- Rural, TEA Project with $800K.
- Fast processing and avoid visa backlog.
- If you are in USA, get EAD & AP quickly.
- Payment plan, Exit period 5 years.
- EB5 jobs created and permits acquired.
- Must be accredited.

For more information-http://www.shooraeb5.com

Durga Prasad Gadde

Developer

gadde@shooraeb5.com

USA: +1 (248) 787 6994 WHATSAPP & CELL :248 787 6994




హనుమయ్య బండ్ల
ఛైర్మన్
తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్

తానా బోర్డ్ ఛైర్మన్ సందేశం

తెలుగు కమ్యూనిటీకి ఎల్లవేళలా సహాయం అందించాలన్న లక్ష్యంతో ఏర్పడిన తానా అమెరికాలోనని తెలుగువారితోపాటు, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మనవాళ్లకు కూడా సహాయాన్ని అందిస్తోంది. 2021-23 సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు కార్యక్రమాలను, సేవలను అందించారు. మరోవైపు తెలుగుభాషను, కళలను పరిరక్షించే కార్యక్రమాలు కూడా ముమ్మరంగా జరిగాయి. తానా ఐ క్యాంపులు, క్యాన్సర్ క్యాంపులు, ఇఎన్‌టి ఆరోగ్య పరీక్షలు వంటివన్నీ ఈ టర్మ్‌లో రికార్డు స్థాయిలో జరగడం సంతోషంగా ఉంది. అలాగే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ, వికలాగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ, ఆడపిల్లలకు సైకిళ్ల పంపిణీ, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ వంటివి కూడా ముమ్మరంగా జరిగాయి.

ఈ టర్మ్‌లో రికార్డుస్థాయిలో తానాలో సభ్యులు చేరడం తానాకు ఆర్థిక పరిపుష్టిని చేకూర్చింది. కళలను ప్రోత్సహించేలా, కళాకారులకు ఆర్థిక సహాయం అందించేలా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా తానా ఈ టైమ్‌లో నిర్వహించింది. అమెరికాలో ఉంటున్న మన తెలుగు పిల్లల కోసం ప్రత్యేకంగా సమ్మర్ క్యాంపులు, శిక్షణా తరగతులను తానా ఏర్పాటు చేసింది. అన్ని నగరాల్లోనూ తానా కార్యక్రమాలు జరగడం, పాఠశాల ద్వారా పిల్లలకు తెలుగుభాషను నేర్పించడం వంటివి ఈ టర్మ్‌లో జరిగాయి. ఇలా ఎన్నో సేవలతో, కార్యక్రమాలతో తెలుగువారికి తానా సేవలందించడానికి కృషి చేసిన తానా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు, ఫౌండేషన్ ట్రస్టీలకు, ఇతరులకు నా అభినందనలు.

హనుమయ్య బండ్ల



వెంకటరమణ యార్లగడ్డ

ఛైర్మన్

తానా ఫౌండేషన్

తానా ఫౌండేషన్ ఛైర్మన్ సందేశం

తానా సభ్యులకు దాతలకు, ట్రస్టీలకు నా హృదయపూర్వక అభినందనలు....

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వెన్నెముకగా ఉన్న తానా ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల్లోని తెలుగువారికి ఎన్నో సేవలందిస్తున్న సంగతి మనందరికీ తెలిసిన విషయమే. విద్య, వైద్య సేవలతోపాటు ఇతర సహాయ కార్యక్రమాలను కూడా ఫౌండేషన్ చేస్తోంది. 2021-23 సంవత్సరంలో ఫౌండేషన్ కార్యక్రమాలు గతంలో కన్నా ఎక్కువగా జరిగి మరింతమందికి చేరువైంది. దాదాపు 300కు పైగా రెండు తెలుగు రాష్ట్రాలలో కార్యక్రమాలను చేపట్టి కొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ టర్మ్‌లో ఫౌండేషన్ డోనర్ మెంబర్లుగా దాదాపు 100మందికిపైగా చేరి చరిత్ర సృష్టించడం జరిగింది. 2021-23లో రికార్డు స్థాయిలో 3 మిలియన్స్ డాలర్లు దాతల నుంచి విరాళంగా వచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లోని పేద పిల్లలకు, అనాథలకు, వికలాంగులకు, వృద్ధులకు, ఇతర ఎన్‌జివో సంస్థలకు తానా ఫౌండేషన్ సేవలు అనుకున్న లక్ష్యాలకన్నా మిన్నగా జరిగింది.

తెలుగు రాష్ట్రాల్లో 2022-23 సంవత్సరంలో గత నవంబర్ నుంచి జనవరి వరకు జరిగిన చైతన్యస్రవంతి కార్యక్రమాల్లో సుమారు 70-80 ఫౌండేషన్ కార్యక్రమాలు మారుమూల గ్రామాలలో కూడా నిర్వహించడం జరిగింది. ఈసారి ఫౌండేషన్ తరపున అన్నపూర్ణ, ఆరుణ్య, ఆయుష్ వంటి కొత్త కార్యక్రమాలను కూడా ఈ టర్మ్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. కంటిలోపంతో ఇబ్బంది పడుతున్న పేదలకోసం వివిధ ప్రాంతాల్లో 50కిపైగా కంటి శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడంతోపాటు మందులను, అద్దాలను అందించాము. 70కిపైగా క్యాన్సర్ క్యాంపుల ద్వారా క్యాన్సర్ పేషంట్లను గుర్తించి వారికి కావాల్సిన వైద్య సహాయాన్ని అందించాము. వారధి కార్యక్రమం ద్వారా 70 లక్షలకు పైగా ఖర్చు చేసి అనాథ పిల్లలకు కావాల్సిన విద్య, వసతి సౌకర్యాలను కల్పించి ఆదుకున్నాము. 60కిపైగా ఆదరణ కార్యక్రమాల ద్వారా వికలాంగులకు అవసరమైన ట్రై సైకిళ్ళను, స్కూటర్లను పంపిణీ చేశాము. ఆడపిల్లలకు రవాణ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి 1500కు పైగా సైకిళ్ళను ఇచ్చాము. ఆదరణ కార్యక్రమం ద్వారా పేద విద్యార్థులకు 300కిపైగా ల్యాప్‌టాప్‌లను అందించాము. చేయూత పథకం ద్వారా హైస్కూల్ చదువుల నుంచి ఇంజనీరింగ్, మెడికల్ చదువుతున్న విద్యార్థులకు కోటిరూపాయలకుపైగా కూడా స్కాలర్‌షిప్‌లను తానా ఫౌండేషన్ ద్వారా ఇచ్చాము. డోనర్స్ ప్రాజెక్టుల ద్వారా దాతల సహాయంతో మరిన్ని కార్యక్రమాలను కూడా తానా ఫౌండేషన్ చేసింది.

స్టెమ్ పథకం, స్టూడెంట్ కనెక్ట్ కార్యక్రమం వంటి వాటి ద్వారా విద్యారంగం పురోగతికి కృషి చేశాము. ఆరుణ్య పథకం ద్వారా మూగ, బధిరుల పిల్లలకు వైద్యసేవలందించాము. ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసేందుకు వీలుగా మొబైల్ వాహనం ద్వారా కూడా చికిత్స అందించేందుకు వీలుగా దాతల నుంచి 45 లక్షల నిధులను సేకరించడం జరిగింది. అన్నపూర్ణ పథకం ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రతి రోజు ఉచితంగా గర్భిణులకు, హెచ్ఐవి పేషంట్లకు పౌష్టిక ఆహారంను విజయవాడ, గుంటూరు, తెనాలిలో అందించడం జరుగుతోంది. ఆయుష్ పథకం ద్వారా చిన్న పిల్లలకు గుండె చికిత్స నిమిత్తము అవసరమయ్యే ఖర్చులను ఆసుపత్రులకు అందించడం జరుగుతున్నది. సిపిఆర్ క్యాంపుల ద్వారా రెండు తెలుగు రాష్ట్రలలో స్కూల్స్, కాలేజీలలో ఉచితంగా సుమారు 50 కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. స్కూల్స్ లైబ్రరీస్ పథకం ద్వారా అనేక విద్యాసంస్థలకు పుస్తకాలను, ఫర్నిచర్‌ను ఉచితంగా అందజేయడం జరిగింది. గోదావరి వరద బాధితులకు సహాయం, ఎస్ఎన్ఆర్ఎ మూగ విద్యార్థుల స్కూల్, సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. స్కూళ్ళలో విద్యార్థినుల కోసం మరుగుదొడ్లను, బసవతారకం ఆసుపత్రికి కోటి రూపాయల విరాళం, దాతల సహాయంతో హాస్పిటల్‌కు అంబులెన్స్‌లు, రైతులకు ట్రాక్టర్లను అందజేయడం జరిగింది. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న తెలుగు విద్యార్థులకు గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లు 100కు పైగా అందించడం జరిగింది.

ఈ కార్యక్రమాల అమలుకు సహకరించిన తానా ఫౌండేషన్ కార్యవర్గానికి, ట్రస్టీలకు, దాతలకు తానా సభ్యులకు, అభిమానులకు నా హృదయపూర్వక ధన్యవాదములు.

వెంకటరమణ యార్లగడ్డ



నిరంజన్ శృంగవరపు

తానా కార్యనిర్వాహక అధ్యక్షులు

తానా కార్యనిర్వాహక కార్యదర్శి సందేశం

అది 1977వ సంవత్సరం.

అమెరికాలోని తెలుగువారి జీవన ప్రస్థానంలో సరికొత్త అధ్యాయానికి తెరలు తీసిన సంవత్సరం. తెలుగుభాష, సంస్కృతులు పరాయిగడ్డ మీద పురులు విప్పి నర్తించిన వత్సరం. అమెరికాలో తెలుగువారి తరతరాల జాతి గౌరవాన్ని, సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్తరాలకు అందించాలని సంకల్పించి, ఆ బృహత్కార్యక్రమ నిర్వహణకు దీక్షాకంకణ బద్ధమైన తానాకు ఊపిరిలూదిన సంవత్సరం. అంతవరకు అసంఘటితంగా ఉన్న తెలుగువారికి ఆపద అవసరాల్లో ఆపన్నహస్తంగా నిలవాలన్నది కూడా తానా మహదాశయాల్లో ఒకటి. అది మొదలు తానా సేవలు విస్తృతపరుస్తూ, విభిన్నరీతుల్లో అమెరికాలోని తెలుగువారికే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేకమైన సేవలందిస్తూ తానా తెలుగువారికి తలలో నాల్కలా మారిపోయింది. 'తన అంటే ఒక్కరిది, తానా అంటే అందరిది,' అనే నానుడి రూఢి అయ్యింది.


'Life can only be understood backward, but it must be lived forward' అంటారు. ప్రపంచంలోనే అతి పెద్ద తెలుగు సంస్థ తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న నేను ఒక్కసారి నా జీవితం, నా ఎదుగుదల, తానాలో నేను మమేకమైన విధానం సింహావలోకనం చేసుకున్నప్పుడు ఎంతోసంతృప్తితో కూడిన చిరు గర్వం నా మనసులో తొణికిసలాడుతుంది. ఒకనాడు రత్నాలసీమగా పేరుగాంచిన రాయలసీమ కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల) రాజానగరంలో 1975వ సంవత్సరంలో జన్మించాను. నా తల్లిదండ్రులు శ్రీ సుబ్రమణ్యం, శ్రీమతి ఇంద్రావతుల నిరాడంబరత, పరోపకారబుద్ధి, సామాజిక దృక్పథం నాకు సహజంగానే అలవడ్డాయి. బళ్లారిలో కంప్యూటర్ సైన్స్ చదవడం వల్ల, ఇతర ప్రాంతాల్లో తెలుగువారు వారి భాషా సంస్కృతుల అస్తిత్వానికి, గుర్తింపుకి పడే వేదన, చేసే ప్రయత్నాలు చాలా తొందరగానే అవగతమయ్యాయి. 2000 సంవత్సరంలో ఐ.టి.రంగ వ్యాపారం స్థిరపడినప్పటి నుండి సమాజసేవకు, భాషా, సంస్కృతుల పరిరక్షణకు సరైన వేదిక కోసం వెతుకుతున్న సమయంలో తానా నా దృష్టిని ఆకర్షించింది. నా ఆశయాలకు, సేవాలక్ష్యాలకు అంతర్జాతీయంగా విరాజమానమౌతున్న తానా వేదికను మించిన సంస్థ లేదని నిర్ణయించుకొని గత 17 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో సేవలందించడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను.

నా జీవితంలో తానా ఫౌండేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన కాలం చాలా సంతృప్తినిచ్చింది. అమెరికాలోని 30 నగరాల్లో 5కె రన్ నిర్వహించి 50 వేల డాలర్లు సేకరించి తాలూకు నిధులు సమకూర్చడం ఒక మరపురాని విషయం.

తానా సేవాపరిధి చాలా విస్తృతమైనది. ఆపద సమయాల్లో, విపత్కర పరిస్థితుల్లో తానా తన శక్తికి మించి సేవలందించడం మన అనుభవంలో ఉన్న విషయం. ఇటీవల ప్రపంచ మంతా విజృంభించిన కోవిడ్-19 పనులు లేని సమయంలో మూడు కోట్ల విరాళాలతో లక్ష కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్‌లు, మూడు లక్షలమంది పేదలకు అన్నదానం, ఆరులక్షల మాస్కులు అందించగలగడం ఎంతో తృప్తినిస్తుందో సులభంగానే ఊహించవచ్చు. రెండవ వేవ్ వచ్చినప్పుడు తొమ్మిది కోట్ల వ్యయంతో ఆక్సిజన్ సిలెండర్లు, వెంటిలేటర్లు సమకూర్చడం వలన ఎంతోమంది ప్రాణాలు కాపాడగలిగాం. తానా ఇతర కార్యక్రమాల కోసం రెండు లక్షల డాలర్లు సమకూర్చుకోగలిగాం. ఉత్తమ లక్ష్యాన్ని ఉత్తమ వ్యవస్థ ద్వారానే సాధించగలమని పెద్దలంటారు. నా విషయంలో ఇది నూటికి నూరుపాళ్లు సత్యమని నిరూపితమయింది. తానాకు గత రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా, అంతకుముందు ఫౌండేషన్ ఛైర్మన్‌గా పనిచేసే అవకాశం కలగడం వల్లనే ఇన్ని మంచి కార్యక్రమాలు చెయ్యగలిగాను. 2023-25 సంవత్సరానికి తానా అధ్యక్షునిగా సేవలందించబోయే నేను మీ అందరి సంపూర్ణ సహకారాన్ని కోరుతూ...

మీ

నిరంజన్ శృంగవరపు



సతీష్ తుమ్మల

కార్యదర్శి
తానా కాన్ఫరెన్స్

తానా కాన్ఫరెన్స్ కార్యదర్శి సందేశం

తమ సంస్కృతిని పదిలంగా కాపాడుకోవడంలో తెలుగువారికి ఒక ప్రత్యేకత ఉంది. ఎల్లలు దాటి వేల మైళ్ల దూరం అమెరికాకు వచ్చినప్పటికీ ఆ సంస్కృతి పరిరక్షణ కోసం రకరకాలుగా కృషి సాగుతోంది. అందులో గత 46 సంవత్సరాలుగా తానా చేస్తున్న కృషి అపూర్వమైనది. ఈ అపూర్వమైన కృషిలో కొత్త తరానికి చెందిన మేము పాలు పంచుకోవడం ఆనందదాయకం. జులై 7, 8, 9 తారీకుల్లో ఫిలడెల్ఫియాలో జరగబోతున్న తానా 23వ మహాసభలలో కొత్త ఆలోచనలతో, కొత్త రూపాలతో ఈ సభలు జరుపుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాము.

ఎన్నడూ లేనివిధంగా వేలాదిమంది ఈ సభల్లో పాలు పంచుకుంటారని ఆశిస్తున్నాము. అందుకనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి మీ ముందుకు వచ్చాము. ఈ సభలు విజయవంతంగా జరుపుకోగలమని నమ్ముతూ మీ అందరికీ సాదరంగా ఆహ్వానం పంపుతున్నాను.

సతీష్ తుమ్మల



రవి మందలపు
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
తానా కాన్ఫరెన్స్

తానా కాన్ఫరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందేశం

తెలుగు కమ్యూనిటీకి ఎల్లవేళలా అన్ని విధాలుగా సహాయం అందిస్తూ, తెలుగు భాష పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తూ, తెలుగు కళలను, కళాకారులను ఆదరిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఇప్పుడు 23వ మహాసభలను ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా నిర్వహిస్తోంది. అమెరికాలో అతి పెద్ద సంఘంగా, కమ్యూనిటీ సేవలో అనితరసాధ్యమైన సేవలందిస్తూ, మహాసభల నిర్వహణలో, ఏర్పాట్లలో తనకు సాటి ఎవరూ లేరన్నట్లుగా గుర్తింపు తెచ్చుకున్న తానా మహాసభల నిర్వహణలో కూడా తనకు సాటి లేదన్నట్లుగా ఏర్పాట్లను చేస్తోంది.

కమ్యూనిటీని మహాసభల్లో పాలుపంచుకునే విధంగా ఎన్నో కార్యక్రమాలను, పోటీలను తానా కాన్ఫరెన్స్ కమిటీ ఏర్పాటు చేసింది. అందులో ధీంతానా కూడా ఒకటి. మీపాట, మీ ఆట, మీ అందానికి గుర్తింపు ఇచ్చేలా ఈ పోటీలను ధీంతానా పేరుతో వివిధ నగరాల్లో నిర్వహించింది.

మహాసభల వేడుకలకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలను రూపొందించడం జరిగింది. టాలీవుడ్‌లో ప్రముఖ సంగీత దర్శకులతో సంగీత విభావరులు, బిజినెస్‌లో నిష్ణాతులైన వారితో సమావేశాలు, సాహిత్యంలో దిగ్గజాలుగా పేరు పొందినవారితో సాహిత్య సమావేశాలు..ఇలా ఎన్నో..మరెన్నో కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది.

మరోవైపు తానా ఫౌండేషన్ ద్వారా ఎంతోమందికి సహాయ సహకారాలను అందిస్తోంది. ఇటీవలనే తెలుగు రాష్ట్రల్లో తానా చైతన్య స్రవంతి కార్యక్రమాల ద్వారా వేలాదిమందికి విద్య, వైద్యం, సైకిళ్ళ పంపిణీ, మూడు చక్రాల పంపిణీ వంటి కార్యక్రమాలను చేసింది. తానా టీమ్ స్క్వేర్ ఆపదలో ఉన్న తెలుగువారిని ఆదుకునేందుకు కృషి చేస్తోంది.

ప్రస్తుతం జరగనున్న తానా మహాసభల్లో అందరూ పాల్గొని తానా చేస్తున్న సేవలను, సహాయ కార్యక్రమాలను ప్రోత్సహించి వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాను.

అందరికీ అభినందనలు....

రవి మందలపు



వంశీ కోట

డైరెక్టర్
ఓవర్సీస్

తానా కాన్ఫరెన్స్ డైరెక్టర్ (ఓవర్సీస్) సందేశం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా గత 46 సంవత్సరాలుగా అంటే దాదాపు మూడు తరాలుగా ఇటు అమెరికాలోని తెలుగువారికి, అటు భారతదేశంలోనూ ఎనలేని సేవలు అందిస్తూ, దినదిన ప్రవర్ధమానమై నేడు ఈ స్థాయికి చేరింది. కాలంతోపాటు సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. ఆ మార్పుల్లో భాగంగానే సాంకేతిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకుని మనం అందరం వేల మైళ్ల దూరం ప్రయాణం చేసి ఇక్కడకు వచ్చాం. ఇక్కడ మన సంస్కృతిని కాపాడుకుంటూ, అక్కడ మనవారికి సేవలు అందిస్తూ ప్రతి రెండేళ్లకి జరుపుకునే సభల ద్వారా మన కార్యక్రమాలను సమీక్షించుకుంటూ ముందుకు వెళుతున్నాం. అందులో భాగంగానే జులై 7, 8, 9 తారీకుల్లో ఫిలడెల్ఫియాలో జరగబోతున్న ఈ సభలు విజయవంతం కావాలని మన:స్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సభల ఏర్పాట్లకు సహకరించిన దాతలకు, కార్యకర్తలకు, విచ్చేస్తున్న కళాకారులకు, ప్రముఖులకు నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను.

వంశీ కోట



సునీల్ కోగంటి

తానా లీజనల్ కో-ఆర్డినేటర్
మిడ్ అట్లాంటిక్

సందేశం

అమెరికా తెలుగు ప్రజల గుండె చప్పుడు తానా. వేలాదిమంది సభ్యులతో రానురాను పటిష్టంగా రూపొందుతున్న ఈ సంస్థ జులై 7, 8, 9 తారీకుల్లో ఫిలడెల్ఫియాలో జరుపుకుంటున్న 23వ తానా మహాసభలకు ఆతిథ్య సంఘంలో ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను. వేలాదిమంది విచ్చేస్తున్న ఈ సభలకు అన్ని ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించడానికి, తద్వారా సభలు విజయవంతం చేయడానికి కార్యకర్తలందరం కృషి చేస్తున్నాం. సంగీత విభావరి, థీం-తానా, ఇతర సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు, రాజకీయ చర్చలతో ఈ మూడు రోజుల సంబరాలు కలకాలం గుర్తుండిపోతాయని భావిస్తున్నాను.

మీ అందరికీ స్వాగతం పలుకుతూ...

సునీల్ కోగంటి

23rd TANA Conference Leadership, 2023




Anjaiah Chowdary Lavu
President



Ravi Potluri
Co-Ordinator



Srinivas Lavu
Chairman



Satish Tummala
Secretary




Ravi Mandalapu
Executive Director



Vamsi Kota
Director - Overseas



Sunil Koganti
Mid-Atlantic - RR



Bharath Maddineni
Treasurer



Srinivas Kukatla
Joint Secretary




Venkat Singu
Joint Treasurer

TANA BOARD OF DIRECTORS - 2021-2023



Dr. Hanumaiah Bandla
Chairman



Murali Vennam
Secretary



Lakshmi Devineni
Treasurer



Janardhan Nimmalapudi
Director (Non-Donor)



Srinivas Lavu
Director



Dr. Chowdary Jampala
Director



Dr. Nagendra Srinivas Kodali
Director



Anjaiah Chowdary Lavu
Ex Officio Member
President, EC



Niranjan Srungavarapu
Ex Officio Member
Executive Vice President, EC




Jayasekhar Talluri
Ex Officio Member
Past President



Sateesh Kumar Vemuri
Ex-Officio Member
Secretary, EC



Ashok Babu Kolla
Ex-Officio Member
Treasurer, EC



Venkataramana Yarlagadda
Ex Officio Member
Chairman, TANA Foundation



Sasikanth Vallepalli
Ex Officio Member
Secretary, TANA Foundation



Srikanth Polavarapu
Ex-Officio Member
Treasurer, TANA Foundation

TANA EXECUTIVE COMMITTEE - 2021-2023



Anjaiah Chowdary Lavu
President



Niranjan Srungavarapu
Executive Vice President



Jayasekhar Talluri
Past President



Sateesh Kumar Vemuri
Secretary



Ashok Babu Kolla
Treasurer



Murali Talluri
Joint Secretary



Bharath Maddineni
Joint Treasurer



Venkata (Raja) Kasukurthi
Community Service Coordinator



Sirisha Tunuguntla
Cultural Service Coordinator



Uma Katiki
Women Services Coordinator



Lokesh Naidu Konidala
Councilor-at-Large



Venkata Hiteshwar Vadlamudi
International Coordinator



Shashank Yarlagadda
Sports Coordinator



Tagore Mallineni
Media Coordinator



Srinivas Kukatla
Event Coordinator




Srinivas Yalavarthy
Membership Benefits Coordinator



Suresh Kakarla
Team Square Chair



Dr. Hanumaiah Bandla
Chairman
Board of Directors



Venkataramana Yarlagadda
Ex-Officio Member
Chairman, TANA Foundation

REGIONAL COORDINATORS - 2021-2023



Nagamalleswara Panchumarthi
Appalachian




Srinivas Vuyyuru
Capital



Sateesh Kommana
DFW



Sunil Koganti
Mid-Atlantic



Hanumantha Cherukuri
Midwest



Pradeep Kumar Gaddam
New England



Vamsi Vasireddy
New Jersey



Dilipkumar Musunuru
New York



Srinivas Gogineni
North




Sai Bollineni
North Central



Padma Bhogavalli
North West



Ram Thota
Northern California



Ravichandra Vadlamudi
Ohio Valley



Sarit Kommineni
Rocky Mountains



Venkata Ramana Meesala
South East



Kishore Yarlagadda
South Central




Ratna Prasad Gummadi
South West



Prathap Cherukuri
Southern California

TANA FOUNDATION 2021-2023



Venkataramana Yarlagadda
Chairman



Sasikanth Vallepalli
Secretary




Srikanth Polavarapu
Treasurer



Ramakanth Koya
Trustee



Ravi Samineni
Trustee



Viswanath Nayunipati
Trustee



Suresh Puttagunta
Trustee



Srinivas Chand Gorrepati
Trustee



Kiran Gogineni
Trustee - Non Donor



Purushotham C Gude
Trustee - Non Donor



Vinay Maddineni
Trustee - Non Donor



Srinivas Oruganti
Trustee - Non Donor




Sumanth Ramsetti
Trustee



Vidyadhar Garapati
Trustee - Donor



Anjaiah Chowdary Lavu
Ex-Officio Member President


AVIGNA
FINE JEWELS
SPECIALIZING IN
DIAMOND, GOLD,
KUNDAN AND POLKI
SCAN TO FOLLOW US
BRINGING YOU EXQUISITE JEWELLERY TO TEASE YOUR SENSES
22K HALLMARKED JEWELLERY & CERTIFIED DIAMONDS
/avignafinejewelsusa
/avignafinejewelsusa
CONTACT : DEEPTI MANDAVA , 6468414840

23rd TANA Conference Committees, 2023

ADVISORS



Gowtham Goli
Advisor




Laxmi Devineni
Advisor



Mahendar Musuku
Advisor



Purushotham C Gude
Advisor



Venkata R Yarlagadda
Advisor

AGRICULTURE FORUM (RAITHU KOSAM)



Left to Right: Krishna Nandamuri (Co-Chair), Dhruva Chowdary Nagandla (Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Ravi Mandalapu (Executive Director), Vamsi Kota (Director Overseas)

Not in Picture: Sudhakar Kandyala (Co-Chair), Neelaveni Kandukuri (Member)

23rd TANA Conference Committees, 2023

AUDIO & VIDEO



Left to Right: Santhosh Kumar Routu (Member), Narsimha Peruka (Co-Chair), Ramana Kumar Rakothu (Member)
Murthy Nutanapati (Chair), Mohan Malla (Member), Chandra Sekhar Rao Bhasutkar (Member)

AWARDS



Left to Right: Naidu Motupalli (Co-Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Not in Picture: Ram Bobba (Chair), Rao Karusala (Member), Rajesh Jampala (Member)

23rd TANA Conference Committees, 2023

BANQUET




Left to Right: Venkata Subbarao Muppa (Member), Shivani Tana (Member), Ranjani Thunga (Member)
Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Raju Gundala (Co-Chair)
Sravani Achuta (Member)



Left to Right: Prasad Kunarapu (Co-Chair), Raju Gundala (Co-Chair), Satish Chundru (Chair), Shivani Tana (Member)
Lakshmi Moparthi (Member), Ramana Duggireddy (Member), Sravani Achuta (Member)
Not in Picture: Chalam Pavuluri (Member), Ravi Teja Garimella (Member), Kalpana Gottipati (Member)
Raviteja Marineni (Member), Srinivas Kakarla (Member), Ramakrishna Chowdary Allu (Member)

23rd TANA Conference Committees, 2023

BUDGET



Left to Right: Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Rao Yalamanchili (Chair)
Not in Picture: Kumar Challagolla (Advisor)

BUSINESS FORUM



Left to Right: Seetharamaiah Sunku (Member), Naresh Korrapati (Member), Vidya Garapati (Advisor), Sri Atluri (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Sekhar Vemparala (Co-Chair) Santosh Kumar Yamsani (Co-Chair)
Not in Picture: Sarath Veta (Member), Anushka Mandalapu (Member), Prakash Kurukunda (Member), Siva Movva (Member) Krishna Mohan Amirineni (Member)

23rd TANA Conference Committees, 2023

CME



Left to Right: Ravi Potluri (Co-Ordinator), Dr. Prameela Motupalli (Member), Anjaiah Chowdary Lavu (President)

Not in Picture: Dr. Ravi Kolli (Advisor), Dr. Nagendra Srinivas Kodali (Advisor), Dr. Sailaja Musunuri (Chair)
Dr. Janaki Kaza (Member), Dr. Prasad Nalluri (Member)

COMMUNITY OUTREACH



Left to Right: Manisha Meka (Member), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Not in Picture: Lakshmi Moparthi (Chair)

23rd TANA Conference Committees, 2023

CONFERENCE LEADERSHIP



Left to Right: Vamsi Kota (Director Overseas), Ravi Mandalapu (Executive Director), Anjaiah Chowdary Lavu (President) Ravi Potluri (Co-Ordinator), Satish Tummala (Secretary), Sunil Koganti (Mid Atlantic RR) Venkat Singu (Joint Treasurer)

Not in Picture: Srinivas Lavu (Chairman), Bharath Maddineni (Treasurer), Srinivas Kukatla (Joint Secretary)

CULTURAL



Left to Right: Ashok K. Chintakunta (Co-Chair), Sarada Dantuluri (Co-Chair), Sarala Kommaraviolu (Co-Chair) Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Swathi Atluri (Chair), Shaila Mandala (Member), Kiran Borra (Member), Kanaka Tatikolla (Member), Thiru voonna (Member) Sravani Achuta (Member), Smita Charles (Member), Satya Varma (Member), Sreedevi Arige (Member) Saroja Pavuluri (Co-Chair), Rekha Uppaluri (Co-Chair), Radhika Koneru (Member)

23rd TANA Conference Committees, 2023

DECORATIONS, ARTS & CRAFTS



Left to Right: Srikanth Guduru (Member), Shreekanth Majge (Member), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator) , Phani Kantheti (Chair), Vasavi Devina (Member), Girija Madasi (Member)

Not in Picture: Anushka Mandalapu (Member), Madhuri Goljana (Member)

Dhim TANA




Left to Right: Sohini Ayinala (Co-Chair), Malathi Nagabhairava (Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Srilakshmi Kulkarni (Co-Chair), Krishna Nandamuri (Member)

Not in Picture: Pallavi Doppalapudi (Member), Poolani Jasti (Member), Aarthika Anne (Member),
Priyanka Gaddam ((Member), Chinmayi Mungara (Member)

23rd TANA Conference Committees, 2023

EXHIBITS



Left to Right: Kalyana Achanta (Chair), Prameela Inaganti (Member), Gopi Vagvala (Co-Chair)
Not in Picture: Suresh Reddy Venkannagari (Advisor), Satya Surapaneni (Advisor), Paparao Undavalli (Member)
Gopinath Garapati (Member), Hari Babu Thubati (Member), Srikanth Rayedi (Member)
Venky Daniala (Member)

FILM & PHOTOGRAPHY



Left to Right: Narsimha Peruka (Member), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator),
Sushanth Manne (Chair), Mouryateja Nallabantu (Member)
Not in Picture: Ramana Kumar Rakothu (Member), Praveen Bodepudi (Member), Amarnadh Chavali (Member),

23rd TANA Conference Committees, 2023

FOOD



Left to Right: Harish Annabathina (Member), Hemanth Yerneni (Member), Venkat Chamcha (Member)
Ravi Veeravalli (Advisor), Kiran Kothapalli (Chair), Umakanth Raghupathy (Co-Chair)
Murali Pamidimukkala (Member)

Not in Picture: Raju Kakkerla (Co-Chair), Ravi Indrakanti (Co-Chair), Chandhra Sekhar Pothineni (Member)
Dasaradha Ramaiah Talapaneni (Member), Mahesh Kumar Dachepalli (Member), Naveen Thokala (Member)
Nidheesh Inturi (Member), Ramana Duggireddy (Member), Pardha Madala (Member), Siva Anantuni (Member)
Tirupathi Rao Birapuneni (Member), Srinivas Donthineni (Member), Srinivas Cherukuri (Member)

HEALTH & INNOVATION



Left to Right: Murali Pamidimukkala (Member), Rama Krishna Pamidimukkala (Member), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator) Mohan Chadalawada (Chair), Praveen Ponna (Member), Hemanth Yerneni (Member)

Not in Picture: Dr. Rama Yerneni (Co-Chair), Dr. Neena Mukkamala (Member), Prathima Chava (Member)

23rd TANA Conference Committees, 2023

HOSPITALITY- ARTISTS



Left to Right: Satish Nalla (Member), Srinivas Kota (Co-Chair), Venkat Singu (Chair), Anjaiah Chowdary Lavu (President) Ravi Potluri (Co-Ordinator), Shivani Tana (Co-Chair), Ravi Macherla (Member), Suresh Yelamarthy (Member) Kiran Jonnala (Member), Raja Gandhe (Member),

Not in Picture: Jogeswara Rao Peddiboyina (Advisor), Praveen Reddy (Co-Chair), Naveen Thokala (Member) Jeevan Varadha (Member), Siva Juturu (Member)

HOSPITALITY- DONORS



Left to Right: Ajay Inaganti (Advisor), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Rama Muddana (Chair)

Not in Picture: Vignesh Reddy Kandula (Co-Chair), Mallik Bolla (Member), Pradeep Maddi (Member), Rajesh Gudla (Member) Srihari Gkina (Member), Raj Allagadda (Member), Naveen Kattamuri (Member), Santosh Kothamasu (Member) Kamalakar Pabbisetty (Member)

23rd TANA Conference Committees, 2023

HOSPITALITY- VIPS



Left to Right: Venky Daniala (Member), Mahesh Nair (Member), Veluvolu Syambabu (Advisor)
Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Ravi Chikkala (Co-Chair)

Not in Picture: Hari Motupalli (Chair), Ravi Kumar Raavi (Member), Praveen Reddy (Member), Girish Eyyapu (Member)

HOTELS



Left to Right: Praveen Ponna (Member), Prasad Pattabi (Member), Raghu Yeddulapalli (Chair), Pavan Nadimpalli (Member)

Not in Picture: Bapanna Mallireddy (Member), Sagar Reddy (Member), Rishi Mutayala (Member), Devender (Member)
Sudhaker Reddy (Member)

23rd TANA Conference Committees, 2023

IT INFRASTRUCTURE



Left to Right: Kishore Kukalakuntla (Member)
Mohan Malla (Chair)
Not in Picture: Karthik Chadalawada (Member)

KIDS ACITIVITIES



Left to Right: Rajeswari Kodali (Chair), Rishikesh Muddana (Member), Manvitha Yaganti (Member)
Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Ramya Pavuluri (Member)
Bhindu Lanka (Member), Vyom Krothapalli (Member)

23rd TANA Conference Committees, 2023

LITERARY



Left to Right: Manohara Boga (Member), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Sri Atluri (Chair)

MATRIMONIAL



Left to Right: Laxmi Devineni (Advisor), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)

Not in Picture: Padmaja Nannapaneni (Chair), Durga Balusu (Grand Sponsor), Sai Valluripalli (Co-Chair)
Sunitha Krosuri (Co-Chair), Akkina Murthy (Member), Sreevani Nuthanapati (Member)
Soumya Devabhakutni (Member), Chandra Anumolu (Member), Soumya Chirra (Member)
Madhavi Marthala (Member), Shilpa Kommidi (Member), Madhavi Chekka (Member)
Jyothi Devala (Member), Kavitha Kurukunda (Member), Sailaja Challapalli (Member)
Suneetha Kambhaladinne (Member), Nandini Topudurti (Member), Chandra Kumar Malavathu (Member)

23rd TANA Conference Committees, 2023

MEDIA & COMMUNICATIONS



Left to Right:
Viswanath Koganti (Chair)
Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator)

Not in Picture:
Tagore Mallineni (Advisor)
Yash Bodduluri (Co-Chair)
Damu Gedala (Member)

MEMENTOS, SHAWLS AND BOUQUETS



Left to Right: Ravi Theja Muthu (Member), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Ranjit Mamidi (Chair)
Not in Picture: Chinasatyam Veernapu (Advisor), Bhaskar Pinna (Member)

23rd TANA Conference Committees, 2023

NTR CENTENARY CELEBRATIONS



Left to Right: Janardhan Nimmalapudi (Advisor), Dr. Sreenath Konanki, Satish Meka (Chair), Anjaiah Chowdary Lavu (President) Ravi Potluri (Co-Ordinator), Vamsi Kota (Director Overseas), Srinivas Oruganti (Advisor), Mohan Malla (Member)

Not in Picture: Vidyadhar Garapati (Advisor), Ramakrishna Chowdary Allu (Member), Pradeep Karuturi (Member) Sarath Thatipamula (Member), Nagamalleswara Panchumarthi (Member), Indraneel Kamineni (Member) Srinivas Mandipudi (Member), Kishore Yarlagadda (Member), Ramesh Mandalapu (Member) Rao Mulpuri (Member), Srinivas Aremanda (Member), Ravi Lagadapati (Member), Praveen Kakani (Member) Ratna Prasad Lingamaneni (Member), Siva Kanakamedala (Member), Ratna Gummadi (Member)

NTR PHOTO EXHIBITION



Left to Right: Janardhan Nimnalapudi (Member), Satish Meka (Member), Anjaiah Chowdary Lavu (President) Ravi Potluri (Co-Ordinator), Vamsi Kota (Director Overseas), Sai Bollineni (Advisor)

Not in Picture: Kranthi Alapati (Chair), Siva Kanakamedala (Co-Chair), Ratna Prasad Lingamaneni (Member) Kishore Konka (Member)

23rd TANA Conference Committees, 2023

OVERSEAS COORDINATION - AP & TS



Left to Right:
Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator)
Srinivas Bharthavarapu (Chair)

PAATASALA COMPITITIONS



Left to Right: Sai Jarugula (Member), Lakshmi Muddana (Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Nagaraju Nalajala, Phani Kantheti


23rd TANA Conference Committees, 2023

PARKING



Left to Right: Koti Yaganti (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)

POLITICAL FORUM - AP



Left to Right: Satya Ponnaganti (Member), Leela Krishna Davuluri (Co-Chair), Radha Krishna Nallamala (Chair)
Manohara Boga (Member)

Not in Picture: Babu Dasari (Member), Sridhar Aluru (Member)

23rd TANA Conference Committees, 2023

POLITICAL FORUM - TS



Left to Right: Dhruva Chowdary Nagandla (Co-Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Ravi MayReddy (Chair), Chandrasekhar Rao Bhasutkar (Member)

Not in Picture: Sreedhar Gudala (Co-Chair), Bhaskar Pinna (Co-Chair), Chandra Sandhadi (Co-Chair)

POLITICAL FORUM - USA



Left to Right: Arun Ayyagari, (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Ravi MayReddy (Member), Ravi Theja Muthu (Member)

23rd TANA Conference Committees, 2023

PROGRAM GUIDE



Left to Right: Krishna Nandamuri (Member), Suresh Bondugula (Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Prashant Pasupula (Member)

Not in Picture: Venu Reddy Janga (Advisor), Srinivas Nadella (Member), Vikram Arjula (Member)

RECEPTION



Left to Right: Rajeswari Kodali (Co-Chair), Saroja Pavulurii (Chair), Anjaiah Chowdary Lavu (President),
Ravi Potluri (Co-Ordinator), Deepti Koka (Member), Mythri Nadimpalli (Member)

Not in Picture: Sudhakar Kandyala (Co-Chair), Rupa Reddy (Member), Raveena Tummala (Member), Neelima Voleti (Member)

23rd TANA Conference Committees, 2023

REELS AND SHORT FILMS



Left to Right: Sravani Achuta (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Sri Atluri (Advisor)
Not in Picture: Viswadath Duvvuri (Member), Swetha Kommoji (Member), Naveen Kakaraparti (Member)

REGISTRATION



Left to Right: Mahesh Nair (Member), Ajay Inaganti (Member), Dr. Sreenath Konanki (Co-Chair), Sai Jarugula (Chair)
Apparao Vaddempudi (Advisor), Hariprasad Sanka (Member)
Not in Picture: Devender Hanumaihgari (Member), Madhu Golla (Member), Sreenath Garlapati (Member)
Ravi Narava (Member), Vinodh Katragunta (Member)

23rd TANA Conference Committees, 2023

SECURITY



Left to Right: Johnmark Alfred (Co-Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Kiran Guduru (Chair), Arun Mekala (Member)

Not in Picture: Madhusudhan Nalla (Member)

SENIOR CITIZEN FORUM



Left to Right: Sambaiah Kotapati (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
KP Sompally (Member)

23rd TANA Conference Committees, 2023

SOUVENIR






Left to Right: Srinivas Sagaram (Chair), Sai Brahmanandam Gorti (Chair), Naveen Vasireddy (Member)
Sita Ponnapalli (Member)





Left to Right: Ranjith Mamidi (Member), Ravi Theja Muthu (Member), Nayudamma Chowdary Yalavarthi (Member)

SPIRITUAL




Left to Right: Srinivas Oruganti (Member), KP Sompally (Member), Subramanyam Varanasi (Chair),
Bhargavi Lakkakula (Member), Ravi C Varanasi (Co-Chair), Krishna Gudipati (Member)

Not in Picture: Krishna Linga (Advisor), Saidaiah Mylapalli (Member), Manju Kolli (Member),
Madhava Reddy Mosarla (Member), Baba Sontyana (Member)

23rd TANA Conference Committees, 2023

SPORTS



Left to Right: Sriram Alokam (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Chalam Pavuluri (Co-Chair)

Not in Picture: Harish Kukatla (Co-Chair), Ramesh Mandalapu (Co-Chair), Ravi Macharla (Member)
Naga Mohan Pasupuleti (Member)

STAGE COORDINATION



Left to Right: Srinivasa Kasimahanthi (Chair), Saroja Sagaram (Advisor), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Bhavani Krothapalli (Co-Chair)

Not in Picture: Venkat Avirneni (Member)

23rd TANA Conference Committees, 2023

TANA CARES



Left to Right: Sashidhar Jasty (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)

TANA LMA



Left to Right: Aravind Arvapalli (Member), Bharath Ramaka (Co-Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Hari Krishna Katakota (Chair)

23rd TANA Conference Committees, 2023

TANA STARTUP LAUNCHPAD



Left to Right: Lanka Sravan (Member), Ravi Theja Muthu (Co-Chair), Anjaiah Chowdary Lavu (President)
Ravi Potluri (Co-Ordinator), Nayudamma Chowdary Yalavarthi (Co-Chair)

Not in Picture: Rakesh Battineni (Chair)

TECHNOLOGY - APP



Ranjit Mamidi (Chair)

TRAVEL



Left to Right:
Prasad Krothapalli (Chair), Pavan Nadimpalli (Member)

Not in Picture:
Venkata Chimmili (Co-Chair), Sanath Vemuri (Member)
Venu Edupuganti (Member)

23rd TANA Conference Committees, 2023

TRANSPORTATION



Left to Right: Ravi Potluri (Co-Ordinator), Anjaiah Chowdary Lavu (President), Johnmark Alfred (Chair)

TTD KALYANAM



Left to Right: Kavitha Mandalapu (Member), Laxmi Devineni (Advisor), Subra Osuru (Chair)
Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)

Not in Picture: Bhargavi Lakkakula (Member), Kavitha Kurukunda (Member), Murali Telkapalli (Member)
Pradeep Maddi (Member), Rajesh Dokuparthi (Member), Shivani Tana (Member), Veeresh Vuyyuri (Member)
Sudha Potla (Member), Sneha Chirra (Member), Roja Venkat (Member), Madhuri Jelli (Member)
Vasantha Gadamsetti (Member)

23rd TANA Conference Committees, 2023

VENUE COORDINATION



Left to Right: Harnath Doddapaneni (Chair), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator)
Hemanth Yerneni (Member)

VOLUNTEER



Left to Right: Harish Annabathina (Co-Chair), Seshu Sai Samudrala (Member), Hari Babu Thubati (Chair)
Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator), Kishore Kukalakuntla (Member)

Not in Picture: Shreekant Majge (Member), Hemanth Yerneni (Member), Venkat Chavakula (Member), Srikanth Rayedi (Member), Shiva Reddy Pessu (Member), Purna Chandra Ganguri (Member), Chandhra Sekhar Pothineni (Member) Rao Karusala (Member), Ramesh Tummalapalli (Member), Saikanta Raparla (Member), Rajesh Musunuru (Member) Naga Ravinu (Member), Bharath Kandregula (Member), Kalyan Karri (Member), Praveen Bodepudi (Member) Nikitha Nelakuditi (Member), Rajesh Konanki (Member), Sridhar Aluru (Member), Ramu Nallavalli (Member) Sridevi Budavati (Member), Jhansi Linganna (Member), Sreenath Garlapati (Member), Bindu (Member) Venkata Karthik Billakanti (Member)

23rd TANA Conference Committees, 2023

WEB



Left to Right: Prakash Kurukunda (Member), Nayudamma Chowdary Yalavarthi (Co-Chair), Anjaiah Chowdary Lavu (President) Ravi Potluri (Co-Ordinator) Rahul Yerra (Chair), Ranjit Mamidi (Co-Chair)

Not in Picture: Bilhan Alapati (Advisor)

WOMENS FORUM



Left to Right: Kavitha Mandalapu (Member), Anjaiah Chowdary Lavu (President), Ravi Potluri (Co-Ordinator) Sailaja Adluru (Chair),

Not in Picture: Shailaja Medidi (Member), Vijaya Nadella (Member), Dr. Sushma Kaveti (Member), Bhanu Arasada (Member) Manjeera Paladugu (Member), Shree Gurusamy (Member)

23rd TANA Conference Committees, 2023

YOUTH



Left to Right: Lavanya Ande (Event Lead), Tarika Yellaula (Event Lead), Manish Polavarapu (Chair)
Aparna Vagvala (Co-Chair), Varshika Mandalapu (Member)

Not in Picture: Ravi Adusumalli (Advisor), Rohit Geereddy (Co-Chair), Chinmayi Mungara (Event Lead)

ALUMNI

Harnath Doddapaneni (Advisor)
Ramakrishna Vasireddy (Chair)

CELEBRITY COORDINATION

Chandini Duvvuri (Advisor)
Ujwal Kasthala (Chair)
Nehal Mahankali (Celebrity Coordination)
Arun kumar Anthati (Celebrity Coordination)
Koushik Vinala (Celebrity Coordination)
Rajitha Damarlapally (Celebrity Coordination)
Lakshmi Kasukurthi (Member)
Venu Madhav Kasukurthi (Member)

23rd TANA Conference Committees, 2023

CORPORATE SPONSORSHIP

Jagadish Prabhala (Chair)
Subbarow Chennuri (Member)

CURIE TANA

Prabhu Vemuri (Chair)

DONOR RELATIONS

Dr. Uma Aramandla Katiki (Advisor)
Rajesh Yarlagadda (Chair)
Srinivas Uppu (Co-Chair)
Subramanyam Varanasi (Member)
SreeRam Royyala (Member)
Suneel Devarapalli (Member)

IMMIGRATION FORUM

Yash Bodduluri (Chair)
Dasaradha Ramaiah Talapaneni (Member)
Praveen Ponna (Member)

INVITATIONS

Chinasatyam Veernapu (Chair)
Sanath Vemuri (Member)
Venu Edupuganti (Member)

23rd TANA Conference Committees, 2023

PANEL DISCUSSIONS

Sudheer Narepalepu (Chair)

PUBLICITY

Damu Gedala (Chair)
Rammohan Rao (Co-Chair)
Satya Nemana (Co-Chair)
Baba Sontyana (Member)

US DIGNITARIES CO-ORDINATION

Karthik Ala (Chair)
Murthy Akkina (Co-Chair)
Raj Katla (Co-Chair)
Chinmayi Mungara (Member)
Devender Hanumaihgari (Member)
Siva Movva (Member)










Razberry's

MAKING MOMENTS MEMORABLE







RAZBERRY'S WEDDING VENUE

834 State Rt 12,
Frenchtown, NJ 08825

Phone: +1 908 285 6942 Email: info@razberrys.net

Website: www.razberrys.net

DIAMOND SPONSOR



Mr. Vishwa Prasad TG, Mrs. Vandana, Pranav and Kriti

PLATINUM SPONSORS



Mr. Sasi Kant Vallepalli, Mrs. Priyanka, Rishik and Geethika

With Best Compliments From



Mr. Durgaprasad Gadde
and
Mrs. Padmaja Gadde

PLATINUM SPONSORS



Mr. Ramu Venigandla

PLATINUM SPONSORS



Mr. Ramakrishna Bobba, Mrs. Radhika and Family

PLATINUM SPONSORS



Mr. Raja Kasukurthi, Mrs. Ranjita, Anindya and Avyay

PLATINUM SPONSORS



Mr. Ravi Mandalapu, Mrs. Kavita, Anushka, Dhanush and Varshika

PLATINUM SPONSORS




Mr. Lokesh Naidu Konidala, Mrs. Aparna and Family

With Best Compliments
From



Mr. Sudhakar Kancharla
and
Mrs. Pracheta

PLATINUM SPONSORS



Mr. Mahender Musuku, Mrs. Samatha, Yuvna and Shreyas

GOLD SPONSORS



Mr. Anjaiah Chowdary Lavu, Mrs. Natasha, Srikanth and Akshinasri



Mr. Ravi Potluri, Mrs. Indumathi, Irasri and Athira

GOLD SPONSORS



Mr. Srinivasa Rao Lavu, Mrs. Mrudula and Family



Mr. Mohan Edara, Mrs. Kalpana and Family

GOLD SPONSORS



Mr. Sri Atluri and Mrs. Swathi, Hanish and Manish



Dr. Pailla Malla Reddy, Mrs. Sadhana and Family

GOLD SPONSORS



Mr. Satish Vemana, Mrs. Neelima Chanamolu, Anvika and Aneesh



Mr. Prasad Nalluri and Mrs. Lakshmi, Sreya and Srikar

GOLD SPONSORS



Mr. Praveen Andapalli, Mrs. Vijaya, Pranathi and Varun



Mr. Vidyadhar Garapati

Use TitleSuit Document Registration Services

& Get any documents registered easily

It's as simple as
"Book & Draft Online, Sign & Collect Offline"



Scan & Download

GET IT ON Google Play

Download on the App Store

Visit
www.titlesuit.com

*Terms & Conditions Apply

GRAND BENEFACTORS



Mr. Gowtham Goli & Family



Mr. Gangadhar Nadella, Mrs. Durga & Family



Mr. Venkatrao Mulpuri & Mrs. Savitri



Mr. Satish Tummala & Mrs. Rani

GRAND BENEFACTORS



Mr. Kiran Reddy Pasham & Family



Mr. Sunil Pantra & Family - *Tek Labs, Inc.*



Mr. Kranthi Ponnam & Family



Mrs. Uma Katiki & Family

GRAND BENEFACTORS



Mr. Karunakar Asireddy & Family



Mr. Subba Arumilli & Vijay Bandla




Mr. Venkat Gutta & Family





Mrs. Ramakrishna Muddana & Family and Mr. Sreedhar Kommalapati & Family

GRAND BENEFACTORS



Mr. Satish Chundru, Mrs. Satya & Family



Dr. Ramesh Eluri, Mrs. Sailaja Adluru & Family




Mr. Ravi Varre, Mrs. Saritha & Family



Mr. Hanuman Nandanampati & Family

GRAND BENEFACTORS



Mr. Brahmaji Valiveti and Dr. Sailaja



Mr. Ravi Yerneni, Mrs. Mamta, Sheel & Neel



Dr. Premsagar Reddy & Mrs. Shanthi



Mr. Srinivas Chand Gorrepati, Mrs. Vani & Family

GRAND BENEFACTORS



Mr. Jagadish Prabhala, Monish Mahadev
Mrs. Manjusha & Manasa



Mr. Siva Kanakamedala & Family



Mr. Jayaram Komati, Mrs. Kalpana & Family



Mr. Naren Kodali, Mrs. Lakshmi & Family

GRAND BENEFACTORS

With Best Compliments From

Dr. Nagendra Srinivas Kodali and Family



Mr. Anju Vallabhaneni, Mrs. Aruna, Sravani & Rohit



Mr. Sreedhar Patibandla



Mr. Ram Talluri

GRAND BENEFACTORS



Mr. Naveen Yerneni



Mr. Srinivas Nimmagadda



Dr. Chandrasekhar Pemmasani



Mr. Srinivas Guttikonda

GRAND BENEFACTORS





Mr. Sagar Palaprolu and Mr. Shiva Jasti, Sage IT



Mr. Srini Rajanikanth Gangavarapu & Family



Mr. Subrahmanyam Osuru, Mrs. Swapna Krishnateja & Ira



Mr. Hari Motupalli, Mrs. Lavanya, Shriya & Shreyas

GRAND BENEFACTORS



Mr. Sagar Lagisetty, Vanaja & Family



Mr. Bhanu B Illindra



Mr. Satya Surapaneni & Family



Mr. Radhakrishna Nallamala, Mrs. Manavi & Family

GRAND BENEFACTORS





Mr. & Mrs. Ravindra Hanumara and Mr. Ajay Inaganti & Family





Mr. Vijay Vennam & Family and Mr. Jagadish Arumula & Family

With Best Compliments From

Mr. Suresh Kakarla & Family



Mr. Rakesh Battineni, Mrs. Lalita, & Family

GRAND BENEFACTORS

With Best Compliments From

Mr. Vishnu Donepudi & Family

With Best Compliments From

Mr. Leelakumar Kaza & Family

With Best Compliments From

Mrs. Rupa Jasti

With Best Compliments From

Mr. Suresh Puttagunta & Family

BENEFACTORS



Mr. Sunil Koganti, Mrs. Roopa & Shruthi Sai



Mr. Srinivas Kukatla & Family



Mr. Rajesh Yarlagadda



Mr. Sekhar Puli, Mrs. Malini & Family



Mr. Tagore Malineni & Family



Mr. Sai Bollineni, Mrs. Sailaja & Shloka



Mr. Phani Kantheti, Mrs. Rajeshwari Kodali
Pranav & Aarnav



Mr. Prasad Ravipati & Family

BENEFACTORS




Mr. Sekhar Vemparala



Mr. Malli Vemana & Family



Mr. Hanumaiah Bandla & Mrs. Swapna



Mr. Venkatramana Yarlagadda



Mr. Venu Sangani



Mr. Suresh Gottipati



Mr. Kishore Kancherla



Mr. Satish Manduva & Family


BENEFACTORS



Mr. Apparao Vaddempudi, Mrs. Kousalya, Sriram & Raghu



Mr. Shankar Musunuri, Mrs. Sailaja, Karthik & Vinny



Mr. Sagar Maramreddy & Family



Mr. Subhakar Velaga & Family




Mr. Kiran Duggirala & Family



Mr. Vijay Kommineni, Mrs. Padmaja, Chankya & Monish



Mr. Kumar Nandigam & Family




Mr. Venkat Gottipati & Family

BENEFACTORS




Mr. Satheesh Mekala & Family



Mr. Sai Jarugula, Mrs. Vijaya & Family



Dr. Baburao Kaza & Dr. Janaki



Mr. Kotibabu Yaganti, Mrs. Saroja Pavuluri, Sai Manvitha, Medha



Mr. B.V. Prasad Krothapalli, Mrs. Bhavani, Vyom & Manvi



Mr. Bobby Yerra



Mr. Vinay Paruchuri & Family



Mr. Sridhar Appasani, Mrs. Sudharani, Mahitha & Akshitha


BENEFACTORS



Mr. Suresh Kagithapu, Mrs. Lavanya, Yashica & Akhil



Mr. Ramakrishna Pamidimukkala



Mr. Suresh Bondugula, Mrs.Lavanya & Advaith



Mr. Venkat Singu, Mrs. Srilakshmi, Sohan & Nirvi




Mr. Muralikrisha Gadde, Mrs.Sailaja, Vamsi, Teja & Kiran



Mr. Vinay Kumar Maddineni



Mr. Eshwar Dommeti, Sohini Aynala & Family



Mr. Nagamalleswara Rao Panchumarthi & Family

BENEFACTORS



Mr. Vamshi Reddy Kancharakuntla & Family



Mr. Raviteja Garimella & Family



Mr. Ramana Anne & Family



Mr. Purushothama Chowdary Gude & Family



Mr. Venkat Suryadevara



Mr. Ram Chowdary Upputuri & Family



Jessica, Niam, Mr. Naidu Motupalli, Mrs. Prameela Vinay, Nathan & Vasu



Mrs. Haritha Sakhamuri & Family

BENEFACTORS



Mr. Lakkireddy Hanumareddy & Family



Mr. Venubabu Dhanekula & Family



Mr. Venkataramana Ganne & Family



Mr. Venkat Dhaniyala




Mr. Vamsi Kota & Family



Mr. Srinivas Mupparaju & Family



Mr. Ravi Yarlagadda & Family



Mr. Ravi Vattikuti & Family


BENEFACTORS



Mr. Ranjith Pothur & Family



Mr. Ramprakash Kota & Family




Mr. Prasad Donepudi & Family



Mr. Malleshwar Rao Tella & Family



Mr. Kranthi K Alapati & Family



Mr. Ajay Babu Vadlamudi & Family



Mr. Ashwini Dhaniyala & Family



Mr. Suresh Yalamanchi & Family

BENEFACTORS



Mr. Vinayak Achuta, Mrs. Sravani & Family




Mr. Devender Reddy Aerrabolu



Mr. Thomas V Allen



Mr. Sudhakar Pennam



Mr. Nagaraju Nalajula & Family



Mr. Sreenath Polavarapu




Mr. Sreenath Konanki



Mr. Kiran Kothapalli & Family

BENEFACTORS



Mr. Venkata Subbarao Karusala

With Best Compliments From

Mr. Venkat Pothur & Family

With Best Compliments From

Mr. Surendra Byrapaneni & Family

With Best Compliments From

Mr. Kiran Madala & Family

With Best Compliments From

Mr. Yogi Papagiri & Family

With Best Compliments From

Mr. Ram Chada & Family

With Best Compliments From

Mr. Krishnakath Kodali & Family

With Best Compliments From

Mr. Sairam Surapaneni & Family

GRAND PATRONS (In $)

Manjula Miryalkar	9,000
Satish Konidala	8,000
Srikar Tummala	7,500
Swarna Jewelers	7,000
Madhukar Yarlagadda	6,250
Madhuri Eluri	6,060
Chaitanya Gangineni	6,050
Gowtham Naidu Konidela	6,000
Gopi Vagvala	6,000
Sudheer Chinthamaneni	6,000
Babu Vadlamudi	6,000
Vamsi Inapuri	6,000
Satish Radhakrishnan (Aroma)	6,000
Jogeswara Rao Peddiboyina	6,000
Srinivas Oruganti	6,000
Mohan Chadalawada	6,000
Hemanth Mukkamala	6,000
Murali Pamidimukkala & Hemanth Erneni	6,000
Yash Bodduluri	6,000
Ram Allu	6,000
Akkina Murthy	6,000
Raju Kakkerla	6,000
Sridhar Doddapaneni	6,000
Murali Boddu	6,000
Anil Yalamanchili	6,000
Venkat Madipadaga	6,000
Purna Veerapaneni	6,000
Srinivasa Yelavarthy	6,000
Arun Vuyyuru	6,000
Bilhan Alapati	6,000
Bharath Maddineni	6,000
Venu Madhav Danda	6,000
Venkat Chalasani	6,000
Sudhakar Jonnalagadda	6,000
Venkateswarlu Adusumalli	6,000
Venkata Hiteshwar Vadlamudi	6,000
Venu Gopal Thota	6,000
Venkata Kishore Puttagunta	6,000
Surya Bezawada	6,000
Veeru Ganne	6,000
Chari Kambara	6,000
Satish Kotapati	6,000
Sri Prashanth Katragadda	6,000
Hemanth Kukatla	6,000
Venkat Bomma	6,000
Gopi Chigurapati	6,000
Paramesh Bheemreddy	6,000
Venu Babu Dhanekula	6,000
Kalyan Vijay Lakimsetti	6,000
Praveen Tadakamalla	6,000
Omprakash Nakka	6,000
Vinay Mahajan	6,000
Kiran Kumar Nuthi	6,000
Ravi Karamsetti	6,000
Chaitanya Manne	6,000
Umash Challappa	6,000
Mahesh Kasa	6,000
Radha Alla	6,000
Visva Kandi	6,000
Samba Movva	6,000
Dasarath Kunapaneni	6,000
Hari Katragadda	6,000
Satish Nagilla	6,000
Mani Kuchan	6,000
Praveen Chinta	6,000
Murthy Koppaka	6,000
Vamsi Vasireddy	6,000

BBI Law Group, P.C.

- EMPLOYMENT-BASED IMMIGRATION
- FAMILY-BASED IMMIGRATION
- EB-5 INVESTOR VISA PROGRAMS
- CORPORATE COMPLIANCE
- I-9 AND E-VERIFY COMPLIANCE
- NATURALIZATION MATTERS
- ALL OTHER IMMIGRATION MATTERS



ATTORNEY BHANU B. ILINDRA, ESQ.,

ATTORNEY PROFILE

Mr. Bhanu B Ilindra represents companies as well as individuals who need guidance and support regarding all applicable immigration law and regulations. Mr. Ilindra not only provides exceptional representation but also provide invaluable counsel to business owners and employers looking to hire foreign workers especially high skilled foreign workers. Mr. Ilindra's clientele include small, midsize to large companies in numerous industry sectors mainly information technology, science, engineering, healthcare, and financial services

ABOUT BBI LAW GROUP

BBI Law Group, P.C. prides itself in providing prompt, courteous, and professional service to its clients. We have developed a reputation that our firm is one of the most caring places to work with. Our honest and dedicated approach to a client's case and our continued search on how to serve our client better, clearly indicated our clients how much we care about them. Since our inception, We began to grow as one of the known immigration law firms in the Washington D.C. area. We are provided with technical resources of a large firm while we retain personal client interaction and cost effectiveness of a small firm

Contact us

950-Herndon Parkway, Suite 355
Herndon, VA 20170

crm@bbilawgroup.com
bhanu@bbilawgroup.com

Call us: 703-496-7722, Visit for more info www.bbilawgroup.com

sling

WATCH TOP SOUTH INDIAN HITS ALL YEAR ROUND



~~$20~~ **$10** FOR YOUR FIRST MONTH

~~$240~~ **$80** FOR YOUR FIRST YEAR

*Packages and channels are subject to change

SIMPLY SOUTH · GEMINI · SVBC TTD · WILLOW HD · +more

sling.com/DAKSHIN



సంస్కృతి మన వరం
సేవ మన బలం

23వ తానా మహాసభల ఆరంభ నృత్య రూపకం

జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

తానా

తెలుగుభాషకీ, తెలుగుచరితకీ వరవీణ తానా
తరతరాల తానా
తెలుగుపౌరుషం, తెలుగువైభవం చాటే థిల్లానా
ధిరన ధిరన తానా తెలుగుకి తందాన తానా
జాతిరత్నములపై వర్షించే మల్లెపూల వాన తానా
అమెరికా సభలకు స్వాగతమిచ్చే పన్నీటిసోన తానా
తెలుగు సంస్కృతి, సంప్రదాయములు కాపాడే పెద్దన్న తానా
ప్రేమను పంచి,చేయందించే పరోపకారి పాపన్న తానా

రాణీరుద్రమా

జయజయ రాణీరుద్రమా!
స్వాభిమాన సమరోద్యమా! కాళికాంబ అవతారమా!
కాకతీయ సామ్రాజ్యరమా!
నీకుతక్క ఈ భూమిపైన ఈ శౌర్యసాహసం సాధ్యమా!
ఇంకెవ్వరికైనా సాధ్యమా!
ఎనుబదేండ్ల ఈ వయస్సులో యుద్ధములో పోరాటమా?
శత్రువు గుండెల ప్రకంపమా!
యుగములు నిలబడు పౌరుషమా!
జగములు పొగడు పరాక్రమమా!
సత్కళలన్నిటిపై సంతకమా!
మహాంధ్రనగరీ వైభవమా!

శేషప్ప

విశేషముగ నీతులెన్నో వివరించెను శేషప్ప.
వందల చురకలు, ఆ తెగువకు వందనమప్పా!
తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు.
వెళ్లిపోయెడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారమ్ము మింగబోడు
అధికవిద్యావంతుల ప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతుల మాట జనవిరోధంబాయె
వదరుబోతుల మాట వాసికెక్కె
పుడమిలో దుష్టులకు జ్ఞానబోధ తెలిపి
సజ్జనుల జేయలేడెంత చతురుడైన
భూషణవికాస శ్రీ ధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర

కొమురం భీముడు

కొమరం భీముడు సమరం ధీరుడు
గోండుల యోధుడు గండరగండడు
అడవుల భూముల కాపాడే అపరఘటోత్కచుడు
నైజాం సర్కారునే వణికించిన నారసింహబలుడు
ఫెడీఫెడీమను పిడిగుద్దులతో ఘడీలన్ని పడగొట్టాడు
బడాబడా మరఫిరంగులన్నీ ఎడాపెడా తెగ్గొట్టాడు

అజాపజా తననెరుంగకుండా నిజాం ఫౌజు పనిపట్టాడు
ప్రజాబలంతో కదంతొక్కి తెలంగాణ ఖలేజా చూపాడు
అడవితల్లి ముద్దుబిడ్డడు ఆదివాసీ వీరుడు
అటవీ స్వతంత్రధీరుడు అమరుడు కొమరం భీముడు

కాళోజీ

వాడుకమాటలనే కొరడాలుగ చేసి
వాతలు గుర్తుండేలా చెళ్లుచెళ్లుమనిపించి
కవితారసమును పూసి కర్తవ్యం తెలిపాడు
కాళోజీ మనకోసం కవిగా పుట్టిన యముడు.
తెలుగువాడివై వుండీ తెలుగు నాకు రాదనీ సిగ్గులేక
ఇంకా చెబుతావెందుకురా?
అన్యభాషలను నేర్చి అమ్మభాష రాదనీ
సకిలించే తెలుగోడా చావవెందుకురా?

యోగి వేమన

వేమనరా యోగి వేమనరా ప్రతిపద్యము జాతికి దీవెనరా
అనుభవసారము, లోకజ్ఞానము
ఆయన కవితకు మూలమురా
తెలివికి, తెలుగుకు ప్రాణమురా
మూడుపంక్తులే విషయమురా
మూఢుని తీరిచిదిద్దునురా
మూడవపంక్తి చెప్పేతీరుకి ముల్లోకాలే అదురునురా
నీతిని సూటిగ చాటునురా నీచులను చెండాడునురా
గురుడై ఉపదేశించునురా గూఢ గుయ్యిమనిపించునురా
దేవుడు,జీవుడు చావూ పుట్టుక వేదాంతము వివరించునురా
మనిషినిపట్టిన మాయరోగము మానే మందును వేయునురా
తండ్రికొడుకు, భార్యా, భర్త బంధుమిత్రుల బంధాలు
అందరిలోని అసలు రూపములు అద్దముపట్టీ చూపునురా

పోతులూరి వీరబ్రహ్మం

కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మం యోగమహిమచే తెలిపెను
త్రికాలమర్మం విజ్ఞానం అందుకొని విశ్వజ్ఞానం
భవిష్యత్తు తెలుపు వీరబ్రహ్మజ్ఞానం
శాస్త్రజ్ఞులు తెల్లబోవు అతీంద్రియజ్ఞానం
స్వార్థం మానండి అనే ఆత్మజ్ఞానం
ప్రకృతిలో ఎక్కడ ఏ క్షణమేం జరుగునో
భూమిపైన దానిఫలితమేతీరుగ ఉండునో
ఖచ్చితముగ వివరించే కాలజ్ఞానం
వీరబ్రహ్మేంద్రుని దివ్యజ్ఞానం
ఇనుపపట్టాలపై ఇనుపరథములు, నాల్గు
దిక్కులా వేగముగ తిరిగేనయా
నీటితోటి కోటిదీపాలు లోకాన
ఇంటింట నిత్యమూ వెలిగేనయా
గాలినౌకలలోన లీలగా జనులెల్ల
గగనవీధులలోన ఎగిరేరయా
నీతినియమములేక జాతిజాతికి పడక
భూతలమ్మే నరకమయ్యేనయా
వికృతరోగాలతో ప్రకృతివిపరీతాల
సతతమ్ము జనులు మృతిచెందేరయా
ధర్మమే సుఖశాంతులొసగేనయా

తరగొండ వెంగమాంబ

తిరుమలేశు భక్తురాలు తరిగొండ వెంగమాంబ
తెలుగుకవనసీమలోన విలువలుగల కవయిత్రి
వేంకటేశునికి తన బ్రతుకు అంకితముచేసి
భక్తిజ్ఞానవైరాగ్యముతో సేవించి
ఓనమాలు నేర్వకున్న ఆశువుగా కవితచెప్పి
శతకములు కావ్యములతో అబ్బురపరచినది
ద్విపద భాగవతము, యక్షగానములు
శివలీలావిలాసమును విరచించినది
స్వామికొసగె వేంకటాచలమాహాత్మ్యము
వ్రాసెనటులె వాసిష్ఠరామాయణము
అష్టాంగయోగ సారమెరిగి, విష్ణుపారిజాతమై
తత్త కీర్తనాలహరిగ తరియించినది
తన రచనలతో తెలుగును పండించినది.

కోడి రామమూర్తి

కొండపిండి చేయగలడు కోడి రామమూర్తి
భూతలాన మారుమ్రోగు ఆతని ఘనకీర్తి
భుజశక్తి, ఆత్మశక్తి, యోగశక్తియుతుడు
ప్రాణాయామసాధనలో అసామాన్యుడు
విశాల వక్షస్థలుడు,వజ్రదేహుడు
యుద్ధమల్ల మార్తాండుడు, దోర్దండుడు
ఎట్టి జగజ్జెట్టినైన పట్టి మట్టికరిపించును
ఏనుగునే గుండెపైన నవ్వుతూ ఎక్కించుకొనును
గోదాలో దిగినచాలు శత్రువు పరువు
గోదావరిలో కలిపే తెలుగు యోధుడు

బరిలో దిగు ఎదుటిమల్లు నమాంతముగ పట్టి
ఏనుగు కొబ్బరి నమిలిన తీరున ఓడించును
తెలుగుయువతకాతడే స్ఫూర్తి
సుధాకరుడు కలియుగభీముడన్న బిరుదాంచితుడు.

ఆదిభట్ల నారాయణదాసు

హరికథాపితామహుడు ఆదిభట్ల మహాకవీ
నారాయణదాసుది నరసింహుని రీవి
ఆంగ్లనాటకకర్త షేక్స్పియర్ కవితలో పసని వివరించె
నవరసతరంగిణిగా సంగీత సాహిత్య నాట్యసంభరితమౌ
హరికథాకళకై అవతరించాడు
శతకాలు, గ్రంథాలు,శాస్త్రానువాదాలు
ఆత్మకథ ఎరుకతో అందించినాడు
అష్టావధానాలు, వీణావాదనలు
అలవోకగా చేసి ఆశ్చర్యపరిచాడు
అనేక కృతులను,అపూర్వగతులను మనోహరముగా
సృజించి లలితాసహస్ర మచ్చతెలుగులో తల్లివిన్కియని
రచించి మహాపండితులు, మహాకవులతో
మహానుభావుడు అనిపించి భాగవతారై,
భాషాంబుధియై ఆంధ్రచరితలో నిలిచాడు
ఆదిభట్లనారాయణుడు హరికథాపితామహుడు
తెలుగులోన చదివి, తెలుగులో మాటాడి
తెలుగుజాతి పరువు నిలుపుడయ్య
తెలుగుదీక్షపూని తెలుగుకు జైయని
తెలుగుతల్లి ఋణము తీర్చుడయ్య. తెలుగుతల్లికీ జై.

గిడుగు రామమూర్తి

గ్రాంథికభాషను కాదని వాడుకభాషను తెచ్చిన
బహుభాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తి
మారుమూల పర్వతాలపేటలోన పుట్టి
భాషాసంస్కరణకై పర్వతమై నిలిచాడు
సొంతడబ్బు ఖర్చుపెట్టి నిందలు పక్కనపెట్టి
వాడుక భాషోద్యమం సాగించాడు
మహామహాపండితులనె ఎదిరించాడు
సవరభాష నిఘంటువు, వ్యాకరణం రచించి
అంటరానితనమును ఖండించాడు
తన ఇంటనె సవరలను పోషించాడు
తేలికగా మనందరం తెలుగును చదివేందుకు
మార్గదర్శియై నిలిచిన మహనీయుడు గిడుగు.
మహనీయుడు గిడుగు.

అల్లూరి సీతారామరాజు

కాషాయం కట్టిన యోగి వీరుడు
కార్చిచ్చై పోరాడిన తెలుగు యోధుడు
అరాచకం ఎదిరించే అల్లూరి అదరిపడే తెల్లవాడె గుండెజారి
గిరిజనులకు జరుగుతున్న అన్యాయం చూసి
ఆంగ్లేయుల దోపిడీని ధిక్కరించి విప్లవించి
గూడెం గూడెం సైనికశిబిరం కావించి
లండన్ కొడుకుల గుండెకి సూటిగా గురిచూసి
భరతావని పౌరుషాన్ని బాణాలుగ వేశాడు
ఆత్మార్పణతో స్వతంత్ర జ్యోతిని వెలిగించాడు.
వందేమాతరం! వందేమాతరం!!

డొక్కా సీతమ్మ

కాశీలో వెలసిన ఆ అన్నపూర్ణమ్మ
ఆంధ్రాలో పుట్టిన డొక్కా సీతమ్మ
ఆమె నోముఫలమంతా అన్నరాశి చేసి
'అతిథిదేవోభవ'అని వడ్డన చేసి
ఎవరే వేళకు వచ్చిన, వండీ వార్చి
తన ఇల్లే ధర్మసత్ర మొనరించి పోషించెను జనులను,
భారతీయ గృహిణి పాత్ర
అమృతరేఖ గల ఆమె హస్తమె అక్షయపాత్ర.

కందుకూరి వీరేశలింగం

నవచరితకు కందుకూరి సంచలనం, జ్వలనం
ఆంధ్రజాతిలో అతడే సంస్కరణాశిఖరం
బాల్యవివాహాలు ఆపి అబలల చదివించి
స్వతంత్రించి వితంతువుల వివాహాలు చేసి
నిందలు పడి తిట్లు తిన్న ఉద్యమ వైతాళికుడు
ఒహోయనగ మహాకవిగ గ్రంథరచన చేసినాడు
మూఢాచారాలలోన మునిగిన
సంఘం సంస్కరించె కందుకూరి వీరేశలింగం

చిలకమర్తి

చెణుకులకీ, సరసానికి చక్రవర్తి
చిలక పలుకులతో చెంపలు వాయించే చిలకమర్తి
పద్యాన్నే అస్త్రంగా సంధించాడు
జాతిని మేల్కొల్పిన జ్ఞాననేత్రుడు
భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ

తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియకట్టి.

బాలసుబ్రహ్మణ్యుడు

పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యుడు
గుండెలు ఉప్పొంగించే గానగంధర్వుడు
స్పష్టంగా ఉచ్చరించి తెలుగున ప్రతి అక్షరం
చాటినాడు లోకానికి తెలుగుభాష అందం
ప్రతి నటుడికి వరం బాలూ కంఠస్వరం
సుస్వరాల సరస్వతికి సువర్ణహారం
తెలుగొకటే కాదు తమిళ కన్నడ మలయాళాలు
బెంగాలీ ఒడియా తుళు హిందీ సంస్కృతాలు
ప్రతిభాషని మాతృభాషవలె పలికే కోవిదుడు
హాస్యప్రియుడు రసజ్ఞుడు స్నేహహృదయుడు
బహుముఖ ప్రజ్ఞాశాలి, మధురభాషి, వక్త
చలనచిత్ర గానంలో చరిత్ర సృష్టికర్త
ఈటీవీ 'పాడుతా తీయగా' వేదికపై
వేలమంది చిన్నారుల తీర్చిదిద్దినాడు
కోట్లాది అభిమానుల ఇంటింటా ఒకడై
వినువీధి నుండి పాటలెన్నో వినిపిస్తున్నాడు
తానాలో పాడినపాట నాకింకా గురుతొస్తోంది
మీ స్నేహం, అభిమానం స్వర్గంలో మురిపిస్తోంది
తెలుగు పాటలెన్నో మీరు అడిగి పాడమంటుంటే
ఇంకా పాడాలని వుంది, మీతో గడపాలని వుంది.

నందమూరి తారకరామా

నిమ్మకూరి నందమూరి తారకరామా!
తెలుగందం చిరునామా నీ ముఖసీమా!
రామ కృష్ణ భీమ భీష్మ హరిశ్చంద్రుడర్జునుడై
దానకర్ణ దుర్యోధన కీచక అశోకుడై
శతచరితలు సృష్టించిన విశ్వామిత్రునివై
విక్రమార్క చంద్రగుప్త వీరబ్రహ్మేంద్రుడై
వేమనయై బృహన్నలై కట్టబ్రహ్మనై
శివుడై శ్రీనాథుడై శ్రీనివాసుడై
విష్ణుమూర్తివై యమధర్మరాజువై
విశ్వరూప సందర్శన సమ్మోహనుడై
మహాద్భుతంగా వెలిగిన మహనీయా!
మరువదు నిను తెలుగుజాతి రామారాయా!
నీ ఠీవికి రారాజే నివ్వెరబోతాడు
నీ కంఠం విని దశకంఠుడె సాధన చేస్తాడు
పులకించును నీ నటనకు పురాణేతిహాసాలు
విశ్వానికి కానుకలా నవరసవిన్యాసాలు
ఆ వాచికం,ఆంగికం, స్వప్రకాశరాజసం
గర్వకారకం తెలుగుకు ఆచంద్రతారకం



తానా సభల ప్రధాన ముఖ్య అతిథి

పల్లె తల్లి ముద్దు బిడ్డ
ముప్పవరపు వెంకయ్యనాయుడు

13వ భారత ఉపరాష్ట్రపతి

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నేత
అనర్గళ వాక్పటిమ ఆయన సొంతం
విద్యార్థి నేత దశ నుంచి దేశంలోనే రెండో అత్యున్నత పదవికి...
జాతీయ నేతగా ఎదిగినా తెలుగు గుర్తింపు కోల్పోని
అరుదైన వ్యక్తి వెంకయ్యనాయుడు

ఆయన నోట పదాలు పరవళ్లు తొక్కుతాయి... మాటలు ముత్యాల దండల్లా మురిపిస్తుంటాయి... గుక్క తిప్పుకోని వాగ్ధాటి ఎంతటివారినైనా మంత్రముగ్ధులను చేస్తుంది... వేదిక ఏదైనా... సమయం... సందర్భం ఏవైనా సరే! విద్యార్థిదశలో పడిన నాయకత్వ లక్షణాలు అంతింతై వటుడింతై అన్నట్లుగా ఎదిగి దేశంలోనే రెండో అత్యున్నత పదవి ఉప రాష్ట్రపతి పదవికి ఆయనే సరైన వ్యక్తి అని గుర్తించే స్థాయికి చేర్చాయి. మారుమూల గ్రామం, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఈ స్థాయికి చేరుకోవటానికి స్వీయప్రతిభే కారణం. కష్టాలెన్ని ఎదురైనా అచంచలమైన నిబద్ధత, నమ్ముకున్న పార్టీని చివరి వరకు అంటి పెట్టుకున్న క్రమశిక్షణ... ప్రలోభాలకు లొంగని వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచారు ముప్పవరపు వెంకయ్యనాయుడు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని చవటపాళెం మారుమూల గ్రామంలోని సాధారణ రైతు కుటుంబంలో వెంకయ్యనాయుడు జన్మించారు. పసిప్రాయంలోనే తల్లి చనిపోవటంతో మేనమామ మస్తాన్నాయుడు ఆదరణలో శ్రీరామపురంలో పెరిగారు. అక్కడి పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం నెల్లూరు వెళ్లటానికి సుమారు 6 కి.మీలు నడిచి వెళ్లాల్సి వచ్చింది. నెల్లూరులో డిగ్రీ వరకు చదివిన ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1971 ఏప్రిల్ 14న ఉషమ్మను వివాహం చేసుకున్నారు.

విలక్షణ వ్యక్తిత్వం

వెంకయ్యనాయుడిది విలక్షణమైన వ్యక్తిత్వం. ప్రతికూల పరిస్థితుల్ని సైతం అనుకూలంగా మార్చుకునే ఆయన రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరొందారు. సమయస్ఫూర్తి, వాగ్ధాటి, లౌక్యం, మాటకారితనం, కష్టపడి పనిచేసే తత్వం ఈ స్థాయికి తీసుకెళ్లాయి. విద్యార్థిదశ నుంచి నాలుగు రకాల ఉద్యమాలు వెంకయ్యని విభిన్న రాజకీయవేత్తగా మలిచాయి. విశాఖపట్నంలో న్యాయవాద విద్య అభ్యసించేటప్పుడు జైఆంధ్రా ఉద్యమంలో కీలక భూమిక నిర్వహించారు. రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించారు. విద్యార్థి నేతగా ఆవిర్భవించారు. ఉద్యమంలో అరెస్టయి తొలిసారి జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలో విద్యార్థి సంఘర్షణ సమితి పేరుతో కార్యక్రమాలు తీసుకున్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి 17 నెలలపాటు జైలులో ఉన్నారు. ఇవన్నీ ఆయన రాజకీయరంగ ప్రవేశానికి వేదికగా మారాయి. తొలిసారి 1977లో జనతాపార్టీ తరపున ఒంగోలు నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1978లో రాష్ట్రమంతటా ఇందిర ప్రభంజనం వీస్తే... నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి వెంకయ్య గెలుపొందారు. 1983లో ఎన్‌టీఆర్ ప్రభంజనంలోనూ అదే స్థానం నుంచి రెండోసారి విజయం సాధించారు. 1984లో ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కరరావు అధికారంలోకి వచ్చినప్పుడు...



ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో జరిగిన ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించారు. నాలుగు ఉద్యమాల్లోనూ వెంకయ్య నాయుడు ప్రసంగాలు అన్ని వర్గాల ప్రజల్ని ఉర్రూతలూగించాయి. 1987 డిసెంబర్ 31 నుంచి నాలుగు రోజులపాటు విజయవాడలో జరిగిన భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో 45 నిమిషాలపాటు వెంకయ్య చేసిన ప్రసంగానికి సభికుల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక పైనున్న పార్టీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీలను ఇది అమితంగా ఆకర్షించింది. జాతీయ రాజకీయాల్లో ప్రవేశానికి ఈ అంశమే దోహదపడింది. ఆపై పార్టీ జాతీయనేతగా వివిధ పదవులు నాయుడును వరించాయి. ప్రధానమంత్రిగా వాజ్‌పేయి ఉన్నప్పుడు భాజపా జాతీయ అధ్యక్షునిగా పనిచేసే అవకాశం వెంకయ్యకి లభించింది. పార్టీ రాజకీయాల్లో అదొక అత్యున్నత స్థాయి. వాజ్‌పేయి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖని, మోదీ మంత్రి వర్గంలో పట్టణాభివృద్ధి శాఖ బాధ్యతలు చూడటం విశేషం. పార్టీకి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు, రాజకీయంగా పీటముడులు విప్పాల్సి వచ్చినప్పుడు అందరి దృష్టి వెంకయ్యనాయుడు పైనే! ఎవరినీ నొప్పించిక వ్యవహారాలు చక్కబెట్టేవారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారు.

విశ్వసిస్తే... ఎంతవరకైనా వెళ్తారు

నమ్మిన సిద్ధాంతాలను చిత్తశుద్ధితో ఆచరించటం... నడిచే దారిలో ఎంత కష్టమొచ్చినా మడమతిప్పక ముందుకే సాగటం వంటి ఉన్నత లక్షణాలు వెంకయ్యనాయుడు అత్యున్నత స్థాయికి ఎదిగేలా దోహదపడ్డాయి. తెలుగువారు దేశంలోని అత్యున్నత రాజ్యాంగ బద్ధమైన పదవులన్నిటినీ నిర్వర్తించారు. నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా, పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా, కోకా సుబ్బారావు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, వీఎన్ రమాదేవి ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా సేవలందించారు. అత్యున్నత పదవిని అలంకరిస్తున్న తెలుగువారి జాబితాలో ఇప్పుడు వెంకయ్యనాయుడు కూడా చేరుతున్నారు. నిరంతర శ్రమ, నేర్చుకొనే తత్వం, తనకు అప్పగించిన పనిని 200% శ్రద్ధతో నిర్వర్తించటం, వంద శాతం ఫలితాల సాధనకు యత్నించడం, ఎవరి కష్టానైన్నా తన కష్టంగా భుజాన వేసుకొని ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధం కావడమే ఆయన్ను వ్యక్తి నుంచి వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లాయి. తెల్లని పంచె, చొక్కాతో సాధారణ వ్యక్తిగా కనిపించే వెంకయ్యనాయుడుది అత్యంత సునిశిత పరిశీలనాదృష్టి. ఒక వ్యక్తి తన ముందుకొస్తేనే ఆమూలాగ్రం అతని లోని శక్తిసామర్థ్యాలను అంచనావేసే అరుదైన తత్వం ఆయన సొంతం. నిరంతరం విద్యార్థిలా గతిశీలంగా ఉండటం, భేషజాలకు

పోకుండా వాస్తవాలను జీర్ణించుకొని మార్పును వెంటనే అంగీకరించడం ఆయనకు ప్రత్యేక వ్యక్తిత్వాన్ని తీసుకొచ్చింది.

గెలుపు ఓటములకు అతీతంగా ఎదుగుదల...

వెంకయ్యనాయుడు తన రాజకీయ జీవితంలో గెలుపు ఓటములకు ఎన్నడూ వెరవలేదు. దక్షిణ భారతదేశంలో భాజపా పునాదులు అంత బలంగా లేకపోయినప్పటికీ ఆయన ఆ పార్టీకే అంకితమయ్యారు. 1977లో ఒంగోలులో జనతాపార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు. 1978లో అదే జనతాపార్టీ తరపున ఉదయగిరి స్థానంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1978లో ఇందిరాగాంధీ ప్రభంజనంలో, 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో ఒంటరిగా పనిచేసి గెలిచారు. అయిదేళ్లపాటు అసెంబ్లీలో భాజపా శాసనసభాపక్ష నేతగా వెంకయ్యనాయుడు చూపిన వాగ్దాటి తెలుగు ప్రజలకు ఎన్నటికీ గుర్తుండేలా చేసింది. 1985లో తెలుగుదేశం పొత్తుతో ఉదయగిరి నుంచి కాకుండా ఆత్మకూరులో పోటీచేసి కొద్ది ఓట్లతో ఓడిపోయారు. ఆ ఓటమే ఆయన జీవితంలో మేలు మలుపైంది. రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాలవైపు తీసుకెళ్లింది. అప్పటివరకూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన జాతీయ రాజకీయాల్లోకి వెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సంస్థాగత నిర్మాణం కోసం ఆయన పడిన తపన, చిత్తశుద్ధి, నిజాయితీ అగ్రనేతలైన వాజ్‌పేయి, అద్వానీలను ఆకట్టుకున్నాయి. 1993లో అద్వానీ భాజపా అధ్యక్షుడైన తర్వాత వెంకయ్యను జాతీయ ప్రధాన కార్యదర్శిగా తీసుకున్నారు. అప్పటి నుంచి జాతీయపార్టీలో ఏదో ఒక పదవిలో కొనసాగుతూ వచ్చారు. 1989లో బాపట్ల లోక్‌సభ స్థానానికి, 1996లో హైదరాబాద్ లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు. 1998లో కర్ణాటక నుంచి రాజ్యసభకు వచ్చి ఇప్పటివరకూ సుదీర్ఘ పార్లమెంటు జీవితం కొనసాగిస్తూ వచ్చారు.

గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

వాజ్‌పేయ్ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిగా కొనసాగిన సమయంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన తీసుకొచ్చి గ్రామాలకు రహదారి అనుసంధానం ఏర్పరిచి సరికొత్త విప్లవం తీసుకొచ్చారు. మారుమూల గ్రామాలకు మట్టిరోడ్లు, తారురోడ్లు తెచ్చారు. ఇప్పుడు పట్టణాభివృద్ధి మంత్రిగా స్మార్ట్ సిటీలు, అమృత్ పథకాలు తెచ్చి తనదైన ముద్రవేశారు.

తెలుగుదనానికి వన్నె

వెంకయ్యనాయుడు జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగినా తెలుగువాడిగా ఉన్న గుర్తింపును పోగొట్టుకోలేదు. సాధారణంగా జాతీయస్థాయికి వచ్చిన నాయకులు తనపై ప్రాంతీయ ముద్ర పడకుండా జాగ్రత్తలు పడుతుంటారు. మాతృభాషలో మాట్లాడితే ఎక్కడ తమ స్థాయి కుంచించుకుపోతుందోనన్న భయంతో ఆంగ్లం, హిందీల్లో మాట్లాడటానికే ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ, వెంకయ్య ఇందుకు అతీతం. తెలుగు మీద ప్రేమను మాటల్లోనే కాకుండా, చేతల్లోనూ చూపారు. ఎంత స్థాయికి ఎదిగినా ధైర్యంగా తెలుగులోనే మాట్లాడారు. ఏలైనచోటల్లా తెలుగువారిని ప్రోత్సహించడంతో పాటు ఆ విషయాన్ని ధైర్యంగా చెప్పుకున్నారు. ఆయన ఎప్పుడూ వ్యక్తులను, వ్యక్తిగత విషయాలను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేయలేదు. ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా సిద్ధాంతపరమైన విమర్శలే చేశారు. ఎన్నడూ ఆ లక్ష్మణరేఖను దాటలేదు. అందుకే ఎవ్వరితోనూ వ్యక్తిగత బంధాలు దెబ్బతినలేదు. అందరూ అజాతశత్రువుగా భావించే పరిస్థితి ఉంది.

ప్రజాస్వామ్యవాది

ఎన్టీఆర్‌ను అప్పటి గవర్నర్ రామ్‌లాల్ దించేసినప్పుడు తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చేపట్టింది. భాజపా వ్యక్తి అయినప్పటికీ వెంకయ్యనాయుడు దాన్ని సొంతం చేసుకున్నారు. తెలుగుదేశం వారికంటే ఎంతో క్రియా శీలకంగా వ్యవహరించి ఎన్టీఆర్ మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టే వరకూ పోరాడారు. తాను మంచిదని భావిస్తే ఎంతవరకైనా వెళ్తారు.

అద్వానీ, వాజ్‌పేయిలు పార్టీని ఈ స్థాయికి తెచ్చిన విషయాన్ని ఆయన ఏ వేదికమీదైనా, ఎవ్వరిముందైనా చెబుతారు. తాజా పార్లమెంటరీ బోర్డు సమావేశంలోనూ మోదీ ముందే ఈ విషయం వెల్లడించారు. వారిద్దరూ పార్టీని ఒక స్థాయికి తీసుకొచ్చిన తర్వాత మరింత విస్తరించలేకపోయారన్న భావన ఆయన మనసులో ఉంది. ఆ లోటును ప్రధానమంత్రి మోదీ తీర్చగలిగారని నమ్ముతున్నారు. అందుకే ఆయన మోదీకి పూర్తి మద్దతుగా నిలిచారు. తనను సాయం కోరివస్తే సాధ్యమైనంత వరకు చేయడానికి ఎప్పుడూ వెంకయ్యనాయుడు వెనుకాడలేదు. విభిజిత రాష్ట్రానికి ఏదోఒకటి చేయాలన్న తపనతో ఢిల్లీలో పెద్ద దిక్కుగా నిలబడటమే అందుకు నిదర్శనం. కేంద్రమంత్రిగా ఉంటూ ఒక రాష్ట్రానికి పని చేస్తారనే అపవాదు వస్తుందనిపించినా ఆయన అన్యాయం జరిగిన రాష్ట్రానికి ఎంతోకొంత న్యాయం చేయాలన్న మొండిపట్టుదలతో పనిచేశారు.

దక్షిణాది వారికి సహజంగా హిందీపై పట్టు తక్కువగా ఉంటుంది. కానీ, వెంకయ్యనాయుడు తెలుగు సమానంగా హిందీలో మాట్లాడగలిగేలా పట్టు సాధించారు. పల్లె నుంచి ఢిల్లీకి ఎదిగినా పుట్టి పెరిగిన గ్రామం, జిల్లాను మరువని అరుదైన నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు వెంకయ్యనాయుడు. ఆయన జీవిత పుస్తకంలోకి తొంగి చూస్తే జ్ఞాపకాల దొంతరలు ఎన్నో! ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావమే ఆయన్ను ఇంతటి వాడిని చేసింది. చిన్నప్పుడే అమ్మను కోల్పోయిన వెంకయ్యనాయుడు పార్టీనే తల్లిగా భావించారు. ఈ విషయం పార్టీలోని ప్రతి కార్యకర్తకూ చెబుతూ స్ఫూర్తి నింపారు.

ఈనాడు సౌజన్యంతో



తానా సభల ముఖ్య అతిథి

లెజెండ్
బాలకృష్ణ

కొమ్మినేని వెంకటేశ్వరరావు

తన తల్లి పేరుతో... ఆమె చివరి కోరికను తీర్చడానికై,
తన తండ్రి సేవాదృక్పథంతో స్థాపించిన వైద్యాలయాన్ని,
తరువాత కాలంలో కుమారుడు కూడా అదే సేవానిరతితో
విజయవంతంగా ముందుకు నడిపిస్తుండడం అపూర్వం!
అది ఒక్క బాలకృష్ణకే చెల్లింది!!

సినిమా కెరీర్

కాళింది మడుగున కాళియుని పడగన... ఆనాడు బాల కృష్ణుని నృత్యకేళి చూసినవారికి కనువిందు. ఈనాడు బాలకృష్ణుని అభినయశైలి అదే రీతిన ఎందరో అభిమానులను అలరిస్తూ ఉంది. 'బాలయ్యా... బాలయ్యా... బాలయ్యా...' అంటూ అభిమాన హృదయాలు పల్లవిస్తున్నాయి. 'జై బాలయ్యా... జై జై బాలయ్యా...' అంటూ ఆ అభిమానకోటి ఆలపించే గీతాలే నందమూరి బాలకృష్ణకు మేలుకొలుపు పాట. ఆ పాటలు వింటూ అభిమానులకు నిత్యానందం పంచాలని నందమూరి బాలకృష్ణ అహరహం తపిస్తూ ఉంటారు. ఆ తపన తండ్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ యన్.టి. రామారావు నుండి వరంగా లభించిందే!

ఆ వరం... 1960 జూన్ 10న నందమూరి తారకరాముని ఇంట జన్మించిన బాలకృష్ణకు లభించింది. తారకరాముని అయిదో తనయునిగా జన్మించిన బాలకృష్ణ పుట్టిన వేళావిశేషమేమో కానీ, ఆ యేడాది యన్టీఆర్ నటనాపర్వంలోనూ విజయభేరీ మోగింది. నందమూరి ఇంట అందరూ బాలకృష్ణను 'బాలయ్యా' అంటూ మురిపెంగా పిలవడం ఆనాడే ఆరంభమయింది. చిన్నారి బాలయ్య ముద్దుమోము, చిలిపి చేష్టలు నందమూరి నివాసంలోని ఆబాల గోపాలాన్నీ ఆనాడే ఆకర్షించాయి. తండ్రి ఎన్టీఆర్‌కు బాలయ్యలో తన నటనావారసుడు ఆనాడే కనిపించాడేమో, బహు కుటుంబీకుడైన రామారావు తన అయిదో పుత్రరత్నాన్ని ప్రత్యేకంగా చూసేవారు. ఇక ఎన్టీఆర్ పెద్దమ్మ చంద్రమ్మ (ఆమె ఎన్టీఆర్‌ను పెంచిన తల్లి. అందువల్ల ఆమె అంటే నందమూరి వారింట అందరికీ ఎంతో గౌరవం) బాలయ్యను మరింత గారాబం చేసేవారు. బాలకృష్ణ దినదిన ప్రవర్ధమానం చెందుతూ అన్నలకు, అక్కలకు ప్రియసోదరుడై ఎదిగారు.

చిన్నతనంలోనే తండ్రిని, ఆయన ధరించిన పాత్రలను తదేకంగా చూస్తూ ఎదిగిన బాలకృష్ణ ఆయనను అనుకరించడం అప్పటి నుంచే ఆరంభించారు. తండ్రి సినిమాలను చూస్తూ అందులో నచ్చిన సన్నివేశాలను ఎంచుకొని తానూ అలా నటించాలని తపించేవారు. ఇక తనకంటే పెద్దవాడయిన మోహన్ కృష్ణతో కలసి బాలయ్య సినిమాల్లోలాగే కత్తియుద్ధాలు, ముష్టి యుద్ధాలు చేసేవారు. అలా ఆడుతూ పాడుతూ సాగిన బాలయ్య బాల్యం తరువాత కొన్నాళ్లకు హైదరాబాద్ చేరింది. భాగ్యనగరంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో బాలయ్య విద్యాభ్యాసం సాగింది. అక్కడే ఆయన ఆటాపాటా ఎందరో మిత్రులను సంపాదించి పెట్టింది. ఇక అతని చురుకుదనం ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. అలా టీనేజ్‌లో అడుగుపెట్టిన సమయంలోనే తండ్రి ఎన్టీఆర్ నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తాతమ్మ కలలో హీరో ఎన్టీఆర్ చిన్న కొడుకుగా నటించే పాత్రకు ఎంపిక చేశారు. బాల్యం నుంచీ బాలయ్యలోని నటనాతృష్ణను గమనించిన ఎన్టీఆర్ అందులో తనయునికి తగ్గ పాత్రను సృష్టించారు.

అదే ఆయన తీరు...

మహా నటదర్శకుడు ఎన్టీఆర్ శిక్షణలో బాలకృష్ణ రాణించారు. 'బాలయ్యను ఇక సోలో హీరోగా పరిచయం చేస్తాం,' అంటూనే ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం చేశారు.

1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీ పెట్టి కేవలం తొమ్మిది నెలల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా పట్టాభిషిక్తుడయ్యారు నందమూరి తారకరామారావు.

అనితరసాధ్యమైన చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ ఘనతను చూసి ఎందరో ఆనందించారు, కొందరు అభినందించారు, మరికొందరు అసూయ చెందారు. ఏది చేసినా అది తారకరాముడికే చెల్లింది అని కీర్తించారు. అంతటి ఘనచరితను చూడకముందే వెండితెరపై వందలాది వైవిధ్యమైన పాత్రలకు రూపుకట్టి జనం మదిలో చెరగని ముద్రవేసిన చరిత కూడా ఆ నటసార్వభౌమునిదే. నటనలో పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘికాల్లో తనదైన బాణీ పలికించిన రామారావు కీర్తి, స్ఫూర్తి తెలుగువారికి నిత్యానందం పంచింది. అంతటి మహానటుని వారసుడు, అప్పటి ముఖ్యమంత్రి తనయుడు అయిన బాలకృష్ణ తొలి సినిమా ప్రారంభోత్సవం నభూతో నభవిష్యతి అన్న రీతిలో సాగాలి. కానీ, ఆడంబరాల కంటే అణకువ, అభినయప్రతిభకే పట్టం కట్టే ఎన్టీఆర్ తనయుని అరంగేట్రానికి ఏ విధమైన ప్రత్యేక శ్రద్ధలు తీసుకోలేదు. సాదాసీదాగా అభిమానుల సమక్షంలో బాలకృష్ణ తొలిచిత్రంగా డిస్కో కింగ్ షూటింగ్ ఆరంభమయింది.

ఆరంభంలో అగ్నిపరీక్ష

అనితరసాధ్యమైన అభినయంతో విలక్షణమైన ఎన్నో పాత్రలకు సలక్షణ రూపం కల్పించి రక్తి కట్టించిన నందమూరి తారక రాముని వారసునిగా రావడమే బాలకృష్ణకు ఓ పరీక్ష. ఎన్టీఆర్ అన్న పేరే తెలుగువారికి ఓ సమ్మోహనం. ఇక ఆయన అభినయం తెలుగువారికి నిత్యారాధన. అంతటి ఘనచరిత్ర ఉన్న తారక రాముని వారసుడు అనగానే జనాల్లో అంచనాలు ఆకాశాన్నంటుతాయి. వాటిని అందుకోవడానికి బాలకృష్ణ ఇమేజ్ అప్పటికి సరిపోదు. పైగా రాజకీయనాయకునిగానూ ఎన్టీఆర్ ఓ చరిత్ర సృష్టించడంతో ఆయన అదృష్టదీపిక ఎందరి కళ్లలోనో మంటలు పుట్టించింది. ఎన్టీఆర్‌ను మహానటునిగా ఆరాధించినవారే ఆయన రాజకీయ ప్రవేశంతో ప్రత్యర్థులుగా నిలచిన తరుణం. అంటే బాలకృష్ణ సోలో హీరోగా ప్రవేశించే సమయానికే ఆయనకు ఓ వైరిపక్షం సిద్ధమైందన్న మాట. ఓవైపు అనితరసాధ్యమైన తండ్రి ఇమేజ్, మరోవైపు అనుకోకుండానే ఏర్పడిన ప్రతిపక్షం- ఇలాంటి సమయంలో బాలకృష్ణ హీరోగా అడుగుపెట్టడం నిజంగా కత్తిమీద సామే! ఇలాంటి పరిస్థితి ఇప్పటివరకు మన దేశంలోనే కాదు బహుశా ప్రపంచంలోనే ఏ నటవారసుడికీ వచ్చి ఉండదని చెప్పొచ్చు. అయినా తండ్రి నేర్పించిన 'చిరునవ్వులతో విషవలయాలను ఛేదించి ముందుకు పదవోయి...' అన్న మాటలే బాలకృష్ణను ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేలా చేశాయి. కోరుకోకుండానే చేరిన ప్రతిపక్షం ఓ మహానటుని తనయుడు అంటేనే జనం, చిత్రసీమలోని గణాలు అతని రాకకోసం ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే ప్రణాళికలు వేసి నటవారసులను పరిచయాలు చేస్తూ ఉంటారు. ఇక వారి సినిమాల విడుదలలోనూ తగిన జాగ్రత్తలు చేయడానికి ఎందరో ముందుకు వస్తూంటారు.

అయితే మహానటుడు, ఆనాటి ముఖ్యమంత్రి అయిన ఎన్టీఆర్ నటవారసుడు బాలకృష్ణ హీరోగా అరుదెంచే సమయంలో ఇలాంటివేవీ చోటు చేసుకోలేదు. ఎవరికివారు తమ కాళ్లపై తామే నిలబడాలి అనే సూత్రాన్ని తు.చ. తప్పక పాటించే ఎన్టీఆర్, తనయుని సినిమా విషయంలోనూ ఏ మాత్రం జోక్యం చేసుకోలేదు. నిజానికి ఆయనే తలచుకుంటే బాలకృష్ణ హీరోగా నటించే తొలి సినిమాకు ఎంతటి ఉత్సవాలు జరిగేవో వేరే చెప్పాలా?

మంగమ్మగారి మనవడు జైత్రయాత్ర

నవ్వినా నాపచేనే పండుతుంది అన్నట్టుగా బాలకృష్ణ నటనను చూసి, ఆయన సినిమాలను చూసి విమర్శించిన వారికి నాలుగో చిత్రం మంగమ్మగారి మనవడు తగిన సమాధానం చెప్పింది. ఎన్టీఆర్‌కు ఉన్న ఇమేజ్‌ను, ఆయన ఫాలోయింగ్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్మాత ఎస్. గోపాల్ రెడ్డి, దర్శకుడు కోడి రామకృష్ణ మంగమ్మగారి మనవడును తెరకెక్కించారు. 1984 సెప్టెంబర్ 7న మంగమ్మగారి మనవడు విడుదల యింది. బాలకృష్ణ తొలిచిత్రం తాతమ్మకలలో ఆయనను జయీభవా అని ఆశీర్వదించిన తాతమ్మ పాత్రధారి భానుమతి, మంగమ్మగారి మనవడులోనూ నాన్నమ్మగా నటించడం కాక తాళీయమే అయినా, బాలయ్య తొలివిజయంలో ఆవిధంగానూ భానుమతి పాత్ర పోషించడం విశేషంగా నిలచింది. ఈ సినిమా విడుదలయిన ఎనిమిది రోజులకే తారకరాముడు మళ్లీ పట్టాభిషిక్తుడు కావడంతో మంగమ్మగారి మనవడు జైత్రయాత్రకు ఎదురే లేకుండాపోయింది.

అరుదైన ఘనత

నాలుగో చిత్రంతో బాలకృష్ణకు లభించిన విజయం చూసి నవ్వినవారే నభూతో నభవిష్యతి అని కీర్తించారు.

భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై బాలకృష్ణతో గోపాల్ రెడ్డి నిర్మించిన నాలుగు చిత్రాలు త్రిశతదినోత్సవం జరుపుకోగా, అందులో మూడు స్వర్ణోత్సవాలు, ఒకటి ప్లాటినమ్ జూబ్లీ. ఇలా ఒకే సంస్థలో వరుసగా నాలుగు అరుదైన విజయాలను నమోదు చేసిన ఘనత బాలకృష్ణ సొంతమయింది.

తండ్రికి తగ్గ తనయుడే!

మహానటుడు ఎన్టీఆర్ తరువాత పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘికాల్లో మెప్పించిన కథానాయకుడుగా బాలకృష్ణ నిలచిపోయారు. ముఖ్యంగా బాలకృష్ణ తరం హీరోల్లో ఎవరూ ఆయనలా నాలుగురకాల చిత్రాల్లో నటించినవారు లేరు. ఎన్టీఆర్ తనయుడు కావడంతో బాలకృష్ణకు కూడా తండ్రిలాగా పలు పాత్రలకు నప్పే శరీరాకృతి ఉండేది. ముఖ్యంగా ప్రొఫైల్ లో తండ్రినే

తలపించేలా ఉండేవారు బాలకృష్ణ. ఆ కళాత్మక రూపమే బాలకృష్ణను సిద్ధయ్యగా, శ్రీకృష్ణదేవరాయలుగా, శాతకర్ణిగా, హరిశ్చంద్రుడిగా, దుష్యంతుడిగా, శ్రీరాముడిగా, శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, జానపద నాయకుడిగా నిలచిపోయేలా చేసింది.

ఇక సాంఘికాల్లో తండ్రి ధరించని వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ ముందుకు సాగారు బాలకృష్ణ. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు వాళ్ల నాన్న అధికారంలో ఉన్నాడు కాబట్టే బాలకృష్ణ హీరోగా రాణిస్తున్నాడు అని ప్రచారం చేసినవారూ ఉన్నారు. ఎన్టీఆర్ ప్రతిపక్షంలో కూర్చున్న సమయంలోనూ బాలకృష్ణ పోషించిన వైవిధ్యమైన పాత్రలను చూసి అలాంటివారు నోళ్లు వెళ్లబెట్టారు.

అనంతరం మనం ట్రెండ్‌ను ఫాలో కాము, మనమే ట్రెండ్‌ను సృష్టిస్తాము అన్నట్టుగానే బాలకృష్ణ నటజీవితం సాగింది. తన తరం హీరోలతో పోటీపడి పలు విజయాలను మూటకట్టుకున్న బాలకృష్ణ, తరువాతి తరం హీరోలతోనూ పోటీకి సై అంటున్నారు.

బాలకృష్ణ రాజకీయాలు

చిత్రసీమకు, రాజకీయాలకు ఏనాటి నుంచో అనుబంధం ఉన్నా, తెలుగునాట ఆ బంధాన్ని బలోపేతం చేసినవారు నందమూరి తారకరామారావు. అటు చలనచిత్రసీమలోనూ, ఇటు రాజకీయరంగంలోనూ ఎన్టీఆర్ సాధించిన అరుదైన విజయాలను తెలుగువారు ఎన్నటికీ మరచిపోలేరు. ఎన్టీఆర్ నటనావారసుడిగా జనాన్ని అలరించిన బాలకృష్ణ రాజకీయరంగంలోనూ తొలినుంచీ ఉత్సాహంగానే పాల్గొన్నారు. ఎన్టీఆర్ 1982లో తెలుగుదేశం పార్టీ నెలకొల్పినప్పుడు ఆ ర్యాలీలో అభిమానులతో కలసి ముందున్నారు బాలకృష్ణ. తెలుగుదేశం ఆవిర్భావంతో అప్పటిదాకా తెలుగునేలపై ఏకఛత్రాధిపత్యం సాగించిన కాంగ్రెస్ పార్టీ గుండెల్లో గుబులు మొదలయింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఓసారి, వాయిదా వేయాలని మరోసారి ఊగిసలాడుతూ అప్పటి ప్రభుత్వం అనూహ్యంగా ఎన్నికల తేదీని ప్రకటించింది. దాంతో చైతన్యరథసారథియై ప్రజల వద్దకు వెళ్లిన ఎన్టీఆర్ నాటి ఆంధ్రప్రదేశ్ నలుచెరుగులా అనుకున్న ప్రకారం పర్యటించలేకపోయారు. అదే సమయంలో బాలకృష్ణకు, వసుంధరతో కళ్యాణం నిశ్చయమయింది. ఎన్టీఆర్ ఇక ఈ జీవితం మీది అంటూ ప్రజల వద్దకు పోవడానికే ప్రాధాన్యమిచ్చారు. అందువల్ల తిరుమలలో జరిగిన బాలకృష్ణ, రామకృష్ణ వివాహానికి యన్టీఆర్ హాజరు కాలేకపోయారు.

బాలకృష్ణకు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల తాకిడి మొదలయింది. ఒక్కసారి వచ్చి తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేస్తే తాము గెలిచిపోతామని వారు ప్రాదేయపడ్డారు. పైగా తన తండ్రి స్థాపించిన పార్టీ కాబట్టి బాలకృష్ణ వారి మాట కాదనలేకపోయారు. వారితో ప్రచారానికే ముందడుగు వేశారు. ఆ కొనసాగింపుగానే ఎన్టీఆర్ పోటీ చేసిన మూడు నియోజకవర్గాల్లోనూ బాలకృష్ణ ప్రచారం చేసారు. ఆయన ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లోనూ దాదాపుగా తెలుగుదేశం విజయ పతాక ఎగురవేసింది. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఎన్టీఆర్ 'దిసీజ్ బాలాస్ విక్టరీ,' అని అభినందించారు.

తిరిగి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ తమ తెలుగుదేశం పార్టీ తరపున బాలకృష్ణ ప్రచారం చేశారు. ఆసారి తెలుగుదేశం పార్టీ అనూహ్య విజయం సాధించింది. కాంగ్రెస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా చేసింది.

2014లో హిందూపురం నియోజకవర్గం నుండి తెలుగు దేశం అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటివరకు హిందూపురంలో తెలుగు దేశం పార్టీ అపజయమెరుగలేదు. అందువల్లే బాలకృష్ణకు ఆ నియోజక వర్గం కేటాయించారు అని కొందరు అన్నారు. నిజానికి అంతకు ముందు ఉన్న కొందరు ప్రతినిధుల కారణంగా తెలుగు దేశం పార్టీ ఆ నియోజకవర్గంలో బలహీనపడింది. దానిని బలోపేతం చేయడానికే బాలకృష్ణ ఆ నియోజకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎందు కంటే ఎన్టీఆర్ హిందూపురం నియోజకవర్గం నుంచే వరుసగా మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

ఇక హిందూపురం నియోజకవర్గం శాసనసభ్యుడిగా బాలకృష్ణ తనదైన బాణీ పలికిస్తున్నారు. అక్కడ మహిళలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని దూరప్రాంతాలకు వెళ్లడం చూసిన బాలకృష్ణ ముందు తన నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని భావించారు. ఆ దిశగానే అడుగులు వేసి అనతి కాలంలోనే మంచినీటి సమస్యను పరిష్కరించారు.

"నాన్నగారు తన జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకొని భావితరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. అదే దిశగా నేనూ సాగాలని కోరుకుంటున్నాను. నా కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు నన్ను ఆదరించినవారి కోసం పాటు పడతాను," అంటున్నారు బాలకృష్ణ. మరి తండ్రి బాటలోనే పయనించి రాజకీయరంగంలోనూ బాలకృష్ణ అరుదైన విజయాలను నమోదు చేస్తారేమో చూద్దాం.

బాలకృష్ణ సేవారంగం

తెలుగునాట ఏ ఉపద్రవం సంభవించినా తనవంతు కృషిగా సాయం చేయడానికి ఎన్టీఆర్ ముందుండేవారు. మనలను ఆదరించి, ఆరాధించే జనానికి చేతనైనా సాయం చేయాలి అనే ఆలోచన యన్టీఆర్ కు ముందునుంచీ ఉండేది. అయితే చేతనైన సాయం చేసి ఊరుకోరాదని, నటుడివి కాబట్టి నీ ఇమేజ్ ఉపయోగించి, దానివల్ల జనానికి మరింత సాయం చేయవచ్చునని ఎన్టీఆర్‌కు సలహా ఇచ్చింది ఆనాటి 'ఆంధ్రప్రభ' సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు. ఆయన ప్రేరణతో ఎన్టీఆర్ 1952లో రాయలసీమ క్షామనివారణకు నిధి వసూలు చేసిచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖకు నిధిని సమకూర్చి ఇవ్వడంలోనూ ఎన్టీఆర్ జోలె పట్టారు. ఆ తరువాత తెలుగునేలపై ఎలాంటి ఉపద్రవం సంభవించినా ఎన్టీఆర్ విరాళాలు సేకరించి, ప్రభుత్వాలకు అందజేయడంలో ముందుండేవారు. 1977లో సంభవించిన దివిసీమ ఉప్పెన సమయంలోనూ ఎన్టీఆర్, ఏయన్నార్ జోలె పట్టి విరాళాలు సేకరించారు. ఎన్టీఆర్ తన దరిచేరిన ఆర్తులకు ఏదో ఒక రూపంలో సాయం చేయడానికే తపించేవారు. కుడిచేత్తో చేసేది ఎడమచేయికి కూడా తెలియనివ్వరాదంటూ ఎన్టీఆర్ పలు గుప్తదానాలు చేశారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. అదే లక్షణం బాలకృష్ణకు కూడా వచ్చింది. 1986లో వరదబాధితుల సహాయార్థం అప్పట్లో నటీనటుల్లో బాలకృష్ణనే అందరికన్నా ఎక్కువ విరాళం ఇచ్చారు. అయితే 2012లో కర్నూలు, మహబూబ్ నగర్ వరదబాధితుల సహాయార్థం బాలకృష్ణ ఎంత కృషి చేశారో అందరికీ తెలిసిందే.



ఇప్పుడు 'బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్' చైర్మన్‌గా ఆయన వ్యవహరించే తీరు కూడా అక్కడ పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. చీఫ్ డాక్టర్స్ మొదలు చప్రాసీదాకా అందరికీ గౌరవమిస్తూ సాగుతున్నారు బాలకృష్ణ. గతంలో కంటే మేలురకమైన వైద్యాన్ని అందించడానికి బాలకృష్ణ ప్రోత్సాహమే కారణమని అక్కడ పనిచేసేవారి అభిప్రాయం. తమ ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచిత వైద్యాన్ని అందించడానికి తగిన నిధుల కోసం బాలకృష్ణ తరచూ విదేశీ పర్యటనలు చేస్తూ ఉన్నారు. అక్కడి తెలుగువారు బాలకృష్ణ మీద అభిమానంతోనూ, ఆయన సేవానిరతిని చూసి విరాళాలు అంద జేస్తున్నారు. బాలకృష్ణ చూపించే గౌరవమర్యాదలు చూసి అక్కడ పనిచేసే డాక్టర్లు, సిబ్బంది కూడా ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నారు. బయట ఆసుపత్రుల్లో మరింత హెచ్చుగా జీతాలు ఇస్తామని కొందరు వైద్యులకు అవకాశాలు వస్తూన్నా, 'బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్' చేస్తున్న సేవాకార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని అక్కడే ఉండాలని నిర్ణయించుకున్న సేవాతత్పరులు కూడా ఉన్నారు. బాలకృష్ణ నిర్వహణలో ఈ హాస్పిటల్ 'నీతి ఆయోగ్' ద్వారా తెలంగాణ రాష్ట్రంలో లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న ఏకైక హాస్పిటల్‌గా గుర్తింపు పొందింది. అలాగే ఇప్పుడు దేశంలోనే క్యాన్సర్ సర్వీసులో బెస్ట్ హాస్పిటల్‌గా రెండవ ర్యాంకు పొందింది.

తన తల్లి పేరుతో... ఆమె చివరి కోరికను తీర్చడానికై, తన తండ్రి సేవాదృక్పథంతో స్థాపించిన వైద్యాలయాన్ని, తరువాత కాలంలో కుమారుడు కూడా అదే సేవానిరతితో విజయవంతంగా ముందుకు నడిపిస్తుండడం అపూర్వం! ఒక రాజు చనిపోయిన తన భార్య స్మారకచిహ్నంగా తాజ్‌మహల్ కట్టించాడని చరిత్రలో చదువు కున్నాం. ఇక్కడ ఒక ప్రజాపాలకుడు దివంగతురాలైన తన భార్య పేరుమీద, ఆమెలా కేన్సర్ సోకిన రోగులందరికి వైద్యసేవ అందించి ఉపశమనం కలిగించడానికై స్థాపించిన ఒక వైద్యాలయాన్ని వర్తమానంలో చూస్తున్నాం. సినిమా, రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉంటూ కూడా ఈ హాస్పిటల్‌కోసం బాలకృష్ణ వెచ్చిస్తున్న సమయం, శక్తియుక్తులు, సేవాతత్పరత ఆయనకు తన తల్లిదండ్రులపట్ల గల ప్రేమాభిమానాలను, పూజ్యభావాన్ని సూచించడమేకాక... ఆయన లోని దీక్షాదక్షతలను, సమర్థతను, సేవాతత్వమును కూడా నిరూపిస్తున్నాయి. ఈ విధంగా సినిమా, రాజకీయ, సేవారంగాలలో ఏక కాలంలో శ్రమిస్తూ అరవైల వయసులో కూడా ఇరవైల స్ఫూర్తితో ముందుకు సాగుతున్న బాలకృష్ణ మునుముందు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుందాం.



కొమ్మినేని వెంకటేశ్వర రావు నాలుగు దశాబ్దాలుగా సినీరంగంతో మమేకమైన అనుభవజ్ఞుడు. తెలుగు సినిమా పంపిణీ, ప్రదర్శన, నిర్మాణరంగాల్లో విస్తృతంగా ప్రయాణించిన చలనచిత్ర ప్రేమికుడు. చిన్ననాటి నుండి ఎన్టీఆర్ ఆరాధకుడు. ఎన్టీఆర్ అపురూప చిత్రాలను వెలికితీసి ప్రజాబాహుళ్యంలో ఉంచిన విలువైన అభిమాని. ఎన్టీఆర్ సినిమాలపై ఇంత విస్తృతమైన, విశిష్టమైన సమాచారం అందుబాటులో ఉండడానికి ప్రథమ కారకుడు. నివాసం హైదరాబాద్.



తానా సభల ముఖ్య అతిథి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ

చిన్నప్పటి నుంచి ఏ సాహిత్య పుస్తకాన్ని వదిలేవాడ్ని కాదు. గురజాడ, విశ్వనాథ, శ్రీశ్రీ, మాలతీచందుర్, రాచకొండ విశ్వనాథశాస్త్రి, రంగనాయకమ్మ నా అభిమాన రచయితలు.

అచ్చ తెలుగు రూపం... తెలుగుభాష అంటే ప్రాణం... హుందా తనానికి ప్రతిరూపం... మాటల్లో స్పష్టత... చేతల్లో ఖచ్చితత్వం... సత్వర న్యాయ ఆకాంక్ష... మధ్యవర్తిత్వం పట్ల అభిలాష... న్యాయ వ్యవస్థ పట్ల అపారమైన విశ్వాసం... గత సంవత్సరం 48వ భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ ఎన్.వి. రమణ గురించి తలుచుకున్న వెంటనే గుర్తుకొచ్చే కొన్ని లక్షణాలు ఇవి.

భారత న్యాయవ్యవస్థలో అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన రెండవ తెలుగు తేజంగా చరిత్ర పుటల్లో స్థానం దక్కించుకున్నారు జస్టిస్ ఎన్.వి. రమణ. తనపై ప్రజలకున్న అంచనాలను అందుకు నేందుకు అహర్నిశలు శ్రమించారు. న్యాయవ్యవస్థను వేధిస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి అవసరమైన మార్గాలు కూడా సూచించారు. తన పరిధిలోని అంశాలను వేగంగా పరిష్కరించి భావి ప్రధాన న్యాయ మూర్తులకు మార్గదర్శిగా మారారు. ఇంతకు ముందు పనిచేసిన ప్రధాన న్యాయమూర్తులతో పోలిస్తే, జస్టిస్ రమణ సుప్రీంకోర్టు తలుపులను ప్రజలకు బార్లా తెరిచారు. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ప్రజల మనసులను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. తనకు వచ్చే ఉత్తరాలకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ సర్వోన్నత న్యాయ స్థానాన్ని సాధారణ ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేసారు. హక్కులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తే, వారే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటారన్న నమ్మకంతో ప్రజాచైతన్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

జస్టిస్ రమణ సాధారణ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వారి కష్టాలు ఆయనకు బాగా తెలుసు. అందుకే సత్వర న్యాయం అందించడం ద్వారా వారిని ఆదుకోవాలని తపించారు. అందుకోసం మధ్య వర్తిత్వాన్ని ఎంచుకునే ప్రక్రియను వేగవంతం చేసారు.

న్యాయవ్యవస్థను భారతీకరించాలన్న వాదనను జస్టిస్ రమణ ప్రతి వేదికపై వినిపిస్తూ వచ్చారు. ప్రజలు, న్యాయవ్యవస్థ మధ్య బంధాన్ని బలోపేతం చేయాలన్నది ఆయన ఉద్దేశం. భారతీయ న్యాయవ్యవస్థలో నియమ నిబంధనలను సంస్కరించి, మౌలిక వసతులను మెరుగుపరచి భాషాపరమైన అవరోధాలతో సహా అన్ని రకాల అవాంతరాలను తొలగించి, సామాన్యుడు ధైర్యంగా కోర్టును ఆశ్రయించే వ్యవస్థను తీర్చిదిద్దాలని ఆయన కలలు కన్నారు. ఆ కలలు సాకారం చేసుకునేందుకు తనున్న కొద్దికాలంలోనే పరిష్కారాలను అన్వేషించి, మార్పును సుగమం చేసారు.

న్యాయమూర్తిగా ప్రస్థానం

కృష్ణా జిల్లా, వీరులపాడు మండలం, పొన్నవరంలో 1957 ఆగస్ట్ 27న సాధారణ వ్యవసాయ కుటుంబంలో నూతలపాటి గణపతిరావు, సరోజినీదేవి దంపతులకు జన్మించిన ఆయన కృషితో నాఃనస్తి దుర్భిక్షం అన్న నానుడిని నిజం చేసి రోసారి తెలుగుజాతి కీర్తిని ఇనుమడింపజేసారు. 38 ఏళ్ల క్రితం న్యాయవాదిగా అడుగుపెట్టిన ఆయన వివిధ ప్రభుత్వరంగ సంస్థల స్టాండింగ్ కౌన్సెల్‌గా అదనపు అడ్వొకేట్ జనరల్‌గా పనిచేసారు. న్యాయవాదిగా సివిల్, క్రిమినల్, రాజ్యాంగం, కార్మిక, ఉద్యోగ సేవలు, ఎన్నికలకు సంబంధించిన విషయాల్లో ప్రావీణ్యం సంపాదించారు. 2000 జూన్

27న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడే తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి స్థాయికి చేరారు. 2013 సెప్టెంబర్ 2న ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, దేశ రాజధానికి చేరారు. 152 రోజులపాటు ఆ పదవిలో కొనసాగిన అనంతరం 2014 ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయ మూర్తిగా 7 ఏళ్ల 66 రోజుల సుదీర్ఘ అనుభవం సొంతం చేసుకున్న తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.



ఎన్నెన్నో కీలక తీర్పులు

న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్.వి. రమణ 156కి పైగా తీర్పులు వెలువరించారు. ఇంటర్నెట్ ద్వారా వ్యక్తం చేసే అభిప్రాయం భావస్వేచ్ఛ క్రిందికే వస్తుందని జమ్మూ కాశ్మీర్ కేసులో ఇచ్చిన తీర్పు ద్వారా ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కులో అంతర్భాగం చేసారు. పన్నులు విధించే హక్కు రాష్ట్రాలకు ఉంటుందని ఇచ్చిన తీర్పు ద్వారా సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు ఉన్న హక్కులకు భద్రత కల్పించారు. మానసిక వైకల్యాన్ని సాకుగా చూపి నేరం నుంచి తప్పించుకోలేరని, దానికి ఆస్పత్రులో చూపించుకున్న ఓపిడి కార్డు కాపీ, తల్లి వాంగ్మూలం లాంటివి సరిపోవని, బలమైన ఆధారాలు ఉండాలని చెప్పి నేరగాళ్లు తప్పించుకోకుండా చట్టం బిగించారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గం, స్పీకర్లను సంప్రదించకుండా అసెంబ్లీ సమావేశాలను ముందుకు జరుపుతూ అరుణాచల్‌ప్రదేశ్ గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులను కొట్టివేయటం ద్వారా రాజ్యాంగ సూత్రాలకు పట్టం కట్టారు.

తెలుగు భాష అంటే ప్రాణం

జస్టిస్ ఎన్.వి. రమణకి తెలుగుభాష అన్నా, తెలుగు సాహిత్యం అన్నా ఎనలేని అభిమానం. తను ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో తెలుగు రచయితల, ముఖ్యంగా రావిశాస్త్రి రచనల నుంచి అనేక ఉదాహరణలు ఉల్లేఖించేవారు. తెలుగుభాష గురించి ఇవీ ఆయన అభిప్రాయాలు-

"నేను ముందు నుంచి తెలుగుమీడియమే. డిగ్రీ కూడా అందులోనే చదువుకున్నాను. అసలు ఎ, బి, సి, డిలు నేర్చుకున్నదే ఎనిమిదవ తరగతిలో. న్యాయవిద్యలోకి వచ్చాక ఇంగ్లీషు మీడియంలో చదవక తప్పలేదు. అది నాకు పెద్ద కష్టంగా అనిపించ లేదు. కాకపోతే, సామాన్యులకు తోడునీడగా ఉండాల్సిన చట్ట వ్యవహారాలు కేవలం ఇంగ్లీషులోనే ఉండడం సరికాదని కెరియర్ ప్రారంభం నుంచే నమ్ముతూ వచ్చాను. తల్లిపాలను హరాయించు కోవడం బిడ్డకు ఎంత తేలికో మాతృభాషను అర్థం చేసుకోవడం మనిషికి అంత తేలిక. అందువల్లే జ్యుడీషియల్ అకాడెమి అధ్యక్షుడిగా తీర్పు కాపీలు వంటివి తెలుగులోనే ఉండాలనే ప్రతిపాదన తీసుకువచ్చి కొంతవరకైనా అమలయ్యేలా చూసాను. చట్టాలకి సంబంధించిన పుస్తకాలు ఎలాగూ తెలుగులో చదవక తప్పదు. కానీ, అవి తప్ప మిగతావన్నీ తెలుగులోనే చదవడానికి ఇష్టపడతాను. చిన్నప్పటి నుంచి ఏ సాహిత్య పుస్తకాన్ని వదిలేవాడ్ని కాదు. గురజాడ, విశ్వనాథ, శ్రీశ్రీ, మాలతీచందుర్, రాచకొండ విశ్వనాథశాస్త్రి, రంగనాయకమ్మ నా అభిమాన రచయితలు. అంతేకాదు, అది ఎంత పెద్ద అంతర్జాతీయ కార్యక్రమమైనా తెలుగు రాష్ట్రాల్లో జరిగితే నేను తెలుగులోనే మాట్లాడతాను. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రసంగం అంతా ఇంగ్లీషులో మాట్లాడినా, చివరి రెండు నిమిషాలయినా తెలుగులో మాట్లాడకపోతే, నా మనసు ఊరుకోదు."

దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి కావటం గొప్ప విషయమే. కానీ, ఎదుగుదల అంటే ఉన్నత పదవి, హోదా మాత్రమే కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ధర్మమార్గాన్ని వీడని మనిషిగా ఎదగడం అని బలంగా నమ్మే జస్టిస్ ఎన్.వి. రమణ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసినా వివిధ రకాలుగా ప్రజలకు చేరువగా ఉంటున్నారు.

ఈనాడు సౌజన్యంతో

తెలుగు రాష్ట్రాల్లో వైభవంగా తానా చైతన్య స్రవంతి

వైద్య శిబిరాలు... కుట్టుమిషన్లు, సైకిళ్ళపంపిణీ, స్కాలర్ షిప్‌ల సహాయం





తెలుగు రాష్ట్రాల్లో 2022-23 సంవత్సరంలో డిసెంబర్ 2 నుంచి జనవరి 7 వరకు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన తానా చైతన్య స్రవంతి కార్యక్రమాలు మునుపెన్నడూ జరగనంత స్థాయిలో వైభవంగా, దిగ్విజయంగా జరిగింది. రికార్డు స్థాయిలో వైద్య శిబిరాలు, విద్యార్థుల చదువుకోసం వేలాది రూపాయల స్కాలర్ షిప్ ల పంపిణీ, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, ఆడ పిల్లలకు సైకిళ్ళ పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారాధన పేరుతో సీనియర్ నటీనటుల సన్మానం వంటి కార్యక్రమాలు, రైతులకు రక్షణ పరికరాలతోపాటు, సేద్యం పరికరాల పంపిణీ వంటివి ఈ చైతన్య స్రవంతి కార్యక్రమంలో భాగంగా జరిగాయి.

అనంతపురం నుంచి ప్రారంభమైన చైతన్యస్రవంతి సేవా కార్యక్రమాలు చిత్తూరు జిల్లాలో జరిగిన కార్యక్రమాలతో ముగిశాయి. ఈ చైతన్య స్రవంతి కార్యక్రమాలకోసం అమెరికా నుంచి 20 నుంచి 25 మంది తానా సభ్యులు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి సేవలు అందించారు. అటు వైద్యం, ఇటు సాంస్కృతికం, మరోవైపు భాష, కమ్యూనిటీకి ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించుకుని సభ్యుల మద్దతుతో, దాతల విరాళాలతో ఈ సేవా కార్యక్రమాలను రికార్డు స్థాయిలో చేయడం జరిగింది.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో తానా చైతన్య స్రవంతి కార్యక్రమాల్లో వైద్యసేవలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఆస్ట్రీ చోట్ల క్యాన్సర్ క్యాంపులు, కంటి పరీక్షలు, ఇఎన్‌టి శిబిరాలు వంటివాటిని ఏర్పాటు చేసి ఎంతోమందిని పరీక్షించి వారికి అవసరమైన మందులను, కళ్ళజోళ్ళను పంపిణీ చేయడం జరిగింది. అలాగే రైతుకోసం కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులకు రైతు రక్షణ పరికరాలను, చేయూత కార్యక్రమం ద్వారా పలువురు విద్యార్థులకు స్కాలర్ షిప్ లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు వీల్ చైర్ లు, ఆడపిల్లలకు సైకిళ్ళ పంపిణీ వంటివి కూడా వివిధ ప్రాంతాల్లో చేయడం జరిగింది.

గ్రామీణ కళలు, జానపద నృత్య ప్రదర్శనలు మరుగున పడిపోకుండా, కళాకారుల చేయూతను అందించి, వారిని ప్రోత్సాహిస్తూ, మన గ్రామీణ ఆట పాటలు, సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళలు మనతో పాటు, భావితరాలు వాటి ప్రాముఖ్యతను తెలుసుకొని ఆనందించేలా ఉండటంకోసం 'తానా' చైతన్య స్రవంతి













కార్యక్రమంలో వివిధ కళా నృత్యాలను ప్రదర్శించడం జరిగింది. గంగ జాతర జానపద నృత్యాలు, బాలికల గ్రూపుతో చెక్క భజనలు నిర్వహణ, తెలుగు గ్రామీణ విశిష్టతను తెలియ చేసే డప్పుల ప్రదర్శన,

ప్రత్యేక తెలుగు జానపద వాయిద్యాలతో జానపద కళా ప్రదర్శన, శాస్త్రీయ(క్లాసికల్) నృత్య ప్రదర్శన వంటి వాటిని ఈ కార్యక్రమాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. రాజన్న డోలు, యక్షగానం, కొమ్మకోయ, బుర్రకథ, కోలాటం పోతురాజుల విన్యాసాలు వంటివి కూడా ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రదర్శించడం జరిగింది.

వైజాగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి గీతాలను రెండు, మూడు భాగాలుగా ప్రచురించిన పుస్తకాలను తానా ఆవిష్కరించింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తెలుగు చలన చిత్ర రంగంలోని ప్రముఖులను సత్కరించడం కోసం 'కళారాధన' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సీనియర్ నటీనటులను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించింది. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో డిసెంబర్ 16వ తేదీన నిర్వహించిన 'తానా కళారాధన' కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, నాటి సినీ నటీనటులు కృష్ణవేణి, నటులు కోట శ్రీనివాసరావు, మురళీమోహన్, గిరిబాబు, గాయని సుశీల, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, దర్శకుడు కోదండరామిరెడ్డితోపాటు గాయని సునీత, మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖుల సేవలను గుర్తిస్తూ వారిని తానా తరపున సత్కరించింది.

తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి లావు, తానా ఫౌండేషన్ చైర్మన్ వెంకటరమణ యార్లగడ్డ, మహాసభల కన్వీనర్ రవి పొట్లూరి సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా జరిపాము. ఈ కార్యక్రమాలకు సహకరించిన, ఏర్పాటు చేసిన తానా ఇసి సభ్యులకు, ఫౌండేషన్ ట్రస్టీలకు, బోర్డు సభ్యులకు నా ధన్యవాదములు...

సునీల్ పంట్ర

కో ఆర్డినేటర్, చైతన్యస్రవంతి

(2022-23)











Prime Healthcare

Saving hospitals. Saving jobs. Saving lives.

In 2001, Dr. Prem Reddy founded Prime Healthcare and has grown it into one of the most prominent health systems in the nation, with 45 hospitals and more than 300 outpatient locations in 14 states. Among numerous accolades, Prime Healthcare has been recognized as one of the "15 Top Health Systems" in the nation three times. Since 2003, Prime Healthcare hospitals have been recognized 66 times among the "100 Top Hospitals" in the nation.



Prime Healthcare is the largest private, physician-founded, physician-led hospital system in the United States.



"My deep appreciation for all the good work that the Telugu Association of North America (TANA) accomplishes."

Prem Reddy, MD, FACC, FCCP
Founder, Chairman, President & CEO

TRUVEN HEALTH ANALYTICS
15 TOP HEALTH SYSTEMS

merative
100 Top Hospitals®

తానా డా॥ కాకర్ల సుబ్బారావు జీవన సాఫల్య పురస్కారం



కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా దంపతులకు...

నలభై ఏళ్ల క్రిందటి మాట. తమిళనాడు తిరుత్తణిలోని నెమలి గ్రామం. ఒక చిన్న వ్యవసాయ కుటుంబం. అరక దున్నటంతో మొదలైన కృష్ణ ఎల్లా ప్రయాణం ప్రపంచ యవనిక పై వ్యాధుల బాధల నుండి విముక్తి చేసే వాక్సిన్‌ని కనుగొనటం వరకు కొనసాగింది. మరీ ముఖ్యంగా ఇటీవల కాలంలో కోవిడ్ మహమ్మారి నుంచి మానవాళిని కాపాడడంలో ప్రముఖ పాత్ర వహించిన కో వాక్సిన్ రూపకల్పనలో కృష్ణ ఎల్లా, వారి శ్రీమతి సుచిత్ర ఎల్లాల కృషి అమోఘమైనది, అపూర్వమైనది.

అమెరికాలోని విస్కాన్సిన్ యూనివర్శిటీలో ఆయన మాస్టర్స్ డిగ్రీ పొందితే, ఆమె బిజినెస్ డెవలప్‌మెంట్‌లో డిప్లొమా తీసుకున్నారు. ఆ తరువాత కృష్ణ ఎల్లా పరిశోధన వైపు మళ్లి టీకాల తయారీపై దృష్టి పెట్టారు. అప్పుడు సుచిత్రలో ఆలోచన మొదలైంది. అవి భారత దేశానికి ఉపయోగపడాలని భావించారు. అలా మొదలైన ఆలోచన 1996లో హైదరాబాదులో భారత్ బయోటెక్ సంస్థ స్థాపించే వరకు వెళ్లింది. ముందు కామెర్లకు టీకాలను తయారుచేసారు. 1700 రూపాయలకు దొరికే టీకాని కేవలం 50 రూపాయలకే అందించడంతో దేశ ఆరోగ్యరంగం దృష్టి తొలిసారి వీళ్లపైన పడింది. స్వైన్ ఫ్లూకి టీకా కనిపెట్టారు. జికా వైరస్‌కు, చికెన్ గున్యాకి... ఇలా పదహారు రకాల ప్రాణాంతక వైరస్‌ల నుంచి రక్షణ కోసం టీకాలు తయారుచేసారు.

1920 జనవరి మొదటి వారం. ప్రమాదకరమైన వైరస్ ప్రపంచానికి పెనుముప్పుగా రాబోతోంది అని ఒక వార్త. మరో రెండు నెలల్లో ఆ వార్త వాస్తవమై, లక్షలాది మందిని కబళించడం మొదలెట్టింది. భారత్ బయోటెక్ శాస్త్రజ్ఞులు కృష్ణ ఎల్లా నాయకత్వంలో రంగంలోకి దిగారు. రోజుకి 18 గంటల పని. శాస్త్రజ్ఞులు అందరూ రోజుల తరబడి కుటుంబానికి దూరంగా ఉండిపోయారు. టీకా తయారయినా, జంతువుల పై ప్రయోగం విజయవంతమయినా మనుష్యుల పై ప్రయోగం చెయ్యడానికి తొలి ఇంజక్షన్‌ను తానే వేసుకున్నారు కృష్ణ ఎల్లా. అరవై అయిదేళ్ల వయస్సులో ఆ సాహసానికి ఒడికట్టడం చిన్న విషయమేం కాదు. 1921 జనవరిలో కేంద్ర ప్రభుత్వం కో వాక్సిన్‌కు అనుమతి ఇవ్వగానే సహజంగానే ప్రతికూల వార్తలు వెలువెత్తాయి. మూడో దశ ప్రయోగాలు కాకుండా అనుమతి ఎలా ఇస్తారంటూ ప్రశ్నించాయి. మొత్తం మీద ఎన్ని వివాదాలు రేగినా కాలం నిజాన్ని నిగ్గు తేల్చింది. మిగతావాటి కన్నా కో వాక్సిన్ టీకాలో సైడ్ ఎఫెక్ట్స్ తక్కువనే నమ్మకం ప్రజల్లో మెల్లగా వ్యాపించింది. టీకాల వినియోగం పెరిగింది. ఆ టీకా 81% సామర్థ్యాన్ని చూపింది. ఇప్పుడు దాదాపు పాతిక పైగా దేశాలు ఈ టీకాను వాడడం మొదలుపెట్టాయి.

మొదట్నుంచీ అనేక సందేహాలని వ్యక్తంచేసిన మీడియా సైతం అనుమానాలని పక్కనపెట్టి... 'మన దేశ చరిత్రలో తొలిసారి ఓ భారతీయ శాస్త్రవేత్త ఆవిష్కరించిన, భారతీయ ల్యాబ్లోనే పుట్టిన మొట్టమొదటి స్వదేశీ టీకా ఇది... హమారా భారత్ మహాన్!' అని కొనియాడడం కొసమెరుపు.

అంతటి మహా వ్యక్తులకు డా॥ కాకర్ల సుబ్బారావు పేరు మీద ఇచ్చే జీవనసాఫల్య పురస్కారాన్ని అందజేయటం తానా తన అదృష్టంగా భావిస్తున్నది.

తానా గుత్తికొండ రవీంద్రనాథ్ సామాజిక సేవాపురస్కారం



గొర్రెపాటి రంగనాథబాబుకు...

కన్నతల్లిని, పెంచిన ఊరును అత్యంత సహజంగా మర్చిపోతున్న ఈ రోజుల్లో, అందుకు భిన్నంగా నిలబడ్డ వ్యక్తి శ్రీ గొర్రెపాటి రంగనాథబాబు.

పుట్టింది కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామం. ఆ గ్రామం చైతన్యానికి ప్రతీక. బౌద్ధ సంస్కృతి విలసిల్లిన గ్రామం. అతి పురాతన జలధీవ్వరాలయం ఉన్న ఊరు. చిన్నతనంలో అక్కడ పెరిగిన రంగనాథబాబు ఖరగ్‌పూర్‌లో ఐఐటి చదువుకుని, ఉద్యోగార్థిగా అమెరికా వెళ్లి అక్కడ వ్యాపారవేత్తగా రాణించారు.

తానా ప్రారంభ దినాల నుండి సభ్యుడిగా, క్రియాశీల కార్యకర్తగా ఉంటూ 1999 తానా సిన్సినాటి మహాసభల కన్వీనర్‌గా అతి తక్కువ ఖర్చుతో అత్యంత వైభవంగా ఆ సభలు నిర్వహించారు.

1957లో ఆయన దృష్టి తను పుట్టి, పెరిగిన ఘంటసాలవైపు మళ్లింది. తల్లిదండ్రులు గొట్టిపాటి వెంకటరాయలు, ఉదయ భాస్కరమ్మ పేరున ట్రస్ట్ స్థాపించి ఘంటసాల గ్రామ అభివృద్ధికి, ఆ ప్రాంతపు విద్యావికాసానికి నాటి నుంచి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఆరువేల ఎకరాల సాగు కోసం నీటివసతిని ఏర్పాటుచేసారు. చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, భవనాలు నిర్మించి, వాటి అభివృద్ధికి, నిత్య పర్యవేక్షణకు నిధులు వెచ్చిస్తున్నారు. పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. ఊళ్లో రోడ్లు వేయించారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇందుకోసం నిజాయితీ కలిగిన వాలంటరీ గ్రూపును ఏర్పరచి, తన పర్యవేక్షణలోనే సమస్త కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బౌద్ధం వైపు ఆయన ఆలోచనలు మళ్లాక, ఒకప్పుడు బౌద్ధ తత్వంతో వెల్లివిరిసిన ఘంటసాల గ్రామంలో బౌద్ధ క్షేత్రాన్ని నిర్మించేందుకు రెండెకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. ప్రపంచంలోనే అతి పెద్దగా దాదాపు 100 అడుగుల శయన బుద్ధ విగ్రహాన్ని రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

పేదపిల్లలకు విద్యనందించడానికి ఘంటసాలకు దగ్గరలోని చల్లపల్లిలో ఒక కాన్వెంట్‌ను ప్రారంభించి, అతి తక్కువ ఖర్చుతో విద్యను అందిస్తున్నారు.

అంతటి మహా వ్యక్తికి గుత్తికొండ రవీంద్రనాథ్ పేరు మీద ఇచ్చే సామాజిక సేవాపురస్కారాన్ని అందజేయటం తానా తన అదృష్టంగా భావిస్తున్నది.

తానా గిడుగు రామమూర్తి స్మారక తెలుగుభాషా పురస్కారం



డా॥ మన్నం వెంకటరాయుడు

తెలుగు భాషాభిమానులకు, సాహిత్యాభిమానులకు రాయుడుగా తెలిసిన ఆయన పేరు మన్నం వెంకటరాయుడు. ఆయన స్వస్థలం ప్రకాశం జిల్లాలోని చిన్న కుగ్రామం లింగంకుంట. చదువుకుంది సైన్స్. దాని ఆధారంగానే వ్యాపారం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి పిహెచ్.డి. తీసుకున్నారు. వివిధ రూపాల్లో ఉన్న తెలుగు సాహిత్య, భాషా సమాచారాన్ని సేకరించే పని పెట్టుకున్నారు. అందుకోసం తన ఇద్దరు సోదరులతో కలిసి తల్లిదండ్రుల పేరు మీద మనసు ఫౌండేషన్ స్థాపించి, కనుమరుగైపోయిన వేలాది పుస్తకాలను సేకరించి భవిష్యత్ తరాలకు అందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఆయన సోదరుడు డా॥ మన్నం గోపీచంద్ కార్డియో థొరాసిక్ సర్జన్.

ఈ మహా యజ్ఞం కోసం కొన్ని వేల పుస్తకాలను సేకరించి, డిజిటలైజ్ చేసారు. ఇప్పటికి దాదాపు కోటి నలభై లక్షల పేజీలను నిక్షిప్తపరిచారు. అందుకోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన గ్రంధాలయాల్లోని పుస్తకాలను, వ్యక్తిగత గ్రంథాలయాల్లోని పుస్తకాలను సేకరించి, స్కాన్ చేసి, భద్రపరిచే పనిలో ఉన్నారు. ఇందుకోసం సాధారణ పత్రికలు, సాహిత్య పుస్తకాలు, సినిమా పాటల పుస్తకాలు, సినిమా పత్రికలు, జానపద గీతాలు, హస్త ప్రతులు, ప్రాచీన ఆంధ్ర సాహిత్య గ్రంథాలను సేకరించారు. గురజాడ అప్పారావు, బీనాదేవి, తండ్రిగారైన మన్నం నరసింహపంతులు- వీరిపై డాక్యుమెంటరీలు నిర్మించారు. వీరి కృషికి గుర్తింపుగా 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' పురస్కారాన్ని అందజేసింది.

గిడుగు రామమూర్తి (1863-1940) పేరు చెప్పగానే 20వ శతాబ్ది ప్రథమపాదంలో వ్యావహారిక భాషావాదానికి ఉద్యమరూపం కల్పించి గ్రాంధిక భాషావాదులపై విజయం సాధించిన ఒక భాషాయోధునిగా ఆయన్ని అందరూ పరిగణిస్తారు. దీనికి మించి ఆయన గొప్ప భాషా శాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథ పరిష్కర్త, శాసన పరిష్కర్త, పాఠ్యగ్రంథ రచయిత. సవరభాషకు వ్యాకరణం రచించి, సవరల జీవితచరిత్రను గ్రంథస్థం చేసినవాడు. సవరల అభివృద్ధికి కృషి చేసిన సంఘసేవకుడు.


ఈ కర్తవ్య నిర్వహణలో భాగంగా జీవితకాలం తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామమూర్తి పేరు మీద ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రూ. 50,000ల నగదుతో కూడిన పురస్కారాన్ని అందజేయాలని తానా నిర్ణయించింది. తెలుగు భాషా వికాసానికి, అభ్యున్నతికి విశేషంగా కృషి సల్పిన ప్రముఖులను ఈ పురస్కారంతో గౌరవించాలని తానా ఆశయం.

ఈ సంవత్సరానికి ఈ పురస్కారాన్ని తెలుగు భాషా సాహిత్య సంపదను నిక్షిప్తం చేస్తున్న మనం వెంకటరాయుడుకి ప్రదానం చేయడం తానా తన అదృష్టంగా భావిస్తోంది.

తానా ఎన్‌టిఆర్ తెలుగు సాంస్కృతిక సేవాపురస్కారం

స్వర్ణోత్సవ మురళీమోహనం

డా॥ జంపాల చౌదరి
తానా పూర్వ అధ్యక్షులు



అరవయ్యేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా చాటపర్రు గ్రామం యువకులు మద్రాస్ ఆంధ్రా క్లబ్ నాటకపోటీలకు పోలీస్ అనే నాటకంతో పాల్గొనాలనుకున్నారు. మద్రాసు నుంచి వచ్చిన స్క్రీనింగ్ కమిటీ కోసం ఊళ్లో ఆ నాటకాన్ని ప్రదర్శించినప్పుడు, మంచి పోలికలతో హీరోలా ఉండే మాగంటి రాజబాబు అనే కుర్రవాడు హీరో వేషంలో స్టేజ్ మీద మొదటిసారిగా మెరిసిపోవటం ఆ రోజు ప్రేక్షకుల్లో ఉన్న నాకు బాగా గుర్తుంది. ఆ నాటకంతో ఆ కుర్రవాడికి నటన, నాటకాల మీద ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత ఏలూరులోనూ, విజయవాడ నటరాజ నాటక సమాజంలోనూ నెలనెలా నాటకాలలో ముఖ్య పాత్రలు వేస్తూ తన నటనకు మెరుగులు దిద్దుకున్నాడు.

పదేళ్ల తరువాత *జగమేమాయ* అనే చిత్రం ద్వారా సినిమా రంగ ప్రవేశం చేస్తున్నప్పుడు రాజబాబు మురళీమోహన్ అయ్యాడు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ, అంచెలంచెలుగా ఎదుగుతూ, అతి తొందరగానే యువహీరోలలో అగ్రస్థానాన్ని సంపాదించుకున్నాడు. అందరితోనూ కలసిపోతూ, వివాదాలకు దూరంగా ఉంటూ, సినీరంగంలో అజాతశత్రువు అనే పేరు తెచ్చుకొని, నిర్మాతలకు ప్రీతిపాత్రుడయ్యాడు.

మరో పదేళ్ల తరువాత రామదండు చిత్రంతో నిర్మాతగా మారిన మురళీమోహన్, జయభేరి సంస్థ పేర ఎన్నో విజయవంతమైన చిత్రాలు నిర్మించి, తెలుగు చలనచిత్రరంగంలో ప్రముఖ నిర్మాతగా పేరు సంపాదించుకున్నారు. తెలుగు చిత్రపరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాదుకు మారటంలో కీలకమైన పాత్ర పోషించారు.

1982లో ఎన్.టి.ఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి రాజకీయాలలో ప్రవేశించినప్పటి నుంచీ ఆయన వెనువెంటనే ఉన్న మురళీమోహన్, పదవులేమీ ఆశించకుండానే ఆయన విజయానికి కృషి చేశారు. 2014 ఎన్నికలలో రాజమండ్రి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

శ్రీ శోభన్‌బాబు స్ఫూర్తితో రియల్ ఎస్టేట్ రంగంలో ప్రవేశించిన మురళీమోహన్, ఆ రంగంలోనూ అచిరకాలంలోనే అగ్రస్థానానికి ఎదిగారు. అయినా నటనమీద తనకున్న అభిమానంవల్ల ఇప్పటికీ సినిమాలలోనూ, టెలివిజన్‌లోనూ నటిస్తున్నారు.

ఫిలమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షులుగా, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా చాలా సేవలు అందించారు. ఆయన పూనిక వల్ల రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు నిర్వహించి నాటకరంగానికి ప్రోత్సాహం అందించటం ప్రారంభించింది. మూవీ ఆర్టిస్ట్స్ అస్సోసియేషన్ అధ్యక్షునిగా బహుకాలం పనిచేసి ఆ సంస్థ అభివృద్ధికి పలువిధాల కృషి చేశారు.

1987లో సెయింట్ లూయిస్‌లో జరిగిన తానా సభలకు మొదటిసారి అతిథిగా వచ్చిన శ్రీ మురళీమోహన్ తానా సంస్థకు అత్యంత ఆత్మీయమిత్రునిగా గత 36 యేళ్ల నుండీ పలువిధాలుగా తన సహకారం అందిస్తున్నారు. పలు తానా సభలకు ఇండియా నుంచి వచ్చే కళాకారుల బృందాలకు సారధ్యం వహిస్తూ, కళా ప్రదర్శనలను సమన్వయం చేయటంలో కీలకపాత్ర వహించారు. 1991లో అప్పటి తానా అధ్యక్షుల కోరికపై తానాలో సభ్యత్వం కూడా తీసుకున్నారు.

సినిమా, వ్యాపార రంగాలలో విజయాన్నందుకున్న శ్రీ మురళీమోహన్, తన మురళీమోహన్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేకమైన ప్రజోపయోగమైన కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా శ్రీ మురళీమోహన్ పదివేలమంది పైగా పేద విద్యార్థులకు ఇంజనీరింగ్, వైద్య విద్యాభ్యాసాలకు అవసరమైన ఖర్చులన్నిటినీ భరించటం చాలమందికి తెలియని విశేషం.

శ్రీ మురళీమోహన్‌ను ఓ తండ్రి తీర్పు (1985) చిత్రానికి ఉత్తమ నటుడిగా, ప్రేమించు (2001), వేగుచుక్కలు (2003) చిత్రాలకు ఉత్తమ సహాయనటునిగా రాష్ట్ర నంది అవార్డులు, 2017లో SIIMA జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

బహురంగాలలలో ఉన్నత స్థానాన్ని అధిరోహించినా, ఇప్పటికీ తన విలువలను మరువని నిగర్వి, మంచిమనిషి, శ్రీ మాగంటి మురళీమోహన్ తెలుగు చలనచిత్రరంగంలో ప్రవేశించి యాభై యేళ్లు పూర్తై స్వర్ణోత్సవం చేసుకుంటున్న సందర్భంలో, తెలుగు సాంస్కృతిక రంగానికి ఆయన చేసిన సేవను గుర్తిస్తూ, **తానా ఎన్‌టీఆర్ తెలుగు సాంస్కృతిక సేవ అవార్డుతో తన ఆత్మీయ మిత్రుణ్ణి తానా గౌరవించుకోగలిగినందుకు చాలా ఆనందిస్తున్నాము.**

TANA AWARDS OF EXCELLENCE, 2023




Dr. SUDHAKAR JONNALAGADDA — Medicine/ Community Service

Dr. Sudhakar Jonnalagadda is the first Telugu physician from Andhra Pradesh to receive Pravasi Bhartiya summan award for medicine. He raised $5.5 million for Covid relief efforts in India and provided 3000 Oxygen concentrators, 100 ventilators and 100 hiflo oxygen machines. As the chair of AAPI COVID committee, he assisted with providing telemedicine in rural India during Covid Pandemic. He received many other awards for his service to India during the Covid Pandemic. Dr. Jonnalagadda was born in Guntur, graduated from Rangaraya Medical College and is currently a gastroenterologist in Georgia.



Dr. VEMURI MURTHY — Medicine

Dr. Murthy, an alumnus of Guntur Medical College and All India Institute of Medical Sciences, is a faculty @ the University of Illinois, Chicago. An Indo-US resuscitation medicine expert, he piloted the University Model of Resuscitation in India. A Visiting Professor to Medical Institutes, Advisor to the Government of Odisha, and international faculty of the American Heart Association, he is considered a "Pioneer of Resuscitation Medicine in India." His mission is "Saving Global Lives through CPR training." His lifelong contributions earned him numerous international accolades.



Hon. DIPTI PIDIKITI-SMITH — Law and Community Service

In 2022, the Virginia General Assembly appointed Dipti Pidikiti-Smith as a General District Court Judge in the 19th Judicial Circuit in Virginia. Dipti is the first Asian American woman to serve on the Fairfax County General District Court. Formerly, Dipti was an attorney and deputy director at Legal Services of Northern Virginia. As a volunteer and compelling advocate to serving children and families, she provided access to justice for disadvantaged and marginalized people. Notable awards and honors include Legal Aid Attorney of the year and being named a 2022 Fellow of the Virginia Law Foundation. Born in India, she grew up near Philadelphia and graduated from the Temple University and the University of District of Columbia Law School.




Mrs. MALINI PULI — Community Service

Smt. Malini Puli is a Technology Executive, philanthropist, and lifelong learner. She co-founded Asha-Jyothi in 2003, now present in 10 cities, spreading the awareness of education for underprivileged, active lifestyle among Indian communities. In addition to helping underprivileged kids in India, Asha-Jyothi, under Malini's leadership has been establishing Tech Innovation Labs in high schools across Northern Virginia. Malini and Sekhar Puli received recognition as the Lady and Lord of Fairfax County from the House of Representatives for their community impact. Asha-Jyothi, in collaboration with Think Peace, supports refugees in India with essential provisions. The organization actively engaged in COVID-19 relief efforts and inspired other non-profits.



Dr. VENKATESWARARAO KATA — Service to TANA

Dr. Venkateswararao Kata helped write the original Constitution and Bylaws of TANA. Throughout TANA's history, he has participated in revisions of these bylaws, with the most recent one being in 2021. He was the Committee chair & member for conducting TANA election through several TANA phases, including current elections of 2023. He served in TANA board as Vice Chairman and Chairman & Senior advisor for several past Tana Presidents. Education is extremely dear to Dr. Kata's heart. Seeing a tremendous need, he Built a high school in his native place of Oppicherla, Guntur, where he also sponsors college scholarships. As a board member to his Local Civic Association, he works in Outreach Programs for the community: providing Police with bullet proof vests, conducted health screening for underprivileged kids, & providing books, dental care,etc. Dr. Kata has always lived his life to contribute towards the betterment and welfare of others through service.



Dr. PATIBANDA SARMA — Community Service

Dr. Patibanda Sarma was born in Vijayawada and grew up in Hyderabad. He is a chemical engineer by profession and had a successful career as a research engineer in DuPont. In addition, Dr. Sarma founded Hindu Temple Association of Delaware to maintain and enhance Hindu religion and Indian culture. Through his hard work and leadership, he raised funds and built a very successful temple covering 50000 SQFT in Delaware. In addition to religious activities, he organizes many social programs such as free medical camps, vaccine programs, language learning and cultural activities for children; and presentations on many needed topics like financial planning, elder care, social security for the Indian community. His service is greatly appreciated by the Indian community living in Delaware, Pennsylvania Maryland and New Jersey.



Prof. SATYA KUNAPULI — Science

Dr. Satya Prasad Kunapuli, professor at Temple University, passionately investigated signal transduction mechanisms in the activation platelets, which are responsible for thrombosis leading to heart attacks and stroke. He has trained 17 Ph.D students, numerous postdoctoral fellows, and mentored many high school and undergraduate students. He has published more than 200 papers in prestigious journals, and has received numerous awards, including Mario Toppo Research award, Eberman Research Award, and American Heart Association Established Investigator award, Outstanding Investigator award from NIH, etc. He had obtained his Ph.D. in Biochemistry from the Indian Institute of Science.



Dr. SRINIVAS VEMULAPALLI — Community Service

Dr. Srinivas Vemulapalli is an exemplary community service leader. For the past 25 years, he has been leading Vibha, a non-profit organization that supports improving the lives of underprivileged children in the U.S. and India. Vibha has supported more than 300 projects in India since 1991 and supported more than 3 million children. More recently, Vibha has put much effort into public education and working with several state governments of India, including Andhra Pradesh, Delhi, and Gujarat. He has received several awards including the US 2016 President's Life-Time Achievement Award. He graduated in Mechanical Engineering from V.R. Siddhartha Engineering College and received his Ph.D. from IIT Mumbai.



Dr. SHANKAR MUSUNURI — **Entrepreneurship**

Dr. Shankar Musunuri is Chairman, CEO and Co-Founder of Ocugen, a biotech company focused on discovery, development, commercialization of gene and cell therapies, biologicals, and vaccines. Dr. Musunuri transformed Ocugen from a start-up into a cutting-edge biotech powerhouse with three distinct first-in-class platform technologies focused on ophthalmology, orthopedics, and infectious diseases. Ocugen anticipates launching products from these technologies within the next few years. Ocugen's mission is to develop cutting-edge innovations for people with serious diseases and conditions with a commitment to ensuring global market access.



Dr. H. RAYUDU KOKA — **Medicine and Community Service**

Medical Director for Mental Health & Addictions Program, Sudbury, Canada. Professor of Psychiatry with NOSM. Leader and strong advocate for mental health and addictions services locally and provincially in leadership roles enabling, enhancing and adding new programs. Instrumental in making NOSM a reality. Helped in changing licensing requirements with CPSO licensing body, as Council member and CPSO President, to enable thousands of IMGs to get licenses to practice in Ontario. Very active community leader participating on different Boards as well as in different fundraising activities. In recognition of his services, many distinguished awards: Good citizenship award of Ontario, Paul Harris Award Rotary Club, Community Builders Award, Health Care and many more. Continue to dedicate clinical practice, teaching and research.

TANA MERITORIOUS ACHIEVEMENT AWARDS, 2023



Mr. VAMSI KORA — **Entrepreneurship**

Vamsi Kora's visionary leadership and strategic expertise have set him apart in the field of enterprise data strategy. As the founder of Gathi Analytics Inc., he transformed the company into a leading tech startup, ultimately securing a multimillion-dollar acquisition by Apexon, a Goldman Sachs company. Today, Vamsi continues to drive the growth and innovation of Apexon's data and analytics practice, strengthening his position as a respected industry leader. Additionally, his unwavering commitment to philanthropy shines through his support of the Boys and Girls Clubs, forging strong partnerships within the Central Ohio chapter as well as the Telugu community. Recognized as the 2022 EY Entrepreneur of the Year, Vamsi's achievements speak volumes about his dynamic leadership and unwavering dedication.



Prof. BELLAMKONDA K. KISHORE — **Science**

Dr. Kishore is a distinguished medical scientist from Utah. Trained as a Physician, he pursued his passion in academic research focusing on the kidney. During his long career over 3 continents, he made seminal discoveries and identified drug targets for the development of novel therapies for obesity, and kidney and liver diseases. Building on his innovations with patents, recently he co-founded ePurines, Inc, a biotech startup, while continuing as an Adjunct Professor of Medicine at the University of Utah Health. https://www.bkkishore.online/



Dr. KRISHNAM RAJU VEGESNA — Entrepreneurship

Dr. Raju originally from Atreyapuram, East Godavari is an accomplished Scientist and serial entrepreneur in pharmaceutical field. He has four decades of pharmaceutical industry experience and has held several leadership positions in various companies including Glaxo Smith Kline, BASF, and Johnson & Johnson, and won several awards for his technical excellence. Building on his vast experience in Pharma, he co-founded Liquisource inc(2000), Allan Pharmaceuticals(2004), partnered with VersaPharm(2009), Co-founded Douglas Pharma(2017) and founder/CEO of Amstergen Life Sciences inc (2022) in Warminster, PA. His pharmaceutical ventures have provided employment and training to several families of Indian origin, while also mentoring numerous talented youngsters in the Telugu community. Among his many contributions to the community in the USA, he is conducting a variety of charitable programs in his village back in India.



Mrs. SAILAJA ADLURU — Women Empowerment

Sailaja Adluru is a fierce advocate for women. She works with the victim service center of Montgomery County and is an outreach specialist to the South Asian Population. For the last two decades, she has working to support women who have faced abuse or assault by providing them shelter, helping them find a livelihood, and attaining legal support, which includes representing victims at police departments, courts, and with the District Attorney etc., Her work applies not only in Philadelphia but across the USA.



Mrs. MALLIKA MADDURI — Arts

Mrs. Madduri has been a tireless advocate and front-runner to promote Indian Arts and Culture. By establishing a Gurukulam Center for Arts, in Omaha, Nebraska for the past 11 years, she has trained hundreds of students in Indian classical dances and literature. She and her students have given stage performances on various local and national events and received numerous Awards. She has written several articles and has given presentations on Bharatanatyam and Indian culture, all of which have been appreciated across the globe.



Mr. VENKATESWARA CHINNI — Community Service

Sri Venkateswara Chinni is a strong believer in community service and dedicates more than 50% of his time and resources for the community. For the past 15 years, he has been running a highly acknowledged non-profit "Save A Life", educated thousands of families and saved many people suffering from blood cancer. They now have 23 chapters in the USA and conduct awareness campaigns on the importance of stem cell donation to save lives. He also serves as the TANA coordinator for stem cell donation awareness. He says, each and every one of us has the UNIQUE power to save a life. For more details or to volunteer you can contact +1 817 584 8886 or visit PeopleSavingPeople.org



Mr. NAGESWARA RAO MANNE — Telugu Language promotion

For the past 15 years, Nageswara Rao Manne has passionately served the Telugu Community in Central Ohio, dedicated to promoting the richness of the Telugu Language. With the support of fellow volunteers, he spearheaded the establishment of free Telugu schools at Bhartiya Hindu Temple, where over 1500 second-generation children have benefitted. In addition, he proudly founded the Telugu Library in Ohio, housing 100 rare books. Notably, Mr. Manne has played a pivotal role in organizing various Telugu literary programs, curating insightful speeches delivered by renowned Telugu scholars. He has also been instrumental in coordinating epic dramas, such as Sri Krishna Rayabaram, captivating the hearts of second-generation children. Mr. Manne's unwavering dedication as a community volunteer has made him an invaluable asset, particularly in his tireless efforts to promote the Telugu language and preserve its vibrant culture.




Mrs. MADHAVI SOLETI — Arts and Education

Madhavi Soleti has over three decades of experience as an educator in India and New York City. She proactively counsels and trains her students to face real-world challenges and helps ESL students from various ethnicities assimilate into American culture. Madhavi demonstrated leadership by creating a safe space for women, which empowered them to improve their sense of self and identity. In the field of arts, she developed compelling characterizations of legendary Telugu personalities on stage.



Mr. SASIKANTH VALLEM — Agriculture Entrepreneurship

Sasikanth Vallem, an IT professional turned agricultural entrepreneur, founded VVF AgTech Inc., encompassing 260 acres of farmland in Florida and Georgia. Specializing in Indian specialty fruits, he cultivates high-value fruits to meet market demands. His motto, "Lets Go Farming – Let's Get to Our Roots," drives his mission to make farming a prosperous venture. To mitigate risks with traditional farming, he diversified the company by growing exotic tropical fruits, nursery operations, greenhouse farming, and online stores. Sasi's platform enables individuals to participate in farming through investments, land ownership, and volunteering. With 106 investors and counting, this collective effort aims to establish a lasting legacy of Indian farming in the USA.



Mr. BABJIRAO YALAMANCHILI — Community Service

Babjirao Yalamanchili, founder and Director of the non-profit organization 'Keep Amarillo Clean', along with his wife Devi run events to clean up Amarillo, end littering, promote recycling, and educate locals on litter's negative impact. He also established 'Keep the Panhandle Clean', collaborating with towns and school districts to organize clean-up activities. His active participation in TANA and Telugu organizations, along with recognition from the NAACP and others, highlights his commendable community service.

TANA YOUTH EXCELLENCE AWARDS, 2023



Ms. SOENIKA CHAND GORREPATI — **Community Service and Leadership**

Soenika Gorrepati is a fourth-year Ingram Scholar at Vanderbilt University, majoring in Medicine, Health, and Society. In 2015, Soenika founded Prepare, a nonprofit offering STEM education to rural government schools in India. Most recently, she collaborated with TANA to organize eye camps at Prepare's five STEM schools, providing free eye exams to all students and glasses as needed. She is also a student consultant for nonprofits, research assistant, robotics mentor, and a Bharatanatyam dancer.



Master AKARSH PRASAD KOLLU — **Academics**

Akarsh Kollu is a High School freshman with a perfect GPA. He is US National Champion in Geography Bee for 8th Grade Division - 2022 and placed 5th in the WORLD at International Geography Bee 2022, Including winning a Gold Medal (1st in world) for an event. As part of the school Academic bowl team, he won regional awards. Akarsh raised funds and aided COVID impacted migrant workers & various charitable causes back home for which he won the Presidential Service GOLD award for the last 4 years in a row.

TANA YOUTH MERITORIOUS AWARDS, 2023



Miss. SINDHU SURAPANENI — **Arts and Community Service**

A 14-year-old creative artist from Spokane, Washington, is also a philanthropist, a changemaker, a two-time TEDx speaker, a cultural dancer, and Miss Teen India Spokane/WA1RU. At 11, she taught over 400 free art lessons online and 100 creative workshops for TANA. She raised $20,000 selling her artwork and donated that money to charities that support the homeless. She's been featured on local and international media over 40 times. She has won many awards, including the Gold Presidential Volunteer Service Award twice from Joe Biden. Sindhu owns and operates Imaginations2Creation, a positive and hopeful non-profit.



Miss. GEETIKA KODALI — **Sports**

A Cary, NC resident, Geetika Kodali is an American-born right-hand all-rounder who started playing cricket at age of 11. She made the USA Women's team at the age of 14 in 2018. She represents the USA with a great deal of pride and sees it as an absolute honor to wear the red, white, and blue. Geetika lead the first ever inaugural USA Women's Under 19 Women's team as Captain. She is in history books for being selected as first ever Captain of Team USA Women's U-19 and the first cricketer to take a Hattrick in the sixty Tournament. Aspiring for USA to progress towards being a full member cricket nation and also looking to do her part and give back to society.

TANA PRESIDENTIAL & SPECIAL RECOGNITION AWARDS, 2023



JUSTICE NUTHALAPATI VENKATA RAMANA — Law

Justice Nuthalapati Venkata Ramana is a former judge and served as the 48th Chief Justice of India. Previously, he was a judge on the Supreme Court of India, chief justice of Delhi High Court and the acting chief justice of Andhra Pradesh High Court. He has also been the president of the Andhra Pradesh Judicial Academy. His tenure as chief justice saw an increase in judicial appointments to the Supreme Court and high courts. Justice Ramana has participated and chaired several National and International Conferences and Seminars in India and abroad. He was born in in Ponnavaram village in Krishna district of Andhra Pradesh.




Mr. T.G. VENKATESH — Community Service

Mr. T. G. Venkatesh is a successful businessman and a politician. He served as a Member of the Legislative Assembly of Andhra Pradesh from 1999 to 2004 and from 2009 to 2014. He was Minister for Minor Irrigation under the administration of Mr. Kiran Kumar Reddy. He has been a member of the Rajya Sabha since 2016. Mr. Venkatesh was born in Madanapalli, Chittoor district. He did his B.Com. from Sri Venkateswara University and owns several businesses spread over Andhra Pradesh, Karnataka and Tamil Nadu.



Mr. K. S. CHANDRABOSE — Music

K. S. Chandrabose is an Indian lyricist and playback singer who works in Telugu films. Chandrabose debuted as a lyricist with the 1995 film Taj Mahal. In a career spanning over 25 years, he has written lyrics for about 3600 songs in over 850 films. Most recently, Chandrabose won an Academy Award and a Golden Globe Award for "Naatu Naatu" song from the film RRR. He has received two Nandi Awards, two Filmfare Awards, and three SIIMA Awards as a lyricist. Chandrabose was born in the village of Challagariga of Bhupalpally district, Telangana. He earned a degree in Electrical and Electronics Engineering from Jawaharlal Nehru Technological University, Hyderabad.



Mr. SATISH TUMMALA — Community Service

Satish Tummala actively served the Philadelphia area Telugu community for the past 15 years. He played an active role in all TANA activities and also organized events like 5k Run, Food Drives and several other sporting tournaments and the DhimTANA events in the Philadelphia area. In the year 2019, Satish coordinated the TANA Regional Conference in Philadelphia. Not only Satish spends enormous amounts of his time in supporting the community, he also generously donates money towards various charity activities. He served as a member of the TANA Finance committee in the past. Satish is currently serving as a secretary for the 23rd TANA Conference in Philadelphia.



Mr. RAM MADDI — Community Service

Ram Maddi, an Atlanta resident for the past 24 years, has dedicated himself to community service by volunteering for numerous non-profit organizations throughout this period. He previously held the position of Chairman in TAMA and served as a volunteer Trustee for the Hindu Temple of Atlanta. Currently, he serves as the Secretary for North America Shridi Sai Temple of Atlanta (NASSTA). He served TANA and participated in several committees, including the Volunteer, Site Selection, and Membership Committees. Ram actively volunteers for several organizations including TANA, TAMA, TAMA Free Clinic, ATA, NATA, IACA, Kannada Koota, etc.



Dr. NANDINI SUNKIREDDY — Medicine

Dr Nandini Sunkireddy is a primary care and Obesity Medicine specialist with wellstar medical group in Roswell,GA. She graduated from Adichunchungiri institute of medical sciences, Karnataka and completed residency at Louisiana State University. Her passion for creating awareness about preventing chronic diseases through lifestyle changes led her to start a YouTube channel Styleyourhealthmd, through which she spreads awareness to the community on the benefits of weight loss and healthy lifestyle. Along with that she has been volunteering at the TAMA clinic serving the community since the year 2017. Dr. Nandini serves on the board for practice management committee for Georgia Academy of family physicians and has been recognized as Georgia trends Top doctor for the years 2021 and 2022.



Mr. MAHENDER MUSUKU — Business

Mahender Musuku is a highly accomplished individual with a wealth of experience in various business sectors. Mahender's journey towards success began with his remarkable achievement of elevating the Systechcorp group of companies to become top-ranking organizations. He expanded his entrepreneurial endeavors into diverse sectors such as education, pharma, real estate, and smart investments, and created numerous employment opportunities in the United States, Mexico, and India. In addition to his business achievements, Mahender plays a significant role in the Indo-American community by actively serving on the board of the Hindu American Temple and Cultural Center (HATCC). Furthermore, he has made noteworthy contributions as a philanthropist, supporting various charitable causes.



Mr. T.G. VISHWA PRASAD — **Community Service**

TG Vishwaprasad is an investor, entrepreneur, film producer, and the founder of People Tech and People Media Factory. With a diverse career spanning multiple industries, he has left an indelible mark on the business and entertainment worlds.

Born in Adhoni, a small town in Andhrapradesh, Vishwaprasad embarked on his entrepreneurial journey, establishing People Tech Group, a software company based in the USA, creating thousands of job opportunities for talented individuals.

Later he laid the foundation for the People Media Factory in 2016. People Media Factory is now the fasted growing film production houses in India aiming to complete 100 films withing short span of time with highest production values and great stories. Dhamaka, Karthikeya-2, Gudachari franchise, Oh Baby are the some of the blockbusters and Pawan Kalyan and Sai Teja's BRO, Prabhas and Maruthi's projects are some of the biggies are in production.

Expanding his ventures, Vishwaprasad established thriving branches of his companies in Hyderabad and Bengaluru, further contributing to local economies and fostering technological growth.

TG Vishwaprasad's remarkable achievements and unwavering dedication continue to inspire others. With his vision and transformative impact, he has become a trailblazer, leaving an enduring legacy in the business and entertainment realms.

TANA PRESIDENTIAL & SPECIAL RECOGNITION YOUTH AWARDS, 2023



Mr. HAASITH GARAPATI — **Community Service**

Hasith Garapati partnered with TANA to host online SAT/ACT test preparation sessions and coached thousands of students. Through these programs, Haasith was able to also raise over $60,000, which were all donated to TANA affiliated charities like the GRACE Cancer Foundation. The money that he donated to this Cancer Foundation helped conduct over 70 cancer camps in India in underprivileged areas. Haasith has also received the Bronze Presidential Volunteer Award for exceptional volunteering service.



Miss. APARNA VAGVALA — **Community Service**

Aparna Vagvala, the founder of Help2C, is dedicated to empowering female artisans and tackling global issues. She has made a significant impact through her initiatives, such as establishing TANA's medical camps, supporting orphanages, and sponsoring the education of 12 nursing and college students. Aparna's visionary leadership has created an inspiring network of global volunteers. Serving as TANA's Mid-Atlantic Youth Chair, she successfully led multiple drives and summer math tutoring programs to raise over $15,000 for children's education. Aparna's academic excellence and exceptional leadership earned her the prestigious 2022 Coca-Cola Scholarship.

SASHA REALTY | SIBHA GROUP

TLP No. 29/2023/H

+1 (917) 455 8919
sales@sasha.homes

CONNECT WITH NATURE

LUXURY VILLAS

EXCLUSIVE PRE-LAUNCH

JUBILANCE
BY
SASHA REALTY | SIBHA GROUP

Exclusive Plots
Half Acre Villas I One Acre Villas

- First Ever 400 Acres Integrated Township at YADADRI
- 42 km from UPPAL, HYDERABAD I YADADRI.
- 48 Km from Ghatkesar, Hyderabad
- 2 km from Regional Ring Road and Rotary Exit at Dathaipally.
- 12 mins drive from YADADRI Temple and Temple View from Jubilance Site Peak Point.
- 90 mins drive from Hyderabad International Airport.



chat on whatsapp

Scan for Location

OUR PARTNERS

REALESTY

TS RERA

RERA NO: A02500001485



Manasvi Lingam

First Indian Professor of Astrobiology

Educational Background

I was born in Hyderabad, and was educated at a nearby small school all the way from kindergarten until my 10th grade. I studied Engineering Physics at IIT-Bombay, and graduated in May 2009. During my undergrad, I had the wonderful opportunity to spend a couple of months in SISSA (Trieste, Italy) thanks to a summer undergraduate research fellowship sponsored by the Italian government.

I left India for the US in August 2010, where I pursued my doctoral degree (PhD) in Physics at the University of Texas at Austin, graduating in May 2015. My dissertation was at the interface of plasma physics and applied mathematics; I was attracted to plasma physics because of its potential to revolutionize our access to clean energy via nuclear fusion, as well as by its mathematical elegance and sophistication.

I was subsequently a postdoctoral scholar at Princeton University (2015-16), where I worked on the application of plasma physics to nuclear fusion and astrophysics. Next, I moved to Harvard University (2016-17), where I was a postdoctoral fellow studying biological physics and fluid mechanics in the School of Engineering and Applied Sciences. Finally, I held a postdoctoral fellowship in the Institute for Theory and Computation at the Harvard-Smithsonian Center for Astrophysics (2017-19), where I researched astrobiology and planetary science.

Since August 2019, I am based at the Florida Institute of Technology (Florida Tech) as an Assistant Professor of Astrobiology in the Department of Aerospace, Physics, and Space Science, and the Department of Chemistry and Chemical Engineering. In addition, I am a Research Fellow in the Department of Physics and the Institute of Fusion Studies at the University of Texas at Austin.

What is the field I work on?


I primarily work in astrobiology, one of the newest and fastest growing disciplines in science, although I also conduct interdisciplinary research in astrophysics, plasma physics, and aerospace engineering in parallel. In a nutshell, astrobiology seeks to answer three fundamental questions in the Universe:

1. Where did we come from? How did life originate and evolve on planet Earth?
2. Are we alone? Is there life on other worlds in the Cosmos?
3. Where are we going? What is the future of humankind?

The chief appeal of astrobiology is the pursuit of science for science's sake. This is because the field strives to understand and contextualize humanity's place in the grand scheme of things: how the Universe came to be, how life on Earth was initiated, how life evolved and eventually gave rise to sentient conscious beings (humans), and how the future of life on our planet (including humans) will play out.

In addition to its intrinsic appeal of answering the above Big Questions, astrobiology offers us a number of tangible benefits. For example, discovering

organisms that survive in extreme conditions (one of the areas within astrobiology) has the potential to revolutionize fields like biotechnology and molecular biology. Likewise, responsible space exploration could grant us sustainable access to certain non-renewable resources (e.g., rare Earth elements) that are becoming scarce on Earth.



My specific research

Astrobiology is a vast and multidisciplinary field, which suits my own diverse background in engineering, physics, astronomy, planetary science, and applied mathematics. A select few of the major research areas in astrobiology that I have worked on thus far are sketched below:

1. Developing sophisticated fluid models (using NASA supercomputing facilities) to understand how planetary atmospheres, a requirement for habitability, could get rapidly eroded by high-speed winds emitted by the star.

2. Seeking to understand whether there exist universal physical principles underlying biological phenomena. For instance, I am particularly interested in resolving whether photosynthesis could operate on planets around other stars, what properties it may exhibit, and how it might be detected via telescopes.

3. Studying novel propulsion systems such as light sails and electric sails that do not carry on-board fuel. These spacecraft would enable us to explore the Solar system and beyond not only at lower costs but also much faster (e.g., Pluto can be reached in just a couple of years).

4. Identifying and searching for novel signatures of intelligent life (called technosignatures) like the presence of industrial pollutants in planetary atmospheres. This group of researchers, to which I belong, were awarded the first NASA funded research on technosignatures in the 21st century.

In addition, I have carried out research on geothermal energy and sustainability; the evolution of humans from primates; plasma instabilities that affect our capacity to realize nuclear fusion; and gravitational interactions of supermassive black holes.

Achievements and future plans

I am not only the first Telugu person to be appointed as a professor of this subject (i.e., astrobiology) in the world, but also the first Indian. I have published nearly 100 papers in international peer-reviewed journals, and wrote the first and only graduate-level textbook in astrobiology published by Harvard University Press, Life in the Cosmos From Biosignatures to Technosigna-tures, which is nearly 1100 pages in length. In addition, I am currently working on two books that will be published by Cambridge University Press in the coming year(s).

For my collective achievements, I was elected to be a Fellow of the Royal Astronomical Society (FRAS) in 2022, which is a prestigious learned society estabi-shed more than two centuries ago (in 1820) in the UK. In addition, I received the Dean's Excellence Fellowship in 2011 (University of Texas) and the ITC postdoctoral fellowship in 2017 (Harvard-Smithsonian Center for Astrophysics).

Last, but not least, I enjoy teaching at multiple levels, ranging from the introductory undergraduate to advanced graduate levels, because it fulfills the vital duty of transmitting knowledge to the next generation of scientists and engineers. In several of my courses, I received a perfect score of 5.0/5.0 in my teaching evaluations. In the academic year 2021-22, I was ranked among the top 5 faculty by average teaching score in the entire College of Engineering and Science at Florida Tech.

In the future, I intend to pursue astrobiology further, simultaneously interfacing with related fields like physics, astronomy, and aerospace engineering. Some of the questions that I hope to grapple with include:

1. What is life from the perspective of information theory? How was the origin and evolution of life shaped by information processing and information flow?

2. How can we utilize mathematical models to predict the future of humankind, given the manifold challenges it is facing (e.g., climate change)? Equipped with this knowledge, how could we mitigate these risks?

3. How can multiple facets of space exploration (e.g., navigation) be optimized by utilizing rapid advancements in artificial intelligence such as deep learning and reinforcement learning? ✤



Apoorva Charan

Oscar nominated Joyland Movie Producer

You come from a different background, diagrammatically opposite to American culture. Most Indian kids in the US are inclined toward the computer field or medicine; what motivated you to choose films?

I'd like to interrogate this question and ask who is defining American culture. Culture, no matter where we are it associating with, is constantly evolving. South Asia has such a strong filmmaking and cinema-going culture, and even beyond filmmaking, storytelling is passed down to us from generations above. It feels like the most natural instinct to be drawn towards filmmaking. I guess what perhaps feels a little different is that I was really encouraged to find what I love doing and to sculpt that into a career path. I'm grateful that I was guided towards a passion-driven profession. We spend so much time working and with our colleagues that our work often becomes interchangeable with our purpose. It feels really nice to have your passion, purpose, and profession align.

It is challenging for anyone to get into Hollywood. Apart from your interest in the movie field, why did you choose to be a producer? Why not other areas like script writing or direction or something else?

I was drawn towards producing because of the balance between creativity and business. I like the process of finding new voices to elevate, finding new stories to tell. I love working with writers & breaking story - I love the collaborative process but screen writing in itself can be isolating. Directing is a calling and it isn't for me, right now. I'm pretty happy with my role as a producer where I can manage and shepherd multiple films and projects.

Tell us about the picture Joyland, your team, accolades around the world and the obstacles if any in this journey.

Joyland is about a married man from a lower middle class family in Lahore who gets a job at a mujra theater, falls in love with a trans dancer, and the effect of that relationship on his wife & the rest of his family. It's an Urdu and Punjabi language film that brought together cinephile & arthouse cinema audiences, the LGBTQIA+ community, and South Asians from across the world.

It takes a village to make a film and we had a wonderful team. Some of the core members of the team were Saim Sadiq, the writer & director, our producing partners Sarmad Khoosat & Lauren Mann, our magnetic cast Ali Junejo, Rasti Farooq, Alina Khan, Sarwat Gilani, Sania Saeed, Salmaan Peerzada, and Sohail Sameer. We were lucky to have a team that was so passionate about the film.

Our journey for sharing the film with the audience started at Cannes 2022. Joyland was the first film from Pakistan to ever play at Cannes in Official Competition and won the Un Certain Regard Jury Prize & the Queer Palm. The film then went on to win many awards around the world including the Independent Spirit



Award for Best International Film, Sutherland Award's Honorable Mention at London Film Festival, Best Film From the Subcontinent at Indian Film Festival of Melbourne, a Special Jury Prize for the Best Ensemble at Bangkok World Film Festival, and Bets Actor for Ali Junejo at the Palm Springs International FIlm Festival. Joyland also played at Toronto International Film Festival, AFI Fest, Sundance, and New Directors New Films.

Joyland is also the first film from Pakistan to be shortlisted for the Oscars.

The role of a producer in the Indian film industry is not fully visible except in funding the film. When you compare Hollywood with Indian Film Industry, what is the role of a producer?

Why the producer plays a vital role in filmmaking, especially in Hollywood?

For me, the role of a producer is to help the film find the right resources so it can be born into the world. Resources can be in the form of talent (finding the right creative partners, writers, directors, cinematographers, production designers, etc.), financial, and even emotional. I really enjoy being the writer/director's creative partner, from doing deep development on the story, to helping build out the team & our vision for the film.

The script your team has chosen is an unconventional one with a mainly - religiously traditional background? What are the obstacles you faced during film production and releasing it in other countries?

I don't think our film is about religion at all. It deals with patriarchy, which stems from culture, regardless of which religion you are referring to. Our director, Saim Sadiq, speaks about this extensively in his interviews. And the film is about a traditional, conservative family in Lahore so I'm always amused when people tell me it's unconventional. Perhaps what is unconventional is the honesty with with we showcase the everyday struggles of patriarchy that women, men, and the trans community face. We had a very strong producing partner in Sarmad Sultan Khoosat who made production very smooth for us. We have had great theatrical releases in France and the US. We did have a ban temporarily in Pakistan but the cast & crew organized a grassroots campaign and Joyland became the first film to have a ban removed and went on to be in theaters in Karachi and Islamabad for over three months.


Getting an entry into the Oscars is not an easy proposition; What are your obstacles or experiences getting to that stage?

Financing and the systemic challenges that make it hard to reach the voter base. An Academy campaign is often about the marketing spend and the muscle of the folks behind it. As an independently financed film, we had to be really scrappy and strategic in the race to getting our film in front of the right voting audience. There is only a certain community of voters that are eligible to vote for the category we were competing in.

What are your next projects in the years to come? Any plans to produce a film in Bollywood or Tollywood?

We have some exciting films in development set in different countries. I will always be open to Bollywood, Tollywood, and any other way in which we tend to define a film industry or a genre of films. I hope to allow good scripts and good stories to lead me to my work.

Interview by Sai Brahmanandam Gorti



Roni Akurati

Film Actor & Standup Comedy Artist

Roni Akurati is an American actor of Indian descent. His parents, Rajani and Ramesh Akurati, are immigrants from India, and both he and his older brother Ramhith were born in Chicago.

When he was the age of five, his parents saw he had a flare for dancing and performing and encouraged him to pursue entertainment opportunities. His earliest performance experiences included doing Bollywood songs for the local Indian community in the Chicago area. Roni's first few professional jobs were in theater, playing the Indian Changeling Boy in, "A Midsummer Night's Dream," and Tiny Tim in, "A Christmas Carol." Soon thereafter, he landed the lead role of Mowgli in a Disney production of "The Jungle Book" at the prestigious Goodman Theater in Chicago and the Huntington Theatre in Boston. "At about the age of nine, Roni's acting career turned towards film and television with roles in NBC's 'Animal Practice' and Nickelodeon's 'Dead time Stories' and 'Henry the Danger.' He also made appearances in several television/online series for Yahoo and Amazon, and most recently starred opposite Ben Stiller on 'Another Period,' which Stiller also produces. "With regard to casting for GROWING UP SMITH, Roni was in India when he received the call to audition for the movie. While auditioning for the filmmakers via Skype, unfortunately the power kept going in and out at the hotel he was staying at. What was meant to be a quick interview dragged on for a few sessions over several days. Ultimately, the producers flew him to Los Angeles for a screen test opposite Brighton Sharbino ('Amy') who had already been cast and he finally got the job."He is currently at University of chicago, IL majoring in economics and film studies. ✤



North America Telugu Society

A Non-Profit Organization To Serve Telugus

ఉత్తర అమెరికా తెలుగు సంఘం

Tax ID: 26-4194139



భాషే రమ్యం... సేవే గమ్యం

#NOTAG

WITH BEST COMPLEMENTS FOR THE 23RD TANA CONFERENCE

NATS Helpline

Touching One Life @ A Time



helpline@natsworld.org

+1-888-4-TELUGU

+1-888-483-5848

www.natsworld.org





కెమెరాకే రంగులద్దిన

తమ్మా శ్రీనివాసరెడ్డి

వీక్షణం కాదు అతనిది దర్శనం!

"...for the eye sees not itself, but by reflection, by some other things."

ఇది ప్రపంచప్రఖ్యాత మహారచయిత, కవి - విలియం షేక్‌స్పియర్, జూలియస్ సీజర్ విషాదాంత నాటకంలో సుప్రసిద్ధమైన వాక్యం!

కానీ, తనని తాను చూసుకోగలిగిన కన్ను గురించి మీకు తెలుసా?

ఆ కన్ను ఫొటోగ్రఫీ గ్రాండ్ మాస్టర్ తమ్మా శ్రీనివాసరెడ్డి!

ఛాయాచిత్రలోకంలో మూడున్నర దశాబ్దాల శ్రీనివాస రెడ్డి పురోగమనాన్ని చూస్తే, ఏకకాలంలో చూసేది... చూడబడేది అయిన కవిత్వం వంటి సజీవ దృశ్యరచనగా అది గోచరిస్తుంది.

పదిచోట్లకి తిరిగి, వంద ఫొటోలు గుప్పించేద్దామనుకునే సగటు ఫొటోగ్రాఫర్ కాడు శ్రీనివాసరెడ్డి. లేదా, ఏవో కొన్ని ప్రసిద్ధ ప్రదేశాలని ఎంచుకొని, ఆ స్థల ప్రాముఖ్యతని అడ్డం పెట్టుకొని ఫొటోలకి గొప్పతనం ఆపాదించాలని చూసే వృత్తి ఛాయా చిత్రకారుడు కానే కాడు.

రాహుల్ సాంకృత్యాయన్ అంటారు కదా 'ఘుమక్కడ్' - అంటే లోకసంచారి, అటువంటి ఘుమక్కడ్ శ్రీనివాసరెడ్డి; ఈ సంచారికి కదిలిపోతున్న ప్రతి క్షణమూ ఆశ్చర్యమే, కదలాడుతున్న ప్రతి దృశ్యమూ అపురూపమే!

వర్షబిందువులో సింధువు.... గడ్డిపువ్వులో గడుసు సౌందర్యం... పల్లెపడుచులో అనంత స్త్రీత్వం... తథాగతుడి ఏకశిలలో తడిచెమ్మ- అన్నీ దర్శించి, ప్రదర్శించే ప్రవృత్తే- శ్రీనివాసరెడ్డి.

తనని తాను చూసుకునే కన్నుకి, తన గాయాలు తానే తడుముకునే పిల్లనగ్రోవి వంటి చూపు ఉంటుంది.

కాబట్టే శ్రీనివాసరెడ్డి ఫొటోలు- దృశ్యాలు కాదు, దర్శనాలు!



ప్రపంచ యవనిక పై తెలుగు చిత్రం

డా॥ కొంపల్లి సుందర్


రంగస్థలం మీద కదలాడే ఏడేడు రంగులకి మూలం ఒంటి కంటితో వెలిగే దీపం ఒక్కటే అయినట్టు, తొందర తొక్కిడి జీవితాల్లో... మన ఉరుకుల పరుగుల కంగాళీ బతుకుల్లో కదలాడే వేనవేల వెలుగునీడల్ని కెమెరా కంటితో ఒడిసిపట్టే కళ కూడా ఒక్కటే- అదే ఫొటోగ్రఫీ. కాంతి కుంచెతో గీసే ఈ బొమ్మలన్నీ కేవలం కెమెరా మహత్తు మాత్రమే కాదు, ఆ కెమెరా వెనక రిక్కించిన ఓ కంటి గమ్మత్తు కూడా. ఫొటోగ్రఫీయే శ్వాస, ధ్యాస అయిన ఆ కన్ను పేరు- తమ్మా శ్రీనివాసరెడ్డి. విజయవాడ కేంద్రంగా ఎల్లలులేని దృశ్య ప్రపంచాన్ని తన కార్యక్షేత్రంగా చేసుకున్న ఫొటో జర్నలిస్ట్ శ్రీనివాసరెడ్డిని పరిచయం చేసుకుందాం.

కృష్ణానదీ తీరాన ఉండవల్లి గ్రామానికి చెందిన తమ్మా శ్రీనివాసరెడ్డి 1984లో ఫొటోగ్రఫి రంగంలోకి అడుగుపెట్టి గత ఏడాది ఫొటోగ్రఫి రంగంలో నోబెల్ బహుమతిగా పరిగణింపబడే 'ఫెలోఆఫ్ ది రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ' అనే అత్యున్నతమైన గౌరవాన్ని సాధించారు. 1853వ సంవత్సరంలో లండన్ కేంద్రంగా ప్రారంభించబడిన రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఫొటోగ్రఫి రంగంలో విశేషంగా కృషిచేసిన వారిని గుర్తిస్తూ ఫెలోషిప్ అవార్డుతో సత్కరిస్తోంది. ఈ ఏడాది ఇరువురు ఎంపికకాగా, ఒకరు భారతీయుడైన శ్రీనివాసరెడ్డి మన తెలుగువాడు కావటం మనందరకు గర్వ కారణం.


భారతదేశంలోని గ్రామీణ సౌందర్యాన్ని గత మూడు దశాబ్దాలుగా దేశంలోని వివిధ రాష్ట్రాలు తిరుగుతూ గ్రామీణ స్థితిగతులు, పల్లెలలో నివాసం ఉండే జీవనశైలిని తన ఫొటోల ద్వారా బాహ్య ప్రపంచానికి చూపించారు. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, నాగాలాండ్, మేఘాలయ, జమ్మూకాశ్మీర్, లడక్‌లలోని మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉండే గిరిజనులతో మమేకమై వారి సాంప్రదాయ జీవన విధానంపై పలు ఫొటో డాక్యుమెంటరీలను చిత్రీకరించారు. ఎన్నో కష్టాలను అధిగమించి 'భారతీయ గిరిజన శైలి' అనే అంశంపై పలు పోర్టు ఫోలియోలను వివిధ దేశాలలో జరిగిన ఫొటో ప్రదర్శనలలో ప్రదర్శించారు. 2000 సంవత్సరంలో వీరిపై పంపిన డాక్యుమెంటరీ చిత్రాలకు రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ అసోసియేటోషిప్ అనే పురస్కారాన్ని ప్రకటించింది. 2006 సంవత్సరంలో రామ్‌నాథ్ గోయంకా పేరు మీద అందించే ఫొటోజర్నలిజంలో అత్యున్నతమైన ఇండియాప్రెస్ ఫొటో అవార్డును అందుకున్నారు. ఎంతో వేగంగా గిరిజనుల్లో వస్తున్న మార్పులను పసిగట్టిన శ్రీనివాసరెడ్డి ముందు తరాల వారికి తన ఫొటోల ద్వారా చరిత్రను చూపించాలనే తపనతో ఈ అంశాన్ని ఎంచుకుని చిత్రీకరించారు. స్వతహాగా వ్యవసాయ కుటుంబం నుండి రావటంతో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ విధానంపై పలు ఫొటో డాక్యుమెంటరీలు చిత్రీకరించారు. డా॥ కొప్పుల హేమాద్రిగారితో భారతదేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి వనమూలికల ఛాయాచిత్రాలు చిత్రీకరించారు. 1987లో ఫొటో జర్నలిజంలోకి అడుగుపెట్టి పలుపత్రికలలో ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేశారు. అత్యధికకాలం ఇండియా టుడేకి ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేశారు. 1990 దశకం నుండి ఆర్ట్ ఫొటోగ్రఫిపై దృష్టి పెట్టి దేశంలో, ప్రపంచంలో పేరుగాంచిన ఫొటో సంస్థల్లో సభ్యుడిగా



Kambala Race in Karnataka



Maha Mastakaabhisheka of Gomateshwar in Sravana Belagola



300 years (1675 AD) old step well in Mylacherla, Prakasham District, Andhra Pradesh



Reflection Lunar Eclipse on Kanakadurga Temple in Vijayawada

చేరి, ఫొటోగ్రఫిలో కొత్తమలుపులపై దృష్టి సారించారు. బ్లాక్ అండ్ వైట్, కలర్, నేచర్, వైల్డ్‌లైఫ్, ఫొటోజర్నలిజం, ఫొటోట్రావెల్ అనే ఆరు అంశాల్లో జాతీయ, అంతర్జాతీయంగా జరిగే ఫొటోగ్రఫి పోటీలకు ఛాయాచిత్రాలను పంపుతూ గుర్తింపు తెచ్చుకున్నారు.

1994, 2006, 2018 సంవత్సరాలలో వరుసగా కర్నాటకలోని శ్రావణ బెళగొళలో జరిగిన గోమటేశ్వర స్వామివారి మహా కుంభాభిషేకాన్ని తనదైనశైలిలో చిత్రీకరించారు. భారతదేశంలో జరిగే పలు పండుగలపై దృష్టిపెట్టి ఎక్కడ ఉత్సవాలు జరిగినా తన కెమెరాకు పనిపెట్టి చిత్రీకరించారు.

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జరిగే మహాకుంభమేళ, పుష్కర్, లఢక్ ఉత్సవాలు, ఈశాన్య భారతంలో జరిగే గిరిజనుల ఉత్సవాలు, తమిళనాడులో ప్రతి సంక్రాంతికి మధురైలో జరిగే జల్లికట్టు, కర్నాటకలోని మంగుళూరు, ఉడిపి ప్రాంతాల్లో జరిగే కంబాలా, భూతకోళ ఉత్సవాలను, కేరళలో జరిగే 'తెయ్యం' సాంప్రదాయిక ఉత్సవాలను క్రమం తప్పకుండా చిత్రీకరిస్తున్నారు.

ప్రపంచంలోనే అత్యధిక ఫొటోగ్రఫి వనరులు ఒక్క భారత దేశంలో ఉన్నాయనే విషయాన్ని తన చాయాచిత్రాల ద్వారా నిరూపించారు. ఫొటోగ్రఫి సొసైటీ ఆఫ్ అమెరికా, రాయల్ ఫొటోగ్రఫి సొసైటీ ముద్రించే జర్నల్స్‌లో ట్రావెల్ అంశాలపై పలు వ్యాసాలు రాసి విదేశీయులు ఆకర్షితులు కావటానికి తనవంతు కృషిచేశారు. ఏడాది పొడవునా ప్రతి రుతువులో ఓ ప్రత్యేకతను సంతరించుకునే భారతదేశం 365 రోజులు ఫొటోగ్రఫి చిత్రీకరణకు అనుకూలంగా ఉండే వాతావరణం అని తెలియజేస్తు ఉత్సవాలు, పండుగలు, పుష్కరాలు, గ్రామీణ ఆటలపోటీలు, గిరిజనుల సంబరాలపై వారు తీసిన చిత్రాలు అన్నీ ఆసియా దేశాల్లో ప్రదర్శించారు. భారత ప్రభుత్వం ఫొటో డివిజన్‌వారు ప్రతి ఏడాది వివిధ అంశాలపై నిర్వహించే ఫొటోగ్రఫి పోటీల్లో ప్రధమ అవార్డులను వరుసగా పొందారు. గుజరాత్, లక్నో లలితకళ అకాడమిల నుండి అవార్డులను పొందారు. భారతదేశంలోని ప్రముఖమైన 38 మెమోరియల్ అవార్డులను అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిన ఫొటోగ్రఫి సంస్థలలో అత్యున్నతమైన పురస్కారాలు సాధించారు.

భారతదేశంలో పనిచేసే పలు ఎన్‌జిఓ సంస్థలతో కలసి పలు డాక్యుమెంటరీలు తీశారు. ముఖ్యంగా జోగిని స్త్రీలు, స్టూవర్టుపురం గిరిజనులు మారిన విధానం, సంస్కరణ కార్యక్రమాలకు సంబంధించిన పాత ఛాయాచిత్రాలు కనుమరుగు కాకుండా తిరిగి వాటిని భద్రపరిచేందుకు కృషిచేశారు. కొండవీడు రెడ్డిరాజుల పరిపాలనా ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తిరిగి డాక్యుమెంటరీని చిత్రీకరించారు. రామప్ప దేవాలయంపై 2016లో వారు తీసిన డాక్యుమెంటరీ ఎన్నో ప్రశంసలను పొందింది. 1977లో సంభవించిన ఆంధ్రప్రదేశ్ దివిసీమ ఉప్పెనపై ఆనాటి ఫొటోలను సేకరించి నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్టుగా ఓ పుస్తకం రూపంలో ముద్రించారు.

రాష్ట్ర ప్రభుత్వం 2013లో ఉగాది పురస్కారంతో సత్కరించింది. 2016లో అత్యున్నతమైన హంస కళారత్న పురస్కారంతో సత్కరించింది. 2019లో మాస్టర్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫి సంస్థ నుండి తొలి అవార్డును శ్రీనివాసరెడ్డి సాధించారు. గత 75 సం॥గా భారతదేశంలో ఈ సంస్థ ఎంతోమంది ప్రతిభను



Tribal women: Manifestation of life



Salt Ponds



గుర్తిస్తూ అవార్డులు అందజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిన అనేక ఫొటోగ్రఫి సంస్థలు 19 గౌరవ పురస్కారాలతో సత్కరించాయి. ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం నుండి 2012 సంవత్సరంలో ఫొటో జర్నలిజంలో జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారు. 2015 సంవత్సరంలో అమెరికాలోని ప్రముఖ ఫొటోగ్రఫి సంస్థ ఇమేజ్ కొలీగ్ సొసైటీ నుండి ఒకే ఏడాది 7 అంతర్జాతీయ పురస్కారాలు సాధించినందులకుగాను గ్రాండ్ మాస్టర్ సత్కారం అందుకున్నారు. గత 32 సంత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా జరిగే ఫొటోగ్రఫి పోటీలలో పాల్గొంటూ 183 బంగారు పతకాలు, 494 అవార్డులు, 890 ప్రశంసాపత్రాలతోపాటు వీరు తీసిన 5847 ఛాయాచిత్రాలు వివిధ అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శింపబడ్డాయి.

2020-2021 సంవత్సరంలో కోవిడ్ మహమ్మారిపై ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, ఉత్తరప్రదేశ్‌లలో తిరిగి చిత్రీకరించారు. తన ప్రాణాలకు తెగించి శ్రీనివాసరెడ్డి చూపిన చొరవను రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రత్యేకంగా అభినందించింది. కోవిడ్-19 మహమ్మారి బారినపడిన సామాన్యులను రక్షించడానికి భారత దేశంలో వివిధ ప్రభుత్వాలు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు పడిన కష్టాన్ని కళ్లకు కట్టినట్లుగా శ్రీనివాసరెడ్డి చిత్రీకరించారు. ఐసియు వార్డుల్లో, వీధుల్లో, స్మశాన వాటికల్లో, వివిధ మారుమూల ప్రదేశాల్లో ఆవిష్కృతమైన హృదయవిదారక సన్నివేశాలను, అక్కడ సేవ లందిస్తున్న కోవిడ్ వారియర్స్‌ను ఆయన తన ఛాయాచిత్రాలలో ప్రపంచం ముందుంచారు. శ్రీనివాసరెడ్డి ప్రదర్శించిన ఈ తెగువకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. ఇది కేవలం ఆయన ప్రతిభకు మాత్రమే పురస్కారంకాదు. ఈ శతాబ్దిలో సంభవించిన మహమ్మారిపై విజయానికి, ప్రజాస్వామిక ప్రభుత్వాల కృషికి ఇది గుర్తింపు. తమ కుటుంబాలను సైతం విస్మరించి వ్యాధిపై పోరాడిన కోవిడ్ వారియర్స్‌కు ఈ అరుదైన పురస్కారం ఒక ఆత్మీయ వలకరింపు. జర్నలిజంలో భారతీయులు ప్రపంచస్థాయికి తీసిపోరని ఋజువు చెయ్యడానికి ఈ అవార్డు ఒక ఆదరింపు. భారతీయ కళాప్రజ్ఞకు నిఖార్స యిన బహుమానంగా దీన్ని పేర్కొనవచ్చు.

భారతదేశంలోని ప్రముఖుల ఛాయా చిత్రాల ప్రదర్శనలు ఏర్పాటుచేసి వారిని సత్కరించటంలో శ్రీనివాసరెడ్డి ప్రధానపాత్ర వహించారు. 2021 మార్చి 31 నాటికి భారత ముప్పన్నెల జెండా రూపకల్పన జరిగి నూరు వసంతాలు నిండిన సందర్భంగా విజయవాడలోని చారిత్రాత్మకమైన బాపు మ్యూజియంలో ఫొటో ప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఇదే ప్రాంగణంలో నాటి రూపకర్త శ్రీ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకానికి జాతిపిత మహాత్మాగాంధి ఆమోదముద్ర వేశారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా శ్రీనివాసరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమీల సహకారంతో జాతీయ ఛాయా చిత్రపోటీలను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఫొటోగ్రఫి అకాడమి ఆఫ్ ఇండియా సంస్థకు ఛైర్మన్‌గాను, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ సంస్థలకు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ అకాడమి ఆఫ్ ఫొటోగ్రఫి సంస్థకు అధ్యక్షులు గాను, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమికి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భారతదేశంలో ఎంతోమంది ఔత్సాహికులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభకు తగిన గుర్తింపు వచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నారు.



డా॥ కొంపల్లి సుందర్ చరిత్రకారుడు, సాంఘిక కార్యకర్త, విశ్లేషకుడు. నేషనల్ బుక్‌ట్రస్ట్, ప్రఖ్యాత అంతర్జాతీయ ప్రచురణ సంస్థ రూట్ లెడ్జ్ వీరి రచనలు ప్రచురించాయి. ప్రముఖ సంఘ సంస్కర్తలు హేమలత-లవణం దంపతుల కార్యక్రమాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. అనేక ఫొటోగ్రఫీ సంస్థల్లో జీవితకాలం సభ్యులుగా ఉన్నారు. 2013లో డాలస్‌లో జరిగిన తానా మహాసభల్లో పాల్గొన్నారు. తన రచనావ్యాసంగాన్ని కొనసాగిస్తూ విజయవాడలో నివసిస్తున్నారు.

శతజయంతి వందనాలు





100



MOVERS.Com™

For All Your Moving Needs

Over 20 Years of Experience in the Moving Industry



Vidyadhar Garapati
Movers.com - CEO



Local Movers



Long Distance Movers



Auto Shipping



International Movers

For FREE Moving Quotes

Call Us:
1-866-343-1243

Visit:
WWW.MOVERS.COM

శతజయంతి మూర్తులకు వందనాలు

నందమూరి తారక రామారావు

1. జగదేక వీరుడు ఎన్టీఆర్ - రెంటాల జయదేవ 159
2. తెలుగు సమాజం మీద చెరగని సంతకం - కందుల రమేష్ 169
3. దర్శకుడిగా ఎన్.టి.ఆర్. - విజయ చంద్రహాస్ మద్దుకూరి 175
4. నాన్నగారిలా... నూటికో కోటికో ఒక్కరే - దగ్గుబాటి పురందేశ్వరి 185
5. వెయ్యేళ్ల నన్నయ్య - వందేళ్ల నందమూరి - ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ 189

ఘంటసాల వెంకటేశ్వరరావు

6. అమృతశాల ఘంటసాల - పి.ఎస్. గోపాలకృష్ణ 193
7. మమతానురాగ నిలయం నాన్నగారి హృదయం - శాంతి సురేంద్రకుమార్ 197

అల్లు రామలింగయ్య

8. హాస్యానికి పుట్టిల్లు - అల్లు - కిరణ్ ప్రభ 201

FOUR OAKS INSURANCE GROUP

Insurance Done Right ✓



PERSONAL INSURANCE

- Auto Insurance
- Home & Flood Insurance

EMPLOYEE BENEFITS

- Group Life
- 401 (K) Plan
- Short & long term disabilities
- Group Health, Dental & Vision

BUSINESS INSURANCE

- General Liability
- Workers' Compensation
- Professional Liability
- Crime
- Cyber Liabilities
- Builder's Risk/Construction
- EPLI & D&O

WE WORK WITH

IT Companies	Retail & Wholesale stores
Bars & Restaurants	Truckers & Gas stations
Real Estate & Constructions	Day & Adult care
Hotels & Motels	Doctors & Healthcare Facilities

CONTACT US : 346-299-2265 www.fouroaksinsurance.com

1330 Post Oak Blvd #1200 Houston, TX 77056

జగదేక వీరుడు - ఎన్టీఆర్

రెంటాల జయదేవ



'నూటికో కోటికో ఒక్కరు... ఎప్పుడో ఎక్కడో పుడతారు..!' 1980లలో వచ్చిన విశ్వరూపం చిత్రంలోని ఓ పాపులర్ పాట ఈ పల్లవితోనే మొదలవుతుంది. అప్పుడైనా, నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఇప్పుడైనా... ఆ పంక్తులు ఆ సినిమాలోని కథానాయక పాత్రకే కాదు... పాత్రధారికీ అక్షరాలా సరిపోతాయి. అడుగుపెట్టిన రంగం ఏదైనా అనన్య సామాన్యంగా ఎదిగి, అందరి హృదయాల్లో చిరకాలంగా మిగిలిన ఒక్కడు- ఎన్టీఆర్. నూరు దాటేసి నూట యాభై కోట్లకు దగ్గరవుతున్న భారతీయుల్లో నేటికీ ఒకే ఒక్కడు ఎన్టీఆర్.

అసామాన్యుడిగా ఎదిగిన సామాన్యుడిగా, తెలుగు సినీ సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తిగా, రాజకీయాల్లో విప్లవం తెచ్చిన నూత్న పథగామిగా నందమూరి తారక రామారావు వ్యక్తిగత, సినీ, రాజకీయ ప్రస్థానం ఓ మహా సాగరం. సముద్రాన్ని దోసిలిలో పట్టడం అసాధ్యం. కొండను అద్దంలో చూపడం కష్టం. అందుకే, ఆ శిఖరాయమానుడి అనేక పార్శ్వాల్లోని కొన్ని అంశాల ప్రస్తావనే ఈ శతజయంతి చిరు నివాళి వ్యాసం.

ఎన్టీఆర్ అనే మూడక్షరాల పేరు ఇవాళ్టికీ ప్రపంచం నలు మూలలా తెలుగువారి మనసుల్లో ఆనందాన్నీ, గుండెల నిండా గర్వాన్నీ నింపుతుంది. ఆ స్థాయికి చేరిన ఆయన పుట్టింది అతి సామాన్య రైతు కుటుంబంలో! ఒకప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంతంలో కృష్ణాజిల్లా నిమ్మకూరు గ్రామంలో నందమూరి లక్ష్మయ్య, వెంకటరామమ్మ దంపతులకు 1923 మే 28న ఆయన జన్మించారు. ఆ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం.


ఎన్టీఆర్, ఆయన తమ్ముడు త్రివిక్రమరావులు రామలక్ష్మణులుగా పెరిగారు. విజయవాడలో పాఠశాల విద్య, గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో బి.ఏ. పూర్తిచేశారు ఎన్టీఆర్. 1947లో మద్రాస్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఎంపికై, గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో సబ్ రిజిస్ట్రార్‌గా చేరారు. అక్కడి అవినీతి వ్యవహారాల మధ్య ఇమడలేక కొద్దిరోజులకే ఉద్యోగం వదిలేసి, ఆనక సినిమాల్లో ప్రవేశించి, అక్కడ 'ఇంత వాడల్లా... అంతవాడై', తారాపథంలోకి ఆయన ఎగసిన తీరు స్ఫూర్తినిచ్చే అధ్యాయం.

ఇంతవాడల్లా... అంతవాడై...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో తెలుగుతెరకు దక్కిన కోహినూర్ ఎన్టీఆర్. రావడం రావడమే ఆయన హీరోగా వచ్చారు, క్లిక్కయ్యారు. అంతా కలిపి అరడజను సినిమాలు దాటాయో లేదో సినిమాల్లో స్టారయ్యారు. దాదాపు 33 ఏళ్ల సుదీర్ఘ సినిమా కెరీర్‌లో 298 సినిమాలు చేశారు. సినీరంగం వదిలేసి, రాజకీయాల్లోకి వెళ్లాక తన కళాతృష్ణను తీర్చుకొనేందుకు అడపా దడపా అంతా కలిపి మరో 4 సినిమాలు చేశారు. మొత్తం ఈ 302 సినిమాల్లో ఆయన చేసినన్ని విభిన్న కోవల సినిమాలు, వేసినన్ని వైవిధ్యభరితమైన పాత్రలు, నట-దర్శక-నిర్మాతగా పండించినన్ని ప్రయోగాలు న భూతో న భవిష్యతి!

ఎన్టీఆర్ నటించిన 302 చిత్రాల్లో 123 సినిమాలు కాస్ట్యూమ్ డ్రామాలు. విభజించి, వివరంగా చెప్పాలంటే- పౌరాణికాలు 48, జానపదాలు 57, చారిత్రకాలు 18. ఏ దేశ సినీచరిత్రలోనూ ఈ స్థాయి అరుదైన విన్యాసం చేసిన మరొకరు కనిపించరు. ఆయన చిత్రాల్లో సింహభాగం భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ప్రాచీన సాహిత్యం, పురాణేతిహాసాలు, మానవ విలువలు, కుటుంబ అనుబంధాలను ప్రతిఫలించినవే. తెలుగు సినీ పరిశ్రమకు ఆయన సాధించి పెట్టిన అనేకానేక ఘనతల జాబితా సుదీర్ఘమైనది.

ఇవాళ్టి ఆదిపురుష్, శాకుంతలం చిత్రాల నాటికి కూడా పురాణ పురుషులన్నా, పౌరాణికాలన్నా ఎన్టీఆరే గుర్తుకు వస్తున్నా రంటే... ఆయన వేసుకున్న పునాది అలాంటిది. రామాయణ, భారత, భాగవతాలను చిన్నప్పుడే ఆపోశన పట్టిన బాల రాముడాయన. అందుకు... ఎన్టీఆర్ తండ్రికి పెద్ద తోడల్లుడు, ఎన్టీఆర్‌కు





వరుసకు పెదనాన్న అయిన రామయ్య ప్రభావం ఎంతో ఉంది. ఆ రోజుల్లో రామయ్య రంగస్థల నటులు. 'షోకు రామయ్య'గా నలుగురిలో ప్రాచుర్యం పొందినవారు. రామయ్య వల్ల ఎన్టీఆర్‌కు కూడా రంగస్థలంపై ఆసక్తి పెరిగింది. విద్యార్థిగా ఉన్న రోజుల నుంచే నాటకాల్లో వేషాలు వేశారు. మరికొంత పెద్దయ్యాక 'నేషనల్ ఆర్ట్ థియేటర్' (ఎన్.ఎ.టి) పేర రంగస్థల సమాజాన్ని నెలకొల్పి, దేశభక్తి ప్రపూరిత అంశాలతో నాటకాలు ప్రదర్శించారు.

ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో... తన కెరీర్‌లో రిలీజైన తొలి చిత్రం మనదేశం (1949)తో తెలుగు సినీ ప్రేక్షకులను పలకరించారు. తదుపరి చిత్రాలు రిలీజు కాకముందే ప్రసిద్ధ విజయా ప్రొడక్షన్స్ సంస్థ నెలసరి జీతంతో స్టాఫ్ ఆర్టిస్టుగా తీసుకొనేంతగా ఆ తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకొన్నారు. నిర్మాతలు నాగిరెడ్డి చక్రపాణి జంట ఆ తరువాత తమ బ్యానర్‌లో నిర్మించిన చిర స్మరణీయ చిత్రాల్లో పాత్రపోషణ చేశారు. ఆ చిత్రాలు నేటికీ తెలుగు సినీచరిత్రలో ఆణిముత్యాలుగా మిగిలిపోవడం అవిస్మరణీయం. విజయాసంస్థలో నటించిన రెండో చిత్రమైన, కె.వి. రెడ్డి దర్శకత్వ ప్రతిభాసుమ జానపదం పాతాళభైరవి (1951) అపూర్వ విజయం సాధించింది. సంచలనం సృష్టించింది. తెలుగు సినీచరిత్రలో తొలి స్వర్ణోత్సవ చిత్రమైంది. మారు మాట్లాడే అవకాశం మరొకరికి ఇవ్వకుండా ఎన్టీఆర్ సూపర్ స్టార్‌గా అవతరించారు. అంతే... ఆ తరువాత ఎన్టీఆర్ ఇక ఎన్నడూ వెనుతిరిగి చూసే పరిస్థితి రాలేదు.

జానర్ ఏదైనా... జన హృదయ విజేత!

పురాణ పురుషులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, వేంకటేశ్వరుడు- ఇలా ఎన్నో పాత్రలను శ్వాసించి, తెలుగుతెరను శాసించి... తెలుగువారి హృదయాల్లో ఆరాధ్య దైవమయ్యారు ఎన్టీఆర్. చిత్రం ఏమిటంటే ఈ దేవతా పాత్రల్లో ఎంత గొప్పగా రాణించారో, అంతే గొప్పగా రావణబ్రహ్మ, దుర్యోధనుడు, ఇంద్ర జిత్తు, కీచకుడులాంటి పురాణ ప్రతినాయక పాత్రల్లోనూ జీవించారు. ఆయనలాగా లెక్కకు మిక్కిలి పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసినవారు ప్రపంచ సినీచరిత్రలో మరొకరు కనిపించరు. ఇది స్తవం కాదు... వాస్తవం!

జానపదాల్లో అసమాన స్థాయిలో 57 చిత్రాల్లో ఎన్టీఆర్ నటించారు. మరీ ముఖ్యంగా, ఆ తరహా చిత్రాల్లో కథా సందర్భానికి తగ్గట్టు అనేకానేక మారువేషాల్లో తెరపై కనిపించి, సామాన్య జనాన్ని మురిపించారు. మైమరపించారు. కత్తి పడితే ఎన్టీఆరే... గుర్రంపై కదం తొక్కితే ఎన్టీవోడే... కథానాయికతో తెరపై అచ్చికబుచ్చిక లాడితే అచ్చమైన మన ఇంటివాడే! ప్రత్యర్థిని ఓ పట్టుపట్టినా, మాంత్రికుడిని మట్టుబెట్టినా మనోడే! సమాస భూయిష్ఠ సుదీర్ఘ సంభాషణలు భావస్ఫోరకంగా చెబుతూనే అపూర్వంగా అభిన యించినా, 'రాచరికమా అర్హతను నిర్ణయించునది...' అని రాజసం గానే నిలదీసినా అవాళ్టికీ ఇవాళ్టికీ నందమూరి సినీ ప్రేక్షకుల 'ఆనంద'మూరి. అంతటి నటుడి అనువాద చిత్రాలు చూసి, దక్షిణాదివారే కాదు... హిందీ, బెంగాలీ చిత్రాల ప్రేక్షకులూ జేజేలు కొట్టారు.

చారిత్రక చిత్రాల్లో ఎన్టీఆర్ తన వేషభాషలతో శభాష్ అనిపించుకున్నారు. బొబ్బిలి యుద్ధం (1964)లో రాజా రంగ రాయలు అయినా, పల్నాటి యుద్ధం (1966)లో బ్రహ్మ నాయుడైనా, తెనాలి రామకృష్ణ (1956), మహామంత్రి తిమ్మరసు (1962) చిత్రాల్లో శ్రీకృష్ణ దేవరాయలు అయినా మన చరిత్రలోని ముద్దుబిడ్డల్ని కళ్ల ముందు నిలిపారు ఎన్టీఆర్. చారిత్రక, సాహితీ ధురంధరుల జీవితాల ఆధారంగా తీసిన హిస్టారికల్ బయోగ్రఫీ చిత్రాలైన వేములవాడ భీమకవి (1976), శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (1984), శ్రీనాథ కవిసార్వ భౌమ (1993) లాంటివి ఈ విశ్వవిఖ్యాత నటసార్వభౌముడి ప్రత్యేక అభిరుచికి ప్రతీకలు.

ఇలా ఏ కోవకు చెందిన పాత్రనైనా తనలో ఆవాహన చేసుకొని, తెరపై అద్భుతంగా ప్రదర్శించడం నటుడిగా ఎన్టీఆర్ జీవలక్షణం.



ప్రేక్షకులకు... సోషల్ టీచర్!

సాంఘిక చిత్రాల్లోనూ ఎన్టీఆర్ సత్తా అమోఘం. ఆయన సినిమాలు అనేకం ఆనాటి సామాజిక పరిస్థితులకు వెండితెర దర్పణాలు. సోషియో హిస్టారికల్ డాక్యుమెంట్లు. పెళ్లి చేసి చూడు (1952)లో వరకట్నానికి వ్యతిరేకంగా పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకొనే అభ్యుదయవాద నవతరం కనిపిస్తుంది. పిచ్చిపుల్లయ్య (1953), తోడుదొంగలు (1954) చిత్రాలను స్వయంగా నటిస్తూ, నిర్మిస్తూ, ఆనాటి సామాజిక రుగ్మతలను ఆర్ట్ ఫిలిమ్ పద్ధతిలో చూపారు. అవార్డులు సాధించారు.

నెహ్రూ తరహా సామ్యవాదాన్నీ, 'ఆనకట్టలే ఆధునిక భారత దేవాల యాలు,' అన్నస్ఫూర్తినీ తెలుగుతెరపైకి తీసుకొచ్చారు. స్వాతంత్ర్యానంతర, 'దేశమ్ము మారిందోయ్... కాలమ్ము మారిందోయ్,' అనే ఆశాభావం కలిగిం చారు. కండల్ని కరిగించి, బండల్ని తొలగించి, భాగ్యాల్ని పండించి, గ్రామాల్ని వెలిగించమనే దేశాభ్యు దయ మంత్రాన్ని వల్లెవేశారు. సందేశాత్మక ప్రబోధ గీతాలతోపాటు నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణ దృశ్యాలకు సంబంధించి రాముడు-భీముడు (1964) ఇవాళ తెలుగు తెరపై మిగిలిన విజువల్ డాక్యుమెంట్.

అలాగే, 1970ల ముందు వరకు దేశంలో ప్రవేశపెట్టిన సమష్టి వ్యవసాయ విధానాన్ని అనేక సినిమాల్లో ఎన్టీఆర్ పాత్రలు చర్చిస్తాయి. ప్రజలకు సందేశమిస్తాయి. ఆ తర్వాత వచ్చిన సామాన్యులకు రేషన్ బియ్యం, సరుకుల విధానాన్నీ, అందులోని సమస్యలు, పరిష్కారాలను ఆ కాలంలోని తన సినిమాల్లో నూటికి 75 వాటిల్లో ఎన్టీఆర్ ప్రతిఫలించారు.

వ్యష్టి కుటుంబాలు, వేరు కాపురాలు ఎక్కువవుతున్న రోజుల్లో కుటుంబవ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో... ఉమ్మడి కుటుంబాలను సమర్థిస్తూ ఎన్టీఆర్ ఉమ్మడి కుటుంబం (1967) చిత్రాన్ని నిర్మించారు. స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే రాసి, నటించి, నిర్మించి, అశేష ప్రజానీకాన్ని మెప్పించారు. నాటి భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రతి రూపంగా ఈ చిత్రాన్ని మాస్కో అంత ర్జాతీయ చలనచిత్రోత్సవంలో మనదేశం తరఫున ప్రదర్శనకు నాటి ప్రభుత్వం ఎంపిక చేయడం విశేషం.

దర్శక, నిర్మాతగానూ వరకట్న దురాచారాన్ని నందమూరి నిరసించారు.



స్వీయ దర్శకత్వంలో నటిస్తూ, నిర్మించిన వరకట్నం (1969) చిత్రం అందుకు ప్రత్యేక ఉదాహరణ. జాతీయ అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా తొలిసారిగా నగదు బహుమతి అందుకున్నారు. ఆనాటి ఆ బ్లాక్ అండ్ వైట్ సెల్యులాయిడ్ చిత్రాన్ని డిజిటలైజ్ చేసి, ఇటీవల 2019లోనూ గోవాలోని వార్షిక 'భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం' (ఇఫీ)లో ప్రత్యేకంగా ప్రదర్శించడం విశేషం.

ఇక, తెలుగు తెరపై హీరో ఒక రాజకీయ నాయకుడిగా ప్రజల కోసం పాటుపడడమనే కథాకథనాలకు కథా నాయకుడు (1969) చిత్రమే ప్రారంభం. ఇదే కథ తర్వాత తమిళ, హిందీ భాష ల్లోనూ సంచలన విజయాలు సాధించింది. తర్వాత కాలంలో దేశంలో ముఖ్యమంత్రు లైన ముగ్గురు సినీతారలు ఎమ్జీఆర్, ఎన్టీఆర్, జయలలితల సినిమా కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవడం గమనార్హం.

తెలుగుజాతి, ప్రాంతాల సమైక్య తను నమ్మిన ఎన్టీఆర్ తన సినిమాలోనూ అవకాశం తీసుకొని మరీ ఆ మాటే చెప్పారు. 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా నడుస్తూ, అల్లర్లు, విధ్వంసం రేగుతున్న రోజుల్లో, హైదరా బాద్‌లో అనేక ఆస్తులున్నప్పటికీ ఎన్టీఆర్ ధైర్యంగా సమైక్యవాదం వైపే నిలిచారు. తల్లా? పెళ్లామా? (1970) చిత్రంలో సమైక్యవాదాన్ని సమర్థిస్తూ, 'తెలుగు జాతి మనది... నిండుగ వెలుగు జాతి మనది...' అంటూ సినారెతో ప్రత్యేకంగా పాట రాయించి పెట్టారు. అదీ ఎన్టీఆర్ నిబద్ధత, నిండు గుండె ధైర్యం.

స్వామీజీలు, బాబాలు, వారి ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు సైతం క్యూలు కట్టడం ఎక్కువైన కాలం అది. అప్పట్లో ఎన్టీఆర్ తన సొంత సినిమా కోడలు దిద్దిన కాపురం (1970)లో బాబాలనూ, వారి వ్యవహారాలనూ ఎండగడుతూ సన్నివేశాలు పెట్టారు. ఇవాళ ఎవరూ కలలో కూడా సాహసించలేని విధంగా... సాక్షాత్తూ రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు సైతం సందర్శించే సత్య సాయిబాబాను పోలిన పాత్రను సినిమాలో చూపెట్టి, దుస్సం ప్రదాయాలను విమర్శించారు ఎన్టీఆర్.

మరో సొంత సినిమా తాతమ్మకల (1974)లో రైతు సమస్య లను చర్చిస్తూనే, అప్పట్లో ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన కుటుంబ నియంత్రణ విధానాన్ని సైతం ఆయన బాహాటంగా వ్యతిరేకించారు. అప్పట్లో అది మరో సంచలనం. ఇలా సమకాలీన అంశాలను సినిమాల్లో చూపడానికీ, వాటిపై తనదైన వెండితెర వ్యాఖ్యానం చేయడానికీ ఎన్టీఆర్ ఎన్నడూ వెనుకాడలేదనడానికి ఎన్నో ఉదాహరణలు!

ఒక్కమాటలో- సందేశాత్మక చిత్రాలు, సమకాలీన రాజకీయ వ్యవస్థపై ధ్వజమెత్తిన చిత్రాలతో ఎన్టీఆర్ జనం హీరో అయ్యారు. ప్రతి కథలో ఆయన ఎప్పుడూ సామాన్యుడి పక్షమే నిలిచారు. దుర్మార్గులకూ, పెత్తందార్ల దోపిడీ వ్యవస్థకూ వ్యతిరేకంగా పోరాడే వీరుడిగా తెరపై గెలిచారు. తాను అంతకు ముందెన్నడూ అనుకోని... తరువాతి రాజకీయ జీవితానికి తిరుగులేని మాస్ ఇమేజ్ సంపాదించారు.



పరిశ్రమను పెంచిన పెద్ద హీరో

నిజానికి, ఒక నటుడు కష్టపడితే హీరో కావచ్చు. ఒక హీరో సిన్సియర్‌గా శ్రమిస్తే జనాదరణ పొందవచ్చు, బాక్సాఫీస్ హిట్లు సాధించవచ్చు. బాక్సాఫీస్ హిట్లు వచ్చిన తారలు చాలామందే ఉండవచ్చు. కానీ, ఎదిగే తన ప్రయాణంలో తాను నమ్ముకొని వచ్చిన పరిశ్రమను కూడా శిఖరాయమాన స్థాయికి తీసుకువెళ్లిన మహానటులు నూటికో కోటికో ఒక్కరే ఉంటారు. తెలుగు సినీ పరిశ్రమలో అలాంటి ధ్రువతారక ఎన్టీఆర్.

జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నందమూరి తారక రామారావు సినీరంగానికి వచ్చేసరికి తెలుగు సినీ పరిశ్రమ ఏటా సగటున 10 చిత్రాలు ఉత్పత్తి చేస్తోంది. ఆయన హీరోగా సినీరంగాన్ని వదిలేనాటికి అది సగటున 100 సినిమాల స్థాయికి వచ్చింది. తెలుగు సినీసీమ ఆ స్థాయిలో పరిపుష్టం కావడంలో ఎన్టీఆర్‌ది కీలకపాత్ర. 'తక్కువ సినిమాలతో ఎక్కువ సంపాదన,' అనే నేటి సినీ నాయకుల సూత్రాలకు భిన్నంగా ఆయన ఒళ్లు దాచుకోకుండా కష్టపడ్డారు. వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేస్తూ, వేలాదిమంది ఉపాధికీ, నిర్మాణ, పంపిణీ, ప్రదర్శక శాఖలన్నిటా పరిశ్రమ సర్వతోముఖ పురోభివృద్ధికీ తోడ్పడ్డారు. 1949లో రిలీజైన తన తొలిచిత్రం మనదేశంతో ప్రారంభించిన ఎన్టీఆర్ మొదటి 20 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 200 సినిమాలు చేశారు. ఆ రకంగా చూస్తే... 1950-1970 మధ్య కాలాన్ని 'ఎన్టీఆర్ శకం'గా చెప్పవచ్చు.

ఆ నిర్ణీత కాలవ్యవధిలో ప్రతి ఏటా తెలుగులో రిలీజైన సినిమాల్లో కనీసం నగం నుంచి నగం పైనే ఆయన సినిమాలున్న సంవత్సరాలే ఎక్కువ. మచ్చుకు 1964లో తెలుగు సినీరంగం 24 సినిమాలు తీస్తే, అందులో 16 సినిమాలు, అంటే మూడింట రెండొంతులు ఎన్టీఆర్‌వే! అలా రాజకీయాల్లోకి రాకముందే సినిమాల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీ ఆయన సాధించారు. 90 ఏళ్ల పైచిలుకు తెలుగు టాకీ చిత్రాల చరిత్రలో ఇలా ఒక ఏడాది మూడింట రెండొంతుల సినిమాలు ఒక హీరో చేయడం అప్పటికీ, ఇప్పటికీ రికార్డు. పొరుగున తమిళ సినీ స్టార్ల చరిత్రలోనూ ఇలాంటి హీరో మరొకరు కనిపించరు. తెలుగు సినిమా ఎదుగుదలలో ఎన్టీఆర్ అవిస్మరణీయ కృషికి ఇది నిలువుటద్దం.



సక్సెస్ రేటులోనూ... స్టార్ ఆఫ్ ది స్టార్స్!

ఆ రెండు దశాబ్దాల కాలంలోని గణాంకాలను తీసుకుంటే ఎన్టీఆర్, మరో అగ్రనటుడు ఏఎన్నార్‌లు ఉమ్మడిగా దాదాపు 350 సినిమాల్లో హీరోలుగా నటించారు. అదే కాలంలో మిగతా అందరు హీరోలూ కలసి సుమారు 250 సినిమాల్లో మాత్రమే నటించగలిగారు. ఇది గమనించి తీరాల్సిన అంశం. అలాగే ఆ మొదటి ఇరవై ఏళ్లలో ప్రతి ఏటా ఎన్టీఆర్ నటించిన ఏదో ఒక సినిమా ఘన విజయాన్ని సాధించింది. పరిమితుల్ని ఛేదిస్తూ, పరిశ్రమ పరిధిని ఎప్పటికప్పుడు పెంచుతూ వచ్చింది. ఆ తరువాత కూడా రాజకీయాల్లో చేరడానికి సినిమాల నుంచి ఎన్టీఆర్ రిటైరయ్యే వరకు ఇతర నటులు ఆయనకు నీడలుగానే నిలిచారు. ఇది నిష్మరమైనా... సినీ విశ్లేషకులు చెప్పే నిజం.

రాజకీయాల్లో చేరడానికి కొద్దిగా ముందు ఎన్టీఆర్ నటించిన నాలుగు సినిమాలూ (సర్దార్ పాపారాయుడు -1980, కొండవీటి సింహం- 1981, జస్టిస్ చౌదరి -1982, బొబ్బిలిపులి -1982)... బాక్సాఫీస్ పరిభాషలో చెప్పాలంటే బ్లాక్ బస్టర్లు. అవినీతి రాజకీయ నేతపై పోరాడే స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాయతీపరుడైన పోలీసాఫీసర్, దుష్టశక్తుల్ని ఎదిరించే న్యాయమూర్తి, సమాజాన్ని సంస్కరించే సైనిక అధికారి... ఇవీ వరుసగా ఆ నాలుగు చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు. ఆ పాత్రలు, ఆ యా సినిమాల కథలు ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి బాటలు వేసేలా తెలివిగా తీర్చిదిద్దుకున్నవే! అన్నీ అద్భుత విజయాలతో ఆ లక్ష్యానికి దోహద పడినవే! మరోపక్క సినీపరిశ్రమ బాక్సాఫీస్ పరిధిని మరింత విస్తరించినవే!!

కెరీర్ మొత్తంగా చూస్తే... పరిశ్రమకు విజయాలు, విపరీతమైన కలెక్షన్ల ద్వారా తెలుగు పరిశ్రమను పెంచి పోషించిన సినిమాల్లో నటించినవారిలో ప్రథమస్థానం కూడా ఎన్టీఆర్‌దే! నాలుగు దశాబ్దాలుగా సినీవ్యాపార అనుభవజ్ఞుడు, పలు చిత్రాల కార్య నిర్వాహక నిర్మాత అయిన కొమ్మినేని వెంకటేశ్వరరావు మాటల్లో చెప్పాలంటే, "సదరు సినిమాలు సంపాదించిన ఆదాయం, థియేటర్లలో ఆ సినిమాలు నడిచిన రోజులను పరిగణిస్తే తెలుగు సినిమాలో ఎన్టీఆర్ సినిమాల

ఆక్యుపెన్సీ రేటు 75 శాతం. థియేటర్‌కు వచ్చే జనసంఖ్య దృష్ట్యా గణిస్తే, ఇతర భాషల హీరో లందరి కన్నా ఎన్టీఆరే పై మెట్టున ఉన్నారు.'' అందుకే... మిగతా నటులు భారమనుకొనే పాత్రలను అలవోకగా మెప్పించడంలోనే కాదు... బాక్సాఫీసును పెంచి పెద్దచేయడంలోనూ ఆయన అగ్రగణ్యులు.

కళామానసి... సినీసాహసి...

కథ, పాత్రల ఎంపిక నుంచి పాత్ర పోషణ దాకా ప్రతి విషయంలోనూ ఎన్టీఆర్‌ది సాహసమార్గం. సినిమా కెరీర్ అటు పతాక స్థాయిలో ఉన్నప్పుడూ, ఇటు పరాజయాలు ఎదురైనప్పుడూ ఆయన తన ప్రత్యేకతను నిలుపు కొన్నారు. నిండా నాలుగు పదుల వయసైనా లేకుండానే ఆయన నిండు, పండు ముదుసలిగా నటిస్తారు. ఆజన్మ బ్రహ్మచారి భీష్మ (1962) పాత్రధారణను అపూర్వమనిపిస్తారు. తెరపై డ్యాన్సులు చేస్తూ, ఈలలు వేయిస్తున్నప్పుడే బతకలేని బడిపంతులు (1972) వేషంలో మెప్పిస్తారు. కళ్లు పోయిన కబోదిగా తెరపై చిరంజీవులు (1956) అనిపించుకున్నారు. అవిటివాడి పాత్రలో కలసి ఉంటే కలదు సుఖం (1961) అని ఒప్పించారు.



ఎన్టీఆర్ తనకు నచ్చిన పాత్ర చేశారు. జనానికి నచ్చదేమో నని... నలుగురూ అనుమానించిన పాత్రలను సైతం చివరకు అదే జనం మెచ్చేలా చేశారు. అభిరుచికి తగ్గట్టు, వెండితెరపై ఆకలిని తీర్చుకొనేట్టు... సినిమాలు నిర్మిస్తూనే వచ్చారు. ఆర్థిక జయాపజయాలు ఎలా ఉన్నా, అనుకున్నది చేయడం వైపే మొగ్గారు. సొంత చిత్రాల్లో ఆత్మసంతృప్తికే అధిక ప్రాధాన్యమిచ్చారు. అందుకు ఉదాహరణలు కోకొల్లలు. ముందుగా రామాయణంలోని రావణ పాత్ర. దర్శకుడు కె.వి. రెడ్డి వద్దని వారించి, తాను దర్శకత్వం వహించనని నిరాకరించినా సరే రావణబ్రహ్మగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలోనే ఎన్టీఆర్ సీతారామ కల్యాణం (1961) చేశారు.

రామాయణం తర్వాత మహా భారతంలోని దుర్యోధన పాత్రపై ఎన్టీఆర్ మనసు పారేసుకున్నారు. ఆరితేరిన నటుడికి సైతం అగ్ని పరీక్ష లాంటి ఆ పాత్రను సుయోధనుడిగా తీర్చిదిద్ది, ఇటు శ్రీకృష్ణుడు, అటు సుయోధనుడిగా రెండు పాత్రలతో శ్రీకృష్ణ పాండవీయం (1966) లో అబ్బురపరిచారు. ఆ తర్వాత దానవీర శూర కర్ణ (1977)లో ఏకంగా మూడు పాత్రలతో (శ్రీకృష్ణుడు, సుయోధనుడు, కర్ణుడు) 'మాయురే' అనిపించారు. తెలుగునాట పౌరాణిక చిత్రంలో త్రిపాత్రాభినయం చేసిన తొలి నటుడనే కీర్తి దక్కించుకున్నారు. అటుపైన శ్రీమద్విరాట పర్వము (1979)లో తన రికార్డును తానే తిరగరాశారు. ఎన్నడూ, ఎవరూ చేయని రీతిలో పంచ పాత్రలకు ప్రాణప్రతిష్ఠ (శ్రీకృష్ణుడు, సుయోధనుడు, కీచకుడు, అర్జునుడు, బృహన్నల) చేశారు.

పౌరాణిక చిత్రాల్లో... ఒక నటుడు ఏకకాలంలో ఇటు సకల గుణాభి రాముడిగా, అటు సీతాదేవిని చెరపట్టిన రావణుడిగా (శ్రీకృష్ణసత్య, శ్రీరామ పట్టాభిషేకం చిత్రాల్లో) ఇటు జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడిగా, అటు మానధనుడైన సుయోధనుడిగా (శ్రీకృష్ణపాండవీయం, దాన వీర శూర కర్ణ) పూర్తి భిన్నమైన ఆంగిక, వాచిక, ఆహార్యాలతో నటించడం, నటించి మెప్పించడం... ప్రపంచ సినిమాలోనే అరుదైన విన్యాసం. ఆ సాహసం న భూతో న భవిష్యతి. సినీ నట వ్యాకరణానికి ఎన్టీఆర్ పెట్టిన శాశ్వత నమూనా ప్రతి.

ఒక్కమాటలో... ఇవన్నీ పరిశ్రమ, ప్రేక్షకుల ఒప్పుదలతో సంబంధం లేకుండా ఎన్టీఆర్ అనుకున్నది ఆచరణలో పెట్టిన సాహసాలు. అరుదుగా... కొన్ని దుస్సాహసాలుగా తిరస్కరణకు గురైనా ఆయన మాత్రం వెనక్కి తగ్గలేదు. ఒంట్లో ఒకప్పటి జవసత్వాలు తగ్గినా, సమ్రాట్ అశోక (1992)గా నటించడంలోనూ అదే తెగువ. చాణక్య-చంద్రగుప్త (1977) స్క్రిప్ట్ నాటి నుంచి తీరని కలగా మిగిలిపోయిన చాణక్య పాత్రను కాసేపైనా ఆ చిత్రంలో పోషించడంలోనూ అదే కళాపిపాస. విడుదలైన తన ఆఖరి చిత్రం శ్రీనాథ కవిసార్వభౌమ (1993)లో సైతం ఎన్టీఆర్‌లో కనిపించేవి- మొండి పట్టుదల, మహోన్నత సంకల్పం, మీద పడ్డ వయసును సైతం లెక్కచేయని తీరని కళాతృష్ణ. విషాదాంత గాథ వద్దని బాపు-రమణలు వారించినా, పట్టుబట్టి ఆ తెలుగు మహాకవి జీవితాన్నే

ఎన్నుకొని తెర మీదకు తెచ్చి, బాక్సాఫీస్ ఫలితాలకు అతీతంగా తృప్తిపడిన నిజమైన మహోన్నత కళామహర్షి ఆయన.

రికార్డ్‌ల రాముడు - బాక్సాఫీస్ భీముడు

అనేకమందితో పోలిస్తే సినీరంగ ప్రవేశం ఆలస్యమైనా, అఖిల భారతావనిలో అత్యంత వేగంగా సినిమాలు చేసిన హీరోగా ఎన్టీఆరే కనపడతారు. భారతదేశం మొత్తం మీద... వంద చిత్రాలు పూర్తి చేసుకున్న తొలి హీరో ఎన్టీఆరే. గుండమ్మ కథ (1962) ఆ రికార్డుకు వేదికైంది. ఆ తర్వాత యావత్ భారతావనిలో 200 చిత్రాల్లో నటించిన తొలి హీరో కూడా ఆయనే. కోడలు దిద్దిన కాపురం (1970) ఆ అపూర్వ గౌరవానికి కారణమైంది. ఇక, తెలుగు నాట 300 సినిమాలు పూర్తి చేసిన తొలి కథానాయకుడు కూడా ఎన్టీరామారావే. మేజర్ చంద్రకాంత్ (1993)తో ఆయన ఆ మైలు రాయిని చేరుకున్నారు.

బాక్సాఫీస్ రికార్డుల విషయానికొస్తే తెలుగు సినీ చరిత్రలోనే కాదు... మొత్తం దక్షిణ భారతదేశంలోనే... కోటి రూపాయలు వసూలు చేసిన తొలి సినిమా ఎన్టీఆర్‌దే (లవకుశ - 1963). అలాగే, ఒకే ఏడాది 1977లో... ఒకటీ, రెండూ కాదు... ఏకంగా ఆయన సినిమాలు మూడు దానవీరశూర కర్ణ, అడవి రాముడు, యమగోల- ఒక్కోటీ కోటి రూపాయల పైన వసూలు చేయడమూ అపూర్వ సంచలనమే. ఇంకా చెప్పాలంటే, ఎన్టీఆర్ 1982లో సినీరంగం వదిలి, రాజకీయాల్లోకి వెళ్లే వరకు తెలుగునాట కోటి రూపాయల వసూలు చేసినవి కేవలం 15 చిత్రాలే. అందులో కె. విశ్వనాథ్ శంకరాభరణం (1980), అక్కినేని ప్రేమాభిషేకం (1981) మినహా మిగతా 13 రికార్డ్ బ్రేక్ కలెక్షన్లూ ఈ బాక్సాఫీస్ భీముడివే!

అసలు కోటి రూపాయలే అనితరసాధ్యమైన ఆ రోజుల్లో అడవి రాముడు ఏకంగా నాలుగు కోట్లదాకా వసూలు చేయడం సంచలనం. ఏకకాలంలో 30కి పైగా కేంద్రాలలో నేరుగా వంద రోజులు చూసిన తొలి తెలుగు సినిమా అదే! సినిమా వ్యాపార పరిభాషలో చెప్పాలంటే, తెలుగునాట ఆంధ్ర, సీడెడ్, నైజామ్, ఉత్తరాంధ్ర... ఇలా నాలుగు ఏరియాల్లోనూ ఏకకాలంలో స్వర్ణోత్సవం (50 వారాలు) చేసుకున్న ఏకైక చిత్రం కూడా అన్నగారి అడవి రాముడే!

హీరోగా ఎన్టీఆర్ సక్సెస్ రేటు సైతం అనితర సాధ్యం. ఇంకా చెప్పాలంటే, దేశంలోని ఇవాళ్టి ఇతర సూపర్ స్టార్ల కన్నా అది ఎక్కువే నంటే అతిశయోక్తి కాదు. వరుసగా 35 ఏళ్ల పాటు (1950-1984) వరుసగా ఏటా వంద రోజుల సినీ విజయాలు చూసిన ఏకైక నటుడు నందమూరి. ఒక ఏడాదిలో 8 చిత్రాలు డైరెక్టుగా శతదినోత్సవాలు చూసిన నటుడు దేశం మొత్తం మీద ఒక్క ఎన్టీఆరే!

రోజుకు మూడు షిఫ్టుల్లో తీరిక లేకుండా నటుడిగా పని చేస్తూనే, చలనచిత్ర నిర్మాణం, దర్శకత్వం నెరపడం ఎన్టీఆర్ చేసిన అరుదైన విన్యాసం. అంత బిజీ బిజీ హీరో... మరోపక్క నిర్మాతగా 34 చిత్రాలు నిర్మించడం, దర్శకుడిగా 18 చిత్రాలను రూపొందించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ కనివిని ఎరుగని చరిత్ర ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమైంది. పైపెచ్చు... సాంఘికం, పౌరాణికం, జానపదం, చారిత్రకాలు... నాలుగు జానర్లలోనూ బ్లాక్‌బస్టర్లు చేసిన, తీసిన ఏకైక నట-దర్శకుడు ఆయనే!



తొలి రిలీజ్ తర్వాత కూడా అదే సినిమా పదే పదే రిలీజై, ఆ రిపీట్ రన్లలోనూ శతదినోత్సవాలు చేసుకోవడం, బాక్సాఫీస్ వద్ద కనకవర్షం కురిపించడం ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఎక్కువ. ఆయన చిత్రాలు మొత్తం 17 సార్లు రిపీట్ రన్లలోనూ వందరోజులు ఆడాయని సినీ వ్యాపార వర్గాల కథనం. అందులోనూ లవకుశ, బొబ్బిలిపులి, కన్యాశుల్కం చిత్రాలు రిపీట్ రన్స్‌లోనూ రజతోత్సవాలు జరుపుకొన్నాయి. అలా రిపీట్ రన్లలోనూ నిరంతరం కాసులిచ్చే కామధేనువులు గనకనే ఎన్టీఆర్ పాత సినిమాలకు పలికినంత రేటు, తీసినన్ని ప్రింట్లు మరే హీరో విషయంలోనూ జరగలేదన్నది నిష్ఠుర సత్యం.

పోటీ హీరోల ఇంటా... పెద్ద కొడుకే!

తల్లితండ్రులు తమ బిడ్డల్ని ప్రేమించడం సహజం. కానీ, ఎన్టీఆర్‌ను మాత్రం ఆయనతో సినీరంగంలో పోటీలో ఉన్న హీరోల తల్లితండ్రులు సైతం సొంత బిడ్డలా అభిమానించడం, ఆప్యాయత పంచడం ఓ అరుదైన విషయం. నటసమ్రాట్ ఏయన్నార్ తల్లి పున్నమ్మ అయితే ఎన్టీఆర్‌ను పెద్ద కొడుకుగా భావించేది. సూపర్ స్టార్ కృష్ణ మాతృమూర్తి నాగరత్నమ్మ కూడా అంతే! స్వయంగా కృష్ణ సైతం ఎన్టీఆర్‌కు వీరాభిమాని. ఆ మాట కృష్ణే అనేకసార్లు బహిరంగంగా చెప్పారు. నటభూషణ శోభన్‌బాబు తన ఆఫీసు టేబుల్ మీద ఎన్టీఆర్ ఫోటో పెట్టుకొనేవారు. ఆయన తల్లితండ్రు

లకూ కన్నకొడుకు కన్నా ఎన్టీఆర్ మీదే అభిమానం, ఆరాధన. రెబల్ స్టార్ కృష్ణంరాజు తండ్రి సత్యనారాయణరాజుకు సినిమాల మీద అసలు ఆసక్తి ఉండేది కాదు. ఆయన కూడా ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలను చూసి, పరవశులై, ప్రేరణ పొందారు.

రాముడు... జనం గుండెల్లో దేముడు

పురాణ దేవతా పాత్రధారణలో ఎన్టీఆర్‌దే పేటెంట్ హక్కు. అత్యంత క్రమశిక్షణ, అపారమైన నిష్ఠతో ఆయన ప్రాణప్రతిష్ఠ చేసిన ఆ పౌరాణిక పాత్రలు తెరపై ఆడుతున్న ప్రతి హాలూ మరో దేవాలయమయ్యేది. తెరపై బొమ్మకు జనం పూజలు చేసి హారతులివ్వడం, ఆ పురాణ పాత్రల ఫోటోలు పూజామందిరాల్లో స్థానం సంపాదించుకోవడం ఒక్క ఎన్టీఆర్ విషయంలోనే జరిగింది. అది మరే నటుడి విషయంలోనూ జరగని, మరెక్కడా కనీవినీ ఎరుగని మన కళ్లెదుటి కథ. సమకాలీన సంభవం.

తమ గుండెల్లో తనకు గుడి కట్టుకున్న జనం కోసం ఎన్టీఆర్ ఎప్పుడూ ముందుండేవారు. ప్రకృతి వైపరీత్యాలలో చిక్కుకొని, సాయం కోసం అల్లాడుతున్నవారి కోసం ఆయన జనంలోకి వచ్చి, విరాళాలు సేకరించిన రాయలసీమ కరవు, దివిసీమ ఉప్పెన లాంటి సందర్భాలు అనేకం. ఇక, 1965లో భారత-పాకిస్తాన్ యుద్ధ సమయంలో సైనికుల సహాయార్థం 'ఎన్టీఆర్ జాతీయ రక్షణనిధి' పేర విరాళాలు సేకరించారు. ఒక డిఫెన్స్ ఫండ్‌కు ఒక వ్యక్తి పేరు పెట్టడం అదే తొలిసారి.

తెలుగుభాష, సమాజం, సినిమాలను ఎన్టీఆర్ నుంచి వేరు చేసి చూడలేం. సినీరంగానికి చేసిన కృషికి గుర్తింపుగా, 1968లోనే భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' బిరుదునిచ్చి, గౌరవించింది. తెలుగుగడ్డ మీద మన సినిమాను విస్తరింపజేయాలనే కోరికతో 1968లో 'ఎన్టీఆర్ ఎస్టేట్'ను ప్రారంభించి, తెలుగునాట తొలి 70 ఎం.ఎం. థియేటర్‌ను 'రామకృష్ణ' పేరుతో నిర్మించారు. 1976లో 'రామకృష్ణా సినీ స్టూడియోస్'ను నెలకొల్పారు. నాటి సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో స్థాపించిన ఈ రెండు సినీ కళా కేంద్రాలూ ప్రభుత్వం నుంచి సబ్సిడీ మీద తీసుకున్న స్థలంలో కట్టినవి కావు. ఎన్టీఆర్ స్వార్జితంతో, సొంత స్థలంలో నిర్మించినవి కావడం గమనార్హం.



చరిత మరువని రాజకీయ బ్రహ్మర్షి

సామాన్య ప్రజల కష్టాలకు నిరంతరం స్పందించే ఎన్టీఆర్ జీవితంలో అనుభవం పండిన ఆరు పదుల వయసులో సుఖవంతమైన తన సినీ సామ్రాజ్యాన్ని వదిలిపెట్టి, రాజకీయాల్లోకి వచ్చారు. సినీతారగా తనకు అంతటి స్టార్ హోదా, ఖ్యాతి కట్టబెట్టిన ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో 1982 మార్చి 29న 'తెలుగుదేశం పార్టీ'ని స్థాపించారు. రాజకీయ ప్రచార వాహనం 'చైతన్యరథం' ఎక్కి, ఎండనకా, వాననకా రోడ్డు మార్గంలో దాదాపు 35 వేల కిలోమీటర్లు ప్రయాణించి, సుమారు 4 కోట్ల మందిని నేరుగా కలుసుకున్నారు. ఇది మరో రికార్డ్. కేవలం పార్టీ పెట్టిన 9 మాసాల్లో ఎన్నికల్లో గెలిచి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు. నేటికీ చెక్కు చెదరని రికార్డు సృష్టించారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయిన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీని అనూహ్యంగా మట్టి కరిపించి, మొత్తం 294 శాసనసభా స్థానాల్లో 200కు పైగా స్థానాల్లో గెలిచి, అపూర్వ మెజారిటీ సాధించారు. ఆంధ్రపదేశ్‌కు తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి అయ్యారు.

హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకొన్న తన తొలి చిత్రం శభాష్ రాముడు (1959)లో రిక్షా కార్మికుడిగా అసెంబ్లీ ఎదుట రోడ్డుమీద రిక్షా తొక్కిన ఎన్టీఆర్ పాతికేళ్ల తరువాత అదే అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా అడుగుపెట్టడం విధి రాసిన వింత స్క్రిప్టు. యాదృచ్ఛికమైనా, సినీ, రాజకీయ చరిత్రలో చిరకాలం చెప్పుకొనే విషయం. అదే సినిమాలో రిక్షా కార్మికుడి పాత్రలో పేదవారి సమస్యలను జనం ముందు ఆవిష్కరించిన ఎన్టీఆర్, అసెంబ్లీలో సీఎంగా, 'సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు,' అని నినదిస్తూ, 'పేదవారికి పట్టెడన్నం పెట్టేలా రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం,' ప్రవేశపెట్టడం మాత్రం యాదృచ్ఛికం కానేకాదు!

నటుడిగా విపరీతమైన జనాకర్షణ ఉన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోనూ ప్రత్యేకమైన తన అభిప్రాయాలు, ఆలోచనలు, ఆచరణల ద్వారా తెలుగు నేల రాజకీయ వాతావరణాన్ని, ఇంకా చెప్పాలంటే భారత రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేశారు. మహిళలు, వెనుక బడిన వర్గాలు, నిరుపేదలకు ప్రేరణనిచ్చి, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించారు. తమిళనాడు స్ఫూర్తితో తెలుగునాట ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇవాళ్టికీ రకరకాల పేర్లతో దేశమంతటా నడుస్తున్నాయి. జాతీయ రాజకీయాల్లో సైతం 'నేషనల్ ఫ్రంట్' చైర్మన్‌గా ఎన్టీఆర్ కీలక భూమిక వహించారు. ఎనిమిదో లోక్‌సభా కాలంలో ఎన్టీఆర్ సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్‌లో కీలక ప్రతిపక్ష పాత్ర పోషించడం విశేషం. అలాగే, ఆరోజుల్లోనే కేంద్రంలో 'నేషనల్ ఫ్రంట్' ప్రభుత్వం అధికారంలోకి రావడం మరో చరిత్ర. కేవలం

రెండు ప్రధాన పార్టీల మధ్యనే పోరు అనే ఒకప్పటి రోజులు పోయాక, విభిన్న పార్టీల మధ్య భాగ స్వామ్యాలు, పొత్తులతో 'సంకీర్ణ ప్రభుత్వం' ఏర్పాటు చేయడమనే ఆ నమూనాయే ఇవాళ్టికీ ఆచరణమార్గమైంది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు పదవీ స్వీకార ప్రమాణం చేసిన ఏకైక నాయకుడూ ఎన్టీఆరే! 1983లో తొలిసారి, 1984లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కుట్రతో పదవిని కోల్పోయినప్పుడు జనమే అండగా పోరాడి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంతో మళ్లీ సీఎంగా వచ్చినప్పుడు మలిసారి, 1985లో ఎన్నికల్లో గెలిచినప్పుడు మరోసారి, 1994 ఎన్నికల్లో సింహగర్జన చేసి, విజయఢంకా మోగించినప్పుడు ఇంకొకసారి- ఇలా మొత్తం నాలుగుసార్లు! ఇక, మధ్యలో 1989లో ప్రతిపక్ష నాయకుడిగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. చివరిగా, 1994 ఎన్నికల్లో ఆయన సాధించిన అఖండ విజయం ఎంతటిదంటే, కాంగ్రెస్ కేవలం 26 స్థానాలకే పరిమితమై, రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకోలేకపోయింది.



రాజకీయాల్లో ఉన్నప్పటికీ అవకాశం కుదిరినప్పుడల్లా ఎన్టీఆర్ తన కళాతృష్ణను తీర్చుకొనే ప్రయత్నం చేశారు. రాష్ట్ర సీఎంగా, జాతీయస్థాయిలో 'నేషనల్ ఫ్రంట్' ఛైర్మన్‌గా ఉంటూనే ఎన్టీఆర్ నటిస్తూ, స్వీయదర్శకత్వంలో రూపొందించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర (1991) మరో పెను సంచలనం. నందమూరి నటించిన చివరి సినిమా మేజర్ చంద్రకాంత్ (1993), అందులో ఆయన పోషించిన రిటైర్డ్ ఆర్మీ అధికారి పాత్ర, 'పుణ్యభూమి నా దేశం నమో నమామి...' అనే దేశభక్తి గీతం, ఆ పాటలోని దేశభక్తుల ప్రత్యేక ప్రస్తావనలు చిరస్మరణీయం. మూడు దశాబ్దాల తర్వాత కూడా ఇవాళ్టికీ తెలుగునాట ప్రతి దేశభక్తి సందర్భానికీ ఆ సినిమా, ఆ పాట లేకుండా రోజు గడవడంటే అత్యుక్తి కాదు. ఇలా అడుగిడిన ప్రతి రంగాన్నీ ప్రభావితం చేసిన ఎన్టీఆర్ 1996 జనవరి 18న హఠాత్తుగా, భౌతికంగా మహాభినిష్క్రమణం చేశారు. అయినా ఇప్పటికీ సినిమా, సమాజం, రాజకీయం ఇలా అన్నింటా ఆయన మూర్తి, స్ఫూర్తి చిరంజీవులుగా వెలుగుతూనే ఉన్నాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఆ కీర్తికాయం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. విశ్వమంతటా విస్తృతమవుతూనే ఉంది.

న భూతో న భవిష్యతి... ఇలాంటి శతజయంతి!

యుగానికొక్కడైన ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా గడచిన 2022 మే 28 నుంచి ఇప్పటికి ఏడాదిగా మాతృభూమి మీదే కాదు... ఖండ ఖండాంతరాల్లో సైతం వందల, వేల సంఖ్యలో సభలు, సమావేశాలు, కార్యక్రమాలు జరగడమే ఆయన కీర్తికీ, స్ఫూర్తికీ ప్రత్యక్ష నిదర్శనం. ఈ 2023 మే చివరతో శతజయంతి ముగిసిపోయినా, ఇప్పటికీ దేశదేశాల్లో ఏదో ఒక రూపంలో ఎన్టీఆర్ నూరేళ్ల వేడుకలు జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా, దాదాపుగా తెలుగువారున్న ప్రతి దేశంలో ఇలా సంబరాలు సాగడానికి కారణం లేకపోలేదు. ఒకప్పుడు పలువురి దృష్టిలో మదరాసీలుగానే మిగిలిపోయిన తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపు, గౌరవాలను ప్రపంచవ్యాప్తంగా తెచ్చింది ఎన్టీఆర్. ఇప్పుడు అదే తెలుగువారు ప్రపంచం నలుమూలలకూ విస్తరించారు. వారు తమ ఆత్మగౌరవాన్ని ప్రపంచవేదికపై నిలబెట్టిన ఆ శకపురుషుణ్ణి ఈ నూరేళ్ల పండుగలో ప్రత్యేకంగా గుర్తు చేసుకొంటున్నారు. కాల గతిలో ఇది ఒక సంపూర్ణ చక్రభ్రమణం.

గిన్నిస్ రికార్డ్ దిశగా... తెనాలి ఉత్సవం!

ఈ శతజయంతి వేళ... ఎన్టీఆర్ ఆరాధకుల సాక్షిగా తెలుగు నేల మీద తెనాలిలో అపూర్వమే కాదు... ఒక అద్భుతమే జరిగింది. గడచిన ఎన్టీఆర్ జయంతికి 2022 మే 28న ప్రారంభించి ఈ 2023 మే 28 వరకు ఏడాది పొడుగూతా... 365 రోజులూ శతజయంతి కార్యక్రమాలు జరిపారు. తెనాలిలో ఒకప్పుడు ఎన్టీఆర్ నిర్మించి, తరువాత మరొకరికి విక్రయించేసిన రామకృష్ణ థియేటర్ (ప్రస్తుతం 'పెమ్మసాని రామకృష్ణ' థియేటర్‌గా నడుస్తోంది)లో నిరుడు జయంతికి ఎన్టీఆర్ శ్రీవేంకటేశ్వర మాహాత్మ్యం (1960)తో మొదలుపెట్టి, అప్పటి నుంచి ఈ ఏడాది శత జయంతి ముగింపు దాకా 265 ఎన్టీఆర్ చిత్రాలను ప్రదర్శిస్తూ వచ్చారు. రోజూ ఉదయం మార్నింగ్ షోగా సాగిన ఈ ఎన్టీఆర్ చలనచిత్రాల ప్రదర్శనకు ప్రజలందరికీ ఉచితంగా ప్రవేశం కల్పించారు. సోమ నుంచి శుక్రవారం దాకా ప్రతి వారం అయిదేసి చిత్రాలు, శని, ఆదివారాల్లో ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితాలపై సదస్సులు, వారంలో మొత్తం ఏడు రోజులూ రోజుకొక సన్మానం నిరాటంకంగా జరిగాయి. ఒక్కరోజు కూడా కుంటుపడకుండా ఏడాదిపాటు ఈ పద్ధతిలో, ఇంత క్రమశిక్షణగా ఉత్సవాలను నిర్వహించడం మరెక్కడా, ఎప్పుడూ జరగని అద్భుత విన్యాసం. హీరో నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రముఖ సినీ, నాటక రచయిత బుర్రా సాయిమాధవ్, ఎన్టీఆర్ వీరాభిమాని నిర్మాత కొమ్మినేని వెంకటేశ్వరరావుల త్రయం కర్త, కర్మ, క్రియగా సాగిన ఈ సంవత్సర కాల బృహత్ యజ్ఞం ఇప్పుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కడానికి సన్నద్ధమవుతోంది.

"ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో చేయాలని భావించాను. ఎలా చేయాలో తెలీదు. ఏదో ఒక ప్రణాళిక రూపొందించాం. అదే సమయంలో బుర్రా సాయిమాధవ్, కొమ్మినేని వెంకటేశ్వరరావు నన్ను కలసి ఏడాదిపాటు అభిమానులకు ఉచితంగా సినిమాలు ప్రదర్శించాలన్న సంకల్పం వివరించారు. అన్ని సినిమాలు ఎలా సేకరిస్తారన్న అనుమానం నాకు కలిగినా, వారిద్దరూ సాధిస్తామన్నారు. చేసి చూపించారు. ఏ ఆటంకం లేకుండా ఏడాది పాటు ఇలా శతజయంతి ఉత్సవాలు జరపడం దైవకృప, పైనున్న ఎన్టీఆర్ ఆశీర్వాద బలం," అంటారు ఆలపాటి.

ఎన్టీఆర్‌ను ఆరాధించే రచయిత బుర్రా సాయిమాధవ్ అయితే, "ప్రసిద్ధ రంగస్థల నటులైన మా నాన్నగారు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పేరిట మా స్వస్థల మైన తెనాలిలో ఏటా రంగస్థల అవార్డుల ప్రదానం చేస్తుంటాను. ఆ ఉత్సవాలకు వచ్చిన మిత్రులు కొమ్మినేని, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల ఆలోచన పంచు కున్నారు. ఎన్టీఆర్ వీరాభిమానిగా నేనూ ఉత్సాహంగా ముందుకొచ్చా. ఏడాదిపాటు ఉచితంగా ఎన్టీఆర్ సినిమాల ప్రదర్శన ఆలోచన కొమ్మినేనిది. అనేక కష్టనష్టాలకు ఓర్చి, 265 సినిమాల డిజిటల్ ప్రతులు సేకరించి, హైదరాబాద్ నుంచి ప్రత్యేక ప్రొజెక్టర్ తెచ్చిపెట్టించి, నిరాటంకంగా ఆ సినిమాలు ప్రదర్శించడానికి ఆయన నిరంతరం శ్రమించారు. ప్రతినెలా చివరి శనివారం రంగస్థల ప్రముఖులకు, 'ఎన్టీఆర్ రంగస్థల అవార్డు పదివేల నగదు', అలాగే చివరి ఆదివారం ఎన్టీఆర్‌తో అనుబంధం ఉన్న సినీ ప్రముఖులకు 'ఎన్టీఆర్ చలనచిత్ర అవార్డు బంగారుపతకం' మా ఉత్సవ సారథ్య కమిటీ పక్షాన అందించాం," అని ఉద్వేగంగా వివరించారు.

ఎన్టీఆర్ నటించిన 302 చిత్రాల్లో 280 తెలుగు సినిమాలు. వాటిలో 265 చిత్రాలను సంపాదించి, ప్రదర్శించడం ఆషామాషీ వ్యవహారం కాదు. నిజానికి, ఎన్టీఆర్ కన్నా ఎక్కువ సంఖ్యలో సినిమాలు చేసిన భారతీయ సినీ హీరోలు నలుగురు ఉన్నారు (మలయాళంలో ప్రేమ్‌నజీర్, మమ్ముట్టి, మోహన్ లాల్, తెలుగులో కృష్ణ). సంఖ్యాపరంగా ఎక్కువైనప్పటికీ, వారి చిత్రాల్లో కనీసం సగమైనా ఇవాళ చూడడానికి ప్రింట్లు కానీ, డిజిటల్ కాపీలు కానీ అందుబాటులో లేని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో ఎన్టీఆర్ నటించిన ఇన్ని చిత్రాలను శ్రమకోర్చి, సేకరించడమూ ఈ శత జయంతిలో అపూర్వ విశేషమే. "ఎన్టీఆర్ వీరాభిమానిగా ఈ సినిమాల ప్రదర్శన ఆలోచన వచ్చింది. 2021 నుంచే ప్రణాళిక వేసుకొని, సినిమా కాపీల సేకరణ ప్రారంభించాను. వాటిలో సరిగ్గా లేని ప్రింట్లను కొత్తగా డిజిటలైజ్ చేయించి, తెరపై బొమ్మ, మాటల నాణ్యత పెంచి మరీ తెనాలిలో నవతరం ప్రేక్షకులకు ప్రదర్శించాం. ఇతర హీరోలు నాలుగొందల పైచిలుకు చిత్రాలు చేసినా, వారివి ఎవరివీ అందులో సగం, అంటే 200 లోపు చిత్రాలు కూడా దొరకడం లేదు. అయితే, ఎన్టీఆర్ చిత్రాలకున్న రిపీట్ రన్ క్రేజ్ కారణంగా, ఆయనవి మాత్రమే 95 శాతం సినిమాలు లభించాయి. ఇది మరే భారతీయ హీరోకూ లేని ఘనత. ఈ ప్రత్యేకతను ప్రపంచానికి చెప్పడానికే సంవత్సరకాలం ఉచిత సినిమా ప్రదర్శన జరిపాం. ఇందుకు ఎందరో సహకరించారు. గిన్నిస్ రికార్డ్ నమోదుకు ఈ ఉత్సవాలను పంపాం. జూలైలో ఈ శతజయంతికి గ్రాండ్ ఫినాలే ఫంక్షన్ చేయనున్నాం," అని కొమ్మినేని ఆనందం పంచుకున్నారు. తెనాలిలో ఈ మే 28న ఆఖరి ప్రదర్శనగా ఎన్టీఆర్ దానవీరశూర కర్ణను ప్రదర్శిస్తే, సరికొత్త ప్రింట్ నాణ్యతతో నాలుగు గంటల పైగా సాగిన ఆ చిత్ర ప్రదర్శనను హాలు నిండిపోయినా సరే, జనం నిల్చొని మరీ చూశారంటే... ఈ శతజయంతి సినిమా ప్రదర్శనలు ఎంతటి ఘనవిజయం సాధించాయో ఊహించవచ్చు.

ప్రభుత్వాల వైపు నుంచి కాకుండా, ప్రైవేటుగానే ఇంతటి స్థాయిలో ఒక ప్రముఖుడి శతజయంతి ఉత్సవాలను ప్రజలు, సాంస్కృతిక సంస్థలు పూనుకొని ఊరూవాడా జరపడం మునుపెన్నడూ కనీవినీ ఎరుగని విషయం. ఒక్క ఎన్టీఆర్‌కే జరిగిన అద్భుతం. అలాగే, ఒక సినీ నటుడినైనా, ఒక రాజకీయ నాయకుడినైనా ఇన్ని దేశదేశాల్లో ఈ రకంగా ఘనంగా స్మరించుకోవడం కూడా ఇదే మొదటిసారి. శతజయంతి వేళ ఎన్టీఆర్‌పై పదుల సంఖ్యలో పుస్తకాలు, ప్రత్యేక సంచికలు, పోస్టర్లు, ఫోటో క్యాలెండర్లు వెలువడ్డాయి. వెల్లువలా ఇంకా వస్తూనే ఉన్నాయి. నూరు వసంతాల వేళ ఓ ప్రముఖుడిపై ఇన్ని ప్రచురణలు రావడం కూడా ఇదే ప్రథమం. ఈ జూలై ప్రథమార్ధంలో అమెరికాలో 'తానా' సంస్థ జరుపుతున్న ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఈ శతజయంతికి మంచి ముక్తాయింపు.

తెలుగుజాతి చిరకాలం స్మరించుకొనే శకపురుషుడికి శతవసంత సుమాంజలి.



ఈనాడు దినపత్రికలో జర్నలిస్టుగా జీవితం ప్రారంభించి నెమ్మదిగా ప్రముఖ సినీ జర్నలిస్టుగా రూపొందారు. అనేకమంది సినీరంగ ప్రముఖుల్ని ఇంటర్వ్యూలు చేశారు. తెలుగు సినిమారంగంపై పరిశోధన చేసి, మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. 2012 సంవత్సరంలో ఉత్తమ సినీ జర్నలిస్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం, ఉత్తమ సినీ గ్రంథ రచయితగా జాతీయ పురస్కారం పొందారు. నివాసం హైదరాబాదు.

తెలుగు సమాజం మీద చెరగని సంతకం

కందుల రమేష్



తెలుగు సమాజం మీద నందమూరి తారక రామారావు ముద్ర ఎన్నటికి చెరిగిపోనిది. నటుడిగా ఆయన కృషి అజరామరం. రాజకీయ నాయకుడిగా ఆయన ప్రస్థానం పద్నాలుగేళ్లే (1982-1996). అయినా ఆయన చూపిన ప్రభావం మహత్తరం. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింప జేయడంతో పాటు, తెలుగు సమాజంలో ఫ్యూడల్ వ్యవస్థలను నిర్మూలించి, అట్టడుగు వర్గాల సామాజిక, రాజకీయ ఉన్నతికి తోడ్పడంలో ఎన్టీఆర్ చూపించిన చొరవ నభూతో నభవిష్యతి.

1982 మార్చి 29న నందమూరి తారక రామారావు రాజకీయ రంగ ప్రవేశం తెలుగువారి చరిత్రలో ఒక విలక్షణ అధ్యాయం. తెలుగు సినీ వినీలాకాశంలో మూడు దశాబ్దాల పాటు జేగీయ మానంగా వెలిగిన అభిమాన నటుడు, అరవైయేళ్ల పండు వయసులో రాజకీయ రంగప్రవేశం చేయడం అపూర్వం. పార్టీ ప్రకటించిన మరుక్షణం నుంచి ఎన్టీఆర్ అన్ని వర్గాల ప్రజలతో మమేకమై స్ఫూర్తి రగిలించిన తీరు అనితరసాధ్యం.

తెలుగువారిలో నెలకొన్న నిస్తేజాన్ని పారదోల డానికి కంకణం కట్టుకున్న ఎన్టీఆర్‌ని తెలుగు సమాజం నిండుమనసుతో ఆశీర్వ దించింది. ఆయన రాకను తెలుగుజాతి రాజకీయచరిత్రలో ఒక కొత్త మలుపుగా ఆహ్వానించింది. తెలుగు ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కోవాలని ఆయనిచ్చిన పిలుపునకు ఉవ్వెత్తున స్పందించింది. ఆంధ్రుల భవిష్యత్తును దేదీప్యమానం చేయాలని



పరితపించిన ఎన్టీఆర్‌కు కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. 1983లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన చారిత్రక ఎన్నికల్లో ఘనవిజయాన్ని సాధించిపెట్టింది.

రాజకీయ చైతన్యం

ఎన్టీఆర్ ప్రవేశం తర్వాతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. స్వాతంత్ర్యం వచ్చిన మూడు దశాబ్దాల వరకు కొద్దిమంది చేతుల్లో బందీగా ఉన్న రాజకీయ అధికారాన్ని తొలిసారిగా ప్రజల్లో చేతుల్లో పెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే. ఎన్టీఆర్ రాకతో రాజకీయం ప్రజలకు చేరువైంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్‌లాగా విస్తృతంగా పర్యటించిన రాజకీయ నాయకుడు మరొకరు లేరు. మూడు విడతల్లో దాదాపు 45 వేల కిలోమీటర్లు వాగులూ, వంకలూ దాటి, డొంకల్లో ప్రయాణించి, మారుమూల పల్లెల్లోని జనాన్ని కూడా ఆయన కదిలించారు. ఇందుకోసం పాత షెవర్లే వ్యాన్‌నే ఆయన చైతన్య రథంగా మార్చుకున్నారు. అందులోనే ఆయన తిండీ, నిద్రా. రోడ్డు పక్కనే కాలకృత్యాలు. సూర్యోదయం కాకముందే రథం కదిలేది. అర్ధరాత్రి తర్వాత కూడా జనప్రవాహం ఆగేది కాదు. విసుగూ విరామం లేకుండా ఎక్కడ జనం గుమిగూడితే అక్కడ వ్యాన్ పైకెక్కి ఉపన్యసించేవారు. ఆయన ఉద్వేగపూరిత ప్రసంగాలు వినడానికి జనం తండోపతండాలుగా వచ్చారు. ఎక్కడకెళ్లినా ఆయనకు అఖండ స్వాగతం లభించింది. ఎర్రటి ఎండలో తిరిగి ఆయన ముఖ వర్చస్సు నల్లబడింది. సినిమా గ్లామర్ దెబ్బతింది. కానీ జనం ఆయన్ని నటుడిగా భావించలేదు. తమ విధి రాతను మార్చడానికి వచ్చిన ప్రజానాయకుడిగా చూశారు.

పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే 201 సీట్లతో అఖండ విజయాన్ని సాధించడం వెనక ఆంధ్ర ప్రజానీకంలో ఎన్టీఆర్ కలిగించిన చైతన్యం ఉంది. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఇంత ఓటమి ఎన్నడూ ఎదురుకాలేదని రామచంద్ర గుహ వంటి చరిత్రకారులు అన్నారు. ఇటు వంటి గెలుపు ప్రపంచచరిత్రలోనే అరుదని ఇండియా టుడే పత్రిక వ్యాఖ్యానించింది. ఈ గెలుపునకు కారణాలను కూడా పరిశోధకులు కనుగొన్నారు. రాజకీయాలను ప్రజలకు చేరువ చేయడం ఇందుకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. అంతకు ముందు రాజకీయ నేపథ్యం లేని వారికి, రాజకీయంగా ప్రాతినిధ్యం లేని వెనకబడిన వర్గాలకు, ఉన్నత చదువులు కలిగిన వారికి, మేధావులకు, యువకులకు పార్టీ టికెట్లు ఇవ్వడం ద్వారా ఒక కొత్త తరాన్ని ఎన్టీఆర్ రాజకీయాల్లోకి తీసుకొచ్చారు.

అందుకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయచరిత్రను ఎన్టీఆర్‌కు ముందు, ఎన్టీఆర్ తర్వాత అని విభజించవచ్చు.

తెలుగువారికి గుర్తింపు

తమకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వం ఉందని, అందువల్ల ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుకున్న తెలుగువారి కోర్కెను మన్నిస్తూ 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అయినా ఆ తర్వాత కూడా తెలుగువారిని మదరాసీలగానే ఉత్తరాదిలో వ్యవహరించేవారు. తెలుగువారు కోరుకున్న ప్రత్యేక గుర్తింపు, మన్నన 1982లో తెలుగు దేశం పార్టీ ఏర్పాటు తర్వాతే వారికి లభించింది. ఆత్మగౌరవ నినాదంతో తెలుగువారిని తట్టిలేపిన ఎన్టీఆర్, జాతీయస్థాయిలో కూడా తెలుగుజాతి ఔన్నత్యానికి గుర్తింపు తీసుకొచ్చారు.

"ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి అధికార మార్పిడి జరిగినప్పుడు నేను ప్రపంచ బ్యాంకు తరపున బడ్జెట్ సలహాదారుగా ఆఫ్రికా దేశం సూడాన్‌లో ఉన్నాను. లాల్ బహదూర్ స్టేడియంలో ప్రజాసమక్షంలో ఎన్టీఆర్ ప్రమాణ స్వీకార దృశ్యాన్ని నేను సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లో టీవీలో చూశాను. ఆంధ్రప్రదేశ్ అనే ఒక ప్రాంతం భారతదేశంలో ఉందని అప్పుడే ఆఫ్రికాలో తొలిసారి తెలిసింది," అని రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి బిపిఆర్ విఠల్ తన స్మృతుల్లో రాశారు. అంతర్జాతీయ వార్తల్లో తొలిసారిగా ఆంధ్ర ప్రదేశ్ మెరిసింది.

తెలుగుదేశం పార్టీ స్థాపకుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ వ్యక్తిత్వం, భిన్న ఆలోచనావిధానం, సంస్కరణాభిలాష రాష్ట్రానికి వన్నె తెచ్చాయి. తొలినాళ్లలోనే రాష్ట్రంలో ఆయన తీసుకొచ్చిన పాలనాసంస్కరణల మీద జాతీయ మీడియా విస్తృతంగా రిపోర్టు చేసింది.

జాతీయస్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేసి, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయాన్ని తయారుచేయాలన్న ఆయన సంకల్పం, అందు కోసం ఆయన చేసిన నిర్విరామ కృషి కూడా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి.

తెలుగువారి ఖ్యాతిని ఇనుమడింపజేయడం కోసమే తెలుగు దేశం పార్టీ రాజకీయాల్లో ఉందిగాని, అధికారం చేపట్టడానికి మాత్రమే కాదని ఎన్టీఆర్ చేతల్లో చూపారు. తన పార్టీకి ఆగర్భ శత్రువైన కాంగ్రెస్ పార్టీ తరపున పివి నరసింహారావు నంద్యాల ఉపఎన్నికల్లో పార్లమెంటుకు పోటీ చేసినప్పుడు, తెలుగు బిడ్డ ప్రధాని పదవిలో ఉండటం తెలుగువారికి గర్వకారణమని ప్రకటించి, పార్టీ అభ్యర్థిని పోటీలో దింపని ఉన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్‌ది.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా తాను తెలుగువాడినని, తనది తెలుగు రాష్ట్రమని తెలుగువారు గర్వంగా చెప్పుకోగలగడానికి ఎన్టీఆర్ చేసిన సేవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ప్రాంతీయ, జాతీయవాదాల సమ్మిళితం

తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించినా, ఇతర ప్రజాసమూహాలని, భాషలని, రాష్ట్రాలని ఆయన శత్రువులుగా పరిగణించలేదు. తెలుగేతరుల పట్ల ద్వేషాన్ని రగిలించలేదు. దీనికి కారణం ఎన్టీఆర్ పుణికి పుచ్చుకున్న జాతీయతాభావం.

ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించినా, అణువణువునా జాతీయతను నింపుకున్న పార్టీగా ఆయన తెలుగుదేశాన్ని నిర్మించారు. అందుకే ఎన్టీఆర్‌ని సంకుచిత ప్రాంతీయ తత్వానికి ప్రతినిధిగా చూపాలన్న రాజకీయ ప్రత్యర్థుల యత్నాలన్నీ విఫల మయ్యాయి. రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని నిరంతరం పోరాటం చేసినా, అది భారత రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలనే ఆయన అభిలషించారు. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు, వేషభాషలకు ఆలవాలమైన దేశం ఒక్కటిగా ఉండాలంటే రాజకీయ, సాంస్కృతిక బహుళత్వాన్ని ఆదరించాలన్నది ఆయన సిద్ధాంతం.


రాష్ట్రాలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలపై కేంద్ర పెత్తనం సహించబోమని ఎలుగెత్తిన ఎన్టీఆర్, అదే సమయంలో దేశరక్షణ, ఐక్యత విషయంలో తాము రాజీ పడబోమని పలుమార్లు స్పష్టం చేశారు. దేశ సమగ్రతకు ఏమాత్రం భంగం వాటిల్లే ప్రమాదం ఉన్నా, అందరికంటే ముందువరుసలో నిలబడి తమ చివరి రక్తపు బొట్టు వరకు దేశం కోసం ధారపోస్తామని 1984లో కలకత్తాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో ఆయన ప్రకటించారు.

1984లో ఎన్టీఆర్ అమెరికా పర్యటన సందర్భంలో ప్రతిపక్ష పాలనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పై ఇందిరాగాంధీ ప్రభుత్వ వివక్షా పూరిత వైఖరిపై ఇండియా టుడే అడిగిన ప్రశ్నకు ఎన్టీఆర్ చెప్పిన సమాధానం ఆయనకు దేశ ప్రతిష్ట పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనం. "నేను న్యూయార్క్‌లో ఉన్న విషయాన్ని మరిచిపోను. మా అంతర్గత విషయాల గురించి విదేశీగడ్డ మీద చర్చించి, దేశ గౌరవాన్ని దెబ్బ తీయలేను," అని ఆయన బదులిచ్చారు. ఆ సమయంలో కేంద్రంలో ఉన్న ఇందిర ప్రభుత్వానికి, ఆయన ప్రభుత్వానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం ఉంది.

సైద్ధాంతిక బలం

ఆత్మగౌరవ నినాదంతో, ఉద్వేగపూరిత ప్రసంగాలతో మాత్రమే ఎన్టీఆర్ ప్రజామద్దతును పొందలేదు. తెలుగు జాతీయతా భావాన్ని అడ్డుపెట్టుకొని అధికారాన్ని చేజిక్కించుకోలేదు. ఆంధ్ర ప్రదేశ్ పాలనావ్యవస్థను సంపూర్ణంగా, సమగ్రంగా సంస్కరించి, తెలుగువారిలో నైతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విప్లవాన్ని సాధించే దిశగా ఎన్టీఆర్ రాజకీయాలను నిర్వహించారు.

ఆహారభద్రతను ప్రాథమిక హక్కుగా ఇవాళ ప్రపంచం గుర్తించింది. కాని ఆనాడే ఆయన ఆకలి బాధ నుంచి పేదలను విముక్తులను చేయడానికి పూనుకొన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం అమలైన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఆకలి చావులు గణనీయంగా తగ్గిపోయాయని, మారుమూల పల్లెల్లో కూడా పౌష్టికాహారం అందుబాటులోకి వచ్చిందని వివిధ అధ్యయనాలు తెలుపుతున్నాయి. "ఎన్టీఆర్ రాజకీయ చిత్తశుద్ధి వల్లే బియ్యం పథకం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైంది," అని ఆనాడు ప్రభుత్వంలో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్ అన్నారు.



కేంద్ర ప్రభుత్వం చేతుల్లో 356వ అధికరణం దుర్వినియోగాన్ని విజయవంతంగా నిలువరించిన రాజకీయ నాయకుడు అప్పటికీ ఇప్పటికీ మరొకరు లేరు. ప్రజల్లో ప్రజాస్వామ్య భావనలను పెంపొందించడంలో, తమ ప్రభుత్వాన్ని తామే నిర్ణయించుకోగల స్ఫూర్తిని రగలించడంలో 1984లో ఎన్టీఆర్ నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం వహించిన పాత్ర చరిత్రలో నిలిచిపోయింది. "ఎమర్జన్సీ తర్వాత ఎన్టీఆర్ పదవీచ్యుతిలాగా మరో అంశం దేశప్రజల్ని కదిలించలేదు," అని టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ గిరిలాల్ జైన్ వ్యాఖ్యానించారు. 'ఇందిరాగాంధీ తర్వాత భారతదేశానికి నాయకత్వం వహించగలిగిన సరైన వ్యక్తి మీరే'నని అమెరికాలో అంతకుముందు ఆయనకు గుండె ఆపరేషన్ చేసిన ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ డెంటన్ కూలీ అభినందనలు తెలిపారు.

ఆడపడచులకు అండగా

తన రాజకీయ ప్రవేశం నాటి నుంచి అండగా ఉన్న ఆడపడుచుల జీవితాలను మెరుగుపరచడానికి ఎన్టీఆర్ ఎన్నో విప్లవాత్మక చర్యలు తీసుకున్నారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిలో కొడుకులతో పాటు కూతుళ్లకు భాగస్వామ్యం కలిపిస్తూ 1986 అక్టోబరు నాటి నుంచి అమల్లోకి వచ్చే విధంగా చేసిన చట్టం ఆయన అభ్యుదయ సిద్ధాంతాలకు ప్రతీకగా నిలిచింది. జాతీయ స్థాయిలో ఇటువంటి ప్రగతిశీలక చట్టాన్ని చేయడానికి పార్లమెంటుకే మరో రెండు దశాబ్దాలు పట్టింది. ఎన్టీఆర్ చట్టం నుంచి స్ఫూర్తిని పొందిన కేంద్రం 2006లో కుమార్తెలకు ఆస్తిహక్కు కల్పిస్తూ శాసనం చేసింది.

స్త్రీలకు ఉన్నతవిద్యను అందుబాటులోకి తీసుకువస్తే వారి జీవితాల్లో గణనీయంగా మార్పు వస్తుందని నమ్మిన ఎన్టీఆర్ అధికారంలోకి రాకమునుపే రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపిస్తానని వాగ్దానం చేశారు. ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 1983 ఏప్రిల్‌లో ఉగాది పర్వదినాన తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి అంకురార్పణ చేశారు.

ఎన్టీఆర్ రాకముందు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మహిళలకు చాలా తక్కువ ప్రాతినిధ్యం ఉండేది. రాష్ట్రస్థాయి నుంచి పంచాయితీ వరకు వేళ్లమీద లెక్కపెట్టదగినంత మంది మాత్రమే స్త్రీలు రాజకీయ పదవులను నిర్వహించేవారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా జిల్లా పరిషత్తుల్లో, మండల ప్రజాపరిషత్తుల్లో తొమ్మిది శాతం అధ్యక్ష పదవులను మహిళలకు రిజర్వు చేస్తూ ఎన్టీఆర్ ప్రభుత్వం చట్టం చేసింది. దీనివల్ల సర్పంచులుగా, మండలాధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీలు పదవీబాధ్యతలను చేపట్టగలిగారు. మహిళలు రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రవేశించడానికి, కీలక పదవులను నిర్వహించడానికి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాజకీయ ప్రతినిధులుగా ఎదగడానికి అవకాశం లభించింది. అన్ని ప్రభుత్వ రంగాల్లో 30 శాతం ఉద్యోగాలను స్త్రీలకు కేటాయిస్తూ ఎన్టీఆర్ ప్రభుత్వం మరొక కీలక నిర్ణయం తీసుకుంది.

ఆడవారి అభ్యుదయం కోసం ఏ ప్రభుత్వమూ ఇంత తక్కువ కాలంలో ఇన్ని రకాల కార్యక్రమాలను చేపట్టలేదు.

తెలుగు వెలుగు


ఎన్టీఆర్ హయాంలో తెలుగుదనం పల్లవించింది. తెలుగు భాషా సంస్కృతులకు ఆయన ప్రభుత్వంలో పునరుజ్జీవనం కలిగింది. మూర్తీభవించిన తెలుగువాడిగా తెలుగుభాషకు ఎన్టీఆర్ పట్టం గట్టారు. తెలుగుభాషను ప్రధాన భాషగా, అధికార భాషగా అన్ని స్థాయిల్లో అమలు చేసిన ఘనత ఆయనదే.



పాలనా సంబంధమైన కార్యకలాపాలు మాతృభాషలోనే జరగాలని, విద్యాబోధన అమ్మనుడిలోనే ఉండాలని నిర్ణయించి, అందుకోసం అనేక చర్యలు తీసుకొన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో తెలుగును పాలనాభాషగా ప్రవేశపెట్టారు. అన్ని శాసనేతర అంశాలకు సచివాలయ స్థాయిలో తెలుగు ప్రధాన భాషగా ఉండా లని ఆదేశాలు ఇచ్చారు. శాసనసభలో అధికార బిల్లులు తెలుగులోనే ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు తెలుగు, ఇంగ్లీషు భాషల సౌలభ్యంతో ఉండాలని కూడా ఆయన ప్రభుత్వం ఆదేశించింది.

సచివాలయంలోని వివిధ విభాగాల అధికారులకు తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో 1983 ఏప్రిల్‌లో తెలుగు తరగతులను

మొదలుపెట్టి, ఆ తర్వాత కార్యదర్శుల స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వుల నమూనాలను చిన్న పుస్తకంగా ప్రకటించి, జిల్లాస్థాయిలో పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో నేరుగా నియమితులయ్యే టైపిస్టులకు తెలుగు టైప్ రైటింగ్ అర్హత విధిగా ఉండాలని, ఇంగ్లీషు టైప్ రైటింగ్ అర్హత విశేషార్హతగా ఉండాలని ప్రకటించారు.



ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వ ప్రకటనలన్నీ అచ్చ తెలుగులో ఆకర్షణీయంగా ఉండేవి. ఏటా జరిగే తెలుగుదేశం మహానాడు సమావేశాల్లో తెలుగుదనం ఉట్టిపడేది. తెలుగు సంస్కృతి సంప్ర దాయాలు, తెలుగు ఆటలు, తెలుగు పాటలతో అలరారేది. ప్రభుత్వపరంగా జరిగే సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలల్లో తెలుగు కళారూపాలకు తెలుగుదేశం ప్రభుత్వంలో పెద్ద పీట వేశారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తెలుగులో చేసే ఉప న్యాసాలు వీనులవిందుగా ఉండేవి.

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పించాలన్న ఉద్దేశంతో 1 నుంచి 5 వ తరగతి వరకు 'తెలుగు భారతి' అనే పేరుతో పాఠ్యపుస్తకాన్ని రూపొందించారు. తెలుగు వెలుగులు బాపు-రమణల నేతృత్వంలో దృశ్య శ్రవణ రూపంలో పిల్లలకు తెలుగు పాఠాలు అందించారు.

దక్కనీ సంస్కృతితో విలసిల్లిన హైదరాబాద్‌కు తెలుగు సొబగులు అద్దిన ఘనత ఎన్టీఆర్‌దే. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినా, 1980వ దశకం వరకు హైదరాబాద్‌లో తెలుగుకు ప్రాధాన్యం లేదు. ఎన్టీ రామారావు రాజకీయ రంగప్రవేశం చేసిన తర్వాత, హైదరాబాదు నగరంతో తెలుగువారు, మరీ ముఖ్యంగా, కోస్తా, రాయలసీమ ప్రాంతాలవారు మమేకమయ్యారు. ఈ కారణం చేతనే 80వ దశకంలో హైదరాబాదు జనాభా పెరుగుదల గణనీయంగా ఉంది. 1950వ దశకంలో హైదరాబాదు జనాభా పెరుగుదల ఏటేటా 1.07 శాతం మాత్రమే ఉండగా, 1980-1990 దశకంలో ఏటేటా 5.50 శాతం జనాభా పెరిగింది.

ఎన్టీఆర్ హయాంలో నగరంలో తెలుగు భాషకు, తెలుగు సాంప్రదాయక కళలకు ఆదరం పెరిగింది. హైదరాబాద్‌కు ఒడ్డాణంలా ఉన్న హుస్సేన్‌సాగర్ మీద ఉన్న ట్యాంక్‌బండ్‌ను విస్తరించి, తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళాప్రాంగణం పేరుతో 1986లో ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు ఎన్టీఆర్ కృషివల్లే సాధ్యమైంది. ట్యాంక్ బండ్‌లో తెలుగువారి విగ్రహాలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. పక్కనే హుస్సేన్ సాగర్‌లో ఎత్తైన బుద్ధ విగ్రహ స్థాపన కూడా తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేస్తుంది.

జాతీయ ప్రత్యామ్నాయం

ప్రాంతీయ నాయకుడిగా ప్రవేశం చేసినా జాతీయస్థాయిలో చక్రం తిప్పిన ఘనత ఎన్టీఆర్‌దే. జాతీయస్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయానికి కృషి చేయడం ద్వారా ఆయన నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. ప్రాంతీయ పార్టీ స్థాపకుడైనా జాతీయస్థాయి నాయకుడిగా ఎన్టీఆర్ అచిరకాలంలోనే ఎదిగారు. "ప్రాంతీయ పార్టీ నాయకుడిగా ఉండి జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేస్తున్న రాజకీయవేత్త ఎన్ టి రామారావు. జాతీయపార్టీలో ఉన్న ప్రాంతీయ నాయకుడిని నేను," అని సీనియర్ రాజకీయ నాయకుడు, దివంగత ఎస్. జైపాల్ రెడ్డి అందుకే అన్నారు. 1983లోనే విజయవాడలో ప్రతిపక్షాలతో ప్రాంతీయ సదస్సును ఏర్పాటుచేసి ఏకాకికలంగా ఉన్న కాంగ్రెసేతర పార్టీలను ఏకం చేసే ప్రయత్నానికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. 1980వ దశకంలో దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు కేంద్రంగా ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ఉండేదనడంలో అతిశయోక్తి లేదు.

కాంగ్రెసేతర రాజకీయ శక్తుల ఏకీకరణ కోసం ఎన్టీఆర్ దేశ వ్యాప్తంగా పర్యటించారు. ఉత్తరాదితో సహా దేశంలో 16 రాష్ట్రాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుజరాత్ నుంచి బెంగాల్ వరకు, కాశ్మీర్ నుంచి తమిళనాడు వరకు అన్నిచోట్లా జనం ఆయనకు నీరాజనాలు పట్టారు. అస్సాంలో అసోం గణ పరిషత్ గెలుపునకు కృషిచేశారు. హర్యానా పర్యటనలో చైతన్య రథంపై నుంచి ఆయన హిందీలో చేసిన ప్రసంగాలు స్థానికులను ఉర్రూతలూగించాయి. 1987 అసెంబ్లీ ఎన్నికల్లో దేవీలాల్ ఘన విజయానికి ఎన్టీఆర్ మద్దతు కారణమని హిందీ పత్రికలు రాశాయి.



ఉత్తరాదిలో ఆ స్థాయిలో ప్రజాదరణ పొందిన దక్షిణాది నాయకుడు అప్పటికి ఇప్పటికి మరొక నాయకుడు లేరు.

హర్యానాలోని గుర్గావ్ (గురుగ్రామ్)లో ఎన్టీఆర్ ఎన్నికల ప్రచారం సృష్టించిన ప్రభం జనాన్ని ప్రముఖ జర్నలిస్టు చిదానంద రాజఘట్ట టెలిగ్రాఫ్ పత్రికలో ఈ విధంగా వర్ణించారు:

"చైతన్యరథం మీద నుంచి ఎన్టీఆర్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టగానే అక్కడ చేరిన కొద్దిమంది జనం వింతగా చూశారు. కాని 'గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవోభవ' అంటూ ఆయన భావోద్వేగంతో మాట్లాడటం మొదలుపెట్టగానే జనం ముగ్ధులై వినడం ప్రారం భించారు. 'ఈ ప్రాంతాన్ని చూడగానే ద్రోణా చార్యుడు, కృష్ణుడు వంటి మహనీయులు స్మరణకి వచ్చారు. పాండవులు, కౌరవుల నడుమ ధర్మం కోసం జరిగిన యుద్ధం గుర్తుకు వస్తోంది,' అంటూ ఎన్టీఆర్ హిందీలో చేసిన ఉపన్యాసంతో స్థానికులను ఉర్రూతలూగించారు. ఆయన ప్రసంగం అయిపోయే టప్పటికి ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలను ఒక్కతాటి మీదకు తీసుకురావడంలో ఎన్టీఆర్ పాత్ర చారిత్రాత్మకం. 1977 తర్వాత కేంద్రంలో ఏక పార్టీ పాలనకు చరమగీతం పాడి, ప్రత్యామ్నాయ రాజకీయశక్తిని తయారుచేయడంలో ఎన్టీఆర్‌దే కీలకపాత్ర. దేశం లోని ఏడు రాజకీయ పార్టీలను దగ్గరకు చేర్చి, జాతీయస్థాయిలో నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేయడానికి ఆయన ఎంతో శ్రమించారు. ఈ ప్రయత్నంలో ఆయన పాత్రకు గుర్తింపుగానే నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా ఆయనకు గౌరవం దక్కింది. చరణ్‌సింగ్, విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్, మధు దండావతే, ఎబి వాజ్‌పేయి, ఎల్ కె అద్వాని, దేవిలాల్, బిజూ పట్నాయక్, జ్యోతిబసు, ఫరూక్ అబ్దుల్లా, ఎం కరుణానిధి, రామకృష్ణ హెగ్డే, శరద్ యాదవ్ వంటి జాతీయ, ప్రాంతీయ నాయకుల ఆదరణ, అభిమానాన్ని పొందిన నాయకుడు ఎన్టీఆర్.

1989లో స్వరాష్ట్రంలో ఓటమి సంభవించకుండా ఉంటే, దేశంలో అత్యున్నత పదవులు అధిరోహించే అవకాశం ఎన్టీఆర్‌కి ఉండేదని పరిశీలకుల అభిప్రాయం. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటులో ఆయనది ముఖ్యపాత్ర అయినప్పటికి ఎన్టీఆర్ పదవి కోరుకోలేదు. అంతర్గత విభేదాలతో సతమతమైన ఫ్రంట్ ప్రభుత్వాన్ని నిలపడానికి ఆయన శాయశక్తులా కృషిచేశారు.

చాలా తక్కువ కాలం రాజకీయాల్లో ఉన్నప్పటికి తెలుగు సమాజంపై అమిత ప్రభావం చూపిన నాయకుడు ఎన్టీఆర్. ఆయన వ్యవహార శైలి మీద, కొన్ని అనాలోచిత విధానాల మీద, వ్యక్తి పూజని ప్రోత్సహించడం మీద, తొందరపాటు నిర్ణయాల మీద అనేక విమర్శ లున్నాయి. అలాగే వ్యక్తిగత జీవితంలో తీసుకున్న నిర్ణయాలు ఆయన రాజకీయ పతనానికి దారితీసిన పరిస్థితుల మీద రకరకాల అభిప్రాయాలున్నాయి. అయితే తెలుగువారు ఉచ్ఛస్థితిలో ఉండా లని, తెలుగుదనం పరిఢవిల్లాలని, సంక్షేమ ఫలాలు అందరికి అందాలని, అవినీతిని మట్టుబెట్టాలని, పాలనలో పారదర్శకత ఉండాలని ఆయన చేసిన కృషి అజరామరం.


సంకుచితత్వానికి చోటులేని ఆత్మగౌరవవాదిగా, జాతీయత పుణికిపుచ్చుకున్న ప్రాంతీయ నాయకుడిగా, ఆధ్యాత్మిక భావాలున్న లౌకికవాదిగా, సోషలిజం మీద మక్కువ ఉన్న వ్యక్తివాదిగా, అతి రథులు, మహారథులనుకున్న వారిని ఆమడ దూరంలో ఉంచి, సామాన్యులని అక్కున చేర్చుకున్న ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ ఒక విలక్షణ రాజకీయనేత. తెలుగు సమాజం మీద ఆయన వేసిన ముద్ర చాలాకాలం ఉంటుంది.



*కందుల రమేష్ సీనియర్ జర్నలిస్టు, రచయిత. ఆంధ్రప్రదేశ్ పత్రిక పూర్వ సంపాదకులు. ఆయన ఇంగ్లీషులో రాసిన **Maverick Messiah - A Political Biography of N.T. Rama Rao** పుస్తకాన్ని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ప్రచురించింది. అమరావతి వాస్తవాలు పుస్తకాన్ని ప్రచురించారు. నివాసం హైదరాబాద్.*

దర్శకుడుగా ఎన్.టి.ఆర్.

విజయ చంద్రహాస్ ముద్దుకూరి



నందమూరి తారక రామారావు అందగాడు. అంత అందగాడు తెలుగుతెర మీదే కాదు, అఖిలభారత స్థాయిలో కూడా లేడు. రూప సుందరుడు, నాజూకు నలకూబరుడు అని వేటూరి అభివర్ణించిన ఆయన విగ్రహంలోని ఆకర్షణ తొలి సంవత్సరాలో చాలాకాలం ఆయనలో నటుడిని డామినేట్ చేసింది కూడా. కానీ ఉత్తరోత్తరా ముఖ్యంగా పాండురంగ మహాత్మ్యం తరువాత ఆయన గొప్ప నటుడు అన్న విషయం అందరి మనసుల్లో నిర్వివాదాంశం అయ్యింది. ఈరోజు తెలుగుతెరనలంకరించిన మహానటుల్లో, ముఖ్యంగా కథానాయకుల్లో ఆయన పేరు తరవాతనే ఎవరి పేరైనా ప్రస్తావనకొస్తుంది.

ఆయన చాలా మంచి నిర్మాత కూడా. వాహిని, విజయా వంటి సంస్థలతో పాటు యాభయ్యవ దశకంలోని ఉత్తమ నిర్మాణ సంస్థలుగా దుక్కిపాటి మధుసూదనరావుగారి అన్నపూర్ణా, డిఎల్ నారాయణగారి వినోదా, భానుమతిరామకృష్ణగార్ల భరణి, రామారావు-త్రివిక్రమరావు సోదరుల ఎన్ఏటీ మొదలైనవి ఇప్పటికీ చెప్పుకుంటాం.

ఎన్ఏటీ సంస్థ ద్వారా నందమూరి సోదరులు తోడుదొంగలు, పిచ్చిపుల్లయ్య వంటి ఆదర్శవంతమైన అవార్డు చిత్రాల నిర్మాణంతో మొదలుపెట్టి జయసింహ వంటి ఘనవిజయాలను సొంతం చేసుకుని తొలిరోజుల నుండి నిర్మాతలుగా గాఢమైన ముద్ర వేశారు.

ఇవిగాక తరువాతి రోజుల్లో స్టూడియో అధినేతగా, థియేటర్ల అధినేతగా కూడా రామారావు తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు.

ఇక ఆయన రాజకీయ ప్రస్థానం అనేక విధాలుగా చరిత్ర సృష్టించినది.

అయితే, ఇన్ని విభిన్నకోణాలలో ఆయన సాధించిన అనితర సాధ్య విజయాలు రామారావులోని గొప్ప దర్శకుడిని విమర్శకుల

దృష్టిలో, ప్రేక్షకుల దృష్టిలో అంతగా పడకుండా చేశాయి. ఆయన చివరి సినిమా చేసిన మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ రోజుకూ రామారావుగారిలోని ఇతర పార్శ్వాల మాటున ఆయన దర్శకత్వ ప్రతిభ దాగి ఉండటం తెలుగులోని గొప్ప దర్శకుల చర్చలో ఆయన పేరు ప్రస్తావించబడకపోవటం ఒక చారిత్రాత్మక లోపం.

నటుడిగా దర్శకుల పట్ల అయనకున్న గురుభావం, దర్శకత్వం చేయడానికి ఆయనను ప్రేరేపించిన కారణాలు, దర్శకుడిగా ఆయన శైలి, పాటించిన పద్ధతులు, ఇతర దర్శకులతో పోల్చితే ఆయన వైశిష్ట్యం మొదలైన విషయాలు స్పృశించడం ద్వారా ఆ లోటును కొంతవరకైనా తీర్చే దశగా ఈ వ్యాసం ఉపకరిస్తుందని ఆశిస్తున్నాం.

ఆదినుంచీ దర్శకుల పట్ల గౌరవం...

తనను నటుడిగా తీర్చిదిద్ది ఉత్తమ కథానాయకుడిగా ఎదగటానికి ముఖ్యకారకులైన దర్శకుల పట్ల రామారావుకు తొలిరోజుల నుండీ అపారమైన గౌరవం ఉండేది. సినిమా మాధ్యమంలో దర్శకుడిదే ప్రముఖస్థానం. దర్శకుడిని కెప్టెన్ ఆఫ్ ది షిప్ అనీ, సినిమాను డైరెక్టర్స్ మీడియం అనీ అంటారని మనకు తెలుసు. తాను అగ్రనటుడుగా సినీరంగాన్ని శాసించే రోజుల్లో కూడా చివరి వరకు దర్శకులకు ఆయన ఇచ్చిన విలువ గురించి పీసీ రెడ్డి, కోదండరామిరెడ్డి వంటి అప్పటి యువదర్శకులు ఎంతో ఉన్నతంగా చెప్పారు. తాను దర్శకుడై వుండి తోటి దర్శకుడికి ఆయన ఇచ్చే గౌరవాభిమానాలకు ఒక్కొక్కసారి కళ్లల్లో నీళ్లు తిరిగేవి అని కోదండరామిరెడ్డి ఒకసారి చెప్పారు.

దర్శకత్వం పట్ల అనురక్తి...

అయితే రామారావుగారికి తానే స్వయంగా దర్శకత్వం వహించాలనే కోరిక ఎలా కలిగింది అనేది ఒక ఆసక్తికరమైన కథ.

1950లో షావుకారు సినిమాలో నటించిన తర్వాత విజయవాహిని సంస్థలవాళ్లు ఆయనతో రెండేళ్లు కాంట్రాక్ట్ వ్రాసుకున్నారు. ఆ రెండేళ్లలో ఆయన వేరే సినిమాల్లో నటించకూడదు అన్న నియమంతో.



ముగ్గురు దిగ్గంతులు అయిన దర్శకులు - కె.వి.రెడ్డి, ఎల్వీ ప్రసాద్, బి.ఎన్.రెడ్డి- వీరి దర్శకత్వంలో మూడు సినిమాల్లో నటించే అవకాశం. హీరోగా అయితేనే చేస్తాను అన్న నియమంతో రామారావు ఈ ఒప్పందానికి అంగీకరించారు.

అంత గొప్పవారి చేతిలో తన భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడం గొప్ప అవకాశం అనీ, అప్పటికి కూడా రాణించలేకపోతే మద్రాస్ వదిలి వెళ్లిపోవాలని కూడా అనుకున్నారట. ఈ కాంట్రాక్టు వల్ల వచ్చిన నికరమైన ఆదాయం, భద్రత చూసిన తర్వాతనే ఆయన కుటుంబాన్ని మద్రాస్‌కు తీసుకొచ్చారని చెప్తారు. ఆ మూడు సినిమాలు- పాతాళభైరవి, పెళ్లి చేసి చూడు, మల్లీశ్వరి- ఎంత విజయం సాధించాయో, ప్రేక్షకుల విమర్శకుల ప్రశంసలు పొందాయో, ఈనాటికి కూడా కళాఖండాలుగా గుర్తించబడుతున్నాయో అందరికీ తెలుసు.

ఈ ముగ్గురు దర్శకుల పట్ల చివరివరకు ఆయన గురుభావంతోనే ఉండేవారు. ఈరోజు వరకు అంతకన్నా గొప్ప దర్శకులు తెలుగులో లేరు అన్నారు ఒకసారి. పరోక్షంగా తర్వాత రామారావు సొంతంగా దర్శకత్వం చేపట్టడంలో గురుతుల్యులుగా వీరి ప్రభావం చాలా ఉంది. ప్రత్యక్షంగా గురువులు లేకపోయినా సెట్టు మీద కెవి, బిఎన్ చూపించిన ఏకాగ్రత, దీక్ష తనకు దర్శకత్వం చేపట్టడానికి ప్రోత్సాహం కలిగించాయి అని ఒక సందర్భంలో ఆయనే చెప్పారు.

కె.వి. రెడ్డితో అనుబంధం

ఈ ముగ్గురిలో కూడా కెవి రెడ్డిగారి పట్ల రామారావుకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. కేవీ సినిమా తీసే విధానం వర్ధమాన దర్శకులకు ఒక పాఠ్యపుస్తకంలా ఉండేదని పరిశ్రమలో చెప్పుకునేవారు. స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధం చేసుకోవడం, ప్రతి విషయాన్ని ముందుగా ప్లాన్ చేసుకోవడం, అనవసర వ్యయం లేకుండా చూసుకోవటం, ఎంతో దీక్షాదక్షతలతో సినిమాను రూపొందించడం మొదలైన విషయాలు కేవీ రెడ్డిని చూసే ఆయన నేర్చుకున్నారు.

నర్తనశాలలోని బృహన్నల వేషం గురించి కొంత మథనపడి, ఆ పాత్రకు మేకప్, కాస్ట్యూమ్ రూపొందించుకుని కేవీ రెడ్డికి చూపించాక ఆయన ఓకే అన్న తర్వాతనే ఆ పాత్రకు అంగీకరించారని మనకు తెలుసు.

చివరిరోజుల్లో కె.వి. రెడ్డి ఆర్థిక సహాయం కోరినప్పుడు శ్రీకృష్ణసత్యకు దర్శకత్వం చేసే అవకాశం ఇచ్చి, ఆయన ఆరోగ్యం బాగోనప్పుడు డైరెక్టర్ కుర్చీలో కేవీని కూర్చోబెట్టి, దర్శకత్వం తాను చేసి, పేరు, డబ్బు కేవీ రెడ్డిగారికి చెందేలా చేయడం రామారావుకు కె.వి. పట్ల ఉన్న గౌరవానికి మరో ఉదాహరణ.

రామారావు తొలిసారి దర్శకత్వం చేపట్టడంలో ప్రత్యక్షంగా కూడా కొంత కె.వి. రెడ్డి పాత్ర ఉంది.

సీతారామకళ్యాణం సినిమాను ముందు రామారావు రాముడిగా కె.వి.రెడ్డి దర్శకత్వంలో అనుకున్నారు. అయితే రావణ పాత్ర గురించి చదివినకొద్దీ ఆ పాత్ర మీద ఆసక్తి పెరిగి, నటనకు అందులో ఎంతో అవకాశం ఉందనిపించి, ఆ పాత్ర తనే వెయ్యాలని



ముచ్చటపడ్డారు రామారావు. ఈ పాత్ర మీద ఆయన అభిమానం 'నా అభిమాన పాత్ర రావణ,' అని ఆంధ్ర సచిత్ర వారపత్రిక '61 సంక్రాంతి సంచికలో ఒక విపులమైన వ్యాసం వ్రాసే వరకూ వెళ్లింది. 'బ్రహ్మవంశ సంజాతుడు, నిత్యశివపూజా దురంధరుడు, మహా పండితుడు, రసజ్ఞుడు, కళాప్రపూర్ణుడు, పట్టినపట్టు విడవని కార్య సాధకుడు, కైలాసాన్ని పెకలించగల బలదర్పమండితుడూ అయిన రావణబ్రహ్మ పరనారీ వ్యామోహం, వైష్ణవద్వేషం, అహంభావం వల్ల రాక్షసుడిగా పరిగణింపబడ్డాడు. అతనిలో లేని రసం లేదు. కావలసినంత సరసం, ఉండరానంత విరసం ఉన్నాయి. ఆ పాత్ర సజీవం కావడం వల్లనే నన్ను ఇంతగా ఆకర్షించింది,' అని ఆయన వ్రాసుకున్నారు.

కానీ కె.వి. రెడ్డి ఇందుకు అంగీకరించలేదు. నిన్ను కృష్ణుడిగా చూపించిన నేను రాక్షసుడిగా చూపించలేను అని కెవి చెయ్య నన్నారు. సిద్ధసంకల్పుడైన రామారావు తొలిసారి (కె.వి. పట్ల గౌరవంతో తన పేరు వేసుకోకుండా) దర్శకత్వం తాను స్వయంగా చేసి సంచలన విజయం సాధించారు.

కేవీ రెడ్డిగారి దగ్గర చాలాకాలం సహాయకుడిగా పనిచేసిన సింగీతం శ్రీనివాసరావు ఈమధ్య ఒక ఆసక్తికరమైన కథ చెప్పారు. శ్రీకృష్ణపాండవీయం తీసిన రోజులలో కేవీరెడ్డితో కూర్చొని రామారావు తన కిష్టమైన జీడిపప్పు పకోడీ చేయించి తినమని కేవీని బలవంతపెట్టారట. ఆయనకు తినటమేగాక, స్వయంగా వడ్డించి ఇతరుల చేత తినిపించటంకూడా ఇష్టమైన విషయాలని మనకు తెలుసు. మిస్టర్ రామారావ్, నాకు చూస్తే తినాలని ఉందిగానీ ఆరోగ్యరీత్యా తినలేను అంటూనే కేవీ అవి తిన్న తరవాత, ఆయన చేయి కడుక్కోటానికి స్వయంగా నీళ్లు పోస్తూ రామారావు అడిగా రట. 'నాకు మీ దర్శకత్వంలో బాలనాగమ్మ తీయాలని ఉంది, కానీ అందులో నేను మాయల మరాఠీ వేస్తాను. మీరు సరేనంటే నా సంస్థ, బలగం అంతా మీ ఆధీనంలో పెడతాను,' అని. కేవీ 'దైవేచ్ఛ' అని సమాధానమిచ్చారట.

కేవీ పట్ల రామారావుకున్న అభిమానంతోపాటు, తన నటనాశక్తికి అవకాశం ఉన్న అతిశయం, ఔద్ధత్యంగల పాత్ర ఆయన దర్శకత్వంలో చేయాలన్న కోరిక పోలేదని ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది. చివరికి శ్రీకృష్ణసత్యలో రావణ పాత్ర వేయటం ద్వారా తన కోరిక కొంతవరకూ తీర్చుకున్నారు రామారావు.

తల్లిదండ్రులకు కానుక

మరలా సీతారామకల్యాణం దగ్గరకొస్తే ఆయన తొలిసారి దర్శకత్వం చేపట్టడానికి మరో కారణం కూడా ఉంది. పరిశ్రమకు వచ్చి అప్పటికి పుష్కరం దాటినా, నటుడిగా ఎన్ని విజయాలు సాధించినా, అంతవరకూ చేసిన చిత్రాలు పూర్తిగా తన సృష్టి కాదు అన్న అసంతృప్తి సృజనాత్మక కళాకారుడిగా ఆయనలో ఉండేది. తాను దర్శకుడుగా ఒక ఉత్తమ కళాసృష్టి చేసి ఆ చిత్రాన్ని తల్లి దండ్రులకు కానుకగా ఇస్తే వారి రుణం తీర్చుకున్నట్టు అవుతుం దని ఆయన భావించారు.

'ఏ చిత్రానికైనా సృష్టికర్త దర్శకుడు కదా. దర్శకుడిగా నా మనోభావాలను నా సృజనాత్మకశక్తిని ప్రతిఫలింపచేసి తెలుగు దేశంలో నిర్వివాదంగా చిన్నా పెద్దా అంతా మెచ్చే చిత్రాన్ని రూపొం దించాలని, నా తల్లిదండ్రుల పాదాల చెంత తనయుని చిన్న కానుకగా సమర్పించాలని నిశ్చయించుకున్నాను,' అని 'తెలుగు సినిమా' మాసపత్రికలో ఒకసారి చెప్పారు రామారావు.

ఆయన దర్శకత్వ శైలి, పద్ధతులగురించి తరచి చూస్తే చాలా విషయాలు సుబోధక మవుతాయి.

రామారావు దర్శకత్వం వహించేటప్పుడు అగ్రదర్శకులను చూసి నేర్చుకున్న పద్ధతులతో పాటు సొంతంగా తను అనుభవ పూర్వకంగా నమ్మిన సంప్రదాయాలు కూడా పాటించేవారు.

కథేమిటని అడిగితే కేవీ, బివిన్ నవ్వేవారట. స్క్రిప్ట్ తీసుకుని చదవాలిగాని కథ అడుగుతావేమిటి అని. ఆరోజుల్లోనే అంటే 60వ దశకంలోనే షూటింగ్‌కు ముందు పూర్తిగా స్క్రిప్టులు సిద్ధం చేసుకునే పద్ధతి అందరూ పాటించేవారు కారు. తను దర్శకత్వం చేసిన సినిమాల్లో మాత్రం ఈ ఆదర్శాన్ని రామారావు చివరివరకూ పాటించారు. నటీనటులకు స్క్రిప్ట్ ముందే ఇచ్చి చదువుకు రమ్మని చెప్పేవారు. సెట్ మీదకు వెళ్లాక ఇతర ఆలోచనలు లేకుండా పాత్ర, నటన వీటి గురించి మాత్రమే ఆలోచించాలని ఆయన అభిప్రాయ పడేవారు.

అంతేగాక, నటుడిగా స్వయంగా తాను పాటించే విధంగా పురాణపాత్రలు ధరించినప్పుడు, ఆ పాత్ర పవిత్రతకు అనుగుణంగా నియమబద్ధంగా ప్రవర్తించాలని తన దర్శకత్వంలో నటించిన వారికి కూడా చెప్పేవారు. ఎవరైనా తద్భిన్నంగా వ్యవహరిస్తే బాధపడేవారని, పిలిచి మాట్లాడేవారని అంటారు.

ఇక్కడ హరనాథ్ విషయం చెప్పుకోవాలి. శ్రీరాముని పాత్ర సీతారామకళ్యాణంలో ముందు రామారావే చేయవలసి ఉందని చెప్పుకున్నాం. అంతకు రెండు సంవత్సరాల క్రితమే తమిళ సంపూర్ణ రామాయణం సినిమా రామారావు శ్రీరాముడిగా, పద్మిని సీతగా ఘన విజయం సాధించింది. మరోపక్క లవకుశ నిర్మాణం కూడా సాగుతోంది.

ఈ నేపథ్యంలో సుకుమారుడైన రాముడిగా అప్పటి వర్ధమాన నటుడు హరనాథ్‌ను, చిన్నారి జానకిగా ఎటువంటి అనుభవంలేని గీతాంజలినీ ఎంపిక చేసారు రామారావు. భీష్మ సినిమాలో కృష్ణుడిగా కూడా రామారావు చెప్పిన మీదటే హరనాథ్‌ను తీసుకున్నారు. ఈ రెండు పాత్రలు సహజంగా అందగాడైన హరనాథ్‌కు సువర్ణావకాశాలు అయ్యాయి. ఈరోజు మనం హరనాథ్‌ని గుర్తుపెట్టుకునేది ప్రధానంగా ఈ పాత్రల వల్లే.

అయితే హరనాథ్‌కున్న వ్యసనాల గురించి తెలిసి, పిలిచి, హితవు చెప్పి తన సినిమా వరకు ఆయన జాగ్రత్తపడేలా చేసారట రామారావు. ఒక నటుడుగా తనకు అనుకున్న, అద్భుతమైన పాటలు ఉన్న హీరో పాత్రను, అదీ భగవంతుడి పాత్రను, సొంత సినిమాలో మరో వర్ధమాన నటుడికి ఇవ్వటం ఆయన పెద్దమనసుకు తార్కాణమైతే, హరనాథ్‌ను శ్రీరాముడిగా అమోఘంగా చూపించటం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. కేవీరెడ్డి రామారావును శ్రీకృష్ణుడిని చేస్తే, హరనాథ్‌ను రామారావు శ్రీరాముడిని చేసారు.

ఇక సీతగా గీతాంజలిని ఎన్నుకున్నాక ఆమె కుటుంబం మొత్తం చాలాకాలం రామారావుగారి ఇంటి అవుట్ హౌస్‌లో ఉన్నారు. అభినయం, వాచికం, నృత్యం మొదలైనవి నేర్పించి ఒక చక్కని నటిగా ఆవిడను తీర్చిదిద్ది, మంచి కళాకారిణిని చేసిన రామారావుగారి గురించి 'మా పెద్దాయన' అంటూ ఇప్పటికీ ఆవిడ ఎంతో గొప్పగా చెప్తారు.

సీతారాములుగా హరనాథ్, గీతాంజలి ఎంత కన్నుల పండుగగా ఉంటారో మనకు తెలుసు.

దర్శకుడిగా ఇతర నటులలోని ప్రతిభను గుర్తించడం, వారికి మంచి అవకాశాలు కల్పించడం, తెరమీద వారిని ప్రతిభావంతంగా ఆవిష్కరించడం- వీటిలో రామారావు మరే దర్శకుడికీ తీసిపోరు అనటానికి ఇంకా అనేక ఉదాహరణలు ఉన్నాయి.

శకుని అంటే మనకు సిఎస్ఆర్ (మాయాబజార్), లింగమూర్తి (పాండవ వనవాసం), జ్ఞాపకం వస్తారు. వీరి సరసన ధూళిపాళ సీతారామశాస్త్రిగారిని కూర్చోబెట్టినది రామారావు దర్శకత్వంలో శ్రీకృష్ణ పాండవీయం, దానవీరశూరకర్ణ చిత్రాల్లో ఆయన చేసిన శకుని పాత్రలే. పగతో, ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న గాంధార యువరాజుగా, కౌరవనాశనం కోరి దుర్యోధనుని పెడత్రోవ పట్టించిన కపట నాటకునిగా, శకునిలో వివిధ కోణాలు చూపించడం ఈరోజుకు కూడా అబ్బురంగానే ఉంటుంది.

ఈ విషయమై ధూళిపాళ చెప్పిన మాటలనుబట్టి దర్శకుడిగా రామారావు నటులను ఏరకంగా హ్యాండిల్ చేసేవారో తెలుస్తుంది.

శ్రీకృష్ణపాండవీయంలో శకుని ప్రాత్ర రూపకల్పన గురించి ఎన్నోసార్లు వివరించారని, స్క్రిప్ట్ ఇచ్చి చదువుకోమన్నారని, సినిమాల్లో స్క్రిప్ట్ మొత్తం చేతిలో పడటం తనకు అదే మొదటిసారి అని, ఒకసారి వ్రాసారు ధూళిపాళ. దర్శకత్వం, ద్విపాత్రాభినయం చేస్తూ శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమిస్తూ కూడా ఎన్నడూ రుసరుసలాడకుండా, విసుక్కోకుండా, ఎంతో ఓర్పుతో ఉండే దర్శకుడని, వివరంగా చెప్పి నటులలో ఉత్సాహాన్ని రేకెత్తించి, తనకు కావలసిన భావప్రకటనను రాబట్టుకునేవారని, ప్రతిరోజు స్వహస్తాలతో మేకప్ తర్వాత తిలకం దిద్దేవారని, తాను స్వయంగా గొప్పనటుడైనా ఏనాడూ తనను అనుకరించమని చెప్పేవారు కాదని, భావాన్ని తనదిగా చేసుకుని స్వేచ్ఛగా నటించమని చెప్పేవారని, రామారావు దర్శకత్వంలో పనిచేయటం చాలా సరదాగా గడిచిపోతుంది అని కూడా ధూళిపాళ వ్రాసారు.

దానవీరశూరకర్ణ సినిమాలో, 'రాజసూయము సాగరాదు, మేమేగరాదు,' అని దుర్యోధనుడు అన్నప్పుడు, 'అని గట్టిగా అనరాదు వేరొకరు వినరాదు,' అని శకుని చెప్పే మాట ఉంటుంది. ఇది ముందు రామారావు అనుకున్నది దుష్టచతుష్టయం అందరూ కలిసి ఉండగా ఈ సంభాషణ జరగాలని. కానీ దుర్యోధనుడు దుశ్శాసనుడితో మొదటి మాట చెప్తే, శకుని చాటు నుంచి వచ్చి ప్రత్యుత్తరం ఇస్తే బాగుంటుందని ధూళిపాళ సజెషన్ ఇచ్చారట. ఇది ఇంకా బావుందని ధూళిపాళ చెప్పినట్టే ఆ సన్నివేశాన్ని చిత్రీకరించారు రామారావు. ఇది చూడటానికి చాలా ఎఫెక్టివ్‌గా ఉంటుంది. తన నటీనటుల ఆలోచనలు కూడా పరిగణనలోకి తీసుకునే దర్శకుడు ఆయన.

సీనియర్ నటీమణి, కమనీయ గాయని శాంతకుమారి వెంకటేశ్వర మహాత్మ్యంలో వకుళగా (ఇంకా శ్రీకృష్ణాంజనేయ యుద్ధంలో యశోదగా) రామారావు తల్లిగా వేశారు.

తల్లా-పెళ్లామా సినిమా తీసినప్పుడు తల్లి పాత్ర మంచిదేనా నాయనా అని శాంతకుమారి అడిగితే, 'throughout మీదే అక్కయ్య గారు, అందుకే మిమ్మల్ని తీసుకుంటున్నాను,' అని చెప్పటమే కాకుండా, 'మీరు ఇందులో పాట పాడుతున్నారు, ఆ పాట అంతటా మోగిపోవాల్సిందే,' అని హుషారు చేశారట రామారావు.

మొదటిరోజు సీన్ చూసి, 'అబ్బ, నేను అనుకున్నట్టు మీరు చేస్తున్నారండి. ఎంత బాగా అర్థం చేసుకున్నారండి మీ వేషం గురించి,' అని ప్రశంసించడంగాక, ఈ మాటలు కేవలం శుష్క ప్రియాలు కావని, 'కృష్ణయ్య! మమతలెరిగిన నా తండ్రీ,' అని పాడుతూ శాంతకుమారి పాత్ర కృష్ణైక్యం అయిపోయే సన్నివేశాన్ని కరుణారసభరితంగా అద్భుతంగా 32 షాట్స్‌లో తీశారని మురిసిపోతూ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు శాంతకుమారి. ఆమెకు సాటి నటుడిగా, దర్శకుడిగా రామారావు చేసిన గొప్ప గౌరవమే ఇది.

నటులు సున్నిత స్వభావులు అని స్వయంగా తెలిసినవారు కావడంతో తన దర్శకత్వంలో వారితో ఆయన వ్యవహరించే విధానం ఇతర దర్శకులతో పోలిస్తే భిన్నంగా ఉండేది. మామూలుగా సీరియస్‌గా, గంభీరంగా కనిపించే ఆయన దర్శకుడిగా చాలా చనువుగా కలుపుగోలుగా మారిపోయేవారు. తనతో సమానంగా, తనకంటే ఎక్కువగా సహ నటీనటుల ప్రతిభకు పట్టం కట్టేవారు.

శ్రీకృష్ణపాండవీయంలో క్లైమాక్స్ చూస్తే అందులో ఆరు నిమిషాలపైన అందరికన్నా పెద్ద డైలాగులు శిశుపాలుడిగా ఉన్న రాజనాలకు ఉంటాయి.

వరకట్నం సినిమాలో కొసరాజు పాటలు హైలైట్. ఇందులో రెండు మంచి హాస్యగీతాలు పద్మనాభం-చంద్రకళ పైన, ఒక మంచి బైరాగితత్వం రేలంగిపైన, అన్నిటికంటే గొప్ప పాట, 'సై సై జోడెడ్ల బండి,' రాజనాల పైన చిత్రీకరించారు దర్శకుడు రామారావు.

అసలు ఈ సినిమాలో రామారావు, కృష్ణకుమారి పాత్రలే తరుగ్గా ఉంటాయి. రామారావుకు బావగా సత్యనారాయణ, ఆయన భార్యగా సావిత్రి, తండ్రిగా నాగభూషణం, మేజువాణిలో సరసుడిగా అల్లు రామలింగయ్య, భట్రాజుగా రావి కొండలరావు, గయ్యాళి అత్తగా సూర్యకాంతం వీరందరి పాత్రలు ఇంకా చాలా బాగుంటాయి. ముఖ్యంగా రావికొండలరావు పాత్ర అత్యంత ప్రత్యేకమైనది, మరే సినిమాలోనూ కనబడనిది.

తాతమ్మ కల కోసం భానుమతిని అడిగితే ఆయన తాతయ్య వేషం వేస్తానంటే నాకు అభ్యంతరం లేదు అన్నారట. అది న్యాయమే కదా అని ప్రత్యేకంగా తాతయ్య పాత్ర కల్పించి వారిద్దరికీ ఒక మంచి సరదా పాట కూడా సృష్టించారు రామారావు. 70లలో భానుమతిగారికి, అదీ రంగులలో, అగ్రహీరోల సరసన ఇంతకన్నా మంచి పాట మరొకటి లేదు.

రాజకీయ ప్రవేశం చేసే రోజుల్లో వచ్చిన చండశాసనుడు సినిమాలో ఊర్వశి శారద చేసిన శక్తివంతమైన చెల్లెలి పాత్ర ఆమె



నటజీవితానికి కొత్తభాష్యం చెప్పి తరవాత చాలా సినిమాలకు దిశానిర్దేశం చేసింది.

తాను చేద్దామని ముచ్చటపడి రూపొందించుకున్న చాణక్య పాత్రను అడగగానే అక్కినేనికి ఇచ్చి టైటిల్స్‌లో అందరికంటే ముందు ఆయన పేరు వేయించడం రామారావు సంస్కారం. అప్పట్లో ఆ పాత్ర నాగేశ్వరరావుకు నటనాపరంగా మంచి పేరు తీసుకొచ్చింది.

శ్రీకృష్ణపాండవీయంలో ఆదిలక్ష్మి అవతారమైన రుక్మిణీదేవిగా కె.ఆర్ విజయను ముగ్ధ మనోహరంగా, సీతారామ కళ్యాణంలో బి. సరోజాదేవిని సాధ్వి మండోదరిగా చూపించడం, వరకట్నం ఇంకా ఇతర ఎన్‌ఏటీ సినిమాల్లో మహానటి సావిత్రి ధరించిన పాత్రలు కూడా ఈ సందర్భంగా చెప్పుకోవచ్చు.

సావిత్రి దర్శకత్వంలో, భానుమతి దర్శకత్వంలో నటించిన అగ్ర హీరో కూడా ఆయనే అని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. వారిపట్ల రామారావుకున్న గౌరవానికి ఇది నిదర్శనం. ఈ రోజుల్లానే ఆరోజుల్లో కూడా మహిళా దర్శకులు చాలా అరుదు. చిన్నాపెద్దా అందరినీ గౌరవించే సంస్కారంతో పాటు అరవైయ్యేళ్ల క్రితమే ఆడామగా భేదం లేకుండా అందరినీ గౌరవించే అరుదైన వ్యక్తిత్వం ఆయనది.

ఇక నందమూరి హరికృష్ణ, బాలకృష్ణ తండ్రి దర్శకత్వంలోనే ఓనమాలు దిద్దుకున్న సంగతి, తొలిరోజుల్లో మంచి నటులుగా పేరు తెచ్చుకున్న సంగతి గుర్తు చేసుకోవచ్చు.

కళాభినేత్రి వాణిశ్రీని ఒకసారి ఒక ఇంటర్వ్యూలో మీరు బాగా చేసారని ఎవరన్నా ఎప్పుడన్నా మెచ్చుకున్నారా అని అడిగితే ఆమె

కథానాయిక మొల్ల సినిమాను చూసి ఎన్టీ రామారావు ఒక దృశ్యంలో మొల్లగా వాణిశ్రీ కూర్చున్న విధానం చూసి అబ్బురపడ్డారని చెప్పారు. అలా కూర్చోవాలని దర్శకుడు చెప్పారా మీరే చేసారా అని అడిగారట. లేదు అన్నగారూ, ఏదో నాకు తెలిసినట్టు నేను చేసాను అన్నారట వాణిశ్రీ. ఇది దర్శకుడిగా ఆయన పరిశీలన ఎంత నిశితంగా ఉంటుందో చెప్పటానికి ఒక చిన్న ఉదాహరణ.

నటుడు రామారావుతో దర్శకుడు రామారావు


ఇతరులను తన దర్శకత్వంలో ఉత్తమంగా చూపించడమే గాక తనను తాను నటుడిగా కొంగ్రొత్త రీతులలో ఆవిష్కరించుకోవటానికి కూడా తనలోని దర్శకుడిని ప్రతిభావంతంగా వాడుకున్నారు రామారావు.

రావణబ్రహ్మ పాత్ర గురించి చెప్పుకున్నాం. ఈ పాత్ర చూసే ఆయనను కంచి పీఠాధిపతి విశ్వవిఖ్యాత నట సార్వభౌమ అన్నారని అంటారు.

ఇక శ్రీకృష్ణపాండవీయంలోని సుయోధన పాత్ర తీవి, దర్పం, రాజసం మూర్తీభవించిన మానధనుడిగా దుర్యోధనుడి వ్యక్తిత్వానికి సరికొత్త భాష్యం పలికి, భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఒక బంగారు అధ్యాయంగా మిగిలిపోయింది. పేజీలకు పేజీలు సంస్కృత సమాసభూయిష్ఠమైన సముద్రాలవారి డైలాగులు రక్తి చెడకుండా, మేఘగంభీర స్వరంతో అనితరసాధ్యంగా ఆయన పలికిన తీరు, ఆనాటికీ ఈనాటికీ తెలుగువారు మరువలేకుండా ఉన్నారు.

ఒక సింహం బొమ్మ మీద సుయోధనుడిగా ఆయన ఆసీనుడై ఉన్న పోస్టర్ ఇప్పటికీ చూసినవారిని విభ్రాంతులను చేస్తూనే ఉంటుంది.

ఈ పాత్రను విస్తరించి రంగులలో దానవీరశూర కర్ణలో ఆయన మరల కొండవీటి వెంకటకవిగారి సంభాషణలను అనర్గళంగా పలికినప్పుడు వాచికాభినయంలో ఎవరికీ అందనంత ఎత్తులు చేరుకున్నారు. ఈ సంభాషణలను పలకటానికి ప్రయత్నించేవారు ఈ రోజుకు కూడా ఎందరో ఉన్నారు. వర్ధమాన నటులు అభ్యసించే విషయాల్లో ఇది ఒకటి. ప్రస్తుతం ఉన్న వారిలో కొంత వాక్శుద్ధి ఉన్న నటుడు దగ్గుబాటి రానా తన ట్రైనింగ్‌లో భాగంగా దానవీరశూర కర్ణ డైలాగులు ప్రాక్టీస్ చేసానని ఒక సందర్భంలో చెప్పారు.



ఎక్కువమంది చెప్పుకోనిది, నాకు ఎంతో ఇష్టమైనది, దానవీర శూర కర్ణ లోని కర్ణ పాత్ర. దుష్టచతుష్టయంలో ఒకడిగా అనాదిగా చూడబడిన కర్ణుడిని శాపగ్రస్తుడైన విషాదాంత కథానాయకుడిగా ఆయన రూపొందించి ప్రదర్శించిన తీరు అద్భుతమే.

ఇంకా పోతులూరి వీరబ్రహ్మం, యోగివేమన, చంద్రగుప్త మౌర్యుడు, అక్బర్ పాదుషా, విశ్వామిత్రుడు, అశోకుడు మొదలైన పాత్రలు స్వీయదర్శకత్వంలోనే ఆయన ధరించారు.

వీటిలో బ్రహ్మంగారి పాత్ర ఒక సాహసం. అప్పటి ఆయన ఇతర కమర్షియల్ సినిమాలలాగా ఎటువంటి బాక్సాఫీసు సూత్రాలు లేని ఈ సినిమాతో ఘనవిజయాన్ని అందుకోవటం దర్శకుడిగా ఆయన కీర్తి కిరీటంలో ఒక కలికితురాయి.

అక్బర్‌గా అనార్కలిలో ఎస్వీ రంగారావుగారు చేశారు. దీనికి పూర్తి భిన్నంగా మొగల్-ఎ-అజాం చిత్రంలోని పృథ్వీరాజ్ కపూర్‌గారి పాత్ర పోషణను ఆదర్శంగా తీసుకుని ఉర్దూ భాషలోని లయను తెలుగులోకి నారాయణరెడ్డిగారి సంభాషణల ద్వారా తీసుకొచ్చి అక్బర్ సలీం అనార్కలి సినిమాలో ఒక ప్రశంసనీయమైన ప్రయత్నం చేశారు రామారావు.

ఎస్వీ రంగారావు, రామారావు ఒకరినొకరు బావగారు అనుకునేవారట. మహానటుడైన రంగారావు పట్ల ఆయనకు ఒక పోటీతత్వం, గౌరవం రెండూ ఉండేవి. రంగారావు వేసి పేరు తెచ్చుకున్న కీచకుడు, దుర్యోధనుడు వంటి పాత్రలను తాను చేసి చూపించాలనిపించినప్పుడు తన నిర్మాణంలోనే వాటిని చేసేవారు. రంగారావు, గోవిందరాజుల సుబ్బారావువంటి గొప్ప కారెక్టర్ నటులు వేసిన బాలనాగమ్మ మరాఠీ పాత్ర కూడా వేయాలన్న మోజు ఉండేదని ముందే చెప్పుకున్నాం.

చివరివరకు తనలోని నటుడికి సంతృప్తి కలిగేలా ప్రయోగాలు చేస్తూనే ఉన్నారాయన. ఈ ప్రయోగాలు అన్నిసార్లు విజయవంతం కాకపోయినా ఆయన ప్రయోగశీలత, నటుడిగా తపన, ఇతర నిర్మాతల డబ్బుతో కాక స్వంత ఖర్చుతో చేయడం ఇవన్నీ గమనించాలి. నటుడు రామారావులోని తపనకు దర్శకుడు రామారావు అమోఘంగా తోడ్పాటునిచ్చారని కూడా మనకు తెలుస్తుంది.

కథ... స్క్రీన్ ప్లే...

నిర్మాతగా దర్శకుడిగా ఎన్నుకునే ప్రతి కథకు ఏదో పరమార్థం ఉండాలని ప్రేక్షకుడు ప్రయోజనకరమైన ప్రాపంచిక నీతిని తెలుసుకోవాలని, దేశభక్తి జాతీయభావం నిండి ఉండాలి అని, మన జాతి, దేశం ఎంత గొప్పదో మన సంస్కృతి ఎంత చైతన్య

వంతమైనదో తెలియచెప్పే చిత్రాలు రావాలని రామారావు ఒక సందర్భంలో చెప్పారు.

కేవలం జనరంజనం కోసం తీసిన గులేబకావళి కథను పక్కన పెడితే ఆయన దర్శకత్వం వహించిన పౌరాణికాలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఒక్కొక్కసారి పురాణాలకు సమకాలీన ఆదర్శాలకు తగ్గట్టుగా కొత్త భాష్యాలు చెబుతూ, పురాణపాత్రలను చీకటి వెలుగులు ఉన్న సజీవమైన మానవులుగా చూపిస్తూ సాగాయి.

సాంఘికాలలో కూడా తనకున్న బలమైన విశ్వాసాలను, ఆదర్శాలను ప్రవేశపెడుతూ సినిమాలు తీసారు రామారావు. చాలా సినిమాలకు, ముఖ్యంగా తల్లా-పెళ్లామా, వరకట్నం, తాతమ్మ కల వంటి సాంఘికాలకు కథ కూడా రామారావుదే. (తల్లా-పెళ్లామా సినిమాను ఎల్ వి ప్రసాద్ హిందీలో *బిదాయి* అన్న పేరుతో తిరిగి తీశారు. అందులో కూడా కథారచయితగా రామారావు పేరు కనపడుతుంది. దీనికి ఆయనకు ఫిలింఫేర్ నామినేషన్ కూడా వచ్చింది. తాను సినీరంగంలోకి రావటానికి ముఖ్య కారకులైన ఎల్వీ ప్రసాద్ తన కథను తీసుకొని సినిమాగా తీయడం రామారావుకి ఎంతో సంతోషాన్ని ఇచ్చింది)

చివరిలో తీసిన చండశాసనుడు, బ్రహ్మంగారి చరిత్ర వంటి సినిమాలలో (అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక మానిఫెస్టోలో) కూడా ఆయన అభిప్రాయాలు, ఆదర్శాలు కనబడతాయి. ఈ విధంగా ఒక బలమైన తాత్విక పునాదితో కథలను ఎంచుకుని సినిమాలు తీసిన దర్శకులను తెలుగు సినిమాలో వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఇటువంటి ప్రయత్నాలలో ఆయనతో ఏకీభావం లేని వారివద్ద నుండి విమర్శలను ఎదుర్కొన్నా ఆయన ఖాతరు చేయలేదు.


ఆయన వ్యాసాలు చూస్తే తెలుగుభాష మీద రామారావుకు ఉన్న పట్టు అసాధారణమని తెలుస్తుంది. ముత్యాలకోవలాంటి అక్షరాలతో తన సినిమాలకు స్క్రీన్ ప్లే రాసి ఇతర రచయితలు వ్రాసిన సంభాషణలు కూడా మళ్లీ తన దస్తూరిలో తిరగ రాసుకుని బైండ్ చేయించి పెట్టుకునేవారట. డైలాగులు కెమెరా యాంగిల్స్ యాక్షన్ వేరువేరుగా వ్రాసుకోవడానికి మూడు రంగుల కలాలు వాడేవారట.

ఇలా ఎప్పుడో పూర్తిచేసి సిద్ధంగా ఉంచుకున్న స్క్రిప్టులు తర్వాత చాలాకాలానికి సినిమాగా తీయడం కూడా జరిగేది. చాణక్య-చంద్రగుప్త , శ్రీరామ పట్టాభిషేకం దీనికి ఉదాహరణలు.

ఇవన్నీ ఇతరులలో కనబడని ప్రత్యేకతలు.

మాటలు-పాటలు

నటనలాగే ఇతర సాంకేతిక రంగాలలో కూడా ప్రతిభను గుర్తించడంలో రామారావు దిట్ట. ఒకసారి ఒక ఆర్టిస్టు మీద నమ్మకం కుదిరితే వారికి మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వటం, కొత్తవారిని ప్రోత్సహించడం, ప్రతిభ ఉండీ అవకాశాలు సన్నగిల్లిన వారికి మరలా అవకాశాలు కల్పించడం ఇవన్నీ రామారావులో కనిపిస్తాయి.



సంగీతసాహిత్యాల విషయంలో కూడా రామారావుకు స్పష్టమైన, స్వతంత్రమైన అభిప్రాయాలు ఉండేవి.

సంభాషణల విషయంలో రామారావు మరింత శ్రద్ధ తీసుకునే వారు. తన అభిరుచికి, భావజాలానికి తగ్గ వారితోనే వ్రాయించు కునేవారు. ఆయన సినిమాల్లో డైలాగులు ప్రత్యేకంగా ఉండటం మనకు అన్ని సినిమాల్లోనూ కనబడుతుంది.

సముద్రాల రాఘవాచార్యులవారి మీద ఆయనకు విపరీ తంగా నమ్మకం, గౌరవం ఉండేవి. సీతారామ కళ్యాణం, శ్రీకృష్ణపాండవీయం మాటలు, చాలావరకు పాటలు సీనియర్ సముద్రాలవారే రాశారు. తల్లా-పెళ్లామా, శ్రీరామ పట్టాభిషేకం సంభాషణలు కూడా ఆయనవే. ఒకసారి నిర్విక్రపరాక్రమం అని సముద్రాల వ్రాస్తే అది చూసి వేటూరి నిర్విక్రగాదు నిర్వక్ర (వక్రము కానిది) అని ఉండాలి అని వాదించారట. మా ఆచార్యులుగారు వ్రాసారు కాబట్టి అది కరెక్టే అన్నారట రామారావు.

సముద్రాలవారి కుమారుడు రామానుజంను (జూనియర్) అతను మావాడే అని ఆత్మీయంగా చెప్పేవారట రామారావు. ఎన్ఏటి వారి చిత్రాలకు తొలిరోజుల్లో మంచి పాటలు కూడా వ్రాసినా రామారావు దర్శకత్వం వహించిన చిత్రాలలో (గులేబకావళి కథ, వరకట్నం) ప్రధానంగా మాటలు మాత్రమే వ్రాసారు జూనియర్ సముద్రాల. వరకట్నంలో సముద్రాల జూనియర్‌తో పాటు మద్దిపట్ల

సూరి కూడా సంభాషణలు వ్రాసారు.

రామారావుకు మరో మంచి మిత్రుడు డివి నరసరాజు. తాతమ్మకల, శ్రీ తిరుపతి వేంకటేశ్వర కళ్యాణం సినిమాలకు మాటలు వ్రాసారు.

సముద్రాల సీనియర్ బాణీలో వ్రాయగల, భావజాల సామ్యం గల రచయిత కోసం వెదికి సంస్కృతం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న హేతువాది కొండవీటి వెంకటకవిని ఒప్పించి సినిమాల్లో వ్రాయించుకున్న ప్రత్యేకత రామారావుదే. దానవీరశూర కర్ణ సినిమాకు ఆయన సంభాషణలు జగత్ప్రసిద్ధాలు. ఇదిగాక విరాట పర్వం, బ్రహ్మంగారి చరిత్ర సినిమాలకు కూడా ఆయన వ్రాసారు. ఈ అనుభవం పురస్కరించుకుని బ్రహ్మంగారి మఠం వారు కొండవీటి వెంకటకవిని తమ ఆస్థానకవిగా కూడా నియమించు కున్నారట.

దళిత నాయకుడు, కవి, రచయిత, కత్తి పద్మారావు కూడా కొండవీటి వెంకటకవితో రామారావు సినిమాలకు పని చేశారు అని అంటారు.

తెలుగేకాక ఉర్దూలో కూడా నిష్ణాతుడైన సి. నారాయణరెడ్డి, అక్బర్ సలీం అనార్కలి సినిమాకు సంభాషణలు వ్రాసారని పైన చెప్పుకున్నాం. (గొప్ప గేయ రచయిత అయిన సినారె సంభాషణలు కూడా కవితాత్మకంగానే ఉండేవి. జనానికి అంతగా రుచించక పోవడం వల్లనో ఏమో ఆయన సంభాషణలు వ్రాసిన ఏకవీర, అక్బర్ సలీం అనార్కలి రెండూ పెద్దగా ఆడలేదు.

సముద్రాలవారి తరంలోని మరో గొప్ప రచయిత పింగళి నాగేంద్రరావు చాణక్య-చంద్రగుప్త స్క్రిప్ట్ రామారావుకు అందించారు. ఆయన కేవీ రెడ్డిగారికి కూడా ఆస్థాన రచయిత అని మనకు తెలుసు. శ్రీకృష్ణసత్య స్క్రిప్ట్ కూడా ఆయనదే.

పాటల రచన దగ్గరికి వస్తే రామారావు ఆస్థానకవిగా గులేబకావళి కథతో (ఆయన మాటల్లో నటసింహద్వారం గుండా) నారాయణరెడ్డి సినీప్రవేశం జరిగాక రామారావు సినిమాల్లో ఎక్కువ భాగం పాటలు ఆయనే వ్రాసారు. నారాయణ రెడ్డిగారిని సినిమాల్లో వ్రాసే ఉద్దేశం ఉందా అంటే, మొదటి సినిమాలో అన్ని పాటలు వ్రాసే అవకాశం ఎస్తేనే వ్రాస్తానని ఆయన చెప్పడం, ఆ అవకాశం మాకే వస్తుందేమో అని రామారావు అనటం, గులేబకావళి కథకు ఆయనను తీసుకోవడం ఇదంతా అందరికీ తెలిసిన చరిత్ర. ఇందు లోని నన్ను దోచుకుందువటే, కలల అలలపై తేలెను వంటి పాటలు ఈరోజుకు కూడా జనం పాడుకునే ఆపాత మధురాలు.

గులేబకావళి కథకు మాత్రమే కాక సమ్రాట్ అశోక, బ్రహ్మర్షి విశ్వామిత్ర, చండశాసనుడు, చాణక్య-చంద్రగుప్త, అక్బర్ సలీం అనార్కలి చిత్రాలకు సింగిల్ కార్డు రచయితగా అన్ని పాటలు రామారావు అభిమాన గేయరచయితగా స్థిరపడిన నారాయణ రెడ్డే వ్రాసారు. తల్లా-పెళ్లామా సినిమాకోసం నారాయణ రెడ్డి చేత ప్రత్యేకంగా వ్రాయించుకున్న తెలుగుజాతి మనది పాట, ముందు సినిమాలో లేనిది, అప్పటి రాజకీయ ఉద్యమాలకు సమాధానంగా తెలుగుజాతి ఐక్యతను ప్రబోధిస్తూ రామారావు అప్పటికప్పుడు కల్పించినది.

శ్రీకృష్ణపాండవీయం సినిమాలోని 'మత్తు వదలరా' పాటతో మొదలుపెట్టి జానపద కవిసార్వభౌమ కొసరాజు కూడా రామారావు దర్శకత్వంలో చాలానే పాటలు వ్రాసారు. వరకట్నం పాటల గురించి ముందు ప్రస్తావించుకున్నాం. తాతమ్మ కల కోసం రామారావుకు భానుమతికి పెట్టిన యుగళగీతం కూడా కొసరాజు వ్రాసిందే. రామారావు తీసిన అనేక సాంఘికాల్లో నారాయణరెడ్డితోపాటు కొసరాజు పేరు మాత్రమే గీత రచయితగా కనబడుతుంది. బ్రహ్మంగారి చరిత్ర సినిమాలోని కొసరాజు మాత్రమే వ్రాయగలిగిన కాలజ్ఞాన తత్వాలు మకుటాయమానమైనవి.

గులేబకావళి కథలో 'ఒంటరినైపోయాను' అన్న పాట గురించి నారాయణరెడ్డి, శ్రీకృష్ణపాండవీయంలో మత్తు వదలరా పాట గురించి కొసరాజు చెప్పూ, తనకేం కావాలో కచ్చితంగా తెలిసిన జడ్జిమెంట్ ఉన్న దర్శకుడు రామారావు అని ఇద్దరూ ఒకే మాట చెప్పారు.

వేరే కవులలో దాశరథి దానవీరశూర కర్ణ సినిమాకు రెండు పాటలు వ్రాసారని ఎక్కువమందికి తెలియకపోవచ్చు.

అలాగే శ్రీరామ పట్టాభిషేకం సినిమాకు సాక్షాత్తు దేవులపల్లి కృష్ణశాస్త్రి అధిక సంఖ్యలో పాటలు వ్రాసారు అనేది కూడా ఒక ఆశ్చర్యకరమైన సంగతి.

గీత రచయితగా వేటూరి సినీప్రవేశానికి బలంగా ప్రోత్సహించింది రామారావు అని మనకు తెలుసు. రామారావు నటించిన ఎన్నో సినిమాలకు వేటూరి అత్యంత ప్రజాదరణ పొందిన పాటలు వ్రాసారు. దర్శకుడు రామారావుతో ఆయన పని చేసింది, మూడు పాటలు వ్రాసింది శ్రీమద్విరాటపర్వం సినిమాకు. ఇందులోని 'జీవితమే కృష్ణ సంగీతం' అన్న పాటను రామారావు చాలా మెచ్చు కున్నారని తనలోతను పాడుకుంటూ ఉండేవారనీ వేటూరి వ్రాసు కున్నారు. అలాగే ఉత్తర నాట్యం చేసే సన్నివేశానికి 'ఆడవే హంస గమన' అని వేటూరి వ్రాస్తే, 'ఇక్కడ హంస గమన అనడం ఔచితీ మంతంగా ఉందా,' అన్న చర్చ వచ్చిందట. హంస అంటే పక్షి కాదు సూర్యుడు. సూర్యునిలా గతి తప్పకుండా ఆడమని అర్థం అని వేటూరి చెప్తే కొండవీటి వెంకటకవి ఆయనను కౌగిలించు కున్నారట. రామారావు ఎంతో సంతోషించారట. శ్రీరామ పట్టాభిషేకం, విరాటపర్వం సినిమాలు బాగా ఆడకపోవడంవల్ల కృష్ణశాస్త్రి, వేటూరి వ్రాసిన ఈ మంచి పాటలు కాలగర్భంలో కలిసిపోయాయి.

సంగీతం

సంగీతదర్శకుల్లో ముందుగా సీతారామ కళ్యాణం చేసిన గాలి పెంచల నరసింహారావుగారిని పేర్కొనాలి. అంతకుముందు ఎప్పుడో బాలరాజు వంటి సినిమాలకు సంగీతం చేసి తెరమరుగైన నరసింహారావుకు తిరిగి రామారావు అవకాశం ఇవ్వటం ఒక విశేషం. ఆయన చేసిన అజరామరమైన సంగీతం ఘంటసాల, సుశీల, లీల మొదలైన వారి కమనీయ కంఠాలలో ఈరోజుకీ నిలిచి ఉంది.

కొత్తవారిని ఎంపిక చేయటంలో రామారావుకున్న ప్రజ్ఞ

గులేబకావళి కథకు సంగీతం చేసిన జోసఫ్, వి. కృష్ణమూర్తి ద్వయానికి తొలిసారి అవకాశం ఇవ్వటంలో మరలా కనపడుతుంది. వారు ఎంత మంచి సంగీతం ఇచ్చారో ఆ పాటలు ఇప్పటికీ ఎలా నిలిచిపోయాయో ముందు చెప్పుకున్నాము. వీరిలో వి(విజయా) కృష్ణమూర్తి తరువాత చాలా సినిమాలకు సంగీతాన్నిచ్చారు.

ఎన్ఏటీ చిత్రాలకు ముందు నుంచి ఆస్థాన సంగీత దర్శకుడు, సినిమాకు వచ్చిన కొత్తల్లో రామారావు రూమ్మేట్ టీవీ రాజు, ఆయన దర్శకత్వం వహించిన మూడు చిత్రాలకు సంగీతం చేశారు. వీటిలో శ్రీకృష్ణ పాండవీయంను ప్రముఖంగా పేర్కొనాలి.

సాలూరు రాజేశ్వరరావు సీతారామ కళ్యాణానికి కొంత పని చేశాక తప్పుకున్నారు. మరలా ఆయన తాతమ్మ కల చిత్రానికి సంగీతం అందించారు. దానవీరశూర కర్ణ కూడా ఆయన చేయవలసి వుంది కానీ చేయలేదని అంటారు. నర్తనశాల వంటి గొప్ప చిత్రానికి సంగీతం అందించి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన సుసర్ల దక్షిణామూర్తికి తర్వాత ఎంతో కాలానికి శ్రీమద్విరాటపర్వం ద్వారా రామారావు అవకాశం ఇచ్చారు. బ్రహ్మంగారి చరిత్ర కూడా ఆయనే చేశారు.

అక్బర్ సలీం అనార్కలి సినిమాలో ప్రఖ్యాత హిందీ గాయకుడు మహమ్మద్ రఫీ పాడారని మనకు తెలుసు. దానికి సంగీతం చేసింది ప్రఖ్యాత హిందీ సంగీత దర్శకుడు సి రామచంద్ర. ఒక ఉత్తర భారత హిందుస్థాని వాతావరణం తీసుకురావటం కోసం ఇవన్నీ చేశారని అనుకోవచ్చు. ఇందులోని సిపాయీ పాట ఇప్పటికీ నిలిచి ఉంది.

తెలుగు హిందీ భాషల్లో తీసిన బ్రహ్మర్షి విశ్వామిత్రకు మరో ప్రఖ్యాత హిందీ సంగీత దర్శకుడు రవీంద్ర జైన్, సమ్రాట్ అశోకకు ఎమ్మెస్ విశ్వనాథన్ సంగీతం చేశారు.

అందరిలోకి అధికంగా నాలుగు సినిమాలు చేసి సంగీత పరంగా కూడా గొప్ప సంగీతాన్ని దర్శకుడు రామారావుకు అందించిన వారు మరెవరో కాదు పెండ్యాల నాగేశ్వరరావు. దానవీరశూర కర్ణ, చాణక్య-చంద్రగుప్త పాటలు ఈరోజుకూ అద్భుతంగా ఉంటాయి. శ్రీరామ పట్టాభిషేకం, శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం సినిమాలలో కూడా సంగీతం చాలా బాగుంటుంది. రామారావు స్వంత సినిమాలే అయినా, దర్శకుడిగా కె.వి. రెడ్డి వ్యవహరించిన శ్రీకృష్ణసత్య, యోగానంద్ దర్శకత్వం వహించిన వేములవాడ భీమకవి సినిమాలకు కూడా సంగీతం పెండ్యాల చేశారంటే డెబ్భయ్యవ దశకంలో వచ్చిన రామారావు స్వంత సినిమాల మీద ఆయన ముద్ర ఎంత ప్రగాఢమో తెలుస్తుంది. యాభై, అరవై దశకాలలో ఆయన చేసిన అత్యుత్తమమైన సంగీతానికి తీసిపోకుండా, చక్రవర్తి, సత్యం మొదలైన వారి స్వీడు యుగంలో కూడా మాధుర్యానికి ప్రాధాన్యతనిస్తూ ఈ సినిమాలకు పెండ్యాల చేసిన సంగీతం గొప్ప విశేషం.

ఇతర సాంకేతిక శాఖలు

తొలి అవకాశం రామారావు కలిగించాక చాలా పేరు తెచ్చుకున్న టెక్నీషియన్ల కోవలో సీతారామ కళ్యాణానికి పనిచేసిన కెమెరామెన్ రవికాంత్ నగాయిచ్‌ను కూడా చెప్పుకోవచ్చు.

దానవీరశూర కర్ణలో శ్రీకృష్ణుడి పాత్రకు పద్యాలు పాడటానికి ముందు బాలసుబ్రమణ్యం, మాధవపెద్ది మొదలైన వారిని ప్రయత్నించి, నచ్చక ఘంటసాల వారి కంఠానికి దగ్గరగా ఉండే రామకృష్ణను ఎంచుకున్నారు రామారావు. ఆయన పాడిన విధానానికి చాలా సంతోషించి, 'రామకృష్ణయ్యగారు, నేను సినిమాలు తీసినంత కాలం మీతో పాడిస్తాను,' అని మాట ఇచ్చి సినిమాల్లో ఉన్నంత కాలం ఆ మాట నిలబెట్టుకున్నారని ఒకసారి రామకృష్ణ చెప్పారు.

ఇటువంటి కథే ఒకసారి జి. ఆనంద్ నాతో స్వయంగా చెప్పారు. తెలుగుభాషను బాగా ఉచ్చరించగలిగిన మరో గాయకుడి కోసం చూస్తుంటే ఎవరో ఆనంద్ పేరు చెప్పారట. బాల సుబ్రమణ్యంతోపాటు ఆనంద్ 20 రోజులపాటు రోజూ రామారావు ఇంటికి వెళ్లి దానవీరశూర కర్ణ లోని జయీభవ విజయీభవ పాటను ప్రాక్టీస్ చేసేవారట. ఆ పాట ఎంత బాగుంటుందో మనకు తెలుసు.

ఇక ఈ సినిమాలో చిత్రం భళారే విచిత్రం అచ్చం రామారావు గాత్రధర్మాన్ని అనుకరిస్తూ బాలు ఎంత బాగా పాడారో అదొక చరిత్ర. ఆ పాట రికార్డింగ్ అయి బయటకు రాగానే 'ఓహోహో బాలయ్యగారు' అంటూ వచ్చి కౌగిలించుకున్నారట ఎన్టీఆర్. ఆ తర్వాత అగ్రకథానాయకుడైన రామారావుకు అగ్రేసర నేపథ్య గాయకునిగా బాలు ఇక వెనుతిరిగి చూడలేదు.

చిత్రీకరణ

అనుకున్న సన్నివేశాలను అందంగా, హృద్యంగా తెరకెక్కించడంలోనూ రామారావు మరే గొప్ప దర్శకుడికీ తీసిపోరు.

సీతారామ కళ్యాణంలో రావణ గర్వభంగం సన్నివేశం ఒక ఉదాహరణ. కానరార కైలాస నివాస అన్న భక్తిగీతంతో ప్రారంభించి, శివతాండవ స్తోత్రం, శివపార్వతుల నృత్యం, కైలాసాన్ని పెకలించడం, రుద్రవీణ గానం, చివర్లో దండకం ఇదంతా ఒక అద్భుతమైన బ్యాలేలా తీశారు రామారావు. రుద్రవీణకు నేపథ్యంలో ఈమని శంకరశాస్త్రిగారు వీణ వాయించడం, ఘంటసాల అనితర సాధ్యమైన గానం, రామారావు నటన ఇవన్నీ ఆ సన్నివేశానికి గొప్ప విలువను చేకూరుస్తాయి.

ఇదే సినిమాలో నటుడు రామారావు ఆసరా లేకుండా దర్శకుడు రామారావు కవితాత్మకంగా తీసిన మరో గొప్ప సన్నివేశం శ్రీరామ జననం ఆసన్నమైనప్పుడు పరవశించిన లోకానికి ప్రతినిధులుగా తాపసులు పాడే 'గోవింద మాధవ దామోదరా' అన్న గీతం.

పోతన భాగవతంలోని రసవత్తరమైన రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని ఒక దృశ్యకావ్యంగా అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా శ్రీకృష్ణపాండవీయం. ఇదే సినిమాలోని సుయోధనుని ప్రవేశార్భాటం, అతని స్వగతాలు నాటకీయతకు దర్పణాలు.

వరకట్నం సినిమాలో మొదట్లో ఉండే భోగంవాళ్ల మేజువాణి, అందులో చివర్లో ఆ సానులు మోళి కట్టడం చూసి తీరాల్సిన

దృశ్యాలు. అంత సహజంగా చిత్రీకరించారు రామారావు.

ఇటువంటి ఉదాహరణలు ఇంకా చాలా చెప్పొచ్చు. బ్రహ్మం గారి చరిత్రలో కక్కడి వృత్తాంతం నాకు బాగా గుర్తున్న సన్నివేశం.

గులేబకావళి కథలో గంతులేసే అస్తిపంజరాలతో పోరాటం గొప్ప సరదాగా ఉంటుంది.

ఇలా కవితాత్మకంగా, నాటకీయంగా, సహజత్వానికి దగ్గరగా, సాంకేతికపరంగా వినూత్నంగా ఎలా అవసరమైతే అలా సినిమాని ఆయన మలచుకున్నారు.

ఒక దర్శక నిర్మాతగా, నటుడిగా సినీమాధ్యమం మీద రామారావు సాధించిన సంపూర్ణ అధికారం, ఒకరకంగా ఆయన విశ్వరూపం, దానవీరశూర కర్ణ సినిమాగా చెప్పుకోవచ్చు. నాలుగున్నర గంటల నిడివి ఉన్న సినిమా, త్రిపాత్రాభినయం, కురుక్షేత్రం సినిమాతో పోటీ వలన ఇతర నటులు దొరకక తనయులు హరికృష్ణ బాలకృష్ణలతో వేషాలు వేయించడం, చలపతిరావుతో 5 వేషాలు, డబ్బింగ్ కళాకారుడు జయభాస్కర్‌తో రెండు వేషాలు వేయించడం, రాత్రింబవళ్లు పనిచేసి 43 రోజుల్లో సినిమా తీసి రిలీజ్ చేయడం, చారిత్రాత్మక విజయాలను అందుకోవడం రామారావు సాధించిన మహాద్భుతం. ఇది ప్రపంచ చలనచిత్ర చరిత్రలో అపూర్వం.

ఈరోజుకీ తెలుగునాట ఈ సినిమాకు ఆయన సుయోధన పాత్రలో చెప్పిన డైలాగులు మార్మోగుతూనే ఉన్నాయి. అభిమన్యుడుగా బాలకృష్ణ పద్మవ్యూహంలో చేసిన వీరోచిత పోరాటం, అభిమన్యుడి మరణం తర్వాత కర్ణుడి పశ్చాత్తాపం, మయసభ వృత్తాంతం, శల్య సారథ్యం వంటి సన్నివేశాలు మరపురానివి.

ముగింపు

రామారావు తొలుత ఆదర్శంగా తీసుకున్న దర్శకులలో ఆయనలా ఒక్క వాహినీవారు (ముఖ్యంగా బి.ఎన్.రెడ్డి) మాత్రమే సినిమాకళకు ఉన్న పరమార్థాన్ని దృష్టిలో ఉంచుకుని తన కథలను ఎంచుకునేవారు.

రామారావులా స్వతంత్రమైన భావజాలంతో తాత్త్విక పునాదితో తెలుగులో సినిమాలు తీసిన దర్శకులలో కొంతవరకు బాపు, కె. విశ్వనాథులు, వీరికి భిన్నమైన పంథాలో టి. కృష్ణ వంటి వారు అతితక్కువమంది కనపడతారు.

యల్వీ ప్రసాద్ సాంఘికాలతోపాటు చారిత్రక జానపద చిత్రాలు చేసారని చాలామందికి తెలియక పోవచ్చు. బిఎన్ కూడా అంతే. వీరిద్దరూ పౌరాణికాలు తీయలేదు. రామారావులా సాంఘిక చారిత్రక పౌరాణిక జానపద చిత్రాలను తీసి విజయాలను సాధించిన దర్శకులు కేవీరెడ్డి, కమలాకర కామేశ్వరరావు కనపడతారు. సీ పుల్లయ్య, పీ పుల్లయ్య గురించి కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి.

బాక్సాఫీసు సూత్రాలకు అతీతమైన యోగుల చరిత్ర తీయటం కత్తి మీద సాము. కేవీ రెడ్డి తీసిన యోగివేమన వంటి సినిమా తరువాత రోజులలో రామారావు తప్ప (బ్రహ్మంగారి చరిత్ర) ఎవరూ తీసి విజయం సాధించలేదు.

పైన చెప్పిన వారిలో రామారావులా నటుడిగా-దర్శకుడిగా ఒక సినిమాను విజయవంతం చేసినది యల్వీ ప్రసాద్ మాత్రమే.

దిపాత్రాభినయం, త్రిపాత్రాభినయం, పంచపాత్రాభినయం చేసి దర్శకత్వ నిర్మాణ బాధ్యతలను నిర్వహించిన చరిత్ర మాత్రం కేవలం తారకరాముడిదే.

60లు, 70లు, 80లు- మూడు దశాబ్దాలలోనూ, అన్ని రకాల సినిమా ప్రక్రియలలోనూ ఘన విజయాలు సాధించిన దర్శకుడిగా, సహ నటీనటుల, సాంకేతిక నిపుణుల వద్ద నుండి మంచి పనిని రాబట్టుకునే కెప్టెన్‌గా, ప్రతిభను గురించి ఆదరించిన మేధావిగా, తనదైన తాత్విక పునాదితో ఆలోచనతో సినిమాలు తీసిన కథా రచయితగా, సాంకేతికపరంగా కళాత్మకంగా నాటకీయంగా సహజంగా కథకు తగినట్టు తన శైలిని మలచుకుని సన్నివేశాలను చిత్రీకరించిన దృశ్యశిల్పిగా నందమూరి తారక రామారావు దర్శకత్వ పటుత్వంలోని అనేక విషయాలను, విజయాలను చూసాం.


వీటిలో కొన్ని విజయాలు ఇతర దర్శకులు కూడా సాధించారు. కానీ ఇవన్నీ ఈ స్థాయిలో చేసినవారు బహుశా ఎవరూ లేరు. అందుకే గొప్ప దర్శకులలో ముందు వరసలో కేవీ రెడ్డి, యల్వీ ప్రసాద్, బిఎన్ రెడ్డి, కమలాకర కామేశ్వరరావు, సీ పుల్లయ్య, పీ పుల్లయ్య మొదలైన దిగ్గజాలతో పాటు ఎన్టీ రామారావు స్థానం పదిలం, కీర్తి శాశ్వతం.



విజయ చంద్రహాస్ మద్దుకూరి సినీ జర్నలిస్టు కాకపోయినా సినిమాలపై అభిమానంతో పరిశోధనాపూర్వక వ్యాసాలు రాసారు. కొసరాజు పాటల మీద ప్రత్యేక శ్రద్ధతో వ్యాసాలు రాసి, పుస్తకంగా ప్రచురించబోతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా డాలస్‌లో నివాసం.

నాన్నగారిలా... నూటికో కోటికో ఒక్కరే

దగ్గుబాటి పురందేశ్వరి



ఆ చంద్రతారార్కం తెలుగువారి మదిలో నిలిచే పేరు నందమూరి తారకరామారావు. వెండితెర వేల్పుగా జన నీరాజనాలు అందుకున్న ఆయన సినీ, రాజకీయ జీవితం భావితరాలకు స్ఫూర్తి మంత్రం. కఠోరశ్రమ, క్రమశిక్షణలను కవచకుండలాలుగా ధరించిన 'ఎన్టీఆర్ తత్వం-వ్యక్తిత్వం' నేటి యువతకు కూడా వ్యక్తిత్వ వికాస పాఠం. కొన్నికోట్ల మంది అభిమానుల ఆరాధ్యమూర్తిగా విరాజిల్లిన ఆ తారకరాముడి శత జయంత్యుత్సవాల సందర్భంగా... అన్నగారి కుమార్తె దగ్గుబాటి పురంధరేశ్వరి జ్ఞాపకాల డైరీలోని కొన్ని మధుర స్మృతులు...

"రామారావుగారి పిల్లలు క్రమశిక్షణకు మారుపేరని ఇవాల్టికీ అందరూ అనుకుంటున్నారంటే, అదంతా మా నాన్నగారి గొప్ప తనమే.! ఆయన కేవలం ఆస్తిపాస్తులే కాదు, అంతకుమించిన జీవిత విలువలను మాకు ఇచ్చారు. ఎంత ఎదిగినా ఒదిగుండటం నేర్పించారు. మా మీద అజమాయిషీ చలాయించడం కానీ, మమ్మల్ని ఎన్నడూ ఒక మాట అనడంకానీ, ఒంటి మీద దెబ్బ వేసిగానీ ఎరుగరు. నాన్నగారికి బాగా కోపం వస్తే మాత్రం, 'ఏం మనకు మతులు పోతున్నాయా,' అనేవారు అంతే.! ఆ మాటే మాకు పెద్ద దండనగా తోచేది. నాన్నగారి గంభీరమైన ఆహార్యం, కంఠం చూసి చాలామంది కంగారుపడేవారు. కానీ ఆయనదంతా పసిపిల్లల మనస్తత్వం. నిష్కల్మషం, నిర్మలత్వం, వృత్తిపట్ల నిబద్ధత, అంకిత భావం, పనిలో ఏకాగ్రత ఎన్టీఆర్‌గారి సహజాభరణాలు. వాటిని మాలోనూ ఇనుమడింపచేసేందుకు ప్రయత్నించారు. సినిమాల్లో ఆయన ఎంత బిజీగా ఉన్నా, మాతో అత్యంత విలువైన సమయాన్ని గడిపారు.



పెద్దలను గౌరవించడం

పిల్లలమంతా మద్రాసులోని ఓ మిషనరీ స్కూల్లో చదివాం. కనుక అమ్మ, నాన్నతో మినహా ఇంట్లో మేమంతా ఒకరికొకరం ఇంగ్లీషులోనే సంభా షించుకునేవాళ్లం. అయితే, 'నాయనమ్మ, తాతయ్య వచ్చినప్పుడు మాత్రం ప్రతి ఒక్కరూ అచ్చ తెలుగులోనే మాట్లాడాలి,' అనేది నాన్న గారి షరతు. అంతేకాదు, పనివాళ్ల ఎందరున్నా, ఊరి నుంచి తాతయ్య వాళ్లు వస్తున్నారంటే... గుమ్మం వెలుపల నీళ్ల బకెట్టు ఉంచడం దగ్గర నుంచి, ఎదురెళ్లి వాళ్లను తీసుకొనిరావడం... కాళ్లు కడుక్కోవడానికి చెంబుతో నీళ్లు అందించడంలాంటి పనులన్నీ మాకే పురమా యించేవారు. తద్వారా పెద్దలను ఎలా గౌరవించాలో నేర్పించారు.

సంస్కారం...

నాన్నగారి దగ్గర మొదటి నుంచి రాజ కీయాల్లోకి రాకముందు వరకు కూడా కృష్ణ అనే డ్రైవర్ పనిచేసేవారు. అతను అమ్మ, నాన్నను 'అన్నా, వదిన' అని పిలిచేవారు. అతనే మమ్మల్ని రోజూ స్కూలు నుంచి ఇంటికి తీసుకొచ్చేవారు. అలా ఓరోజు నేను కారు దిగి గబగబా ఇంట్లోకి వెళుతుండటం నాన్నగారు గమనించారు. అప్పుడు నన్ను పిలిచి... 'చిన్నమ్మా! కృష్ణకు ధన్యవాదాలు చెప్ప లేదేంటి,' అనడిగారు. 'అది అతని డ్యూటీ కదా!' అని నేనన్నాను.

దాంతో నాన్నగారు, "వారికి వేతనం చెల్లిస్తున్నది నేనేగానీ, మీరు కాదు. మిమ్మల్ని స్కూలు నుంచి తీసుకొచ్చే బాధ్యత వారిది కాదు. కానీ నా ఆదేశాల మేరకు సేవలందిస్తున్నారు. కనుక కృష్ణకు ధన్యవాదాలు చెప్పడం మీ ధర్మం," అన్నారు.

ఎదుటి వ్యక్తికి చాలా మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేయాలి. లేకపోతే నాన్నగారు అస్సలు ఊరుకునేవారు కాదు. "చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం మన సంస్కారం," అంటూ ఆనాడు ఆయన నేర్పిన పాఠాలను ఇవాల్టికీ ఆచరిస్తున్నాం.

'మనుషులంతా ఒక్కటే'...

మా అబ్బాయి హితేష్, అమ్మాయి నివేదిత అమెరికాలో పుట్టారు. అయితే, ఓరోజు స్కూల్లో సోషల్ స్టడీస్‌లోని మతాల గురించిన పాఠం విని ఇంటికి వచ్చిన అమ్మాయి, నాన్నగారి వద్దకు వెళ్లి... "తాతయ్య... మీరు, అమ్మ, నాన్న ఇండియాలో పుట్టారు కనుక మీరంతా హిందువులు. నేను, అన్నయ్య అమెరికాలో పుట్టాం కాబట్టి క్రిస్టియన్స్," అంది. ఆ పక్కనే నేనూ కూర్చొనున్నాను. బహుశా అదే మాట నాతో అనుంటే, 'తల్లిదండ్రులుగా మాదే మతమో, మీదీ అదే మతమ,'ని చెప్పేదాన్నేమో! కానీ నాన్నగారు మాత్రం నివేదితను ఒడిలోకి తీసుకొని, తల నిమురుతూ... "మతం కన్నా మానవత్వం గొప్పదమ్మా! మనుషులంతా ఒక్కటే. కనుక మన మతం విశ్వమానవ ప్రేమతత్వం," అంటూ ఆనాడు చెప్పిన మాటలు ఇవాల్టికీ నా చెవుల్లో మార్మోగుతున్నాయి.

విమర్శను స్వీకరించే స్వభావం

విమర్శను సైతం సహృదయంతో స్వీకరించగలిగిన విశాల హృదయం ఎన్టీఆర్‌గారి సొంతం. నాన్నగారు రోజూ వేకువజామున ఐదు గంటలకు ఒక చుట్ట తాగేవారు. అదీ ఎవరో చెప్పగా, స్వర శుద్ధి కోసం అలవాటు చేసుకున్నారు. మా హరికృష్ణ అన్నయ్య చైన్ స్మోకర్. దాంతో, 'పొగ తాగొద్దు,' అని నాన్నగారు తరచుగా హరన్నను హెచ్చరిస్తుండేవారు. ఓరోజు అది విన్న మా చిన్న తమ్ముడు జయశంకర కృష్ణ.. "చుట్టతాగే మీరు, అన్నయ్యను సిగరెట్ మానేయమనడం ఎంతవరకు కరెక్టు నాన్నగారు!" అని ప్రశ్నించారు. అంతే! మరెన్నడూ నాన్నగారు చుట్ట ముట్టలేదు. అదీ ఆయన మాకు ఇచ్చిన స్వేచ్ఛ. తన ఆలోచనలను విభేదించే వాళ్లను సైతం అక్కున చేర్చుకోగలిగిన గొప్ప గుణం ఎన్టీఆర్‌గారిది.

ప్రేమ సంగతి తెలిసి...

నాన్నగారికి అమ్మ ద్వారా... డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారితో నా ప్రేమ విషయం తెలిసింది. తర్వాత ఓరోజు నన్ను పిలిచి, "డాక్టరుగారితో పెళ్లి ఇష్టమేనా?" అనడిగారు. "వివాహం అంటే కేవలం మనకు నచ్చిన వ్యక్తితో జరిగే తంతు మాత్రమే కాదు, ఆ కుటుంబంతో జీవితాంతం కలిసిమెలిసి జీవించడం. తదను గుణంగా నడుచుకోవాలి కూడా! కాబట్టి ఒకరోజు సమయం తీసుకొని, అవన్నీ బాగా ఆలోచించి నిర్ణయం తెలియజేయ," మన్నారు. మరుసటి రోజు పిలిచి మళ్లీ అడిగితే, 'నాకెలాంటి



అభ్యంతరం లేద,'ని చెప్పాను. ఇలా ప్రతి విషయంలో ఘర్షణలకు తావు లేకుండా, మా అభిప్రాయాలను గౌరవిస్తూ వచ్చారు. ఆదర్శ నీయ తండ్రిగా నిలిచారు.

నన్ను కలెక్టరుగా చూడాలని...

నాన్నగారు తరచుగా పెద్దమ్మాయి డాక్టరు, రెండో అమ్మాయి కలెక్టరు, మూడో అమ్మాయి లాయర్ అవ్వాలి అంటుండేవారు. మరి చిన్నమ్మాయి ఉమామహేశ్వరిని ఎందుకు వదిలేశారు నాన్న అనంటే, 'ఆఖరిపిల్ల కదా! అల్లారు ముద్దుగా పెంచుతాంలే,' అని నవ్వేవారు. నాన్నగారి కోరిక మేరకు మొదట సివిల్స్ ప్రిలిమ్స్ కూడా రాశాను. మెయిన్స్‌కు సిద్ధమవుతున్న సమయంలోనే ఎన్టీఆర్‌గారు రాజకీయాల్లోకి రావడం, డాక్టర గారు హైదరాబాదుకు మారడం... అలా ఆ ప్రయత్నాలు అంతటితో ఆపేశాను.

అంకితభావం

ప్రజలకు మంచి చేయాలని నిరంతరం పరితపించిన మహా నాయకుడు ఎన్టీఆర్. ఆయన పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం ఇవ్వాలి అనుకున్నారు. 'అది సాధ్యం కాదని' అధికారులు చెప్పినా, "దాన్నెలా సుసాధ్యం చేయాలనే విషయం మీద దృష్టిసారించి తగిన సూచనలు ఇవ్వండి," అని ఆదేశించారు. ప్రజ లకు ఇచ్చిన మాటనిలబెట్టుకున్నారు. ఎన్టీఆర్‌గారి అంకితభావం అలాంటిది మరి. ప్రజాప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి ఉదాహరణలు నాన్నగారి రాజకీయ ప్రస్థానంలో కోకొల్లలు!

ప్రజల మీద పిచ్చి ప్రేమ

నాన్నగారిని ప్రజలు అభిమానించడమే కాదు, ఆయనకూ ప్రజలంటే పిచ్చి ప్రేమ. ఓసారి నాన్నగారు శ్రీకాళహస్తి పర్యటనకు వెళ్లినప్పుడు, వెంట నేనూ ఉన్నాను. అప్పుడు ఎన్టీఆర్‌గారిని చూడాలని, స్వర్ణముఖి నదికి అవతలి గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున భారీ సంఖ్యలో జనం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నదిలో ఈదుకుంటూ... ఇవతలి ఒడ్డునున్న మా వ్యాన్ దగ్గరకి పరుగులు తీయడం చూసి... "నేనంటే ఇంత అభిమానం, ప్రేమ కనబరుస్తున్నారు. ఇంత వరకు నాకు సమాజంలో గుర్తింపు, గౌరవం అంతా ఈ ప్రజలే ఇచ్చారు. వీరికి నేనేదైనా మంచి చేయాలి. అది నా జీవితకాలంలో చూడాలి," అని నాతో చెబుతూ భావోద్వేగానికి గురైన సంఘటన ఇప్పటికి నా కళ్లముందు మెదులుతోంది.

కృతజ్ఞతాభావం...

నాన్నగారు మొట్టమొదట మద్రాస్ వెళ్లినప్పుడు, ఎల్వీ ప్రసాద్ గారు స్వయంగా రైల్వేస్టేషనుకు వెళ్లి రిసీవ్ చేసుకున్నారట. ఆ కృతజ్ఞతాభావంతో ప్రసాద్‌గారు మా ఇంటికి ఎప్పుడు వచ్చినా, నాన్న గారు గేటు దగ్గరకు ఎదురెళ్లేవారు. తిరిగి అంతే మర్యాదతో సాగ నంపేవారు. ఎల్వీ ప్రసాద్‌గారిని మినహా ఎన్టీఆర్‌గారు మరెవ్వరిని 'సర్' అని సంభోదించడం నేను అయితే వినలేదు. అలాగే కాలేజీలో నాన్నగారికి చిన్న సాయం అందించిన ఓ మిత్రుడు కష్టాల్లో ఉన్నా రని తెలిసి, వాళ్ల కుటుంబానికి అండగా నిలిచారు. తనకు చదువు చెప్పిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, నిర్మాత నాగిరెడ్డి గారు ఇలా... తనకు సాయం అందించిన వ్యక్తుల పట్ల జీవితాంతం కృతజ్ఞతతో మెలిగారు ఎన్టీఆర్‌గారు.


నిత్య విద్యార్థి

నర్తనశాల సినిమాలో బృహన్నల పాత్ర కోసం వెంపటి చినసత్యం మాష్టారు దగ్గర నాన్నగారు భరతనాట్యం నేర్చుకుంటున్న రోజులవి! రోజూ వేకువజామున 4.30 గంటలకు గురువుగారు ఇంటికి వచ్చేవారు. అప్పటికే నేను, చెల్లి భువనేశ్వరి వెంపటి చినసత్యంగారి దగ్గరే నృత్యసాధన చేస్తున్నాం. కనుక మాకూ అదే సమయంలో డ్యాన్స్ క్లాసు ఉండేది. అయితే, సమయానికి నేను సిద్ధంగా ఉండేదాన్నే కానీ, ఒక్కోరోజు అంత పొద్దున్నే నిద్రలేవడానికి భువన కాస్త బద్ధకించేది. అది గమనించిన నాన్నగారు... "గురువు గారు వచ్చే సమయానికి తయారుగా ఉండి, వారికి స్వాగతం పలకాలి. అంతేకానీ, గురువుగారు మన కోసం ఎదురుచూడటం



పాఠాలు నేర్చుకున్నాం

నందమూరి బాలకృష్ణ



నాన్నగారే నాకు గురువు, దైవం, మార్గదర్శి. వేకువనే మూడున్నరకి నిద్రలేవడం ఆయన్నుంచే అలవాటైంది. నాన్నగారు పిల్లల్ని గారాబం చేయడం నేనెరగను. పొగడ్తలకు చెడిపోతారన్న భయమో ఏమో మరి. చిన్నప్పుడే కాదు, హీరోగా స్థిరపడ్డాకా ప్రశంసించేవారు కాదు. ఆయన దగ్గర సుశిక్షితులైన సైనికులమని భావించేవారేమో మరి. నేనూ, హరి అన్నయ్య ఆయన దగ్గరే నటనలో పాఠాలు నేర్చుకున్నాం. నాన్నతో నాకు ఎదురైన రెండు సంఘటనల్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ఎందుకంటే ఆ రెండూ పనే దైవం అనే సూత్రాన్ని నేనిప్పటికీ పాటించడానికి కారణం అయ్యాయి.

శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర షూటింగు బ్రహ్మంగారు తిరిగిన ప్రాంతాల్లోనే తీశారు నాన్న. ఆరోజు క్లైమాక్స్ సీన్... అక్కడ జనమంతా షూటింగ్ చూస్తున్న సమయంలో... 'ఈ సీన్ నువ్వు బాగా చేస్తేనే సినిమా ఆడుతుంది. లేదంటే దెబ్బ తింటుంది,' అన్నారు. 'ఇదేంటి ఇలా అంటున్నారు...' అని మనసులో అనుకుంటూనే తలబాదుకునే సన్నివేశంలో ఏకధాటిగా నటించా. అప్పుడు రక్తం కూడా వచ్చేసింది. అయ్యో కొడుక్కి దెబ్బ తగిలింది అనేది పట్టించుకోకుండా తర్వాత సన్నివేశానికి సిద్ధమవ్వమని చెప్పేసరికి ఆశ్చర్యపోయాను. పనిపట్ల ఎంత నిబద్ధత ఉండాలో తొలిసారి నేర్పించిన సంఘటన అది. సినిమా విడుదలయ్యాకా ఆ సన్నివేశం గొప్పతనం ఏంటో తెలిసింది.

అలాగే బ్రహ్మర్షి విశ్వామిత్ర షూటింగ్ సమయంలో శ్మశానం నేపథ్యంలో సాగే సీన్ తెరకెక్కిస్తున్నప్పుడు నా కాలు కాలింది. అది కూడా పట్టించుకోకుండా తర్వాత షాట్ తీసేశారు నాన్న. నేనిప్పుడూ ఇదే అనుసరిస్తున్నాను. ఎప్పుడైనా కాస్త డల్‌గా అనిపిస్తే నాన్నగారి సినిమాల్లోని 'మాయదారి మరలా బండిరా', 'మత్తు వదలరా...' లాంటి పాటలు వింటుంటా. మోక్షజ్ఞకి తన తాతగారి గురించి చెబుతా. టీవీలో ఆయన సినిమా వచ్చిందంటే పక్కన కూర్చో బెట్టుకుని చూపిస్తా. ఇది మన కుటుంబం- మన వారసత్వమని చెప్పి, నేనున్నానని ధైర్యం ఇస్తూనే, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యతని గుర్తుచేస్తా.

మర్యాద కాదు,'' అని మందలించారు. అప్పటికి నాన్నగారు బాగా పేరు ప్రఖ్యాతలు కలిగిన కథానాయకుడు. అయినా, వెంపటి చినసత్యం మాష్టారికి శిష్యుడిలానే మెలిగారు.

బహుభాషల బోధన

నాన్నగారికి చిన్నతనంలోనే వాళ్ల పెదనాన్న షోకుల రామయ్య గారు రామాయణ, మహాభారతాలను పరిచయం చేశారు. తెలుగు ఉచ్చారణ స్పష్టంగా ఉండేలా తర్ఫీదు ఇచ్చారు. ఏదైనా పదం తప్పు పలికినా, బెత్తంతో కొట్టేవారట. అలా మా నాన్నగారికి పురాణాల పై జ్ఞానం, మాతృభాషపట్ల మమకారం అలవడ్డాయి. అందుకే మమ్మల్ని కూడా చిన్నతనం నుంచి బహుభాషలు నేర్చుకునేలా ప్రోత్సహించారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న మాకు బొట్టపాటి మాష్టారు వంటి పండితులతో ప్రత్యేకంగా ఇంట్లో తెలుగు, తమిళం నేర్పించారు. జాతీయ భాష హిందీ అవసరాన్ని ఆనాడే మాకు కళ్లకు కట్టారు. ఓ సందర్భంలో, "ఇన్ని భాషలు నేర్చుకోవాలంటారా,'' అని నేను నవ్వితే, "లేదు చిన్నమ్మా... నేర్చుకోవాల్సిందే,'' అన్నారు. అప్పుడు నాన్నగారు చెప్పిన మాటలు, నేను పార్లమెంటులో అడుగుపెట్టిన తర్వాత కానీ అర్థంకాలేదు.

ఇలా ఎన్టీఆర్‌గారి గురించి ఒకటి కాదు, రెండు కాదు... కొన్నేళ్ల పాటు మాట్లాడుకున్నా తరగనన్ని జ్ఞాపకాలున్నాయి. ఆయన ఒక చారిత్రక పురుషుడు. అలాంటి మహనీయులు నూటికో కోటికో ఒక్కరు మాత్రమే ఉంటారు.



దగ్గుబాటి పురందేశ్వరి నందమూరి తారకరామారావుగారి ప్రథమ కుమార్తె. రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. గతంలో విశాఖ ఎంపీగాను, కేంద్ర మంత్రిగాను పనిచేసారు. ప్రస్తుతం బిజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు.

వెయ్యేళ్ల నన్నయ్య - వందేళ్ల నందమూరి

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



తెలుగుభాషకు సారస్వత స్థాయి కల్పించిన మహాకవి నన్నయ్య అని కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ప్రశంసించారు. రుషివంటి నన్నయ్య, రెండవ వాల్మీకి అని ఆయన శ్లాఘించారు. వేయేళ్ల క్రితం తెలుగుభాషకు నన్నయ్య సాహితీ గౌరవాన్ని కల్పిస్తే వందేళ్ల క్రితం జన్మించిన నందమూరి తారకరామారావు తెలుగుభాషకు సామాజిక, రాజకీయ గౌరవాన్ని, తెలుగుజాతికి ఒక ఉనికిని కల్పించారనడంలో అతిశయోక్తి లేదు. ఇది నన్నయ్యతో నందమూరిని పోల్చడం కాదు. తెలుగుభాషకు గత వేయేళ్లుగా లభించిన గౌరవాన్ని స్మరించుకోవడమే ప్రధాన లక్ష్యం.

రాజమహేంద్రపుర నివాసి అయిన నన్నయ్య పద్యవిద్యకు శ్రీకారం చుట్టారు. తెలుగు పద్య సౌందర్యాన్ని తొలుత ప్రపంచానికి తెలియజేసింది ఆయనే. నన్నయ్య రాసిన పర్వాల్లో కథ అలవోకగా ప్రవాహంలా సాగుతుంది. అరణ్యపర్వం చదువుతుంటే ఆ దృశ్యాలు కళ్లకు కట్టినట్లుంటాయి. ఆదిపర్వంలో శకుంతలోపాఖ్యాన ఘట్టాలను చదివినకొద్దీ చదవాలనిపిస్తుంది. సంస్కృత పదాలు ఎల్లెడలా వాడినా అవి చాలా సరళమైనవేకాక పద్యానికి అందం తెచ్చాయి. అందుకు కారణం ఆయన దేశీయ పదాలను కూడా తన పద్యంలో చేర్చడం. తెలుగులో చంపూ రచనలకు మార్గ దర్శకత్వం చేసింది కూడా నన్నయ్యే అని మనం తెలుసుకోవాలి. తనది ప్రసన్న కథా కలితార్థ యుక్తి అని, తన అక్షరం రమ్యంగా ఉంటుందని, తన కథల్లో నానా రుచిరార్థ సూక్తులు ఉంటాయని ఆయనే ఒక పద్యంలో చెప్పుకున్నారు.

ధీరులైన వ్యక్తులను వర్ణించడంలో నన్నయ్యకు నన్నయ్యే సాటి. నన్నయ్య వల్లే సుయోధనుడు, కర్ణుడు, అర్జునుడు, ధర్మరాజు, శ్రీకృష్ణుడు, ద్రౌపది మొదలైన పాత్రలు తెలుగు ప్రజల హృదయాల్లో చిత్రితమయ్యాయి. ఆయన విశేషణాలు చారిత్రక దృశ్యాలయ్యాయి. ఆయన పద్యాల్లో పదాల నడకలు సంగీతంలో లయల్లాగా ఇంపుగా ఉంటాయి. ఆ పదాలు పుష్పగుచ్ఛంలో పూలలా ఉంటాయి. కర్ణుడిని ఆయన బాల సూర్యుడుగా వర్ణిస్తే అర్జునుడిని ఇంద్రచాపంతో ఉన్న మెరుపు మేఘంగా వర్ణించారు. అర్జునుడు ప్రకాశిస్తూ ఉండే నల్ల కలువ రంగు వాడు అయితే కర్ణుడు బంగరు వన్నె వాడు అన్నారు.

నన్నయ్యను శబ్ద శాసనుడు, వాగను శాసనుడు అని కూడా అంటారు. తెలుగులో మొదటి కావ్యంలోనే అద్భుతమైన, అత్యుత్తమైన పరిణతి చెందిన సాహిత్యాన్ని రచించిన నన్నయ్య తెలుగుభాషకు ఒక దిశా నిర్దేశాన్ని చేశారు. మహా భారతంలో ఆది, సభా, అరణ్య పర్వాలను పూర్తిచేశారు.

ఆయన వ్యాస భారతాన్ని ఉన్నది ఉన్నట్లు అనువదించకుండా ఎంతో స్వేచ్ఛను తీసుకున్నారు. ఆయన స్వయం ప్రతిభ మనకు అడుగడుగునా గోచరిస్తుంది.

నన్నయ్య సత్యవాక్పరిపాలకుడు అనడానికి ఆయన రచించిన నుతజల పూరితంబులగు... అన్న పద్యమే ఉదాహరణ. నూరు నూతులకంటె ఒక బావి మంచిది. నూరు బావులకంటే ఒక యజ్ఞము మంచిది. అటువంటి నూరు క్రతువులకంటె ఒక కుమారుడు మేలు. నూరుగురు కొడుకుల కంటే ఒక సత్యవాక్యము మేలు అని ఆయన అన్నారు.

సభలో మనసుకు ప్రియంగా ఉండే హితవాక్యాలే చెప్పాలి. చాలా మితంగా మాత్రమే మాట్లాడాలి. అదీ సరళంగా, ఎదుటివారు నొచ్చుకొనని రీతిగా మాట్లాడాలి అని ఆయన యయాతి ద్వారా సభా మర్యాద గురించి చెప్పారు. ఇవి ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోయే వాక్యాలు.

నన్నయ్య పద్య సౌందర్యం గురించి అర్థం చేసుకోవాలంటే ఆయన శారద రాత్రులుజ్జ్వల పద్యాన్ని చదివితే చాలు. మెరిసే తారక హారాలపట్ల శారదరాత్రులు దొంగలుగా మారాయి (తెల్లని వెన్నెలలో చుక్కలు బాగా కనపడవు). అప్పుడే వికసించిన తెల్ల కలువల సొరభాలను వంటబట్టించుకొన్న పిల్లగాలులు వీస్తున్నాయి. పూల పరాగంతో ఆకాశం వెలిగిపోతున్నది. చంద్రుడు కర్పూరపు పొడివలె తెల్లని వెన్నెలను వెదజల్లుతున్నాడు... అని ఆయన వర్ణించారు. ఎంత అందమైన వర్ణన?

పాండవ వనవాసంలో ఎన్టీఆర్ భీముడుగా తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. దుశ్శాసనుడు ద్రౌపదిని జుత్తు పట్టుకుని ఈడ్చుకుని సభకు తీసుకువచ్చినప్పుడు ఎన్టీఆర్ రెండు పద్యాలు చదువుతారు.

ధారుణి రాజ్య
సంపద మదంబున కోమలి కృష్ణజూచి రం
భోరుని జోరు దేశమున నుండగ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వార మదీయ బాహు పరివర్తిత చండ గదాభిఘాత! భ
గ్నోరుతరోరు జేయుదు సుయోధను ఉగ్ర
రణాంతరంబునన్!
కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధురుడై ద్రౌపదినిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కర లీలన్ వధియించి తద్భిపుల వక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ నని నాస్పాదింతు నుగ్రాకృతిన్

ఈ రెండు పద్యాలూ నన్నయ్య రాసినవే. నన్నయ్య అంటే నందమూరికి ఎంతో ప్రేమ. తెలుగు పద్యం అంటే ఆయనకు ప్రాణం.



తెలుగు వెలుగురేఖ - నందమూరి

బ్రిటన్‌లోని లండన్ నుంచి ప్రచురితమయ్యే ప్రతిష్టాత్మక మైన వారపత్రిక 'ద ఎకనమిస్ట్' దశాబ్దం క్రితం 'ద బుక్ ఆఫ్ అబిచ్యువరీస్' అన్న పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించింది. కెనిత్ కాల్క్ హాన్, ఆన్ రో ఈ పుస్తక సంపాదకులు. ప్రపంచవ్యాప్తంగా పేరుమోసిన, చరిత్రకెక్కిన వారి మరణానంతరం ఆ వ్యక్తుల గురించి విశేషాలను 'ద ఎకనమిస్ట్' పత్రికలో వారం వారం ప్రచురించేవారు. అందులోంచి అత్యంత

ఆసక్తికరమైన, ఆలోచన రేకెత్తించే వారి మరణానంతర విశేషాలను సంకలనం చేయాలని సంకల్పించారు. సమాధిలో ఉన్నవారు ఎప్పుడూ మరణించరనేది ఒక అలిఖిత సూత్రం. వారు మరణించిన తర్వాత శాశ్వత జీవితాన్ని అనుభవిస్తారు. రోజురోజుకూ వారి ప్రాధాన్యత మరింత బలపడు తుంది. జీవితమంటే చీకటికి చీకటికి మధ్య వెలుగురేఖ... అని ఆన్ రో తన సంపాదకత్వంలో వ్యాఖ్యానించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీరు సంకలనం చేసిన దాదాపు 400 మంది పేరు మోసిన వ్యక్తుల మరణ విశేషాల్లో భారతదేశం నుంచి కేవలం ముగ్గురి పేర్లే ఉన్నాయి. ఆ ముగ్గురూ దక్షిణాదికి చెందినవారే కావడం మనకు ఇంకా ఆశ్చర్యం కలిగిస్తుంది. అన్నిటికంటే ఎక్కువ అచ్చెరువూ కలిగించేది ఆ ముగ్గురి పేర్లు. ఆ ముగ్గురిలో ఒక్కరు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు.

రామారావు మరణించినప్పుడు ఆయనను ఆరాధించిన ఎందరో భారతీయుల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మరికొందరు ఆయన రాజకీయ ప్రత్యర్థులపై రాళ్లు రువ్వారు... అన్న వాక్యంతో ఎన్టీఆర్ పై ఈ పుస్తకంలో రాసిన వాక్యంతో ఆ వ్యాసం ప్రారంభమవుతుంది, 'రామారావు అభిమానులు ఆయన దర్శనం చేసుకునేందుకు ఆయన ఇంటి ముందు బారులు కట్టేవారు...' అని ఈ వ్యాసం పేర్కొంటుంది. ఆయన అభిమానులు భగవంతుడికి నటుడికి మధ్య తేడాను గుర్తించ లేనంత అమాయకులా? కానే కాదు.. చాలామంది నటులు రామారావులాగే దేవుడి పాత్రలో లీనమై నటించారు. కానీ రామారావు ప్రత్యేకత వేరు. భగవంతుడి రూపంలోనే కాదు, భూస్వామ్య దోపిడీదారులను ఎదుర్కొని, హింసాకాండను, దౌర్జన్యాన్ని తిప్పికొట్టే కథానాయకుడుగా కూడా దాదాపు 300 సినిమాల్లో నటించి ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయాడు... అని 'ద ఎకనమిస్ట్' పేర్కొంది.

ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావడానికి ప్రేరణ కూడా అవినీతి భూతాన్ని అంతం చేయడానికేనని ఆ పత్రిక వివరించింది. ఆనాడు ప్రజలు కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్థ, అవినీతి భూయిష్టపాలనను తీవ్రంగా వ్యతిరేకించారు కనుకే ఎన్టీఆర్ పిలుపునకు పెద్ద ఎత్తున ప్రతిస్పందించారు... అని వ్యాఖ్యానించింది. ఢిల్లీ వీధుల్లో పణంగా పెట్టిన తెలుగువాడి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఆయన కంకణం కట్టుకున్నారని, తెలుగు ప్రజల మనోభావాలు అప్పటికే గాయపడినందువల్లే ఆయనకు బ్రహ్మరథం పట్టారని 'ద ఎకనమిస్ట్' పేర్కొంది. ఒక ఉత్తుంగ తరంగంలా తెలుగునాట ముంచెత్తిన ఎన్టీఆర్ జీవిత విషాదాంతాన్ని కూడా ఈ పత్రిక చిత్రించింది. ఒక అసమానమైన, అసాధారణమైన జీవితం కల ఎన్టీఆర్ భారత దేశ రాజకీయాల్లో ఒక సుడిగాలిలా ప్రవేశించి తనదైన ముద్రవేసి వెళ్లిపోయారు. పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే రాష్ట్రంలో తొలి



కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. కాంగ్రెసేతర రాజకీయాల్లో మకుటాయమానమై చరిత్రపుటల్లో ప్రత్యేక స్థానం సంపాదించు కున్నారు.

జాతీయ రాజకీయాల్లో అలజడిని సృష్టించారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలను ఒకే వేదికపై తీసుకువచ్చి జాతీయ ఫ్రంట్‌ను ఏర్పరిచి రాష్ట్రాల ప్రాదాన్యతను చాటిచెప్పారు. బలమైన రాష్ట్రా లుంటేనే బలమైన కేంద్రం ఉంటుందని ఎన్టీఆర్ ఫెడరలిజానికి కొత్త అర్థాన్నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో పెను మార్పులు రావల్సి ఉంటుందని అడుగడుగునా వాదించారు. తనకే కాదు, తెలుగుభాషకు, తెలుగువాడికి గుర్తింపు తెచ్చి పెట్టారు. అందుకే ఆయన ప్రత్యేకతను ఒక అంతర్జాతీయ పత్రిక గుర్తించింది.

నిజంగా ఎన్టీఆర్ ఒక వర్గానికీ, ఒక ప్రాంతానికీ, ఒక రాష్ట్రానికీ, ఒక పార్టీకీ చెందిన వ్యక్తి కాడు. ఆయన సమస్త భారతా వనికి చెందినవాడు, అందరివాడు.

పురాణపురుషుడుగా మాత్రమే కాదు, ఒక నిరుద్యోగిగా, ఒకరోజు కూలీగా, ఒకే కార్మికుడుగా, ఒక లారీ డ్రైవర్‌గా ఒక ఆర్మీ మేజర్‌గా నటించి సామాన్యుల హృదయాల్లో హత్తుకుపోతే, ఒక రాజకీయ నాయకుడుగా కూడా ఆయన ప్రజల్లోకి అంతే సులువుగా వెళ్లిపోయారు. చైతన్య రథంతో ప్రజల్లోకి ప్రవేశించి వారి మధ్యే సామాన్య జీవితం గడిపారు. గొప్ప గొప్ప వాగ్దానాలేవీ ఆయన చేయలేదు. కూడు, గూడు, గుడ్డ మాత్రమే కల్పిస్తానన్నారు. అదే

విధంగా, రూ. 2కు కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణం, పేదలకు జనతా వస్త్రాల సరఫరా వంటి పథకాలను ప్రారంభించారు. రైతుల కోసం ఉచిత విద్యుత్, రాష్ట్రంలో మొదటిసారి మధ్యాహ్న భోజన పథకం, ఎస్.సి., ఎస్.టి. వర్గాలకు సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ప్రవేశపెట్టారు.

ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకు కామన్ ఎంట్రన్స్ పరీక్షా పద్ధతిని ఏర్పరిచారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్ కేటాయించడమే కాక, మొట్టమొదటిసారి మహిళలకు ఆస్తిలో హక్కును కల్పించారు. పరిపాలనారంగంలో కూడా ఎన్టీఆర్ విప్లవాత్మకమైన చర్యలు చేపట్టారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దుచేసి గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను ఏర్పరిచారు. స్థానిక పరిపాలనను వికేంద్రీకరించి, మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజల వద్దకు పాలనను తొలుత తీసుకెళ్లింది. ఎన్టీఆరే. రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చే తెలుగుగంగ ప్రాజెక్టునే కాక, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను ప్రారంభించింది ఎన్టీఆరే.

ప్రపంచ చిత్రపటంలో తెలుగుభాషకు, తెలుగువాడికి విలువలు కల్పించింది కూడా ఎన్టీఆరేనని చెప్పకతప్పదు. తెలుగు సంస్కృతికీ, తెలుగు చారిత్రక సంపదకూ ఆయన ఇచ్చిన విలువ ఎవరూ ఇవ్వలేదు. స్వచ్ఛమైన తెలుగులో అనర్గళంగా, గంగా ప్రవాహంలా మాట్లాడే ఎన్టీఆర్ ప్రభుత్వ కార్యాలయాలకు తెలుగు పేర్లు పెట్టారు. అనేక పథకాలకు తెలుగుదనం సమకూర్చారు. తెలుగు సాహిత్యాన్ని, చరిత్రను కాపాడేందుకు తొలి తెలుగు యూనివర్సిటీని ఏర్పర్చింది ఆయనే, తెలుగు లలితకళాతోరణం వంటి సాంస్కృతిక వేదికలను నిర్మింపజేశారు. తెలుగుజాతి గర్వించదగ్గ 36 మంది మహాపురుషుల విగ్రహాలను ట్యాంక్ బండ్ వద్ద నెలకొల్పారు. హుస్సేన్ సాగర్ నడిబొడ్డున బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్టాపింపజేసి ఆంధ్రదేశంలో బౌద్ధం ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పారు.

తన ప్రజల కోసం, వారి ఆత్మగౌరవం కోసం, వారి భాషా సంస్కృతుల కోసం, అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కోసం



తపించి, వారి సంక్షేమం కోసం కృషి చేసిన నాయకుడు ఎన్టీఆర్. పతితులు, బాధాసర్పదష్టులు, నిత్యపీడనకు గురైన అబలలతో నోరారా 'అన్నా' అని పిలిపించుకోగల నాయకుడు ఎన్టీఆర్. తన తర్వాతి వారు తనను అనుకరించడానికి కావల్సిన అనేక వినూత్న అంశాలను వదిలిపెట్టిన ప్రజానేత ఎన్టీఆర్.




యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ బహుముఖీన సాహితీవేత్త. కొంతకాలం పార్లమెంటు సభ్యులుగా పని చేసారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో హిందీ ప్రొఫెసర్‌గా పనిచేసారు. వీరి ద్రౌపది నవలకు కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. తెలుగు హిందీ నుంచి, హిందీ నుంచి తెలుగుకి అనేక గ్రంధాలు అనువదించారు. ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషాసంఘం పూర్వ అధ్యక్షులు.

సాగసైన శిల్పంగా రూపుదిద్దుకోవడానికి శిల ఎన్ని ఉలి దెబ్బలు తింటుందో తెలియదు!
ఒక కళాకారుడు ఇతరులు అందుకోలేనంత ఎత్తుకు ఎదగడానికి ఎక్కే మెట్లు ఎన్నో!
ఎదుర్కొనే ఇబ్బందులూ ఆటంకాలూ ఎన్నెన్నో!
అందుకే అటువంటి కళాకారులు తమకు తామే సాటిగా ఉంటారు!
అటువంటి మహా సంగీతవేత్త మన ఘంటసాల!!

అమృతశాల ఘంటసాల

పి.ఎస్. గోపాలకృష్ణ



ఘంటసాల. మన ఘంటసాల.

ఇంటి పేరుతోనే ప్రసిద్ధులయిన తెలుగు సంగీత ప్రక్రియ వెంకటేశ్వరరావు పూర్వీకులు ఘంటసాలలో ఎప్పుడు ఉన్నారో తెలియదు కానీ ఘంటసాల కుటుంబంవారు కృష్ణాజిల్లా టేకుపల్లిలో స్థిరపడ్డారు. ఘంటసాల వెంకటేశ్వరరావు తల్లి రత్తమ్మగారు, తండ్రి సూర్యనారాయణగారు. ('ఘంటసాల సూరయ్య'గా ప్రసిద్ధులు.)


1922 డిసెంబర్ 4వ తేదీ గుడివాడ సమీపంలోని చౌటపల్లిలో తమకు రెండవ కుమారుడు జన్మించినప్పుడు సూరయ్యగారూ రత్తమ్మగారూ ఆ అబ్బాయికి తెలుగువారి ఇలవేల్పు శ్రీ వేంకటేశ్వర స్వామి పేరు పెట్టుకొన్నారు. ఆ పేరు సరిగా పలకలేనివారు వెంకటేస్వర'రావు అని భవిష్యత్తులో ఆ బాలుడు పలికించనున్న స్వరాల విలువ తెలియకుండా పిలిచినా సార్థకంగానే పిలిచారు. తల్లిదండ్రులకు అతను చిన్నాడు. తోబుట్టువులకు వెంకులు. చిన్నాడు వెంకులుకు చౌటపల్లిలోనే అక్షరాభ్యాసం జరిగింది. సూరయ్యగారు సంగీతజ్ఞులు. తరంగగానంలో ప్రత్యేక కృషి చేసిన వారు. తర్వాతి రోజులలో తరంగగానంలో ప్రసిద్ధులైన ఎందరో సూరయ్యగారి నుంచి శిక్షణ పొందినవారే. ఆయన మృదంగం కూడా వాయించేవారు. సూరయ్యగారు తమ రెండవ కుమారుడు కళామతల్లి ముద్దుబిడ్డడని గ్రహించినట్టున్నారు. తండ్రిగారి గురించి ఘంటసాల వెంకటేశ్వరరావు బాల్యస్మృతి: "మా తండ్రిగారు మృదంగం వీపున కట్టుకొని నన్ను భుజం మీద ఎక్కించుకొని ఎంత దూరమైనా ఎక్కడ భగవత్సంకీర్తనం జరిగితే అక్కడికి హాజరయి, తాము మృదంగం వాయిస్తూ, పాడుతూ, నా చేత నృత్యం చేయిస్తూ ఉండేవారు. నాటి నా బాల్యస్వరూపం, నృత్యం అందరికీ ముచ్చట

గొలుపుతూ ఉండేవి. ఆరోజుల్లో నన్ను 'బాల భరతుడు' అని ముద్దుగా పిలిచేవారు. ఎన్నో బంగారు పతకాలు, బహుమతులు కూడా అప్పట్లో లభించాయి."

ఒక ఉత్సవంలో ఊరేగింపు కోసం ఒక ఏనుగును తెచ్చారు. బాలభరతుడు వెంకటేశ్వరరావు ఏనుగు ఎక్కాలని మారాం చేసాడు. (సంగీత కళాకారులుగా ప్రసిద్ధులైన తర్వాత ఘంటసాలకు ఘంటసాలలోనే గజారోహణ గౌరవం లభించింది)! వెంకటేశ్వర రావు చిన్ననాటి నుంచే సూరయ్యగారు కొడుకుతో, 'నాదోపాసన ఎయ్యాలి!' అంటూ ఉండేవారు. ఆ మాటలకు అప్పటికి అర్థం తెలియకపోయినా వెంకటేశ్వరరావు శ్రద్ధగా తల ఊపేవాడు. వెంకటేశ్వరరావు పదకొడవ ఏట సూరయ్యగారు చనిపోయారు. "చివరి రోజుల్లో ఆయన నన్ను దగ్గరికి తీసుకొని సంగీతవిద్యలో తరించవలసిందిగా ఆదేశిస్తూ ఉండేవారు. మా తండ్రిగారి యావజ్జీవిత తప:ఫలమే నా అభ్యుదయానికి కారణం అని నా నమ్మకం," అని ఘంటసాల వెంకటేశ్వరరావు ఆ తర్వాత చెప్పు కొన్నారు.

తండ్రి మరణించిన తర్వాత వెంకటేశ్వరరావు చదువు సరిగా సాగలేదు. అతని దృష్టి ఎప్పుడూ ఆటపాటల మీదే ఉండేది. అయినా అతను తండ్రి చెప్పిన మాటలు మరిచిపోలేదు. 'ఏమైనా సరే, సంగీత విద్య సాధించాలి,' అని పదేపదే చెప్పుకొనేవాడు. చుట్టుపక్కల ఉన్న చాలామంది సంగీత విద్వాంసులను శిక్షణ కోసం ఆశ్రయించాడు. అయినా అప్పటి గురుకులవాస దీక్షకు అతని బాల్యప్రవృత్తి తట్టుకోలేకపోయింది. ఈ ప్రయత్నాలు కొనసాగిస్తూ తొమ్మిదవ తరగతిదాకా చదివిన తర్వాత అతనికి చదవాలనిపించ లేదు.

చదువు మానేసిన తర్వాత అతను కొన్ని నాటకాలలో చిల్లర మల్లర వేషాలు వేసాడు. ఎన్ని వేషాలు వేషినా సంగీతం మీది ఆసక్తి తగ్గలేదు. అప్పట్లో బాగా ప్రచారంలో ఉన్న కపిలవాయి రామనాథ శాస్త్రి పాటలూ పద్యాలూ గ్రామఫోన్ రికార్డులలో విని తానూ అట్లాగే పాడే ప్రయత్నం చేయసాగాడు. పాడగా పాడగా తానూ గాయకుడిగా రాణించగలనని అనిపించేది. ఈ నేపథ్యంలో చౌటపల్లి దగ్గరలో ఉన్న సిద్ధాంతం గ్రామంలో ఏర్పాటుచేసిన ఒక సంగీత కార్యక్రమంలో వెంకటేశ్వరరావు సంగీతం నవ్వుల పాలయింది. ఆ సంఘటనతో అతనిలో ఒక వేదన మొదలయింది. 'సంగీత విద్య సాధించాలి. తండ్రిగారి ఆత్మకు శాంతి కలిగించాలి. అపహాస్యం చేసినవారికి సంగీతవిద్యతోనే ప్రతీకారం చేయాలి,' అనుకొన్నాడు. రకరకాల ఒడిదుడుకుల తర్వాత తన దగ్గర ఉన్న నలభై రూపాయల విలువగల ఉంగరాన్ని ఎనిమిది రూపాయలకు ఇచ్చి, ఆ ఎనిమిది రూపాయల పెట్టుబడితో తన సంగీత విజయ యాత్ర మొదలుపెట్టాడు వెంకటేశ్వరరావు. కళ్లనిండా కలలతో విజయనగరం సంగీత కళాశాలలో చేరడానికి బయలుదేరాడు. కళాశాలకు సెలవులు కావడంతో, అక్కడే ఉండడానికి అనుమతి సంపాదించాడు. ఎవరో చేసిన తప్పు తనమీద పడగా నిలువ నీడలేక ఎల్లమ్మగుడిలో తల దాచుకొన్నాడు. ఆ నిరుత్సాహ పరిస్థితులలో సంగీత కళాశాలలో గాత్ర పండితులుగా ఉన్న పట్రాయని సీతారామశాస్త్రిగారిని కలుసుకొన్నాడు. ఆయన వెంకటేశ్వరరావు పాట విన్నారు. అతని పరిస్థితుల గురించి తెలుసుకొన్నారు. సంగీత విద్యపట్ల అతనికి ఉన్న తీవ్రమైన ఆకాంక్షను అర్థం చేసుకొన్నారు. తమ ఇంటి ముందు గదిలో ఆశ్రయం కల్పించారు. తమ కుటుంబ పరిస్థితుల కారణంగా ఆయన వెంకటేశ్వరరావుకు భోజన సదుపాయం కల్పించలేకపోయారు. దాంతో వెంకటేశ్వరరావు అప్పట్లో సంస్కృత విద్యార్థులు చేస్తున్నట్టు మాధుకరం చేసుకొన డానికి పూను కొన్నారు. కలిమి వచ్చినప్పుడు చాలా మందికి లేమి జ్ఞాపకం ఉండదు. కానీ ఘంటసాల వెంకటేశ్వరరావు గతాన్ని ఎప్పుడూ మరచిపోలేదు. "ఏమైనా నాడు ఏ తల్లి మొదటి కబళం నా జోలెలో వేసిందో ఆమె వేసిన ఆ వాత్సల్యపూరిత మైన భిక్ష నాకు అష్టైశ్వర్యాలతో కూడిన భవిష్యత్తునే ప్రసాదించింది," అని ఎన్ని సార్లో జ్ఞాపకం చేసుకొనేవారు ఘంటసాల.



గురువు పట్రాయని సీతారామశాస్త్రితో ఘంటసాల (కుడివైపు రెండవవారు)

సంగీత కళాశాల తెరిచేలోగా కళా శాలలో జరిగిన సంఘటనతో ఘంట సాలకు సంబంధం లేదని తెలిసింది. నాటి సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ప్రముఖ

వాయులీన వాద్య విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు గారు ఘంటసాల సంగీతజ్ఞానం పరీక్షించి, ఆ 'గాత్రం సుశారీరంగా నిర్ణయించి గాత్ర సంగీతమే సాధన చేయవలసిందిగా,' ప్రోత్సహించారు. కళాశాల పాఠ్య ప్రణాళికతో సంబంధం లేకుండా సీతారామశాస్త్రిగారు వెంకటేశ్వరరావుకు తమ ఇంట్లోనే సంగీత బోధన చేయసాగారు. గురువుగారి ప్రస్తావన వచ్చినప్పుడు ఘంటసాల నిలువెల్లా పులకించిపోయేవారు. "నిజంగా గురువు లంటే వారినే చెప్పాలి. మా తండ్రిగారు ఏ రకమైనటువంటి సంగీతాన్ని ఉపాసన చేసి తరించారో అలాంటి సంగీతాన్ని బోధించే టటువంటి గురువు నాకు దొరికారని సంతోషించాను," అనేవారు ఘంటసాల.

కళాశాల చదువు పూర్తయిన తర్వాత అడపాదడపా సంగీత కార్యక్రమాలలో పాల్గొంటూ నాటకాలలో వేషాలు వేస్తూ సంగీత పాఠాలు చెబుతూ ఉన్న ఘంటసాలను జాతీయోద్యమం ఆకర్షించింది. దేశ భవితవ్యం ముందు తమ వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యత, సంగీతసాధన అన్నీ అల్పమనిపించాయి. అంతకుముందు ఏ ఉద్యమంలోనూ పాల్గొనని ఘంటసాల చాలామంది మిత్రులతో 1942 ఆగస్ట్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆరునెలల శిక్ష అనుభవించడానికి 1943 ఏప్రిల్ 24 నాడు బళ్లారి ఆలీపూర్ (అల్లీపురం) కేంప్ జైలులో ఖైదీ (నంబర్ 7460) అయ్యారు. జైలులో 'మంచి'గా ప్రవర్తించినందుకు శిక్షలో 18 రోజుల తగ్గింపు ఇచ్చారు. జైలు జీవితం తమకు కర్తవ్యదీక్ష, స్థిర సంకల్పం, నియమబద్ధమైన జీవితం మొదలయినవాటి గురించి తెలియజేసిందనేవారు ఘంటసాల.

సంగీతం మీద ఆధారపడి జీవితం గడపడం కష్టం అని జైలుకు వెళ్లడానికి ముందే నిర్ణయించుకొన్న ఘంటసాల-మోపిదేవిలో నటరాజ నాట్యమండలి ఏర్పాటుచేసారు. కొన్ని నాటకాలూ ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలు లేని రోజులలో ఒక్కొక్కసారి రోజులో 18 గంటలు పాడుతూ ఉండేవారు.

1944 మార్చి 3నాడు వెంకటేశ్వరరావు పెదపులివర్రులో తమ మేనమామ కుమార్తె సావిత్రిని పెళ్లి చేసుకొని ఒక ఇంటివాడయ్యారు. పెళ్లి జరిగిన కొన్నాళ్లకు ఘంటసాల పెదపులివర్రుకు వచ్చిన ప్రముఖ చలనచిత్ర రచయిత సముద్రాల రాఘవాచార్యులుగారిని కలుసుకొన్నారు. సముద్రాల, ఘంటసాలను మద్రాసు రమ్మన్నారు. రెండు నెలలు నాటకాలు వేసి యాభై రూపాయలు కూడబెట్టి కొండంత ఆత్మవిశ్వాసంతో 1944 మే నెల మద్రాసు చేరుకొన్నారు ఘంటసాల. త్యాగరాయనగర్‌లో ఒక కట్టెల అంగడిలో పెట్టె పెట్టుకొని రాత్రులు పానగల్లు పార్కులో పడుకోవడానికి 'అనుమతి' సంపాదించారు. (ఆ అనుమతి ధర నెలకు రెండు రూపాయలు.)

సముద్రాలగారి పూనికతో ఘంటసాల కొన్ని సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. బృందగానాలలో పాల్గొన్నారు. మద్రాసు రేడియో కేంద్రంలోని తెలుగు అధికారులకు ఘంటసాల గురించి



ఒక లేఖ రాసి ఘంటసాలకే ఇచ్చి పంపించారు సముద్రాలగారు. ఘంటసాల రేడియో ప్రవేశానికీ లలిత సంగీత ప్రస్తారానికీ అప్పుడు మద్రాసు కేంద్రంలో పనిచేస్తున్న రజని (బాలాంత్రపు రజనీకాంత రావు)గారు తోడ్పడ్డారు. మొదట శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో పాల్గొన్న ఘంటసాల ఆ తర్వాత ఎన్నో సంగీత రూపకాలలో పాల్గొని గానం చేసారు. 1945లోనే రజని రాసి స్వరపరచిన 'ఘనాఘనా గర్జింపవో' అనే గేయం ఘంటసాల పాడగా జాతీయస్థాయిలో ప్రసారం కావడం విశేషం!

తమ అదృష్టం పరీక్షించుకోవడానికి ఘంటసాల గ్రామఫోన్ కంపెనీకి వెళ్లారు. అక్కడివారు ఘంటసాల గొంతు మైక్‌కు పనికి రాదని చెప్పి పంపారు. ఘంటసాల పాడిన గ్రామఫోన్ రికార్డ్‌లు అమ్మంలో రికార్డ్‌లు సృష్టించడం ఆ తరువాతి చరిత్ర!

ఈ పరిస్థితుల మధ్య, అంతకుముందే సముద్రాల చెప్పగా ఘంటసాల పాటలు విన్న ప్రముఖ దర్శకులు బి.ఎన్. రెడ్డిగారు, ప్రముఖ నటులు నాగయ్యగారు- ఘంటసాలతో వాహినీవారి స్వర్గసీమ చిత్రం కోసం పాడించాలని నిర్ణయించారు.

'ఆరేహా...లేయెన్నెల చిరునవ్వుల ఇరజిమ్ము బఠాణి నీ రాకకోరి నా దారిగాచ్చి యున్నానే,' అంటూ గాజుల పిల్ల నృత్య నాటిక కోసం మహానటి భానుమతిగారితో పాడి తమ నేపథ్యగానం మొదలుపెట్టారు. ఆనాడే భారత చలనచిత్ర సంగీత చరిత్రలో ఘంటసాల శకం మొదలయింది.

నేపథ్య గాయకులుగా తమ జైత్రయాత్ర ప్రారంభించిన ఘంటసాల సంగీత దర్శకులుగానూ నిలదొక్కుకున్నారు. గాయకులుగా ఆయన ఎంత కీర్తి గడించారో సంగీత దర్శకులుగానూ అంతే కీర్తి గడించారు. ఘంటసాల గానం గొప్పదా? ఆయన సంగీత దర్శకత్వం గొప్పదా? రెండూ గొప్పవే.

ఘంటసాల కంఠం గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. కొన్ని కంఠాలు గంభీరంగా ఉంటాయి. వాటిలో మాధుర్యం ఉండదు. కొన్ని కంఠాలలో మాధుర్యం ఉంటుంది కానీ జవమూ



జీవమూ ఉండవు. ఘంటసాల కంఠం అటువంటిది కాదు. గాంభీర్యం, మాధుర్యం, మార్దవం, ఆర్జవం కలబోసిన స్వర నిలయం అది. రాగానికి భావాన్ని అద్దడం, అక్షరాలకు అనుభూతిని తొడగడం ఆయన ప్రత్యేకత. సందర్భోచితంగా అది మేఘమై గర్జిస్తుంది. కన్నీటివాగై ప్రవహిస్తుంది. పరమ శాంతంగా పలుకుతుంది. సరదాల సరాగాలు చిలుకుతుంది. ఏది పాడినా స్పష్టంగా పాడడం ఆయన విశిష్టత.

ఘంటసాలతో స్వర్గసీమలో 'గాజులపిల్ల' పాట పాడించిన చిత్తూరు నాగయ్యగారి అభిప్రాయం ప్రకారం, "కొందరు గాయకులు తమ కంఠాన్ని శ్రుతితో మేళవించడానికి ప్రయత్నిస్తారు. కానీ శ్రీ ఘంటసాలగారి గాత్రంలోనే శ్రుతి పలుకుతూ ఉంటుంది. అందుకే ఆయన పద్యం చదివినా, గద్యం పాడినా, పాట పాడినా, రాగం ఆలపించినా భావగర్భితంగా, శ్రుతియుతంగా, లయ భరితంగా ఇంపుగా, సొంపుగా శ్రోతలను ఉర్రూతలూగిస్తుంది." ఘంటసాల పాటకు వన్నెవాసీ రావడానికి ఆయన కంఠస్వర సంపద ఒకటే కారణం కాదు, ఆ సంపదను మరింతగా పెంపు చేసినది ఆయన చేసిన నాదానుభవ సాధన.

"ఆయన కంఠస్వరం అత్యద్భుతమైనది... ఏ గాయకుల గాత్రం అయినా గొప్పది అని చెప్పడానికి ఆ గాత్రం త్రిస్థాయి ల్లోనూ శుద్ధంగా పలకాలి... మంద్రస్థాయిలో పాడినా మధ్యమ స్థాయిలో పాడినా తారస్థాయిలో పాడినా సంపూర్ణమైన ధ్వనితో పాడగలిగినటువంటి ఒక్క కళాకారుడు- యావద్భారత దేశంలో ఒక్క ఘంటసాలగారేనేమో అనిపిస్తుంది నాకు," అని ఘంటసాల గాత్ర సంపదను ప్రముఖ సంగీత దర్శకులు పెండ్యాల నాగేశ్వరరావుగారు ప్రశంసించారు.

'తెలుగువారికే ప్రత్యేకమైన పద్యాలను పాడడంలో ఒక కొత్త బాణీ సమకూర్చాలని,' తమకు సంకల్పం కలిగిందని ఘంటసాల చెప్పారు. అంతకుముందు తెలుగు నాటకరంగంలో ప్రసిద్ధులైన నట గాయకుల పద్ధతి నుంచి భిన్నమైనది ఘంటసాల పద్ధతి. పద్యంలోని భావాన్ని రాగం మింగేయకుండా, మాటలను సంగతులు మరుగుపరచకుండా తమ పాటలో సాధించిన భావసిద్ధిని పద్యంలోనూ పలికించిన సిద్ధకంఠులు ఘంటసాల. భావ స్పందనను, ఔచిత్యాన్నీ పాటించి పద్యాలు పాడడానికి తమదే అయిన ప్రత్యేక మార్గాన్ని రూపొందించారు ఘంటసాల.

పాడుతున్నప్పుడు కుడిచెవిని కుడి చేత్తో మూసుకోవడం ఘంటసాల అలవాటు. చెవి మూసుకుని పాడినప్పుడు, "మనం పాడుతున్నది మనకు మరింత బాగా వినిపిస్తుంది. మనం పాడు తున్నది సరిగా ఉందా లేదా అని మనకు స్పష్టంగా తెలుస్తుంది," అనేవారు ఆయన. ఒకసారి ఆయన చెవులకు ఏదో సమస్య వచ్చింది. గొంతు బాగానే ఉంది. "చెవి మీద చేయి వేసి నేను పాడినప్పుడు నా పాట నాకు సంతృప్తికరంగా వినిపించనంత దాకా పాడేది లేదు," అని నిర్ణయించి పదిరోజులు, 'నేను పాడలేను,' అని ఊరుకున్నారు ఆయన. పదిరోజుల తర్వాత చెవులు మామూలుగా వినిపిస్తున్నవి అనిపించిన తర్వాత మళ్లీ పాడడం మొదలుపెట్టారు. విరామం తర్వాత ఆయన మొదట పాడినది బుద్ధిమంతుడు చిత్రంలోని 'నను పాలింప నడచి వచ్చితివా...' అనే సమ్మోహనకరమైన గీతం.


తెలుగువారికి ఘంటసాల పట్ల ఉన్న ఆరాధనకూ ఆత్మీయ మైన అభిమానానికీ ఆయన పేరిట నెలకొల్పిన ఆలయాలూ, తెలుగు ప్రాంతాలలోని ఆయన విగ్రహాలూ గుర్తులు. ఇటువంటి గౌరవం ఇతర కళాకారులకు ఎవరికీ దొరకలేదనడం సత్యం. తమ సంగీతం ద్వారా ఘంటసాల చిరంజీవిగా వర్ధిల్లుతూ ఉంటారు అనడమూ సత్యమే!



ఘంటసాలకు అత్యంత సన్నిహితుడుగా మెలిగిన పి.ఎస్. గోపాలకృష్ణ 1972లో ఎమెస్కో పాకెట్ పుస్తకాల సంపాదకవర్గ సభ్యుడిగా తెలుగు సాహితీరంగానికి పరిచయమయ్యారు. ఆనాటి చందమామ, వనిత పత్రికలకు పనిచేసారు. కొంతకాలం కేంద్ర సాహిత్య అకాడెమిలో ఉప కార్యదర్శిగా పనిచేసారు. 1977 నుంచి 2009 వరకు ఆకాశవాణిలో వివిధ పదవులలో కొనసాగి, పదవీ విరమణ అనంతరం రచనావ్యాసంగం మీద దృష్టి సారించారు. 'మన ఘంటసాల', 'జీవన గానం' (ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జీవితచరిత్ర), 'తెలుగుదారిలో వెలుగు దీపిక-సి.పి. బ్రౌన్' వీరి రచనలు. నివాసం హైదరాబాదు.

మమతానురాగ నిలయం - నాన్నగారి హృదయం

శాంతి సురేంద్రకుమార్



మల్లియలారా... మాలికలారా
మా కథయే విన్నారా...

అని ఈ పాటను పాడుతూ మా నాన్నగారు నన్ను తన గుండెలమీద పడుక్కోబెట్టుకొని నిద్రబుచ్చటం నాకు బాగా గుర్తు. అప్పుడు నా వయసు నాలుగేళ్లు మాత్రమే.

నాన్నగారు మధ్యాహ్నం 2 టు 9 కాల్షీట్ రికార్డింగ్‌లకు వెడితే తిరిగి రావడానికి రాత్రి పది, పదిన్నర అయేది. నాన్నగారు వచ్చేంత వరకూ నేను కూడా అమ్మతోపాటు మేల్కొనే వుండి ఆయన వచ్చాక ఏదో పాట పాడి నన్ను నిద్రబుచ్చేదాక నిద్రపోయేదాన్ని కాదు. ఆయన ఎంత రాత్రి వేళ అలసిపోయివచ్చినా మా మీద ఏమాత్రం చిరాకు, కోపం, అసహనం ప్రదర్శించేవారు కాదు. చల్లటి చందమామలా నవ్వుతూ మమ్మల్ని పలకరించేవారు.

ఇంతకూ నేనెవరో చెప్పలేదు కదా!

నేను కోట్లాది తెలుగు హృదయాలలో గానగంధర్వునిగా, శతాబ్ది గాయకునిగా గూడుకట్టుకొని వున్న అమర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావుగారి సంతానంలో ఆఖరు అమ్మాయిని.

నా పేరు రాధ (స్కూల్/కాలేజ్ రికార్డుల వరకు మాత్రమే)... ఇంట్లోవారందరికీ శాంతిని. చివరకు ఆ శాంతి పేరే స్థిరపడి పోయింది.

గాయకుడిగా, సంగీత దర్శకుడిగా లోకవిదితమైన మా నాన్నగారి విద్వత్, కీర్తిప్రతిష్టలు నేను అర్థం చేసుకోగల వయసు వచ్చేలోపలే ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ విషయంలో మా నాన్నగారికి , నాకూ ఒక సాపత్యం వుంది. మా తాతగారు (ఘంటసాల సూరయ్యగారు) కాలం చేసేనాటికి నాన్నగారి వయసు కేవలం 11 సంవత్సరాలు. అలాగే, మా



నాన్నగారు నిర్యాణం చెందేనాటికి నా వయసు కూడా 11 సంవత్సరాలు మాత్రమే.

గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తెలుగు సినిమా రంగం లోని నాన్నగారి అనుభవాలు, విశేషాలు నాకంటే వారి అభిమానులైన మీకే బాగా తెలుసు కనుక నేను 'మధుర గాయకుడు ఘంటసాల' గురించి కంటే 'మా నాన్నగారు ఘంటసాల' గురించి మాత్రమే నాకు తెలిసిన భాషలో చెపుతాను.

మా నాన్నగారు దక్షిణాది చలనచిత్రసీమలో ఎంతటి ఉచ్ఛ స్థాయిలో వున్నా, ఎంతటి కీర్తిప్రతిష్టలు సంపాదించినా ఇంట్లో మాత్రం సామాన్యంగానే వుండేవారు. కేవలం ఒక మధ్యతరగతి కుటుంబానికి కావలసిన వస్తువులే మా ఇంట్లో వుండేవి. ఏ రకమైన ఆడంబరాలు, హంగులు నాన్నగారికి ఇష్టముండేదికాదు. తన సంతానాన్ని కూడా ఆ రకంగానే పెంచారు, ఆ రకమైన సంస్కారాన్నే అలవాటు చేసారు. ఒక స్టార్ సింగర్ ఇంట్లో నేను పుట్టిన ఆరేళ్లదాకా టెలిఫోన్ కూడా వుండేది కాదంటే నాన్నగారు ఎంత నిరాడంబరజీవో అర్థం చేసుకోవచ్చు. ఆయన మామూలుగా రికార్డింగ్‌లకు వెళ్లేప్పుడు తమిళనాడులోని అలవాటు ప్రకారం తెల్ల లుంగీ కట్టుకొని, అర చేతుల తెల్లచొక్కా, లేదా తెల్ల జుబ్బా వేసు కునేవారు. కచేరీలకు, పబ్లిక్ ఫంక్షన్లలో పాల్గొనేప్పుడు పదహారణాల తెలుగువాడిలా తెల్లటి పంచెకట్టు కట్టి, పైన జుబ్బా వేసుకునేవారు.

దేశ, విదేశాల పర్యటనలలో కూడా తన డ్రెస్ కోడ్‌ను (తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప) మార్చుకోలేదు.

భగవద్గీత రికార్డింగులు సమయంలో పూర్తి వైరాగ్యాన్ని పాటిస్తూ కాషాయ రంగు దుస్తులను వేసుకునేవారు.

ఇంట్లోని పిల్లలను కూడా అదే మనస్తత్వంతో మా అమ్మ, నాన్నగారు పెంచారు.

మా ఇంట్లో MSW 8929 నెంబర్ గల రేడియం కలర్ అంబాసిడర్ కారు వుండేది. కానీ, మా పిల్లలం అందరం నడిచే స్కూలుకు వెళ్లి వస్తూ వుండేవాళ్లం. నాన్నగారి చేతికి మొదట్లో గోల్డ్ కోటెడ్ చైన్ రిస్ట్ వాచ్ ఉండేది. తర్వాతి కాలంలో బ్లాక్ లెదర్ స్ట్రాప్ వాచ్ పెట్టుకోవడం గుర్తుంది. అందరిలా వాచ్‌ను మణికట్టు వేపు కాకుండా రివర్స్ సైడ్‌లో అరచేతివేపు పెట్టుకునేవారు. అలాగే ఒక బ్రౌన్ కలర్ లెదర్ జిప్ బ్యాగ్ చేతిలో వుండేది. అందులో ఆరోజు పాడవలసిన పాటల కాగితాలు వుండేవి. నాన్నగారికి తన వస్తువులు వేటినీ తరచూ మార్చే అలవాటు వుండేదికాదు. అవి పూర్తిగా చిరిగి, శిధిలావస్థకు చేరి పాడైపోఅశీవరకు వాటినే మక్కువగా వాడేవారు.

అమ్మ బలవంతం మీద కొత్తవాటికి మారేవారు.

మా నాన్నగారు వున్నంతకాలం మా ఇంట్లో దసరా, దీపావళి, సంక్రాంతి పండగలు చాలా వైభవంగా జరిగేవి. దసరా కొలువులు సమయంలో సినీమారంగానికి, సాహితీరంగానికి చెందిన ప్రముఖ మహిళలెందరో పేరంటానికి వచ్చేవారు. దీపావళి వచ్చిందంటే మా 35 , ఉస్మాన్ రోడ్ ఇల్లంతా పూర్తిగా ప్రమిద దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయేది. తమిళంవారికి దీపావళి రోజు రాత్రి దీపాలు వెలిగించి పండగ చేసుకునే ఆచారం లేదు. బాణా సంచా మాత్రం ఉదయం నుండి అర్ధరాత్రి వరకూ పేలుస్తారు. ఇక సంక్రాంతి వస్తే మా కాంపౌండ్ అంతా పెద్ద పెద్ద ముగ్గులతో నిండి పోయేది. ఈ పండగలన్నీ మా అమ్మ ఆధ్వర్యంలోనే జరిగేవి. అలాటి పండగ సమయాలలో కూడా నాన్నగారి కార్యకలాపాలకు ఎటువంటి భంగం రాకుండా చూసుకుంటూ ఇంటిపని ,వంటపని, వడ్డనలు అన్నీ అమ్మ, పిన్నే చేసేవారు.

మా నాన్నగారికి పిల్లలంటే చాలా ప్రేమాభిమానాలు వుండేవి. పిల్లలు ఎంత విసిగించినా, అల్లరిచేసినా కోపగించుకోవడం, తిట్టడం వంటివి చేసేవారు కాదు. చాలా సౌమ్యంగా, సహనంగా, నవ్వుతూ బుజ్జగించేవారు.

ఆయన నవ్వు చల్లగా , జాబిల్లి వెన్నెలంత హాయిగా వుండేది. నాన్నగారి కళ్లు కూడా సదా నవ్వుతూనే వుండేవి.

సినిమాలలో వివిధ సన్నివేశాలకు ఆయన పాడిన పాటల్లోని నవ్వులు కూడా ఎంత మధురంగా వుండేవో మీ అందరికీ తెలిసినదే.

ఆయన ఇంట్లోనేకాదు, రికార్డింగ్ ధియేటర్స్‌లో, రిహార్సల్స్‌లో కూడా తన చుట్టూవున్న మనుషులు, పరిసరాలు ప్రశాంతంగా, సరదాగా వుండాలని ఆశించేవారు. ఎవరు మూడ్ ఔట్‌లో వున్నా నాన్నగారు భరించలేకపోయేవారు. తన సరదా కబుర్లతో అక్కడి వాతావరణాన్నే మార్చివేసేవారు. అందరూ సంతోషంగా కలసి మెలసి పనిచేస్తేనే ఆ పని విజయవంతమవుతుందని అనేవారు. వేసవికాలంలో ఆంధ్రా నుండి టూరిస్ట్ బస్సుల్లో తిరుపతి దర్శనానికి వెళ్లే యాత్రీకులంతా మద్రాసు వచ్చి ఉదయం ఏడు

గంటలకల్లా నాన్నగారిని చూస్తామని వచ్చేవారు. కొందరు తాము పాడతామని, నాన్నగారిని కూడా పాడమని గొడవ చేసేవారు. అలాటివారందరినీ కూడా వారి మనసు గాయపడకుండా తమాషాగా మాట్లాడి సంతోషపెట్టి పంపేవారు.

భగవద్గీత కంపోజింగ్ జరుగుతున్న రోజుల్లో దీపావళి పండగ సందర్భంలో నాన్నగారు నాకు ఒక గన్ కొనిపెట్టారు. మా ఇంటి హాల్‌లో నాన్నగారు తన బృందంతో సీరియస్‌గా తమ పనిలో నిమగ్నమైవున్నారు. ఆ సమయంలో నేను అల్లరిగా హాలులోకి వెళ్లి ఢాం! ఢాం! ఢాం అని గన్‌తో గాలిగా పేల్చి అరుస్తూ అక్కడ నుండి పారిపోయాను. ఆ క్షణాన వారి పనికి అంతరాయం కలిగింది. అయినా నాన్నగారు నాపై కోపగించుకొని, తిట్టడమో, కొట్టడమో చేయలేదు. ఆ వయసులో పిల్లలు సహజంగా అలాగే మసలు కుంటారని సర్దుకుపోయేవారు.

శిక్షించి పిల్లలను పెంచడంలో ఆయనకు నమ్మకం వుండేది కాదు. అమ్మ ఆయనకు పూర్తి విరుద్ధం. అమ్మకు కోపం ఎక్కువే. ఆ సమయంలో దండం దశగుణం భవేత్ అనే సూక్తి అక్షరాల పాటించేది. నాన్నగారు లేని సమయంలో ఎవరు ఏ చిన్నపాటి తప్పు, అల్లరి చేసినా అమ్మ పెట్టే తొడ పాయసాలు మాకు అనుభవమే. మేము ఏడుస్తూ పిన్ని దగ్గరకో లేకపోతే సంగీతంగారింట్లో శ్రీలక్ష్మమ్మగారి దగ్గరకో చేరి రక్షణ పొందేవాళ్లం. నాన్నగారిలాగే వాళ్లకు కూడా పిల్లలంటే అమితమైన ప్రేమానురాగాలు. పిల్లలు ఏమాత్రం ముఖం ముడుచుకున్నా చాలా బాధపడేవారు. సంగీతం గారి కుటుంబం, మా కుటుంబం కలసిమెలసి చాలా సఖ్యతతో వుండేవాళ్లం. ఇప్పటికీ మా కుటుంబాల స్నేహం అలాగే కొనసాగుతోంది. నాన్నగారు పోయిన తర్వాత కూడా సంగీతంగారి కుటుంబం ఓ పదేళ్లపాటు మా ఔట్‌హౌస్‌లోనే వుంది. ఆ సమయంలో సంగీతంగారు మా అక్కచెల్లెళ్లకు ఇచ్చిన సంగీత శిక్షణ మాకు శాస్త్రీయ సంగీతం పట్ల మంచి అభిరుచిని, అవగాహనను ఏర్పర్చింది.

ఏది ఏమైనా ఈనాడు మేము ఈ స్థితిలో వృద్ధి చెంది సుఖ సంతోషాలతో హాయిగా వుండేందుకు అమ్మ, నాన్నగార్ల మమతాను రాగాలు, పెంపకము, దీవెనలే ముఖ్యకారణంగా భావిస్తాను.

నాన్నగారు ఇంట్లో లేని సమయంలో నెం.35 , ఉస్మాన్ రోడ్ (మా ఇల్లు) ఒక మినీ కిండర్ గార్డెన్ స్కూల్‌లా వుండేది. మా ఇంట్లోని పిల్లలు, సంగీతంగారింట్లోని పిల్లలు, పక్కింటి మామి పిల్లలు అంతా కలసి నా వయసువారే 15 మంది పిల్లలకు తక్కువ లేకుండా మా కాంపౌండ్ ఎప్పుడూ కళకళలాడుతూ వుండేది. అందులోనూ వేసవి శెలవులు వస్తే మా బంధువుల పిల్లల రాకతో మరింత చైతన్యవంతంగా వుండేది.


నాన్నగారు పదిమంది మధ్యలో గడపడమే చాలా ఆనందంగా భావించేవారు. ఆ రోజుల్లో మా ఇంట్లో ఎవరికి ప్రత్యేక గదులంటూ వుండేవికాదు.

నాన్నగారికి ఆధ్యాత్మిక సేవ, సాంఘిక సంక్షేమ సేవా కార్యక్రమాలంటే చాలా ఆసక్తి. అందుకోసం తన అనారోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టకుండా కనీస వసతులు కూడా లేని పల్లెటూళ్లలో తన బృందంతో ఉచితంగా కచేరీలు చేసేవారు. కష్టాలలో వున్న వారెందరికో తగురీతిలో ఆర్థిక సహాయ సహకారాలందించారు.

1972 వరకు నాన్నగారు ఇంట్లో గడిపిన సమయం చాలా తక్కువే. ఆయన పుట్టినరోజునాడు, లేదా తనకు అవకాశం దొరికినప్పుడల్లా ఇంట్లోని పిల్లలందరినీ మౌంట్ రోడ్‌లోని బుహారీ హోటల్‌కో లేక మెరీనా బీచ్‌లోని బుహారికో తీసుకువెళ్లి ఐస్ క్రీములో, కేకులో పెట్టించేవారు. ఆయన కూడా మాతో సమానంగా బీచ్‌లో నడుస్తూ నీళ్లవరకు వచ్చేవారు. నాన్నగారితో బీచ్ అంటే రాత్రి ఎనిమిది, తొమ్మిది తర్వాతే.

నాన్నగారికి అవకాశం లేకపోతే ఇంట్లోని బాబాయి , పిన్నిల సాయంతో వెళ్లేవాళ్లం.

నాన్నగారు బయటకు వెళ్లేప్పుడు ఆరోజు సాయంత్రం ఏదో సినిమా ప్రివ్యూ వేస్తున్నారని అందరం వెళదాం, రెడిగా వుండమని చెప్పి వెళ్లిపోయేవారు. అంతే, అక్కడితో ఆ విషయమే మర్చిపోయేవారు. సాయంత్రమెప్పుడో మా డ్రైవర్ గోవిందు గుర్తు చేస్తే పని ముగించుకొని ఆదరాబాదరగా వచ్చి మమ్మల్ని తీసుకువెళ్లేవారు. కోడంబాక్కం రైల్వే గేట్లన్నీ దాటి వడపళనిలో స్టూడియోలకి వెళ్లేసరికి పుణ్యకాలం కాస్తా దాటి సినిమా మొదలెట్టేసేవారు. నాన్నగారు పాడిన ఒకటి రెండు పాటలు కూడా అయిపోయేవి. టైటిల్స్‌తో సహా పూర్తి సినిమాలు, మా నాన్నగారితో కలసి చూసినవి చాలా అరుదు. పూర్తిగా సినిమాలు చూడలేదనే అసంతృప్తి అమ్మకుండేది. అసలు విషయం ఏమంటే నాన్నగారికి



సినీమాలు చూడడంలో లేదా తను పాడిన పాటలు తిరిగి వినడం, పాడుకోవడం వంటి విషయాలలో పెద్ద ఆసక్తి వుండేది కాదు. అవకాశం దొరికితే వారాంతాలలో రాత్రిపూట రేడియోలో వచ్చే ఆకాశవాణి అఖిలభారత సంగీత కార్యక్రమాలను మాత్రం చాలా తక్కువ వాల్యూమ్‌లో పెట్టుకొని వినేవారు.

నాన్నగారు లేకుండా మేము చూసిన ఆఖరి ప్రివ్యూ అల్లూరి సీతారామరాజు. ఆ సినిమా విడుదల నాటికి ఆయన లేనేలేరు. ఆ సినిమాలో నాన్నగారు పాడిన 'తెలుగు వీర లేవరా...' పాటను వ్రాసినందుకు శ్రీశ్రీగారికి నేషనల్ అవార్డు లభించడం మా అందరికీ ఎంతో ఆనందాన్ని తృప్తిని కలిగించింది.

నాన్నగారు స్వర్గస్థులయేనాటికి ఆయన పిల్లలెవరం జీవితంలో స్థిరపడలేదు. అందరం చదువుల్లోనే ఉన్నాము. మా పెద్దన్నయ్య విజయ్‌కుమార్ మాత్రం కర్ణాటిక్ , వెస్టర్న్ సంగీతంలో డిప్లొమాలు పొంది నాన్నగారి కొన్ని సినీమాలకు, భగవద్గీత రికార్డింగ్ సమయంలో, ఆర్కెస్ట్రాలో పనిచేసాడు.

కానీ తర్వాతి కాలంలో అతనికి తగిన అవకాశాలు లభించక పోవడం మా దురదృష్టం. మా చిన్నన్నయ్య రత్నకుమార్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపును, పేరును సంపాదించుకోగలిగాడు.

నాన్నగారు అనారోగ్యంతో బాధపడుతూ మమ్మల్ని దగ్గరకు తీసుకొని మా చేతులను తన కనులకు అద్దుకొని , 'మీరంతా బాగా చదువుకొని మంచి వృద్ధిలోకి రావాలి. అందరిచేత మంచివాళ్లు అనిపించుకోవాలి, నా పేరు నిలపాలి,' అనేవారు.

నాన్నగారి ఆకస్మిక మరణం మా కుటుంబానికి ఎవరూ తీర్చ లేని లోటు అయింది. మాట సాయం చేసినంతగా చేత సాయం చేసినవారు కరువయ్యారు. కానీ , అమ్మ చాలా ధైర్యంగా సమస్యల న్నిటిని ఒంటరిగా ఎదుర్కొని మా చదువులు పూర్తి చేయించి మేమంతా జీవితంలో నిలదొక్కుకునేందుకు అహర్నిశలు కష్ట పడింది.

నాన్నగారి ఆఖరి అద్భుత సాధన 108 శ్లోకాల భగవద్గీతా గానం. ఇది రెండు భాగాలుగా రికార్డు చేయడం జరిగింది. మొదటి భాగానికి , రెండవ భాగానికి మధ్య ఆరుమాసాల వ్యవధి ఏర్పడింది.

మొదటి భాగం రికార్డు తయారయి ఇంటికి వచ్చినప్పుడు మా ఇంట్లో, సంగీతంగారింట్లో వున్నవారందరి సమక్షంలో నాన్న గారితో సహా మేమందరం ఆ శ్లోకాలు విని ఎంతో ఆనందించాము. తర్వాత రెండవ భాగం రికార్డు అయింది. అన్నీ కలిపిన LPరికార్డు ఒక పెద్ద పబ్లిక్ ఫంక్షన్‌లో రిలీజ్ కావడం, యావత్ భారతదేశం ఘంటసాలవారి భగవద్గీతా గానానికి ముగ్ధులు కావడం, వారి ఖ్యాతి దిశాంతాలకు వ్యాపించడం వంటి విశేషాలు నాన్నగారు వుండగా జరగలేకపోవడం అత్యంత దురదృష్టకరం. అది మా అందరికి చాలా విచారాన్ని కలిగించింది.

నాన్నగారి భగవద్గీత చివర్లో వచ్చే శాంతి శ్లోకాన్ని మీ నాన్న గారితో పాటు మీ అక్కచెల్లెళ్లు అంతా కలసి పాడారా అని చాలా మంది అడుగుతూంటారు. కానీ మేము ఎవరము పాడలేదు.

సంగీతంగారి రెండో అమ్మాయి పద్మ, మరో గాయని ఆ శ్లోకంలో గొంతు కలిపారు.

నాన్నగారు వ్రాసి, స్వరపర్చి, పాడిన 'పుట్టపర్తి సాయిబాబా' గీతాలను మా ఇంట్లోని పిల్లలం అందరమూ కలసి నాన్నగారితో పాడే అదృష్టం కలిగింది. ఆ పాటలు రికార్డులుగా వచ్చి మంచి జనాదరణ పొందాయి. అది నాకెంతో గర్వకారణం.

నాన్నగారు పోయిన తర్వాత మేము 35, ఉస్మాన్ రోడ్ ఇంట్లో ఉన్నంతకాలం మా నాన్నగారి తలపు కలిగినప్పుడల్లా పిల్లలం అందరం నాన్నగారి కచేరీ పుస్తకాలు ముందు పెట్టుకొని అందులోని పాటలన్నీ మనసారా పాడుకుంటూ ఆయనను స్మరించుకునేవాళ్లం.

ఈనాడు మా నెం. 35, ఉస్మాన్ రోడ్ భవంతి నేలమట్టమై మరో కొత్త రూపు సంతరించుకున్నా మా జ్ఞాపకాలు మాత్రం నాన్నగారు నివసించిన నెం. 35, ఉస్మాన్ రోడ్‌నే సదా అంటి పెట్టుకొని వుంటాయి.

కొసమెరుపు...

ఇంత మంచి నాన్నగారిలో నాకు/మాకు నచ్చనిది ఒకే ఒకటి- ఆయన పొగచుట్ట కాల్చడం. ఉదయాన్నే నాన్నగారి పొగచుట్ట వాసనతో మాకు తెల్లారేది. ఆ వాసన భరించలేక మేమందరం ముక్కులు మూసుకొని ఆయనను కోపంగా చూసేవాళ్లం. నాన్న గారు నవ్వుతూ మరింత గట్టిగా పొగ వదులుతూ మమ్మల్ని ఏడిపించేవారు.

ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నాన్నగారి శతజయంతి ఉత్సవాలు , పాటల/మాటల కచేరీలు , విగ్రహ స్థాపనలు విరివిగా సాగుతున్నాయి. ఆ క్రమంలో 'తానా' వారు కూడా నాన్నగారి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరపడం ఎంతో ముదావహం.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఘంటసాలవారి కుమార్తెగా నా హృదయంలోని భావాలను మీ అందరితో పంచు కోవడానికి అవకాశం కల్పించిన 'తానా' కార్యనిర్వాహకులకు నా తరపున, మా ఘంటసాల కుటుంబం తరపున హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

జయహో ఘంటసాల!



శాంతి సురేంద్రకుమార్ ఘంటసాల వెంకటేశ్వరరావుగారి మూడవ కుమార్తె. మద్రాసులో నివాసం.

హాస్యానికి పుట్టిల్లు - అల్లు

కిరణ్ ప్రభ



తెలుగు సినిమా స్వర్ణయుగంలో తన నట జీవితాన్ని ప్రారంభించి యాభై సంవత్సరాల సినీరంగ ప్రస్థానంలో వెయ్యి పైగా సినిమాల్లో నటించిన అల్లు రామలింగయ్యగారి లాంటి కళాకారులకు మరణం ఉండదు. అంటే ఇప్పుడు ఇది వారికి నూట ఒకటవ సంవత్సరం. సినిమాల్లో ఏ నటుడైనా, నటి అయినా వివిధ రకాల పాత్రలు ధరించి తమని తాము ఉత్తమ కళాకారులుగా నిరూపించుకోవడం ఒక ఎత్తయితే హాస్యనటులకు మాత్రం ఈ ప్రయాణం అంత సులువైంది కాదు. చాలాసార్లు వాళ్లు ఒకసారి ధరించిన పాత్రనే మళ్లీ మళ్లీ ధరించాల్సి వస్తుంది. పిసినారి ముసలాయన, చాదస్తపు భర్త, చండశాసనుడైన మాస్టారు, పెళ్లిళ్ల పేరయ్య, తాగుబోతు... ఇట్లాగ ఒకే పాత్రను అనేక సినిమాల్లో పోషించాల్సి వచ్చినా వాటిల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తేనే తప్ప ప్రేక్షకుల్ని మెప్పించడం కష్టం. ఆ కోవలో ఒకే పాత్రను డజన్లకొద్దీ సినిమాల్లో ధరించి, హాస్యనటుడి సత్తా ఇది అని నిరూపించిన తొలి తరం హాస్యనటుల్లో మొదటి వరుసలో చూడదగిన నటుడు అల్లు రామ లింగయ్య. ఆయన తన మొట్టమొదటి సినిమాలోనే పేరయ్యశాస్త్రిగా నటిస్తే ఆ తరువాత మాయాబజార్‌లో శర్మ అనే పాత్రలో నటించి అక్కడి నుంచి వరుసగా చాలా సంవత్సరాల పాటు శాస్త్రులు, పంతులు ఇలాంటి పాత్రలనే కొనసాగించక తప్పలేదు. అయినా కానీ ప్రతి సినిమాలోనూ తనదైన వైవిధ్య భరితమైన నటనను ప్రదర్శించారు కాబట్టే అయిదు దశాబ్దాలపాటు తరతరాల నటు లతో కలిసి నటించే అవకాశాన్ని సొంతం చేసుకున్నారు.

1953లో అల్లు రామలింగయ్యగారు సినీరంగ ప్రవేశం చేసేటప్పటికీ, రేలంగిగారు ప్రతి సినిమాలోనూ అప్రకటిత ప్రధాన



హాస్య పాత్రధారి. అంజి బాలకృష్ణ, పద్మనాభం, రమణారెడ్డి గార్లు అప్పుడప్పుడే పైకొస్తున్న హాస్యనటులు. ఆ దశలో హాస్య నటుడిగా సినీరంగ ప్రవేశం చేసిన అల్లు రామలింగయ్యగారు మొదట్లో చిన్న చిన్న పాత్రలకు పరిమితం కాక తప్పలేదు. తెరమీద కనిపించేది కొద్ది నిమిషాలే అయినా ఒక మెరుపులాగా మెరవడంతో తొందర్లోనే పూర్తి నిడివిగల పాత్రలను సొంతం చేసుకోగలిగారు. సహ హాస్య నటులందరిలోనూ తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకోగలిగారు.

ఆయన నటించిన చిత్రాల వేగం కూడా ఆనాటి హాస్య నటుల వేగంతో పోలిస్తే చాలా ఎక్కువ. ఉదాహరణకు ఆయన నటించిన తొలి చిత్రం 1953లో విడుదలైతే, 1953, 1960 సంవత్సరాల్లో 108 సినిమాల్లో నటించారు. ఆ తర్వాత 1961 - 1970 ఆ పదేళ్లలో 224 సినిమాల్లో అల్లు రామలింగయ్య నవ్వులు పండించారు. 1969, 1970, 1971, 1972 సంవత్సరాల్లో అయితే సంవత్సరానికి 35-40 సినిమాల్లో నటించడం అల్లు రామలింగయ్యకే చెల్లింది.

అల్లు రామలింగయ్య పేరు తలచుకోగానే ఎన్నో మేనరిజంలు, ఇంకెన్నో ఊతపదాలు, మరెన్నో చిలిపి పాటలు గుర్తొస్తాయి. బుద్ధిమంతుడులో 'అమ్మాయ్యా' ఊతపదం, ముత్యాల ముగ్గులో కోతి పాత్రలో ఆయన చేసిన పరకాయ ప్రవేశం... ఇలా ఒకటి రెండు ఉదాహరణలైనా చాలు అల్లు రామలింగయ్య హాస్య సంతకం విలువేమిటో తెలుసుకోవడానికి.

సినీరంగంలోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా అల్లు రామలింగయ్యకి అనేక ప్రత్యేకతలున్నాయి.

సినిమాల్లో రావడానికి ముందే ఆయన గాంధేయవాది. ఆ తరువాత కమ్యూనిస్టు. రెండుసార్లు రాజకీయ ఖైదీగా జైలు కెళ్లిన అనుభవం. ఆనాటి సినీ పరిశ్రమలోని ప్రతి కళాకారుడు సాంకేతిక నిపుణుడు ఎప్పుడో ఒకసారి ఆయన హోమియోపతి వైద్యాన్ని తీసుకున్నవాళ్లే. ఆయన సమకాలీన హాస్యనటులు అందరూ కూడా ఎవరికి వాళ్లు తమదైన ముద్రని, శైలిని తమ నట జీవితంలో మిగిల్చి వెళ్లారు. అయితే అల్లు రామలింగయ్య వాటన్నింటితోపాటు తెలుగు సినిమా పరిశ్రమలో ఒక శకానికి పునాది వేశారు, ఒక శకాన్ని వదిలి వెళ్లారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు పటిష్టమైన వ్యవస్థ లాంటి తన వారసుల్ని నిలబెట్టి వెళ్లారు. గీతా ఆర్ట్స్, జి ఎ టూ, గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్, అల్లు ఎంటర్‌టైన్‌మెంట్, అల్లు స్టూడియోస్- ఇలాగా శాఖోపశాఖలుగా విస్తరించిన, విస్తరిస్తున్న ఈ మహా వృక్షానికి తొలి విత్తనం నాటింది అల్లు రామలింగయ్యగారు.

పాలకొల్లు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాదు, బెంగుళూరు... ఇన్ని నగరాల్లో శిలావిగ్రహాలు నెలకొల్పబడిన తెలుగు హాస్యనటుడు బహుశా అల్లు రామలింగయ్య ఒక్కరేనేమో! మొత్తం భారతదేశంలోనే పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న తొలి హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్యగారైతే ఆ పురస్కారాన్ని అందుకున్న ద్వితీయ హాస్యనటుడు అల్లు రామలింగయ్య. ఇది కూడా భారతదేశం మొత్తంలోనే రికార్డ్. అట్లాగే తెలుగుభాష పట్ల ఆయనకు ఉన్న మమకారం, మధ్యతరగతి జీవన విలువల పట్ల ఆయనకున్న గౌరవం. వీటికి బోలెడన్ని ఉదాహరణలున్నాయి ఆయన జీవన ప్రయాణంలో.

బాల్యం

అల్లు రామలింగయ్య నాన్న వెంకయ్య, అమ్మ సత్తెమ్మ.

తాతగారు సుబ్బారాయుడు. మితిమీరి దానధర్మాలు చేయడంతో ఆ సుబ్బారాయుడు ఆస్తంతా కరిగిపోయి వెంకయ్యగారి దగ్గరకు వచ్చేసరికి ఇరవై ఎకరాలు మిగిలింది. వెంకయ్య, సత్తెమ్మ దంపతులకు మొత్తం ఏడుగురు సంతానం. మగవాళ్లలో నాలుగవ సంతానం రామ లింగయ్య. ఆయన పుట్టిన తేదీ 1922 అక్టోబర్ 1. ప్రాథమిక విద్యాభ్యాసం వాళ్ల ఊళ్లోలోనే మొదలైంది.

చిలిపితనం అనేది ఆయనకు తెలియకుండానే చాలా చిన్న తనం నుంచే మొదలైంది. ఆలస్యంగా స్కూల్ కు వెళ్లాల్సి వచ్చిన రోజున స్కూలు కెళ్లే దోవలో జంతికలు కొనుక్కుని వెళ్లేవాడు. మాస్టర్ కొట్టబోతుంటే, 'పంతులుగారు పంతులుగారు మరండి మరేనండీ జంతికలు కొనుక్కొచ్చేసరికి ఆలస్యమైందండి,' అని, ఆ జంతికలిచ్చేవాడు. ఇదే దృశ్యం సినిమాల్లో చిత్రీకరించినట్లు ఊహించుకోండి అల్లు రామలింగయ్య ఆ పాత్రలో అచ్చుగుద్దినట్లు ఒదిగిపోతారు కదా! ఆ కుర్రవాడి సమయస్ఫూర్తిని గమనించిన పంతులుగారు వాళ్ల నాన్న వెంకయ్యకి చెప్పారట, 'మీవాడు బతకనేర్చిన వాడండి. చదువు గురించి పట్టించుకోబాకండి. ఎక్కడైనా బతికేస్తాడు,' అని.

హైస్కూల్లో చదువు అంతంత మాత్రంగానే సాగింది. తండ్రి పొలం వెళదాం రమ్మన్నా ఏదో వంకతో తప్పించుకుంటూ ఉండే వారు. నాటకాలు చూడడం అనే అలవాటు నాటకాల్లో వేషం వేయాలి అనే కోరిక వరకు వెళ్లింది. కానీ వెంటనే అవకాశం ఎవరిస్తారు?

నాటకంలో తొలిసారి వేషం

ఒకరోజు ఆయన మిత్రుడు హడావిడిగా పరిగెత్తుకొచ్చి, 'రామలింగయ్య గుడ్ న్యూస్,' అన్నాడు.

'ఏమిట్రా?' అంటే,

'ఈ రాత్రికి మన ఊళ్లో భక్తప్రహ్లాద నాటకం వేస్తున్నారు. అందులో బృహస్పతి వేషం వేసేవాడు ఉన్నట్టుండి పారిపోయాడు,' అని చెప్పాడు ఆ మిత్రుడు.

ఇద్దరూ కలిసి ఆ కాంట్రాక్టర్‌ని కలుసుకున్నారు. మూడున్నర రూపాయలు ఇస్తే ఆ వేషం రామలింగయ్యతో వేయిస్తానన్నాడు ఆ కాంట్రాక్టర్. వెంటనే ఇవ్వడమంటే కష్టం కాబట్టి మర్నాడు ఆ డబ్బులు ఇచ్చే ఒప్పందం మీద రామలింగయ్యతో ఆ వేషం వేయించాడు ఆ కాంట్రాక్టర్. మర్నాటి నుంచి ఆ వీధికి వెళ్లడం మానేశాడు అల్లు రామలింగయ్య. రెండు మూడు రోజుల తరువాత ఒకరోజు ఆ కాంట్రాక్టరే ఈ కుర్రాణ్ణి వెదుకుతూ మొత్తానికి రోడ్డు మీద నిలేశాడు. విషయం తెలుసుకున్న పెద్దలు, 'ఆ మాత్రం వేషానికి మూడున్నర రూపాయలు చాలా ఎక్కువ. పైగా అసలే కుర్రాడు, అంత ఇవ్వలేడు రూపాయిన్నర చేసుకో,'మని తీర్పు చెప్పారు. ఎట్లాగో అమ్మకు, నాన్నకు తెలియకుండా ఇంట్లో బియ్యం తీసుకెళ్లి కిరాణాకొట్లో అమ్మేసి రూపాయిన్నరా కాంట్రాక్టర్‌కు ఇచ్చి రుణ విముక్తుడయ్యాడు రామలింగయ్య.

రాజకీయాలు - వివాహం

ఆయన చదువు హైస్కూలు దాటకుండానే ఆగిపోవడానికి ఇంకొక కారణం స్వాతంత్ర్యోద్యమం. పాలకొల్లులోనూ, చుట్టు పక్కల ఎక్కడ ఏ రాజకీయ సభ జరిగినా రామలింగయ్య తప్పని సరిగా హాజరవ్వాల్సిందే. ఒకసారి అమలాపురంలో జరిగిన మహాత్మాగాంధీ ఉపన్యాసం విన్నాక ఖద్దరు బట్టలు కుట్టించు కున్నారు. గాంధీగారి ప్రసంగాల్ని మిత్రులకు వివరించి చెప్పడం, స్థానిక గాంధీయవాదులతో కలిసి తిరగడం మొదలైంది. ఈ కుర్ర వాడి రాజకీయ కార్యకలాపాలు భరించలేని వాళ్లల్లో కొంతమంది పోలీసు రిపోర్టు ఇచ్చారు. పోలీసులు ఒక శుభముహూర్తాన ఆయన్ని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపించారు 1942లో. వీటన్నింటి మధ్య చదువు ఆగిపోయింది. జైలు నుంచి రాగానే పెళ్లి చేసెయ్యాలని నిర్ణయించుకున్నారు అమ్మానాన్న.

పాలకొల్లుకి చెందిన ముత్తిరెడ్డి నారాయణస్వామి, బాపనమ్మ గార్ల కుమార్తె కనకరత్నంతో సంబంధం నిశ్చయం చేశారు. పెళ్లి కూతురికి రాట్నం పడికే పోటీలో మొదటి బహుమతి వచ్చింది అని తెలుసుకుని వెంటనే ఆమెను వివాహం చేసుకోవడానికి ఒప్పేసు కున్నారు. 1944లో 22 సంవత్సరాల వయసులో వివాహం అయింది. నాన్నగారి వ్యవసాయం ఉంది కాబట్టి ఉండడానికి, తినడానికి ఏమి ఇబ్బంది లేదు.

హోమియో వైద్యుడు

ఏదో ఒక వ్యాపకం చూసుకుని సొంత కాళ్ల మీద నిలబడాలి అనుకున్నారు రామలింగయ్య. ఆ క్రమంలో నరసాపురంలో ఉన్న నోరి నారాయణమూర్తి అనే ఆయన్ని కలుసుకున్నారు. ఆయన వకీలు ప్లస్ హోమియో వైద్యం కూడా చేస్తుండేవారు. కొన్ని నెలల పాటు శ్రద్ధగా ఆయన దగ్గర హోమియో వైద్యం నేర్చుకున్నారు. లైబ్రరీలో దొరికిన హోమియో పుస్తకాలన్నీ శ్రద్ధగా చదివారు. డాక్టర్ పాగరు వెంకటేశ్వరరావు అనే ఆయన దగ్గర ఒకటి రెండు నెలలు సహాయకుడిగా పనిచేశారు. 1945లో పాలకొల్లులోనే హోమియో డాక్టర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. తొందర్లోనే హస్తవాసి ఉన్న వైద్యుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. తన ప్రాక్టీస్‌కి అను బంధంగా హోమియో మందుల దుకాణాన్ని కూడా ప్రారంభించారు. దానికి 'అరవింద హోమియో స్టోర్స్' అని పేరు పెట్టారు. అప్పటికి ఆయనకు ఇంకా సంతానం కలగలేదు. అప్పుడే అరవింద హోమియో స్టోర్ అని పేరు పెట్టడానికి, ఆ తర్వాత తన పెద్ద కుమారుడికి అరవిందబాబు అని పేరు పెట్టడానికి కారణం- రామలింగయ్యకి ఆ రోజుల్లోనే తత్వవేత్త శ్రీ అరబిందో పట్ల ఉన్నటువంటి గౌరవం, భక్తి.

ప్రజానాట్య మండలి

హోమియో వైద్యంలో కాస్త స్థిరపడ్డాక మళ్లీ రామలింగయ్యలోని నటుడు మేల్కొన్నాడు. ఈసారి నరసాపురం తాలూకా ప్రజా నాట్యమండలి కార్యక్రమాల వైపు ఆకర్షితులయ్యారు. ఆ రోజుల్లో

ప్రజానాట్య మండలి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలన్నింటికీ ముఖ్య సారధి, కీలకమైన కేంద్ర నాయకుడు, డాక్టర్ గరికపాటి రాజారావు. అల్లు రామలింగయ్య కూడా కమ్యూనిస్టు భావజాలాన్ని ఒంటపట్టించుకున్నారు. స్టంటు శాస్త్రి, విదేశీయానం ఇలాంటి ఏకపాత్రాభినయాలతో పాటుగా, డాక్టర్ రాజారావు వ్రాసిన 'పశ్చాతాపం', ఆ తర్వాత రోజుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన పరకాల శేషావతారం వ్రాసిన 'బ్రతుకు భార మాయర' లాంటి నాటకాల్లో కూడా ముఖ్యమైన పాత్రలు ధరిస్తూ ఉండేవారు అల్లు రామలింగయ్య.

ఆయన ప్రజానాట్యమండలి కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉన్న రోజుల్లోనే అంటే 1947-1948 ప్రాంతాల్లో తెలంగాణ సాయుధ పోరాటం, కమ్యూనిస్టు కార్యకర్తలను జైల్లో పెట్టడంలాంటి సంఘటనలన్నీ జరిగాయి. అందులో భాగంగానే అల్లు రామ లింగయ్యని కూడా అరెస్టు చేసి ఈసారి కడలూరు జైలుకి తరలించారు. దశాబ్దాలపాటు నవ్వుల పువ్వుల్ని పోయించిన అల్లు రామలింగయ్య జీవనపథంలో ఇన్ని మలుపులు, ఇన్ని త్యాగాలు, ఇంత దేశభక్తి, ఇంత సామాజిక స్పృహ ఉంది. జైలులో దుర్భరమైన పరిస్థితుల్ని భరించారు.

దాదాపు సంవత్సరం పాటు ఆ జైలుశిక్ష ముగించుకుని వచ్చాక మళ్లీ ఆయన హోమియో వైద్యం, నాటక ప్రదర్శనలు కొనసాగాయి. ఈసారి అల్లు రామలింగయ్య నటించిన నాటకాల్లో ఆయనకు బాగా పేరు తెచ్చిపెట్టింది పరకాల శేషావతారం వ్రాసిన 'కూడు గుడ్డ' అనే నాటకం. ఆ నాటకంలో అల్లు రామలింగయ్య ధరించిన ఆచార్యులు పాత్ర ఎంతగా ప్రజాదరణ పొందిందంటే విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆ నాటకంలోని ఆచార్ల పోర్షన్ మాత్రమే రికార్డు చేసి ప్రసారం చేసింది. ఈ 'కూడుగుడ్డ' నాటకమే 1951లో తెనాలిలో ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీల్లో ప్రదర్శించినప్పుడు, డాక్టర్ రాజారావు మొట్టమొదటిసారిగా అల్లు రామ లింగయ్యను రంగస్థలం మీద చూశారు. ఇంతకుముందు తాను వ్రాసిన 'పశ్చాతాపం'లో కూడా శాస్త్రులు పాత్ర పోషించింది ఈ కుర్రవాడే అని తెలుసుకున్నారు. ఆ నాటక ప్రదర్శన అవగానే గ్రీన్ రూమ్ కెళ్లి అల్లు రామలింగయ్యతో, 'ఇంకొక ఏడాదిలో నేను సొంతంగా సినిమా నిర్మాణాన్ని ప్రారంభించబోతున్నాను, అందులో ఇలాంటిదే శాస్త్రులు పాత్ర ఒకటుంటుంది. దాంట్లో మీకు అవకాశం ఇస్తాను,' అని చెప్పారు.

ఆయన మాట ఇచ్చిన దగ్గర నుంచి సినిమా మొదలుపెట్టే దాకా ఇచ్చిన మాటను మర్చిపోకుండా ఆయనకు గుర్తుచేస్తూ ఉండేవారు. అల్లు రామలింగయ్య సినీరంగ ప్రవేశానికి కారణమైన మరొక వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి. ఆయన కూడా రాజారావు తీయబోయే సినిమాకి పెట్టుబడి పెట్టారు.

అప్పటికి రామలింగయ్య వయసు 31 సంవత్సరాలు. వ్యక్తిగత జీవితాన్ని చూసుకుంటే- 1947లో జన్మించిన పెద్ద కుమార్తెకు నవభారతి అని పేరుపెట్టుకున్నారు. 1949 జనవరిలో జన్మించిన పెద్దబ్బాయికి అరవింద్‌బాబు అని పేరు పెట్టారు. అప్పటివరకు హోమియో డాక్టరు, నటుడు, రాజకీయ యోధుడు, ఇద్దరు బిడ్డల తండ్రి అయిన అల్లు రామలింగయ్య జీవితంలో 1952 నుంచి సరికొత్త అధ్యాయం మొదలైంది.

1953-1960

డాక్టర్ గరికపాటి రాజారావు ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శక నిర్మాతగా ప్రారంభించినటువంటి చిత్రం రాజా ప్రొడక్షన్స్ పుట్టిల్లు సినిమా షూటింగ్ 1952లో జరిగింది. అల్లు రామలింగయ్య తొలి సారిగా మద్రాసులో అడుగుపెట్టడం కూడా ఈ పుట్టిల్లు సినిమా కోసమే. డాక్టర్ రాజారావు పుట్టిల్లు సినిమాలో చాలామంది ప్రజా నాట్యమండలి కళాకారులకు అవకాశం కల్పించారు. బుర్రకథ కళాకారుడు నాజర్, పెరుమాళ్లు, మిక్కిలినేని, చదలవాడ మొదలైన వాళ్లు.

అల్లు రామలింగయ్య పుట్టిల్లు సినిమా షూటింగ్ జరిగినన్ని రోజులు ప్రొడక్షన్ ఆఫీసులోనే ఉంటూ, మెస్‌లో భోజనం చేస్తూ ఉండేవారు. మూడవ సంతానం వసంతలక్ష్మి జన్మించాక పాపకు నాలుగైదు నెలల వయసు ఉండగా 1953లోనే కుటుంబాన్ని మద్రాసుకు తీసుకొచ్చేశారు. అప్పటికి పెద్ద పాప వయస్సు ఆరేళ్లు, అబ్బాయి అరవింద్ వయసు నాలుగేళ్లు, చిన్న పాప నెలల పసిబిడ్డ. సినిమాల్లో స్థిరపడకుండానే ముగ్గురు పిల్లలతో మద్రాసులో కాలు పెట్టడం అనేది సాహసవంతమైన వ్యవహారమే.



రామలింగయ్య ఆదాయం సినిమాల ద్వారానే కాబట్టి ఒకదాని తరువాత ఒకటి సినిమాలు వెతుక్కోక

తప్పలేదు. పుట్టిల్లు సినిమాలో నటిస్తూ ఉండగానే ఎన్టీఆర్ పిచ్చిపుల్లయ్యలో ఒక వేషం సంపాదించుకోగలిగారు. అట్లా ఎన్టీఆర్‌గారితో ఏర్పడిన ఆనాటి పరిచయం దశాబ్దాలపాటు కొనసాగింది.



నటనా ప్రతిభతో పాటుగా పదిమందితో మంచిగా ఉండడం అనేది అల్లు రామలింగయ్యను ఎక్కువమంది దర్శక నిర్మాతలకు దగ్గర చేసింది. సమయానికి షూటింగ్‌లకు వెళ్లడం, ఎవరినీ ఇబ్బంది పెట్టకపోవడంలాంటి లక్షణాలు అల్లు రామలింగయ్యకు ఎక్కువ అవకాశాలు వచ్చేలాగా చేశాయి. అక్కడి నుంచి ఆ దశాబ్దం చివర వరకు 108 సినిమాల్లో నటించారు. సమకాలీన హాస్యనటులు ఎవరితో పోల్చుకున్నప్పటికీ ఇది అత్యంత వేగవంతమైన నట జీవితం అని చెప్పుకోవాలి.

తొలి దశాబ్దంలోనే చెప్పుకోదగ్గ సినిమా 1954లో విడుదలైన హెచ్ఎం రెడ్డిగారి వద్దంటే డబ్బు. అందులో హీరోయిన్ తండ్రిగా ప్రైవేటు పాఠాలు చెప్పే మాస్టర్. దీనికి ప్రత్యేకమైన మేనరిజం కోసమని అల్లు రామలింగయ్యకుతమిళ మాతృక చూపించారు. దాన్ని యదాతథంగా అనుకరించడం ఇష్టంలేని రామలింగయ్య ఒక విచిత్రమైన కూత కనిపెట్టారట. తొలిరోజుల నుంచే తన పాత్ర ఎంత చిన్నదైనాగాని ప్రత్యేకంగా తీర్చిదిద్దుకునే నేర్పు ఉండేది రామలింగయ్యకి.

ఆ తర్వాత చెప్పుకోవాల్సింది 1955లో విడుదలైన అన్నపూర్ణ వారి తొలిచిత్రం దొంగరాముడు. దీంట్లో హాస్టల్ వార్డెన్ పాత్ర. ఒకరోజు నాగేశ్వరావు, జమున, రామలింగయ్యల మీద దృశ్యం చిత్రీకరణ జరుగుతోంది. అల్లు రామలింగయ్య తాను చెప్పాల్సిన సంభాషణ మధ్యలో మర్చిపోయారు. తర్వాత డబ్బింగ్‌లో సరిచేసుకుందాంలే అనుకుని అప్పటికి దర్శకుడికి కట్ చెప్పే అవకాశం ఇవ్వకుండా మరిచిపోయిన సంభాషణ స్థానంలో 'ఆమ్యామ్యా' అని ఏదో సరిపెట్టేశారు. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాల షూటింగుల్లో కూడా ఏదైనా సంభాషణ మర్చిపోయినప్పుడల్లా 'ఆమ్యామ్యా' అనే పదం ఆదుకుందాయనని. రామలింగయ్యగారి ఈ అలవాటుని గమనించిన ముళ్లపూడి వెంకటరమణ బుద్ధిమంతుడు చిత్రంలో రామలింగయ్య పాత్రకు దాన్ని ఊతపదంగా వాడారు. అది అప్పటికి సూపర్ డూపర్ హిట్ అవడమే కాకుండా 'అమ్యామ్యా' అనేది లంచానికి పర్యాయపదం అని నిఘంటువులో ఉందేమో అనేంతగా ప్రాచుర్యం పొందింది. ఒకసారి ముళ్లపూడిగారిని ఎవరో అభినందించారట, 'అమ్యామ్యా అనేది అద్భుతమైన ఊతపదం బలే కనిపెట్టారండి,' అని. దానికి రమణగారు, 'అయ్యా... అమ్యామ్యా అనేది అల్లు రామలింగయ్యగారి సృష్టి. దానిమీద పేటెంట్ హక్కులన్నీ కూడా ఆయనవే,' అన్నారట.

ఆ తరువాత ప్రస్తావించుకోవాల్సిన చిత్రం 1957లో విడుదలైన మాయాబజార్. దానిలో తాన శర్మగా కంబళి, గింబళి, తల్పం, గిల్పంలాంటి పింగళివారి విచిత్రమైన పదప్రయోగాలకు ప్రాణం పోశారు అల్లు రామలింగయ్య.

1955లో నాలుగవ సంతానం సురేఖ, 1959లో ఐదవ సంతానం రెండో అబ్బాయి వెంకటేశ్వరరావు జన్మించారు. పెరుగుతున్న సంసారంతో ఆర్థికంగా ఇంకా స్థిరపడలేదు. మాయాబజార్ అయ్యాక ర్యాలీ సైకిల్ మాత్రం కొనుక్కున్నారు.

1961-1970

ఆ పదేళ్లలో రామలింగయ్య నటించిన చిత్రాల సంఖ్య 224. అంటే సుమారుగా ఆయన నటించినవి నెలకి రెండు సినిమాలు విడుదలయ్యేవన్నమాట. 1963లో విడుదలైన కెవి రెడ్డి దర్శకత్వంలోని శ్రీకృష్ణార్జున యుద్ధం రామలింగయ్య నటజీవితంలో ఒక మలుపు అని చెప్పుకోవాలి. అంత వరకు మేనరిజమ్స్, ఊతపదాలు వీటితోనే నవ్విస్తూ వచ్చిన రామలింగయ్య శ్రీకృష్ణార్జున యుద్ధంలో ఆయన మీద ఒక పాట చిత్రీకరించే స్థాయికి ఒక మెట్టు పైకెక్కారు. అర్జునుడి శిష్యుడు చిన్న ముని పాత్రలో రామలింగయ్య, సుభద్ర చెలికత్తె వేషంలోని సురభి బాలసరస్వతితో పాడిన 'అంచెలంచెలు లేని మోక్షము చాలా కష్టమే భామి...' అనే పాట ఆరోజుల్లో పెద్ద సంచలనం. ఎన్టీఆర్, ఏఎన్నార్‌లాంటి హేమాహేమీల మధ్య ఒక హాస్యనటుడి మీద అందునా మొట్టమొదటిసారిగా ఒక డ్యూయెట్ చిత్రీకరించడం అనేది చాలా సాహసంతో కూడిన వ్యవహారం. అది విజయవంతం అయ్యింది. ఆ తర్వాత అల్లు రామలింగయ్య నట జీవితంలో సుమారుగా 40-50 పాటల్లో ఆయన నటిస్తే అందులో 15 పాటలు ఆయన మీద చిత్రీకరించిన డ్యూయెట్లు. 'ముత్యాలు... వస్తావా...' లాంటి పాటల కోసం బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా అల్లురామలింగయ్య స్వరాన్ని అనుకరించడం గమనించదగ్గ విశేషం.

1969లో విడుదలైన ఎన్టీఆర్ కథానాయకుడు అల్లు రామ



ఇచ్చేస్తారు. కానీ, 'నాకింకా ముప్పై తొమ్మిది సంవత్సరాలే నేను పరీక్ష రాసే సర్టిఫికెట్ తీసుకుంటాను,' అని అగ్ర హాస్యనటుడిగా తీరికలేనంత సినిమాల్లో నటిస్తున్నప్పటికీ, ప్రత్యేకంగా విజయవాడ వెళ్లి మరీ పరీక్ష వ్రాసి ఆర్ఎంపీ సర్టిఫికెట్ తెచ్చుకున్నారు. అది ఆయనలోని పట్టుదలకు నిబద్ధతకు ఒక ఉదాహరణ.

ఈ దశాబ్దంలోనే ఇంకొక చెప్పుకోదగ్గ విశేషం- అల్లు రామ లింగయ్య చిన్నబ్బాయి వెంకటేశ్వరరావు కూడా వెండితెరమీద కనిపించడం. అది కూడా బాపుగారి దర్శకత్వంలో వచ్చిన మొదటి చిత్రం సాక్షిలో. టైటిల్స్‌లో మాస్టర్ అల్లు వెంకటేశ్వరరావు అని ఉంటుంది. ఆ సినిమాలో మునసబుగారి మనవడు గోపి పాత్రలో కనిపిస్తాడాయన.

లింగయ్య నటజీవితంలో ఇంకొక మలుపు. దీంట్లో విలన్ల బృందం ఒకటుంటుంది, అల్లు రామలింగయ్య, నాగభూషణం, మిక్కిలినేని. వీళ్ల పెద్దపెద్ద ముఖాలతో పబ్లిసిటీ పోస్టర్ వేసేంతగా రామలింగయ్య పాత్ర ఆ సినిమాలో రూపుదిద్దుకోవడమే కాకుండా, ఆ తర్వాత నుంచి చాలా సినిమాల్లో మెయిన్ విలన్, సెకండ్ విలన్లు ఎవరైనా గానీ మూడో విలన్ అల్లు రామలింగయ్య అన్నట్లుగా దర్శకులు ఆయన కోసం ప్రత్యేకంగా పాత్రలు సృష్టించడం మొదలుపెట్టారు. ఈ దశాబ్దం చివరికొచ్చేసరికి నిర్మాతలు ప్రత్యేకంగా, "అల్లు రామలింగయ్యగారిని ఈ పాత్రకు పిలిపించండి," అనేంతగా స్థిరపడిపోయారు.

పిల్లల మీద తమిళభాష ప్రభావం ఎక్కువగా పడకూడదు అని, తెలుగుభాష మర్చిపోకూడదని కావాలని కేసరి హైస్కూల్లో చేర్పించారు వాళ్లని. తెలుగు నేర్చుకోవడానికి తమిళం నేర్చుకోవడానికి ప్రత్యేకంగా వేరే వేరే టీచర్లను నియమించి, తమిళ యాస లేని తెలుగు మాత్రమే నేర్చుకోవాలి అని నిబంధన పెట్టడమే కాకుండా తేడా వస్తే పిల్లల్ని ఒకటి రెండు దెబ్బలు కూడా వేసేవాళ్లట. మాట్లాడమే కాదు దస్తూరి కూడా బాగుండాలి అని కట్టల కట్టల కాపీ పుస్తకాలు తెప్పించి పిల్లలతో అభ్యాసం చేయించేవారట. పిల్లల్లోనే వారానికొకరిని లీడరుగా ఉండమని చెప్పేవాళ్లు. ఆ లీడర్ మిగతా పిల్లలంతా కూడా కాపీ పుస్తకాలు సరిగా రాస్తున్నారో లేదో చూడాలన్నమాట. రామలింగయ్య కూడా షూటింగ్ అయ్యి ఇంటికొచ్చాక అందరి కాపీ పుస్తకాలు, హోంవర్క్ పుస్తకాలు శ్రద్ధగా చూస్తూ ఉండేవారు.

'మా తలరాతే కాదు చేతి రాత కూడా బాగుండడానికి మేము తమిళ వాసన లేని తెలుగు మాట్లాడడానికి మా నాన్నగారే కారణం,' అంటారు అరవింద్.

1961లోనే ఆయన హోమియో డాక్టర్‌గా ఆర్ఎంపీ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులయ్యారు. అప్పటికి పదహారు సంవత్సరాలుగా ఆయన హోమియో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆ అనుభవంతో నలభై సంవత్సరాల వయసు ఉంటే పరీక్ష రాయకుండానే సర్టిఫికెట్

1971-1980

ఈ పదేళ్లలో ఆయన 388 సినిమాల్లో నటించారు. అంటే ఆయన చిత్రాల వేగం ప్రతి పదేళ్లకి మరింతగా పెరుగుతూ వచ్చిందన్నమాట. ఆ దశాబ్దంలో తమదైన ముద్ర వేసిన దర్శకులు కె విశ్వనాథ్, బాపు, దాసరి నారాయణరావు- అందరి సినిమాల్లోనూ రామలింగయ్యకి ప్రత్యేక పాత్రలు రూపొందించబడుతూ ఉండేవి. నిర్మాత, దర్శకుడు, హీరో, బ్యానర్... వీటితో సంబంధం లేకుండా ప్రతి రెండు మూడు సినిమాల్లోనూ ఒకదానిలో అల్లురామలింగయ్య పాత్ర సినిమా కథను ఒక స్థాయికి తీసుకెళుతూ ఉండేది. చెల్లెలి కాపురం, బడిపంతులు, ఇల్లు-ఇల్లాలు, శారద, రాధమ్మ పెళ్లి, బలిపీఠం, ముత్యాలముగ్గు, జమీందారు గారమ్మాయి, యమగోల, మనవూరి పాండవులు, డ్రైవర్ రాముడు, వేటగాడు, శంకరాభరణం- ఇలా ప్రతి సినిమాలోనూ అల్లు రామలింగయ్య పాత్ర ఒక మెరుపే!

ఈ దశాబ్దంలోనే అల్లు రామలింగయ్య పెద్దబ్బాయి అరవింద్ డిగ్రీ పూర్తిచేసి వ్యాపారంలోకి ప్రవేశించడం ఒక ముఖ్య సంఘటన. కొందరు మిత్రులతో కలిసి గీతా ఆర్ట్స్ ప్రొడక్షన్స్ అనే నిర్మాణసంస్థను ప్రారంభించారు. ఆ పేరు మీద అల్లు అరవింద్ నిర్మాణ భాగస్వామిగా దాసరి నారాయణరావు దర్శకత్వంలో రూపొందించిన తొలి చిత్రం బంట్రోతు భార్య. నిర్మాతలు, దర్శకుడు, ఇందులో ప్రధాన పాత్ర పోషించినటువంటి నటుడు చలం అందరూ కూడా పాలకొల్లుకు చెందినవారే కావడం ఒక విశేషం. ఆ సినిమా ఘన విజయంతో గీతా ఆర్ట్స్ విజయ పరంపర కొనసాగింది.

1974లోనే అల్లు రామలింగయ్య ఇంట్లో పిల్లల పెళ్లిళ్లు జరిగాయి. 1974 ఏప్రిల్ 6న అరవింద్‌కు నిర్మలతోనూ, ఆ మర్నాడు అంటే 1974 ఏప్రిల్ 7న అమ్మాయి వసంతలక్ష్మికి డాక్టర్

వెంకటేశ్వరావుతోనూ వివాహాలు జరిగాయి.

1975 మొదట్లో జీవితం ఓ పెద్ద దెబ్బ కొట్టింది అల్లు రామలింగయ్యగారిని, వారి కుటుంబ సభ్యుల్ని కూడా చాలా సంవత్సరాలు తేరుకోలేనంతగా.

1975 ఫిబ్రవరిలో చిన్నబ్బాయి వెంకటేశ్వరరావు కాలేజీ నుంచి లోకల్ ట్రైన్‌లో ఇంటికి వస్తున్నారు. మధ్యలో దిగి వెళ్తున్న ఫ్రెండ్స్‌కి వీడ్కోలు చెప్పడానికని రైలు గుమ్మం దగ్గరే నిల్చుని తల బయటకు పెట్టారు. ఉన్నట్టుండి రైలు కదలడం వెంటనే కరెంటు స్తంభం ఆయన తలకు తగలడం, కింద పడిపోవడం, ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది. అవుట్ డోర్ షూటింగ్‌లో ఉన్న అల్లు రామలింగయ్యకి యాక్సిడెంట్ అని మాత్రమే కబురెళ్లింది. హుటాహుటిని బయలుదేరి వచ్చిన ఆయన విగతజీవుడై ఉన్న చిన్న కొడుకును చూసి భరించలేక పోయారు. బోరున ఏడ్చారు అనడం చాలా చిన్న మాట.

జీవితంలో ఎంత పెద్ద విపత్తు ఎదురైనా ఏం జరిగినా నిర్మాతల్ని ఇబ్బంది పెట్టడం రామలింగయ్యకి ఇష్టం ఉండేది కాదు. చిన్నబ్బాయిని కోల్పోయిన నాలుగైదు రోజులకే ముత్యాలముగ్గు సినిమా కోసమని అవుట్ డోర్ షూటింగ్‌కి వెళ్లారు. పైగా ఆరోజు కోతిలాగా నటించాల్సిన దృశ్యం. రామలింగయ్యను చూస్తున్న యూనిట్ సభ్యులందరికీ ఆయన మీద సానుభూతి వెల్లువెత్తుతోంది. ఆయన మాత్రం తాను నటించాల్సిన దృశ్యం తెలుసుకుని కోతిని తెప్పించమన్నారు. ఆ కోతికి బిస్కెట్లు వేసి, దాన్ని రాళ్లేసి రెచ్చగొట్టి ఒక గంటసేపు దాని గంతులు హావభావాలు గమనించి, 'నేను రెడీ,' అన్నారు బాపుగారితో. మళ్లీ ఒకసారి ముత్యాలముగ్గులో అల్లు రామలింగయ్య నటించిన ఆ దృశ్యం చూస్తే మనసులో ఎంత విషాదాన్ని దాచుకుని ఆ పాత్రలో ఎలా లీనమయ్యారో అర్థమవుతుంది.

ఏది ఏమైనా జీవితం ముందుకే సాగాలి కదా. అల్లు రామలింగయ్య నటించే సినిమాల సంఖ్య, గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో వస్తున్న చిత్రాల సంఖ్య కూడా పెరిగింది ఆ సంవత్సరాల్లో. అదే దశాబ్దంలో తరువాతి సంవత్సరాల్లో అల్లురామలింగయ్య కుటుంబంలో మరొక శుభ సమయం, సంతోషకరమైన సందర్భం చిన్నమ్మాయి సురేఖ వివాహం.

మనవూరి పాండవులు షూటింగ్ సందర్భంలో అల్లు రామలింగయ్యకి చిరంజీవితో పరిచయం ఏర్పడింది. ఒకరోజు అల్లు రామలింగయ్య ఇంటి పై వాటాలో అద్దెకుంటున్న మిత్రుడు సత్యనారాయణను చూడడానికి చిరంజీవి వచ్చారు. ఆ కుర్రాడ్ని చూసిన కనకరత్నం భర్తతో, 'కుర్రాడు చాలా బావున్నాడు. మన అమ్మాయికి చేసుకుంటే బావుంటుందేమో?' అన్నారు. పెద్దవాళ్ల సంప్రదింపులన్నీ జరిగాక 1980 ఫిబ్రవరి 20న చిరంజీవి, సురేఖల వివాహం జరిగింది. అల్లువారి కుటుంబంలో అదొక పెద్ద శుభ కార్యం. మరొక చరిత్రకు శ్రీకారం.

1981-2004

1982 అక్టోబరు ఒకటిన మద్రాసులో అల్లు రామలింగయ్య షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. మద్రాసులోని తెలుగు చలనచిత్ర ప్రముఖులంతా హాజరయ్యారు.

అల్లు రామలింగయ్య నటించిన సినిమాల వేగం మరొక ఏడెనిమిదేళ్లపాటు అలాగే కొనసాగింది. 1995కి బలే బుల్లోడుతో ఆయన నటించిన సినిమాల సంఖ్య వెయ్యికి చేరింది. 1990లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం, 2003లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రఘుపతి వెంకయ్యనాయుడు పురస్కారం అందుకున్నారు.

1995లో అరవింద్‌తో కలిసి హైదరాబాద్‌కి తరలి వచ్చారు. దేశ విదేశాల్లో రామలింగయ్యకి జరిగిన సన్మానాలకు లెక్కేలేదు.

వ్యక్తిత్వం

అల్లు రామలింగయ్య వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే కొన్ని సంఘటనల గురించి తెలుసుకుందాం. ఆ రోజుల్లోని ప్రముఖ నటీమణి కన్నాంబ, ఆమె భర్త కడారు నాగభూషణంగార్ల సినిమా నిర్మాణ సంస్థ రాజరాజేశ్వరి ఫిలిమ్స్ అనేది చాలా సంవత్సరాల పాటు వైభవంగా నడిచి 1960 సంవత్సరం వచ్చేసరికి చాలా నష్టాల్లో కూరుకుపోయింది. ఇంకో సినిమా తీయాలంటే ఇబ్బందుల్లో ఉన్నారు. ఆ సంస్థలో అల్లు రామలింగయ్య అప్పటికే నాలుగైదు సినిమాల్లో నటించారు. ఆ కృతజ్ఞతతో ఒకరోజు అల్లు రామలింగయ్య కన్నాంబగారి ఇంటికెళ్లి తన డైరీని ఆమె చేతిలో పెట్టి, 'మీకు ఏ డేట్లు కావాలంటే ఆ డేట్లు తీసుకోండి ఇంకనుంచి మీరు నిర్మించబోయే సంస్థలో సంవత్సరానికి ఒక సినిమా రెమ్యూనరేషన్ తీసుకోకుండా ఉచితంగా చేస్తాను,' అని చెప్పారు. కన్నాంబ ముందు ఆశ్చర్యపోయారు. తరువాత అది అల్లు రామలింగయ్య





ఔదార్యం అని ఆవిడకి అర్థమైంది.

అట్లాగే ఇంకొక ఉదాహరణ. 1964లోనే ఒక కొత్త సినిమాలో నటించడానికి ఒప్పుకున్నారు అల్లు రామలింగయ్య. నిర్మాత విశాఖ పట్నానికి చెందిన పెద్దమనిషి. నిర్మాతగా ఆయనకు అది రెండవ సినిమా. ఆయన మొదటి సినిమా తీసే సందర్భంలోనే చాలా నష్ట పోయారు. ఈ రెండో సినిమాకి ఇంకా కష్టాల్లో ఉన్నారు. అడ్వాన్సులు సైతం ఇచ్చే స్తోమతు లేక అప్పు చేసి అందరికీ అడ్వాన్సులిచ్చారు. రామలింగయ్యకు కూడా వెయ్యి రూపాయలు పంపించారు. ఆ అడ్వాన్స్ తీసుకున్న కొన్ని రోజులకి రామ లింగయ్యకి తెలిసింది- నిర్మాత అప్పు చేసి తెచ్చారు అని. ఆయన చాలా బాధపడ్డారు. మర్నాడు షూటింగ్‌కు వెళ్తూ ఆ వెయ్యి రూపాయలు తీసుకెళ్లి నిర్మాతకు ఇచ్చారు. అయితే అందరూ చూస్తున్నారని అల్లురామలింగయ్య అన్నారట, 'మీ దగ్గర తీసుకున్న వెయ్యి రూపాయలు తిరిగి ఇవ్వడం కాస్త ఆలస్యమైంది ఏం అనుకోవద్దు,' అని. అట్లా ఆ నిర్మాత ఆత్మాభిమానం దెబ్బ తినకుండా ఆ డబ్బులు వెనక్కిచ్చేశారు.

ప్రముఖ నటుడు చిత్తూరు నాగయ్య చివరి రోజుల్లో ఎన్నో కష్టాలు అనుభవించారు. ఆయన పరిస్థితి తెలుసుకుని అల్లు రామలింగయ్య ఒక బస్తా బియ్యం రిక్షాలో వేసుకుని, 'పాలకొల్లు నుంచి పది బియ్యం బస్తాలు వచ్చాయి. అంత బియ్యం నేనేం చేసుకుంటానండి? అందుకనే అందరికీ పంచుతున్నాను,' అని ఇచ్చారు. ఆ తర్వాత రోజు సినిమావాళ్లందరికీ బియ్యం సరఫరా చేసే నెల్లూరు వీరాస్వామి అనే ఆయన నాగయ్యను కలిసినప్పుడు, 'అవి పాలకొల్లు బియ్యం కాదండి. నెల్లూరు బియ్యమే అల్లు రామ లింగయ్యగారు నా దగ్గర కొనుక్కుని మీకిచ్చారు,' అని చెప్పారట. ఇవి ఆయన మంచితనానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

ఇంకా అల్లు అరవింద్, తండ్రితో తనకున్న అనుబంధం గురించి చెబుతూ, 'నాన్నగారు చాలా సందడి మనిషి. నిశ్శబ్దంగా ఉండలేరు. మేమిద్దరం తండ్రి కొడుకులకంటే కూడా స్నేహితుల్లాగా ఉండేవాళ్లం. అయితే సమయం వచ్చినప్పుడు మాత్రం ఆయన తన క్రమశిక్షణ కొరడా జడిపిస్తూ ఉండేవాళ్లు,' అన్నారు.

చివరి సంవత్సరాలు

అల్లు రామలింగయ్య ఎనభై సంవత్సరాల వయసులో కూడా 2002లో ఇంద్ర సినిమాలో నటించారు. ఆ సమయంలో కూడా తెలిసిన దర్శకుడు ఎవరైనా సినిమా తీస్తుంటే, 'ఏమయ్యా సినిమాలో నాకే వేషం లేదా?' అనేవారట. అరవింద్, 'నాన్నగారు ఈ వయసులో కూడా వేషాలెందుకు, విశ్రాంతి తీసుకోవచ్చు కదా,' అంటే, 'కళామతల్లి సేవ ప్రాణమున్నంత వరకు కొనసాగుతూనే ఉండాలి. నా విషయంలో అయితే ప్రాణం పోయాక కూడా నేను నటిస్తూనే ఉంటాను,' అన్నారట రామలింగయ్య.

'అదేంటి నాన్నగారు?' అనడిగారు అరవింద్.

'నువ్వు పెద్ద నిర్మాత కదా. రేపెప్పుడో నేను చనిపోయాక నా అంతిమయాత్రను కెమెరాలో బంధిస్తావు నువ్వు. మరి చనిపోయాక కూడా నేను కెమెరా ముందున్నట్లే కదా,' అన్నారట ఆయన.

ఆయన అన్నట్లుగానే జరిగింది. ఆ తర్వాత రెండేళ్లకు రామ లింగయ్యగారు నటించగా విడుదలైనటువంటి చివరి చిత్రం

2004లో తేజగారి దర్శకత్వంలో విడుదలైన జయం. ఆ సినిమా విడుదలైన రెండు మూడు నెలలకి 2004 జులై మొదటివారంలో బాత్రూంలో కాలుజారి పడ్డారు అల్లు రామలింగయ్య. తలకి దెబ్బ తగిలింది. ఆసుపత్రిలో సీటీ స్కాన్ చేసి స్కల్‌కి దెబ్బ తగిలి లోపల బ్లీడింగ్ అవుతోంది అని చెప్పారు. ఆపరేషన్ చేశారు. కొద్దిగా కోలుకున్నట్లే ఉన్నారు కానీ మళ్లీ ఐదారు రోజులకే పరిస్థితి విషమంగా మారింది. ఆసుపత్రిలోనే ఉంచేశారు. చికిత్సలో భాగంగా శరీరానికి వివిధ ట్యూబులు, బెడ్ చుట్టూ బోలెడు వైద్య పరికరాలు. ఒకరోజు అరవింద్‌ని దగ్గరకు రమ్మని సైగ చేశారు రామలింగయ్య. ఎందుకంటే మాట్లాడే పరిస్థితుల్లో లేరు. నోటికి ఆక్సిజన్ మాస్క్ లాంటివన్నీ ఉన్నాయి. ఆ ట్యూబులన్నీ ఉన్న చేతిని కొద్దిగా పైకి లేపి, 'ఇంక నా పని అయిపోయింది వెళ్లిపోతున్నాను,' అన్నట్లుగా సంజ్ఞలు చేశారు.

ఆ తర్వాత కొద్ది రోజులకే కోమాలోకి వెళ్లిపోయారు. 2004 జూలై ముప్పై ఒకటి సాయంకాలానికి డాక్టర్లు పెదవి విరిచారు. 'మరికొద్ది గంటల్లో కీలకమైన అవయవాలన్నీ పనిచేయడం మానేస్తాయి. ఏ క్షణంలోనైనా ఆయన ఇకలేరు అన్న వార్త మీకు చెప్పాల్సి వస్తుంది,' అన్నారు.

అరవింద్ అన్నారట, 'నాన్నగారి చివరి క్షణాల్లో ఆయన నా చేతుల్లో ఉండాలి అని.'

రాత్రి పదకొండు ముప్పైకి యంత్రాలన్నీ ఆగిపోయాయి. తండ్రి దేహాన్ని చేతుల్లో ఉంచుకున్నారు అరవింద్. కొడుకు చేతిలో తృప్తిగా కన్ను మూసిన ఒక కన్న తండ్రి. ఒక ప్రయాణం ముగిసింది. చాలామంది విషయంలో ఒక అధ్యాయం ముగిసింది, ఒక శకం ముగిసింది అంటూ ఉంటాం. కానీ అల్లు రామలింగయ్య



విషయంలో మాత్రం అధ్యాయం ముగియలేదు. సుదీర్ఘంగా సాగుతున్న చరిత్రలో ఒక అధ్యాయం వ్రాసుకున్నారంతే.

ఆ చరిత్ర చిరకాలం కొనసాగే శకానికి బలీయమైన పునాది వేసి నిష్క్రమించారు.

మొదటి నుంచి అల్లు రామలింగయ్య జీవితాన్ని నిశితంగా గమనిస్తే, విశ్లేషిస్తే ఎన్నో వ్యక్తిత్వ వికాస పాఠాలు దొరుకుతాయి. చాలామంది కష్టాలు పడతారు, పడి లేస్తారు, విజయాలు సాధిస్తారు. అయితే అల్లురామలింగయ్య ప్రత్యేకతేమిటంటే ఆ కష్టాల ఫలితాలను, విజయాలను తరువాతి తరాలకు అందించడం, వాటిని అంది పుచ్చుకుని తండ్రి ఆశయాలను నిలబెట్టే దిశగా కుమారుడిని తీర్చిదిద్దడం. దానికి తగినట్లుగానే అల్లు అరవింద్ ఆ జ్యోతిని ముందుకు తీసుకెళ్లడం.

ఈ వ్యాస రచనకు ఉపయోగపడిన పుస్తకాలు, వ్యాసాలుః
అల్లు రామలింగయ్య జీవిత చిత్రం- సి. శ్రీకాంత్ కుమార్
పద్మశ్రీ అల్లు రామలింగయ్య A Life in Pictures- Collector's Edition
1955 కినిమా పత్రికలోని వ్యాసం, విజయచిత్రలోని వ్యాసాలు, అల్లు అరవింద్‌గారితో సంభాషణ



కిరణ్‌ప్రభ కవి, కథకుడు. చాలాకాలంగా కౌముది అంతర్జాల పత్రిక నిర్వహిస్తున్నారు. సాహిత్యం, సినిమాలపై వీరి టాక్ షోలు సుప్రసిద్ధం. కాలిఫోర్నియాలో నివాసం.





LUCKY CHARMS

DECOR&EVENT PLANNERS

@luckycharmsdecor

LuckyCharmsWeddingDecor

Prathyusha Mikkineni
2106676382





With the Best Compliments from:



Prof. Bellamkonda K. Kishore

M.D., Ph.D., MBA, CBiol, FASN, FRSB, FAPS, FAHA, FISN


Academician, Innovator & Entrepreneur

- **Adjunct Professor of Internal Medicine** (Nephrology), University of Utah Health, Salt Lake City, UT, USA
- **Co-Founder, President, CEO & CSO**, ePurines, Inc., University of Utah Research Park, Salt Lake City, UT, USA
- **Senior Member**, National Academy of Inventors (NAI), Washington, DC, USA
- **Honorary Distinguished Fellow**, Global Association of Physicians of Indian Origin (GAPIO), New Delhi, India
- **Founding Editor-in-Chief**, Journal of the American Association of Physicians of Indian Origin (JAAPI), Oak Brook, IL, USA
- **Former Principal Investigator** (Nephrology), US Department of Veterans Affairs, Salt Lake City Health Care System, Salt Lake City, UT, USA (2001-2020)

Dr. Kishore believes that a Passionate Purpose-oriented Life is Superior to an Ambitious Success-driven Life.

JAI SWARAAJYA TV

With Best Compliments From



ఈ సంచికలో...

వ్యాసాలు

1.	తెలుగు ప్రపంచభాష ఎప్పుడవుతుంది	- వెల్చేరు నారాయణరావు	214
2.	దక్షిణాపథ చివరి చక్రవర్తి	- నీలయపాలెం విజయ్‌కుమార్	219
3.	అందరి చూపు రామప్పవైపు	- ఈమని శివనాగిరెడ్డి - స్థపతి	225
4.	యాత్రాసాహిత్యంలో నవచైతన్యం	- దాసరి అమరేంద్ర	230
5.	తిక్కన తెనుగుదనం	- పాపినేని శివశంకర్	234
6.	ఏటికొప్పాక బొమ్మలు	- ముత్తేవి రవీంద్రనాథ్	237
7.	మనసు పైన మనసు పడ్డ ఆత్రేయ	- డా॥ ఇండ్ల రామచంద్రారెడ్డి	242
8.	కొత్త తెలంగాణ చరిత్ర బృందం	- శ్రీరామోజు హరగోపాల్	245
9.	చియాంగ్ రాయ్ - రంగుల హేళీ	- స్వర్ణ కిలారి	248
10.	చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!	- డా॥ బెల్లంకొండ కృష్ణకిషోర్	251

కథలు

1.	పనస బాసలు!	- చింతకింది శ్రీనివాసరావు	255
2.	తెగని పరిణతులతో...	- మధురాంతకం నరేంద్ర	259
3.	ప్యారడైజ్	- శివ సోమయాజుల (యాజి)	267
4.	సందెపొద్దు	- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి	273
5.	పోగొట్టుకున్న...	- చంద్ర కన్నెగంటి	280
6.	గోడ మీద వేలాడే తుపాకీ	- గోపిని కరుణాకర్	283
7.	సమావేశం	- తాడికొండ కె. శివకుమార శర్మ	289
8.	పరావర్తనం	- శ్రీఊహ	295
9.	ఆమరణ నిర్విద్యుత్ దీక్ష	- పాణిని జన్నాభట్ల	305
10.	కుడి పైట	- కె.ఎ. మునిసురేష్ పిళ్లై	311

కవితలు

1.	రేపవళ్లలా...	- కె. శివారెడ్డి	266
2.	వీడ్కోలు	- నారాయణస్వామి వెంకటయోగి	278
3.	పక్షులు	- దర్భశయనం శ్రీనివాసాచార్య	279
4.	జిజ్ఞాసపు జీవనది	- అందెశ్రీ	282
5.	యాత్ర	- బండ్ల మాధవరావు	288
6.	విప్లవం యాడుందిరా!	- ఆశారాజు	294
7.	చల్లబడని కల	- మెర్సీ మార్గరెట్	302
8.	నదిని ముద్దాడిన ఎండ	- బాలసుధాకర మౌళి	310
9.	ప్రేమ ఋతువును కలగంటూ...	- పల్లిపట్టు నాగరాజు	318
10.	నదీ - నేను	- దేవనపల్లి వీణావాణి	319
11.	మెట్లు లేని బావి	- తగుళ్ల గోపాల్	320
12.	తారల దారిలో...	- తమ్మినేని యదుకుల భూషణ్	321
13.	నమ్మకం	- దేశరాజు	322

❖ తెలుగు ప్రపంచభాష ఎప్పుడవుతుంది? ❖

వెన్నేరు నారాయణమూర్తి

తెలుగు చాలా అందమైన భాష. తెలుగు చాలా తియ్యని భాష. తెలుగు చాలా గొప్ప భాష. (అప్పుడే చప్పట్లు కొట్టకండి.) ఈమాటని ఎవ్వరూ కాదనరు. మా అమ్మాయి చాలా అందమైనది. చాలా తెలివైనది. నాతో ఆ విషయం మీద మీరు ఎప్పుడూ పోట్లాడరు. మీ అమ్మాయి అందమైనది కాదు అని నాతో వాదించరు. పోన్లే పాపం ఆ తండ్రికి కూతురంటే ప్రేమ, అని వొదిలేస్తారు. తెలుగు విషయంలో కూడా అంతే. తెలుగువాళ్ళు కానివారి సభకి వెళ్లి, అందరూ ఇంగ్లీషువాళ్లో, అందరూ ఫ్రెంచివాళ్లో, అందరూ జర్మన్లో ఉండగా, తెలుగు ప్రపంచంలోకల్లా అందమైన భాష, గొప్ప భాష అని మీరనండి, తెలుగువాళ్లు అంతేలే, తెలుగువాళ్లకి వాళ్ల భాష అంటే అభిమానమని కాసేపు ఊరుకుంటారు. వాళ్ల సభ్యత అడ్డు వస్తుంది కాబట్టి అంతకన్నా ఇంకేమీ అనరు.

మనకి తెలుగు అందమైన భాష కావడానికి కారణం మనకి తెలుగు ఒక్కటే రావడం. మనకి ఇంకొక భాష నిజంగా రాదు. ఉద్యోగరీత్యా వచ్చిన ఇంగ్లీషు భాష మనకి వొచ్చు. సాహిత్య రూపంలో వచ్చే ఇంగ్లీషు మనకి రాదు, కాకపోతే రాదని మనకి తెలియదు. తెలుగువాళ్లు ప్రపంచంలోకి వచ్చారు. అమెరికా వచ్చారు, ఇంగ్లాండు వెళ్లారు, ఆస్ట్రేలియా వెళ్లారు. దాదాపుగా ఇంగ్లీషు మాట్లాడేటటువంటి దేశాలన్నింటిలోనూ తెలుగువాళ్లు కొద్దో గొప్పో వున్నారు. కొద్దిమంది ఇంగ్లీషు మాట్లాడని ఇటలీ, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో కూడా వున్నారు. ఇంత దూరం వొచ్చినా మనం తెలుగువాళ్లమే, అంటే తెలుగు మీద ప్రేమ వున్న వాళ్లమే.

ఇంతకీ తెలుగు మీద ప్రేమ అంటే ఏవిటి? మా అమ్మాయి తెలుగు పండితురాలవుతుందంటే నేను ప్రోత్సహిస్తాననే నమ్మకం లేదు నాకు. మీరు ఇంజనీర్లవక్కర్లేదు, డాక్టర్లవక్కర్లేదు, కంప్యూటర్ సైంటిస్టులవక్కర్లేదు, తెలుగు పండితులవండి చాలు అని మీ పిల్లలతో అంటారని నాకు నమ్మకం లేదు. అయినా ఇక్కడ, మరీ ముఖ్యంగా అమెరికాలో, అప్పుడప్పుడు ఇంగ్లండ్‌లో కూడా, తెలుగు నిలబెట్టాలనే మాట వినిపిస్తోంది. అమెరికాలో ఈమధ్య ఈ మాట మరీ వినిపిస్తోంది. ముఖ్యంగా ఇలాటి సభల్లో.

మరి అమెరికాలో తెలుగు నిలబెట్టడం అంటే ఏమిటి? తెలుగువాళ్లు అమెరికా వొచ్చిన మాట నిజమే. కాని అమెరికాలోకి తెలుగు వెళ్లలేదు. తెలుగు మన ఇళ్లల్లో ఉంది. ఇంట్లో పెద్దవాళ్ల మాటల్లో వుంది. కాని అమెరికాలో తెలుగు లేదు. అమెరికా స్కూళ్లలో తెలుగు లేదు, ఒకటి రెండు జాగాలలో తప్ప, విశ్వ విద్యాలయాల్లో లేదు, గ్రంథాలయాల్లో లేదు, పుస్తకాల షాపుల్లో లేదు, రేడియోలో, టి.వి.లో లేదు. మన పిల్లలు అమెరికన్ ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. పిల్లలు మనతో తెలుగు మాట్లాట్టం లేదే అన్న బెంగ ఇప్పుడిప్పుడే కలుగుతోంది మనకి. వాళ్లు అమెరికన్లు అయిపోతున్నారు. వాళ్లు ఒకవేళ కొద్దో గొప్పో తెలుగు మాట్లాడినా, వాళ్లు తెలుగువాళ్లు కారు. ఏదో ఒక ఉగాది రోజునో, సంక్రాంతి రోజునో పరికిణీలు కట్టుకుని, జడగంటలు పెట్టుకుని నాట్యం చేసినా, వాళ్లు నిత్యజీవితంలో అమెరికన్లే.

తెలుగు, మీరు మీ యిళ్లల్లో మాట్లాడుకుంటున్నంత వరకూ బాగానే ఉంటుంది. ఇంకో యాభై యేళ్ల వరకూ నాకు హామీయే, ఇక్కడున్న పెద్దవాళ్లందరూ తెలుగులో మాట్లాడతారు, కొందరు తెలుగులో రాస్తారు, రచయితలూ, కవులూ అవుతారు. మీరు తెలుగులో పుట్టి, తెలుగులో పెరిగి ఇక్కడికి వొచ్చినవాళ్లు. అందుచేత హాయిగా ఉంటుంది మీతో తెలుగు మాట్లాడుతూంటే.

ఇప్పుడు మీ పిల్లలూ, మీ మనవలూ కుటుంబాల్లో తెలుగు మాట్లాడాలని, వాళ్లకి తెలుగు నేర్పాలనే ప్రయత్నం కొంత కొంత మనలో కనిపిస్తోంది. మన పిల్లలకి తెలుగు చెప్పాలని దీక్షగా పని చేస్తున్న వాళ్లని ఓ పదిమందిని నేను ఎరుగుదును. వాళ్ల ఆసక్తికి, శ్రద్ధకి, పిల్లలకి తెలుగు నేర్పడంలో వాళ్ల కృషికి నమస్కారాలు చెప్పాలి.

కాని, వాళ్లు పాఠాలు చెప్పడానికి పుస్తకాలు లేవు, వాళ్లు పాఠం చెప్పే పద్ధతులు లేవు.

మనం తెలుగు నేర్చుకోలేదు. మనకి తెలుగు వచ్చింది. ఏది మీరు నేర్చు కున్నారో, అది మీరు చెప్పగలరు. సంగీతం నేర్చుకుంటే, సంగీతం చెప్పగలరు. నాట్యం నేర్చుకుంటే, నాట్యం నేర్పగలరు. వంకాయ కూర చెయ్యడం మీకొస్తే వంకాయ కూర ఎలా చెయ్యాలో మీరు చెప్పగలరు. కానీ, తెలుగు మనం నేర్చు కోలేదు. ఏ రకంగా తెలుగు మన మనస్సుల్లోకి ప్రవేశించిందో, ఏ రకంగా తెలుగు మన శరీరంలో భాగమైపోయిందో మనం చెప్పలేం. అంచేత తెలుగు పుట్టుకతో రానివాళ్లకి తెలుగు ఎలా చెప్పాలో మనకి తెలియదు.

నేను మా యింటి'కి' వెళతాను. కానీ మా అమ్మ 'దగ్గరికి' వెళతాను. మా తాతయ్య 'దగ్గరికి' వెళతాను. కారు దగ్గరికి వెళతాను. ఇంటికి అన్నప్పుడు 'కి' అని ఎందుకు అంటాము? అమ్మ, తాతయ్య, ఇలాంటి మాటలు అన్నప్పుడు 'దగ్గరికి' అని ఎందుకంటాం? అమ్మకి, తాతయ్యకి, కారుకి అని ఎందుకు అనం? అక్కడ 'దగ్గర' ఎందుకు పెడతాం, ఇక్కడ ఎందుకు మానేస్తాం?

మనం పుస్తకాలు కొనుక్కోవచ్చు, చొక్కా కొనుక్కోవచ్చు. కాని అన్నం కొనుక్కోం, భోజనం కొనుక్కోం, కాఫీ కొనుక్కోం. నేను కాఫీ కొనిపెట్టను, కాఫీ ఇప్పిస్తాను. భోజనం కొనిపెట్టను, భోజనం పెట్టిస్తాను. మీకు చొక్కా కొనిపెడతాను. కొను అనే క్రియ తినే పదార్థాలకు ఎందుకు వాడం తెలుగులో?

నాకు ఆకలేస్తోంది. నాకు భయం వేస్తోంది. నాకు సంతోషంగా ఉంది. ఇంగ్లీషులో I am hungry అవుతుంది కదా, నేను ఆకలేస్తోంది అంటే ఎందుకు తప్పు?

మా యింటికి నేనొక్కణ్ణే యజమానిని. నా డబ్బుతోనే కొనుక్కున్నాను. అయినా మా యిల్లు అంటాను నేను. మీ అమ్మకి మీరు ఒక్కరే కొడుకో, కూతురో కావచ్చు. అయినప్పటికీ మీ అమ్మ అంటాను. నీ అమ్మ అంటే తిట్టు! ఏ కారణం చేత?

ఇంగ్లీషు పుట్టుకతో మాట్లాడడం వొచ్చిన వాళ్ల పలుకుబడిలో take (తీసుకొను) అనే క్రియ భోజనానికీ, స్నానానికీ, కాఫీలాంటి ద్రవ పదార్థాలకీ, సలహాకీ ఉమ్మడిగా వాడతారు. మరి తెలుగులో భోజనం తీసుకోరు, స్నానం తీసుకోరు. వీటికి చెయ్యడం క్రియగా వాడాలి. మళ్లా భోజనం చెయ్యడం, వంట చెయ్యడం అనే మాటల్లో చెయ్యడం ఒకే అర్థంలో లేదు. అంటే, తెలుగులో ప్రతి నామ వాచకానికి ఒక నిర్దిష్టమైన క్రియ వుంది, ఆ క్రియకి చిన్న చిన్న అర్థచ్ఛాయలు ఉన్నాయి. ఆ క్రియలు ఇంగ్లీషులో మల్లే వుండవు.

ఈ వివరాలు మనకి ఇప్పుడున్న తెలుగు వ్యాకరణాలేవి చెప్పవు. ఆ వ్యాకరణాలు తెలుగు వొచ్చేసిన వాళ్ల కోసం రాసినవి.

అలాంటి వ్యాకరణాలు తెలుగు నేర్పడానికి పనికిరావు. తెలుగు మొదటి భాష రాని వాళ్లకోసం వ్యాకరణాలు, భాషా బోధన విధానాలూ తయారు చెయ్య వలసిన అవసరం మనకి ఇంతవరకూ కలగలేదు. అంతేకాదు, ఆ బోధన విధానాలు ఇంగ్లీషు మాతృభాష అయినవాళ్లకీ, ఇంకొక భారతీయ భాష మాతృభాష అయిన వాళ్లకీ వేరువేరుగా తయారుచెయ్యాలి అనే దృష్టి కాని, పిల్లలకి ఒకరకంగానూ, పెద్దవాళ్లకి మరొకరకంగానూ, పుస్తకాలు తయారు చేయాలనే ఆలోచన కూడా మనకు కలగలేదు.

మన పిల్లల మాతృభాష ఇంగ్లీషు. అంటే మన పిల్లల మొదటి భాష ఇంగ్లీషు. వాళ్లు ఇంగ్లీషులో ఊహిస్తారు, ఇంగ్లీషులో మాట్లాడతారు, ఇంగ్లీషులో ప్రపంచాన్ని అర్థం చేసుకుంటారు. వాళ్లకి తెలుగు చెప్పటం ఎలా? ఫ్రెంచ్ నేర్చుకోవచ్చు, జర్మన్ నేర్చు కోవచ్చు, ఇటాలియన్ నేర్చుకోవచ్చు. మీకిష్టమొచ్చిన భాషలు నేర్చుకోవచ్చును. దానికి కావలిసిన పుస్తకాలు, వీడియోలు బోలెడు ఉన్నాయి. ఆ ఆ భాషలు ఎలా నేర్పాలో తెలుసుకొని, నేర్పే వాళ్లున్నారు. ఆయా భాషల సాహిత్యం చెప్పేవాళ్లున్నారు. అందుకు కావలసిన పరికరాలు తయారుచెయ్యడానికి కొన్ని వందలమంది పరిశోధనలు చేశారు. చాలా అమెరికన్ యూనివర్సిటీలలో ఈ.ఎస్.ఎల్ అంటే English as Second Language అని ఒక ప్రత్యేక విభాగం వుంటుంది. తెలుగు మాతృభాష కానివాళ్లకి తెలుగు నేర్పే విధానాలని గురించి ఆంధ్రదేశంలో ఎన్ని యూనివర్సిటీలలో పరిశోధన చేస్తున్న వాళ్లున్నారో చెప్పండి నాకు.

తెలుగు విషయంలో ఈ భాష రెండోభాషగా నేర్పడానికి అనుసరించవలసిన పద్ధతులూ, రాయవలసిన పుస్తకాలూ తయరు చేసే వాళ్లని మనం తయారుచేసు కోవాలి. తెలుగుదేశంలో వున్న విశ్వవిద్యాలయాలలో వున్న తెలుగుభాషా శాస్త్రవేత్తలలో ఈ రంగంలో పనిచేసేవాళ్లని ఈ పని చెయ్యమని పురమాయించాలి. వాళ్లకి అందుకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. అంటే వాళ్లకి డబ్బిచ్చి, ఈ రంగంలో పరిశోధనలు చేసి, ప్రామాణికమైన పుస్తకాలు రాయమని చెప్పాలి. మనం ఎవ్వరమూ అడగకపోయినా ఇప్పటికే ఈ పనిచేసిన ఒకరిద్దరు భాషాశాస్త్రజ్ఞుల్ని నేనెరుగుదును. ఒకరు, ప్రపంచ విఖ్యాత ద్రావిడ భాషా శాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తిగారు, రెండవ వారు, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీనించి ఈ మధ్యనే రిటైర్ అయిన పరిమి రామనరసింహంగారు. తెలుగు

రెండోభాషగా చెప్పడానికి కావలిసిన వ్యాకరణాలు రాసినవాళ్లు వీరిద్దరూ. అయితే ఆ వ్యాకరణాలు పెద్దవాళ్ల కోసం రాసినవి, అంటే కాలేజీలో చేరే వయస్సున్న వాళ్లకోసం రాసినవి.

పైకి చెప్పక పోయినా తెలుగుభాష చవక అనే అభిప్రాయం ఒకటి మనలో చాలా గట్టిగా వుంది. చవక అంటే తక్కువ డబ్బుతో దొరికేది అని అర్థం. శని ఆదివారాల్లో మనలో ఉత్సాహవంతులు పిల్లలలకి తెలుగు చెప్పడం ఆనందించదగిన విషయం. వాళ్లు ఊరికే పనిచేస్తారు. వాళ్లకి జీతాలివ్వక్కరలేదు. కాని, మన పిల్లలకి తెలుగు రావాలనుకుంటే అందుకు కావలసిన పెట్టుబడి మనం పెట్టాలి.

మన దగ్గిర డబ్బు లేక కాదు. తెలుగుభాష మీద ప్రేమ లేక కాదు. మనకు తెలుగుని ఏరకంగా పైకి తీసుకు రావాలో తెలియదు. డబ్బు ఎక్కడ పెట్టాలో తెలియదు. డబ్బు పెట్టుబడిగా పెట్టేటప్పుడు ఫలానా కంపెనీలో షేర్లు కొనండి, ఫలానా కంపెనీలో పెట్టుబడి పెట్టండి అని చెప్తారు. సరిగ్గా అదే పద్ధతిలో తెలుగు మీద పెట్టుబడి పెట్టమని అడుగుతున్నాను. తెలుగు మీద ప్రేమని చూపించమని అడగట్లేదు. ఉదారంగా విరాళాలివ్వమని అడగటం లేదు నేను. తెలుగుమీద పెట్టుబడి పెట్టమంటున్నాను. పెట్టుబడి అంటే అర్థమేమిటి? దీనివల్ల లాభా లొస్తాయి, ఆ లాభాల వల్ల మీరు బాగుపడతారు. నేను షేర్లెందుకు కొంటాను? వాటి ధర పెరుగుతుంది, నాకు లాభం వస్తుంది. నా డబ్బు ఎక్కువౌతుంది.

నేనెవ్వరినీ నిస్వార్థంగా పనిచెయ్యమని అడగను. నిస్వార్థంగా పనిచేస్తున్నా ననే వాళ్లంటే నాకు భయం. మనకి స్వార్థం లేకపోతే ఇక్కడికి వొచ్చేవాళ్లం కాదు. స్వార్థం కోసమే ఇక్కడున్నాం. స్వార్థం తప్పుకాదు. కానీ తెలివైన స్వార్థం కావాలి. అజ్ఞానంతో కూడుకున్న స్వార్థం మన స్థానాన్ని తగ్గిస్తుంది. తెలివితేటలతో ఉన్న స్వార్థం మనకు ఉపయోగపడుతుంది.

తెలుగుని మన పిల్లల మనస్సుల్లో నిలబెట్టమని అడిగేది ఎందుకూ అంటే మీ స్వార్థం కోసం అడుగుతున్నాను. ప్రజాస్వామిక దేశాలలో అధికసంఖ్యాకుల కన్నా సంస్థాగతంగా కూడి ఉన్న తక్కువమందికి ఎక్కువ బలముంటుంది. ఈ సంగతి సాధారణంగా తెలీదు మనకి. మనం organized minorityగా అవగలమా? ఆ organized minorityగా అవడానికి కావలసిన ప్రయత్నంలో తెలుగు ఒక భాగం, ముఖ్యమైన భాగం. ఈ ముఖ్యమైన భాగం నిలబెట్టుకోవడంలో మన పిల్లలందరూ తెలుగు పండితులైపోవలసిన అవసరం లేదు. మీరు కోరుకున్నా అవరు వాళ్లు, ఒకవేళ అయినా వాళ్లు బాగుపడరు. అంచేత వాళ్లు తెలుగు పండితులైపోవాలనీ, తెలుగులో రచనలు చేయాలనీ, కోరుకోకండి మీరు. వాళ్లు తెలుగు నా భాష అనుకుంటే చాలు, మాట్లాడగలిగితే చాలు. వాళ్లు ఒకరితో ఒకరు తెలుగు మాట్లాడుకుంటే అప్పుడు వాళ్లకి మనం తెలుగువాళ్లం అనే భావన ఏర్పడుతుంది.

కానీ, తెలుగులో బాగా పనిచేయగలిగిన వాళ్లు కొద్దిమంది కావాలి. వాళ్లు పండితులవాలి. ఆ కొద్దిమందీ విశ్వవిద్యాలయాల్లో పనిచేసేవాళ్లు కావాలి. వాళ్లు తెలుగువాళ్లే అవక్కరలేదు. ఫ్రెంచి వాళ్లు కావచ్చు, ఇంగ్లీషువాళ్లు కావచ్చు, జర్మన్లు కావచ్చు, అమెరికన్లు కావచ్చును. వాళ్లు తెలుగులో పనిచేయాలి. వాళ్లు తెలుగులో పెద్ద పనిచేయాలి. చాలా కొద్దిమంది పనిచేస్తే చాలు. తెలుగు సాహిత్యం మీద పీహెచ్.డీలు చేసినవాళ్లూ, గొప్ప గొప్ప పుస్తకాలు రాసినవాళ్లూ అందరూ తెలుగు వాళ్లే కానక్కర్లేదు. ఈ విషయం ఇంకొంచెం వివరంగా ఒక నిమిషంలో చెప్తాను.

ఈమధ్య తరచూ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. ఆంధ్రదేశంలో ప్రభుత్వపు ఖర్చుతోను, ఈ దేశంలో ఇదిగో ఇలా మన ఖర్చుతోనూ. నేను ప్రస్తుత సందర్భానికి అనుగుణంగా ఒక సంగతి అడుగుదాం అనుకుంటున్నాను. ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి కదా, ప్రపంచ ఇంగ్లీషు మహాసభలు జరుగుతున్నాయా? ప్రపంచ ఫ్రెంచి మహాసభలు జరుగుతున్నాయా? ప్రపంచ జర్మన్ మహాసభలు జరుగుతున్నాయా? మరి ప్రపంచ తెలుగు మహాసభలు ఎందుకు జరుగుతున్నాయి? తెలుగు ప్రపంచభాష కాదు కాబట్టి.

తెలుగుని ప్రపంచభాష చేయాలి. అంటే, దానికి కావలిసిన పరికరాలేమిటి?

మనం ఒక ఉత్సాహంలో రెండురోజులో మూడురోజులో ఒకచోట చేరి, బ్రహ్మాండమైన ఉపన్యాసాలు చెప్పి, అంతకన్న బ్రహ్మాండమైన ఉపన్యాసాలు విని, ఎన్నాళ్లుగానో కలుసుకోలేక పోయిన తెలుగు స్నేహితులని మళ్లీ పలకరించి, మంచి తెలుగు భోజనాలు చేసి, వెళ్లిపోతాం.

ఎక్కడ చూసినా సరే, చిన్న చిన్న సంస్థలు, ఎక్కువ బలమైన ఏర్పాట్లు లేని సంస్థలను నేను చూశాను. సంస్థ అంటే కొన్ని తరాల పాటు నిలిచేది. విశ్వ విద్యాలయం ఒక సంస్థ. అది ఒక ఐదేళ్లో, మూడేళ్లో, నాలుగేళ్లో ఉండి ఆగిపోదు. నడుస్తూ ఉంటుంది, కొన్ని వందల సంవత్సరాలు నడుస్తుంది.

మనం ప్రపంచం గుర్తించదగిన ప్రచురణ సంస్థలు నిర్మించాలి. విశ్వవిద్యాలయాలలోకి, లైబ్రరీలకి, పుస్తకాల షాపుల్లోకి ఆ సంస్థలు ప్రచురించిన పుస్తకాలు వెళ్లగలగాలి. హీబ్రూలోంచి వచ్చినటువంటి అనువాదం పెద్ద పుస్తకాల షాపుల్లో తేలికగా దొరుకుతుంది. గట్టిగా ఐదుకోట్ల జనాభా ఉండరు వాళ్లు. ఆ చాలా కొంచెం మంది ఈ దేశం మొత్తం మీద ఎంత ప్రభావం చూపిస్తున్నారో ఒకసారి చూడండి వెళ్లి. విశ్వవిద్యాలయంలో హీబ్రూ డిపార్ట్‌మెంట్ లేని పెద్ద విశ్వవిద్యాలయం ఎక్కడుందో వెళ్లి చూడండి.

అలా అని, యూదుల కుటుంబాలలో ఉండేవాళ్లందరూ హీబ్రూ నేర్చేసుకుంటున్నారా లేదు. వాళ్లు ఇంగ్లీషే నేర్చుకుంటు న్నారు. అయినా హీబ్రూ భాషని గౌరవిస్తారు. ఆ భాషలోంచి అనువాదమైన పుస్తకాలు వెంటనే కొంటారు. అవి లైబ్రరీలో ఉన్నాయో లేదో చూస్తారు. యూనివర్సిటీలో పాఠాలు చెప్తున్నారో లేదో అని చూస్తారు. హీబ్రూలో ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరిగేలా చూస్తారు. అమెరికాలో కూడా హీబ్రూ నేర్చుకోదలుచుకుంటే అన్ని అవకాశాలూ వున్నాయి. కొన్ని వేల లక్షల డాలర్లు అమెరికన్ యూని వర్సిటీలలో పెట్టుబడిగా పెట్టారు యూదులు.

విశ్వవిద్యాలయాలలో తెలుగు శాశ్వతంగా నిలబడడానికి కనీసం ఒకటి రెండు మిలియన్ల డాలర్లు కావాలి. మనం తల్చుకుంటే ఆ పని చెయ్యగలం. గత పాతిక ఏళ్లుగా తెలుగు సంస్థలు- ఒకప్పుడు ఒకటే వుండేది, ఇప్పుడవి నాలుగు అయ్యాయి రెండేళ్ల కొకసారి ఒకరితో ఒకరు పోటిపడి మహాసభలు నిర్వహిస్తారు. వాటి కోసం రెండురోజుల్లో కనీసం కొన్ని మిలియన్ల డాలర్లు ఖర్చు పెడతారు, రాజకీయ నాయకుల కోసం, సినిమా తారల కోసం, ఇతర ఆనందాల కోసం. అందులో ఇరవయ్యోవంతు ఒకచోట తెలుగు నిధిగా చేర్చి వుంటే ఈపాటికి నాలుగయిదు విశ్వవిద్యా లయాల్లో తెలుగు endowed professorship ఏర్పాటు చెయ్యగలిగి వుండేవాళ్లం. అయినా ఈ సంస్థల ముఖ్యులే తెలుగుదేశం వెళ్లి తాము తెలుగుపీఠాలు ఏర్పాటుచేస్తున్నామని ఉపన్యాసాలు చెప్తారు.

తెలుగు పీఠం అంటే, ఇప్పుడు అమెరికాలో రెండో మూడో యూనివర్సిటీలలో ఉన్నట్టు, తెలుగు నేర్పడానికి ఉన్న చిన్న లెక్చరరు స్థాయి ఉద్యోగం కాదు. అమెరికన్ విశ్వవిద్యాలయాలలో లెక్చరరు అంటే తాత్కాలికంగా పనిచేసే ఉద్యోగి. కొన్ని విశ్వ విద్యాలయాలలో నిరంతరం కొనసాగుతూనే వున్న, నిత్య తాత్కాలికతలో వుండే ఉద్యోగి. విశ్వవిద్యాలయాలో పీహెచ్.డీ.లని తయారుచేసే స్థాయి ఈ వ్యక్తికి ఉండదు. అంచేత, తెలుగు నిజంగా నిలబడాలంటూ ప్రొఫెసరు స్థాయిలో ఉద్యోగులు తెలుగు కోసం ఏర్పడాలి. ఇలాటి ప్రొఫెసరు స్థాయి ఉద్యోగులు సంస్కృ తానికి ఉన్నారు. తమిళానికి ఉన్నారు. హిందీకి ఉన్నారు. తెలుగుకి లేరు.

యూనివర్సిటీలలో తెలుగు ప్రొఫెసర్లు ఏర్పడడానికి అమెరికాలో తెలుగు వాళ్లు, తెలుగుదేశంలో తెలుగువాళ్లూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వమూ కలిసి ఒక ప్రణాళిక వేసుకోవాలి. విశ్వవిద్యా లయాలలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక విషయాల మీద పిహెచ్.డి.లు తయారయి, వాళ్ల పని ప్రపంచవ్యాప్తం అయితే తప్ప తెలుగు ప్రపంచ భాషగా బయటికి రాదు. ఇంగ్లీషు ద్వారా, అలాంటి ఇతర ప్రపంచ భాషల ద్వారా తెలుగు గురించిన విజ్ఞానం ఇతర ప్రపంచ భాషల్లోకి వెళ్లడానికి చాలాకాలం పడుతుంది. అంత దీర్ఘకాల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తే తప్ప, వట్టి మాటల వల్ల తెలుగు ప్రపంచ భాష అయిపోదు. కంప్యూటర్లలో వాడడానికి తెలుగు ఫాంట్లు తయారుచేసి వాటిలో విడుదల చేసినంత మాత్రాన తెలుగు ప్రపంచభాష అయిపోదు.

ఇంతకన్న ముందుగా, ఆంధ్రదేశంలో విశ్వవిద్యాలయాలలో తెలుగు శాఖల సంగతి చూడండి. అమెరికాలో తెలుగు ప్రొఫెసర్ స్థానాలు ఏర్పడ్డాయనే అనుకుందాం. ఆ స్థానాల్లో పనిచెయ్యడానికి కావలసిన అర్హతలున్న వాళ్లని తెలుగు శాఖలు తయారు చేస్తున్నాయా? అక్కడ తెలుగులో పిహెచ్.డి. పొందినవాళ్లు ఒక్కరైనా ప్రపంచంలో ఇతర దేశాల్లో తెలుగు ప్రొఫెసర్లు అవడానికి తగినవాళ్లేనా? అమెరికాతో మొదలుపెట్టి ఏ ఇతర పాశ్చాత్య దేశాల్లోను, అచ్చంగా ఆంధ్రదేశంలో లాగా, తెలుగు శాఖలు వుండవు. ఇక్కడి దేశాల్లో దక్షిణ ఆసియా దేశాలని గురించి పాఠాలు చెప్పే శాఖలు ప్రాంతీయ అధ్యయన విభాగాల ఆవరణలో వుంటాయి. ఆ దక్షిణ ఆసియా దేశాల శాఖలలో విద్యార్థులు, దక్షిణ ఆసియాలోని భాషల్లో ఏదో ఒకదానిని ప్రధానభాషగా నేర్చు కుంటారు, దానితోపాటు మరొక దక్షిణ ఆసియా భాష అప్రధాన భాషగా నేర్చుకుంటారు. ఇంతవరకూ దక్షిణ ఆసియా భాషలన్నీ అంటే, సంస్కృతం. హిందీ, తమిళం, ఈ చాలా విశ్వవిద్యా లయాలలో దక్షిణ ఆసియా శాఖల్లోనే ఉన్నాయి. ఈ శాఖలు ఎలా పనిచేస్తాయి, అందులో పనిచేసే వాళ్లకి ఎలాంటి విద్యార్హతలు కావాలి అనే విషయాలు తెలుగుదేశంలో ఏ విశ్వవిద్యా లయపు తెలుగుశాఖా తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. తెలుగు దేశపు పరిమిత అవసరాల కోసం ఏర్పడ్డ ఈ శాఖలకి తమ విద్యార్థుల్ని ఇతర దేశాలకి పంపి అక్కడి విశ్వవిద్యాలయాలలో పని చెయ్యడానికి తగినవాళ్లుగా తీర్చిదిద్దవలసిన అవసరం ఇంతవరకూ కలగలేదు. మరి ఇప్పుడు తెలుగుని ప్రపంచభాషగా చెయ్యాలన్న ఆలోచన నెరవేరాలంటే, తెలుగుదేశంలో వున్న విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలు ప్రపంచ దృష్టి అలవరుచుకోవాలి.

పుస్తకాల ప్రచురణ దగ్గరికొస్తే ఇంకా అన్యాయంగా వుంది మన పరిస్థితి. పుస్తకాలు బోలెడు అచ్చు వేస్తున్నాం. కొన్ని చాలా అందంగా కూడా అచ్చు వేస్తున్నాం. కొన్ని అందంగా అచ్చు అయినా, ఆ పుస్తకాలు అమ్ముడుపోయిన తరవాత మళ్లా ఎక్కడ దొరుకుతాయో తెలీదు నాకు. పంతొమ్మిదివందల పదిలో, ఇరవైలో, పదిహేనులో, ముప్పైలో అచ్చైన పుస్తకాల కోసం నేను వేటాడు తున్నాను, దొరకవు ఆ పుస్తకాలు. ఏ అక్కిరాజు రమాపతిరావు వంటివాళ్లో వెళ్లి ఆ లైబ్రరీల్లో, ఆర్కైవుల్లో, వాళ్ల దగ్గిర, వీళ్ల దగ్గిర ప్రాధేయపడి సంపాదించుకోవాలి. ఎందుచేత ఒక్క లైబ్రరీలో ఆ

పుస్తకాలు అన్నీ లేవు? ఎందుచేత ఆ పుస్తకాలు నాకు దొరకవు? అచ్చైన పుస్తకాలు ఈవాళ తాళపత్ర ప్రతులకన్నా కష్టం సంపాదించడం. ఎంచేత? ఎవరూ దాచిపెట్టరా పుస్తకాలు. ఏ లైబ్రరీలోనూ లేవు. అంటే మనం అలాంటి సంస్థల్ని నిర్మించలేదు.

ఎవరి పుస్తకాలని వాళ్లు వేసుకుని, అమ్ముకోవడమో, అమ్ముకోలేకపోతే ఊరికినే పంచుకోవడమో చేస్తున్నారు మన రచయితలూ, కవులూను. ఎవరి పుస్తకాలు వాళ్లమ్ముకునే దశలో ఎందుకున్నాం మనం? మనకు చెప్పుకోతగ్గ ప్రచురణ సంస్థలు ఎందుకు లేవు? ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రచురణ సంస్థ ఒక పుస్తకం వేస్తే, కొన్ని వందల సంవత్సరాల తరవాత కూడా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఉంటుందా పుస్తకం. తిరిగి తిరిగి మళ్లా అచ్చు వెయ్యకపోయినా కనీసం వాళ్ల దగ్గిర ఆ పుస్తకం దొరుకుతుంది. అల్లాంటి ప్రచురణ సంస్థలు నిర్మించలేకపోవడం తెలుగువారికి తెలుగుమీద ఆసక్తి లేదు అని చెప్పడానికి ఒక గుర్తు.

తెలుగులో వున్న విజ్ఞానంలో ఏది ప్రపంచం నేర్చుకోవాలి? ఏది నేర్చుకోకపోతే ప్రపంచ విజ్ఞానానికి నష్టం? మనం ప్రపంచానికి అందించిన విజ్ఞానం వుందా? వుంది, అని చెప్పే సామాజిక స్థైర్యం తెలుగుదేశం ఎప్పుడో కోల్పోయింది. తెలుగులో ఒకప్పుడు ఉండే సాంస్కృతిక నాయకులు, కొమర్రాజు లక్ష్మణరావులూ, గిడుగు రామ్మూర్తులూ, గురజాడ అప్పారావులూ ఇప్పుడు లేరు. ఇప్పుడు మనకున్నవాళ్లంతా రాజకీయనాయకులే. రాజకీయంగా ఉద్యోగాలు పోయినవాళ్లు సంస్కృతి గురించీ, భాష గురించీ మాట్లాడతారు. ఎందుకు? మళ్లా రాజకీయాల్లో ఉద్యోగం సంపాదించుకోడానికి. ఇంకొందరికి తెలుగు అంటే ఒక అమాయకమైన ప్రేమ. తెలుగు మీద వాళ్లకి వున్న ఆ అమాయకమైన ప్రేమ ప్రకటించుకోడానికి ఈ ఉద్యోగాలు పోయిన రాజకీయ నాయకులు అవకాశం ఇస్తారు. ఫలితం, ఖరీదయిన ప్రపంచ తెలుగు మహాసభలూ, అంతులేని ఉపన్యాసాలూ, పత్రికల్లో ఫొటోలూను. ఆశ్చర్య మేమిటంటే ఈ జట్టులో అమెరికాలో వున్న తెలుగు సంస్థలలో ప్రముఖులు కూడా చేరడం. అమెరికాలో తెలుగు మూడు పువ్వులూ ఆరు కాయలుగా అభివృద్ధి చెంది పోతోందని తెలుగుదేశంలో ఉపన్యాసాలివ్వడం.

ఈ సభలు ప్రపంచంలో తెలుగు ప్రపంచభాషగా నిలబడడానికి ఏమీ చెయ్యవు. ఈ ఉపన్యాసాల మంత్రాల వల్ల ప్రపంచ వైజ్ఞానిక లోకంలో తెలుగు చింతకాయలు రాలవు.

ఒక భాషని రెండో భాషగా నేర్పడానికి ప్రత్యేకమైన శిక్షణ కావాలి. ఆ రకమైన శిక్షణ పొందడానికి ఉత్సాహవంతులైన తెలుగువాళ్లు ప్రయత్నం చేయాలి. వాళ్లు స్కూళ్లలో, కాలేజీలలో విశ్వవిద్యాలయాల్లో తెలుగు నేర్పే రోజు వొస్తే అమెరికాలో తెలుగు నిలబడుతుంది. ఆపైన ఇంకా విశ్వవిద్యాలయాలతో మనం కలిసి పనిచేస్తే, తెలుగుకి ప్రొఫెసరు స్థాయిలో యూనివర్సిటీలలో ఉద్యోగాలు నెలకొల్పగలిగితే, అప్పుడు వాళ్ల కృషి ఫలితంగా తెలుగు ప్రపంచభాష అవుతుంది.

ప్రపంచస్థాయిలో తెలుగు గురించి తెలుసుకునే వాళ్లు, తెలుగులో వున్న సాహిత్యాన్నీ, ఇతర వైజ్ఞానిక సమాచారాన్నీ అందిపుచ్చుకునేవాళ్లు ప్రపంచవ్యాప్తంగా వుంటారు. మన పిల్లలు ఏ స్కూల్లో చేరినా, ఏ విశ్వవిద్యాలయంలో చేరినా తెలుగు చదువుకునే వసతులు ఏర్పడతాయి. మన పిల్లలే కాదు ఇతర పిల్లలు కూడ తెలుగు నేర్చుకుంటారు.

మన భాష ఏదో మన ఇళ్లల్లో పెద్దవాళ్లు మాట్లాడుకునే ఒకరకమైన పిచ్చి భాష అనే అభిప్రాయం పోయి, ఇది ప్రపంచంలో గొప్ప నాగరిక భాషల్లో ఒకటి అనే నిబ్బరం మన పిల్లల్లో ఏర్పడుతుంది.



శ్రీకాకుళంలో పుట్టి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగులో ఎం.ఎ. పట్టా పొంది, అనంతరం అమెరికా వెళ్లి చాలాకాలం మేడిసన్, విస్కాన్సన్ విశ్వవిద్యాలయంలో సౌత్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ విభాగానికి అధిపతిగా పనిచేసి, అనంతరం చికాగో విశ్వవిద్యాలయంలోను, అట్లాంటా ఎమొరీ విశ్వవిద్యాలయంలోనూ విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉండి, ప్రస్తుతం భారతదేశంలో ఏలూరులో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. 90 ఏళ్ల వయసులోనూ నిరంతర సాహిత్య శ్రామికుడు. ప్రభావతీ ప్రద్యుమ్నం, కళా పూర్ణోదయం వంటి ఇరవై క్లాసికల్ పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువాదం చేసారు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం అనే వీరి గ్రంథం తెలుగునాట ప్రాచుర్యం పొందింది. 2007 తానా సభల్లో జీవనసాఫల్య పురస్కారం పొందారు.

❖ దక్షిణాపథ చివరి చక్రవర్తి అరవీటి వెంకటపతి దేవరాయలు ❖

నీలయపాలెం విజయ్‌కుమార్

వెంకటపతి దేవరాయలు గురించి ఒక రచనా? అసలు ఇంతకూ ఎవరీ వెంకటపతి దేవరాయలు? చరిత్రలో ఎప్పుడూ పేరు విన్నట్లు గుర్తులేదే!

తెలుగువారందరూ తిరుమల వేంకటేశ్వరుని గుడిని సందర్శించే వుంటారు. వెలుపలి నుండి వెండి మహాద్వారం దాటగానే, ఎడమవైపున ఒక పెద్ద నిలువెత్తు విగ్రహం వుంటుంది. పేరు తెలుసుకోవడం కష్టం కాదు. విగ్రహం పైనే రాసి వుంటుంది కూడా. విగ్రహం ఎదురుగా తులాభారం వుంటుంది. బహుశా దేవుడిని చూడాలనే ఆత్రుతతో మనం ఆ రద్దీలో పెద్దగా గమనించమేమో! అతనే 'వెంకటపతి దేవరాయలు'.

మనం దర్శన అనంతరం తిరిగి వచ్చేటప్పుడు అదే ప్రదేశంలో కుడివైపున శ్రీకృష్ణ దేవరాయలు తన ఇద్దరు దేవేరులతో కనపడుతారు. బహుశా దేవుడి దర్శనం అయిపొయింది కాబట్టి, సావకాశంగా చూస్తాము.

ఇంత ప్రసిద్ధి పొందిన తిరుమల గుడిలో, శ్రీకృష్ణ దేవరాయ లతో పాటుగా వున్న, ఈ వెంకటపతి దేవరాయలు ఎవరు?

నిజమే, భారత చరిత్రలో, ఆమాటకొస్తే తెలుగు చరిత్రలో కూడా విన్న గుర్తు ఉండదు. ఎందుకంటే, మన తెలుగు చరిత్ర పాఠ్యపుస్తకాల్లో కనీ కనపడకుండా ఒక లైను వుంటే ఉంటుందేమో, అంతే. ఇంక భారత చరిత్రలో అసలు ఇలాంటి ఒక పాత్ర కనపడదు కూడా.

భారతదేశంలో, ప్రత్యేకించి దాదాపు దక్షిణాపథిని, 1565 నుంచి యువరాజుగా, 1585 నుంచి 1614 వరకు చక్రవర్తిగా దాదాపు ముప్పై సంవత్సరాల పాటు, ఏకచ్ఛత్రాదిపత్యంగా ఏలిన చక్రవర్తి, ఈ వెంకటపతి దేవరాయలు. దక్షిణాది రాజులందరి చేత కప్పం కట్టించుకొన్న వ్యక్తి. డచ్చి, ఇంగ్లీష్‌వారితో మొట్టమొదటగా వ్యాపారాలు నడిపిన చక్రవర్తి. పోర్చుగీసువారితో




అప్పట్లోనే యుద్ధాలు చేసిన చక్రవర్తి. నేటి ఆంధ్ర, రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక మొత్తాన్ని, కేరళలోని కొన్ని భాగాలను ఏలిన చక్రవర్తి. దక్షిణాపథచక్రవర్తి.

అతనే అరవీటి వెంకటపతి దేవరాయలు. శ్రీ కృష్ణ దేవరాయల మనవడు, రెండవ కూతురి కొడుకు.

తళ్లికోట యుద్ధంలో అయిదు ముస్లిం రాజ్యాల కలిసి విజయ నగర సామ్రాజ్యాన్ని ఓడించి, అప్పటి చక్రవర్తి, ఆళియ రామ రాయలని యుద్ధంలో చంపేసిన తర్వాత, ఆళియ రామరాయల తమ్ముడు తిరుమలరాయలు హంపీ నుంచి కొద్దిమంది సైన్యం, కుటుంభసభ్యులతో పారిపోయి, ఇప్పటి రాయలసీమలోని పెనుకొండ కోటకు చేరుకొని తన సామ్రాజ్యాన్ని అక్కడ ఏర్పాటు చేసుకొన్నాడు. యుద్ధంలో గెలిచిన సుల్తానులు, హంపీని, ఇక మనుషులు నివసించ వీలులేని రీతిలో ధ్వంసం చేసి తగలబెడుతారు.

ఇంతవరకు మనందరికీ బహుశా తెలుసు. కానీ ఆ తర్వాత ఆ సామ్రాజ్యం గురించి పెద్దగా ఎక్కడా చదివి ఉండము కూడా. హంపీ విధ్వంసంతో విజయనగరం అంతమైపోయిందనే నేనూ దాదాపు కాలేజీస్థాయి వరకు అనుకొన్నాను. ఖులీ కుతుబ్ షా ఎవరంటే, టక్కున గోల్కొండ సుల్తాన్ అని చెప్తాము. ఆదిల్ షాహా ఎవరు అని కర్ణాటకలో అడగండి, బీజాపూర్ అంటూ సమాధాన మొస్తుంది. అక్బర్ అని అనగానే భారతదేశమంతటా మొఘల్ చక్రవర్తి అని అనేస్తారు.

కానీ సరిగ్గా అవే సంవత్సరాల్లో, గోల్కొండ, బీజపూర్, మొఘల్ అక్బర్‌లకి సమకాలికుడుగా వుండి, ఒక రకంగా వారికంటే ఎక్కువ విస్తీర్ణం వున్న దక్షిణాపథాన్ని ఏలిన తెలుగు చక్రవర్తి వెంకటపతి దేవరాయలు తెలుసా అని అడగండి? తెల్ల మొహం వేయకపోతే ఒట్టు! భారతదేశంలో దేవుడెరుగు, ఆంధ్ర దేశంలో కూడా తెలీదు.



విజయనగర సామ్రాజ్యం, హంపీ విధ్వంసంతో ఆగిపోలేదని, అరవీటి వంశం అనే ఒక తెలుగు రాజవంశము ఆ సామ్రాజ్యాన్ని ముందుగా పెనుకొండ, పిమ్మట, చంద్రగిరి రాజధానులుగా, అటు పిమ్మట, రాయ వేలూరు రెండవ రాజధానిగా ఎనభై సంవత్స రాలకు పైగా దాదాపు దక్షినాపథినంతా పరిపాలించిందని, నాటి తెలుగు, తమిళ, కర్ణాటక, కొన్ని మలయాళ ప్రాంతాలను చక్రవర్తిగా వేంకట పతిరాయలు పరిపా లించాడని నాకైతే కాలేజీ విద్య పూర్తి చేే దాకా కూడా తెలీదు. దక్షినాపథిని ఒక తెలుగు చక్రవర్తి పరిపాలించాడని, ఆయా స్థానిక రాజుల చేత కప్పం కట్టించుకొని సామంతు లుగా చేసుకొని ఒక తెలుగు చక్రవర్తి రాజ్య మేలాడని నాకైతే చిన్నప్పుడు నా పాఠ్య పుస్తకాల్లో చెప్పలేదు.

1615 A.D. నాటికి భారతదేశంలో అప్పటికి ముప్పై సంవత్స రాలుగా దక్షినాథినంతటినీ ఒక తెలుగురాజు సర్వం సహా చక్రవర్తిగా పాలిస్తున్నాడని మనం మన తెలుగు పాఠ్యపుస్తకాల్లో కూడా వ్రాసు కోలేకపోవటం, ప్రభుత్వాలే కాదు మన తెలుగు చరిత్రకారులది కూడా ఘోరమైన తప్పిదం. చరిత్ర పట్ల ఇంత నిర్లక్ష్యం, అమానవీయ ధోరణి బహుశా ఇక ఏ దేశంలోనూ మనం చూడమేమో. శ్రీకృష్ణ దేవరాయల గురించి మాట్లాడే మనము ఆ వంశంలోని ఆ తర్వాత చక్రవర్తుల గురించి అసలు మాట్లాడము. నిజానికి కృష్ణదేవరాయల కాలంలో విజయనగరము మాదంటే మాదని కన్నడ, తెలుగువారి మధ్యన పేచీ వుండేది. హంపీ నుంచి పెనుకొండకు వచ్చేసినప్పుడు, తిరుమలరాయలు వెంట వచ్చినవారు దాదాపు తెలుగువారే. అటు వంటి స్థితి నుంచి 17వ శతాబ్దము ప్రారంభం నాటికి నూటికి నూరు పాళ్లు తెలుగు రాజవంశమైన అరవీటి వంశము దక్షిణాదిని అంతటినీ పరిపాలించడం అనే అత్యంత గొప్ప విషయాన్ని అతి సులువుగా చరిత్రలో నుంచి తుడిచేశారు. మా చరిత్ర ఇది, దీన్ని మేము కాపాడుకొంటాము అని స్వాతంత్ర్య అనంతరం వచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా పట్టించుకోలేదు. మన తెలుగు చరిత్ర పట్ల అత్యంత విషాదం ఇది.

మన అదృష్టంకొద్దీ స్వాతంత్ర్యానికి కొద్దిగా ముందు సమయంలో కొంతమంది చరిత్రకారులు, ఈ హంపీ అనంతర చరిత్ర పై పలు పరిశోధనలు చేసారు. అప్పటి అన్నామలై, మద్రాసు యునివర్సిటీల వారు పలు పరిశోధనాపత్రాలను ప్రచురించారు. 1928 'ఫ్రాఫెసర్ హెరాస్' అనే పోర్చుగీస్ జీసుట్, అరవీటి రాజ వంశము గురించి విపులంగా పరిశోధన చేసాడు. ఆరవీడు రాజ వంశము, దక్షినాపథాన్ని, కృష్ణానది సరిహద్దుగా అప్పటి ముస్లిం రాజ్యాలైన, గోల్కొండ, బీజాపూర్, మొఘల్ దాడుల నుంచి ఎలా కాపాడింది, ధక్షిణాపథిని ముస్లిమీకరణ చెందకుండా అరవీటి వంశము దక్షిణాపథికే ఒక కావలివారుగా ఎలా రక్షించింది విపులంగా వివరించబడి వున్నాయి.

కానీ దురదృష్టవశాత్తు, స్వాతంత్ర్యం అనంతరమే, మన చరిత్రను మనము మరచిపోవడం ప్రారంభించాము. మరీ ప్రత్యేకించి తెలుగువారు తమ చరిత్రను మరచి, వరుల చరిత్రను భుజాన వేసుకొన్నారు. దక్షిణాది మొత్తాన్ని ఏలిన ఒక తెలుగు చక్రవర్తి గురించి, ఆ ప్రాంత ప్రజానీకం మదిలో నుంచి పూర్తిగా మాసిపోవడం అనేది బహుశా తెలుగు జాతిలో తప్ప ఇంకెక్కడా జరగదేమో.

1336లో హిందూ ధర్మ పరిరక్షణ కోసం అలనాటి మాలిక్ కాఫుర్, అల్లవుద్దిన్ ఖిల్జీలకు వ్యతిరేకంగా ఉద్భవించిన విజయనగర సామ్రాజ్యం, తన మూల సిద్ధాంతాన్ని మరచిపోకుండా మూడు వందల పైచిలుకు సంవత్సరాలుపాటు, దక్షిణాదిని కావలి కాసింది. ఆ క్రమంలోనే అరవీటి వంశం, హంపీ ఓటమి అనంతరం, నేటి రాయలసీమలోని పెనుకొండ దుర్గం నుంచి మొదటగా రాజ్యం చేసింది.

మనకు చిన్నప్పటి బడి పాఠంలో చెప్పినట్టు విజయనగర సామ్రాజ్యం 1565 తళ్లికోట యుద్ధంతో అంతమైపోలేదు. కేవలం రాజధాని హంపీని, కృష్ణనది ఉత్తర భాగాన వున్న నేటి కర్ణాటక ప్రాంతాలైన గుల్బర్గా, చంద్రగుత్తి, ధార్వాడ్, తుర్కుల్, బంకాపూర్, అరేబియా సముద్ర తీరప్రాంతాలు తదితరాలు కోల్పోయారు. తళ్లికోట యుద్ధం తర్వాత, మన రాయలసీమ ప్రాంతంలోని ఆదోనీ, ఆపై ప్రాంతాలను బీజాపూర్ ఆక్రమించింది. కానీ మిగిలిన దక్షిణాది ప్రాంతం అంతా, అంటే నాటి విజయనగర సామ్రాజ్యంలోని దాదాపు 70 శాతం విస్తీర్ణం తళ్లికోట యుద్ధం తర్వాత కూడా పెనుకొండలో ఏర్పడిన విజయనగర సామ్రాజ్యం లోనే వుంది. దక్షిణాది ప్రాంతాలైన మదురై, తంజావూరు, జింజి, మధురాంతకం, వెల్లూరు. మైసూరు, చిత్రదుర్గ, ఇక్కేరి, బేలూరు, మంగళాపురం, నేటి కేరళలోని కొన్ని ప్రాంతాలతో వున్న కొన్ని ప్రాంతాలతో విజయనగర సామ్రాజ్యం దాదాపు 1640 దాకా విలసిల్లింది.

1565లో హంపీ ఓటమి తర్వాత, మిగిలిన విజయనగర సామ్రాజ్యాన్ని మూడు భాగాలు చేసాడు తిరుమలరాయలు. తాను రాజుగా పెనుకొండలో, మొదటి కొడుకు శ్రీ రంగరాయలు రాజ ప్రతినిధిగా తెలుగు ప్రాంతాలను ఏలుతూ ఉదయగిరిలో, రెండవ కొడుకు రామదేవరాయలు కన్నడ ప్రాంతాలను ఏలుతూ శ్రీరంగపట్నంలో, మూడవ కొడుకు వెంకటపతి దేవరాయలు తమిళ ప్రాంతాలను పాలిస్తూ చంద్రగిరిలో ఉండేట్టుగా ఏర్పాటుచేసారు.

1571దాకా తిరుమలరాయలు పరిపాలించగా, పెద్దకొడుకు శ్రీ రంగ రాయలు ఆ తర్వాత గద్దెనెక్కి, 1584 దాకా పాలించాడు. ఈ మధ్యలో రామదేవరాయలు అనారోగ్యంతో చనిపోవడం, అతని కొడుకులు మరీ చిన్నపిల్లలు అవడం చేత రాజ్యంలో పెద్దలు, వెంకటపతి దేవరాయలను చక్రవర్తిగా చేసారు.

ఈ క్రమాన్ని చాలా సులభంగా చెప్పేసాను కానీ, ఈ సమయంలో హంపీలో ఓడిపోయిన విజయనగరాన్ని మళ్లీ లేవనీయ కూడదని పెనుగొండకు వచ్చినప్పటి నుంచీ బీజాపూర్, గోల్కొండలు నిరంతరంగా దాడులు చేసి విజయనగర సామ్రాజ్యాన్ని అమిత బలహీనం చేసాయి. ఆదోనీ, నంద్యాల, అనంతపురము లాంటి పెనుకొండ పక్కన వున్న ప్రాంతాలనే కాకుండా, రాజమహేంద్రవరం, కొండవీడు, కొండపల్లి, వినుకొండ, అద్దంకి, తదితర కోస్తా ప్రాంతంలోని విజయనగర ఆధీనంలోని ప్రాంతాలను జయించి విజయనగరాన్ని బలహీనం చేసారు ముస్లిం సైన్యాలు. సామంతుల రాజ్యాలు కాకుండా విజయనగరం స్వంత రాజ్యం కేవలం పెనుకొండ చంద్రగిరి మధ్య ప్రాంతానికి పరిమితం అయింది. పరిస్థితి చూసిన సామంతులు కూడా కప్పం కట్టడం ఆలస్యం చేయటం, లేదా మదురై లాంటి రాజ్యాలు అసలు కట్టడమే మానేశారు. ఇలాంటి పరిస్థితిలో విజయనగరానికి చక్రవర్తిగా 1584 జనవరి మాసంలో చంద్రగిరిలో వుండే అరవీటి వెంకటపతి దేవరాయలు తిరుమల దేవాలయంలో ఒక ప్రాతఃకాలంలో చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకొన్నాడు.

ఆ పట్టాభిషేకం రోజు నుంచి ఒక పుష్కరం పాటుగా బీజాపూర్, గోల్కొండ సేనల్ని ఎదుర్కొంటూ పలు యుద్ధాలు చేసాడు. కుతుబ్ షా నందికొట్కూరు, ముసలి మడుగు దగ్గర కృష్ణానదిని దాటి విజయనగర సామ్రాజ్యం లోపలికి చొచ్చుకొచ్చేసి, ఇప్పటి రాయలసీమలో ఒకొక్క దుర్గాన్ని ఆక్రమిస్తూ చివరికి పెనుకొండకు చేరి కోటను ముట్టడిస్తాడు. వెంకటపతి దేవరాయలు తన ప్రజ్ఞను అంతా వుపయోగించి తంజావూరు యువరాజు రఘునాథ నాయకుడి సహకారంతో, కుతుబ్ షాని తరిమేస్తారు. ఆ తర్వాత, గుత్తి, కడప, గండికోటలలో జరిగిన ప్రధాన యుద్ధాల్లో కుతుబ్ షాని పూర్తిగా తరిమేస్తాడు. ఇప్పటి విశాఖపట్నం దగ్గరలో, కుతుబ్ షా ఆధీనంలో వున్న కసింకోటని జయించి వెనుకకు వచ్చే మార్గంలో కొండపల్లి, కొండవీడు, వినుకొండ, అద్దంకి నెల్లూరులను జయించి విజయనగర సామ్రాజ్యం నుంచి ముస్లిం సైన్యాలను పూర్తిగా తరిమేస్తాడు. ముస్లిం రాజులతో ఈ యుద్ధాలు జరుగు తున్నప్పుడే, మదురై, జింజీ రాజ్యాలు దక్షిణాదిన తిరుగుబాటు చేస్తాయి. వారి పై దాడిచేసి, జింజీ రాజును ఖైదుచేసి, మధురై రాజ్యం దగ్గర మూడు రెట్లు కప్పం వసూలు చేసి తన ఆధిపత్యాన్ని చూపిస్తాడు దక్షిణ నాయకరాజులకి.

ఆవిధంగా ముస్లిం రాజ్యాలను వాటి స్థానంలో ఉంచిన అనంతరం, తన సామ్రాజ్యం మొత్తం దక్షిణాదిలో వుంది, తానేమో తన రాజధానితో దక్కను పీఠభూమిలో వున్నానని గ్రహించిన వెంకటపతిరాయలు, 1594లో విజయనగర రాజ్య రాజధానిని పెనుకొండ నుంచి ఇప్పటి చిత్తూరు జిల్లా తిరుపతి పక్కన వున్న చంద్రగిరి కోటకి మార్చాడు. ఆ విధంగా విజయనగర సామ్రాజ్యానికి, హంపీ, పెనుకొండ తర్వాత, చంద్రగిరి మూడవ రాజధాని అయింది. అప్పటినుంచి దక్షిణాది మీద చూపు పెట్టి, అక్కడి మాట వినని పెద్ద సామంతులయిన మదురై, జింజీ, వేలూర్‌లను జయించి, రామనాడ్, పుదుక్కొట్టై లాంటి తమిళ రాజ్యాలను తనకు కప్పం కట్టే సామంతులుగా చేస్తాడు. తంజావూరు మొదటి నుంచి విజయనగరానికి అనుకూలంగానే వుంది.

తన రాజ్యంలోని కన్నడ, మలయాళ సరిహద్దుల్లో దాడులు చేస్తున్న బీజపూర్ రాజ్యాన్ని సరిహద్దుల్లో నుంచి పలు యుద్ధాల ద్వారా తరిమి కొడతాడు వెంకటపతిరాయలు. కన్నడ రాజ్యాలయిన చిత్రదుర్గ, కోలార్, సంతబెన్నూర్, బేలూరు, ఇక్కేరి, మైసూరు, మంగళూరు, మలయాళ రాజ్యాలు కొన్ని, హోనావార్ వంటి అరేబియా సాగర తీర రాజ్యాలతో సహా దాదాపు దక్షినాదినంతటినీ తన విజయనగర ఛత్ర ఛాయలోకి తెచ్చుకొని దక్షిణాది చక్రవర్తిగా అవతరిస్తాడు వెంకటపతిరాయలు.

ఈమధ్యలో మళ్లీ మదురై తోక ఝాడించి, వెల్లూరు రాజు తిరుగుబాటు చేయడం జరుగుతాయి. వాటిని అణిచివేసి, వెల్లూరు రాజును ఖైదుచేసి ఆ రాజ్యాన్ని విజయనగరంలోకి కలిపేస్తాడు. మదురై మీద మళ్లీ అయిదు రెట్లు కప్పం అదనంగా వేసి తానే దక్షిణాదికి చక్రవర్తి అని నిరూపిస్తాడు. ఆ క్రమంలోనే మరింత పర్యవేక్షణకు వీలుగా, విజయనగరానికి రాజధానిగా చంద్రగిరితో పాటుగా వెల్లూరును 1602వ సంవత్సరంలో రెండవ రాజధానిగా చేస్తాడు. ఆ రోజునుంచి ఇప్పటిదాకా వెల్లూరు పేరు 'రాయవెల్లూరు' అయింది.

ఈ క్రమంలోనే, ఉత్తర భారతదేశ ముస్లిం రాజు, మొఘల్ చక్రవర్తి అక్బర్ గుజరాత్‌లో యుద్ధంలో వుండి, దక్కనులోని అహ్మదునగర్, బీజాపూర్‌లను జయించ నెంచి, విజయనగరాన్ని సహాయం కోరి రాయభారం పంపిస్తాడు. ఒకప్పుడు మీ సామ్రాజ్యాన్ని ఓడించి హంపీని నాశనం చేసారు కాబట్టి ఇద్దరమూ కలిస్తే ఆ రెండు ముస్లిం రాజ్యాలను నాశనం చేద్దామని ప్రతిపాదిస్తాడు. దీనికి ప్రధాన కారణం, అక్బర్, దక్షిణాదిని చేరాలంటే, ఉత్తర భారతం నుండి దక్కను పీఠభూమిలోని ముస్లిం రాజ్యాలయిన అహమద్‌నగర్, బీజాపూర్, గోల్కొండలను దాటి రావాలి. లేదా గుజరాత్ నుండి, వెంకటపతి ఆధీనంలో వున్న దక్షిణ కర్ణాటక ద్వారా దక్షిణాదిలోకి రావచ్చు. ఈ మేరకు అక్బర్ చక్రవర్తి రెండు సార్లు, 1602, 1604 సంవత్సరాల్లో రాయభారం పంపిస్తాడు. కానీ దాని వెనుకాల వున్నా దుర్బుద్ధిని గ్రహించిన వెంకటపతిరాయలు అక్బర్‌కు సహకరించేందుకు నిర్ద్వందంగా తిరస్కరిస్తాడు. అప్పట్లో విజయనగరం మీద గుజరాత్ నుండి దండెత్తే ధైర్యం లేక అక్బర్ కూడా మిన్నకుండిపోయాడు. అలా మరొకసారి ముస్లిం సైన్యాలను దక్షిణాదిలోకి రావాడాన్ని నిరోధించాడు.

ఈ క్రమంలోనే, అప్పటికే భారత్‌లో వున్న పోర్చుగీస్‌వారు, తళ్లికోట యుద్ధంలో రామరాయల మరణాంతరం ఆగిపోయిన

విజయనగర పోర్చుగీస్ సంబంధాలను మళ్లీ పునరుద్ధరించుకొని, వెంకటపతిరాయల అనుమతితో అతని ఆధీనంలో వున్న ఇప్పటి మద్రాసు పక్కన వున్న, మైలాపూర్‌లో ఒక కోట కట్టుకొని, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకొన్నారు. అదే కోవలో డచ్చివారు కూడా వెంకటపతిని ఆశ్రయించి అతని ఆధీనంలో వున్న పులికాట్ సరస్సు తీరాన ఒక కోట కట్టుకొని వ్యాపారాన్ని ఆరంభించారు. ఇది చూసి అప్పటికే కుతుబ్ షా ఆధీనంలో వున్న మచిలీపట్నంలో వ్యాపారం చేస్తున్న ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీవారు వెంకట పతిని శరణు జొచ్చి తమకూ అవకాశం ఇమ్మన్నారు. పులికాట్ దగ్గర వారికీ అనుమతిని ఇచ్చాడు వెంకటపతి. కానీ అది అమలు లోకి వచ్చే సమయానికి వెంకటపతి చనిపోవడంతో అది మరుగున పడుతుంది. తిరిగి 15 సంవత్సరాల తర్వాత ఇప్పటి చెన్నైను, వెంకటపతి వారసుడు అదే చంద్రగిరి కోటలో అప్పటి అనుమతిని పునరుద్ధరించి అనుమతి ఇస్తాడు.

తప్పో, ఒప్పో చెప్పలేము గానీ, యూరోప్ వలసదారులకు ముందు అనుమతి ఇచ్చి వారు భారత్‌లో కాలు పెట్టడానికి సహక రించింది మాత్రము వెంకటపతి అని చెప్పచ్చు. కానీ అప్పట్లో ఈ యూరోప్ వలసదారులు వెంకటపతి కరుణాకటాక్ష వీక్షణాల కోసం చేయని ప్రయత్నం లేదు. అప్పట్లో వెంకటపతి దేవరాయలు దక్షిణాది చక్రవర్తి మరి! కుతుబ్ షా ఆధీనంలో వున్న మచిలీపట్నం రేవు తప్ప, దక్షిణాది తూర్పు తీరం మొత్తం, దక్షిణ తీరంలోని పలు తీర ప్రాంతాలు వెంకటపతి ఆధీనంలో వుండటంతో తీర ప్రాంత రేవుల్లో వ్యాపారం చేసే యూరోప్ రాజ్యాలకు వెంకటపతి ప్రీతి పాత్రుడయ్యాడు. అప్పట్లో పోర్చుగీస్ దేశాన్ని యూరప్‌లో స్పెయిన్ దేశం జయించింది, తన ఆధీనంలో వున్న పోర్చుగీస్ వ్యాపార విషయాల కోసం స్పెయిన్ రాజు అప్పట్లో వెంకటపతి రాయలుతో ఎన్నో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. పోర్చుగీస్ పరిశోధనాలయాల్లో ఇప్పటికీ వున్నాయి అవన్నీ. ఆసక్తి వుంటే, మద్రాసు కన్నెమెరా గ్రంధాలయంలో కూడా కొన్ని దొరుకుతాయి.

పదహారవ శతాబ్దపు చివరిలో, పదిహేడవ శతాబ్దపు మొదటి రెండు దశకాల్లో దక్షిణాదిలో ఒకే ఒక చక్రవర్తి అరవీటి వెంకటపతి దేవరాయలు. దక్షిణాదిలోని తొంబై శాతం మంది రాజులు అతకికే కప్పం కట్టేవారు. కానీ వెంకటపతిరాయలు గొప్పతనం కేవలం ఈ వీరత్వం వల్లనే వచ్చిందా అంటే, కానేకాదు. అతని గొప్పతనంలోని ఇంకో ప్రధానమైన కోణం ఏంటంటే. హిందుమతాన్ని కాపాడడం. విజయనగర సామ్రాజ్యం మొదటి నుంచి కళలు, సాహిత్యం, భక్తి కట్టడాలు / శిల్పకళ, యుద్ధాలు- ఈ అయిదింటితో సమాహారం అయి వుంది. కొంత వైష్ణవం వైపు మొగ్గు చూపుతూ హిందూమతం వైపు పూర్తిగా వుండిపోయి, ఆ మత ఉద్ధరణ, రక్షణ ప్రధానంగా గడిపిన సామ్రాజ్యం అది. అప్పట్లో పరిస్థితులు కూడా అలాగే వుండేవి. పర్షియా నుంచి వచ్చిన ముస్లిం రాజులు, మూడు నాలుగు సామ్రాజ్యాలు తన చుట్టూ ఉంటూ, చాలాసార్లు హిందూ గుళ్లు, మతము, మతావలంబకులు అపాయంలో పడుతున్న రోజులవి. అందుకని హిందూమతాన్ని తన సామ్రాజ్య మతంగా చూస్తూ, దానిలో వైష్ణవ సాంప్రదాయాన్ని, విష్ణు ఆరాధనను ప్రధాన మార్గంగా చూసిన రోజులవి.

హంపీ యుద్ధం తర్వాత, అటు బీజాపూర్, ఇటు కుతుబ్ షా, పైన ఉత్తరం నుంచి మోఘుల్ రాజైన అక్బర్ ముగ్గురూ వివిధ స్థాయిల్లో ముస్లిం తత్వాన్ని ప్రవచించారు. మత ఆవలంబన అనేది సార్వభౌమత్వానికి ఒక అర్హత అయింది. ఇటు విజయనగరంలో కూడా హిందూమతం, గుళ్లు గోపురాలు వేదవిద్యకే కాదు, ఆ సమయంలో రోజువారీ జీవితంలో ఒక భాగం. జీవనోపాధిలో ఒక మార్గం. అందుకని వెంకటపతిరాయలకు కూడా హిందూ మత ఉద్ధరణ, సంస్కృతి , సాహిత్యం, సాంప్రదాయాల పరిరక్షణ అనేవి అతని రాజధర్మంలో ఒక భాగం అయ్యాయి. పైగా హంపీ విధ్వంసం తర్వాత దేవాలయాల లూటీ, విధ్వంశం ఎక్కువ అయింది. దేవాలయాలు సులభంగా డబ్బులు, నగలు దొరికే ప్రదేశాలు అయ్యాయి. అందుకని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత చక్రవర్తిగా వెంకటపతిదే అయింది. దేవాలయాల సంరక్షణ అంశంలో వెంకటపతి తన రాజ్యంలోనే కాదు, సామంతుల రాజ్యాల్లో, ఒక్క మాటలో పూర్తి దక్షిణాదిలో, ఒక్క దేవాలయానికి కూడా సమస్య లేకుండా చూసాడు. కృష్ణ దేవరాయలు తిరుమల గుడికి ఇచ్చినట్టు పెద్ద ఎత్తున నగలు, వజ్రాలు ఇచ్చిన దాఖలాలు లేవుగానీ, తన సువిశాల సామ్రాజ్యంలోని ప్రతి గుడిని కాపాడాడు. తన గురువు తాతాచార్యుల వారిని కంచి ప్రాంతంలోని పెద్ద గుళ్లకు అధికారిగా నియమించి గుళ్లను సంరక్షించాడు.

ఇక సాహిత్యం విషయానికొస్తే కృష్ణదేవరాయల తర్వాత సాహిత్యానికి అంత పెద్ద ఎత్తున ప్రాముఖ్యత ఇచ్చిన వ్యక్తి వెంకటపతి దేవరాయలు. అష్టదిగ్గజాలలో అప్పటికీ బ్రతికి వున్న, తెనాలి రామకృష్ణుడు, రామరాజభూషణుడు, పింగళి సూరన, వెంకటపతి ఆస్థానంలో కూడా వుండేవారు. దర్బారులో నిత్యం మత, సాహిత్య, వేదాంత, వ్యాకరణ చర్చలు జరిగేవి. చక్రవర్తి తెలుగు, సంస్కృతాన్ని తమ భాషలుగా చేసుకొన్నా, తమిళము, కన్నడాన్ని కూడా ఆదరించారు. పోర్చుగీసు ఫాదర్లతో క్రైస్తవము గురించి దర్బారులో చర్చలు జరిపేవాడు వెంకటపతి. తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుడు తాళ్లపాక తిరుమలయ్య వెంకటపతి ఆస్థానంలోని వాడే.

సంస్కృతం, గణితము, వేదాంతము, జ్యోతిష్యాల్లో పండితు డైన వెంకటపతి తన ఆస్థానంలో పలు ప్రసిద్ధి చెందిన కవులను ఆదరించాడు. అష్టదిగ్గజాలలో ఒకరైన భట్టుమూర్తి ఇతని ఆస్థానంలో ఉండి 'నరస భూపాలియము', 'హరిశ్చంద్ర నలోపాఖ్యానము' అనే కావ్యాలను వ్రాసాడు. వివిధ తమిళ కవులు, కుంభకోణం నుంచి 'సుచీన్ద్రుడు', 'ఆనంద నమశ్శివాయ పండరం' లాంటి వారిని చిదంబరం నటరాజ గుడి పర్యవేక్షణకు వినియోగిం చాడు. వెంకటపతి గురువైన తాతాచార్యులవారు 'సాత్విక బ్రహ్మ విద్య విలాస', 'పాండురంగ మహత్యం' లాంటి కావ్యాలు రాసాడు. అష్టదిగ్గజాల్లోని తెనాలి రామలింగకవి అందరికీ తెలిసిన కవివర్యులే. ఈయన వెంకటపతి ఆస్థానంలో కూడా వున్నాడు. శైవ కవి అయిన

రామలింగకవి వైష్ణవకవిగా మారాడు. మట్లి అనంతకవి రాసిన 'కాకుస్థ విజయం', తరిగొప్పుల మల్లన వ్రాసిన 'చంద్రహాను చరిత్రం', అయ్యల భాస్కరుడు వ్రాసిన 'రెట్టమతం', ఎర్రా మాధవ రాయుని 'త్రిపద ద్యోతిని', బట్టులంక వ్రాసిన 'శాధనుశాసన', శైవ అద్వైత వేదాంతకుడు అయ్యప్ప దీక్షితులు వ్రాసిన 'కువలయా నంద', మొదలుగునవి ఇతని ఆస్థానము నుండి వచ్చిన రచనలు.

వీరే కాకుండా, వెంకటపతి సామంతుల దగ్గర కూడా పలువురు కవులు పండితులు వుండేవారు. వారిని కూడా వెంకటపతి ఆహ్వానించి ఆదరించేవాడు. మధ్వ వేదాంతాన్ని ప్రవచించిన తంజావూర్ మాధవాచార్య విజయేంద్ర తీర్థ వ్రాసిన 'చక్ర మీమాంశ', 'న్యాయ వివరణ', వెంకటపతి చేత ఆదరించబడ్డాయి. వడీరాయ తీర్థ, గోవింద దీక్షిత, తదితరులు వ్రాసిన 'హరివంశ చరిత్ర', 'సంగీత సుధానిధి', 'భావన పురుషోత్తమ' ఆనాటి రచనల్లో గొప్పవి. రాయలసీమలోని గండికోటకు చెందిన పింగళి సూరన వ్రాసిన 'కళాపూర్ణోదయం,'అతని కొడుకు వ్రాసిన 'రాఘవ పాండవీయము', 'గరుడ పురాణము', తదితర రచనలు వెంకటపతి కాలంలో ఎన్నదగినవి.

అసలు వెంకటపతి దేవరాయలు దక్షిణ భారత చివరి చక్రవర్తి అని ఎందుకు చెప్పాలి?

ఒక చక్రవర్తి గొప్పతనం గురించి మాట్లాడాలంటే, ముఖ్యంగా రెండు పరిమితులు అవసరం. ఒకటి, ఆనాటి కాలమాన పరిస్థితులు, ఆ కాలంలో అతను నెరవేర్చిన పనులు, వచ్చిన కీర్తి; రెండు అతని నిర్యాణం తర్వాత వచ్చిన వచ్చిన తదుపరి రాజులు/ చక్రవర్తుల స్థాయి, వారి సామ్రాజ్య విస్తీర్ణం తదితరాలు. ఆ చక్రవర్తి తర్వాత అతనంతటివారు లేరు అని చెప్పాలంటే, వెంకటపతి రాయలు తదనంతరం, అంతటి పెద్ద రాజ్యంగానీ, అతని కింద వున్న అన్ని సామంత రాజ్యాలుగానీ, అతని కీర్తి ప్రతిష్టలుగానీ, అతని తర్వాత రాజులకు వచ్చి ఉండకూడదు.

వెంకటపతిరాయలు యువరాజుగా 20 సంవత్సరాలు చంద్రగిరి నుంచి తమిళ రాజ్యాలను; 29 సంవత్సరాలు దక్షిణా పథము అంతటినీ విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా పరిపాలించి 1614లో చనిపోయాడు. అతను రాజ్యానికి వచ్చినప్పుడు, విజయ నగర సామ్రాజ్యము, హంపీ ఓటమి తర్వాత దాదాపు పతనావస్థలో వుంది. అలాంటి స్థితి నుంచి మళ్లీ దక్షిణాదిని అంతా తనకు సామంతులుగా వుండే స్థితికి తీసుకొచ్చాడు. మళ్లీ తిరిగి విజయ నగర సామ్రాజ్యాన్ని హంపి ముందు ఉన్నటువంటి ఉజ్వల స్థితికి తెచ్చాడా అంటే, దాదాపు డెబ్భైశాతం వరకు తెచ్చాడనే చెప్పాలి.

చరిత్రని ఎప్పుడూ ఆరోజు కళ్లతోనే చూడాలి. పదహారు, పదిహేడు శతాబ్దాలలో అప్పుడు ఉన్నటువంటి పరిస్థితులను చూస్తే వెంకటపతిరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని తిరిగి పూర్తి స్థాయిలో పునరుజ్జీవింప చేసినట్లే. 1600 సంవత్సరం తర్వాత దక్షిణ భారతానికి వెంకటపతి బ్రతికి ఉన్నంత వరకు దక్కను, ఉత్తరాది నుంచి ఏ విధమైన దాడులు లేవు. కృష్ణానదిని మూడు రాష్ట్రాల సరిహద్దుగా, బీజాపూర్, గోల్కొండ, విజయనగరము, గుర్తించాయి. ఉత్తరాది నుండి అక్బర్ గుజరాత్ మీదుగా ఇప్పటి కర్ణాటక, ఆంధ్ర మీద దాడి చెయ్యాలనే ఆలోచన చేసినా వీలుకాదని విరమించు కొన్నాడు. దక్షిణాది రాజ్యాలైన తంజావూరు. మధురై, జింజీ వెల్లూరు. రామనాద్, పుదుక్కోట్టై, మైసూర్, చిత్రదుర్గా, బేలూర్, సంత బెన్నూర్, ఇక్కేరి, కోలార్, మంగళూర్, ఇప్పటి రాయలసీమ, కోస్తాంధ్రలోని కర్నూల్, నంద్యాల, గండికోట, సిద్ధవటం, కాళహస్తి, నెల్లూరు, అద్దంకి, కొండవీడు, వినుకొండ, కొండపల్లి మొదలగు రాజ్యాలు అన్నీ వెంకటపతి అదుపాజ్ఞలలోసామంతులుగా వున్నారు. చివరన వున్న కొన్ని మలయాళ ప్రాంతాలు మినహా, దక్షిణం అంతా వెంకటపతి రాయలకు సామంతులుగా ఉండేందుకు అంగీకరించి కప్పం కడుతున్నారు. 1590ల్లో అహ్మద్‌నగర్‌ని మొఘల్ రాజు అక్బర్ జలాలుద్దీన్ ఆక్రమించడం కూడా వెంకటపతికి కలిసొ చ్చింది. ఎందుకంటే, గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలకి కింద వుండే విజయనగరాన్ని జయించడం కన్నా, ఉత్తరాన్నుంచి వస్తున్న మొఘల్ సేనల్ని కాచుకోవడమే సరిపోయింది. ఆవిధంగా దక్షిణా పథము అంతటినీ తన రాజ్యాధికారం కింద వుంచుకొని, దక్షిణానికి ఒక కావలిగా విజయనగర సామ్రాజ్యాన్ని ఏర్పరిచాడు వెంకటపతి రాయలు. ఇక యూరోప్ వలస వ్యాపారుల సంగతి చెప్పుకొన్నాము. ఇలా సర్వం సహా చక్రవర్తిగా ముప్పై ఏళ్ల పాటు వెలుగొందాడు.

ఒకవేళ వెంకటపతి చక్రవర్తిగా కాకుండా వుంటే, హంపీ ఓటమి తర్వాత కొన్నాళ్లకే దక్షిణం మొత్తం అప్పటి మూడు ముస్లిం రాజ్యాలు బీజాపూర్, గోల్కొండ, మొఘల్ రాజ్యాలకు సులభంగా లొంగిపోయుండేది. హంపీ విధ్వంసము, తర్వాత ఒక స్థాయిలో ముస్లిం రాజ్యాలు దక్షిణాదికిలోకి రావడానికి దాదాపు ఆరు శతాబ్దాలు పట్టింది. ఔరంగజేబు వచ్చేదాక ముస్లిం సేనలు దక్షిణాన అడుగుపెట్టలేకపోయాయి. కానీ అప్పటికి శివాజీ రంగంలోకి వచ్చి వుండటం వలన, ముస్లిం సేనలు, ఉత్తరాదిని ఆక్రమించినంత వేగంగా స్థాయిలోనూ, విస్తీర్ణంలోనూ దక్షిణాన అడుగుపెట్టలేక పోయాయి. దీనికి ప్రధాన కారణం వెంకటపతిరాయలు అని చెప్పక తప్పదు.

చిత్రంగా వెంకటపతి 1614లో చనిపోగానే, వారసులు రాజ్యం కోసం కొట్లాడడం, అంతఃకలహాలు, 1617 'తోప్పూర్' లో అప్పటి దాకా భారతదేశంలోనే, విజయనగర రాజ్యం అధికారం కోసం అతి పెద్ద యుద్ధం జరగడం, దక్షిణాది రాజులంతా చెరో పక్కన చేరడం, ఆ యుద్ధంలో మదురై, జింజీలు ఓడిపోవడం, తంజావూరు విజయ నగరంలోని ఒక వర్గం గెలవడం వంటి సంఘటనలు వేగంగా జరిగి పోయాయి. కానీ ఎక్కువ రోజులపాటు వెంకటపతి వారసులు విజయనగరాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఓడిపోయిన మధురై, జింజీ, వెల్లూరు తదితర, రాజ్యాలు గోల్కొండ, కుతుబ్ షాను, బీజాపూర్ ఆదిల్ షాను ఆహ్వానించారు, మనం అందరం కలిసి విజయనగరాన్ని నాశనం చేసేద్దామని. వాళ్లందరూ అనుకొన్నది సాధించారు కూడా. 1640కి విజయనగరం నామమాత్రం అయిపో యింది, అప్పటి చివరి రాజు, మైసూర్ అడవుల్లోకి పారిపోయాడు. కానీ ఖర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు కదా. విజయనగర సామ్రాజ్యాన్ని

నాశనం చేసిన వెంటనే, గోల్కొండ, బీజాపూర్‌లు తమ సేనల్ని అప్పటిదాక తమకు సహాయం చేసిన మదురై, జింజీ మీదకి మళ్లించారు. జింజీని ఓడించి కలిపేసుకొన్నారు. మధురైని సామంతులుగా చేసుకొన్నారు. ఆ క్రమంలోనే తంజావూర్‌ను కూడా ముస్లిం సేనలు పూర్తిగా ఆక్రమించేసుకొన్నాయి.

కానీ ఖర్మ ఎవ్వరినీ వదిలి పెట్టదు అన్నట్టుగానే బీజాపూర్, గోల్కొండలను ఔరంగజేబు మొఘల్ సేనలు వరుస సంవత్సరాల్లో అంటే, 1686, 1687లలో ఆక్రమించుకొన్నాయి. దాంతో కొద్ది కాలం పాటు దక్షిణాది ముస్లిం సేనల చేతికి వచ్చింది. కానీ అప్పటికే శివాజీ దక్కనులో పెడుతున్న చికాకులతో ఔరంగజేబు దక్షిణాదిలో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేదు. మరాఠీ సేనలు తంజావూర్‌ను గెలుచుకోన్నాయి. కానీ ఒక రెండు దశాబ్దాల్లోనే ఔరంగజేబు మరణం, తర్వాత యూరోప్ వ్యాపారులు తమ నిజ స్వరూపం చూపించి భారతదేశంలోని స్థానిక రాజులపై యుద్ధాలతో ఆక్రమణలు ప్రారంభించారు. ఆ క్రమంలో వచ్చినవాడే టిప్పు సుల్తాన్. కొంతవరకు దక్షినాది మొత్తాన్నీ తన అధీనంలోకి తెచ్చుకొన్నా కూడా, మధ్యలో చాలా రాజ్యాలు అతని ఆధీనంలో లేవు.

విజయనగర సామ్రాజ్యం పతనమైన తర్వాత వచ్చిన అయిదు పెద్ద రాజ్యాలు తంజావూరు రఘునాధ నాయక, మదురై, ముత్తు వీరప్పనాయక, జింజి వరదప్పనాయక, ఇక్కేరీ బసప్ప నాయక, మైసూరు శ్రీరంగదేవ, కూడా ఒకప్పటి వెంకటపతి రాయ చక్రవర్తి విజయనగర సామ్రాజ్య సామంతులే, ఆ తానులోని ముక్కలే. వీరందరూ అప్పటి విజయనగర సామ్రాజ్యపు గొప్ప దనానికి నిదర్శనం.

'దక్షిణాది చివరి చక్రవర్తి' అనే బిరుదు అరవీటి వెంకటపతి రాయలకు సరిగ్గా సరిపోయే ప్రశంస. మధ్య యుగాలలో ఒక రాజ్యం అంటే వివిధ సామంత రాజ్యాల సమాహారం. వీరందరినీ ఒక రాజ్యం అదుపుచేస్తూ కప్పం కట్టించుకొంటూ ఆధిపత్యం చెలా యిస్తూ, బయటవారి నుండి తన సామంతులను కాపాడుకొంటూ వుండే ఒక వ్యవస్థ. ఈ మొత్తం వ్యవస్థకి అధిపతిగా ఉండేవాడే ఆ సామ్రాజ్య చక్రవర్తి. ఇది విజయనగర సామ్రాజ్యం వెలసినప్పటి నుంచి దాని నమూనా. శ్రీకృష్ణదేవరాయలు నుంచీ మనమడు వెంకటపతిరాయలు దాకా పాటించిన నమూనా.

దక్షినాది మొత్తాన్ని, అన్నీ రాజ్యాలు తన ఆధీనంలో, తన ఛత్రచాయలో, తన అదుపాజ్ఞలలో ఉంచుకొన్న చక్రవర్తి 1614లో చనిపోయిన వెంకటపతి దేవరాయలు తర్వాత వేరొకరు లేరు. ఆ తరువాత వచ్చిన విజయనగర రాజులుగానీ, లేక పిమ్మట వచ్చిన ఇతర రాజులుగానీ, విస్తీర్ణంలో, శక్తి, పలుకుబడి, ప్రభావం దేంట్లో కూడా వెంకటపతికి సాటి రాలేదు సరికదా, దరిదాపుల్లోకి కూడా రాలేదు.

1614లో వెంకటపతి దేవరాయ మరణం తర్వాత దక్షిణాది రాజ్యాలు, ఉత్తర భారతదేశ ముస్లిం సైన్యాలకు ఒక భోజనశాలగా మారాయి. వెంకటపతిరాయలులాగా దక్షిణాదినంతటినీ ఒక్కటి చేసి, పరిపాలిస్తూ ఎదుర్కొన్న నాయకుడు, రాజు, చక్రవర్తి ఆ తరువాత లేరు. వెంకటపతి లేని లోటు ప్రస్ఫుటంగా కనపడింది. ఒకటి వెంట ఒకటి రాజ్యాలన్నీ ముస్లిం సేనలకి లొంగిపోయాయి. శివాజీ కొంతవరకు ఎదుర్కొని సరిదిద్దినా 17వ శతాబ్దం రెండో సగం నుంచీ దాదాపు 18 శతాబ్దం రెండవ సగం వరకు దక్షిణాదిలో అరాచకమే రాజ్యమేలింది. ఎందుకంటే, దాన్ని ఆపగలిగిన చక్రవర్తి వెంకటపతిరాయలు మరణించి చాలాకాలమే అయింది మరి.

ఇదీ మన చరిత్ర. మన తెలుగు చరిత్ర. మన తెలుగు చక్రవర్తి చరిత్ర. మనము మరచిపోయిన, నిర్లక్ష్యం చేసిన మన తెలుగు చరిత్ర.

ఈ రోజు, చరిత్రను మొత్తం చాప చుట్టేసి పారేసిన మనకు ఈ గొప్ప చక్రవర్తి గురించిన ఒకే ఒక చరిత్ర పారల జ్ఞాపకం, తిరుమల శ్రీ వేంకటేశ్వరుని గుడిలో వుండే అతని కంచు విగ్రహం. దక్షిణాదిని రక్షించడంలో, బలంగా రూపొందించడంలో శ్లాఘనీయ పాత్ర వహించిన అరవీటి వెంకటపతి దేవరాయలని గుర్తు చేసుకోవడం తెలుగువారిగా మన కనీస కర్తవ్యం. దేశరక్షణ, సంస్కృతి, సాహిత్యం, కట్టడాలు, శిల్పకళ, మొదలగు విషయాల్లో శ్రీకృష్ణ దేవరాయల తర్వాత ఆంతటి ఘనత వహించిన ఒకే ఒక చక్రవర్తి వెంకటపతి దేవరాయులు మాత్రమే.

అవును, అతనే చివరి దక్షిణ భారత చక్రవర్తి.



నీలయపాలెం విజయ్‌కుమార్ టెక్నోక్రాట్‌గా జీవితం ప్రారంభించి కొంతకాలం జర్నలిస్టుగాను, కొంతకాలం బిజినెస్ అడ్మినిస్ట్రేటర్‌గాను వివిధ ప్రాంతాల్లో పనిచేసి, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు.

❖ అందరి చూపు రామప్ప వైపు ❖

ఈమని శివనాగిరెడ్డి - స్థపతి

దాదాపు 200 సంవత్సరాల పాటు సుస్థిర పాలనను అందించి, వర్తక, వాణిజ్య, వ్యవసాయాభివృద్ధితో పాటు, సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనాలను పోషించిన కాకతీయులు తెలుగునాట, ప్రత్యేకించి తెలంగాణలో వేయికి పైగా దేవాలయాలను నిర్మించారు. హన్మకొండలోని వేయి స్తంభాలగుడి, వరంగల్ కోటలోని శంభుని గుడి, ఘనపూర్‌లోని కోటగుళ్లు, పాలంపేటలోని రామప్ప దేవాలయం కాకతీయ శిల్పకళా కౌశలానికి అద్దం పడుతున్నాయి. కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని సైనాధ్యక్షుడైన రేచర్ల రుద్రారెడ్డి పాలంపేటలో తన పేరిట రుద్రేశ్వర ఆలయాన్ని, సముద్రాన్ని తలపించే చెరువును క్రీ.శ. 1213లో నిర్మించాడు.

పరుచుకొన్న పచ్చటి తివాచీలాంటి ప్రకృతి ఒడిలో, అందాన్ని మరింత ఇనుమడింపజేసే కొండపానుపుల దిగువనున్న పాలంపేటలో తాను కూడా తన ప్రభువుమాదిరే శివునికి ఒక వినూత్నమైన ఆలయాన్ని నిర్మించాలనుకొని, అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకొన్నాడు. తానొక అద్భుత ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నానని, కాకతీయ సామ్రాజ్యానికే మణిమకుటంగా ఆ ఆలయం భాసిల్లాలనీ తన తలంపును ప్రకటించాడు. ఇక అంతే! అద్భుత ఆలయాల నిర్మాణంలో సిద్ధహస్తులైన కాకతీయ శిల్పులు, అప్పటి వరకూ అందుబాటులో ఉన్న ఆలయాలకు భిన్నంగా, ఒక అపురూప దేవాలయాన్ని బట్టపై చిత్రించి, కొయ్యలో నమూనా దేవాలయాన్ని చెక్కి చూపించారు.

మునుపటి కళ్యాణీ చాళుక్య దేవాలయాల వాస్తునే ఎంచుకొన్నా, నిర్మాణం వరకే ఆ శైలికి పరిమితమై, ఎత్తైన ఉప పీఠంలో మరిన్ని వరుసలు చేర్చి, తమ ప్రయోగ పరంపరలో సాటిలేని మేటి భూమిజ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏమంత లోతు లేని పునాదుల్ని రచించి, ఆధారశిలతో ప్రారం భించి, నక్షత్రాకారపు ఉపపీఠాన్ని ప్రదక్షిణాపథంగా తీర్చిదిద్దారు. కట్టడభాగాలకు పాలంపేట, రామానుజపురం మధ్యలో గల ఎర్ర ఇసుకరాతిని, ద్వారాలు, రంగమంటప స్తంభాలు, దూలాలు, మధ్య కప్పులు, రుద్రేశ్వర శివలింగ పానపట్టాలు, నంది వాహనం, రంగ మండపం ముందుభాగంలో చుట్టూ మదనికలు, అలసకన్యలు, నాగినులు, సురసుందరీమణులను బోలిన అందాలొలికే అప్సరస లాంటి యువతుల శిల్పాలను నల్లశానపు రాతితోనూ, కప్పుపైన శిఖరాన్ని (విమానాన్ని) నీళ్లపై తేలియాడే ఇటుకలతో నిర్మించ బోతున్నామని వివరించగా, రుద్రుడు, చిరునవ్వుతో ఆమోదాన్ని తెలిపాడు. అపురూప ఆలయ రూపురేఖల గురించి విన్న దేవ చక్రవర్తి, మహారాణి సోమలదేవి, ప్రధానులు, మహా ప్రధానులు ఎప్పుడు పూర్తవుతుందా అని ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. ఎర్ర ఇసుకరాయి స్థానికంగానే దొరికినా, ద్వారాలకు స్తంభాలకు కావలసిన నల్లశానపు రాతిని ఖమ్మం చుట్టుపక్కల నుంచి తరలించాల్సి రావటంతో మండప నిర్మాణం కొంత ఆలస్యమైంది. విమానానికి కావలసిన సున్నాన్ని ఏటూరు నాగారం నుంచి, తేలిక పాటి ఇటుకల కోసం చెరువు అడుగుభాగం మట్టిని తెచ్చి, రంపపు పొట్టు, ఊక, తుమ్మచెక్క, కరక్కాయలు, బెల్లం కలిపి, బాగా కలియదొక్కి, ఇటుక పెళ్లలను పోతపోసి, ఆవంలలో కాల్చి సిద్ధం చేసుకొన్నారు. చిన్నదైనా మన్నికగల అధిస్థానాన్ని రచించి, ఎత్తైన గోడలు, వాటిపై పాలాల్లో రైతులు వేసుకునే మంచె లాంటి కోష్టా లను, వాటిపైన శిఖరం, కలశాలతో అలంకరించారు. గోడలపైన కప్పు భాగంలో బాగా విస్తరించిన ప్రస్తరకపోతాన్ని తీర్చిదిద్ది, వర్షపు నీరు ఆలయ గోడలపై పడకుండా జాగ్రత్తలు తీసుకొని, నిర్మాణ పరంగా ఆధునిక ఇంజనీర్లకు ఏమాత్రం తీసిపోమని కాకతీయ శిల్పులు ఆనాడే నిరూపించారు.

తెలంగాణ దేవాలయాల్లో మేటి, కాకతీయ కళా కౌశలానికి మచ్చుతునక రామప్ప దేవాలయం. సార్వత్రిక కళా నైపుణ్యంతో, అబ్బురపరిచే సాంకేతిక పరిజ్ఞానానికి, మేధో మథనమందించిన సృజనాత్మకతకు నిదర్శనంగా ప్రపంచ దృష్టినాకర్షించి, తెలంగాణ


తల్లి కీర్తి కిరీటంలో మణిమకుటంగా వెలుగొందుతూ ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటును దక్కించుకొంది. ప్రతి తెలుగువాడికీ గర్వ కారణమైంది.

రామప్ప ఎవరో తెలియదుగానీ, అన్నీ తానై అపురూప ఆలయాన్ని సృష్టించిన రేచర్ల రుద్రసేనాని, 31-3-1213న ఆలయంలో తన పేరిట రుద్రేశ్వరుని ప్రతిష్టించి, చరిత్రలో మిగిలి పోయాడు. విశ్వకర్మ దిగొచ్చి రామప్ప అవతారమెత్తి, రేచర్ల రుద్రునితో భూలోక పుష్పకాన్ని మనకందించి, తరతరాల తెలుగువారి కీర్తికి స్ఫూర్తిగా నిలిచాడు.

రామప్ప దేవాలయంగా పేరు గాంచిన ఈ దేవాలయానికి నిర్మాణసహకారం అందించింది రేచర్ల రుద్రుడు. అతడు శివలింగాన్ని ప్రతిష్టించి ఆలయాన్ని తనపేర రుద్రేశ్వరుడని పిలుచుకొన్నాడు. ఇప్పుడు రామలింగేశ్వరుడని పిలుస్తున్నారు.

అయితే ఇంతకీ ఈ దేవాలయానికి రామప్ప దేవాలయమని పేరెలా వచ్చిందో ఖచ్చితమైన ఆధారాలు లేవు. కొందరు గుడి కట్టిన శిల్పి పేరు రామప్ప అనీ, అందుకే ఆ దేవాలయానికి అతని పేరు మీద రామప్ప దేవాలయమని పిలుస్తున్నారని గ్రామస్తులంటారు. మరో చిత్రమేమిటంటే రామప్ప శిల్పిని గణపతిదేవుని కూతురు రాణి రుద్రమ ప్రేమించిదనే కట్టు(వట్టి) కథ ఒకటి ప్రచారంలో వుంది. దీంట్లో ఏమాత్రం నిజం లేదు. ఎందుకంటే క్రీ.శ. 1261లో సింహాసనమెక్కి 1289లో మరణించిన రుద్రమదేవికి ఆలయ నిర్మాణం పూర్తైన 31-3-1213 నాటికి 77 ఏళ్ల వ్యత్యాసముంది. బహుశ అమె అప్పటికింకా పుట్టిందో లేదో కూడా చారిత్రక ఆధారాలు లేవు.

కట్టుకథలను పక్కన పెడితే, గణపతిదేవుని సైన్యాధ్యక్షుడిపైన రేచర్ల రుద్రిరెడ్డి (రుద్రుడు) పాలంపేటలో క్రీ.శ. 1213లో నిర్మించిన రామప్పదేవాలయం, కాకతీయ దేవాలయాల్లో మణిపూస.



దేవాలయ అదురిక

రామప్ప దేవాలయం గర్భాలయం, అర్ధమండపం, రంగ మండపం, నంది మండపంతో కుడివైపున కామేశ్వరాలయం, కళ్యాణమండపం, ఎడమవైపున కాటేశ్వరాలయాలతో చుట్టూ ప్రాకారం నిర్మించబడింది.

ఉపపీఠం

పీఠం అంటే అధిష్టానం. దేవాలయం మొత్తం దేనిమీద నిలబడి వుంటుందో దాన్ని అధిష్టానం 'ప్రాసాదాదీని వస్తూ నిచాధితిష్ఠంతి యుద్ధితత్,' అంటారు. అంటే దేవాలయానికి పాదం లాంటిది. ఈ అధిష్టానం కింద ఉండే వరుసల్ని ఉపపీఠం అంటారు. రామప్ప దేవాలయ ఉపపీఠం చూడటానికి ఎత్తుగా, చుట్టూ ప్రదక్షిణ చేయటానికి విశాలంగా ఉంది. ఆధారశిల ఉపానం, పద్మం, పట్టిక, కుముదం, పట్టిక, ఆధోచర్మం అనే ఉప పీఠం వరుసలపై ఎలాంటి అలంకార శిల్పమూ లేక సాదాగా వున్నాయి.

అధిష్టానం

అధిష్టానానికి ఉపానం, కుముదము, కపోతము దానిపైన ఏనుగుల వరుస (గజధార) లున్నాయి. కపోతం వరుసపై మట్టానికి సమంగా గర్భాలయ, అర్ధమండప, రంగమండపాల నేల రాళ్లు పరచబడినాయి. ఏనుగుల వరున గల రాయిపై ఏనుగులు మనిషిపై దాడి చేస్తున్నట్లు, గణపతి, భైరద, గజలక్ష్మి, మల్లయుద్ధం, సూర్యుడు, మకరం (మొసలి), వ్యాళాలున్నాయి..

కక్షాసనాలు - ఆనుకొని కూర్చోటానికి వీలుగా పటవాలు పిట్టగోడలు

దేవాలయ రంగమండప అధిష్టానంపై గల ఏనుగుల వరుస లున్న రాయిపైన నిలువుగా ఒక పిట్టగోడలాంటి రాయి వుంది. దీనిని కక్షాసనం (ఆనుకుని కూర్చోటానికి) అంటారు. మండపం లోపల ఒక మూడు వరుసల వేదిక, దానిపై భక్తులు కూర్చుండ టానికి అరుగుగా ఉపయోగపడుతుంది. తూర్పువైపు ప్రవేశద్వారం నుంచి రంగమండపం అరుగుపైన 20 కక్షాసన ఫలకాలున్నాయి. వాటిపై జైనతీర్థంకరులు, డాలు కత్తి పట్టిన యోధులు, నాట్య గణపతి, చామరధారి, విల్లు, బాణం పట్టుకొన్న వేటగత్తె, భటులు, భైరవుడు, గణిక, వేణుగోపాల, మల్లయుద్ధ దృశ్యాలు, సాలభంజిక (కొమ్మను పట్టుకొని వయ్యారంగా నిలబడిన స్త్రీ) నాట్యగత్తెలు, అటూ ఇటూ మద్దెలను వాయిస్తున్న వాద్యగాండ్లు, నాగిని, సూర్య శృంగార మైథున శిల్పాలు, నగ్నంగా వున్న ఋషిపుంగవులు, శివభక్తులు, భటుల బొమ్మలున్నాయి. మధ్యమధ్యలో నాలుగు దళాల పద్మాలు, పట్టీలు వున్నాయి. ఈ కక్షాసనాలను వెనకగోడగా చేసుకొని రంగమండపం లోపలి వైపున చుట్టూ ఏడు చిన్న దేవాలయాలున్నాయి. రెండింటిలో మాత్రం దేవి, గణపతి విగ్రహా లున్నాయి. కేవలం కాకతీయుల దేవాలయ రంగమంటపాల్లోనే ఇలాంటి చిన్న దేవాలయాలు పరివారాలయాలుగా వుండటం గమనించాల్సిన విషయం.

పాదవర్గం (గోడ భాగం)

అధిష్టానం పైన ఉండే దేవాలయ గోడభాగాన్ని పాదవర్గం అంటారు. రామప్ప దేవాలయ గర్భాలయ, అర్ధమండపాల వరకూ వున్న గోడభాగం, కింద వేదిక, పొడవాటి స్తంభభాగం, దానిపైన కలశం, ఫలిక, పద్మం, పోదిక (బోదె) వున్నాయి. అడ్డంగా చూస్తే ఒకవైపు నుంచి మరోవైపుకు కర్ణకూటం, అహార, పంజర, ముఖశాల మళ్లీ పంజర, అహార, కర్ణకూటాల అమరిక వుంది. ముఖశాల మధ్య భాగంలో మూడంచెలున్న కోష్టము, దానిపై శిఖరం, కోష్టం పక్క గోడలకు స్వస్తిభద్ర కిటికీలు, ఒక్కో అంచెకు కపోతం, వ్యాళ వర్గాలున్నాయి. కోష్టం కింద గజధార, దానికింద యథావిధిగా అధిష్ఠానం ముందుకు పొడుచుకొచ్చాయి. కుముద భాగం మధ్యలో చక్కటి నంది విగ్రహం వుంది. నంది కేవలం శివుని వాహనమే కాదు. వ్యవసాయానికి తోడ్పడి తిండి గింజలందించేది గాబట్టి దానిపట్ల కాకతీయులు మక్కువ పెంచుకొన్నారు. గర్భాలయ గోడల ముఖశాల మధ్యలో మూడువైపులా మూడు కోష్టాలున్నాయి. కర్ణకూట, అహార భాగాల్లో రెండు స్తంభాల కోష్టాలపై మూడంతస్తుల విమాన ముంది.



ప్రస్తరం

చూరుగల కప్పు గర్భాలయం. అర్థమండపం, రంగమండపం పైన గోడలపై వర్షం నీరు పడకుండా బాగా వెడల్పైన ప్రస్తర కపోత (చూరు)ముంది. కింద నుంచి చూచేవారికి కొయ్యతో బాడిసె ఉలిపెట్టి పట్టీలు, బద్దెలు, చివర చూరు నుంచే వర్షపు బిందువుల మాదిరి బొంగరం లాంటి రాతి బుడిపెలను చెక్కారు. ఈ బుడిపెలనే సమరాంగణ సూత్రధారమనే శిల్పశాస్త్రాన్ని రచించిన భోజమహారాజు (క్రీ.శ. 11వ శతాబ్ది) ఝరావళి అని పిలిచారు. అంటే చూరు నుంచి రాలే చిటుక్కు చిటుక్కు వానచుక్కలని అర్థం. కపోతం కింద ఉత్తరమనే (దూలం) వరుస, కపోతం పైన వ్యాళీమనే వరుస వున్నాయి.

శిఖరం (విమానం)

కప్పు వరకూ రాతితో కట్టిన రామప్ప దేవాలయ ప్రస్తరం పైన ఇటుకలతో కట్టిన మూడంతస్తుల విమానముంది. అనేక రకాల కొలతలతో నిర్మించినందున దీన్ని విమాన (నానా మానవిధాన త్వాత్ విమానం పరికల్పయేత్) మన్నారు. కాకతీయుల కాలపు విమానం శిథిలమైతే నలభై ఏళ్ల క్రితం పునర్నిర్మించారు. కూటకోట లక్షణం ద్రావిడ పద్ధతిలో కట్టిన విమాన శిఖరం చదరంగా వుండి దానిపైన కలశముంది. విమానం ముందు భాగాన అర్ధమండపం పైన రెండో అంతస్తు వరకూ ఉన్న కట్టడాన్ని శుకనాసి (చిలుక ముక్కు) అంటారు.

నీళ్లపై తేలే ఇటుకలు

సకల విద్యాప్రవీణులు, ప్రయోగశీలురైన రామప్పశిల్పులు అప్పటికే పెద్దపెద్ద బండరాళ్లతో బరువెక్కిన దేవాలయానికి మరింత బరువు కాకూడదని, గర్భగుడిపై విమానాన్ని నీళ్లలో తేలే ఇటుకలతో నిర్మించి, నిర్మాణరంగంలో యావత్ భారతదేశంలోనే తమ కెవరూ సాటిరారన్న విషయాన్ని రుజువు చేశారు. బాగా దంచిన బంకమట్టికి తుమ్మచెక్క, కరక్కాయ తొక్కనాడించి నీళ్లను, వట్టివేళ్లను, ఊకను కలిపి పోతపోల్చి కాల్చటాన ఆ ఇటుకలు అంత తేలికైనాయి. ఇది కాకతీయ ఇటుకల ప్రత్యేకత.

రంగ మండప స్తంభాలపై శిల్పం

రామప్ప దేవాలయ గర్భగృహం, అర్ధమండపం తరువాత వున్న చదరపు మండపాన్ని రంగమండపమంటారు. దీనికి మూడు వైపులా భక్తులు లోనికి రావడానికి దారులున్నాయి. దేవుని విగ్రహానికి చేసే అలంకరణలను అంగభోగమని, రంగశిల నుంచి అర్పించే నాట్యాన్ని రంగభోగమనీ రెండింటినీ కలిపి అంగరంగ భోగాలని అంటారు. ఈ మండపంలో మధ్యన ఎత్తైన నాలుగు ప్రధాన స్తంభాలు, చుట్టూ వేదిక మీద కురచ స్తంభాలు వున్నాయి. కపోతం వంగిపోతుంటే అప్పటి పురావస్తు శాఖ సంచాలకులు గులాం యజ్దాని చుట్టూ అదే సాదాగా చెక్కించిన రాళ్లతో స్తంభాలెత్తించాడు. దానిపై నున్న వ్యాళ వర్గం శిథిలమైతే దాన్ని కూడా రాతితో పిట్టగోడ మాదిరిగా కట్టించాడు. నిజానికి కాకతీయుల పిట్టగోడ ప్రధాన ఆలయాన్ని పోలిన చిన్న ఆలయాల వరుస వుంటుంది.

రంగ మండపం

రంగమండపం మధ్యనున్న నాలుగు స్తంభాలు, దూలాలు, కప్పు రాళ్లను నల్లశానపు రాతితో ముఖం కనిపించేంత నగిషీగా చెక్కారు. ఆగ్నేయంలో వున్న స్తంభానికి కింద అశ్వపాదం, స్తంభ భాగం దానిపై నాట్య గణపతి, ఎకచెక్కాలాడుతూ శృంగారం భంగిమల్లో నున్న దంపతులు, ఒక సైనికుడు, అతని భార్య (రామప్ప దేవాలయ పుస్తక రచయిత శ్రీ మందల మల్లారెడ్డి ఈ శిల్పాన్ని రేచర్ల రుద్రసేనాని, అతని భార్యగా వర్ణించారు) ఉన్నారు. నైరుతిలోనున్న స్తంభంపైన నాట్యగత్తెలు, రతీ మన్మథ, అమృత మథన దృశ్యాలు, వాయువ్య స్తంభం మీద గోపికా వస్త్రాపహరణం, నాట్యగాళ్లు, ఈశాన్య స్తంభంపై డిజైన్లు వున్నాయి. స్తంభాలపైన కలశం, దాడి, ఫలికా పద్మాలను బంగారు పనిచేసే కంసాలులు తీర్చి దిద్దారా అన్నట్లుంది. దానిపై నాలుగు వైపులా నాలుగు ముఖాలున్న బోదె వున్నాయి.

రంగ మండప దూలాలు

బోదెలపైన గల దూలాలపై కూడా వెన్నతో తీర్చిదిద్దినట్లుగా లెక్కలేనన్ని దేవతామూర్తుల్ని సులువుగా చెక్కారు. తూర్పు వైపు

దూలం ఎదురుగా శివ కల్యాణసుందరమూర్తి, దూలం కింద వైపున బ్రహ్మ విష్ణువుల మధ్య నర్తనమాడుతున్న నటరాజు, ఏకాదశ రుద్రులు, లోపలి వైపు త్రిపుర సంహారమూర్తి, దక్షిణం వైపు దూలం పై ఎదురుగా, నందీశ్వర, బ్రహ్మ, విష్ణు, వాహనాలపైనున్న దిక్పా లకులు, సప్తర్షులు, దూలం కింద వైపున గజాసురసంహారమూర్తి, లోపలివైపు అమృతకలశానికి అటూ ఇటూ దేవతలు, పడమర దూలం ఎదురుగా దేవతా శిల్పాలు, దూలం కిందవైపున దిక్పాలకుల మధ్య నటరాజు, లోపలి వైపు సాగరమధన దృశ్యం, ఉత్తరం వైపున దూలంపై ఎదురుగా రుషులు, కింద వైపు గజాసురసంహారమూర్తి, లోపల రామరావణ యుద్ధ దృశ్యాలు రమణీయంగా మలిచారు. దూలాలపైన మధ్యలో (మూల రాళ్లు) కోణపట్ట, చదరపట్టాల (చదరపురాళ్లు) పై దిక్పాల శిల్పాలు, మధ్యన నటరాజ శిల్పం చూపరుల దృష్టిని మరల్చటమే కాక మెడనొప్పిని కూడా కలిగిస్తుంది. ఎందుకంటే ఏ శిల్పానికి ఆ శిల్పం అద్వితీయం.



స్తంభాలు

దూలాల మధ్య మదనిక నాగిని శిల్పాలు

రంగమండప కక్షాసనాల వెనుక వేదికపై నిలబెట్టిన కురచ స్తంభాలున్నాయి గదా! వాటి వెలపలి వైపు నుంచి దూలాల బోదె భాగాల్లోకి నల్లశానపు రాతితో చెక్కిన ఏనుగుపైనున్న యాళి- గజ కేసరి (సింహాన్ని పోలిన ఉహాత్మక జంతువు) శిల్పాలు, నాగినీ, మదనికా శిల్పాలున్నాయి. చక్కటి అంగసౌష్టవంతో వొంపు సొంపులు, హొయలూ, వయ్యారాల కలబోతగా తీర్చిదిద్దిన అలనాటి సుందరీమణులు, కాకతీయుల కాలపు అందమైన యువతులు రూపలావణ్యానికి ప్రతిబింబాలు. నల్లశానము రాతిలో చెక్కిన రంగమండప వాయువ్యభాగంలో ఐదు గజకేసరి శిల్పాలు, తరువాత తూర్పు ద్వారానికి రెండు వైపులా ఇద్దరేసి నాట్యగత్తెలు, నాగినులు, మద్దెల వాయిస్తున్న యువతులు. తూర్పువైపు ద్వారానికి ఎడమ వైపున్న యువతి ఎత్తు మడమల చెప్పులతో ఫ్యాషన్లలో ఫ్రెంచి అందగత్తెల్ని తలదన్నే రీతిలో ఉంది.

మరో యువతి వంటిపై జారిపోతున్న అంబ్రాయిడరీ అల్లికలు, అప్పటికి కొంగొత్త డిజైన్లు అద్దుకున్న బట్టలతో అంద మంతా సొంతమేనన్నట్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ సుందరీ మణుల తలపై వెంట్రుకలను కూడా అందంగా అలంకరించుకొన్న తీరు, చెవులకు పెద్దసైజు గుండ్రటి దుద్దులు, నాజూకైన బంగారు నగలు, నాట్యభంగిమలు, ఆ సొగసుగత్తెల మాటేమోగాని చేయి తిరిగిన శిల్పుల వనితనానికి నిదర్శనాలు. అంగాంగానికి పొందు వరచిన ఆభరణాలతో అప్సరసలను సైతం కవ్వించి, అలంకరణలో, అందంలో తమకు సాటి రారన్న గర్వంతో సవాళ్లు విసురుతూ, తెలంగాణా ప్రాంత యువతులు మొదటి నుంచి ఆధునిక నాగరికత ప్రేమికులని (సౌందర్యోపాసకులని) రుజువు చేస్తున్నాయి.

ద్వార శాఖలు

గర్భాలయంలో ప్రతిష్ఠితమైన రుద్రేశ్వరుని దర్శించాలను కొన్నా, ఒకటీ రెండూ శృంగార శిల్పాలు అందరిదృష్టిని ఆకర్షిస్తాయి. అపు రూపంగా చెక్కిన ద్వారబంధాలు, వాటి శాఖలు, కింద సుందర మైన శిల్పాలు, వేటగత్తె పాట్లు, లోనికి వెలుతురు రావటానికి కిటికీలు, కిటికీ కళ్లపై అలనాటి నాట్యభంగిమలు (కరణాలు) అభినయ, నృత్యరీతులు మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. బహుశా రేచర్ల రుద్రుడు, నాట్యాభిరుచిని ఇక్కడ తెలియజెప్పు కొన్నాడేమో! ద్వార బంధాల కిందున్న గడపపై రమణీయ శిల్పం, పైనున్న పతంగంపై నటరాజు తాండవం చూపరులను మమేకం చేస్తుంది. ఇక్కడ మలచిన నాట్య భంగిమలను పరిశోధించిన ఎన్నో నాట్య విశేషాలను డా॥ నటరాజ రామకృష్ణ బయటి ప్రపంచానికి తెలియజెప్పటానికి 1985లో రామప్ప దేవాలయ ప్రాంగణంలో పేరిణి నృత్యప్రక్రియను వేల మంది సమక్షంలో ప్రదర్శించారు.

నంది మండపం

దేవాలయ దర్శనమైన తరువాత రంగమండపం బయటి కొచ్చినవారికి, తంజావూరు బృహదీశ్వరాలయంలో మాదిరిగా వ్యవసాయం పట్ల మక్కువ గల కాకతీయ రాజుల అభిమతానికి మచ్చుతునకగా, దుక్కిటెడ్లపట్ల గల మమకారాన్నంతా కలిపి చెక్కించుకొన్న నందిని ప్రతిష్ఠించిన నందిమండపం, అటు అంతకు ముందు కళ్యాణి చాళుక్యుల దేవాలయాల్లోగానీ, లేక అప్పటివరకూ కట్టిన కాకతీయ దేవాలయాల్లోనూ ఎక్కడా లేనట్లు విలక్షణ వాస్తుశైలిలో నిర్మించారు. హుందాగా పడుకున్న నందిపై పట్టెడలు, నగలను, శిల్పులు-కంపాలులూ కలిపి చెక్కారా అన్నట్లున్నాయి.

కాకేశ్వరాలయం

రామప్ప దేవాలయానికి ఎడకువైపుగా, అర్ధమండలి, గర్భాలయం- మహామండపాలతో మన్న కాళేశ్వరాలయాన్ని రుద్రుడు తన తండ్రి కాట్రెడ్డి పేర నిర్మించాడు. చుట్టూ చిన్న ప్రదక్షిణపథంగా వున్న ఉపపీఠం, దానిపై చిన్న అధిష్ఠానం, పదవర్గం, ప్రస్తర కపోతం, దానిపైన ఒక్క అంతస్తు వరకు మిగిలి వున్న శిథిల విమానం కొంచెం ఎత్తైన అధిష్ఠానం, దానిపై కక్షానసాలతో ఉన్న

రంగమండపం, ప్రవేశం దగ్గర అటూ ఇటూ శిథిలమైనా పదిలంగా మెట్లెక్కండని భక్తులను ఆహ్వానిస్తున్న రెండు ఏనుగులతో చూడముచ్చటగా ఉంది..

రంగమండపంలో 16 స్తంభాలు, ద్వారబంధాలపై నాట్య కరణాలతో రామప్ప ప్రధానాలయానికి తగ్గట్టుగా నిర్మించబడింది. ముందున్న మెట్లకు అటూ ఇటూ పొందికగా వున్న అధిష్టాన భాగాలను సంస్కృతంలో గజహస్తాలనీ, అలంబన బాహులనీ అంటారు.

కామేశ్వరాలయం

రామప్ప చేరాలయానికి నైరుతి దిక్కులో నిర్మించిన కామేశ్వ రాలయం చిన్న ఉపీఠం, సాదా గోడలు, దానిపై చిన్న కపోతం వర్గా లున్నాయి. ముందుభాగంలో అటూ ఇటూ రెండు కక్షాసనా లుండటం గమనించదగ్గ విషయం. ద్వారబంధాలు కాకతీయ శిల్ప వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి.

కల్యాణ మండపం

రామప్ప ఆలయ దక్షిణభాగంలో ప్రాకారానికి మధ్యగల కల్యాణమండపం శిథిలమైపోగా భారత పురాతత్వ సర్వేక్షణ శాఖ పదిలపరుస్తుంది.

ప్రాకారం

ఆలయాలను అపురూపంగా కట్టించిన రుద్రుడు వాటి భద్రతను గురించి కూడా ఆలోచించాడు. ఆలయాలు భద్రతతో పాటు పచ్చటి పరిసరాల నడుమ అందం ఇనుమడించేటట్లు (రక్షార్థ మున్నతార్థంచ శోభనార్థం ప్రాకారం ప్రకల్పయేత్) చుట్టూ ఎత్తైన విశాలమైన ప్రాకారాన్ని నిర్మించాడు. తూర్పు, పడమర, దక్షిణ దిక్కుల్లో ప్రవేశ ద్వారాలను కల్పించాడు. ప్రాకారం దృఢంగా ఉండటానికి రెండు వరుసలతో గోడను కట్టి, ఆ వరుసల మధ్య మట్టితో నింపి, పైన కప్పునూ, దానిపై అందం కోసం కలశాలను తలపించే కోడిపుంజు తలపై ఉండే చర్మపు జుట్టు రీతిలో నిర్మించాడు.



ఇతర దేవాలయాలు

రామప్పకు నైరుతి దిక్కులో 100 గజాల దూరంలో ఒక త్రికూటాలయం, వాయువ్యంలో చాళుక్య రీతిలో నిర్మించిన ఆలయం, చెరువుకట్టపై కుడివైపున కొండగట్టున మరో ఆలయం, చెరువుకట్ట ఎడమవైపు ఒక త్రికూటాలయం, మరో ఏక కూటా లయాలు శిథిలమైనా చూడదగ్గ కట్టడాలు.

అపురూపమే కాక అరుదైన రామప్ప దేవాలయ సముదాయం మధ్యయుగపు రాజవంశ ఠీవిని, అప్పటి వాస్తుశిల్ప వైవిధ్యాన్ని, నాటి శిల్పుల హస్తకళా లాఘవానికి అద్దంపడుతూ ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకొని తెలంగాణా ప్రతిష్టను ప్రపంచవ్యాప్తం గావించింది.

శాసన మండపం

గణపతి దేవుని అడుగుజాడల్లో నడుస్తున్న రేచర్ల రుద్రుడు ఆలయాన్ని కట్టిన సందర్భంగా సంస్కృతంలో ఒక శాసనాన్ని వేయించి, దానిని నిలబెట్టి ఎండావానల నుంచి రక్షణకు ఒక మండపాన్ని కట్టించాడు. చక్కటి ఉపపీఠంపై నాలుగు స్తంభాలపై అందమైన కప్పుతో నిర్మించిన శాసన మండపం కాకతీయ వాస్తు కట్టడాల్లో విలక్షణమైనదిగా గుర్తింపు పొందింది.




డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి దేవాలయ పునర్నిర్మాణ ప్రక్రియలో నిష్ణాతులు. ఆలంపురం, సోమశిల, నల్గొండ, రామప్ప దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురావస్తు శాఖలో స్థపతిగా పనిచేసి పదవీ విరమణానంతరం కొత్త రాజధాని అమరావతిలో ప్రభుత్వానికి సలహాదారుగా సేవలు అందిస్తున్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి, కొండవీటి రెడ్డిరాజులు, మనము వంటి అనేక చారిత్రక గ్రంథాలు రచించారు.

❖ యాత్రాసాహిత్యంలో నవచైతన్యం ❖

దాసరి అమరేంద్ర

తెలుగువారు తమ ప్రయాణాల గురించి రాయడం మొదలెట్టి 185 సంవత్సరాలయింది (ఏనుగుల వీరాస్వామి, కాశీయాత్ర చరిత్ర, 1938). ఇప్పటిదాకా సుమారు 200 యాత్రాగ్రంథాలు వచ్చాయి. వేలాది వ్యాసాలు వచ్చాయి. ప్రయాణాల గురించి రాయాలన్న ఉత్సాహం ఉన్నవాళ్ల దగ్గర్నించి పరిణితి చెందిన రచయితల వరకూ యాత్రారచనలు చేసారు, చేస్తున్నారు. మొట్ట మొదటి యాత్రారచనే చక్కని పరిణితి ప్రదర్శించినా నిన్న మొన్నటి దాకా యాత్రారచనలు చాలావరకూ వింతలూ విడ్డూరాలకూ, కాలాలూ దూరాలకూ, గణాంక వివరాలకూ, రచన చేయాలన్న ఉత్సాహాలకూ పరిమితమై సాహితీవిలువలను సంతరించు కోవడంలో అంతగా విజయవంతం కాలేకపోయాయి.

గత ఇరవై పాతికేళ్లుగా యాత్రారచనల ధోరణి బాగా మారింది. కుతూహలాల స్థానంలో జిజ్ఞాసా, పిపాసా వచ్చి చేరాయి. వింతలూ విడ్డూరాల స్థానంలో ప్రకృతీ మనిషీ ముఖ్యమయ్యాయి. ఉపరితల పర్యటనలు గాఢత నిండిన యాత్రలయ్యాయి. ప్రదేశాలను కళ్లతో చూసి కలంతో రాయడం స్థానంలో మనసుతో చూసి హృదయంతో రాయడం మొదలయింది. అనుభవాలు అనుభవాల దగ్గరే ఆగకుండా అనుభూతులకు దారి తెరిచాయి. పెదవి నుంచి వచ్చిన నోటిమాటల స్థానంలో మనసు పలికే మౌన రాగాలు యాత్రారచనల్లో వినిపించసాగాయి. మనుషులూ ప్రదేశాలూ ప్రపంచమూ అంటే ఉండే ఆసక్తీ అభిమానాల స్థానంలో అనుకంపా అక్కరా చోటు చేసుకున్నాయి.



తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ రచనలు అంటే 1838 నాటి కాశీయాత్ర చరిత్ర- మాలపల్లి, కన్యాశుల్కం లాంటి రచనల సహపంక్తిన ఉండటం మనం గమనించవచ్చు. అలాంటి సాహితీస్థాయి గల యాత్రారచనలు ఈ పాతికేళ్లలో కనీసం అరడజను వచ్చాయి.

❖

ప్రపంచంలో ఇప్పటికీ పర్యటన అన్నది డబ్బుతో నిండిన వేడుక. పరిశ్రమ స్థాయికి చేరిన వ్యాపార ప్రక్రియ. ప్రయాణాలు చేసేవారిలోనే కాకుండా వాటి గురించి రాసేవారిలో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఈవిషయం మీద మౌన అంగీకారం ఉండటం మనం గమనించవచ్చు. తెలుగు యాత్రాసాహిత్యం అందుకు మినహాయింపు కాదు.

కానీ 1830లోనే ఏనుగుల వీరాస్వామి తన ప్రయాణానికి జిజ్ఞాస, పిపాస కేంద్రబిందువులుగా చేసుకొన్నాడు. అనుభవాలూ, మానవ సంపర్కం మీద దృష్టిపెట్టాడు. అలా చేసిన పదిహేను నెలల కాశీయాత్ర గురించి గొప్ప రసజ్ఞతతో రాయగలిగాడు. అదే ధోరణి 1978లో వచ్చిన కాశ్మీర దీపకళికలో నాయని కృష్ణకుమారి ప్రదర్శించారు. సౌందర్యదృష్టితో తాను తిరిగిన ప్రదేశాలను చూసి ఆయా అనుభవాలను కవితాత్మకంగా, అనుభూతి ప్రధానంగా చెప్పిన కృష్ణకుమారి ఆధునిక తెలుగు యాత్రా రచనకు పునాది రాయి వేసారు. గమ్యం కన్న గమనం ముఖ్యమని చెప్పకనే చెప్పారు.

కాశ్మీర దీపకళికను అభిమానించిన వారిలో ఒకరైన దాసరి అమరేంద్ర ఆ రచనలోని అనుభూతి అన్న అంశాన్ని కేంద్రంగా చేసుకుని 1990లో తన తొలి యాత్రారచన మూడు నగరాలు (మ్యూనిక్, పారిస్, లండన్) వెలువరించారు. ఆ రచన ఒక దిన పత్రికలో ధారావాహికగా వచ్చినపుడు దానికి సంపాదకులు, 'అనుభూతిని మేళవించి చెప్పిన విదేశీ యాత్రాగాథ,' అన్న ట్యాగ్ లైన్‌ను జోడించారు.

❖

1999లో వచ్చిన భ్రమణకాంక్ష (మాచవరపు

ఆదినారాయణ) 'ప్రయాణం'లోని అనేక మౌలిక అంశాలకు ప్రతీకగా నిలిచింది. నదులు, కొండలు దాటుకుంటూ వేలాది కిలోమీటర్లు కాలి నడకన సాగిపోయిన ఆ మూడు ప్రయాణాల ముప్పేట పాఠకులకు ఢిల్లీ చేరినప్పుడో, డార్జిలింగ్ చేరినప్పుడో కాకుండా ఆయా ప్రయాణాల పొడవునా అనేకానేక అనుభవాల రుచి చూపి ఆ గమనాల రమ్యతను వారి మనసుల్లో నింపగలిగింది. తెలుగులో యాత్రా రచనకు ఊతమివ్వడమే గాకుండా ఆ ప్రక్రియను ఒక మలుపు తిప్పింది. దీపస్తంభంగా నిలిచింది. ఎంతోమందిలో యాత్రా పిపాసను నింపగలిగింది.

సుఖమూ సౌఖ్యమూ దైనందిన జీవితాలలోని మొనాటనీ జయించడమూ ప్రయాణాల లక్ష్యంగా ఉన్న రోజుల్లో, ఆ లక్ష్యాలకు అనుగుణంగా ట్రావెలాగ్స్ వస్తోన్న సమయంలో, సుఖం కన్న సంతోషం మిన్న అంటూ సౌఖ్యం కన్న సాహసం ముఖ్యం అంటూ యాత్రలు చెయ్యడం, యాత్రాగాథలు వెలువరించడం గత ఇరవై పాతికేళ్లలో తెలుగులో వచ్చిన చెప్పదగ్గ పరిణామం. ఎవరూ ఊహించని మధ్యయుగాలనాటి వ్యాపారమార్గం సిల్క్ రూట్లో సాహసయాత్ర (పి. లోకేశ్వర్, 2013), నలుగురు స్త్రీ సాహసికులు 56 రోజులపాటు ఆరు దేశాలలో పదిహేడు వేల కిలోమీటర్లు మోటారుసైకిళ్ల మీద తిరిగిరావడం (రోడ్ టు మెకాంగ్, జయ భారతి, 2019) మనం గమనించవచ్చు. అలాగే సైకిళ్లమీద ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అడవులన్నిటినీ 78 రోజులపాటు తిరిగి వచ్చిన వైనం మనకు అడవి నుంచి అడవికి (జయతి, 2018) పుస్తకంలో కనిపిస్తుంది. జగము నేలిన తెలుగు (డి.పి. అనూరాధ, 2021) వెదుకులాటలో ఆ వెదికిన వ్యక్తి ఎంతటి సాహసప్రవృత్తిని సంతరించుకొని ప్రదర్శించారో మనం ఊహించవచ్చు. దేశపు సరిహద్దుల్లో (రెహానా, 2018) పర్యటించినా, చత్తీస్‌ఘడ్ అడవుల్లో వేల కిలోమీటర్లు స్కూరు మీద తిరుగాడినా (స్కూటర్ పై చత్తీస్‌ఘడ్ యాత్ర, పరవస్తు లోకేశ్వర్, 2009)- వీటన్నిటి వెనుకా సాహసమే మా ఊపిరి అన్న మౌలిక ప్రేరణ ఉంది. ఇప్పుడది మన యాత్రికుల్లోనూ యాత్రారచనల్లోనూ మునుపెన్నడూ లేనంత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

దీనితో ముడిపడిన మరో ఆసక్తికరమైన పరిణామం గురించి చెప్పుకోవాలి. రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో వీరాస్వామి కాశీ యాత్రకు ఎద్దుబళ్లూ, పల్లకీలూ సాధనాలయ్యాయి. రోడ్లూ, రైళ్లూ, విమానాలూ వచ్చాక 'సహజంగానే' అవి యాత్రికుల ముఖ్య సాధనా లయ్యాయి. దానికి భిన్నంగా- రవాణా సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చిన 21వ శతాబ్దంలో ఊహాతీతమైన యాత్రా సాధనాలు మనకు కొన్ని యాత్రారచనల్లో కనిపిస్తాయి. ఆది నారాయణ యాత్రలకు కాళ్లే ప్రధాన వనరు. జయతికి సైకిలు ముఖ్యమైన సాధనమయితే జయభారతికీ లోకేశ్వర్‌కూ స్కూటర్లు, మోటారు సైకిళ్లూ అభిమాన పరికరాలు. జలమార్గానా, కారుల్లోనూ ఈమధ్య చేసిన యాత్రల గురించి ఇంకా పుస్తకాలు రాలేదుగానీ అవీ రావడానికి పెద్దగా సమయం పట్టదు.

❖

తెలుగువారు యాత్రికులుగా సీమాంతరాలు వెళ్లడమన్నది కనీసం నూట యాభై ఏళ్ల క్రితమే జరిగిన దాఖలాలు ఉన్నాయి. పుస్తకంగా ఆ వివరాలు నమోదు అయ్యాయి (పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్, పోతం జానకమ్మ, 1876). ఆ తర్వాత కూడా ఓడల్లోనూ విమానాల్లోనూ వెళ్లి వచ్చినవాళ్లు ఉన్నారు. కానీ 1950లు 60ల దాకా విదేశీయానం అన్నది మనకు అపురూపమైన విషయంగానే ఉండిపోయింది. 1970లు వచ్చేసరికి విద్యా ఉద్యోగాల కోసమో, సాంస్కృతిక రాయ బారులుగానో తెలుగువారి విదేశీ ప్రయాణాలు పెరిగాయి. అలా వెళ్లివచ్చిన కవులూ కళాకారులూ పాత్రికేయులూ రచయితలూ తమతమ యాత్రల గురించి రాసారు కూడానూ.

21వ శతాబ్దం వచ్చేసరికి విదేశాలు వెళ్లిరావడమన్నది అతి సులభమయింది. ఏదో కార్యక్రమం పెట్టుకొని వెళ్లిరావడం గాకుండా టూరిస్టులుగానూ, యాత్రికులుగానూ వెళ్లడం, రాయడం సామాన్యమయింది. సిల్క్‌రూటు యాత్ర గురించీ, రోడ్ టు మెకాంగ్ గురించీ చెప్పుకొన్నాం. ఇవి రెండూ రొటీన్‌కు భిన్నంగా పొందిన అనుభవాలు; సాహసాలు పునాదిగా చేసిన యాత్రలు. ఈ నవీనబాణీ యాత్రలూ, యాత్రారచనలూ గత పాతికేళ్లలో మనకు ఎన్నో కన్పిస్తాయి.

2016లో వచ్చిన భూభ్రమణకాంక్ష ఆరు ఖండాలూ పద్నాలుగు దేశాలలో మాచవరపు ఆదినారాయణ చేసిన విదేశీ యాత్రల సమాహారం. నగరాలూ, మహానదులూ, సంపన్న దేశాలూ, వింతలూ, విశేషాలను పట్టించుకోకుండా టాస్మానియా, నైజీరియా లాంటి అంతగా ప్రయాణీకులకు అందని దేశాలకు అనాది యాత్రికుని బాణీలో వెళ్లి తిరుగాడి రాసిన ప్రపంచశ్రేణి యాత్రా గాథ ఈ భూభ్రమణకాంక్ష. 2016లో వచ్చిన నా ఐరోపా యాత్ర (వేమూరి రాజేష్) కూడా యూరప్‌లోని అనేకానేక దేశాల గురించి రాసిన పుస్తకమే అయినా అది ప్రముఖ దేశాలూ నగరాల గురించి గాదు; లిచ్టెన్ స్టైయిన్, లక్జెంబర్గ్, ఆస్ట్రియా, చెక్ రిపబ్లిక్ లాంటి పది పన్నెండు దేశాలను మనసుతో చూసి హృదయంతో రాసిన పుస్తకమది. ఇదే బాణీలో అదే రచయిత 2022లో యూరప్‌లోని మారుమూల పర్వతశ్రేణిలోని అజార్బైజాన్, అర్మేనియా లాంటి దేశాలలో తిరుగాడి మా కాకసస్ యాత్ర అన్న పుస్తకం తీసు కొచ్చారు. గల్ఫ్ గీతం (2021) అంటూ దుబాయ్, మస్కట్ల గురించి రాసినా అవి ఆయా దేశాలలోని ఆకాశహార్మ్యాలనూ, బంగారపు విపణి వీధుల్నీ హెచ్చుచేసి చెప్పకుండా అక్కడి జనసరళిని ఒడిసి పట్టుకుని పాఠకులకు అందించడానికి చేసిన ప్రయత్నం. ఎండ్లూరి సుధాకర్, అంపశయ్య నవీన్, మధురాంతకం నరేంద్ర, ఎన్. గోపీ లాంటి ప్రముఖులూ, జయభారతి లాంటి ఔత్సాహికులూ తమ తమ దృష్టిలో చూసిన ఆయా దేశాల గురించి తమదే అయిన బాణీలో రాసుకొచ్చారు. ఈ సందర్భంలో ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ 'ప్రయాణించి', ఆగదు మా ప్రయాణం (2018) అంటూ సమాచార దర్పణాల్లాంటి పుస్తకాలను ప్రచురిస్తోన్న నర్మదా రెడ్డినీ గుర్తు చేసుకోవాలి.

❖

ప్రతి యాత్రికునిలోనూ ఒక కవి ఉంటాడు.

"మధ్యాహ్నం ఎండ గంజి పెట్టిన నూలుగుడ్డలా పెళపెళ లాడుతోంది," అంటూ కాశ్మీర దీపకళిక ఆరంభిస్తారు నాయని కృష్ణకుమారి. "తెల్లరంగు వేసిన మైలురాళ్లు వికసించిన పుష్పాల్లా ఉంటే నేను వాటిని వెంటాడే తేనెటీగగా మారిపోయాను," అంటారు ఆదినారాయణ భ్రమణకాంక్షలో. "తెల్లటి ఇసుకమీద వంగుతోన్న పొద్దులోంచి నారింజరంగు పారుతోంది," అంటారు జయతి సాయంసంధ్యలో ఒక కొండవాగును చూసి తన అడవి నుంచి అడవికి పుస్తకంలో.

గల్ఫ్ యాత్రలో ఉన్న అమరేంద్రకు దుబాయ్ నగరపు పాతబస్తీలో 'కనిపించి', 'పలకరించిన' 1875-1954ల నాటి కవి ఒళైలీలో మధ్యయుగాల బమ్మెర పోతన, తదుపరి కాలపు కబీరూ, ఢిల్లీ నగరపు గాలిబూ, ప్రజాకవి కాళోజీల ఛాయలు ప్రస్ఫుటంగా కనిపించి మురిపించడం సదరు యాత్రారచన యాత్రాపరిధినీ, కవితాస్ఫూర్తినీ దాటుకుని వెళ్లి విశ్వమానవ స్పర్శకు సంకేతంగా పరిణమించడంగా చెప్పుకోవచ్చు. ఆటా జని కాంచె (2006) అంటూ తన అమెరికా యాత్రను 134 కవితల్లో చెప్పారు ఎండ్లూరి సుధాకర్. జర్మనీలో కవితాయాత్ర (2015) అంటూ రాసారు ఎన్. గోపి. నిరంతరం (2020) అన్న తన టాగోర్ తిరిగిన దారుల్లో చేసిన యాత్రాకథనాన్ని కవిత్వంతో నింపేసారు ఆకెళ్ల రవిప్రకాష్. యాత్రల గురించి కథారూపంలోనూ, నవలారూపంలోనూ చెప్పడం (అమెరికా, అమెరికా - అంపశయ్య నవీన్, జగమునేలిన తెలుగు - డి.పి. అనూరాధ) ఇపుడు సామాన్యమయిపోయింది.


❖

యాత్ర అంటే కొత్త ప్రదేశాలను, దేశాలను, మనుషుల్ని మనవిగా మనవారిగా చేసుకోవడం. 'టూరిస్టు పక్క ఊరికి వెళ్లినా పరాయివాడిగా పట్టుబడిపోతాడు. యాత్రికుడు మనుషులూ భాషా తెలియని దూరదేశాలకు వెళ్లినా క్షణాల్లో అక్కడివాడయిపోతాడు,' అంటారు అనుభవజ్ఞులు. ఇలా జరగాలంటే యాత్రికునికి అనుకంప, అక్కర ఉండాలి. ప్రదేశాలలో మనుషులతో మమేకమవ గలగాలి. ఆయాచోట్ల తన ప్రతిబింబాన్ని చూడగలగాలి.

ఈ లక్షణాలున్న యాత్రాగాథలు మనకీమధ్య తరుచూ కనిపిస్తున్నాయి.

తన ఐరోపా యాత్రలో వేమూరి రాజేష్ జర్మనీ వెళ్లినపుడు అక్కడి ప్రముఖ ప్రదేశాల కన్నా ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధ కాలపు ఆష్‌విడ్జ్ నాజీ కాన్సంట్రేషన్ కాంప్ చూడాలని కోరుకుంటాడు. తన తరానికి అంతగా పరిచయం లేని ఆ యుద్ధపు దారుణాలతో ముఖాముఖీ అవుతాడు. 'ఎవరీ హిట్లర్? జాత్యహంకారం, యుద్ధోన్మాదం ఒక జాతి మొత్తాన్ని నిర్మూలించే క్రీడగా, ఒకానొక దారుణ వ్యవస్థకు ఆర్థిక పుష్టిని చేకూర్చే పరిశ్రమగా ఎందుకు పరిణమించింది,' అంటూ వ్యాకుల పడతాడు. అసంకల్పితంగా అతని కళ్లు నీటిచెలమలవుతాయి. యాత్రలూ యాత్రా రచనలూ మౌలిక మానవ స్పందనలకి ఎలా ప్రేరణలవుతాయో ఆ ఘట్టంలో స్పష్టమవుతుంది.

సరిహద్దుల్లో రెహాన 2016లో కాశ్మీరు బోర్డర్ ప్రాంతానికి వృత్తిపరంగా వెళ్లారు. అక్కడి ఉద్రిక్తతలనూ, ఉగ్రవాదుల కార్య కలాపాల వివరాలను తెలుసుకోవడానికి కాల్పులు జరుగుతోన్న సరిహద్దు గ్రామాలకు వెళ్లారు. వెళ్లి తూటాలకు కొడుకును పోగొట్టుకొన్న ఒక తల్లిని కలిసారు. గ్రామాలలోని కన్నీటిగాథలు విన్నారు.



'మనిషిని పలకరిస్తే చాలు ఊరు ఊరంతా పోగైపోయేది,' అంటారు. వృత్తిపరిధిని దాటిన అక్కరా, అనుకంపా ఆమెది.

డిబ్రూఘర్ నుంచి కన్యాకుమారి దాకా నాలుగు రోజులు రైల్లో ప్రయాణించిన జయతి రిజర్వుడు బోగీలు కూడా మూడు రెట్లు మనుషులతో నిండిపోయినప్పుడు, 'తోటివాళ్లు నిలబడి వుంటే సీట్లు పట్టుకుని ఎలా కాళ్లు చాపుకుంటాం? ఆ కష్టాన్ని వందల మందిమి పంచుకొన్నాం,' అంటారు. ఆ ప్రక్రియలో అస్సాం నుంచి కేరళకు పనులకోసం వస్తున్న కుర్రాళ్లందరూ తమ్ముళ్లయిపోయారు అంటారు.

ఈ అక్కర, అనుకంప జయతీ, రెహాన, రాజేష్‌లకే పరిమితం కాదు. యాత్రల గురించి పిపాసతో రాసే అందరి రచనల్లోనూ ఇది ఒక సామాన్యలక్షణంగా కనిపిస్తోందిప్పుడు.

❖

మగతోడు కోసం చూడకుండానూ, తమంతట తామే చొరవతో మహిళలు యాత్రలు చెయ్యడం, వాటి గురించి రాయడం ఈమధ్య కాలంలో వచ్చిన చక్కని పరిణామం. గత పది పదిహేనేళ్ల కాలంలో మహిళలు రాసిన యాత్రారచనలు విరివిగా వచ్చాయి. ముందు చెప్పుకున్న డి.పి. అనూరాధ, నర్మదా రెడ్డి, రెహానా, జయతి, జయభారతిలే కాకుండా పూదోట శౌరీలు, రొంపిచర్ల భార్గవి, కె. గీత, కొండవీటి సత్యవతి లాంటి వారు కూడా తమ యాత్రారచనలను ప్రచురించారు.

❖

యాత్రారచనను స్వీయ అనుభవాలకే పరిమితం చెయ్యకుండా యాత్రాసంబంధిత విషయాలనూ పాఠకులకు చేర్చే ప్రయత్నం ఇపుడు బాగా జరుగుతోంది. ఈ విషయంలో ఆది నారాయణ గణనీయమైన కృషి చేసారు. స్త్రీ యాత్రికులు (28 మంది ప్రపంచ ప్రసిద్ధ మహిళా యాత్రికుల జీవనరేఖలు), మహాయాత్రికులు (24 మంది ప్రపంచస్థాయి యాత్రికుల జీవితాలు), తెలుగువారి ప్రయాణాలు (64 మంది తెలుగు యాత్రికుల అనుభవాలు), ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర (1838 నాటి మూలప్రతికి సరళీకృత వెర్షన్) లాంటి అపురూపమైన పుస్తకాలను ఆదినారాయణ గత ఇరవై యేళ్లలో ప్రచురించారు. దాసరి అమరేంద్ర కూడా సాటి తెలుగు యాత్రికుల రచనలనూ, తెలుగేతర ప్రముఖ యాత్రాగ్రంథాలనూ, తెలుగులో వచ్చిన యాత్రాసాహిత్యపు రూప పరిణామాలను పాఠకులకు పరిచయం చేస్తున్నారు.

❖

మనకు ఉన్న రెండు వందల యాత్రాగ్రంథాలలో చాలావరకు ఆయా రచయితలు ఒకసారి ట్రావెలాగ్ రాసి విరమించుకొన్న కోవకే చెందుతాయి. ఔత్సాహికులే కాకుండా ఇతర సాహితీ ప్రక్రియల్లోనూ, కళారంగాలలోనూ కృషి చేసి పేరు పొందినవారు కూడా ఒక యాత్రారచన చేసి విరమించడం సామాన్య లక్షణంగా ఉంటూ వచ్చింది. ఇపుడా ధోరణిలో మార్పు వచ్చింది. డా॥ ఎన్. గోపి, పరవస్తు లోకేశ్వర్, దాసరి అమరేంద్ర నిలకడగా యాత్రారచనలు వెలువరించడం గమనించవచ్చు. జయతి రాసిన మూడు పుస్తకాలూ మౌలికంగా యాత్రా సంబంధితాలే. ఆదినారాయణ, నర్మదారెడ్డి లాంటివారు కేవలం యాత్రారచనకే తమ సాహితీవ్యాసంగాన్ని అంకితం చెయ్యడం ఆసక్తికరమైన పరిణామం.

❖

అనువాదాలకు తెలుగు సాహిత్యంలో ప్రముఖస్థానం ఉంది. యాత్రా సాహిత్యమూ దానికి మినహాయింపు కాదు. 1950ల నుంచీ నాణ్యమైన అనువాద యాత్రారచనలు తెలుగులో వస్తున్నాయి. ఈమధ్యకాలంలో హైకూయాత్ర (మత్సువొ, బషో, వాడ్రేవు చినవీరభద్రుడు), టిబెట్‌లో 15 నెలలు (రాహుల్ సాంకృత్యాయన్-పారనంది నిర్మల), ప్రయాణానికే జీవితం (అజిత్ హరిసింఘాని-కొల్లూరి సోమశంకర్), జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర (పోతం జానకమ్మ- కాళిదాసు పురుషోత్తం), ఊహలకందని మొరాకో (నిమ్మగడ్డ శేషగిరి- దాసరి అమరేంద్ర)లాంటి అనువాద యాత్రా గ్రంథాలు వెలువడ్డాయి. ఈ కాలంలో వచ్చిన తెలుగు యాత్రా రచనలకు పాఠకుల ఆదరణ పెరిగినట్టుగానే ఈ అనువాద రచనలూ ఆదరణ పొందుతున్నాయి.

❖

యాత్రారచనలు నిజానికి ఆత్మకథలు. యాత్రికుడు తన బింబాన్ని అక్షరాల్లో నిలిపి ప్రతిబింబాలను పాఠకుల్లో చూసుకొనే ప్రక్రియలు. ప్రపంచంలో తన ఉనికినీ, తననుతాను వెదుక్కొనే ప్రయత్నం. ఈలాంటి ప్రయత్నాలు జయతి రాసిన మూడు పుస్తకాల్లోనూ, దేవనపల్లి వీణావాణి రాసిన ధరణీరుహ (2022) లోనూ, ఆదినారాయణ రాసిన పుస్తకాల్లోనూ మనకు కనిపిస్తాయి. ప్రయాణాలను దాటి వెళ్లి తమలోకి తాము ప్రయాణించగల అరుదైన వ్యక్తుల ఆత్మ ఘోషలు అవి.

కథ, కవిత, నవల, వ్యాసం లాంటి సాహితీప్రక్రియల అంశాలను ఇముడ్చుకోగల అవకాశం యాత్రారచనకు ఉంది. చరిత్ర, సంస్కృతి, భౌగోళిక అంశాలు, మానవ మనస్తత్వాలను కల్పనా రహితంగా చిత్రించే శక్తి యాత్రారచనకు ఉంది. అలాగే మనుషులు తమంతట తామే సృష్టించుకొన్న భౌగోళిక రాజకీయ హద్దులను దాటుకుని వెళ్లి ప్రపంచమంతటినీ కౌగిలించుకొనేలా చేసే శక్తి యాత్రకూ, యాత్రారచనకూ ఉంది.

కులాన్ని దాటి, మతాన్ని దాటి, ఊరు దాటి, ప్రాంతం దాటి, జాతీ దేశాల పరిధులు దాటి, మనిషినీ సమాజాన్నీ ప్రపంచాన్నీ జీవితాన్ని ఆవిష్కరించగల శక్తి యాత్రలకూ యాత్రారచనలకూ ఉంది.

ఆ దిశగా ఈనాటి తెలుగు యాత్రాసాహిత్యం తొలి అడుగులు వేస్తోంది.

<u>తాజాకలం:</u> ఇంతియానం అన్న పేరిట నలభైమంది తెలుగు మహిళల యాత్రానుభవాల సంకలనం జులై 2023లో విడుదల అవుతోంది.



తెలుగు సాహిత్యంలో యాత్రాస్మృతులను రాయడంలో ప్రత్యేక ముద్ర కనబరచిన దాసరి అమరేంద్ర కథకుడు, వ్యాసకర్త కూడా. నిరంతర పథికుడు. ఐదు యాత్రాకథనాలు, ఒక కథాసంపుటి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి మరో కథాసంపుటి ప్రచురించారు. నివాసం న్యూఢిల్లీ. 2015 తానా సభల అతిథి.

❖ తిక్కన తెనుగుదనం ❖

పాపినేని శివశంకర్

మహాకవి తిక్కన తెలుగువాడైనందుకు మనమందరం ఆనందించాలి. (అందునా మా గుంటూరు వాడైనందుకు మాకెంతో సంతోషం.) వ్యాసుడు సంస్కృతంలో కూర్చిన భారతాన్ని కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన) తెలుగులోకి అనుసృజన చేశారు. అంటే ఎంతో స్వతంత్ర పద్ధతిలో భారతాన్ని తెలుగు చేశారు. కవిత్రయంలో ద్వితీయుడైనా తిక్కన కవిత్వంలో అద్వితీయుడు అని పండితుల అభిప్రాయం. ప్రాచీన కవుల్లో అతనికి సాటిలేదు. అతని రెండు రచనల్లో (నిర్వచనోత్తర రామాయణము, మహాభారతము) తెలుగుదనం నిండారింది. అయితే తెలుగువారి కవిత్వంలో ప్రత్యేకంగా తెలుగుదనం ఏమిటనే ప్రశ్న వస్తుంది. వెనకటి కావ్యాల్లో సంస్కృతం నుంచి దిగుమతి అయిన మాటలే (తత్సమాలు) నూటికి డెబ్భై పాళ్లు కనపడతాయి. అందువల్ల తెలుగు కవుల కవిత్వంలో తెలుగుదనం కోసం వెతుక్కోవాల్సిన దురవస్థ పట్టింది. కవిబ్రహ్మ, ఉభయ కవి మిత్రుడు తిక్కన దీనికి మినహాయింపు. అతని కవిత్వంలో అచ్చ తెలుగు మాటలు విరివిగా ఉంటాయి. 'జాత్యమి గామి నొప్పయిన సంస్కృతమెయ్యెడ జొన్ప' నన్నాడు నిర్వచనోత్తర రామాయణంలో. మన జాతి భాష కానందున సంస్కృత పదజాలం కావాలని చొప్పించటం అతనికిష్టం లేదన్నమాట. తేట తెలుగు మాటలే ముద్దు. మచ్చుకు నాలుగైదు పద్యాలు చూద్దాం.

భారతం విరాటపర్వంలో కీచకుడు సైరంధ్రి (ద్రౌపది) మీద మరులుగొన్నాడు. అది ఆమెకసహ్యమైంది. కానీ అతని కోరిక ప్రకారం సోదరి, మహారాణి సుదేష్ణ తన పరిచారిక సైరంధ్రిని కీచకుడి ఇంటికి పోయి మద్యం తెమ్మన్నది. ఆమెకిష్టం లేదు. కానీ తప్పదు. ఆ సంకట పరిస్థితిలో వెళ్తున్నప్పుడు ఆమె మనోభావాలెలా ఉన్నాయి?

తలకు వుట్టె, గొంకు కొలదికి మీరె, వె
న్నాటు దోచె, ముట్టుపాటు దొడరె
వెరగుపాటు దనికె, నెరనాడె నొవ్వు, నె
వ్వగలు వగలనీనె, దిగులు వొదివె

సైరంధ్రికి భయం పుట్టింది. సంకోచం మిక్కుటమైంది. విషాదం కలిగింది. సంకటం పుట్టింది. నివ్వెరపాటు కలిగింది. వేదన ఆయువుపట్టులో కదిలింది. అతి విచారం దుఖం కలిగించింది. దిగులు పెనవేసుకొన్నది.

అన్నీ అచ్చ తెలుగు మాటలే. ఇవాళ వాటి అర్థాలు తెలియటం కూడా కష్టమే. ఒక్కొక్క మాట ఒక్కొక్క భావచ్ఛాయను తెలియజేస్తుంది. గత్యంతరం లేని కష్టం ఎదురైనప్పుడు ఒక నిస్సహాయ స్త్రీ మనస్సులో అలలు అలలుగా ఎన్నెన్ని చింతలు రేగుతాయో అవన్నీ అచ్చు గుద్దినట్టు తెలిపాడు కవిబ్రహ్మ.

తెలుగుదనం అంటే తెలుగు మాటలు గుది గుచ్చటమేనా? ఆ మాటకొస్తే అచ్చ తెలుగు కావ్యాల్లో అన్నీ తెలుగు మాటలే ఉంటాయి. మరి తెలుగు మాటలు వాడినంత మాత్రాన తెలుగుదనం ఉన్నట్టేనా? కానే కాదు. తెలుగువాళ్ల మాటల పద్ధతి ఉండాలి. అందులో హాస్యం, ఎగతాళి, ఎత్తిపొడుపు, వ్యంగ్యం, కోపతాపాలు- అన్నీ ఉట్టిపడాలి. అవన్నీ తిక్కన్న తెలుగులో సహజ సుందరంగా సాగుతాయి. ఆ క్రమంలో ధర్మరాజాది వ్యక్తులు తెలుగువాళ్లే అనిపిస్తారు. అదీ ఆ మహాకవి ప్రతిభ.

మాట్లాడేటప్పుడు ఏదో ఒక మాటని ఒత్తి పలికామంటే అర్థం మారిపోతుంది. వ్యంగ్యం స్ఫురిస్తుంది. పదమూడేళ్ల అరణ్యవాస, అజ్ఞాతవాసాలు ముగిసినాక రాజ్యభాగం కోసం పాండవులు ద్రుపదుడి పురోహితుణ్ణి రాయబారిగా పంపారు. ఆ పని నెరవేర లేదు. ఆపైన ధృతరాష్ట్రుడు పంపగా సంజయుడు పాండవుల వద్దకు రాయబారిగా వచ్చాడు, వట్టి చేతుల్తో. ఏదో భాగం ఇస్తామని చెప్పటానికి కాదు. కౌరవులతో పాలు, నీళ్లలా కలిసిపొమ్మని. వచ్చి మొదటగా ఏమంటున్నాడు? 'మీ తండ్రి, ధృతరాష్ట్ర మహారాజు మీరు ఇక్కడ (ఉపప్లావ్యము) ఉన్నారని తెలిసి, మీ యోగక్షేమాలు తెలుసుకు రమ్మని అంతులేని ప్రేమతో నన్ను పంపించాడు.' ఆ మెరమెచ్చు మాటలకి ధర్మరాజుకు ఒంటిమీద కారం రాసినట్టయ్యింది. ఇట్లా బదులు చెప్పాడు.

ఆ రాజు మా దెసం గల
కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన
గారవమున నాదు మది వికాసముఁ బొందెన్


ఆ రాజుగారికి మా పట్ల గల దయవల్ల ఇట్లా సుఖంగా ఉన్నాము. గౌరవంగా నిన్ను పంపించినందుకు నా మనస్సు వికసించింది.

పైకి సంజయుడి కుశల ప్రశ్నలకి మర్యాదగా సమాధానం ఇచ్చినట్టే ఉంది. కాని లోపల ఎత్తిపొడుపు వేరు. 'ఇట్లున్నారము' అంటే ఎట్లా ఉన్నట్టు? రాజ్యం కోల్పోయి, అడవుల్లో పడరాని పాట్లు పడి, ప్రస్తుతం దిక్కు లేకుండా ఉన్నారు కదా. అది సుఖంగా ఉన్నట్టా? మితిలేని కష్టంలో ఉన్నట్టేగా? ఈ దౌర్భాగ్యం అంతటికీ కారణం? ఆ రాజుగారి దయే! అంటే ఆ (పెద్ద) తండ్రి దయలేని తనమే మా దురవస్థకి కారణం అని ధర్మరాజు ఉద్దేశం. ఇంత లావు 'తండ్రి' ఇంత కాలం ఏమయ్యాడు? మాటల్లో అంత వ్యంగ్యం ఉంది. 'సుఖంబున నిట్లున్నారము' అనే మాటలమీద ఊనికతో వ్యతిరేకార్థం ధ్వనిస్తుంది. అదీ తిక్కన రచనా చాతుర్యం.

ధర్మరాజు శ్రీకృష్ణుడిని కౌరవుల వద్దకు రాయబారిగా పంపిస్తూ, ముందుగా ఎవరిని కలవాలో, ఎవరిని ఎట్లా పలకరించాలో, సభలో ఏది మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అన్నీ చెప్పి ముగింపుగా ఇలా అన్నాడు :

మమ్మెఱుఁగు; దెదిరి నెఱుఁగుదు;
నెమ్మి యెఱుఁగు; దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు; వా
క్యమ్ముల పద్ధతి యెఱుఁగుదు
పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్

'మేము నీకు తెలుసు. ఎదుటివాళ్లూ తెలుసు. ప్రేమాభిమానాలూ తెలుసు. సంపద సిద్ధించే ఉపాయమూ తెలుసు. క్రమంగా మాట్లాడే వైనమూ తెలుసు. పోవయ్యా! నేనెవణ్ణి నీకు బుద్ధులు గరపటానికి?' అంటున్నాడు ధర్మరాజు, అన్నీ చెప్పినాక. అది అతని లౌక్యం. అక్కడ శ్రీకృష్ణుడి సంగతేమోగాని 'వాక్యమ్ముల పద్ధతి' తిక్కన సోమయాజికి బాగా తెలుసు. ఇది కంద పద్యం. కంద పద్యాలన్నిటిలో బుల్లి పద్యం. అంత చిన్న పద్యంలో వరసగా ఏడు వాక్యాలు ఇమిడ్చాడు ఆ మహాకవి. సహజంగా తెలుగు వాక్య నిర్మాణం చిన్నదిగా ఉంటుంది. మయసభ డైలాగుల్లాగా చాంతాడంత వాక్యాలుండవు. ఆంగ్లంలో, సంస్కృతంలో ఉన్నట్టుగా సంక్లిష్ట, సంశ్లిష్ట వాక్యాలు తెలుగులో (మామూలుగా) ఉండవు. సరళ వాక్యాలే ఉంటాయి. 'రా', 'పో' అనేవి కూడా పూర్తి అర్థం ఇచ్చే వాక్యాలే. పద్యంలో 'పొమ్మ' అనేది ఒక వాక్యం. అన్నీ చెప్పినాక చనువుగా, 'చాల్లే పోవయ్యా! నీకు చెప్పేదేముంది?' అనటం మన సంభాషణల్లో సాధారణం. 'ఇప్పటిదాకా చెప్పింది చాలు గదా,' అని. అది ముక్తాయింపు. తిక్కన ఇక్కడ ఆ సహజ వాక్యవిన్యాసం చేశాడు. అతని రచనలో క్లుప్తత, బిగింపు ఉంటాయి. ఎంతగా అంటే ఆ వాక్యవిన్యాసంలో ఒక మాట తీసి మరొక మాట పెట్టలేము.



శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్లేముందు పాండవుల అభిప్రాయాలు తెలుసుకొని చివరగా ద్రౌపదిని అడుగుతాడు. మనస్సులో కలిగే 'విషాద రోషముల్' దాచుకోలేక 'గద్గద ఖిన్న కంఠియై' ఆమె వాపోతుంది. మొదటిసారి జూదంలో ధర్మరాజు తన రాజ్యాన్నీ, తమ్ముళ్లనీ, భార్యనీ పందెంగా ఒడ్డి ఓడిపోయాడు. అందరూ కౌరవులకు దాసులయ్యారు. ద్రౌపదిని దాసిగా భావించి, వస్త్రాపహరణం చేస్తున్నా గద్దెపైనున్న మహారాజు ధృతరాష్ట్రుడు కిమ్మనలేదు. తర్వాత రాజ్యమిచ్చినా రెండవ జూదంలో సమస్తం కోల్పోయి పాండవులు అడవుల పాలవుతుంటే వారించలేదు. ఇంత జరిగినాక ఇప్పుడు ఐదూళ్లయినా చాలు, కౌరవులతో కలిసిపోదామంటున్నారు పాండవులు. అది నచ్చని ద్రౌపది తనకు జరిగిన అవమానం ప్రస్తావించింది.

అరయమిఁ జేసి కోడలనకప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోడ యేమఁ జె
చ్చెరఁ జని కోటరంబుఁ దగఁ జేయుదునో,
యటు గాక పాడిమై
వరపుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా

ముందు వెనుకలు ఆలోచించకుండా, కోడలని కూడా చూడకుండా, నన్ను ఊడిగపు దాసిగా చేశాడు. ఆ పెద్దమనిషి (ధృతరాష్ట్రుడు) దగ్గరికి నా భర్తలు పోతే, వారి వెంట నేను కూడా పోయి, కోడరికం చెయ్యాలో న్యాయం ప్రకారం దాస్యమే చెయ్యాలో చెప్పు మాధవా! అంటుంది ద్రౌపది. రాజ్యభాగం లేకుండా

పాండవులు కౌరవనాథుడి పంచన చేరితే వాళ్లు రాజులా? సేవకులా? సందిగ్ధ పరిస్థితి. ఆమెది బాధతో కూడిన తర్కం. ఎవ్వరూ జవాబు చెప్పలేనిది. ఇక్కడ ఆమె తన పెదమామని 'మహాపురుషుడు' అంటుంది. నిజానికి మహానుభావుడా? కాదు. పరమ దుర్మార్గుడని వ్యంగ్యం. వ్యంగ్యవాక్కులో పైకి సాధారణార్థం ఒకటి ఉంటుంది. లోపల దానికి భిన్నమైన, అసలైన విశేషార్థం ఇమిడి ఉంటుంది. అది తెలుగు పలుకుబడి.

ఎదటివాళ్లు కించపరిచేటప్పుడు మాన్యులు తమ గొప్పతనం పరోక్షంగా తెలియపరుస్తారు. 'నా సంగతేమిటో పోయి ఫలానా వాళ్ల నడుగు,' అంటారు. సూటిగా చెపితే అతిశయం అనుకోవచ్చు గదా. అట్లాగే అన్నాడు భీష్ముడు కర్ణుడితో. ఎప్పుడు? సర్వ సేనాధిపతిగా భీష్ముడు తన సేనలో ఆయా వీరుల స్థాయిని నిర్ణయించేటప్పుడు. 'రాధాసుతుండర్ధరథుడు,' అని నిర్ణయించాడు భీష్ముడు. ద్రోణుడు సమర్థించాడు. అర్ధరథుడు అంటే ఒక్క విలుకానితో సమానంగా పోరాడలేనివాడు. ఈ అవమానంతో మహావీరుడు కర్ణుడి కోపం తారాస్థాయికి చేరింది. 'నా దృష్టిలో నువ్వే అర్ధరథుడివి,' అన్నాడు.

ముదియ (ముదియన్ = ముసలితనం రాగా) మతి దప్పి
నోరికి నొదవినట్లు
పలుకు వెడగుల మాటలు పాడి యగునె?

అని ఆక్షేపించాడు. అందుకు ఆ కురువృద్ధుడి సమాధానం ఇది.

ముదుకఁడనైన నాదు బలమున్ జలమున్ వివిధాస్త్రశస్త్ర సం
పదయును బోయి నీ గురుఁడు భార్గవుచే వినుఁ; మాజిభూమి నా
కెదిరినవారు వెక్కెడల నేమయిరో యెఱుఁగున్ జగంబు; నా
ముదిమియు నీ కుమారుతనమున్ వరుసన్ విజయుం
డెఱింగెడున్

వృద్ధుడనైన నా శక్తి, పట్టుదల ఎంతటివో, సకల శస్త్రాస్త్ర సంపన్నత ఎట్టిదో వెళ్లి నీ గురువైన పరశురాముడిని అడిగి తెలుసుకో. పలుచోట్ల యుద్ధభూమిలో నన్నెదుర్కొన్నవారు ఏమై పొయ్యారో లోకానికి తెలుసు. నా వార్ధకం, నీ కుర్రతనం సంగతి అర్జునుడు తెలుసుకుంటాడులే.

కర్ణుడికి అస్త్ర గురువు పరశురాముడు. అంతటివాడినే ఇరవయ్యేడు రోజుల ద్వంద్వ యుద్ధంలో భీష్ముడు ఓడించాడు. ఇంకెంతోమంది ఎన్నోచోట్ల అతని చేతిలో పరాజితులయ్యారు. ఇక పైన తన పరాక్రమం, కర్ణుడి పరాక్రమహీనతా రణరంగంలో అర్జునుడి వద్ద తేలుతాయని ఆ కురువృద్ధుడి భావం. 'విజయుడు' అనే మాట అర్థవంతంగా ఉంది. మన ఇద్దరినీ అతడు జయిస్తాడు అని భావం. ఆ మాట బదులు మరో మాట వెయ్యలేము.

ఇవాళ వాడుకలో లేని తెలుగు మాటలెన్నో తిక్కన రచనలో ఎదురవుతాయి. అవి ఆనాటి వాడుకలో తప్పకుండా ఉండే ఉంటాయి. భాషా వ్యవహారంలో కాలక్రమాన కొన్ని మాటలు తొలగిపోవటం, మరికొన్ని కొత్తగా చేరటం సహజం. మరుగునబడ్డ ఆ మాటల్ని కూడా తెలుసుకోవాల్సిన, పదిలపరచాల్సిన అవసరం ఉంది. అప్పుడే మన భాష విరివి అర్థమవుతుంది. అది మన భాషా సంపద. భారత యుద్ధరంగంలో కర్ణపర్వంలో భీమసేనుడు దుశ్శాసనుడి రొమ్ము చీల్చి, తుద ముట్టించేటప్పుడు అంటున్నాడు.

ప్రైవడి పోయె గాక ధృతరాష్ట్రుడు గన్నది యేమి? యా సభన్
దా వలదన్న కీడుడుగదా?

నిండు సభలో ద్రౌపది వలువలూడ్చేటప్పుడు ధృతరాష్ట్రుడు అది తప్పని వారిస్తే ఆ కీడు తప్పేదికదా? చివరికి నింద పాలయ్యాడు గాని అతడు పొందింది ఏమున్నది? ఇక్కడ 'ప్రై' అనే మాటను గమనిద్దాం. 'నింద/దూఱు' అని ఆ మాటకర్థం. ఇప్పటి వాడుకలో లేనే లేదు. 'ప్రై, ప్రయి' మాటల్ని తిక్కన వాడాడు.

సామెతలు, జాతీయాలు లేకుంటే అది తెలుగుదనమే కాదు. సిరి వచ్చిన మోకాలు నూపువారుం గలరే, సడికంటె చావు మేలు, నివురు గవిసిన మెరయని నిప్పు వోలె, కయ్యంబునకు కాలు ద్రవ్వచునుండె, అరచేత ప్రాణంబులిడి, చిచ్చునకు దోడు కరువలి వచ్చు గతి, నే వోసిన అగ్ని భంగి, డెందాన చెయి వెట్టుకొని నిద్రించుట, కంటికిన్ రెప్పయు బోలె, నూతి కప్ప విధంబున, కొంగున నగ్ని దాచినట్లు, ఒంటర మింటరములు (పరుష వాక్కులు)- ఈ విధంగా తిక్కన తెలుగులో నానుడులెన్నో. ఇక - అంప పెనుచీకటి (బాణవర్షం వల్ల కలిగిన చీకటి), మెత్తని పులి, చిచ్చర కన్ను (అగ్ని నేత్రం), మగ పాడి (శూరుల ధర్మం), రక్కెస తాల్మి (తగని ఓర్పు)- ఇట్లాంటి కొత్త కొత్త తెలుగు సమాసాలు, పద బంధాలు ఉభయ కవిమిత్రుడి రచనలో కోకొల్లలు.

ఇట్లా చెప్పుకుంటూ పోతే కొన్ని వందల ఉదాహరణలు దొరుకుతాయి. తిక్కన సోమయాజి కవిత్వంలో అనేకానేక కోణాలున్నాయి. అందులో ఇది ఒకానొక కోణం మాత్రమే.

ఆ కవిబ్రహ్మకు నమస్సులు.



కథ, కవిత్వం, విమర్శ, సంపాదకత్వం- ఇలా అన్ని రచనాప్రక్రియల్లో అందె వేసిన చేయి పాపినేని శివశంకర్. రెండు కథాసంపుటాలు, నాలుగు కవితాసంపుటాలు, నాలుగు వ్యాస సంపుటాలు ప్రచురించారు. ప్రతి ఏటా కథాసాహితి వెలువరించే ఉత్తమ కథల సంకలనంకి సహ సంపాదకులు. వీరి కవితాసంపుటి 'రజనీగంధ'కు ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. 2001 నుంచి 2017 వరకు మూడుసార్లు తానా సభల అతిథి. నివాసం గుంటూరు.

❖ ఏటికొప్పాక బొమ్మలు ❖

ముత్తేవి రవీంద్రనాథ్

ఎప్పుడో 2004- 06 మధ్యకాలంలో నేను తూర్పుగోదావరి జిల్లా తునిలో వాణిజ్య పన్నుల అధికారి (సీటీఓ)గా పనిచేసిన కాలంలో అక్కడికి సమీపంలో విశాఖపట్నం జిల్లా యలమంచిలి మండలంలో ఉన్న ఏటికొప్పాక బొమ్మలు మరియు హస్తకళాఖండాల తయారీ కేంద్రాలను చూశాను. అక్కడి హస్తకళాకారుల ప్రతిభ నన్ను అబ్బురపరిచింది. తరువాత మరోసారి తీరికగా వెళ్లి ఆ హస్తకళను గురించి సమగ్రంగా తెలుసుకోవాలనే నా కోరిక ఇన్నేళ్లుగా కలగానే మిగిలిపోయింది. కోవిడ్ వలన ట్రైన్లు, బస్‌లు నడవని కారణంగా నేను, రాజ్యలక్ష్మి విశాఖపట్నం ఇటీవల అత్యవసరంగా కార్లో వెళ్లడంతో మా తిరుగు ప్రయాణంలో మేము ఏటికొప్పాక గ్రామానికి వెళ్లి అక్కడి అపురూప కళాకృతులను గురించి సమగ్రంగా తెలుసుకునే అవకాశం లభించింది.

భౌగోళికం - గ్రామనామం

ముందుగా ఏటికొప్పాక గ్రామానికి సంబంధించిన భౌగోళిక విషయాలు, గ్రామనామం మొదలైన వాటి గురించి చూద్దాం. ఏటికొప్పాక (పిన్ కోడ్ 531 082) విశాఖ జిల్లా యలమంచిలి మండలంలోని ఒక గ్రామం. ఈ గ్రామం విశాఖపట్నం నుంచి 67 కిలోమీటర్ల దూరంలోనూ, యలమంచిలి బస్‌స్టాండ్ నుంచి అయితే 20 కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. విజయవాడ వైపు నుంచి వెళ్లేవారికి చెన్నై-కోల్‌కాతా జాతీయ రహదారిలో తుని దాటాక విశాఖ జిల్లా నక్కపల్లికి సమీపంలో ఉన్న 'అడ్డరోడ్డు'గా వ్యవహరించే జంక్షన్ నుంచి ఎడమవైపుకు వెళితే ఏటికొప్పాక మరికొంత దగ్గర. మనం విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వెళ్లేటపవిడు ఆ జిల్లాలో ప్రయాణిస్తూ, తూర్పు కనుమలలో పుట్టి బంగాళాఖాతంలో కలిసే మూడు చిన్న నదులను దాటతాము. మొదటిది తాండవ నది. ఈ నది తూర్పు గోదావరి జిల్లా తుని- విశాఖ జిల్లా పాయకరావు పేటలను విడదీస్తూ ప్రవహిస్తుంది. రెండవది ఏటి కొప్పాక సమీపంలోని వరాహ నది. మూడవది అనకాపల్లి సమీపంలోని శారదా నది. ఏటి కొప్పాక గ్రామనామం లోని ఏరు వరాహ నదే. వాక అనే పేరుతో ఉన్న ముండ్ల పొద మొక్క మనకు తెలిసిందే. పుల్లటి వాక్కాయలు లేక కలివి (కలే) కాయలను మనం కూరగాయగా వాడుకుంటాం. ఈ వాక చెట్టు మీదుగా వాకా అనే ఇంటిపేరు మాత్రమే కాక వాకపల్లి, వాకలపూడి, వాకల తిప్ప, వాకాడు (వాక + కాడు) వంటి పలు గ్రామనామాలు కూడా ఏర్పడ్డాయి. ఇక వాక అనే పదానికి ఏరు అనీ, వంక, వైపు లేక దిశగా అనీ అర్థాలున్నాయి. గాజువాక గ్రామనామం మనకు తెలిసినదే. కాచము (గాజు లేక కాజు) అంటే గాజు ఉప్పు లేక గాజు మన్ను (Silica Sand) లేక పింగాణీ మన్ను (Porcelain Clay) అని



అర్థం. పింగాణీ మన్ను లభించే ప్రాంతాలకు కాచవరం, కాజు లూరు, గాజులూరు, గాజులపల్లి, గాజులదిన్నె అనే పేర్లు వచ్చినట్లే పింగాణీ మన్ను లభించే ప్రదేశం దిశగా వెళ్లే ప్రాంతానికి గాజువాక అనే పేరు వచ్చింది. తాటి తోపు దిశగా వెళ్లే ప్రదేశాన్ని తాటివాక అన్నట్లే కొండ కొప్పు (గిరి శిఖరం) దిశగా వెళ్లే బాటను కొప్పు వాక (కొప్పాక) అన్నారు. కొప్పాక గ్రామాలు ఒకటి కంటే ఎక్కువ ఉన్నప్పుడు ఇలా కొండ కొప్పాక, ఏటికొప్పాక అంటూ వేర్వేరుగా గుర్తించారు. ఇక్కడ ఈ కొప్పాక ఏరు (వరాహ నది) సమీపంలో ఉన్నందున దీనికి ఏటి కొప్పాక అనే పేరు ఏర్పడింది. అయితే స్థానికులు మాత్రం కొప్పరాజు నారాయణ అనే పెద్దాయన పేరు మీదుగా కొప్పాక గ్రామనామం ఏర్పడి, ఏటి ఒడ్డున ఉన్నందున అదే కాలక్రమంలో ఏటి కొప్పాక అయిందని భావిస్తున్నారు.



పటికొప్పాక కుంచాలు - తప్పలు

ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమకు ఘనమైన చరిత్ర ఉంది. మొదట్నుంచీ ఇది బొమ్మలే కాక కొయ్యను తరిణ (turnery) పట్టి చేసే పలు వస్తువుల తయారీకి పేరొందింది. నేటికీ ఇక్కడి కళాకారులు కలపతో తయారుచేసే పలు అందమైన బొమ్మలేకాక లక్క పిడతలు, పిల్లలు ఆడుకునే వంట చట్లు, వివాహిత స్త్రీలకు పెళ్లి కానుకగా ఇచ్చే పసుపు, కుంకం, సాంబ్రాణి, వక్కలు మొదలైనవి వేసుకునే ఆరు లక్క భరిణెల సారె, స్టూల్ కోళ్లు (Stool Legs) వంటివన్నీ కలపను తరిణ పట్టి తయారుచేస్తారు. స్థానికుల కథనం ప్రకారం ఇక్కడ అనాదిగా నేరేడు, పనస కలపలతో చేసే కుంచాలు, అంకుడు కలపతో చేసే తప్పలనేగీ ఒకపవిడు ఆంధ్రదేశమంతా ధాన్యం కొలిచేందుకు వాడేవారట. (నాలుగు గిద్దలు ఒక సోల. రెండు సోలలు ఒక తప్ప. రెండు తప్పలు ఒక మానిక. కొన్ని ప్రాంతాలలో మానికనే ముంత అని కూడా వ్యవహరిస్తారు. నాలుగు మానికలు లేక నాలుగు ముంతలు ఒక కుంచము. ఇవి ప్రాచీన కాలంలో ధాన్యం కొలిచేందుకు వాడే కొలమానాల వివరాలు). తూర్పు చాళుక్యుల పాలనాకాలం నుంచే ఏటికొప్పాక కుంచాలు, తప్పల తయారీకి ప్రతీతి.

ఈ ప్రాంతపు చారిత్రక నేపథ్యం - విదేశాలకు ఎగుమతులు

తూర్పు చాళుక్య (వేంగి చాళుక్య) ప్రభువైన కుబ్జ విష్ణువర్ధనుడి పాలనాకాలం (క్రీ.శ .624-641)లో ఈ ప్రాంతమంతా ఆయన పాలన కింద ఉండేది. 'విషమసిద్ధి' అనే బిరుదు కలిగిన విష్ణువర్ధనుడు ఉత్తరాన నాటి విశాఖ మండలం నుంచి దక్షిణాన కమ్మనాడు వరకు గల ప్రాంతాన్ని పాలించాడు. ఒకప్పటి విశాఖ మండలంలోని చీపురుపల్లి(ప్రస్తుతం ఇది విజయనగరం జిల్లాలో ఉంది)లో లభించిన ఇతని శాసనం ఈయన పాలనాకాలం నాటి పలు విశేషాలను వివరిస్తుంది. యువాన్ చాంగ్ (హ్యూయాన్ త్సాంగ్ లేక Xuanzang క్రీ.శ. 602-664) అనే చైనీస్ యాత్రికుడు విష్ణువర్ధనుని పాలనాకాలంలోనే నాటి ఆంధ్రదేశంలో పర్యటించి తాను చూసిన పలు విశేషాలను 'Great Tang Records on the Western Regions' అనే పేరుతో తన పశ్చిమ ప్రాంతాల పర్యటన విశేషాలను గ్రంథస్థం చేశాడు. విష్ణువర్ధనుని కుమారుడు 'సర్వసిద్ధి' అనే బిరుదనామం కలిగిన జయసింహ వల్లభుడి పాలనాకాలం (క్రీ.శ. 641- 673)లో నిర్మించబడిన గ్రామమే ఇక్కడికి సమీపంలోని యస్.రాయవరం మండలంలోని సర్వసిద్ధి గ్రామం (పిన్ 531 060). వేంగి చాళుక్య ప్రభువు, 'చాళుక్య నారాయణ' బిరుదాంకితుడైన శక్తివర్మ పాలనాకాలం (క్రీ.శ. 999-1011)లో ఆగ్నేయాసియా దేశాలతో నౌకా వాణిజ్యం విస్తారంగా సాగేదనీ, సయామ్, ఆరకాన్ మొదలైన ప్రదేశాలలో 'చాళుక్య నారాయణ' పేరిట ముద్రించిన బంగారు నాణాలు లభించటమే ఇందుకు ప్రబల సాక్ష్యమని చరిత్రకారుల భావన. కుబ్జ విష్ణువర్ధనుడు తన చీపురుపల్లి శాసనంలో 'దిమిల విషయము' అనే ప్రాంతాన్ని ప్రస్తావించాడు. యల మంచిలికి నాలుగు కిలోమీటర్ల దూరంలో సముద్రతీరానికి సమీపంలో ఉన్న దివ్వెల అనే నేటి కుగ్రామమే నాటి దిమిల అనీ, ఇక్కడ సముద్రంలో వచ్చే ఓడలకు దివ్వెలు వెలిగించి మార్గం చూపే పురాతన లైట్ హౌస్‌లు (దీప స్తంభాలు) ఉండేవనీ చరిత్రకారుల నిర్ధారణ. దిమిల పక్కనే ఉన్న తెరువుపల్లెలో రత్నాకరస్వామి ఆలయం నేటికీ ఉంది. రత్నాకరుడు అంటే సముద్రుడు. ఎలాంటి ఉత్పాతాలకు లోను చేయకుండా తమ నౌకలను క్షేమంగా ఒడ్డుకు చేర్చాలని అప్పట్లో ఈ ఆలయంలో వ్యాపారులు, ప్రజలు సముద్రుడిని పూజించేవారట. సముద్రంలో ప్రయాణించే ఓడలకు తెరువు అంటే దారి చూపించటం కోసం దివ్వెలు వెలిగించిన ప్రాంతమే తెరువుపల్లె లేక దిమిల. కృష్ణాజిల్లా ఘంటసాలలోనూ ఒక జలధీశ్వర స్వామి ఆలయం ఉంది. జలధీశ్వరుడు అంటే సముద్రుడు. అయితే ఒకప్పటి సముద్రుని ఆలయం నేడు శివాలయంగా రూపొందింది. ఒకప్పుడు ఘంటసాల నౌకా వాణిజ్యానికి కేంద్రమైన గొప్ప సముద్రతీర రేవు. ఏ సునామీ కారణంగానో ఒకానొక చారిత్రక దశలో అక్కడి సముద్రం భౌగోళికంగా వెనక్కి జరిగిపోయి ఉంటుంది. ఇక ఆ సంగతి అలా ఉంచి యలమంచిలి ప్రాంతం అంతా ఒకప్పుడు నౌకా వాణిజ్యానికి కేంద్రంగా ఉండేది. ఈ ప్రాంతపు హస్తకళాకారులు (Artisans) కొయ్యతో తయారు చేసిన రథాలు, పలు పనిముట్లు, కళాకృతులు అతి ప్రాచీనకాలం నుంచే విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవనే స్థానికుల విశ్వాసానికి అలా కొంత ఆస్కారం ఉంది. తునికి సమీపంలోని గోపాలపట్నం దగ్గరున్న నెట్టికట్ట ప్రాంతం నుంచి కూడా సముద్ర వ్యాపారం ద్వారా ఎగుమతి దిగుమతులు అప్పట్లో జోరుగా సాగేవట. ఏది ఏమైనా ఈ ప్రాంతపు ప్రాచీన చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తేనేగానీ ఇక్కడి హస్తకళాకారుల కొయ్య ఉత్పాదనల ప్రాశస్త్యాన్ని గురించిన, వాటి ఎగుమతుల గురించిన మరిన్ని విశేషాలు వెలుగులోకి రావు. నేటి ఏటికొప్పాక బొమ్మలలో ఎక్కువగా కనిపించే గుంబజ్ (Gumbaj)లను బట్టి ఈ బొమ్మల పరిశ్రమ మీద బహమనీ సంస్కృతి ప్రభావం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా బహమనీ సుల్తానుల పాలనలో ఉండటమే అందుకు కారణం. మహమూద్ షా పాలనాకాలం (క్రీ.శ. 1482-1518) వరకు బహమనీ సుల్తానుల ఏలుబడిలో ఉన్న ఈ ప్రాంతం బహమనీ సామ్రాజ్యవిచ్ఛిన్నం తరువాత క్రీ.శ. 1512 నుండి క్రీ.శ. 1687 వరకు గోల్కొండ నవాబుల పాలన కిందికి వెళ్లింది. ఏటికొప్పాక ముస్లిం పాలకులచే ఆంధ్ర క్షత్రియులకు ఇవ్వబడిన ఏడు గ్రామాల మొఖాసా. చింతలపాటి వారు ఇక్కడి ఆనువంశిక మొఖాసాదారులు.

వీరు మొదట్నుంచీ ఈ కళ ఎట్టి పరిస్థితులలోనూ అంత రించి పోకూడదనే లక్ష్యంతో ఏటికొప్పాకకు దేశ విదేశాలలో ఇంతటి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ఇక్కడి బొమ్మల పరిశ్రమను పునరు ద్ధరించి, దానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారు.

నక్కపల్లి - లక్క పరిశ్రమ ప్రభావం

ఇక్కడికి సమీపంలోని నక్కపల్లి దేవుడి రథాల తయారీకి అనాదిగా ప్రసిద్ధి. ఈ గ్రామం మొదటిపేరు లక్కపల్లి అనీ ఇక్కడ దేవుడి రథాలకు వాడే లక్క తయారీ ప్రతి ఇంటా కుటీర పరిశ్రమగా విస్తరించిన కారణంగా దీనికి లక్కపల్లి అనే పేరు వచ్చిందనీ, అదే క్రమంగా నక్కపల్లి అయిందనీ స్థానికులు చెపుతున్న విషయం నాకెందుకో నమ్మశక్యంగా లేదు. ఏనుగుపాలెం, పులిపాడు, గుర్రం పాడు, ఎడ్లపల్లి, కుక్కపల్లి, గొర్రెపాడు, నక్కపాడు, నర్మెట్ట (నరి +మెట్ట - నక్క కొండ) మొదలైన గ్రామాలలాగే ఇది కూడా మొదట్లోనే నక్క అనే జంతువు పేరిట ఏర్పడిన నక్కపల్లేనని నా అభిప్రాయం. తన 'కాశీయాత్ర చరిత్ర' గ్రంథంలో ఏనుగుల వీరా స్వామయ్యగారు నక్కపల్లిలో లక్కను వినియోగించి చేసే రథ చక్రాల వంటి కలప వస్తువుల తయారీని ప్రస్తావించారట. పూరీ (ఒడిశా- ఒరిస్సా) మొదలు తమిళదేశంలోని కన్యాకుమారి వరకు నక్కపల్లిలో తయారయ్యే దేవుడి రథాలకు అప్పట్లో మంచి డిమాండ్ ఉండేదట. నక్కపల్లి పరిసరాలలో అప్పట్లో కెర్రియా లాక్కా (Kerria lacca) అనే శాస్త్రీయనామం కల సిసలైన లక్క పురుగులకు ఆశ్రయ మిచ్చే మోదుగ (Butea monosperma), రేగు (Zizyphus mauritiana), రావి (Ficus religiosa), నల్ల తుమ్మ (Acacia arabica), చండ్ర (Acacia catechu), కంది (Cajanus indicus), కుసుమ్ (బూసి లేక పొసుకు- Schleichera oleosa), కానుగ లేక గానుగ (Pongamia pinnata) వంటి మొక్కలు, వృక్షాలను విస్తారంగా పెంచుతూ వాటి నుంచి లక్క తయారీకి అవసరమైన ముడి లక్క (Sticklac)ను సేకరించేవారట.

కీ.శే. సి.వి. పద్మనాభరాజుగారు లక్క సేకరణ, వినియోగంపై విశేష పరిశోధనలు చేసి, నక్కపల్లికి చెందిన కొందరు హస్తకళాకారు లను ఏటికొప్పాకకు రప్పించి, లక్కతో కలిపిన సహజసిద్ధమైన రంగులు వేస్తూ బొమ్మలను తయారుచేసే విధానంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారట. ఈ తరహా లక్కతో కలిపిన రంగులు వేసి తయారు చేసే కొయ్య బొమ్మలు ఎంతో ప్రకాశవంతంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. వాటిని లక్క బొమ్మలు (Laquer Colour Toys) అంటారు. ప్రస్తుతం బొమ్మల తయారీ మీద ఆధారపడి జీవిస్తున్న 160 కుటుంబాలు ఈ గ్రామంలో ఉన్నాయి. అనాదిగా రథ నిర్మాణంలో పేరొందిన కంసాలి (విశ్వబ్రాహ్మణ) కులస్థులు ఈ బొమ్మల తయారీలోనూ నిపుణులుగా పేరొందారు. సంఖ్యాపరంగా వారి తరువాత ఈ గ్రామంలోని పద్మశాలీయులు ఈ బొమ్మల తయారీ కళలో నైపుణ్యం సాధించి, ఆ వృత్తిలో స్థిరపడ్డారు. ఇక షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన కొందరు కూడా అడవి నుంచి కర్ర తేవడం వంటి సహాయక కార్యక్రమాలలో ఉపాధి పొందు తున్నారు.

అంకుడు కర్ర గురించి

మన తెలుగు నేలమీద అనాదిగా నిర్మల్, కొండపల్లి, ఏటి కొప్పాక ప్రాంతాలు బొమ్మల తయారీకి పేరొందాయి. కొండపల్లి బొమ్మలను తెల్ల పునికి లేక తెల్ల పొనికి అనే మెత్తటి తేలికపాటి కర్రతో తయారుచేస్తారు. అది యూఫోర్బియేసీ (Euphorbiaceae) కుటుంబానికి చెందిన జివోటియా రాట్లేరిఫార్మిస్ (Givotia rottleriformis) అనే శాస్త్రీయ నామం కలిగిన వృక్షం. ఆ వృక్షాలు కొండపల్లి అడవులలో విస్తారంగా కనిపిస్తాయి. అయితే ఏటి కొప్పాక బొమ్మలు స్థానికంగా విరివిగా లభించే తేలికపాటి అంకుడు కర్రతో చేస్తారు. అంకుడును పలు ప్రాంతాలలో రప్పాల, పిన్నపాల అనే పేర్లతోనూ పిలుస్తారు.

ఎపోసైనేసీ (Apocynaceae) కుటుంబానికి చెందిన ఈ వృక్షాన్ని హిందీలో దూధీ అనీ, తమిళంలో పాలై అనీ అంటారు. ఈ వృక్షాలలో ఉండే పాలనుబట్టి దీనికా పేర్లు వచ్చాయి. ఈ వృక్షం శాస్త్రీయనామం రైటియా టింక్టోరియా (Wrightia tinctoria). ఈ శాస్త్రీయనామం Wright అనే శాస్త్రజ్ఞుని పేరిట ఏర్పడింది. ఈ వృక్షం పాలలో, ఆకులలో, పూలలో ఉండే 'పాల ఇండిగో' (Pala Indigo) అనే ఒక విధమైన నీలి అద్దకపు రంగు (Blue Dye) కారణంగా దీనికి టింక్టోరియా అనే పేరు ఏర్పడింది. టింక్టోరియస్ అంటే లాటిన్ భాషలో 'నీలిరంగు కలిగిన' అని అర్థం. దీని కర్ర తేలికగా, మెత్తగా ఉండే కారణంగా బొమ్మల తయారీకి, తరిణె పట్టే పనుల (Turnery)కూ ఇది చాలా అనువుగా ఉంటుంది. ఈ కర్రతో అగ్గిపెట్టెలు, అగ్గిపుల్లలు కూడా తయారుచేస్తారు. సువాసన కలిగిన ఈ చెట్టు తెల్లని నక్షత్ర ఆకారపు పూలను కొందరు కూరగా వండుకుంటారు. వీటి లేత ఆకులు, కాయలను కూడా కూర వండు కుంటారు. చిరుచేదుగా ఉండే ఈ పూలు, లేత కాయలు, లేత





ఆకులను వండబోయే ముందు ఒకటికి రెండుసార్లు బాగా నీటితో కడిగి వండుకుంటారు. అంకుడు ఆకులు వరిపొలాలకు పచ్చిరొట్ట (Green Manure) గానూ శ్రేష్ఠమైనవి. ఈ వృక్షం కాయలు వైద్యులు ఉపయోగించే స్టెతస్కోప్‌లను పోలి ఉండే కారణంగా ఆంగ్లంలో అంకుడు చెట్టుకు స్టెతస్కోప్ ట్రీ అనే పేరు కూడా వచ్చింది. విశాఖ పట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవరణ అంతా అంకుడు చెట్లు విపరీతంగా కనిపిస్తాయి.

ఈ ఏటికొప్పాక బొమ్మల తయారీ పరిశ్రమకు ఏటా సుమారుగా 65 ఘనపు మీటర్ల అంకుడు కలప అవసరమౌతుంది. ఒకప్పుడు బొమ్మల తయారీ కోసం సమీప పర్వతాలలోని అడవుల నుంచి అంకుడు కర్రను అదే ఉపాధిగా జీవించే స్థానికులు కొందరు నరికి తెచ్చేవారు. కనీసం మూడు సంవత్సరాలు పెరిగిన అంకుడు చెట్టు నుంచి రెండు అంగుళాల నుంచి పది పదిహేను అంగుళాల చుట్టుకొలత కలిగిన కలపను వీరు నరికి తెచ్చేవారు. ఆ పరిమాణంలో ఉన్న అంకుడు కర్ర బొమ్మల చెక్కడపు పనికి, తరిణె పట్టే పని (Turnery)కి అనువుగా ఉంటుంది. గతంలో ఈ అంకుడు కర్రను అడవుల నుంచి నరికి తెచ్చే శ్రామికులపై రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ అధికారులు కేసులుపెట్టి, వేధించడం ఉండేది. ఈ బొమ్మల తయారీ కార్యకలాపాల కారణంగా అంకుడు జాతి వృక్షాలు క్రమంగా అంతరించిపోయే ప్రమాదం కూడా ఏర్పడ్డది. అయితే అంతరించిపోతున్న ఈ కళను కాపాడేందుకు కళాకారుల ప్రధాన అవసరమైనట్టి అంకుడు కలపను వారికి తగినంతగా అందుబాటులో ఉండేట్లు చూడడం తమ కర్తవ్యంగా భావించిన ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏ.పి .స్టేట్ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ - APSFDC) ద్వారా 1997 నుంచి అరవై హెక్టార్ల అటవీ భూమిలో వీరి అవసరాల కోసం ప్రత్యేకంగా అంకుడు వృక్షాలను పెంచుతూ ఆ కలపను ఒక సహకార సంస్థ ద్వారా ఇక్కడి 200 మంది ఆర్టిజాన్లకు అందుబాటులో ఉండేట్లు చర్యలు తీసుకుంది. వీరు ఉత్పత్తి చేసే బొమ్మలు, ఇతర కళాకృతులు ఇక్కడి 13 షాపులలో అమ్మకానికి పెడతారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడిచే లేపాక్షి సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఒక కోఆపరేటివ్ సొసైటీ ఇక్కడి కళాకారులకు బొమ్మల తయారీకి అవసరమైన ముడిసరుకులు సరఫరా చేస్తూ, వారి ఉత్పాదనలను కొనుగోలు చేస్తుంది.

అద్భుత కళకు పునర్వైభవం

ముచ్చటైన గణేశుని బొమ్మలు, హరిదాసు, గొల్ల పడుచు బొమ్మలు, పిచ్చుకలు, బాతులు, ఫ్లెమింగోల వంటి పలు రకాల పక్షుల బొమ్మలు, రకరకాల ఫలాల బొమ్మలు, ఆకర్షణీయమైన లక్కపిడతలు, భరిణెలు, వంట చట్లు, తల్లీబిడ్డల బొమ్మలు, ట్రాక్టర్లు, సైకిళ్లు, మోటారు సైకిళ్ల వంటి బొమ్మలు ప్రకాశవంతమైన రంగులలో మెరిసిపోతూ ఏటికొప్పాక హస్తకళాకారుల ప్రతిభకూ, నైపుణ్యానికి అద్దం పడతాయి. వీరి కళానైపుణ్యానికి ఆకాశమే హద్దు. సంప్రదాయ కళకు తమ సృజనాత్మకతను జోడించి, వీరు నిత్యం తమ ప్రతిభను మెరుగుపరచుకుంటూ మరిన్ని కొత్త కొత్త కళారూపాలకు జీవం పోస్తున్నారు. ప్రస్తుతం వీరు రూపొందిస్తున్న అంశాలు 170 దాకా ఉన్నాయంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. వీరు తాము రూపొందిస్తున్న సంప్రదాయ కళాకృతులకు తోడు ఎప్పటికప్పుడు మరిన్ని ఐటం డిజైన్లు రూపొందించుకుంటూ, వాటి తయారీలో తమ ప్రతిభను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటూ ముందుకు సాగుతున్నారు. గతంలో కీ.శే. మన్నె అప్పలాచారి, జామి సత్యం వంటి ఎందరో ప్రతిభావంతులు తమవంతు కృషిచేసి, అంతరించిపోతున్న ఈ కళకు కొత్త తళుకులద్దారు. బొమ్మల తయారీకళలో జాతీయస్థాయిలో ఇందిరాగాంధీ అవార్డు వంటి ఎన్నో పురస్కారాలు కూడా పొందారు. ఎంతో ప్రాచీనకాలం నుంచి తరతరాల ప్రజలను రంజింపజేస్తూ వచ్చిన ఏటికొప్పాక బొమ్మల తయారీకళకు మహర్దశ పట్టింది 1980 నుంచి. గతంలో 1949లో జరిపిన ఒక అధ్యయనం ఆధారంగా ఈ గ్రామానికి చెందిన కీ.శే. చింతలపాటి బుచ్చి వెంకటపతిరాజుగారు ఇక్కడి హస్తకళాకారులకు ప్రత్యేకమైన శిక్షణ ఇప్పించి, వారి ప్రతిభను ఆధునిక ప్రపంచానికి పరిచయం చేశారు. ఎందరో కళాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించారాయన. కళాకారులలో అంతర్లీనంగా దాగి వున్న ప్రతిభను వెలికితీసి, వారి ప్రతిభకు తగిన గుర్తింపు తెచ్చారు.

ఏటికొప్పాక సూక్ష్మ శిల్పకళకు కూడా పేరుగాంచింది. (కేవలం 1.2 మిల్లీ మీటర్ల నిడివిగల) గసగసాల గింజ యొక్క సగభాగం మీద శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడులతో కూడిన శ్రీరామ పట్టాభిషేక దృశ్యాన్ని 2017లో చెక్కిన శ్రీశైలపు చిన్నయాచారి అనే కళాకారుడు చిన్న వయసులోనే ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టే ప్రయత్నంలో ఉండడం విశేషం. అలాగే ఆయన 'గుడ్డులో గుడ్డు' అనే కళాకృతిలో ఒక గుడ్డులో మరొకటిగా మొత్తం 30 కొయ్య గుడ్లను అమర్చి జాతీయస్థాయిలో బొమ్మల తయారీకిగాను ఇచ్చే కమల అవార్డును స్వంతం చేసుకోవటం మరో విశేషం.

ఈ సందర్భంగా ప్రస్తుతం ఈ కళను కాపాడి అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీ చింతలపాటి వెంకటపతిరాజు

కృషిని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఏటికొప్పాక మొఖాసా దారుల కుటుంబానికి చెందిన సి.వి. రాజు తన తాతతండ్రుల బాటలోనే పయనిస్తూ ఈ అద్భుత కళను అంతరించిపోకుండా కాపాడే కృషిని మరింత ముందుకు తీసుకెళ్లడమేకాక, పర్యావరణానికి హితకరమైన సహజసిద్ధమైన రంగుల వాడకాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చే కృషి చేస్తుండటం విశేషం.

ఈయన తన 17వ ఏట ఈ బొమ్మల తయారీరంగంలో ప్రవేశించి శిక్షణ పొందారు. ఈ రంగంలో పనిచేసే కళాకారుల కృషికి తగిన గుర్తింపు, ప్రతిభకు తగిన ప్రతిఫలం వారికి దక్కాలంటే ఏమి చెయ్యాలో నవ్యరీతులలో ఆలోచించారీయన. కొత్త ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో తరచు జరిగే అంతర్జాతీయ కళాకృతుల ప్రదర్శనలలో ఏటికొప్పాక బొమ్మలను తప్పక ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తూ, ఈ కళకు అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు తెచ్చారు. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, క్రాఫ్ట్ కౌన్సిల్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్‌లతో సంపర్కం పెట్టుకుని ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ మార్కెట్ ఏర్పడాలంటే ఏమి చెయ్యాలో, అందుకు నేడున్న అవరోధాలు ఏమిటో కూడా తెలుసుకున్నారు. విషపూరితాలైన కృత్రిమ వర్ణాల స్థానంలో ప్రకృతిసిద్ధమైన, వృక్షోత్పాదనలైన రంగులు వాడితేనే అమెరికా, ఐరోపా దేశాలు తమ బొమ్మలను దిగుమతి చేసుకుంటాయనే వాస్తవాన్ని ఈయన గ్రహించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్లలో పాల్గొని వస్త్రాలపై, బొమ్మలపై ప్రాకృతిక వర్ణాలను వినియోగిస్తే కలిగే ఫలితాలపై పరిశోధనలు చేశారు. వృక్షాల ఆకులు, పూలు, కాయలు, విత్తనాలు, కాండం బెరడు, వేళ్లు వంటి వాటి నుంచి 12 రకాల సహజసిద్ధమైన రంగులను రూపొందించారు. నిరపాయకరమైన (టాక్సిక్ ఎలిమెంట్ లేని) ఈ ప్రాకృతిక వర్ణాల వాడకంతో పలు దేశాలకు ఏటికొప్పాక బొమ్మల ఎగుమతులకు అవకాశాలు మెరుగయ్యాయి. ఆ కారణంగానే ప్రస్తుతం ఏటికొప్పాక బొమ్మలు అంతర్జాతీయ మార్కెట్లలో చైనీస్ బొమ్మలతో పోటీపడగలిగే స్థాయికి క్రమంగా చేరుకుంటున్నాయి. ముంబాయిలోని ఛత్రపతి శివాజీ వస్తు సంగ్రహాలయ (ఒకప్పటి ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియం)లోనూ, జహాంగీర్ ఆర్ట్ గ్యాలరీలోని ప్రదర్శితాంశాలలోనూ ఇవాళ ఏటికొప్పాక బొమ్మలు చోటుచేసుకున్నాయంటే అందుకు ప్రధానంగా వీటి ప్రాచుర్యానికి చింతలపాటి వేంకటపతి రాజుగారు చేస్తున్న కృషే కారణం.

ముగింపు

మేము ఏటికొప్పాక వెళ్లగానే శ్రీ శ్రీశైలపు చిన్నయాచారి వర్క్ షాప్‌ని చూశాము. అక్కడ కొన్ని ఫోటోలు తీసుకుని, ఆయనతో ఓ అరగంట సంభాషించాను నేను. ఆయన, ' ఈ హస్తకళ చరిత్ర గురించి తెలుసుకోవాలంటే మీరు వేంకటపతిరాజుగారిని తప్పక కలుసుకోవాలి. అయితే రాజుగారు ప్రస్తుతం ఊళ్లో లేరు. తరువాత ఆయనకి ఫోన్ చేసి ఇంటర్వ్యూ చెయ్యండి. ఇదిగో ఇది ఆయన ఫోన్ నంబర్ అంటూ 97010 57267 అనే నంబర్ ఇచ్చారు. అక్కడ కొన్ని కొనుగోళ్లు చేసి మేము బయలుదేరి సాయంత్రానికి తెనాలి వచ్చేశాము. ఆ తరువాత ఒకరోజు నేను రాజుగారితో ఫోన్‌లోనే సుమారు గంటన్నరపాటు ముఖాముఖి చేశాను. తాను ఈ బొమ్మల తయారీలో ప్రమాదకరమైన టైటానియం డయాక్సయిడ్‌తో కూడిన సంశ్లేషిత వర్ణాల (Synthetic Colours) స్థానంలో నిరపాయకరమైన సహజసిద్ధమైన, వృక్షోత్పాదిత వర్ణాల (Vegetable Colours) వినియోగించే పద్ధతు లపై ఉత్తర్‌ప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో పరిశోధనలు కొనసాగించ నున్నట్లు ఆయన నాకు తెలిపారు. నేను ఆయనకి శుభాకాంక్షలు తెలిపి, బరివెంక లేక బటింక అనే పేరుతో పిలిచే వృక్షం ఆకులు బాగా గరుకుగా ఉండి బొమ్మలను నున్నగా పాలిష్ చేసేందుకు పనికివస్తాయనీ, ఆ ఆకుల్ని Sand Paper Leaves అంటారనీ తెలిపి, దాని శాస్త్రీయ నామం Streblus asper అని కూడా తెలిపి, ఏటికొప్పాకలో ఆ వృక్షాలను పెంచుకుంటే బాగుంటుందని సూచించాను.

ప్రోత్సాహం కరవై అంతరించిపోయే దశకు చేరుకున్న మన తెలుగువారి ఈ అద్భుత హస్తకళను కాపాడుకుందాం. కళాకారుల కృషికి తగిన ప్రతిఫలం, గుర్తింపు రావాలని అందరం మనసారా కోరుకుందాం.



ముత్తేవి రవీంద్రనాథ్ రచయిత, పరిశోధకుడు, వ్యాసకర్త. కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా రిటైరయ్యి, తెనాలిలో నివసించే వీరు ఫేస్‌బుక్ ద్వారా వందలాది వ్యాసాలు రాసారు. 'తెనాలి రామకృష్ణకవి-శాస్త్రీయ పరిశీలన' పై విస్తృత పరిశోధనా గ్రంధం రాసారు. ఇది మూడుసార్లు పునర్ముద్రణ పొందింది. వీరి యాత్రాకథనాలు 'మా కాశ్మీర్ యాత్ర', 'మా కేరళ యాత్ర' కూడా ప్రాచుర్యం పొందిన గ్రంధాలు. మనుస్మృతి పై విస్తృత పరిశోధన చేసి 'మనుస్మృతి-సమగ్ర శాస్త్రీయ వ్యాఖ్య' గ్రంధాన్ని వెలువరించారు. ఇవికాక ఇలియట్‌ని అనువాదం చేసారు.

❖ మనసు పైన మనసు పడ్డ ఆత్రేయ ❖

డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

తెలుగు సినీ పాటల రచయిత, పద్యకవి, నాటక రచయిత ఆచార్య ఆత్రేయ తెలుగువారి గుండెల్లో 'మనసు కవి' గా చెరగని ముద్రవేశారు. ఆత్రేయ రాసినన్ని మనసు పాటలు ప్రపంచ వ్యాప్తంగా ఏ ఇతర కవి రాయలేదంటే అతిశయోక్తి కాదేమో! ఆయన మొత్తం రాసిన 1600కు పైగా సినిమా పాటల్లో, దాదాపు వందకు పైగా 'మనసు'కు సంబంధించినవే! మంచిమనసులు, మూగ మనసులు, తేనెమనసులు, కన్నెమనసులు, పాలమనసులు మొదలైన 'మనసులు' చివర వున్న పదాలు గల పలు సినిమాలకు పాటలు రాసిన ఆత్రేయ తనను తాను 'హార్ట్ స్పెషలిస్ట్' (ఆయన ఉద్దేశంలో మనసనేది గుండెలోనే దాగి ఉందన్నట్లు)గా చమత్కరించుకునేవారు.

మనసు పైన ఇన్ని పాటలు ఎందుకు రాశారు అని ఆత్రేయను అడిగితే, 'మనసు పైన మనసు పడ్డాను నాయనా,' అని చమత్కరించేవారు. అయితే అందుకు ముఖ్యమైన కారణం ఆయన జీవిత నేపథ్యమేనని ఆయన ఆత్మకథ చదివితే అర్థమవు తుంది. 1951 నుండి 1989 వరకు నాలుగు దశాబ్దాల పాటు సాగిన ఆయన సినీ పాటల ప్రస్థానంలో ఆత్రేయ 1600 పైగా పాటలు రాశారు. అందులో కేవలం 'మనసు'కు సంబంధించినవి సుమారు 100కి పైగానే. ఇవి కూడా 1964 నుండి 1979 వరకు 15 సంవత్సరాల కాలంలోనే ఎక్కువగా రాశారు.

వైద్యుడు కాని వైద్యుడు ఆత్రేయ: మాలాంటి మానసిక వైద్యులు మాకున్న శిక్షణ, డిగ్రీల అనుభవంతో మానసిక సమస్యలతో బాధపడుతూ మా దగ్గరకు వచ్చేవారికి తగిన మందులు, సలహాలు, కౌన్సెలింగ్ చేసి వారికి స్వస్థత చేకూర్చు తాము. కానీ ఏ శిక్షణ, డిగ్రీలు, లేని ఆత్రేయ కేవలం తన మనోనేత్రంతో, మనుషుల మనస్తత్వాలను, బాధలను వారి అంతరంగంలోకి చొచ్చుకుపోయి, శోధించి, మధించి, ఆ బాధలను అక్షరబద్ధం చేసి ఎందరికో స్వస్థత చేకూర్చారు. అందుకే ఆయన్ను 'మానసిక కవితా వైద్యుడు' అని కూడా అనొచ్చు. ఆత్రేయ మనసు పాటలు అంతగా ప్రాచుర్యం పొందడానికి ముఖ్య కారణం వాటిల్లోని వాస్తవికత, వైవిధ్యం, పొదుపైన పదాల పొందికనే చెప్పాలి. మనసును విశ్లేషించేవి కొన్ని అయితే, మనసున్న మనిషి పడే సంఘర్షణకు అద్దంపట్టేవి మరికొన్ని, మనసుకు ఓదార్పు కల్గించేవి, మనసిచ్చిన మనసు లేని దేవుడిని నిలదీసి ప్రశ్నించేవి, వేదాంత ధోరణిలో ఉపశమనం కల్గించేవి ఇంకా కొన్ని.

సమయానికి పాటలు రాసివ్వక నిర్మాతలను రాసిన పాటలు వింటూ ప్రేక్షకులను ఏడిపిస్తారనే అపవాదున్న ఆత్రేయను, ఆ విషయం అడిగినప్పుడూ, రాస్తూ... రాస్తూ..... నేనెంత ఏడుస్తానో మీకు తెలుసా? అని ఎంతో బాధతో అనేవారు. ఆయన వ్యక్తిగత, వైవాహిక జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఆత్రేయను ఎంతో మనోవ్యధకు గురిచేశాయని, ఆ సంఘర్షణలోంచి పుట్టుకొచ్చినవే ఇన్ని మనసు పాటలని ఆయన్ను దగ్గర్నుంచి చూసిన వారు చెప్పడం జరిగింది. ఆయన తన డైరీలో ఒకచోట రాసుకున్న పంక్తుల్లో ఆయన మానసిక సంఘర్షణను ఇలా వ్యక్తం చేసాడు.

నన్ను నన్నుగ ప్రేమించి నాకు గాను
ఒక్క నిట్టూర్పు విడుచువారే దక్కలేదు.
మనసు కొరకు ప్రేమించెడి మనషి కొరకు
తుదివరకు నీకు నేను తోడు కొరకు

పాటలతోనే విజయవంతమైన సినిమాలు

మూగమనసులు (1964) సినిమాలో దాదాపు అన్ని మనసు పాటలే! మనసు ప్రశాంతతకు నిద్ర చాలా అవసరమని, మంచి నిద్రలో తీపి కలలు కూడా వస్తాయని, ఆ కలలే మనకు చివరకు మిగిలే కలిమి అంటాడు ఆత్రేయ

కునుకు పడితే మనసు కాస్త కుదుటపడతది
కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది
కలలె మనకు మిగిలిపోవు కలిమి సివరకూ
ఆ కలిమి కూడా దోచుకునే దొరలు ఎందుకూ

అలాగే ఆత్రేయ పాటలతో విజయవంతమైన **ప్రేమ్‌నగర్** (1971)లో ప్రేమికురాలు దూరమైనపుడు తాగుడుకు బానిసైన హీరో మనసున్న మనిషికి సుఖం లేదంటాడు.

తాగితే మరచి పోగలను - తాగనివ్వదు
మరచిపోతే తాగ గలను-
మరువ నివ్వదు
మనసు గతి యింతే, మనిషి బ్రతుకింతే
మనసున్న మనిషికి సుఖము లేదంతే
అంతా మట్టేనని తెలుసు
అదీ ఒక మాయేనని తెలుసు
తెలసీ వలచి విలపించుటలో
తీయదనం ఎవరికి తెలుసు
మనిషికి మనసే తీరనిశిక్ష,
దేవుడిలా తీర్చుకున్నాడు కక్ష



వలపు విఫలమై విలపించుటల్లో తీయని బాధ గురించి భావ కవి బసవరాజు అప్పారావు చెప్పిన ప్రేమతత్వాన్ని ఈ పాటలో ఆత్రేయ చెప్పడం గమనార్హం.

ఆత్రేయ భావుకుడనేందుకు మరొక చక్కటి ఉదాహరణ మూగమనసులు చిత్రంలోని

నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి
ఏ కన్నీటినకాల ఏముందో తెల్సునా అంటాడు.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, సి. నారాయణరెడ్డిగారు ఓ సందర్భములో ఈ రెండు పంక్తులు గురించి చెబుతూ, ఇవి ఇరవై కావ్యాలకు సమానం అని ప్రశంసించారు.

ఆత్రేయ- భగ్నప్రేమికులు

యద్దనపూడి సులోచనారాణి నవల ఆధారంగా తీసిన సెక్రటరీ (1977) చిత్రంలో భగ్న ప్రేమికుడైన హీరో మనోవేదనలో పాడిన గీతం.

మనసు లేని బ్రతుకొక నరకం, మరువలేని మనసొక నరకం
మనిషి కెక్కడ ఉన్నది స్వర్గం, మరణమేనా దానికి మార్గం

అలాగే ప్రేమలు-పెళ్లిళ్లు (1974) చిత్రంలో, భార్యాభర్తలు విడిపోయిన తర్వాత పాడే ఈ పాట.

మనసు లేని దేవుడు మనిషి కెందుకో మనసిచ్చాడు.
ఆ మనసు మనసును వంచన చేస్తే
కనుల కెందుకో నీరిచ్చాడు

అలాగే, అభినందన (1988) చిత్రంలో

ప్రేమ ఎంత మధురం - ప్రియురాలు ఎంత కఠినం
చేసినాను ప్రేమక్షీర సాగర మథనం
మింగినాను హలాహలం

ఆత్రేయ రాసిన మరొక మరచిపోలేని పాట మురళీకృష్ణ (1964) లోనిది. అనుమానంతో విడిపోయిన తర్వాత, హీరో తన నాయికను సముదాయించి, తన నుండి ఆమె వేరైనా సుఖంగా ఉంటే చాలని పాడే అందరి మనసులను కదిలించే ఈ పాట.

ఎక్కడ ఉన్నా ఏమైనా, మనమెవరికి వారై వేరైనా
నీ సుఖమే నే కోరుతున్నా, నినువీడి అందుకే వెళుతున్నా

అంటూనే ఆత్రేయ ఈ పాటలో చివరగా మనసుకు స్వాంతన కల్గించే అద్భుతమైన వాక్యాలు రాశాడు.

అనుకున్నామని జరుగవు అన్నీ-
అనుకోలేదని ఆగవు కొన్ని
జరిగేవన్నీ మంచికని అనుకోవడమే
మనిషి పని

మాలాంటి సైకియాట్రిస్టులు కూడా జీవితంలో ఎన్నో వైఫల్యా లతో మా దగ్గరకు వచ్చేవారికి ధైర్యం నింపేందుకు ఆత్రేయ పైన చెప్పిన వాక్యాలు వాడుతామంటే అతిశయోక్తి కాదు.!

మనసు గాయం మానదు: శరీరానికి దెబ్బ తగిలితే త్వరగా మానుతుంది, కానీ మనసుకు గాయమైతే ఎన్నటికీ మానదంటాడు ఆత్రేయ. ఆడ బ్రతుకు (1965) చిత్రంలో.

తనువు కెన్ని గాయాలైగా మానిపోవు నేలాగైనా
మనసు కొక్క గాయమైనా మాసిపోదు చితిలోనైనా
ఈ పాటలోనే మరొక్క అడుగు ముందుకు వేసి
ఆడవారు ఆదుకునే ఆట బొమ్మ ఈ మగవాడు
ఆడుకున్నా ఫర్వాలేదు పగులగొట్టి పోతారెందుకో

అంటూ తన మనసులోని స్త్రీ ద్వేషాన్ని బహిర్గతం చేశాడేమో ఆత్రేయ అనిపిస్తుంది.

ప్రేమ్‌నగర్ చిత్రంలో ఇలాంటి పాటే ఒకటి రాశారు.

ఒకరికిస్తే తిరిగిరాదు ఓడిపోతే మరచిపోదు
గాయమైతే మాసిపోదు, పగిలిపోతే అతుకుపడదు

ఆత్రేయ ఒక మేరేజ్ కౌన్సిలర్

మనసు మూగదంటాడు ఆత్రేయ. కానీ దానిక్కూడా ఒక భాష ఉంది. అయితే ఆ భాషను అర్థం చేసుకోవటానికి అవతలి మనసుకు కూడా ఒక 'మనసుండాలి' అప్పుడే అది విన్పిస్తుందంటాడు. 1964లో వచ్చిన మూగమనసులు చిత్రంలో.

మనసు మూగదేకాని బాసుండది దానికి
చెవులుండే మనసుకే ఇనిపిస్తుందా ఇది

అంటూనే, కొత్తగా పెళ్లయిన భార్యాభర్తలకు కౌన్సిలింగ్ లాగా చేస్తూ, ఆత్రేయ ఒక 'మెరైటల్ థెరపిస్ట్' (Marital Therapist) అని కూడా అనిపిస్తారు.

ఎదమీద ఎదపెట్టి సాదలన్నీ ఇనుకో
ఇనుకొని బతుకునూ ఇంపుగా దిద్దుకో

అంటాడు.

ఆత్రేయ ఒక వేదాంతి, తత్వవేత్త. మనసే మందిరం (1966) చిత్రంలో-

తలచినదే జరిగినదా, దైవం ఎందులకు
జరిగినదే తలచితివా, శాంతిలేదు నీకూ

ఆయన వేదాంత ధోరణి ఒక్కోసారి 'వేమన'ను కూడా మరిపిస్తుంది.

ఈ జీవన తరంగాలలో, ఆ దేవుని చదరంగంలో
ఎవరికి ఎవరూ సొంతమో, ఎంతవరకీ బంధమూ
కడుపు చింకుకు పుట్టిందొకరు, కాటికి నిన్ను మోసేదొకరు
తలకు కొరివి పెట్టేదొకరు, ఆపై నీతో వచ్చేదెవరు
జీవన తరంగాలు-1973

దేవుడితో వైరం

ఆత్రేయ మొదట్లో హేతువాది, ప్రజానాట్యమండలితో కలిసి పనిచేశాడు. కానీ జీవిత చరమాంకంలో ఆధ్యాత్మికం వైపు మొగ్గు చూపాడు. అవకాశమొచ్చినప్పుడల్లా దేవుడ్ని విమర్శిస్తూనే, ప్రశ్నిస్తూనే ఉన్నాడు. నాస్తిక భావాలున్న ఆత్రేయ వెంకటేశ్వర మహాత్మ్యం చిత్రంలో ఎన్నో భక్తిరసాత్మక మైన పాటలు రాశాడు. కమ్యూనిస్టు భావాలు మెండుగా కల్గిన మరోకవి శ్రీశ్రీ కూడా ఎన్నో భక్తిగీతాలు రాశారు. మనిషి నమ్మకాలకు, సిద్ధాంతాలకు, వారి రచనలకు, వృత్తికి సంబంధముండాల్సిన అవసరం లేదనేది దీన్నిబట్టి అర్థమవుతుంది.

భక్త తుకారం (1973) చిత్రంలో

ఉన్నావా- అసలున్నావా ఉంటే కళ్లు మూసుకున్నావా
ఈ లోకం కుళ్లు చూడకున్నావా

అలాగే శభాష్ సూరి (1964) సినిమాలో

"దేవుడికేం హాయిగా ఉన్నాడు. ఈ మానవుడే బాధలు పడుతున్నాడు,' అంటాడు.

ప్రేమనగర్‌లో మనిషికి మనసే తీరని శిక్ష - దేవుడిలా తీర్చుకున్నాడు కక్ష అంటూ దేవుడిని సూటిగా విమర్శిస్తాడు.

దాగుడుమూతలు (1968) చిత్రంలో-

దేవుడనే వాడున్నాడా అని మనిషికి కల్గెను సందేహం
మానవుడనేవాడున్నాడా అని దేవుడికొచ్చెను అనుమానం
బుద్ధికి హృదయం లేక, హృదయానికి బుద్ధిరాక
నరుడే ఈ లోకం నరకం చేశాడు

అంటూ మానవుడి కష్టాలకు మనిషే బాధ్యుడు తప్ప, దేవుడ్ని నిందించడం సరికాదంటాడు, ఈ పాటలో!

మనిషికోపిచ్చి

వేపకాయంత వెర్రి అందరికి ఉంటుందని మన సామెత. మానసిక వైద్యశాస్త్రం ప్రకారం ప్రతి మనిషికి ఏవో కొన్ని బల హీనతలు, లోపాలుంటాయి, ఈ లోకంలో ఎవరూ నూటికి నూరు శాతం 'పర్‌ఫెక్ట్' కాదు. తీవ్రమైన 'పిచ్చి' (ఉన్మాదం) లేకపోయినా డబ్బు పిచ్చో, పదవి పిచ్చో, మదపిచ్చో, తాగుడు పిచ్చో, వాగుడు పిచ్చో- ఇలా ఒక్కొక్కరికి ఒక్కో పిచ్చి ఉండవచ్చు. అందుకే ఎవరి పిచ్చి వారికానందం అంటారు. నాకే పిచ్చి లేదని ఎవరైనా భావిస్తే, అతనికి నిజంగా పిచ్చి ఉన్నట్టే! అంటాడు ఆత్రేయ. పండంటి సంసారం (1975)లో. అంతేకాదు మంచితనాన్ని మించిన పిచ్చి కూడా లేదంటాడు.

పిచ్చి పిచ్చి పిచ్చి రక రకాల పిచ్చి
ఏ పిచ్చి లేదనుకుంటే అదే పెద్ద పిచ్చి
మనసుంటేనే పిచ్చి, మతి ఉంటేనే పిచ్చి
మంచితనం అన్నింటికీ మించిని పిచ్చి

ఆత్రేయ పాటలే కాదు మాటలు కూడా తూటాలే

ఆత్రేయ మాటల మాంత్రికుడు కూడా! మనసుల్ని కదిలించి కన్నీళ్లు తెప్పించే ఆయన రాసిన మాటలు మచ్చుకు కొన్ని.

కన్నీళ్లే మనిషిని బ్రతికించగల్గితే, అవికూడా అమృతంలాగే కరువయ్యేవి అంటాడు, వెలుగు నీడలు సినిమాలో. బతకడం ఏముంది, బాగా ఎవరైనా బతుకుతారు, బాగా చావాలి! అదే గొప్ప.

నేను నాటకాన్ని ప్రేమించాను - సినిమాను పెళ్లాడాను. నా బ్రతుకింతే! నాటకాన్ని మరువలేను, సినిమాను విడువలేను. బ్రాందీ, విస్కీ, రమ్, జిన్- రకరకాల మధువులు, తల్లీపిల్లలు, భార్యా భర్తలు పలు రకాల బంధాలు ఏదైనా నిషా తగ్గేవరకే! ఎవరైనా ఋణం తీరేవరకే ఆపై మిగిలేదేముంది- ఖాళీసీసాలు, కాలిన బూడిద,

ఎవర్నీ ప్రేమించనంత వరకు హృదయం చాలా విశాలంగా ఉంటుంది. ఒకరికి ఇచ్చిన తర్వాత అది చాలా ఇరుకైపోతుంది.

స్కూలు కెళ్లాల్సిన వయసు అయిపోయింది-గుడి కెళ్లాల్సిన పాపాలు నేను చేయలేదు

డ్రింక్ బాటిల్స్‌ను పగులగొడితే మళ్లీ కొత్తవి కొనగలం కానీ, హృదయం ఒకసారి పగిలిపోతే, కొనడం కష్టం.

తెలుగు సాహితీ ఫ్రాయిడ్

ఇలా చెప్పుకుపోతే ఆత్రేయ మనకందించిన మనసు పాటలు ఎన్నెన్నో. మనసు మర్మాన్ని చేధించి, శోధించి మనసు రహస్యాలను ఆధునిక మానసిక వైద్యశాస్త్రానికి అందించిన మహానీయుడు, 'సిగ్మండ్ ఫ్రాయిడ్.' మనసంటే ఇలా ఉంటుంది అని తెలుగు జాతికి హృద్యంగా విప్పి చెప్పిన ఆత్రేయను 'తెలుగు సాహితీ ఫ్రాయిడ్' అనొచ్చు. ఆత్రేయ అనుభవించిన వ్యక్తిగత జీవితమే, ఆయన పాటల్లో, మాటల్లోనూ కనపడ్తుందని చెప్పవచ్చు.

మహాకవి జాషువా చెప్పినట్లు, "రాజు జీవించే రాతి విగ్రహముల యందు, కవి జీవించు ప్రజల నాలుకల యందు."

ఆత్రేయ కూడా తెలుగు వారి మనసుల్లో ఎన్నటికి చిరంజీవి గానే మిగిలిపోతాడు.



ఇండ్ల రామసుబ్బారెడ్డి ప్రముఖ మానసిక వైద్యనిపుణులు. సైకాలజీ మీద వ్యాసాలు రాసారు. అనేక పుస్తకాలు ప్రచురించారు. సాహిత్యం, సినిమాలు ఆసక్తికర విషయాలు. అందులో భాగంగానే అప్పుడప్పుడు సాహిత్య వ్యాసాలు రాస్తారు. నివాసం విజయవాడ.

❖ కొత్త తెలంగాణ చరిత్ర బృందం - పరిశీలనలు, పరిశోధనలు ❖

శ్రీరామోజు హరగోపాల్

తెలంగాణ చరిత్ర మరుగున పడ్డది. కొందరి మరుపున పడ్డది. ఎవరిని నిందించే పనిలేదు. కాని, తెలంగాణ చరిత్ర నిర్లక్ష్యం చేయబడ్డది. ఉపేక్ష వహించిన బాధ్యుల కారణంగా చాలా ఆలస్యంగా తెలంగాణ చరిత్ర వెలుగులోనికి వచ్చింది. భారత దేశంలోని ఏ ప్రాంతానికి తీసిపోని అపురూప మానవవికాసాభ్యుదయాలను తెలంగాణలో చూడవచ్చు. ఎన్నో నిదర్శనాలున్నాయి. పురావస్తుశాఖ తవ్వకాలలో బయటపడ్డ చారిత్రకాంశాలు విశేషమైనవి. కాని, చాలా చోట్ల ఈ తవ్వకాలు అసంపూర్ణంగా ముగిసిపోయాయి. తవ్విన చోట్ల నివేదికలు బయటికి రాలేదు. ఆరడుగుల లోతు తవ్వుకుంటు వెళ్లిన వారికి మరో రెండడుగుల లోతుకు వెళ్లే ఆలోచనలు లేవు. ఇంకా చరిత్ర మట్టిలో కప్పబడే వుంది.

ఎంతోమంది Pride of History కోరుకోవచ్చు. కాని, దానిని Proud of Historyగా తమదని చెప్పుకునే ఒరవడిలో ఇతర చరిత్ర పట్ల ఉదాసీనత చూపడమో, దాచేయడమో తగని పని. చరిత్ర కూడా 'దాచేస్తే దాగని సత్యం'. తెలంగాణలో ఎక్కడైనా వంగి పిడికెడు మట్టిని ముట్టుకుంటే చరిత్ర చెప్తుంది అన్నాడు గజపతిరాయవర్మ అనే చరిత్రకారుడు, 'నరవరులు' అనే పత్రికను నడిపిన రచయిత.

తెలంగాణ చరిత్ర పునరన్వేషణ కొరకు తెలంగాణపట్ల ప్రేమ, మమకారాలున్న ఔత్సాహికులు, చరిత్రకారులు సంఘటితమై నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ కొత్త తెలంగాణ చరిత్ర బృందం. ఇద్దరితో మొదలై శతాధిక సహచరులతో తెలంగాణ చరిత్రను కొత్తగా అన్వేషిస్తున్నది. సంవత్సరాల తరబడి సాగుతున్న ఈ అన్వేషణలో ఎన్నెన్నో కొత్త చారిత్రక విశేషాలను గుర్తించింది. ఎప్పటికప్పుడు అందరికి తెలిసేలా నివేదికలను రచిస్తున్నది. సోషల్ మీడియా మాధ్యమంగా, బ్లాగ్, వెబ్ సైట్లలో బృందం చేసిన Explorations పొందుపరుస్తూ వస్తున్నది.

గడిచిన ఇరవై యేండ్లలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం చేసిన అన్వేషణలు, పరిశోధనల్ని మూల్యాంకనం చేయడం సులభం కాదు. వందలాది ప్రదేశాలు, వంద రాతిచిత్రాల తావులు, వేలాది పెదరాతియుగం సమాధులు, వేలాది పురావస్తువులు, రాతి పనిముట్లు, నాణాలు, ఆలయాలు, ప్రతిమలు, శాసనాలు, పరిశోధనాంశాలు, సమావేశాలు, సమాలోచనలు... తెలంగాణ చరిత్రలో ఖాళీలు పూరించే సాధనలు... దండ కట్టివ్వడం సాధ్యం కాదు త్వరగా. అయినా చరిత్ర రాయాలి.

కొత్త తెలంగాణ చరిత్ర బృందం చేసిన పరిశీలనలు పరిశోధనలను చరిత్రలోని దశల ఆధారంగా, విషయంవారీగా సంక్షిప్తంగా తెలిపే ప్రయత్నమిది.

చరిత్రపూర్వయుగం

గుహలు

కొత్త తెలంగాణ చరిత్ర బృందం కొమరంభీం జిల్లాలో కొత్తగా కపిలాయి గుహల్ని, ములుగుజిల్లాలో నల్లగుట్టలు/మైలారం గుహల్ని గుర్తించింది. నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని గాజుబేడం గుహల్ని పరిశీలించింది.



ఖమ్మం జిల్లా నీలాద్రి రాతిచిత్రాలు

కాలమ్నార్ బసాల్ట్స్

రాష్ట్రంలో తొలిసారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరున్నర కోట్ల సంవత్సరాల వయస్సున్న 'లావాస్తంభాల సముదాయాల్ని' పది దాక గుర్తించింది.

శిలాజాలు

మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సమ్మక్కగా పూజించ బడుతున్న జంతు ఉరఃపంజరం శిలాజం, శిశు అస్థిపంజర శిలాజాలు, వేమనపల్లిలో డైనసార్లు, వృక్షాలు, ఆకులు, చేపల శిలాజాలను గుర్తించింది.

కొమరంభీం జిల్లాలో నత్తగుల్లల జిలాజాలు, కొండపల్లిలో, భూపతిపూర్, అక్షరాలలొద్దిలో, ఖమ్మంలో వృక్షశిలాజాలు గుర్తించింది బృందం.

రాతిపనిముట్లు

అన్ని జిల్లాలలో చరిత్రపూర్వయుగ మానవావాసాలలో పాత రాతియుగం, మధ్యరాతియుగం, కొత్తరాతియుగం పనిముట్లను సేకరించడమైనది. వీటిలో రాతిగొడ్డండ్లు, క్లీవర్లు, స్క్రాపర్లు, చక్రాలు, సూక్ష్మరాతిపనిముట్లు, బ్లేడ్లు, బోరర్లు, వడిసెలరాళ్లు వంటివి వున్నాయి.


రత్నాపూర్, హస్తలాపూర్, గుండ్లపోచంపల్లి, నీలాద్రి, ఒంటి గుండు వంటి రాతిచిత్రాల తావులలో మధ్యరాతి యుగాల మైక్రోలిథ్స్ లభ్యం.

రాతిచిత్రాలు

పురావస్తుశాఖ 18 చిత్రిత శిలాశ్రయాలను గుర్తించింది. రాతిచిత్రాల అన్వేషకులైన మిత్రులు గుర్తించినవి మరో 18. కొత్త తెలంగాణ చరిత్ర బృందం అన్వేషించింది 36 చిత్రిత శిలాశ్రయాల కన్నా ఎక్కువే.

పత్రసమర్పణలు

రాతిచిత్రాలను తావులవారీగా విశ్లేషించి ప్రకటించడమే కాకుండా, రాతిచిత్రాలను గీయడంలో వాడే పదార్థాలను గుర్తించడానికి రామన్ స్పెక్ట్రామీటర్‌ను మొదటిసారిగా వాడింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం. రాతిచిత్రాలను గీయడానికి ఇనుప ఖనిజమైన హెమటైట్ వాడినట్లు గుర్తించి, పూనాలో రాశి జాతీయ రాతిచిత్రాల సదస్సులో పత్రసమర్పణ చేయడమైనది. తెలంగాణా రాతిచిత్రాలలో నెమళ్లు, తెలంగాణా రాతిచిత్రాలలో అమ్మ దేవతలు, లిపుల గుర్తింపు. రాతిచిత్రాలలో అంతర చిత్రాల చిత్రణ. రాతిచిత్రాలలో పెద్దపులులు, ఏనుగులు, అడివిదున్నలు, ఇట్టులు, సంభోగచిత్రాలు, మూపురపుటెద్దులు, యుద్ధరంగంలో రథాలు, ఎద్దులబండి, తేళ్లు, స్వస్తిక్, చేపలు, వేటగాళ్లు, ఆయుధాలు... రాతిచిత్రాల తావులను తులనాత్మకంగా పరిశోధించింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం.



గాజుపూసలు, నల్లపూసలు, గొట్టాలు - కొండపాక, సిద్దిపేట

పూర్వచారిత్రక యుగం

మెగాలిథ్స్

రాయగిరి నుంచి తెలంగాణాలోని అన్ని జిల్లాలలో పెదరాతియుగపు సమాధుల గుర్తింపు, పరిశీలన.

నల్లగొండ జిల్లా ఎర్రగడ్డలగూడెంలో అతిపెద్ద, 72 అడుగుల వ్యాసమున్న బంతిరాళ్ల సమాధి గుర్తించింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం.

భద్రాచలం ప్రాంతంలో మెగాలిథ్స్ కొరియాలోని మెగాలిథ్స్ రికార్డుని మించిపోతాయన్నది సత్యం.

జగదేవ్‌పూర్ పెద్ద సమాధి, నర్మెట, పాలమాకుల మెగాలిథ్స్, మెన్హర్లు, కంతలతో పెట్టె సమాధులు, సిస్టులు, కైరన్లు, డోల్మన్లు, డోల్మనాయిడ్స్...సిద్దిపేట జిల్లా ప్రాంతంలో విస్తరించిన మెగాలిథ్స్ గాథ ఇరాక్ ప్రాక్చరిత్రతో పోలివుంది. శివారు వెంకటాపూర్ సమాధిలో మట్టితో చేసిన నీటిలోటా (వాటర్ ఫ్లాగన్) దొరికింది.

అమ్మదేవతలు

పుల్లూరు సమాధులలో ఒక అడుగు ఎత్తున్న రాతికడ్డీని పురావస్తుశాఖ ఆంత్రోపోమార్ఫిక్ శిల్పంగా గుర్తించింది. మా కొత్త తెలంగాణ చరిత్ర బృందం దానిని అమ్మదేవతగా గుర్తించింది. వివరించింది. ఈ శిల్ప సంస్కృతి తెలంగాణాకే తలమానికమైంది. ఎక్కడా లేదు. ఏచోటా దీనిని పోలిన మరొక బొమ్మ దొరకలేదు. ఇది కొత్త చరిత్ర.

కొలనుపాక సమీపగ్రామం సోమారంలో పాటిగడ్డ మీద లభించిన తలలేని, గర్భవతైన అమ్మదేవత బంకమట్టిబొమ్మ. ఇటువంటిది దేవతారూపం కూడా మరెక్కడా దొరకలేదు. బొమ్మ దొరికిన ప్రదేశంలోని శాతవాహనుల కాలంనాటి ఇటుకలపోగు అక్కడొక స్తూపనిర్మాణం వుండొచ్చని సందేహాన్ని కలిగిస్తున్నది.

సింగరాయకొండ బౌద్ధస్తూప శిథిలాల నడుమ దొరికిన నగ్నకబంధ లజ్జాగౌరీగా కొలువబడే అమ్మదేవత.

పురావస్తువులు

సింగరాయకొండ మీద చతుర్మఖాలతో ఏకశరీరుడైన బౌద్ధబ్రహ్మ విగ్రహం లభించింది.

కొండపాకలో టెర్రకోటబొమ్మలు, ఎముకపాచిక, రాతిగొడ్డండ్లు, గాజుపూసలు, నాణెం, నంగునూరులో ఎద్దుతల బంకమట్టిబొమ్మ, టెర్రకోట మట్టిపూసలు, టెర్రకోటబొమ్మలు; ఆకునూరులో టెర్రకోట బొమ్మలు, చేర్యాలలో టెర్రకోట బొమ్మలు, జైన చౌముఖి; చేర్యాలలో పెద్ద శాతవాహనుల కాలంనాటి టెర్రకోట బొమ్మల్ని, బౌద్ధస్తూపం ఇటుకల్ని పురావస్తువుల దిబ్బను గుర్తించింది.

నాణాల సేకరణ

మా బృందంలోని నాణాల సేకర్తలు బండి మురళీధర్ రెడ్డి, కందుల వేంకటేశ్, బీవీ భద్రగిరీశ్‌లు తెలుగురాష్ట్రాలలో, విదర్భలో, మహారాష్ట్రలో శాతవాహన పూర్వరాజుల నుంచి ఆసఫ్జాహీల దాక వివిధ రాజవంశాల నాణాలు సేకరించారు.

కోటిలింగాల శాతవాహన పూర్వరాజులు- గోబద, నారనస, సిరికంవాయస, సిరివాయస, సమగోప, సిరికామ.



గొల్లత్త గుడి, జైనబస - జడ్చెర్ల

తొలిచారిత్రక యుగం

శాతవాహన యుగం

కోటిలింగాలలో కొత్తశాసనం, మునులగుట్ట మీద రెండు బౌద్ధ శాసనాలు, హకుసిరి శాసనంలో 'మహాపురి' కోటిలింగాలగా గుర్తింపు.

ఇక్ష్వాకులు

ఈ కాలంనాటి టెర్రకోట బొమ్మలను నంగునూరు, చేర్యాల పాటిగడ్డల మీద గుర్తించడమైనది.

విష్ణుకుండినులు

గోవిందవర్మ కాలంలో చేయబడిన దానశాసనంలో పేర్కొన బడిన ఎర్మేదల, పెన్కపర్రులను విజయవాడ దగ్గరున్న యన మాదల కాదని, భువనగిరి జిల్లాలోని వెల్మజాల, పనకబండ గ్రామాలుగా గుర్తించింది కొత్త తెలంగాణ చరిత్రబృందం. విష్ణు కుండిన రెండో మాధవవర్మకాలంలో కీసరగుట్టలో వేయబడిన 'తొలుచువాన్డు' తొలి తెలుగుశాసనంగా రుజువుపరుస్తు శ్రీరామోజు హరగోపాల్ పుస్తకం రచించాడు.

మధ్యచారిత్రకయుగం

బాదామీచాళుక్యులు

ఉమ్మడి మహబూబునగర్ జిల్లా, కృష్ణానది పరీవాహ ప్రాంతంలోని దేవాలయాలలోని వివిధ శిల్పాల ప్రతిమాలక్షణాలను పరిశోధించి వాటి పేర్లను నిర్ధారించింది.

రాష్ట్రకూటులు

రాష్ట్రకూటుల రాజప్రతినిధిగా కొలనుపాకను రాజధానిగా పాలించిన శంకరగండరస 5 శాసనాలలో ప్రధానశాసనాన్ని నల్ల గొండ జిల్లా ఆమనగల్లులో గుర్తించి, పరిష్కరించింది (శ్రీరామోజు హరగోపాల్). యాదగిరిగుట్ట-భువనగిరి జిల్లా వెల్మజాలలోని రెండవ రాష్ట్రకూట శాసనాన్ని పరిష్కరించడంవల్ల విష్ణుకుండిన రాజు గోవిందవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనంలో పేర్కొనబడిన ఎర్మేదల విజయవాడ దగ్గరి యనమాదల కాదు వెల్మజాల అని నిరూపిత మైంది. ఆ గ్రామపు ప్రాచీనత వెల్లడైంది.

కళ్యాణీ చాళుక్యులు

కళ్యాణీ చాళుక్యులు నిర్మించిన వంద లాది దేవాలయాలు, వాటిలోని శిల్పాల ప్రతిమా లక్షణాలను ఫోటో డాక్యుమెంటేషన్ చేసింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం.

కాకతీయులు

కాకతి దేవత నామోత్పత్తిని పరిశోధించి, హన్మకొండలోని పద్మాక్షి దేవతే ఆమ్ర కూష్మాండిని, కాకతి దేవతని నిరూపించడ మైనది. శాసనాల ఆధారంతో వరంగల్ నగర నిర్మాత రుద్రదేవుడని, రుద్రమదేవి గణపతిదేవుని అగ్రతనయని తెలుపడమైనది. రుద్రమదేవి మరణాన్ని తెలిపే 3 శాసనాలలో పుట్టాల గూడెం (గుంటూరు జిల్లా) శాసనాన్ని పరిష్కరించి పరిశోధనా పత్రాన్ని సెమినార్‌లో సమర్పించడమైనది. కాకతీయుల కోటలో 24మంది జైన తీర్థంకరుల గుడిని, కుష్ మహల్లో బాహుబలిని వెలుగులోనికి తేవడమైనది. కాకతీయుల కాలంలో జైన విద్యా క్షేత్రాలను గుర్తించడమైనది.

కాకతీయానంతర పాలకులు

ముసునూరి పాలకుల బంధువు ముప్పనాయకుని శ్రీరంగం తామ్రశాసనంలో 'తెలింగాణ దేశం' మొదటిసారి పేర్కొనబడిన సంగతి వెల్లడి చేసింది కొత్త తెలంగాణ చరిత్రబృందం. ఉండ్రు గొండ మీద వెలమనాయకుల కొత్త శాసనాలు పరిష్కరించనైనది.

ఆధునికయుగం

కుతుబ్షాహీలు: కొత్త తెలంగాణ చరిత్ర బృందం, కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పరిష్కరించిన కుతుబ్షాహీల కాలంనాటి ఏదులాబాద్, వల్మిడి, నాగర్ కర్నూలు శాసనాలు, మొదటిసారిగా పరిష్కరించిన తెలంగాణాలోని చరిగొండ 'గధేగల్లు' శాసనం కొత్తవి.

అనేకంగా మెగాలిథ్ ప్రదేశాలు, శాతవాహన క్షేత్రాలు, బౌద్ధ శిల్పాలు, బౌద్ధస్తూపాల ఆనవాళ్లు, కొత్త జైన తీర్థంకరులు, జైన దేవతల శిల్పాలను గుర్తించింది. ఇవన్నీ తెలంగాణ చరిత్రకు కొత్తగా చేర్చిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆనవాళ్లు.



శ్రీరామోజు హరగోపాల్ కవిగా జీవితాన్ని ప్రారంభించి, మూడు కవితాసంపుటాలు ప్రచురించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ చరిత్రపై ఆసక్తి కలిగి ఆవైపుగా పరిశోధనా కృషి ఆరంభించి, ఒక బృందాన్ని ఏర్పరచుకున్నారు. దాని పేరే కొత్త తెలంగాణ చరిత్ర బృందం. తెలంగాణలోని అనేక ప్రాంతాలు తిరిగి చరిత్ర ఆనవాళ్లను సేకరించి, వరుస గ్రంధాలు ప్రచురించే తలంపుతో ఇటీవలే 'కొత్త తెలంగాణ చరిత్ర-1' ప్రచురించారు.

❖ చియాంగ్ రాయ్ - రంగుల హోళీ ❖

స్వర్ణ కిలారి

సరదా యాత్ర కాదు, ఉత్తర థాయ్‌లాండ్‌లోని 'చియాంగ్ రాయ్' పట్టణానికి సమీపంలో ఉన్న 'థాం లువాంగ్' అనే గుహ వద్దకు వెళ్లాలనే నాలుగేళ్ల క్రితపు ఆలోచన నాది, దిలీప్‌ది.

ఆటవిడుపు కోసం పన్నెండు మంది పిల్లలు, ఒక కోచ్ సరదాగా థాం లువాంగ్ గుహ సందర్శనకు వెళ్లి , అనుకోకుండా గుహ నిండా చేరుకున్న వర్షపు నీటి వల్ల బయటికి రాలేక అనేకరకాల ఇబ్బందులు పడి చివరికి ఆ అవాంతరాలను ఎలా అధిగమించారు అనే కథాంశంతో మేము తీసుకు వస్తున్న '13' అనే పుస్తక పరిశోధన నిమిత్తం వెళ్లాల్సి వచ్చింది.

రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చిన మా ప్రయాణం మార్చి 5 వ తేదీ ఉదయం నిర్ణయం అవడంతో, ఆరోజు రాత్రి బయలుదేరాల్సి వచ్చింది. ముందుగా హైదరాబాద్ నుండి బ్యాంకాక్ వరకూ మూడున్నర గంటల ప్రయాణం సాఫీగా సాగింది. దిగాక ఎయిర్‌పోర్టులోనే On Arrival Visa తీసుకున్నాం. ఈ ప్రక్రియకు ఒక గంట సమయం పట్టింది. అక్కడినుండి లే ఓవర్ లేకుండానే వెంటనే విమానం ఎక్కి, గంటా పదినిమిషాల అనంతరం చియాంగ్ రాయ్ చేరుకున్నాం.

ఏ కొత్త ప్లేస్‌కి వెళ్లినా మన దేశానికి ఉన్న సారూప్యతలో, తేడాలో గమనిస్తాం కదా, అలా విమానం దిగగానే గమనించిన విషయాలు- తేమతో కూడిన చిరు ఎండ, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద వృక్షాలూ, మొక్కల వల్ల వచ్చే చల్లని చిరుగాలిని ఆస్వాదిస్తూ ముందుగానే బుక్ చేసుకున్న హోటల్‌కి చేరాం. చెకిన్ అయి ఫ్రెష్ అవగానే ఆ హోటల్‌లోనే ఉన్న రెస్టారెంట్‌లో లంచ్ చేసి, క్యాబ్ మాట్లాడుకుని 'థాం లువాంగ్ గుహ' చూడటానికి బయలుదేరాము. మేమున్న ప్లేస్ నుండి నాలుగు కిలోమీటర్లు మాత్రమే ఉన్న ఆ గుహను చేరుకోవడానికి మాకు పెద్ద సమయం పట్టలేదు.

థాం లువాంగ్ కేవ్

గుహ ముఖద్వారం దగ్గర అడుగుపెట్టగానే చల్లని మంచు వీచిక మొహాన్ని తాకి వెళ్లింది. శుభ్రంగా ఉన్న పరిసరాలు, కను చూపు మేరా కళ్లనిండా కనిపించే పచ్చదనం, గంభీరంగా కూర్చుని బయట జరిగే తమాషాని వీక్షిస్తున్న ఎత్తయిన కొండల్ని చూడటానికి మాకు రెండు కళ్లూ సరిపోలేదు. గుహలోనికి వెళ్లడానికి మెట్లు ఎక్కుతుండగానే కాస్తంత ఎత్తున కొలువై ఉన్న గ్రామదేవత ఆకర్షించింది మమ్మల్ని. చెపవిలు విప్పి అక్కడే ఉన్న నాలుగయిదు పూలగుత్తుల కొమ్మల్ని ఆమెకి అలంకరించి దండం పెట్టుకున్నాం.

తర్వాత గుహ లోపలికి నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ ముందుకు సాగాం. అక్కడక్కడా ఏర్పాటుచేసిన లైట్ల కాంతి వల్ల ఎక్కడా చీకటి పెద్దగా లేకపోవడంతో సునాయాసంగానే ముందుకు వెళ్లగలిగాం.

కాల్షియం కార్బొనేట్ నిక్షేపాల వల్ల అక్కడక్కడా ఏర్పడ్డ పలకలు చిన్న చిన్న నీటి బొట్లను కారుస్తూ కాస్తంత చిత్తడి చేసాయి కింద ఉన్న నేలను. మానవ నిర్మితం కాని అటువంటి సహజంగా ఏర్పడ్డ ఆకృతులు అంటే ఎవరికయినా ఆసక్తే కదా! జాగ్రత్తగా ముందుకు నడుస్తూ సుమారు 150 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే ఎక్కగలిగాం. అద్భుతమయిన ఆ ప్రకృతి మహిమల్ని ఇంచు ఇంచూ పరిశీలిస్తూ.

ఇదివరకు నేను చూసిన గుహలు గబ్బిలాలకు నెలవై వుండటం వలనేమో ఒకలాంటి దుర్గంధపు వాసనతో ఉండేవి. కానీ ఈ గుహ మాత్రం చాలా శుభ్రంగానూ, ఒకటి రెండు చోట్ల బుద్ధుడి విగ్రహాలతో అలంకరించబడి ఉంది.

గుహ లోపలే ఆ పిల్లల్ని తలచుకుంటూ ఎలా గడిపారో అని చర్చ చేసుకుంటూ ఒక గంట సమయం గడిచాక బయట ఏర్పాటు చేసిన మ్యూజియంని సందర్శించి, గుహకు సంబంధించిన ఒక సావనీర్ కొనుక్కుని బయటపడ్డాము.

సాయంత్రం అవడం వల్లనేమో గాలిలో చల్లదనం ఇంకా పెరిగి, కాస్త అలసట కూడా అనిపించకపోవడంతో చుట్టూ ఉన్న పరిసరాలు చూస్తూ తన్మయత్వంలో ఉండిపోయాము.

పళ్లు ఇష్టపడే వాళ్లకు మాత్రం థాయ్‌లాండ్ ఒక పండగే. అడుగడుగునా మనల్ని పలకరించే ఫ్రెష్ పళ్లు, కూరగాయ

ముక్కలు, మంచి ప్రోటీన్ ఫుడ్ యభై నుండి వంద భాట్లకు (మన రూపాయికి రెండున్నర రెట్లు ఎక్కువ) దొరుకుతాయి. గుహ బయట చిన్న చిన్న దుకాణాల్లో ఎక్కువగా స్త్రీలు మాత్రమే కనిపించే వారు. వాళ్ల మొహంలో ఎక్కడా, ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. చక్కటి చిరునవ్వు, మర్యాదతో కూడిన హావభావాలు కట్టిపడేసాయి.

రెండు గుట్టల మధ్య దోబూచులాడుతున్న భానుడికి వీడ్కోలు పలుకుతూ ఆరోజు పర్యటన ముగించుకుని హోటల్ రూముకి బయలుదేరాము. డిన్నర్ చేసి తర్వాత రోజుటి ప్రయాణం గురించి ఒక ప్లాన్ వేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాము.

మూడు దేశాల సరిహద్దు

బ్రేక్‌ఫాస్ట్ చేసి పదకొండుకల్లా కిందకి దిగగానే థాయ్‌లాండ్ భాషలో నమస్తే చెబుతూ ఒక చక్కటి అమ్మాయి నవ్వుతూ కనిపించింది. వావ్! మన డ్రైవర్ ఈ అమ్మాయేనా అంటూ ఆనందంగా దిలీప్ వైపు చూసాను. నీకు పండగే, నువ్వు తన పక్కన ముందు సీట్లో కూర్చోవచ్చు, బోల్డు కబుర్లు చెప్పుకోవచ్చు అన్నాడు. కార్లో ముందు సీట్లో కూర్చుని ఒక చిన్న సైజు ఇంటర్వ్యూ మొదలు పెట్టాను. ఆమె పేరు క్లాంగ్. అర్థం తేనె అట. నిజంగానే స్వీట్ గర్ల్ అని తర్వాత్తర్వాత అర్థం అయింది మాకు. ఇద్దరు సిబ్లింగ్స్. డిగ్రీ పూర్తి చేసి, పీజీలో జాయిన్ అయేలోపు హాబీ లాగా ఈ డ్రైవింగ్ చేస్తుందట. ఎంత ఒడుపుగా, నైపుణ్యంగా నడిపిందో కారు.

అలా మాట్లాడుకుంటూ 'మాసెయ్' టౌన్‌లో ఉన్న 'వాట్ ఫ్రా థాట్ డాయ్ వావ్' అనే అతి పురాతన గుడికి చేరుకున్నాము. దారి పొడవూతా పెద్ద పెద్ద నీడనిచ్చే వృక్షాలు, పూలమొక్కలతో రహదారి అంతా అలంకరించబడి ఉంది. ఈ గుడి సమీపంలో స్థానిక ఆహారం, సావనీర్లు అమ్మే దుకాణాలు, అందమయిన రకరకాల హస్తకళలకు సంబంధించిన వస్తువులు లభ్యమవుతాయి.

రాజు 'వావో' బుద్ధుడి కేశాలను భద్రపరచడం కోసం ఈ గుడిని నిర్మించారని చెబుతారు.

ఇక్కడ తప్పక చూడాల్సిన మరో విగ్రహం, అతి భారీ పరిమాణంలో ఉన్న వృశ్చిక విగ్రహం. ఈ విగ్రహం ఎదురుగుండా నిల బడితే మయన్మార్ సరిహద్దును కూడా వీక్షించవచ్చు. ఎటువంటి ప్రవేశ రుసుములు చెల్లించకుండానే అత్యద్భుతమయిన పురాతన బుద్ధుడి విగ్రహాలు మనం చూడవచ్చు.

ఇలా అన్ని విగ్రహాలూ చూసుకుంటూ నడుస్తున్న మాకు ఒకవేపు నుండి గణపతి స్తోత్రం వినబడింది. ఒక్క సెకనుపాటు నడక ఆపి చెవులు రిక్కించి మళ్లీ విన్నాము. అసంకల్పితంగా అది వినిపించిన వేపు అడుగులు వేసుకుంటూ వెళ్లాము. వినాయకుడికి ఇరువైపులా కొలువై ఉన్న శివ, పార్వతులను చూడగానే, 'అబ్బా! మన దేవుళ్లు,' అని ఇద్దరమూ ఆనందంతో చిన్న కేక పెట్టాము. అక్కడే ఉన్న ఇద్దరు బుద్ధ పూజారులు మా సంతోషాన్ని గమనించి మరికొన్ని పూల గుత్తులు తెచ్చి ఆ విగ్రహాలకు చేసిన అలంకరణ మరింత శోభను తెచ్చిపెట్టింది. అలంకరణపట్ల వారికున్న ఉత్సుకత, అభిరుచి మాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

భోజనపు వేళ అవడంతో క్లాయ్‌ని ఏదయినా మంచి థాయ్ రెస్టారెంట్‌కి తీసుకెళ్లమని అడిగాము. సరే అని తలూపిన ఆమెతో మళ్లీ ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ పరిసరాలు గమనించిన మాకు యురేకా! అని అరవాలనిపించింది. ఒక పెద్ద విశాలవంతమయిన పచ్చికావరణలోకి సాగుతున్న మా కారు కిటికీలోంచి బయటికి చూస్తే, పెద్ద పెద్ద సైజుల్లో ఉన్న చెట్ల కాండపు మధ్యభాగంలో నుంచి పొడుచుకొచ్చిన అతి భారీ పరిమాణంలో ఉన్న ఆకుల ద్వయాలు, చిన్న చిన్న కుండీల్లో కాసిన స్ట్రాబెర్రీ పళ్లు, కళ్లను కనువిందు చేసే నూరువరహాలు, నందివర్ధనాలు, తినే టేబుల్స్‌కి ఎదురుగా ఒక చిన్న కాలువ, అందులో బుజ్జి పడవలు కనిపించాయి. అదే 'కెమేలియా సీడ్ ఆయిల్ రీసెర్చ్ సెంటర్'. కొన్ని వందల ఎకరాల్లో ఉన్న ఈ రీసెర్చ్ సెంటర్‌లోనే థాయ్ రెస్టారెంట్ ఉంది. నచ్చిన భోజనం ఆర్డర్ చేసుకుని తిని, ఆ సంస్థ స్వయంగా ఉత్పత్తి చేసిన కొన్ని వస్తువులు కొనుక్కుని మరోసారి ఆ స్వచ్ఛమయిన గాలిని ఆస్వాదిస్తూ, మధ్యాహ్నపు ఎండ తగ్గుముఖం పట్టడంతో, మూడు దేశాల సరిహద్దు ప్రాంతమయిన 'గోల్డెన్ ట్రయాంగిల్' చూడటానికి బయలుదేరాము.

థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ దేశాల సరిహద్దులు కలిసే అద్భుతమయిన ప్రదేశం అది. అక్కడే అతి భారీ సైజులో ఉన్న బంగారు వర్ణపు బుద్ధుడి మేనిపై సాయంకాలపు సూరీడి చందనపు కాంతి పడి మరింత వర్ణశోభితం అయింది. మెకాంగ్, రువాక్ అనే నదులు ఇక్కడే సంగమిస్తాయి.

ఇక్కడ దారి పొడవునా ఎంతో నైపుణ్యంగా రకరకాల లేసులతో అల్లిన వస్తువులు, దుస్తులు ఆకర్షణీయంగా ఉండి అందుబాటు ధరల్లో ఉండేసరికి నచ్చినవి కోనేసుకున్నాను.

అరచేతిలో పట్టేంత పరిమాణంలో ఉండే పైన్ ఆపిల్ పొట్టును చాకుతో చకచకా తీస్తూ, చక్రాల్లా తరిగి నిమిషాల్లో చేతిలో పెట్టే స్త్రీలను చూస్తే ముచ్చటేసింది. పానకంలాంటి తీపి. అసలు ఎక్కడా తిండికి ఇబ్బంది పడనేలేదు.

ధవళ దేవాలయం

మరునాడు ఉదయం సుమారు పదకొండు గంటలకల్లా మేమనుకున్న 'వాట్ రాంగ్ ఖాన్' అనే వైట్ టెంపుల్ కి చేరుకున్నాం. ఆకాశం మేఘావృతమై ఉండటంవల్ల అప్పుడప్పుడే బద్ధకంగా విచ్చు కుంటున్న చిత్రభానుడి కిరణాలు మామీద సూటిగా పడటంతో కళ్లు చికిలించి బలవంతంగా చూస్తున్న మా నేత్రాలు ఎదురుగా కనిపిస్తున్న ధావళ్యపు కట్టడాలను చూసి మరింత విప్పారాయి. లోపల కొలువై ఉన్న ధవళవర్ణధారి బుద్ధుడి చక్కదనాన్ని వర్ణించడం మహా కష్టతరం. బయటా, లోపలా ఉన్న తెలుపు కట్టడాలు మొత్తం రకరకాల ఆకారాల్లోని గాజుముక్కలతో కూర్చబడి, ఎండ వెలుగు జిలుగులకు మిరుమిట్లుగొలిపే కాంతిని వెదజల్లి ఒక అత్యద్భుత మయిన వీక్షణంతో కనువిందు చేస్తున్నాయి.

ఇన్ని శ్వేత నిర్మాణాల మధ్య ఒక మేలిమిచాయ నిర్మాణం మా కంటబడింది. దిలీప్ క్లాయ్ ని ఆరా తీసాడు, ఇన్ని తెల్ల గుడుల

మధ్య అందంగా కనిపిస్తున్న ఆ గుడి ఏమిటి అని. ఆమె సమాధానం 'అదొక శౌచాలయ్.'

ఈ ఆలయాన్ని కట్టించిన వ్యక్తి ప్రముఖ థాయ్ కళాకారుడు 'చలేరంచాయ్ కొసిట్ పిపాట్.' ఎవ్వరి దగ్గర నుండీ నయాపైసా విరాళం తీసుకోకుండా స్వంత ఖర్చుతో నిర్మిస్తున్నాడు. ఇంకా గుడి చుట్టూ పూర్తి కావలసిన పనులు ఉన్నాయట. మనసులో అతనికి సాష్టాంగ నమస్కారం చేసుకుని అక్కడికి దగ్గరలో ఉన్న సింహా పార్క్ చూడటానికి బయలుదేరాం.

ఈ పార్క్ ప్రత్యేకత ఏమిటి అని అడిగిన నాకు, జవాబుగా ఒక చిరునవ్వు మాత్రమే వచ్చింది. ప్రశ్న అర్థం కాలేదేమో అనుకుని నేనూ గమ్మున కళ్లు మూసుకుని వైట్ టెంపుల్ ఆలోచనల్లోకి జారిపోయాను. ఒక పది నిమిషాల తర్వాత కారు ఆగిన శబ్దం విని కళ్లు తెరిచిన నాకు ఏదో పూల ఉద్యానవనంలో ఉన్నట్టు అనిపించింది. రంగురంగుల పూల దొంతరలు. క్షణాల్లో చిన్న పిల్లలం అయిపోయాం ఇద్దరమూ. ఒక పువ్వు నా చెవిలో తురుముకుని, మరి నీకు మాత్రం వద్దా అనుకుని, దిలీప్ చెవిలో కూడా పెట్టే అందమయిన దృశ్యాన్ని తన కెమేరాలో బంధించింది మా క్లాయ్. ఆ తర్వాత కూడా రకరకాల ఫోజులతో మమ్మల్ని మాకు విసుగు వచ్చేదాకా ఎన్నెన్నో చిత్రాలు తీసి, చూపించి మురిపించింది. అప్పుడే తెలిసింది ఆమె ఒక మంచి ఫోటోగ్రాఫర్ అని. ఇంతటి రమణీయతను ఆమె చెప్పలేక నా ప్రశ్నకు నవ్వు సమాధానంగా ఇచ్చిందా అనిపించింది.

అక్కడికి కొద్ది దూరంలో ఉన్న పర్యాటక ఆకర్షణ భారీ సైజు సింహపు బొమ్మ దగ్గరకు చేరుకున్నాము. బొమ్మ చుట్టూ పరిసర ప్రాంతమంతా చిన్న చిన్న కాలువలు, పళ్లు, తేయాకు తోటలు, పచ్చికమైదానాలతో కూడి, రహదారి గుండా వెళ్లే సందర్శకులకు చూడ ముచ్చటగా కనిపిస్తుంది.

సింహపు బొమ్మ మీద ప్రసరిస్తున్న గోరువెచ్చని సూర్యాస్త మయాన్ని కనులారా వీక్షించి మరొక కొత్త రంగుల ప్రపంచం చూడటానికి బయలుదేరాం.

లలిట్బా కెఫే

ఇండియాలో ఉన్నప్పుడే ఈ కెఫే గురించి కాస్త తెలుసుకుని వచ్చాము. లోపలికి అడుగుపెట్టగానే ఒక్కసారిగా భూతల స్వర్గంలో ఉన్నామా అనిపించింది. ప్రపంచంలోని పూలమొక్కలన్నీ ఇక్కడే ఉన్నాయా అనే భావన కలిగింది. పాగమంచుతో కప్పబడి ఉన్న రంగురంగుల పూలమొక్కలు, ఆర్కిడ్లు, పచ్చందనపు నాచుతివాచీ, అతి సుందరమయిన జలపాతాలు, అందులో జలకాలాడుతున్న గంధర్వ కన్నెల పాలరాతి శిల్పాలు, చెవికింపయిన మంద్ర స్వరంలో వస్తున్న సంగీతం వింటూంటే 'ఫెయిరీ ల్యాండ్'లో ఉన్నామా అనే అనుభూతిని కలిగింది.

దీనికి ఆనుకుని ఓపెన్ ఎయిర్ లాంజ్ ఉంది. ఆ ప్రాంతపు గోపురపు పైకప్పు చక్కటి మ్యూరల్ ఆర్ట్‌తో మనోహరంగా అలంకరించబడింది. అందులో ఉన్న చెక్క కుర్చీలలో కూర్చుని, జలపాతాల నుండి వచ్చే వాన తుంపర్లు అప్పటిదాకా అలసిన మోమును పలకరిస్తుంటే చక్కటి కాఫీ తాగడం అనేది మరచిపోలేని అనుభవంగా నిలిచిపోయింది.

ఇక ఆరోజు చివరగా మేము వెళ్లాల్సిన మూడు గుడుల సముదాయం 'వాట్ హుయే ప్లా కంగ్' చేరుకున్నాము. అవే దయ, కరుణ, మహిమ కలిగిన మెర్సీ గాడ్, వైట్ టెంపుల్, ఇరువైపులా చైనీస్ డ్రాగన్ నిర్మాణాలతో కూడిన మెట్లు కలిగిన పగోడా. ఈ పగోడా ముఖద్వారం దగ్గర అగరొత్తులను వెలిగించి, మనసులో మొక్కుకుంటే కోరికలు తీరతాయనే నమ్మకం ఉందట. అక్కడికి వచ్చిన అమెరికన్ అమ్మాయిలతో పాటు, నేనూ కొన్ని అగరొత్తులు వెలిగించి ఈ మూడు రోజులూ ఇంత ప్రశాంతత ఇచ్చిన బుద్ధుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

చుట్టుపక్కల దగ్గర్లో ఉన్నవి అన్నీ చూడడంతో చివరిరోజు ఎయిర్ పోర్ట్‌కి దగ్గరగా ఉన్న 'ద రివరి' అనే హోటల్‌కి మారాము.

చియాంగ్ రాయ్‌లో మనం తడిసే జలపాతాలు, బీచులు కనిపించలేదు కానీ, కంటికి కనువిందు చేసే చిన్న చిన్న నీటి మడుగులు, కుంటలు మాత్రం బోలెడు దర్శనమిచ్చాయి.

మేము బస చేసిన హోటల్‌కి ఆనుకుని 'కోక్' అనే ఒక నది పారుతూ ఉంది. దాని అంచు పొడవునా రమణీయమయిన రంగుల్లో దడి కట్టినట్టుగా ఉన్న బోగన్‌విల్లాలను చూస్తూ, పొడవాటి బలమయిన చెట్లకు కట్టిన జూలా (హామక్)లో ఊగుతూ చల్లగాలిని ఆస్వాదిస్తూ, 'గాల్లో తేలినట్టుందే' అని పాడుకోకుండా ఉండలేక పోయాను.

అద్భుతమయిన ఆనందాలు 'క్షణ భంగురాలే' కదా! అనుకుంటూ వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టి, నాలుగోరోజు పెట్టే-బేడా సర్దుకుని, మధురానుభూతులన్నీ మనసునిండా నింపుకుని విమానాశ్రయానికి చేరుకున్నాము.



స్వర్ణ కిలారి అనువాదకులు. కథకులు. ఔత్సాహిక ప్రయాణికులు. అనేక దక్షిణ భాషా చిత్రాల విశ్లేషణలు, యాత్రాకథనాలు వివిధ పత్రికల్లో ప్రచురించారు. 45 మంది స్త్రీల యాత్రా విశేషాలతో 'ఇంతియానం' అనే సంకలనం తీసుకొచ్చారు. నివాసం హైదరాబాదు.

❖ చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా! ❖

డా॥ బెల్లంకొండ కృష్ణకిశోర్

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా గతమంత ఘనకీర్తి కలవోడా!' అని రచించి, పాడారు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణగారు. అది తెలుగువారికి ఒక ఆవేశకరమైన గీతం. ఎన్నో శతాబ్దాలుగా తెలుగుభాష, తెలుగు జాతి, తెలుగు సంస్కృతి, తమిళవారి నీడలోను, నిజాం అనుగ్రహం తోను బ్రతికాయి. నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ వంటి మహా కవులు, అన్నమాచార్యులు, త్యాగరాజు వంటి సంగీత సారధులు, దేశభాషలందు తెలుగు లెస్స అన్న కృష్ణదేవరాయలు, తెలుగే తన జీవితం అని భావించిన సీపీ బ్రౌన్ దొర ఉన్నప్పటికీ తెలుగుకి సొంత ఊపిరి పీల్చుకునే అవకాశం కలగలేదు చాలాకాలం. ఆధునిక కాలంలో కూడా గురజాడ వారు, మంగళంపల్లి, ఘంటసాలవంటి కళాకారులు, గాయకులు, ఇలా ఎందరో మహాను భావులున్నప్పటికీ, తెలుగువారికి ఒక రాష్ట్రమంటు రావడానికి ఎంతో కృషి చేయవలసి వచ్చింది. చివరకు పొట్టి శ్రీరాములుగారు ప్రాణత్యాగం చేసారు మనకోసం. అయన అస్థికలు మీదుగా 1953 లో మనదంటూ ఒక రాష్ట్రం ఏర్పడింది. ఎంతో ఆనందించాము, పండగ చేసుకున్నాం. కానీ శతాబ్దాలు గడిచినా తెలుగువారిని మదరాసి అనేవాళ్లు మన ఉత్తర భారత దేశపు సోదర సోదరీ మణులు. కాదు మేము తెలుగువాళ్లము అని ఎంత ఘోషించినా వినేవారు కాదు. తెలుగు రాష్ట్రం వచ్చినా, తెలుగువారికి గుర్తింపు లేకుండాపోయింది మా చిన్నతనములో. చివరకు ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ స్థాపించి తెలుగు శంఖం ఊదేవరకు భారతావనిలో తెలుగుజాతి, తెలుగుభాష ఉన్నవని గుర్తింపు రాలేదు. అంతవరకు తెలుగోడి గోడు ఎవరు పట్టించుకోలేదు. ఈ విషయములో శ్రీ నందమూరి తారక రామారావుగారు చేసిన కృషి ఎంతో ఉన్నది. ఆయనకు తెలుగుజాతి ఋణపడి ఉన్నది. ఇందులో ఏమి సందేహం లేదు.

ఎప్పుడో స్వాతంత్ర్య సమరంలో మన అల్లూరి సీతారామ రాజు, పింగళ వెంకయ్య, ఆచార్య ఎన్.జి. రంగ, టంగుటూరి ప్రకాశంపంతులు, కాశీనాథుని నాగేశ్వరరావు వంటి గొప్ప దేశభక్తులు పోరాడినా కూడా తెలుగువారికి తగిన గుర్తింపు రాలేదు. స్వాతంత్ర్యం రాకముందు 1942లోనే 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ మా కన్నతల్లికి మంగళారతులు...' అని శంకరంబాడి సుందరాచారిగారు రచించినా, ఆ తల్లి రావడానికి పదేళ్లు పట్టింది. ఆ తర్వాత పట్టుమని రెండు శతాబ్దాలు గడవగానే, అన్నదమ్ములు విడిపోతే మంచిదేమో అన్న పరిస్థితికి వచ్చారు. అప్పుడు ఆ తెలుగు తల్లి కన్నీటిని ఎవరు చూసారో, ఎవరు తుడిచారో తెలియదు. 'మీరు విడిపోయినా ఫరవాలేదు. కానీ ఆనందంగా, కవలపిల్లల్లాగా ఒకరికొకరు సాయం చేసుకుంటూ జీవించండి,' అని ఆ తల్లి దీవించింది.

తెలుగు రాష్ట్రాలు రెండు అయినా, మన జాతి ఒక్కటే. యాసలు వేరైనా, మన భాష ఒక్కటే. మనం విడిపోయినా, మన తల్లి ఒక్కటే. మనదంటూ ఒక రాష్ట్రం ఏర్పడి ఇప్పటికి 70 సంవత్సరాలు ముగిసాయి. ఇప్పుడు తెలుగు అంటే భారతావనిలోనే కాకుండా, యావత్ ప్రపంచమంతా తెలుసు. తెలుగు వైద్యులు, శాస్త్రవేత్తలు, ఐటి ప్రొఫెషనల్స్, టెక్నాలజిస్ట్స్, సీ-ఈవోలు, వ్యాపారస్తులు, థింక్ ట్యాంకులు ప్రపంచమంతా, అన్ని ఖండాలలో వున్నారు. తెలుగు చలనచిత్రాలు ప్రపంచమంతా ఆడుతున్నాయి. ఆస్కార్ వరకు వెళ్లాయి. ఒకప్పుడు, 'రవి కాంచని చోట కవి గాంచునట,' అనేవారు. ఇప్పుడు, 'కవి కాంచని చోట, తెలుగోడు గాంచునట,' అనవచ్చు మనం. ఇది తెలుగువారందరు గర్వించ తగిన విషయం. కానీ, ఇది ఎంతో బాధ్యతతో కూడిన విషయం కూడా. మనము ఎంత పైకి వెళతామో అంత జాగ్రత్తగా నడుచు కోవాలి. నిచ్చెన పైకి ఎక్కేకొద్దీ మరీ జాగ్రత్తగా ఉంటాం కదా? ఆ మాదిరే ఇది కూడా. ముఖ్యంగా మనం దేశం విడిచి వేరే దేశానికి వృత్తిరీత్యా వచ్చినప్పుడు, మనం నడుచుకునే తీరు మన జాతికి మంచిగా కానీ, చెడ్డగా కానీ పేరు తెస్తుంది. అమెరికాలాంటి దేశాల్లో ఎంతో ఫ్రీడమ్ ఉంటుంది మనకు. కానీ ఆ ఫ్రీడమ్‌ని మనం దుర్వినీ


యోగం చేసుకోకుండా, మన జాతి గౌరవాన్ని పెంచేలా ఉపయోగించుకోవాలి. ఆ బాధ్యత మనందరి మీద ఉంది, మనం పది కాలాలపాటు చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అని పాడుకోవాలంటే మనందరికన్నా ముందుగా ఎప్పుడో ఇరవయ్యవ శతాబ్దం మొదట్లో అమెరికాకు వచ్చి ప్రపంచ విఖ్యాతగాంచిన తెలుగుబిడ్డ డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావుగారిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. మనం ఆయనంత గొప్ప శాస్త్రవేత్త కాలేకపోవచ్చు కానీ ఆయనలా నడచుకొని మన తెలుగుజాతికి, మన మాతృభూమికి మంచి పేరు తెచ్చుకోవచ్చు. మన జాతికి, దేశానికీ మంచి పేరు తేలేకపోయినా ఫర్వాలేదు, చెడ్డ పేరు మాత్రం తేకూడదు. చెడ్డపేరు తెస్తే మన తెలుగుతల్లి కంట నీరు పెట్టుకుంటుంది. గురజాడ అప్పారావుగారు చెప్పిన విధంగా, 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలపరా నీ జాతి నిండు గౌరవము.' అప్పుడే మనకు, 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా,' అని పాడుకునే హక్కు వుంది.

'కోటి గొంతులు పాట పాడెను ఒక్క శృతిలో, కోటి శృతుల పాట సాగెను ఒక్క గొంతులో.' ఇది ఎవరు వ్రాసారో తెలియదు. చిన్నప్పుడు రేడియోలో విన్నాను. నా మనస్సుని ఆకట్టుకుంది. 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ మా కన్నతల్లికి మంగళారతులు,' అంటూ మనం ఆ కోటి గొంతులతో పాడదాము. ఆ తల్లి దీవెనలు అందుకుందాము. ఇక సెలవు మరి.

సర్వే జనా సుఖినోభవంతు.



డా॥ బెల్లంకొండ కృష్ణకిషోర్ వృత్తిరీత్యా వైద్యులు. వైద్యంలో అనేక పరిశోధనలు చేసారు. ముఖ్యంగా కిడ్నీలకు సంబంధించిన వ్యాధులపై పరిశోధనలు చేసారు. యూటా విశ్వవిద్యాలయంలో మెడికల్ సైంటిస్ట్‌గా ఉన్నారు. అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. తెలుగుభాషపై అభిమానం. అప్పుడప్పుడు తెలుగులో వ్యాసాలు రాస్తుంటారు.



Million+
Happy Customers

SITARA FOODS

Across 69+
Countries

Sitara Foods

The Store For Home Made Food Products

FARMERS FRIEND

All ingredients
freshly sourced directly
from local farmers

RURAL WOMEN EMPOWERMENT

With our Rural Kitchens
Providing Employment to Elderly
Rural Household Women

PREMIUM QUALITY & FAST DELIVERY
QUALITY SERVICE

Super Strong &
Leak Proof Packing with
Fast Delivery using Bluedart & DHL

HAPPY CUSTOMERS

All Together with
Delicious Products & Fast Delivery
we make & keep customers Happy



Homemade **Traditional** Sweets & Snacks

SHOP NOW @
www.sitarafoods.com

Get $10 off
COUPON CODE: TANA

Scan with
Google Lens
to know more.

PRODUCTS THAT ARE HOMEMADE & HANDMADE
FREE FROM PRESERVATIVES,COLORS AND CHEMICALS.

Phone: +91 7981882581 **Email: wecare@sitarafoods.com**

SITARA FOODS

Built By Women to Help Fellow Home Makers to Support their Families
| Women Empowerment | Rural Development | Farmers Friend | Healthy & Hygienic |

LS Property Investments

Extends Warm Greetings to TANA Patrons & Guests



LS Property Investments is a prestigious local firm based in Greater Philadelphia Region offering partnership opportunities for accredited investors to buy prestigious landmark Shopping Centers on a partnership basis and help them build generational wealth . If you want to know more about our strategy and whether you can be part of our success journey, please talk to one of us.

Suresh Kagithapu

CEO, LS Property Investments
A Landlord of Several Shopping Centers
offering Partnership Investment oppurtunities
Email: Suresh@LSPropertyInvestments.com
Phone: (610) 871 2332

PROPERTY INVESTMENTS
WWW.LSPROPERTYINVESTMENTS.COM

Key Investment Partners & Our Property Portfolio



Harish Koya



Harinath Bungatavula



Giri Mannepuli



Raja Ram Katragadda



Srinivas Adda



Siva Pola



Amar Varada



Dr. Chatargy Kaza



Dr. Chandra Kunavarapu



Radha Alla



Ravi Musuku



Eeswara Satyadev Janjanam



Nagasekhar Anumalasetty



Sinking Spring Shopping Center



Stowe Crossing Shopping Center



Dollar General




Cherry Square Shopping Center



Bensalem Square Shopping Center



Darby Town Shopping Center



New Garden Shpping Center



The Shops on Eagleview Boulevard

పనస బాసలు!

చింతకింది శ్రీనివాసరావు




విశాఖమన్యంలోని వంతాలు, గమ్మేలి, లోచలి, సొలభం, గడుతూరు, మినుములూరు గ్రామాల నుంచీ గంగరాజు మాడుగుల వరకూ విస్తరించిన ఆరు గ్రామాలు 'ఆరుళ్లు' అని పేరు పడ్డాయి. గరికబందలు దాటగానే భూమికి వేల ఆడుగుల ఎత్తున ఉంటాయవి. దట్టమైన మంచు వల్ల సమకాలంలో గుమ్మళ్లు విరక్కాస్తాయి. చిక్కటి వానల వల్ల మామిడి, పనసా బాగానే దిగుతాయి. కాపోతే, ఇటిం, బైశాగి, అవిటి మాసాల్లో మటుకు భయంకరమైన గ్రీష్మతాపం. ఎర్రగా కాగిపోయే ఆ కరువువేళ, ఆకలి తట్టుకునేందుకు వనవాసులు నానాతంటాలూ పడుతుంటారు.

మినుములూరు కొండలు దిగితే వరసగా తగిలేవి కోడూరు, మాడుగుల, కస్పాజగన్నాథపురం, వడ్డాది, చోడవరం, అనకాపల్లి వంటి మైదానాలు. పనసకాయలంటే ఎవరికైనా ఇష్టమే. ఈ ప్రాంతాల వారికయితే చచ్చేంత ఇష్టం. షష్టిపుడియలూ అవే తినమన్నా తినగలరు. పిందెల్నీ వదలరు. కూరగా లాగిస్తారు. పులుసుగా తాగేస్తారు. పనసకాయ దొరికినప్పుడే తద్దినాలకీ తయారైపోవాలంటారు. దానాదీనా, ఆరుళ్ల పూసింది లగాయితూ ఆ చెట్ల మీదనే గిరి ముదుర్ల దృష్టి నిలబడిపోతుంది. కాయలు కొద్దిగా పెద్దవయినా చాలు. మూడోకంటికి తెలీకుండా చకచకా కోసేసి కిందివారికి టోకున అమ్మేసుకుంటారు. పైగా అవి ఊరుమ్మళ్లు. ఎవర్నీ ఏమీ అనడానికీ ఉండదు.

'ముదరనివ్వకుండా పనసల్ని తెగ్గొట్టేస్తుంటే వేసంగిలో శిఖర ప్రజ ఏం తిని బతకాలి? వాటిని ఎంచక్కా పండనిస్తే క్షామ సమయాల్లో పిక్కల గంజయినా తాగి ప్రాణాలు నిలుపుకోవచ్చు కదా.' ఆరుళ్ల పెద్దలది ఇదే యోచన. అంచేతనే, ఏ ఊరికి ఆ ఊరిగా ప్రతీ ఏటా పనస బాసలు ప్రకటిస్తూ ఉంటారు.

మునుముందుగా గ్రామంలో ఇందుకు సంబంధించిన దండోరా పడుతుంది. నిర్ణయించిన సమయానికి రచ్చబండ దగ్గరకో, గద్దెరాళ్ల వద్దకో, సిమ్మాలతిన్నె సమీపానికో జనమంతా చేరుతారు. ప్రసంగాలు మొదలవుతాయి. ఎవరెంతగా మాట్లాడినా సారాంశం ఒక్కటే. పనసలు కాసే సమయాన చెట్లమీద ఎవ్వరూ చెయ్యి వెయ్యకూడదు. కాయలు దూయకూడదు. పూర్ణంగా పండే వరకూ వేచి ఉండవలసిందే. ఆనక అందరూ కలిసి సమానంగా వాటాలేసుకోవచ్చు.

జాకరమ్మసాక్షిగా ఈ మాటలే వల్లెవేసుకుంటూ అడవి బిడ్డలంతా ఒకరి హస్తాలను మరొకరు పుచ్చుకుని వాగ్దానాలు చేసుకుంటారు. ఆ ప్రమాణాలే పనస బాసలుగా కోనంతటా ప్రసిద్ధం. అయితే, ఎవరెంతగా ఒట్లు పెట్టుకున్నా- వాటిని తీసి గట్టున పెట్టేవారెప్పుడూ ఉంటూనే ఉంటారు. మనిషి అనగానే మంచీ ఉంటుంది. చెడ్డా ఉంటుంది. తత్ఫలితమే తప్పు కట్టడం, జుల్మానా చెల్లింపు, వగైరా వగైరాలు.



ఎప్పటిలాగానే ఆరుళ్ల దేశంలోని సొలభం గ్రామాన ఈ సంవత్సరమూ పనస బాసలు పెనుసుకున్నాయి. రచ్చబండన మెరిసిన కట్టుబడి ఊరంతా ఉరిమింది. పల్లె చుట్టూతానూ, పొలి సీమల్లోనూ ఇబ్బడిముబ్బడిగా పెరిగిన పనసల్ని గ్రామావాసులంతా ప్రేమగా చూస్తున్నారేగానీ కొయ్యడం లేదు. అంతేకాదు. ఎవరన్నా వీటిని తస్కరిస్తారేమోనని జోడు నేత్రాలూ అటే పడేస్తున్నారు. కొంద రయితే కాయమంతా కళ్లు చేసుకుని కుంజిగాణ్ణి గమనిస్తున్నారు.

కుంజిడు మామూలోడు కాదు. రణపెంకికి మొండిమొగుడు. రాయికి రంకుమొగుడు. చోరీ తలంపు వాడిలో స్థిరపడిపోతే ఇక నంతే. ఇంద్రుడు వాణ్ణి కాయలేడు. మందుడు వాణ్ణి మలపలేడు. శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదంటారు. వాడలా కాదు. ఆ పరమే శ్వరుడి అనుజ్ఞ లేకుండానే కండచీమలు పరుగులు తీసే పనస చెట్ల పైకి చిమ్మచీకట్లోనూ జాయిగా చేరిపోగలడు. త్రినేత్రుడికీ తెలియ కుండా నిశివేళే కాయలు తెంపగలడు. ఆ రాతిరి మీదనే డొంక దారుల్లో రోడ్డుకు మోసుకుపోగలడు. కాంట్రాక్టర్ల తొట్టె మోటార్లలో లోడింగు చెయ్యగలడు. వాళ్లిచ్చే రూపాయిలు రొంటిన దోపగలడు.

చాలాకాలంపాటు కుంజిడి ఆటలకి సొలభంలో అడ్డూ అదుపూ లేదు. అంతూదరీ లేదు. ఈ ఏడాదే ఎందుకనో వాడికంతా ఎదురు తిరిగేసింది. దారుణంగా అంకిపోయాడు. అంకడం అంటే అలా ఇలా కాదు. నిలువూనిపాతంగా వింతవింతగా చిక్కడి పోయాడు. తప్పు చేస్తూ చేస్తూ అయినవారికే అందడిపోయాడు. చేటమూలకి చేరేశాడు.

అంత సుళువుగా ఎవరికీ దొరకని కుంజిగాణ్ణి విరేచనాల భంజిగాడు పట్టుకోవడమే అసలైన చిత్రం. కల్తీలేని విచిత్రం.

ఊరికి దూరంగా ఉన్న పనసచెట్లను లక్ష్యంగా ఎంచుకుని ఓనాటి అర్ధరాత్రివేళ వాటంగా వాటి దగ్గరకి తరలిపోయాడు కుంజి. సడీ చప్పుడూ లేకుండా వెంట తెచ్చుకున్న గోనెల్ని ఒకానొక చెట్టు మొగదల పెట్టుకున్నాడు. గబగబా దాన్నెక్కిపోయాడు. కొమ్మల మీదికి పోనేపోయాడు. ఆలస్యం కూడదనుకున్నాడు. తొలికాయ తెంపి థక్కున కింద పడేశాడు. సరిగ్గా అప్పుడే వాడి ఖర్మ ఖరాగా కాలిపోయింది. వాడి బతుకు బేడాపరక అయిపోయింది.

చెట్టుమీంచి పనసకాయ జారిందే తడవుగా కిందనున్న డొంకల్లోంచి, 'అమ్మోయ్... అమ్మోయ్...' అనే గావుకేకలు పరిసరాలు ప్రతిధ్వనించేలా ఉన్నపళంగా వినిపించిపోయాయి. ఆ వెంటనే, 'చచ్చానోయ్..,' అనే చావుకేకా మింటినంటేసింది. నడిరేయిలో వేరే మనిషి గొంతు పెడబొబ్బగా బయల్పడటంతో చెట్టు మీదున్న కుంజికి కచ్చ తడిసిపోయింది. భీతావహం కమ్మే సింది. ఊహించని ఘటన ఎదురవడంతో పొడిబారిన జిహ్వాను తడిచేసుకునేందుకు నోరంతా నాలుక తిప్పుకోవడం మొదలెట్టాడు. మరులిప్తలోనే,

"ఏవయిందిరా మగడా!" అంటూనే డొంకలకి కాసింత దూరంగా రాయిమీద కూర్చున్న భంజి భార్య సువ్వాలమ్మ భారీ శరీరాన్ని కదపలేక కదపలేక కదుపుకుంటూ పనసచెట్టు దగ్గరసా వచ్చిపడింది. దాని మాట వినేసరికి కొమ్మనున్న కుంజికి పై ప్రాణాలు పైనే పోయాయి. కంగారెత్తిపోయాడు.

'ఈ వేళలో వీళ్లంతా ఇక్కడ తగలడ్డారేంట్రా తండ్రీ...' అనుకుంటూ మాను ఎక్కినవాడు మ్రాన్పడిపోయాడు. ఇంతకీ, అసలు విషయం ఏంటంటేను- భంజిగాడికి అడ్డపిక్కలంటే అతి మక్కువ. నిన్నటి దినాన పిక్కల పిచ్చి ముదిరిన భంజి, గంజి మానేసి వాటినే తడువు లేకుండా తింటూ పరవశించిపోయాడు. అలా గిద్దలకు గిద్దలు మింగడం వల్ల వాడి ఆసనం అదిరిపోయింది. వాయువు చెదిరిపోయింది. పారుడు పట్టుకుంది. తెరిపి ఇవ్వడం లేదు. ఎంతకీ తగ్గడం లేదు.

పెనిమిటి పాసనాలు కట్టించడానికి భంజిని తీసుకుని గణాచారి దగ్గరకి ఈ మధ్యాహ్నమే వెళ్లింది సువ్వాలమ్మ. ఆచారి మంత్రం వెయ్యలేదు. మందు ఇవ్వాలేదు. కొత్త శంక పోల్చాడు. ఇది సామాన్యమైన పారుడు కాదన్నాడు. తక్షణమే భంజిగాణ్ణి ఊరికి దూరంగా ఒక్కపూటకయినా పట్టుకుపొమ్మన్నాడు. అక్కడే ఉంచి వాము జలం ఆరారా పొయ్యమని బెత్తాయించాడు. అలా చెయ్యక పోతే ఊరందరూ అంటున పడిపోతారని స్పష్టపరిచాడు. దీంతో, తన నోములపంటను ఊరవతలి పనసచెట్లకు సాయంకాలమే చేర్చింది సువ్వాలు. అప్పట్నించీ భంజిబాబు డొంకల మధ్యనే గొంతికిళ్లా పల్లవించిపోతున్నాడు.

కాటు మూలుగుతున్న మొగుడి దరికి సువ్వాలమ్మ దిగబడిపోయి, 'ఏమైందేమైంది...' అంటూ అరుపులెట్టింది. ఆరా తీసింది. వాడు చెప్పలేక చెప్పలేక కాయ దెబ్బకి ధణుతెగిరిందని ఎరింగించాడు.

'ఇంత రాత్రివేళ పనసకాయ పడ్డం ఏంటి?..' అనుమాన పడుతూనే చెట్టుమీదికి సర్రున చూసింది సువ్వాలు. లీలగా ఎవడో కనిపించాడు. దెయ్యమని తొలీతా అనుకుంది. తన కంటే పెద్ద దెయ్యం ఎక్కడుంటుందన్న భావన రాగానే,

"ఎవడ్రా నువ్వు, ఈ వేళ చెట్టెక్కావ్," భీకరంగా గర్జించింది.

సువ్వాలమ్మ సంగతి కుంజికి తెలుసు. అది కొండల్లోకెల్లా పెద్దబండనీ తెలుసు. బదులివ్వకపోతే చెట్టెక్కిమరీ గుడ్డలూడదీసి తంతుందన్న నమ్మిక సైతం వాడికి ఉండనే ఉంది. ఆ భయంవల్లే తెలివిమీరాడు. అటునుంచి నరుక్కురావాలన్నట్టుగా కిలకిల మన్నాడు.

"అత్తా! ఎవరో కాదే, నేనే. కుంజిణ్ణి. అయినాగానీ, ఇంత రాత్రిపూట మొగుడూపెళ్లాలు ఇలా వచ్చేరేంటే?" ఏమీ తెలియని ఎర్రిపప్పలా అమాయకంగా అడిగాడు. ఆలకించిన సువ్వాలమ్మ ఆ పట్టున వ్యవహారమంతా గ్రహించేసింది. అది మహా ఠంగణం. మొదటిశ్రేణి ముదురుటెంక.

"నువ్వేంట్రా కుంజీ! చెట్టుమీదున్నావా? అలా చెప్పు. మరేం లేదురా. మీ మావయ్య నేనూ అరణ్యంలో అర్ధరాత్రి చెమ్మచెక్క లాడాలని ఉవ్విళ్లూరుతూ వచ్చాం. తీరా చూస్తే ముహూర్తం దగ్గర పడలేదు. ఇంతలో నువ్వేమో అడ్డుగా వెళిపొచ్చేసేవు. అల్లుడయితేనేం. నువ్వయినా ఆడొచ్చు కదరా చెమ్మచెక్క," ఒళ్లంతా ఊపుకుంటూ వికవికలాడింది.

కుంజికి చెమట్లు పట్టిపోయాయి.

'దీంతో చెమ్మచెక్కలాడ్డంకంటే సర్పంతో కరిపించుకుని చావడం మెరుగు..' ఎదను వర్రగా చేసుకున్నాడు. పైకి మాత్రం అదంతా కనబడనివ్వలేదు.

''నువ్వేదేదో మాట్లాడతున్నావే అత్తాయీ!'' వగలు పోబోయాడు. ఈ లోపటే సువ్వాలు పోటెత్తేసింది.

"నాకంతా తెలిసిపోయిందిలేరా మాయ నాకొడకా. నువ్వు పనసబాసలకి బొక్కెట్టేవు. గ్రామకట్టుకు చుక్కెట్టేవు. కాయల దొంగతనానికి ఒడిగట్టేవు."

ఊరంత నోటితో తలపడిపోయింది. పెళ్లాం ధర్మమాని విషయమంతా బోధపడిపోయిన పారుడు భంజి శుభ్రపడి నిదానమవుతూ నీరసమైన గొంతుతో,

"దొంగతనాలు తప్పురా కుంజా! నీవల్ల నా తల ఈవేళ శిల అయిపోయిందిరా మిండడా!" కోపడ్డాడు.

భంజి మాటలూ కుంజికి బాగానే గుచ్చుకున్నాయి.

''అవును మరి. నువ్వీవేళ ఈ చెట్టుకింద దుకాణం పెడతావని నేనేం కలగన్నానా,'' రోషం చూపించాడు. ఆ వెంటనే నాలుక్కరుచుకున్నాడు. చేసిన తప్పు దిద్దుకోవాలనుకున్నాడు.

"అత్తమ్మా! ఈ తప్పు కాయవే. నేను తెంపే పనసకాయల్లో సగం వాటా ఇస్తానే. క్షమించవే," చెట్టుదిగుతూ బతిమలాడాడు.

"నోర్ముయ్యరా బాజోటు ముండాకొడకా! నీలాగ అందరి పంటా ఆశించీదాన్లా అవుపిస్తున్నానేంట్రా. నువ్విచ్చేదెంతరా. ఈక పాటి చెయ్యదు. ఊరికి అప్పచెప్తే నీ సరద్దీరిపోద్ది," ఫడఫడలాడుతూ చెట్టు మొదల్లోనే వాణ్ణి వెనకనుంచి గభాల్న ఒడిసి పట్టేసింది సువ్వాలమ్మ. విడిపించుకునే ప్రయత్నం చెయ్యకపోలేదు కుంజి. వీలుపడలేదు. ఏనుగులాంటి సువ్వ సందిట వాడు గువ్వయ్యాడు. మర్రిలాంటి దాని శరీరం ముందర వాడి మేను మురిగింజంత అయిపోయింది.

పట్టుకున్న కుంజిని పట్టుకున్నట్టుగా నడిపిస్తూనే వాడు కోసిన రెండు పనసకాయల్నీ తీసుకురమ్మనమని భంజికి పురమాయించింది సువ్వాలు, మొగుడుగారు కాయలగోనె నేలన ఈడుస్తుంటే పెళ్లాంగారు కుంజిణ్ణి లాక్కొచ్చారు. ఈ లోపటే కోడిజాము అయి కూర్చుంది. పల్లె పెద్ద బొంతల గణ అప్పలరాజు ఇంటికి చోరీ సొత్తుతో సహా కుంజిని సువ్వాలమ్మ దంపతులు అప్పగించేశారు.

మరునాటి మధ్యాహ్నం కల్లుగీసే ఎడగీతవేళ ఊరివారంతా రచ్చబండకు చేరారు. బండమీది ప్రముఖులు ముందుగా సువ్వాలమ్మను మాట్లాడమన్నారు. రాత్రి జరిగిన సంగతంతా పూస గుచ్చినట్టుగా ఆయమ్మ చెప్పుకొచ్చింది. మధ్యమధ్యన భంజి కొన్ని ముక్కలేవో అందించాడు. జనాల మయాన బుర్ర వాల్చుకుని నిలుచున్న కుంజిని సమాధానం ఇవ్వాలంటూ తగుమనిషి అప్పలరాజు ఆదేశించాడు.

"వాడేం చెబుతాడు. నేరం చేసినవాడు. సిగ్గులేని బతుకు బతుకుతున్నాడు," కుంజి భార్య సోమాలు ముక్కు చీదుకుంది. చేసిన పొరపాటును కాదనేంత ధైర్యం కుంజికి లేదు. సాక్ష్యాలతో దొరికిపోవడంవల్ల మరో దారీ లేదు. దొంగతనాన్ని ఒప్పేసుకున్నాడు.

"శాన్నాళ్ల బట్టీ వీడిమీద ఆరోపణలొస్తున్నాయి. అయినా బుర్ర ఎగరేసుకుంటూ తిరుగుతున్నాడు. గట్టి దండన వేసి తీరాలి. లేదంటే వీణ్ణి చూసి మరికొందరు బయలెల్తారు. గూడెం గుండమైపోతుంది," జనంలోంచి కసికసిగా ఎవడో రగిలాడు.

"అవునవును. సరైన పాఠం చెప్పవలసిందే. పాతశిక్షలు కాదు. కఠినమైన సరికొత్త శాసింపు జరగవలసిందే." అక్కడ చేరిన వారంతా మూకుమ్మడిగా స్వరతంత్రులు కదపాయించారు.

అప్పలరాజుకు, మిగిలిన ఊరిపెద్దలకూ శిక్ష ఖరారు కార్యం అప్పుడిక గండమైపోయింది. అందరూ హర్షించేలా దోషికి చేయ వలసిన శాస్తి ఏమిటన్నది వాళ్లకి అంత తొందరగా అంతుబట్టలేదు. ఒకళ్లతో ఒకళ్లు గుసగుసగా ఏదేదో చెప్పుకున్నారు. బుర్రా బుర్రా రాపాడించుకున్నారు. నుదుళ్లూ నుదుళ్లూ చిట్లించుకున్నారు. సమయం గడిచింది. నిశ్శబ్దం నిగిడింది. బండ కిందన కూర్చున్న వారిలో చీకాకు మొదలైంది. అసహనమూ పెరిగింది. అంతలోనే అప్పలరాజు కంఠం ఖంగుమంది.

"కుంజి చేసిన పని గట్టి సమస్యే తెచ్చిపెట్టింది. విజ్ఞులందరూ చివరికి నామీదే భారం వేశారు. ఆ మోదకొండమ్మ దయవల్ల నాకో ఆలోచన తట్టింది. అది చెప్పడానికి ముందు నా ప్రశ్నలకి మీరంతా జవాబివ్వాలి," గబగబా అనేశాడు.

"తప్పకుండాను." భంజి నిమ్మళంగా పలికాడు.

అప్పలరాజు మళ్లీ అందుకునేశాడు.

"పనసలు పూర్తిగా పండిన తర్వాతనే మనమంతా దింపుడు మొదలెడతాం. అవునా?" తెలియనిదేదో తెలుసుకోగోరుతున్న చందంగా భాషించాడు.

"అవును మావా! పండు అయ్యాకనే పనస కోస్తాం." ముక్త కంఠంతో బదులిచ్చారు జనం.

"పనసలు ఫలించాక మనకు పోటీగా చెట్లమీదికి ఎగబడేవి ఏవి?" చిరునవ్వుతో రాజు అడిగినప్పటికీ, ఏకమాటగా అందరూ ఎగిసిపడిపోయారు.

"ఎలుగుబంట్లు," చులాగ్గానే సమాధానం చెప్పేశారు.

"పనసలు పీక్కుని తొనలన్నీ కడుపునిండా తినేశాక ఆ ఎలుగులన్నీ చేసేదేంటి?" అప్పలరాజు రెట్టించాడు.

ఆ దెబ్బకి, ప్రజాళి మొత్తం ఒక్కసారిగా మొహం మీదికి నవ్వులు తెచ్చేసుకుంది. భంజిగాడయితే విరివిగా విరగబడ్డాడు.

"పూటుగా పనసతొనలు భోంచేశాక వాటి పిక్కల్ని ఏ చెట్ల కిందనో, ఏ తుప్పల్లోనూ ఎలుగుబంట్లు బర్రుబుర్రుమనిపిస్తాయి." ఘుల్లుఘుల్లుమన్నారు.

పకపకలతో గలగలలాడాడు. అందరూ ఆ మాటలకు మరింతగా.

"అప్పుడు మనమేం చేస్తాం." అంత ఘొల్లులోనూ గొంతు పెంచాడు రాజు.

ఈసారి పెద్దాయనెవడో కల్పించుకున్నాడు.

"ఏం చేస్తాం. పక్క ఊరి కూలీలకి డబ్బులిచ్చి ఆ ఏరుగుళ్లన్నీ ఎత్తిస్తాం. పిక్కలన్నీ శుభ్రంగా కడిగిస్తాం. దాస్తాం." అందరికీ తెలిసిన విషయమే అయినా, తనొక్కడికే తెలిసినంతటి దర్జాతో గొంతెత్తాడు. మీసాలూ మీటుకున్నాడు.

ఆ మరుక్షణమే అప్పలరాజు ఇంకొంచెం బింకంగా మారి పోయాడు. నోరు బాగా సాగదీసుకున్నాడు.

"పనసపళ్లు ఆరగించాక ఎలుగ్గొడ్లు చేసే విసర్జనాలను గతంలో కూలీల చేత ఎత్తించేవాళ్లం. ఈ సంవత్సరం కూలీలను పెట్టం. వాళ్లకు బదులుగా కుంజిగాడే ఎత్తాలి. ఎత్తిన పిక్కల్ని కొండవాగులో కణికిల్లా కడగాలి. వాటిని తెచ్చి చింతగింజల పాతర, మావిడిటెంకల పాతరల పక్కనే నేల తవ్వి ఊరుమ్మడి పాతర పాయ్యాలి. సొలభం ఇరుపంచాలా ఎలుగు పేడ ఈ ఏడు కనిపించనేకూడదు. కనిపిస్తే మటుకు కుంజిగాడి శిక్షాకాలం పెరిగిపోతుంది. ఇదే కొత్త తీర్పు. సిసలైన తీర్పు. పెద్దల తీర్పు."

గడగడా చెప్పేసి టపటపా బండ దిగేశాడు.

ఎప్పుడూ ఎవ్వరూ చెప్పని, మరెప్పుడూ ఎక్కడా వినని దండన వెలువరించిన రాజుకు సంభ్రమంతో సర్వులూ జేజేలు పలికారు. హర్షధ్వానాలతో అభినందనలూ తెలిపారు.

ప్రత్యేకమైన ఆ తీర్పును చురుగ్గా బుర్రకెక్కించుకున్న కొందరు మాత్రం అక్కడికక్కడే రోత చెందిపోయారు.

"అబ్బా! మలినం... మలినం... ఎలుగుబంటి అద్దె... దుర్వాసన... దుర్వాసన... దయిద్రం... దయిద్రం... ఛీ... ఛీ..." అసహ్యపడిపోతూ కుంజివైపు తిరిగారు.

వాడిమొహంలో నెత్తురు చుక్కలేదు. ఇంత అసహ్యకరమైన శిక్ష తనకు పడుతుందని వాడెన్నడూ ఊహించలేదు. పాలిపోయి నట్టయ్యాడు. చేసేదేంలేక, పక్కనే ఉన్న పెళ్లాం సోమాలు వైపు దీనంగా చూశాడు.

అది కూడా మూక్కూనోరూ మూసుకుని మొగుడి కళ్లల్లోకి ఆ క్షణాన అదోలా చూసింది! కేండ్రకించి ఊసింది!!



చింతకింది శ్రీనివాసరావు సీనియర్ జర్నలిస్ట్. కథా, నవల, నాటక రచయిత. వందకు పైగా కథలు రాసారు. ఆరు నవలలు రాసారు. నాలుగు కథాసంపుటాలు, నాలుగు నవలలు, రెండు నాటకాలు ప్రచురించారు. వీరి నవల 'మున్నీటి గీతలు'కు తానా బహుమతి లభించింది. క్రిష్ దర్శకత్వంలో త్వరలో వెబ్ సిరీస్‌గా రాబోతోంది. నివాసం విశాఖజిల్లా, చోడవరం.

తెగని పరిణతులతో...

మధురాంతకం నరేంద్ర



"అయ్యో పెద్దాయనా! అట్లా సోలిపోయి పడిపోయినావేమి? లెయ్యి పైకి..."

బాగిచెట్టు నీడలో బండరాతి పైన చిన్న మూటలా ముడుచు కుని పడుకున్న ముసలాయన నీరసంగా కళ్లు తెరిచాడు.

చిలుంపట్టి వంగిపోయిన పాత కొడవలిలా సన్నగా బలహీనంగా వున్నాడతను. యెముకలు తేలిన అతడి పొడవాటిశరీరానికో చివర మురికిదాగుల పంచె వేలాడుతుండడంతో అతగాడి ఆకారం జియ్యంగారి చేతిలోని త్రిదండంలా పడి వుంది.

భుజాల వరకూ వేలాడుతున్న వెండి తల వెంట్రుకల్లో తగులుకున్న యెండు టాకులు మువ్వల్లా గలగలమంటున్నాయి. ముఖం నుంచి వేలాడు తున్న తెల్ల గడ్డం యెదరొమ్ము దగ్గరికొచ్చాక పలచబడి కుచ్చు లూడిన వింజామరలా వూగిసలాడుతోంది.

అతడి పక్కన దీనంగా పడివున్న పాత తంత్రీనాదాన్ని తన చేతికెత్తుకుని, "చూసేదానికి నెలదినాలుగా లంఖణాలు పడుండే టట్టుగా గనబడతా వుండావు. లేచి యీ ప్రసాదం కొంచెం తిను పెద్దాయినా! వొంట్లోకి కొంచెం శక్తొస్తే సాగబారచ్చు," అందామె.

తెల్లటి కనుబొమ్మల కింద కొడిడగుతున్న దీపాల్లా వెలవెల బోతున్న కళ్లను బలవంతంగా తిప్పుతూ తల పైకెత్తాడతను. ఆమె కంటబడగానే అతడి చూపుల్లోకి వింత వెలుగేదో వచ్చి నిలిచి నట్టయింది.

''నీకోసమనే యేమో, యీ వరమాన్నం జారుగా తయారయింది. నోట్లో పెట్టుకుంటే సాలు, దానిపాటు కదే గొంతు దిగిపోతింది. లేచి తిను,'' అందామె.

అప్పుడే తెరిచిన అతడి కళ్లకు ఆకుపచ్చ అంచున్న యెరుపు పట్టుచీర కట్టుకున్న ఆమె తొలి కిరణాలు పడగానే విచ్చుకుంటున్న తామరపువ్వులా కనబడింది. లేచి కూచుని, పచ్చటి తామరదొప్పెలో కరిగిన ముత్యాలరాశిలాగున్న పరమాన్నతడు రెండు గుక్కలు మింగేసాడు. కళ్లల్లోకి మరికాస్త వెలుతురూ, శరీరంలోకి యింకాస్త శక్తీ వచ్చినట్టయింది.

తూర్పు నుంచీ ముసురుకుంటున్న యెండ అతడిపైకి వాలకుండా అడ్డంగా నిలబడి వుందామె. ఆమె వెనక నేలపైనో పల్లకీ దిగి వుంది. పల్లకీకి రెండువైపులా నిలబడి వున్న బోయీలకవతల, కొండపై కెగబాకుతున్న మట్టిబాటపైన, గరుడస్తంభం పట్టుకున్న పసుపు దుస్తుల పడుచువాడి వెనక పదిహేనుమంది అదేరకపు దుస్తుల ఆడా మగా యాత్రికుల గుంపు గోవింద నామస్మరణ చేసుకుంటూ వెళ్తోంది.

తందానాన అహి - తందనాను పురె
తందానాన భళా - తందనాన...

యాత్రికుల పాట వింటూనే ముసలాయన చేయి అసంకల్పి తంగా ఆమె చేతిలోని జంత్ర వాయిద్యంకేసి సాగింది. ఆయన వేలు తగలగానే దాని తీగల్లోంచీ జుయ్యిమంటూ రాగమొకటి పుట్టు కొచ్చింది.

"బాగా నీరసంగా వుండావు. నేను నడస్తాన్లేగానీ, నువ్వు పల్లకీ యెక్కు... పోదాం పైకి," అందామె.

మావిచివురు కనబడగానే నోరు తెరిచే కోయిలలా, ఆమె మాటల చెవినబడగానే అతని శరీరం అమాంతంగా పైకి లేవబో యింది. పల్లకీ బోయీలిద్దరూ సరసరా ముందుకొచ్చి నిలువునా వూగిపోతున్న అతడి శరీరాన్ని పైకెత్తుకుని, పల్లకీలో కూచోబెట్టారు.


పల్లకీ ముందుకు కదిలింది. దానిపక్కనే ఆమె నడవసాగింది. లేడిపిల్ల కాళ్లలా నేలకు తాకీ తాకకుండా గెంతుతున్నట్టుగా నడుస్తున్న ఆమె పాదాలను కళ్లార్పకుండా చూడసాగాడతను. ఆమె పాదాలకు చుట్టుకున్న బంగారు మంజీరాల్లోంచి కొత్త రాగమొకటి వినరాగానే అతడు పులిక్కిపడ్డాడు.

"ఆపండాపండి," అని పెద్దగా అరిచాడతను.

ముందు మోస్తున్న బోయీ వెనక్కోసారి తిరిగిచూసి ఆగకుండా నడుస్తూ అదోలా నవ్వాడు. ఆ బోయీ ముఖంలో పెద్దగా పొడుచుకొచ్చినట్టుగా కనబడుతున్న ముక్కుకేసి అయోమయంగా చూసాక, "నేనింక అక్కడ వుండనని చెప్పేసి వచ్చేసినాను. మళ్లా నన్ను పైకెందుకు యెత్తుకుపోతా వుండారు?" అని అడిగాడా ముసలాయన.

చక్కిలిగింతలు పెడుతున్న నవ్వొకటి నవ్వాక, "అలిగొచ్చేసి నావా? యెవురిపైన? మండలాధీశుని పైన్నా?" అని అడిగిందామె.

ముసలాయన మరోసారి ఆమెకేసి ఆశ్చర్యపడుతూ చూసి, "మండలాధీశుడేం చేస్తాడు పాపం! వేషం వేసినోడిపైన అలిగేదేం న్యాయం? ఆడించేవాని పైన్నే అలగాలగానీ..." అన్నాడు.




"అద్గదీ మంచిమాట చెప్పినావు. అయితే యిట్లాంటి అలకలెన్ని చూసినాడోగదా ఆ పెద్దమనిషి! యెవురిదాకానో యెందుకు, నేనే చాలాసార్లు అలిగాను. అయితే యెంత పెద్ద అలకనైనా మబ్బును లాగేసి నట్టుగా మాయ చేసేది ఆయినకొచ్చినంత బాగా యెంగువురికీ తెలియదు. నా అంతట నేనే బయిల్దేరి రావల్సి వచ్చింది చూడు. యీసారి మనిద్దరమూ కలిసి కడిగేద్దాం పద," ఆమె మాటలకు చిలిపి నవ్వులు వంత పాడుతూనే వున్నాయి.

ముసలాయన ఆమె నడుస్తున్న వైపుకు వొరిగి, కళ్లు చిట్లించుకుని చూసి, "నా అలకంటే సాధారణ మైందిగాదని ఆ స్వామిగారికి గూడా తెలుసు తల్లీ!

నన్ను సాదాసీదా మనిషనుకున్నావు నువ్వు పాపం! సంవత్సరానికొక సారైనా యిక్కడికి యిలుదీర్థం వచ్చే వాళ్ల కంతా నన్ను గురించి బాగా తెలుసు. అన్నమాచార్యుడనే పేరు విన్నావా నువ్వెప్పుడైనా?" అని అడిగాడు పెద్దగా వూపిరి తీసి వదులుతూ.

"పేరైతే విన్నాన్లే! నేరుగా చూళ్లేదుగానీ, కొండలరాయడి పైన పదాలు రాసి పాడే ఆయన గురించే గదా నువ్వు అడిగింది. కొంప దీసి, నువ్వేనా ఆ పదాలపాటల కవి?" ఆమె గొంతులో పరాచికాలే దొర్లుతున్నాయి.



యెగుడుదిగుడు బాటలో సాగుతుండడం వల్ల, పల్లకీ ముసలాయన శరీరాన్ని వూయల్లా వూపుతోంది. కన్నీళ్లతో తడిబారిన కళ్లతో ఆమెకేసి చూసాడతను. చినుకులో దూరి యింద్ర ధనుస్సుల్ని పూయించే సూర్యకిరణాల్లా అతడి చూపులు తడిబారిన కళ్లల్లోంచి సాగి ఆమె చుట్టూ రంగుల్ని విరిపించినట్లు తోచగానే అతను విస్మయుడైపోయాడు. అంతలోనే తేరుకుని, "నా పదాలు వినే వుంటావు. కానీ నా గురించి నీకేం తెలుసులే తల్లీ!" అంటూ పెద్దగా మూలిగాడు. రెండు నిముషాలు కళ్లు మూసుకుని తెరిచాక, "కాగడా పెట్టి వెతికినా నా పదాల్లో నేను దొరకను. అందుకే యిట్లా శాంతి జరిగింది నాకు!" అన్నాడు. మరికాస్సేపాగి, "అన్నీ ఆయనే చూసుకుంటాడుగదా అని యేమారిపోయాను. నన్ను గురించి నేనే పట్టించుకోలేదని యిటీవలిదాకా తెలియదు నాకు," అన్నాడు.

"నీ పదాలనీన విన్నాన్లే పెద్దాయనా! నువ్వు పాడిందంతా ఆయన గురించేనంటే వొప్పుకుంటాను. అయితే నీ పదాల్లో నువ్వు లేనంటే మాత్రం యెవురూ వొప్పుకోరు..." ఆమె మాటల్లో యీసారి కాస్త కోపం తొంగి చూసింది.

అంత నీరసంలోనూ ముసలాయన శరీరం నారి తెగిన విల్లులా చివాలున పైకి లేచింది. "యెంత మాటన్నావు తల్లీ! నిన్న నేను రాసిన పదం వినుండవు.

నాలిక పై నుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితివి...
యీ మాట గర్వము గాదు - నీ మహిమే కొనియాడితిగాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పి వాడగాను

యిది వినయంగా చెప్పిన మాట మాత్రమేగాదు, సత్యం కూడా! అయితే నా గోడు మాత్రం ఆయన చెవికెక్కలేదని నిన్న మాత్రమే తెలిసింది నాకు..." కోపంతోనూ, బాధతోనూ అతడి గొంతు గాలిలో వూగే దీపంలా వణికింది.

"నీ బాధేందో నాకే తెలిసిపోయింది. ఆమాత్రం ఆయన తెలుసుకోలేదా..." జాలితో ఆమె మాటలు వెన్నలా వెలువడ్డాయి. అయినా అతని కోపం ముందా వెన్నంతా కరిగిపోయింది.

"యేం తెలిసింది నీకు? నా పాటల్లో, పదాల్లో ఆయన తప్ప యింకెవురికీ చీమంత తావైనా దొరకలేదు. ఆయన్ను గురించి తప్ప యింకేమీ నాకెప్పుడూ కాబట్టిందీ లేదు." అతడి నీరసాన్నతడి కోపం మరింతగా పదునుబెట్టింది.

"నేరుగా చెప్పకపోతే మాత్రం తెలుసుకోలేమా పెద్దాయనా?" నచ్చజెప్పుతున్నట్టుగా ఆమె నెమ్మదిగా చెప్పుకుపోసాగింది. "అసలు కవ్వమంటేనే వక్రోక్తి గదా! పాట యెట్లా వొరిగిందో చూసి పాడేవాడ్ని గురించి తెలుసుకోలేమా చెప్పు! యింకా నమ్మకం రాకపోతే, నేనో సంగతి చెప్తాను విను. యీ తిరుమలకు రాక ముందు, చిన్నప్పుడు మీ వూర్లో వున్నప్పుడు, నిన్ను మీ అమ్మానాయినా, అన్నలూ వదినలూ యేవేవో పనులు చెప్పి విసిగించినారు. ఆ పనులే గొప్పనుకొని నువ్వుగూడా చానాదినాల పాటు వెంగటేశ్వరుని వూసే యెత్తుకోలేదు. ఆపైన అది తలచుకోని పశ్చాత్తాపంతో కుమిలిపోయినావు..."

విస్తుపోయిన ముసలాయన పల్లకీలో నిటారుగా కూర్చున్నాడు. "అవున్నిజమే! ఆ సంగతి నీకెవురు చెప్పినారు?" అతడి ప్రశ్న యీటెలా దూసుకొచ్చింది.

"యింకెవురు నువ్వే!

మిగులవీరల పొందు మేలనుచు
హరి నాత్మ దగిలించలేక చింతాపరుడనైతి

అని నువ్వే ఆ పదంలో చెప్పుకున్నావు..."

ముసలాయన తల వాలిపోయింది. "నిజమే! పశ్చాత్తాపం ముంచుకొచ్చి నాకు తెలియకుండా నన్ను గురించే చెప్పేసినాను. ఆ సంగతి నువ్వు చెప్పేవరకూ గుర్తేలేదు. చూసేదానికి చిన్న దానివిగా కనబడతా వుండావుగానీ, భలే తెలివి తల్లీ నీకు!"

"యింత మాత్రానికెంతో తెలివిగావాల్నా పెద్దాయనా! నువ్వు తొలిసారిగా తిరుపతికొచ్చి తాతయ్యగుంటలో వుండే గంగమ్మ

పూజ్జేసినాకే గదా ఆమెకు తాళ్లపాక గంగమ్మ అనే పేరొచ్చింది. అదెప్పుడు జరిగిందో తిరుపతిలో వుండే పసిపిల్లోడ్నడిగినా చెప్తాడు.''

ముసలాయన పల్లకీ బయటకు తల వంచి,"అదీ నిజమే! అయితే జనం చెప్పిన మాటలతో నాకు సంబంధం లేదు,'' అనేసారు.

"నేను సంబంధాల గురించి మాట్లాడలేదు పెద్దాయనా! తెలిసిన నిజాల గురించి చెప్తా వుండానంతే! దేన్నయినా తొలిసారిగా చూసినప్పుడు వచ్చే ఆశ్చర్యాన్నీ, సంభ్రమాన్నీ కనిపెట్టేది కష్టంగాదు. తిరుపతి గురించి నువ్వు పాడిన పదం వింటే నువ్వా వూర్లోకి అడుగుపెట్టిందెప్పుడో చెప్పలేమా! కొండెప్పుడెక్కినావో తెలుసుకోవాలంటే కొండెక్కేదాన్ని గురించి నువ్వు రాసిన పాట చాలదా? తోవ భాష్యకారుల గురించీ, పుష్కరిణి గురించీ, విష్వక్సేనుడ్ని గురించీ, బేది హనుమంతుల్ని గురించీ, చివరకు ప్రసాదాల గురించీ, మూలమూర్తిని గురించీ నువ్వెప్పుడు పాడినావో తెలిసిపోతానే వుంది. నీ పెద్ద భార్యను తొలి తెలుగు కవయిత్రి అని పొగిడినప్పుడు నీకింకో భార్యుండాదని తెలిసిపోలేదా? పైగా ఆ రెండో భార్య కొడుకు నీ కళ్ల ముందరే పెద్ద కవయిపొయినాడు. నీకూ, పెనుగొండ నరసింగరాయుడికీ వచ్చిన గొడవలనంతా నువ్వే పదాల్లో పాడీ పాడీ చెప్పుకుంటివి. అంతెందుకు, నీకు పెండ్లయినప్పుడు నీ దేవుడి పెండ్లిళ్ల గురించీ, నీకు బిడ్డలు పుట్టినప్పుడు దేవుడి చిన్నతనం గురించీ, గుడిలో నీకు దర్బారుగా వుండినప్పుడు బ్రహ్మోత్సవాల గురించీ పాడినావు. యిద్దురు పెళ్లాలూ కాలమైపొయినాక, యిప్పుడు గదా వైరాగ్యంలోకి దిగినావు..."

ముసలాయన పల్లకీలో ముడుచుకుని పడుకునేసాడు. అతడి ముఖం కన్నీళ్లతో తడిసిపోయింది. గుడిగంటలు వినబడ్డాకగానీ అతికి స్మారకం రాలేదు.

"వచ్చేసినాం పెద్దాయనా! కావాలంటే నువ్వింకొంచేపు విశ్రాంతి తీసుకో... యాలోపల నా పని ముగించుకొనొచ్చేస్తాను,'' అందామె ముందుకు చకచకా నడిచిపోతూ. ఆమె వెనకే బోయీలిద్దరూ నడచిపోతున్నారు.

వొళ్లంతా వెంట్రుకలున్న వెనక బోయీ తిరిగి చూసినట్లనిపించిందతనికి. పెద్ద తిరుపుంశ్రాలున్న ఆ వ్యక్తి నోరు వుబ్బుగా ముందుకుబికినట్టుగా అనిపించగానే ముసలాయన వులిక్కిపడ్డాడు.

ఆలయం పైన గొడుగు పట్టినట్టుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. అయినా పుష్కరిణి పైన్నుంచీ వీస్తున్నగాలి హాయిగా, వెచ్చగా వుంది.

ఆలయ మహాద్వారం గుండా లోపలికి పెద్ద గుంపు వెళ్తోంది.

వున్నట్టుండి చెప్పలేనంత బలమేదో తన శరీరంలోకి దూరినట్టుగా ముసలాయన పైకి లేచాడు. తుపానులో వూగిపోయే అవిశమొక్కలా అతని శరీరం పెద్దగా వూగిపోతోంది. వూడిపోతున్న ధోవతినతడు పట్టించుకోలేదు. సుట్రగాలిలో తగులుకున్న చెక్క పేడులా అతడి శరీరం ఆలయద్వారం దాకా విసురుకొచ్చింది. కోట తలుపుల్లా వున్న ఆలయ ద్వారాలు అప్పటికే మూసుకుపోయి వున్నాయి.

పిచ్చిపట్టినవాడిలా అతను తలుపుల పైన రెండు చేతుల తోనూ మోదసాగాడు. తలుపులకున్న చిన్న కంత మాత్రం తెరుచుకుంది.

"రోజూ నీతో పెద్ద యాతనైపోతా వుండాది. వొకసారి చెప్తే నీ తలకెక్కదా? నిన్న తరిమితే గూడా తెలివి రాలేదా? యిది మండలాధీశుడు కోసం ప్రత్యేక పూజ జరిగే దినం. నువ్వేగాదు, వానబ్బ పాలాక్షుడైనా, రేపుటిదాకా లోపలికి రాలేరు..." కంతలోంచి తొంగి చూసిన ముఖం చెప్పడం పూర్తవగానే దానిపైకి చిన్న తలుపును లాగేసుకుంది.

వేర్లు తెగిన చెట్టులా ముసలాయన నిస్త్రాణగా అలాగే నిలబడిపోయాడు. అతడికి మళ్లీ యేడుపు ముంచుకొచ్చింది. వొకప్పుడా గుడి తలుపులు తనకోసం ప్రత్యేకంగా వేచి చూసేవని అతడికి గుర్తుకొచ్చింది. కొత్త అధికారులకు పాటలూ, పదాలూ పట్టవని తెలిసాక కూడా అక్కడే తానుండడం తప్పని మరోసారి అనుకున్నాడతను. మాసిపోతున్న జ్ఞాపకాలను బలవంతంగా గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఆలయద్వారాని కెదురుగా వున్న గొల్ల మండపంలోకొచ్చి కూలబడ్డాడు. గాలి వీస్తున్నా అతడి వొళ్లంతా చెమటలు పట్టసాగాయి.

పాడుకుంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న యాత్రికుల గుంపకటి దగ్గరకొచ్చింది.

తందనానా అరి, తందనాన పురె

తందనానా భళా తందనాన...

గుంపులోంచి వచ్చిన ముసలావిడొకతి, %%ఆకలిగా వుందానాయినా! యింద తిను,'' అంటూ విస్తరాకును అతడి ముందుంచింది. వద్దన్నట్టుగా తల అడ్డంగా వూపాడతను. చేతిని ఆలయ ద్వారం కేసి చాపి, చెప్పడానికి ప్రయత్నించాడు. కానీ మాటలు పెగల్లేదు.

"లోపలికి నిన్ను కూడా రానీలేదా వాళ్లు? మమ్మల్ని కూడా తరిమేసినారు. నూరంటే నూరు యోజనాల్నించీ కాలూ కాలూ కొట్టుకుంటూ నడిచొచ్చినాము. రేపుటిదాంకా దేముడ్ని చూపియ్యమన్నారు. యిప్పుడు మగరాజులకు తప్ప మనమాదిరి అలగా జనాలకు దర్శనం దొరకదు పొమ్మన్నారు. పోనీలే, దేవుడు లోపలేనా వుండేది? కొండంతా దేముడే! చూసే కల్లుండాలంతే!..." ఆవిడ మాట్లాడుకుంటూనే వెళ్లిపోయింది.

ముసలాయన కళ్ల ముందు పెద్ద మెరుపు మెరిసినట్టయింది. స్థంభాన్ని గట్టిగా పట్టుకుని పైకి లేచాడు. యెవరో తరుముతున్నట్టుగా పల్లకీ దగ్గరికి దూసుకెళ్లాడు. పల్లకీలో పడున్న తన తండ్రీవాయిద్యాన్ని ప్రాణాన్ని పట్టుకున్నట్టుగా చేతికెత్తుకున్నాడు. పల్లకీ పక్కనే నేలపైన కూర్చుని వాయిద్యపు తీగలపైన వ్రేళ్లు మోపాడు. అతడి గొంతులోంచీ పాట తెరలుతెరలుగా పెల్లుబికింది.

తందనాన అహి, తందనాన పురె
తందనాన భళా, తందనాన
బ్రహ్మమొకటే, పర
బ్రహ్మమొకటే, పర
బ్రహ్మమొకటే, పర
బ్రమ్మమొకటే॥

కందువగు హీనాధికములిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ।
ఇందులో జంతుకుల మంతా ఒకటే
అందరికీ శ్రీహరే అంతరాత్మ॥

నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర - అదియునొకటే।
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
ఛండాలుండేటి సరిభూమి యొకటే॥

అనుగు దేవతలకును అలకామ సుఖమొకటే
ఘన కీట పశువులకు కామ సుఖమొకటే
దిన మహోరాత్రములు - తెగి ధన్యాద్యునకొకటే
వొనర నిరుపేదకును ఒకటే అవియు॥

కొరలి శిష్టాన్నములు తునుకాకలొకటే
తిరుగు దుష్టాన్నములు తినుకాకలొకటే
పరగు దుర్గంధములపై వాయువొకటే
వరస పరిమళమువై వాయువొకటే

కడగి ఏనుగుమీద కాయు ఎండొకటే
పుడమి శునకము మీద బొలయు నెండొకటే।
కడుపుణ్యులను, పాపకర్ములను సరిగావ
జదియు శ్రీ వేంకటేశ్వరు నామమొకటే॥

"బాగుంది పెద్దాయినా, భలే బాగుంది."

అతను తిరిగి చూసాడు.

పల్లకీలకెక్కి కూర్చుని వుందామె. బోయీలిద్దరూ పల్లకీ రెండు వైపులా సిద్ధంగా నిలబడి వున్నారు.

"గుడిలోకి నిన్ను రానిచ్చి వుంటే యీ పదం పుట్టేదేగాదు. అంతేగదా?"

ముసలాయన మరోసారి పెద్దగా వులిక్కిపడ్డాడు.

విస్మయంతోనూ, విభ్రమంతోనూ తెరుచుకున్న అతడి నోరు అలాగే వుండిపోయింది.

"యిదే గొల్లమండపంలో వొక రాత్రంతా నువ్వు నిద్ర లేకుండా వుండి పోయినావని తెలిసింది నాకు. యెప్పుడో యాభై అరవై సంవత్సరాల ముందు జరిగిన సంగతి. కానీ అది నిన్ననే జరిగి నట్టుగా గుళ్లో వుండే స్వామొకడు నా చెవినేసి పోయినాడిప్పుడే..."

ముసలాయన్నొక్కసారిగా ఆ పాత జ్ఞాపకం ముంచెత్తేసింది.

"అదే పదమో గుర్తుందా నీకు? ఆ గుడి స్వామే నాకూ జ్ఞాపకం చేసినాడు.

పలుకుదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభుని గలసినదిగాన


అదేగదా?"

ముసలాయనకంతా వివరంగా గుర్తు రాసాగింది.

అవి తన పెద్ద భార్య మొదటి కానుపు కోసం పుట్టింటికెళ్లిన రోజులు. యింట్లో చిన్న భార్యొకతే వుంది. పుష్కరిణి కవతల కొత్త యిల్లొకటి కట్టుకోవాలనుకుంటున్న సమయమది. కొడుక్కు యిల్లు గట్టించడం కోసం తన తండ్రి తన తల్లితోబాటుగా వచ్చాడు. సాయంకాలమనగా భార్యను తీసుకుని యింటి స్థలానికెళ్లి, కట్ట బోయే యింటికోసం నేలపైన గీతలు గీయడం మొదలుపెట్టాడు. సరిగ్గా తాను రాయబోయే పదంలో మొదటి చరణంలోనే సంధి గట్టం విరుచుకుపడింది.

పలుకుదేనెల తల్లి పవళించెను।
కలికి తనముల విభుని గలసినదిగాన॥
నిగనిగని మోముపైనెరులు గెలకుల జెదర
పగలైన దాక జెలి పవళించెను॥

ఆమె ఆలస్యంగా పడుకుంది. యెందుకని? ఆమె భర్త ఆలస్యంగా యిల్లు చేరాడు. అయితే ఆయనకంత ఆలస్యమెందు కయింది? అంతవరకూ ఆయనేపనిలో మునిగిపోయాడు? అదీ ప్రశ్న. దేవుడ్నిగూడా వివశుడ్ని చేసి ఆలస్యం చేయించే ఆ పని యేది?



ఆలోచిస్తూ గొల్లమండపంలో కూర్చున్నాడు తాను.

యెంతకూ ఆలోచన తెగలేదు.

ఆలయంలో యేకాంతసేవ జరిగిపోయింది.

తలుపులు మూసుకుని పూజారులూ వెళ్లిపోయారు.

ఆకాశంలోకి నక్షత్రాలొచ్చేసాయి.

పుష్కరిణి కూడా నిద్రపోయింది. తనకు మాత్రం నిద్ర రాలేదు. సమాధానం దొరకలేదు. తెల్లవారడం కూడా తనకు తెలియలేదు.

గోగర్భం నుంచి తీర్థజలాలు మోసుకుని పూజారులు ఆలయంలోకెళ్లారు. సుప్రభాతం కూడా ప్రారంభమైపోయింది.

అక్కమాంబ తనను వెతుక్కుంటూ వచ్చింది.

రాత్రంతా మేలుకున్నందువల్ల ఆమె కళ్లు యెర్రబారిపోయి వున్నాయి.

"యింకా పదం పూర్తిగాలేదు. నువ్వెళ్లు," అన్నాడు తాను.

"ఆ పూర్తి చేసేదేదో యింటికెళ్లాక చేసుకోవచ్చు. పోదాం పద."

ఆవిడది కోపమో, బాధో తెలియలేదు తనకు. పల్లవి వెంట సాగే చరణంలా ఆమెననుసరించాడు.

యింటికెళ్లాక, "మా నాన్న, అమ్మా యేరీ?" అని అడిగాడు.

"యిప్పుడు గుర్తుకొచ్చారా వాళ్లు?" ఆమె ముభావంగా కసిరింది. "ఆ తంత్రీ యీ కొడుక్కు అబ్బేగదా! యింటి గీతలు గీస్తా రాత్రంతా అక్కడే వుండిపొయినట్టున్నారు. యింకా యిల్లు చేరలేదు."

యింతలో ముసలి దంపతులిద్దరూ యింటిలోపలికొచ్చారు.

వాళ్ల కళ్లు చంత్రనిప్పుల్లా మెరుస్తున్నాయి.

"రాత్రంతా అక్కడేం పని? యిందుకేనా యిక్కడికి మీరొచ్చింది?" తాను కస్సుమన్నాడు.

నులకమంచంపైన నడుం వాల్చాక తన తండ్రి పెద్దగా నిట్టూర్చాడు. "ముందుగా నీకూ, నీ పెళ్లాలకూ మాత్రమే యిల్లు గదా అని గీతలు గీసినాను. పుట్టబోయే బిడ్డల గురించి మీ అమ్మ అప్పుడు జ్ఞాపకం చేసింది. యిటుకపైన యిటుక పేర్చినట్టుగా నీ సంసారమూ పెరిగిపోతింది గదా! యెంతమంది పుడతారు? అందరికీ సరిపోవాలగదా! అంతా ముందుగానే ఆలోచన చేసుకోని, జరగబోయే దానికనుగుణంగా గీతలు గీస్తే ఆపైన యిల్లు కట్టేదెంత పని? అందురూ పడుకునేదెక్కడ? ధాన్యం యెక్కడ పెట్టుకోవాల? వంటిల్లు యే పక్కనుంటే అనువుగా వుంటింది? అన్నీ ముందుగా చెప్పచ్చుగదా, అంతా గీసినాక మీ అమ్మ కొత్త సంగతొకటి తోలుకొస్తాది. మళ్లా తొలి నుంచీ గీతలు గీయాల... సగం పని గూడా కాలేదు."

"ఆ లెక్కలేవో నువ్వొక్కడే చేస్తే పోలేదా? దానికోసరం అమ్మ దగ్గిర కూడా జాగారం చెయ్యించాల్నా?" రాత్రంతా మేలుకున్నందువల్ల వచ్చిన కోపాన్ని తండ్రి పైకి మళ్లించాడు తాను.

"సిర సర్లే! ఆమె పక్కన లేకపోతే నన్ను నేనే మర్చిపోతాను. ఆమె గెవనం జేస్తేగానీ నాకేదీ గుర్తుకురాదు. యెన్ని పరిణతులు? యెన్ని పరిణామాలు? యెంతకూ తెగనేలేదు," అన్నాడాయన పెద్దగా ఆవులిస్తూ.

ఆయనకేసి కళ్లార్పకుండా చూడసాగాడు తాను.

అంతవరకూ చేతిలోనే వున్న తీగవాయిద్యం పైన తన వేళ్లు నాట్యం చేయసాగాయి.

"దొరికింది... దొరికింది," అని అరుస్తూ మళ్లీ గొల్ల మండపంలోకొచ్చి కూర్చుని పాట కొనసాగించాడు తాను.

నిగనిగని మోముపై నెరులు గెలకుల జెదర
పగలైన దాకజెలి పవళించెను।
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేకపతి మనసు జుట్టిగొనెదాన॥

తరువాత చరణాలు అలవోకగా వచ్చి చేరాయి. పదం గుర్రంలా ముందుకు పరిగెత్తింది.

"తెగని పరిణతులతోనే గదా నీ బతుకు యిట్లా తెల్లారింది?" ఆమె ప్రశ్నను వినగానే ముసలాయన వులిక్కిపడి జ్ఞాపకాల తెరల్లోంచి బయటికొచ్చాడు. "చూసినావా, నీ గురించే నువ్వెప్పుడూ చెప్పుకొనింది? నీ స్వామి నీకు కేవలం మిష మాత్రమే!..."

అతను అయోమయంగా చూసాడు.

"వొక వుపమానం నుంచి యింకో పెద్ద వుపమానంలోకి, వొక పదం నుంచి యింకో గొప్ప పదంలోకి, వొక దృక్కోణం నుంచి యింకో కొత్త దృక్కోణంలోకి, రక్తి నుంచి భక్తిలోకి, భక్తి నుంచి వైరాగ్యంలోకి... యెంతకూ తెగని పరిణతుల్ని పట్టుకుంటూ వొక పాట నుంచి యింకో పాటంలోకి... యిలాగే గదా అన్ని పదాలూ పాటలు పుట్టించినావు? చిట్టచివరికి యిప్పుడు, యీ 'తందనాన' వరకూ వచ్చి చేరినావు..."

యీ సంగతులంతా యీవిడకెలా తెలిసాయి? యీవిడ చెప్తున్నదానిలో నిజమెంత? యింతకూ యీవిడ తనను వూరిస్తోందా, వూరడిస్తోందా? అసలింతకూ యీవిడెవరు?

నెయ్యి పోసే కొద్దీ పెరిగే మంటలా, ఆమె మాటలు వినేకొద్దీ అతడిలోని అలజడి పెట్రేగిపోసాగింది.

"అంటే, చిట్టచివరికి, కట్టకడపటికి, చేరాల్సిన తావును చేరిపోయినానంటావా తల్లీ!" అతను కంగారుగా ప్రశ్నించాడు.

"అని యెట్లా అనగలవు? జంతువుల్లో, మనుషుల్లో, రాజుల్లో, సేవకుల్లో, బ్రాహ్మణుల్లో, చండాలుర్లో, అందరిలో వుండే బ్రహ్మ మొకటే అనేవరకూ వచ్చినావు. జంతువుల సంగతి వదిలిపెట్టు. పుట్టుకతోనే మనుషుల్ని రాజుగా, సేవకులుగా, అగ్రకులంవారుగా, అంటరానివారుగా పుట్టించేదేం న్యాయం? వాళ్ల కర్మ ఫలమని చెప్పి తప్పించుకోవద్దు. అంతా కర్మ అని చెప్పిందెవురు? చేసేదీ, చేయించేదీ అంతా ఆయనే అయినప్పుడు యీ తేడాల్ని పుట్టించిందీ ఆయనే గదా? యిది న్యాయంగాదు గదా!"

ముసలాయన ముందు ఆకాశం చీలిపోయినట్టుగా పెద్ద

మెరుపు మెరిసింది. ఆయన తలలోకి పెద్ద పిడుగేదో జారిపడింది.

ఆయన మరబొమ్మలా తలాడించి, "నిజమే తల్లీ! యెవర్నడ గాలా మాట!" అని దీనంగా అడిగాడు.


"యింతవరకూ యెవర్నడిగినావో, ఆ పెద్దమనిషే అడుగు."

ఆమె కూర్చున్న పల్లకీ పైకి లేచింది.

బోయీల పాదాలు భూమికి తాకీ తాకనట్టుగా ముందుకు కదిలాయి.

వ్రేళ్ళాడిన చెట్టులా ఆయన ఆలయ ద్వారం దగ్గరికి పరిగెత్తాడు. గాలిగోపురం తలుపులు దిట్టంగా మూసుకునే వున్నాయి.

గోపురాని కవతల మనుషుల కలకలం పెద్దగా వినబడగానే ఆలయ తలుపులు యాంత్రికంగా తెరుచుకున్నాయి.



బయటికొచ్చిన పూజారులకు గొల్లమండపం ముందు ముసలాయన శరీరం కనిపించింది.

"అయ్యయ్యో! అన్నమాచార్యుడు స్వామీ! పరమపదం చేరినారు... సరిగ్గా తన దైవం పాదాల దగ్గిర..." వో అర్చకుడు పెద్దగా యేడవబోయాడు.

"యిది యేడ్వాల్సిన సమయం కాదు. ఆయనది నిండైన బతుకు. మనిషైన వాడెంతగా సుఖపడాలో అంతగా సుఖపడినాడు. ఆయన పాడబోయే కొత్త పదాన్ని వినాలని వెంకటేశ్వరుడే ఆయన్ను పిలిపించుకున్నారు," మరో అర్చకుడి గొంతు గంటలా టంగు మంది.



మధురాంతకం నరేంద్ర ప్రముఖ కథా, నవలా రచయిత. వందకు పైగా కథలు రాసారు. ఆరు నవలలు ప్రచురించారు. వీరి నవల 'మనోధర్మ పరాగం'కు ఆటా బహుమతి లభించింది. 2022 సంవత్సరానికి ఈ నవలకు కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేసి, పదవీ విరమణ చేసారు. నివాసం తిరుపతి.

రేపవళ్లలా

కె. శివారెడ్డి

భూమిని
హృదయాన్ని
చీల్చుకుని వస్తాను
రెక్కలు మొలుస్తాయి రేపవళ్లలా–
శూన్యానికి అశూన్యానికి మధ్య
తిరుగుతున్నవాణ్ణి–
ఎప్పుడూ తెలివిడితోనే
ఎప్పుడూ తెగిపోవటానికి సిద్ధంగానే
ధాన్యపు రాశుల మీద
శయనించేది నేనే
బాగా పండిన వరిచేల చుట్టూ పొలి తిరిగేది నేనే–
నదులూ కాలవలూ నేనే, దొరువులూ డొంకలూ నేనే–
ఊగుతున్న చెట్ల మీద
వాలుతున్న కాకులూ కొంగలూ నేనే–
సముద్రాలను పుక్కిటపట్టిన
గౌతముణ్ణి నేనే
ఎడ్ల వెనకాల నాగేటిచాలులో
మొలుస్తున్న మొక్కలు నేనే
ఎదుగుతున్న మొక్కల మొవ్వుల్లో
మంచుబిందువును నేనే
ఏదో ఒక ధార
కలుపుతుంది నన్నూ ఆకాశాన్ని–
ఇంద్రధనుస్సు నొసటి మీద
ఏడు రంగులు నేనే
నాగలి భుజానేసుకు
నడిచిపోతున్న గౌతముణ్ణి నేనే
చిన్నపిల్లల స్కూలు వెనక నుంచి
పొడుచుకొస్తున్న పగటిగింజలు నేనే

నన్ను అనుసరిస్తున్న జాగిలానికి
ఇంత బువ్వ పెట్టే చేతికోసం వెతుకుతున్నా–
వెతకటం తప్పు కాదు
విడివడి వుండడం తప్పు గాని
తలదించుకోవడం తప్పుగాదు
తల నుంచి పోతున్న అలల ఉరవడిని
అంచనా వేయాలి గాని
గుప్పిట మూసి తెరుస్తాను
తెల్లవారుతుంది పొద్దుగూకుతుంది–
పత్తికాయలా పటుక్కున పగిలి
నవ్వుతాను
చలనాచలనాల మధ్య చరించే
నేర్పు వాక్యం రాస్తున్నా
పదార్థపు ప్రాణాన్ని అందుకుని నడుస్తున్న
పద్యాన్ని రాస్తున్నా

❖

దమ్ముచేసిన చేల నిండా
బాతుల గుంపులు గుంపులు
చేల నిండా అండాలు అండాలు అండాలు అండాలు
ఏరుకోండి ఏరుకోండి–



కె. శివారెడ్డి భారతదేశంలోని అత్యున్నత పురస్కారాలు పొందిన ప్రముఖ కవి. కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారంతో పాటు, సరస్వతీ సమ్మాన్,కబీర్ సమ్మాన్ పురస్కారాలు లభించాయి. వందలాది సభల్లో, సెమినార్లలో పాల్గొన్నారు. 2018-22 మధ్య కేంద్ర సాహిత్య అకాడెమి కేంద్ర కమిటీ సభ్యులు. నివాసం హైదరాబాద్.


ప్యారడైజ్

శివ సోమయాజుల (యాజి)



చాలా అసహనంగా ఉంది హాసినికి. రోజూ సమయానికి వచ్చే పోస్టువాడు అప్పటికే గంట ఆలస్యం చేశాడు. డోర్ బెల్ మ్రోగంగానే, పరుగున వెళ్లి తలుపు తెరిచింది. పెద్ద అట్టపెట్టె ఒకటి బయటే వదిలేసి వెనుదిరిగి చూడకుండా వెళ్లిపోతున్నాడు, వాడు. అది కొద్దిగా బరువుగా ఉండటంతో, ఆయాసపడుతూ లోపలికి తీసుకొచ్చింది. ఆ పెట్టె పక్కనే కార్పెట్ పైన చతికిలపడి దాన్నే చూస్తూ కూర్చుంది. మోహన్ చివరి కోరిక!

ఒక నెల క్రితం వరకూ హాసిని జీవితం ఒక అమెరికన్ డ్రీం. ఇరవై ఏళ్ల క్రితం ఇంజినీరింగ్ పూర్తికాగానే మోహన్‌తో పెళ్లై, అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో కాపురం మొదలెట్టింది హాసిని. మోహన్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ పబ్లిక్‌కి వెళ్లటంతో ఆర్థికంగా వెనుదిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి కూడా తప్పింది. సారటోగా అనే గ్రామంలో చుట్టూరా అందమైన కొండలు, విశాలమైన ఇల్లు, లగ్జరీ కార్లు.



''ప్యారడైజ్ అంటే, ఇంతకంటే ఏముంటుందోయ్?'' అప్పుడప్పుడూ ప్రశ్నిస్తూ ఉండేవాడు మోహన్. ''రంభ, ఊర్వశి, మేనకలని నేను మరిపిస్తున్నానన్న మాట, థ్యాంక్ యు!'' బదు లిచ్చేది హాసిని. ఎదురుచూసిన సమాధానమైనా, అదేదో మొదటిసారి విన్నట్లుగా పెద్దగా నవ్వేస్తూ ఆమెను చుట్టేసేవాడు మోహన్. పిల్లలు లేరన్న విషయం ఎప్పుడూ వాళ్లని బాధ పెట్టలేదు.

భయంకరమైన తలనెప్పిగా ఉందంటూ ఇంటికి వచ్చాడు, ఓరోజు మోహన్. రాత్రంతా వాంతులు అవ్వటంతో ఎమర్జెన్సీ వార్డ్‌కి తీసుకెళ్లింది. డాక్టర్లు అనేక పరీక్షలు, స్కాన్‌లు చేసి, స్టేజ్ ఫోర్ బ్రెయిన్ క్యాన్సర్, ఒక నెల కంటే ఎక్కువ బ్రతికే అవకాశం లేదు అని నిర్ధారణ చేసారు. కీమో, రేడియేషన్ ట్రీట్‌మెంట్‌ల వల్ల ఉప యోగం లేదనేసరికి, తన చివరి రోజులు ఇంట్లోనే గడిపాడు మోహన్.

అనుకోని విపత్తుకి తల్లడిల్లిపోయారు దంపతులిద్దరూ. వారం రోజుల వరకూ ఎవ్వరికీ చెప్పకుండా దాచి క్షోభపడ్డారు. ఆ తరవాత ఒక ఫేసుబుక్ పోస్టు ద్వారా అందరికీ తెలియబరిచారు. దానికి వచ్చే ప్రతిస్పందనలు చదువుతుంటే ఆ మిగిలిన ఆయుష్షు కూడా సగమయిపోతుందేమోనని భయపడి, ఆ యాప్ డిలీట్ చేసు కున్నారు ఇద్దరూ కూడా.

మోహన్ ముందు కోలుకొని ఆర్థిక సంబంధమైన విషయా లన్నీ చక్కబెట్టాడు. తాను వెళ్లిపోయిన తరవాత జరగాల్సిన కార్య క్రమాలు కూడా హాసినికి శ్రమ కలగకుండా ఏర్పాట్లు చేసుకొన్నాడు. చివరి రోజుల్లో బెడ్‌లోంచి కూడా లేవలేని పరిస్థితుల్లో, హాసినికి కలగనున్న ఒంటరితనాన్ని గురించి చాలా చర్చించుకున్నారు. మోహన్ తనకి అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సూచించాడు. అన్నింటికీ చివరికి ఒకటే సమాధానమిచ్చేది హాసిని. ''వాట్ ఈజ్ ది పాయింట్?''

సామూహిక కార్యక్రమాలలోని పాజిటివ్ ఎనర్జీ, తద్వారా కలిగే స్నేహాలూ, సమాజానికి కలిగే ఉపయోగాలూ, దాని ద్వారా తొలగే ఆత్మన్యూనత, పెరిగే ఆత్మవిశ్వాశం; ఇలా ఎన్నిటి గురించో మాట్లాడాడు మోహన్. చివరికి, ''ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటే నా కంటే మంచి మోహన్ నీకు దొరకచ్చు,'' అన్నప్పుడు మాత్రం, తన చేతిలో ఉన్న మోహన్ చేతిని విదిలించు కొని పక్క గదిలోకి వెళ్లిపోయింది హాసిని. అట్ట గోడలకి ఆమె ఏడుపు మోహన్ చెవులకి చేరకుండా ఆపే శక్తి లేదు.

తన చివరి రోజున మోహన్ ఒక కోరిక కోరాడు; తాను ఒక ప్యాకేజ్ ఆర్డర్ చేసాననీ; అది రావటానికి ఒక వారం పడుతుందనీ; దానిని బాబ్ క్యాట్స్ అనే అమ్మాయిల బాస్కెట్ బాల్ టీం కోచ్ షీలాకి పర్సనల్‌గా వెళ్లి అందజెయ్యమని.

35-8 అని స్కోర్ కార్డ్‌ని గమనించింది సాక్రిమెంటోలోని ఆ హైస్కూల్ స్టేడియంలోనికి అప్పుడే అడుగుపెట్టిన హాసిని. అప్పుడే బాస్కెట్ వేసింది ఆకుపచ్చ దుస్తులు వేసుకున్న టీం. 35-10 అని మారింది స్కోర్. ఒక్కసారిగా చప్పట్లతో మారుమ్రోగి పోయింది. 'పి హెచ్ యస్' అని రాసుంది ఆ ఆకుపచ్చ చొక్కాల మీద. 'ప్యారడైజ్ హైస్కూల్' అని పెద్దగా కట్టున్న బ్యానర్‌ని అప్పుడే చూసింది హాసిని.

హాఫ్ టైంలో ఆ అమ్మాయిల టీం కోచ్ తన చేతులు ఊపుతూ చాలా ఉత్సాహంగా వాళ్లతో మాట్లాడుతూ ఏవేవో చెప్తోంది. ఆ అమ్మాయిలు కూడా శ్రద్ధగా ఆ కోచ్ చెప్పింది వింటున్నారు. విజిల్ వినపడంగానే ఆట మళ్లీ మొదలయ్యింది.

తెల్లచొక్కాలు వేసుకున్న అమ్మాయిల టీం చాలా బాగా ఆడుతూ అవలీలగా బాస్కెట్స్ స్కోర్ చేస్తూ ఉంటే, ప్యారడైజ్ టీం అమ్మాయిలు మాత్రం చాలా కష్టపడుతున్నారు. వాళ్లలో వాళ్లకి కోఆర్డినేషన్ కుదరక చాలా చిత్తుగా ఓడిపోతున్నారు. ఆ కోచ్ మొహంలో ఏ మాత్రం ఓటమి ఛాయలు కనపడటంలేదు సరికదా తన టీంతో పాటే పరిగెడుతూ అరుస్తూ ప్రోత్సహిస్తోంది.

చివరి విజిల్ మ్రోగేసరికి 65-20 స్కోరుతో ప్యారడైజ్ హైస్కూల్ టీం ఓడిపోయింది. కోచ్ చుట్టూ అమ్మాయిలంతా గుమిగూడారు. అందరి కళ్లల్లో నీళ్లు. ఒకరికొకరు హగ్గులిచ్చుకుంటున్నారు. అవి దు:ఖంతో జారే కన్నీళ్లలా లేవు, ఆనందభాష్పాలలాగా అనిపించాయి, దూరం నుంచి ఇదంతా చూస్తున్న హాసినికి. ఆశ్చర్యమూ వేసింది.

వాళ్లంతా వాళ్ల వాళ్ల సామాగ్రిని ప్యాకప్ చేసుకున్న తరవాత హాసిని నెమ్మదిగా ఆ కోచ్ దగ్గరకి వెళ్లింది.

"హాయ్... నేను హాసిని, మోహన్ వైఫ్‌ని, మీరు షీలా కదా?"

"హాయ్ హాసిని... సో సారీ ఎబౌట్ మోహన్," హాసిని దగ్గరకి వచ్చి, గట్టిగా గుండెలకి హత్తుకుంది. ఆ ఒక్క స్పర్శతో ఎంతో స్నేహానుభూతికి లోనయ్యింది హాసిని.

"సారీ, పాపం మీ టీం బాగా చెయ్యలేదు ఈరోజు..."

"ఒహ్... నో, అమ్మాయిలు గేంని చాలా బాగా ఎంజాయ్ చేసారు. అది చాలు."

ఏమనాలో తెలియక షీలా వంక కొంత అయోమయంగా చూసింది హాసిని.

అది పట్టించుకోని షీలా తన టీం అమ్మాయిల వైపు తిరిగి హాసినిని పరిచయం చేసింది.

"గర్ల్స్, మీట్ హాసిని... ఈ రోజు మనకి హెల్ప్ అండ్ సపోర్ట్ ఇయ్యటానికి ఇక్కడికి వచ్చింది."

హాసిని ఏమనాలో తెలియక తడబడుతుంటే, మళ్లీ షీలానే అందుకొని,

"తన హజ్బెండ్ మోహన్, ఎంత కాలంగానో మనకి బిగ్ సపోర్టర్. బాస్కెట్ బాల్ సప్లైస్ ఉన్న ఒక బాక్సు మనకి ఇవ్వటానికి తెచ్చుంటుంది. రైట్ హాసిని?" అని హాసినిని ఎదురు ప్రశ్నించింది.

అప్పటికి కొద్దిగా తేరుకున్న హాసిని, "యస్ గర్ల్స్! మీ కోసం ఒక పెద్ద బాక్స్ నా కారు ట్రంకులో వెయిట్ చేస్తోంది," అంటూ కారు వైపుకి నడిచింది.

కొంత మంది అమ్మాయిలు ఉత్సాహంగా ముందుకు వచ్చి, ఆ బరువైన అట్టపెట్టెను అవలీలగా ఎత్తి వాళ్ల టీం వ్యాన్‌లోకి ఎక్కించారు.

వాళ్లకి కొంచెం దూరంగా హాసిని షీలాతో, "ఇంత ఉల్లాసంగా ఉన్న మీ బాబ్ క్యాట్స్ టీంని చూస్తుంటే చాలా ముచ్చటేస్తోంది. కానీ నిజం చెప్పలంటే, నాకు మీ గురించి అస్సలు తెలియదు. మోహన్ చివరి కోరిక తీర్చటానికి మాత్రమే ఈ బాక్స్ మీ కోసం తెచ్చాను."

"యస్, మీరిలా వస్తారని నాకు మోహన్ ముందరే చెప్పాడు."

"ఒకే... అయితే ఇంక నా పని అయిపోయినట్టే," కొంచెం అసంతృప్తిగానే అన్నది హాసిని.

"అంత త్వరగానా? మీకు మోహన్ ఆఖరి కోరిక అర్థం అవ్వాలంటే మాతో పాటు వచ్చి ఒక రాత్రి తప్పకుండా గడపాలి. రేపు మిమ్మల్ని నేనే తెచ్చి ఇక్కడ డ్రాప్ చేస్తాను. ఓకేనా?"

కొద్ది సెకండ్లు తటపటాయించినా, హాసినికది చాలా సులువైన నిర్ణయం.

❖

వాళ్ల ఊరు ప్యారడైజ్ గురించి చూడమని షీలా పంపిన ఒక వీడియోని చూస్తోంది హాసిని.

సియెర్రా నెవాడా పర్వత పాదాల దగ్గర ఉన్న ఆ చిన్న ఊరులో జనాభా అయిదు వేలు దాటదు. తూరుపున ఫెదర్ నది, పడమటన సాక్రిమెంటో నదీ పాయ, చుట్టూ దట్టమైన అడవుల మధ్య, ఖనిజ సంపన్న భూమితో, ఎంతో అందమైన ఊరు. దక్షిణా నున్న ఎడారి లాంటి సాక్రిమెంటో లోయలో నుంచి ఎనభైమైళ్లు పైకి ప్రయాణం చేస్తే, పచ్చని చెట్లతో, చల్లని గాలులతో, దండిగా పండే పంటలతో ఉన్న ఈ ఊరు 'ప్యారడైజ్'లా ఉంది అని ఎవరో ఒక పెద్దాయన అంటే, ఆ ఊరు పేరు ప్యారడైజ్‌గా స్థిరపడి పోయిందని ఒక పుకారు. తొంభై శాతం తెల్లవారితో నిండి ఉన్న ఆ ఊరిలో, దాదాపు అందరూ అందరికీ పరిచయమే. ఒకటే హైస్కూల్, మిడిల్ స్కూల్, ఎలిమెంటరీ స్కూల్ అవ్వటంతో అక్కడి పిల్లలందరూ కూడా క్లాసుల వారీగా కలిసి పెరిగినవారే. ఊరికి కొత్తగా వచ్చేవారు అరుదు, వదిలి వెళ్లేవారు అంతకంటే అరుదు.

ఏటేటా అక్కడ జరిగే జాతరలో ఊరు ఊరంతా చిన్నా పెద్దా ఒకటై పండుగలాగా జరుపుకుంటూ ఊంటారు. ఆ ఊరి అందమైన వాతావరణాన్ని ఏరియల్ షాట్‌లో జూమ్ అవుట్ చేస్తూ ఆగిపోయింది అ వీడియో.

వాళ్ల వ్యాన్ కూడా ఒకే ఒక గుడ్డి దీపం వెలుగుతున్న ఒక ఇంటి ముందు ఆగింది. బయటంతా కారు చీకటిగా ఉండటంతో, ఆ ఊరిని గమనించే అవకాశం లేకపోయింది హాసినికి. కారు లోనుంచి అమ్మాయిలంతా సందడి చేస్తూ దిగారు. లోపలికి పరిగెత్తి వాళ్లు పడుకోవటానికి ఏర్పాట్లు చేసారు.

"ఈ అమ్మాయిలకి ఈ రాత్రికి ఇక్కడే స్లీపోవర్," అడగకుండానే చెప్పేసింది షీలా. ఆ ఇంట్లో పెద్దగా సామాన్లేవీ కనపడలేదు హాసినికి. వారందరికీ పడుకోవటానికి సరైన సదుపాయం కూడా లేదు. అందరూ అక్కడే కార్పెట్ మీద దుప్పట్లు పరిచేసుకొని, కంఫర్టర్లు కప్పుకొని కబుర్లలో పడిపోయారు.

"ఈ అమ్మాయిలు ఎంత లక్కీనో... ఏ చీకూచింతా లేని జీవితం." లోపల అనుకున్నానుకుంది హాసిని. షీలాకి వినపడిందేమో,

"అవును, లక్కీనే. మీకు రేప్పొద్దున మా ప్యారడైజ్ టూర్ ఇస్తాను, అప్పుడు అర్థమవుతుంది ఎందుకో... బాగా లేటయ్యింది, పడుకోండి'."

❖

తెల్లారంగానే చాలా హడావిడిగా ఉంది ఇల్లంతా. ఇల్లు శుభ్రపరిచే పనిలో కొందరుంటే, మరి కొందరు బ్రేక్‌ఫాస్ట్ తయారీలో.

కొద్దిగా ఆలస్యంగా లేచిన హాసినికి, షీలా సర్కస్‌లో రింగ్ మాస్టర్లా అందరినీ కోఆర్డినేట్ చేస్తూ కనపడింది.

కాసేపటికి ఆ అమ్మాయిల తల్లితండ్రులు వచ్చి వాళ్లని తీసుకెళ్లసాగారు. వాళ్లు వాళ్ల పిల్లల్ని చూడంగానే అడిగిన ఒకే ప్రశ్న- ''డిడ్ యూ హావ్ ఎ గుడ్ టైం?''

ఒక్కళ్లు కూడా వాళ్లు క్రితం రోజు జరిగిన ఆట గెలిచారా ఓడారా అన్నది అడగలేదు. ఒక గంటలో దాదాపు అందరు పిల్లలూ వెళ్లిపోయారు, ఒక అమ్మాయి తప్ప.

"రండి, మీకు మా ప్యారడైజ్ చూపించి సాక్రిమెంటోలో డ్రాప్ చేస్తా," అంటూ షీలా బయల్దేరదీసింది.

''బై మామ్... మీరు వెళ్లిరండి, నాకు బోలెడు హోమ్‌వర్క్ ఉంది,'' అన్నది ఆ అమ్మాయి.

కార్లో కూర్చోంగానే అన్నది హాసిని, "మీ అమ్మాయా? చాలా అందంగా ఉంది!"

"థ్యాంక్ యూ... ఆ అమ్మాయిలంతా అంతేగా,'' అంటూ సమాధానం కోసం ఎదురుచూడకుండా డ్రైవ్ చెయ్యటం మొదలెట్టింది, షీలా.

కార్ విండోలోంచి బయటకి చూస్తున్న హాసిని ఒక్కసారిగా ఉలిక్కి పడింది. అది ఊరులా లేదు. కాష్టాలు కాలిన మర్నాటి శ్మశానంలాగా ఉంది. సగం కాలిన ఇళ్లు కొన్ని, పూర్తిగా మట్టైపోయినవి మరికొన్ని. బ్లాకులు బ్లాకులు తగలపడి జీవం కోల్పోయిన శకలాలు. రోడ్లు తప్ప ఒక్క నిలిచి వున్న భవనమూ కనుచూపు మేరలో కనపడటం లేదు. కొద్ది దూరం వెళ్లాక కొన్ని సగం కాలి, నివాస సూచనలున్న భవనాలు కనిపించాయి.

''ఆ సగం కాలిన బిల్డింగ్ మా హైస్కూల్... ఆ కుడివైపు మా బాస్కెట్ బాల్ కోర్ట్,'' నోరు విప్పింది షీలా.

అప్పుడు గమనించింది హాసిని. ఆ ఊరే కాదు, ఆ కనుచూపు మేరలో ఉన్న కొండలూ, అడవులూ, అన్నీ చమ్డిలూడిపోయిన కళేబరాలే!

"ఏం జరిగిందిక్కడ?"

"డ్రైవ్‌లో చెప్తాను... రండి కారెక్కండి."


❖

"నవంబర్ 8, 2018, 7.30 AM:

నేను రోజూలాగానే స్కూల్ తెరిచే ముందరే వచ్చి స్టాఫ్ రూంలో ఆరోజు ప్లాన్ చేస్తున్నాను. దూరంగా కిటికీలో పొగ కనిపించింది. మాకు ఈ ప్రదేశంలో ఇలాంటి అగ్నిప్రమాదాలు మామూలే. కంగారుపడకుండా బయటకి వచ్చి చూసాను. ఒక అరమైలు దూరంలో కనపడ్డాయి, నా వైపుకే దూసుకొస్తున్న ప్రచండ అగ్నిసాగర కెరటాలు! నా పికప్ ట్రక్‌లోకి వెళ్లి రేడియో పెట్టంగానే, ఇవాక్యుయేషన్ ఆర్డర్స్. ఒక గంట క్రితం ఎక్కడో దూరంగా బుట్టె కౌంటీలో మొదలైన క్యాంప్ ఫైర్, మా ప్యారడైజ్ వైపు వేగంగా దూసుకొస్తోందని. నాకు ఒక్కత్తే కూతురు డాలీ; మిడిల్ స్కూల్. మా ఆయన జార్జ్, ఫైర్మెటర్. వెంటనే జార్జ్‌కి కాల్ చేసాను. ఆయన తియ్యట్లేదు. ఎక్కడో ఆ అగ్నిజ్వాలలతో పోరాడుతున్నట్టున్నాడు.

డాలీకి కాల్ చేసాను. తాను వాళ్ల ఫ్రెండ్ వాళ్ల కారులోకి ఎక్కబోతున్నానని, వాళ్లతోపాటు బయల్దేరుతున్నానని చెప్పింది. నేను వీలైనంతమందిని నా ట్రక్‌లో ఎక్కించుకొని ఊరు వదిలి వెళ్దామని బయల్దేరాను. ట్రాఫిక్ జాం వల్ల చాలా కార్లు ఇరుక్కు పోయాయి. సెల్ ఫోన్లలో సిగ్నల్ సమంగా అందటంలేదు. డాలీకి కాల్ చేస్తుంటే కాల్ వెళ్లటం లేదు. ఒక రెండు గంటల తరవాత, కాల్ కనెక్ట్ అయ్యి, హల్లో అన్న తన గొంతు వినటం, నా జీవితం లోనే మర్చిపోలేని క్షణం.

డాలీతో ఫోన్‌లో ఉండగా జార్జ్ నుండి కాల్ రావటంతో కాన్ఫరెన్స్ కాల్ కలిపాను.



❖

"డాడ్..." వణుకుతున్న కంఠం, బ్యాగ్రౌండ్‌లో మోగుతున్న సైరన్లు, అన్నిటికంటే పెద్దగా వినపడుతున్న అగ్నికీలల ధ్వనులు.

''హే, వంప్కిన్...'' జార్జ్ గొంతులో అలసట... "నేను చెప్పేది జాగర్తగా విను."

ఒక్క రెండు సెకండ్ల తరవాత ఆదుర్దా భరించలేని షీలా, "జార్జ్..."

''నో...'' సాఫ్ట్‌గానే అన్నా ధృఢంగా వినపడింది జార్జ్ గొంతు. "నన్ను మాట్లాడనీ..."

"మీరిద్దరూ ఫోకస్ చెయ్యండి. షీలా, నువ్వు అందరి కంటే

ముందున్నావు. వెనుదిరిగి చూడద్దు, ఎక్కడా ఆగద్దు. జస్ట్ కీప్ డ్రైవింగ్. డాలీ నువ్వు కూడా అంతే..."

"డాడ్..." డాలీ గొంతు చాలా కీచుగా వినపడుతోంది. "నేను... నేను..."

"డాలీ... నువ్వు చిన్నప్పుడు ఒక పాట పాడేదానివి గుర్తుందా?" కొద్దిగా వణుకుతున్న కంఠంతో జార్జ్. "ఒక బ్రేవ్ లిటిల్ బర్డ్ గురించి? ఆ పాట పాడు, ప్లీజ్..."

కొద్ది నిశ్శబ్దం తరవాత, త్రొణుకుతున్న గొంతుతో డాలీ, "బ్రేవ్ లిటిల్ బర్డ్... డోంట్ యూ క్రై... ఫ్లై హై..."

"ఇన్ ద స్కై..." అని వంత పాడుతూ జార్జ్. "దట్స్ ఇట్ బ్రేవ్ లిటిల్ బర్డ్... పాడుతూనే ఉండు..."

"డాడ్..." గద్గద స్వరంతో డాలీ. "భయమేస్తోంది..."

"నాకు తెలుసు స్వీట్ హార్ట్. ధైర్యం అంటే భయం లేకపోవటం కాదు. భయం వేస్తున్నా మనం చేస్తున్న పని ఆపకపోవటం..."

"డాలీ..." షీలామధ్యలో మాట్లాడుతూ, "ప్లీజ్ డాడ్ చెప్పినట్టే చెయ్యి. వి బోత్ లవ్ యూ సో మచ్."

"ఐ లవ్ యు టూ మామ్..." సన్నటి స్వరంతో డాలీ. "అండ్ యు డాడ్..."

"ఐ లవ్ యూ బోత్. డాలీ మై డార్లింగ్, సో ప్రౌడ్ ఆఫ్ యు. షీలా, నీ కంటే స్ట్రాంగ్ విమన్ నాకు తెలియదు. సారీ... మై లవ్. యూ బోత్ కెన్ డూ దిస్..." ఒక పెద్ద శబ్దంతో జార్జ్ కాల్ కట్ అయ్యింది.

"మామ్..." అరుస్తోంది డాలీ...

గుండెల్లోంచి లావాలా ఉబుకుతున్న దు:ఖాన్ని అదిమి పెడుతున్న షీలా, "ఇక్కడే ఉన్నాను బేబీ..."

ఏదో ఒక దూరపు ప్రపంచం నుంచి వస్తున్న గొంతుకలా వినిపిస్తోంది డాలీ గొంతు. "ఫైర్ చాలా దగ్గరగా కనపడుతోంది... చాలా పెద్దదిగా కూడా ఉంది..."

గుటక పడటం లేదు షీలాకి. "యస్ హనీ... చాలా పెద్ద ఫైర్. డాడ్ ఏమి చెప్పారో గుర్తుందిగా, యు ఆర్ అవర్ ఎ బ్రేవ్ లిటిల్ బర్డ్."

కాసేపు నిశ్శబ్దం తరవాత మెలోడియస్ స్వరంతో, "బ్రేవ్ లిటిల్ బర్డ్... డోంట్ యూ క్రై... ఫ్లై హై ఇన్ ద స్కై..."

"అంతే బేబి... అలాగే పాడుతూ ఉండు..." కన్నీరు ఆపుకొనే వృధా ప్రయత్నం చెయ్యట్లేదు షీలా.

"మామ్... నాకస్సలు భయమేయట్లేదు ఇప్పుడు... లవ్ యూ సో మచ్..." సెల్ ఫోన్‌లో డాలీ గొంతు కంటే స్టాటిక్ నాయిస్ ఎక్కువగా వినపడుతోంది షీలాకి.

"డాలీ... డాలీ... డాలీ..." గొంతు చించుకొని అరుస్తోంది షీలా..

కాల్ కట్ అయ్యిందని ఒక నిమిషం తరవాత గ్రహించింది. ఒక్కసారి ఏడుపు తన్నుకు వచ్చినా, కార్లో మిగిలిన పిల్లల సెల్ ఫోన్లు కూడా పనిచెయ్యకపోవటంతో, మళ్లీ డాలీని కలుస్తానన్న నమ్మకంతో, కారు వేగం పెంచింది. కాసేపటి తరవాత అగ్ని జ్వాలలు రేర్ వ్యూ మిర్రర్ లో కూడా కనపడటం లేదు షీలాకి.

ఒక పది నిమిషాల పాటు షీలా, హాసినీల మధ్య జరిగింది మౌన సంభాషణ.

"ఎనభై ఆరుమంది చనిపోయారు. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఊరిలో అయిదు శాతం ఇళ్లు మాత్రమే మిగిలాయి," రోడ్డు మీద నుంచి కళ్లు తిప్పకుండా షీలా.

ఇంటి నుంచి బయలుదేరే ముందర, "బై మామ్..." చెప్పిన పాప మొహం గుర్తుకొచ్చి, చేతిలో ఉన్న టిష్యూలకి పనిచెప్తున్న హాసిని కొంత ఊరట చెందింది.

"హౌ డు యూ డు దిస్? మీ ఊరు, మీ పర్సనల్ ప్యారడైజ్ అంతా నాశనం అయిపోయిన తరవాత కూడా, ముందుకు నడవాలని రోజూ ప్రేరేపించే ఆ శక్తి ఏమిటి?" తనకి తాను నిత్యం వేసుకొనే ప్రశ్న, షీలామీద సంధించింది హాసిని.

"మనల్ని వదలి వెళ్లిపోయిన వాళ్ల మీద గౌరవం, వాళ్ల జ్ఞాపకాలు మీద ప్రేమ, వాళ్ల ఆశలు మనమే పూర్తి చెయ్యాలన్న బాధ్యత."

కొంచెం, కొంచెం అర్థమవుతున్నా, షీలా ఇంకా ఏదో చెప్పటం మిగిలుందనిపించిన హాసిని, మధ్యలో మాట్లాడలేదు.

"జార్జ్ తన తీరిక సమయంలో ప్యారడైజ్ హైస్కూల్ అమ్మాయిల బాస్కెట్ బాల్ టీం కోచ్‌గా వాలంటరీ వర్క్ చేసేవాడు. తన టీం నేషనల్ ఛాంపియన్స్‌గా చూసుకోవాలని కలలు కనేవాడు."


"ఆ అగ్ని ప్రమాదం జరిగిన అయిదు నెలల తరవాతగానీ మళ్లీ ఊళ్లోకి జనాలు రావటం మొదలెట్టలేదు. అందరిలోనూ, నిరాశానిస్పృహలే. మా హైస్కూల్ సగానికి పైగా తగలపడిపోవటంతో, ఏమి చెయ్యాలో, ఎక్కడి నుంచి మొదలెట్టాలో కూడా తెలియని పరిస్థితి. కానీ పిల్లలకి ఇవన్నీ పట్టవుకదా. తమకి అందుబాటులో ఉన్నవాటితోనే వాళ్లు వాళ్ల ప్రపంచాన్ని నిర్మించుకుంటారు, వాళ్ల సంతోషాలని వెతుక్కుంటారు."

"నేను మీకు చూపించిన బాస్కెట్‌బాల్ కోర్టు ఆ అగ్నికి ఆహుతి కాలేదు. ఈ పిల్లలందరూ అక్కడ చేరి రోజూ బాస్కెట్ బాల్ ఆడటం మొదలెట్టారు. స్తబ్ధతతో కూరుకుపోయున్న ఆ వాతావరణంలో, వాళ్ల అరుపులు, కేరింతలు, మాలో కొంత ఉత్సాహాన్ని రేపాయి."

"ఊరు ఊరంతా ఏకమయ్యింది. మా ప్యారడైజ్ రీబిల్డింగ్ అప్పుడే మొదలయ్యింది. ఒంటరిగా ఏ ఒక్క కుటుంబమూ చెయ్యలేని పనులెన్నో, మా సమిష్టి కృషి వల్ల మొదలెట్టుకోగలిగాం."

"నిన్న మేము ఆడిన గేం, ఆ అగ్నిప్రమాదం తరవాత మేము పాల్గొన్న మొదటిది."

అడగాలా వద్దా అని సందేహిస్తూనే హాసిని, "మీరు రోజూ



ఇంటికి వెళ్తే మీకోసం ఎదురుచూసే ఒక చిన్నారి ఉంది. తానే లేకుంటే, ఈ ఊరు ఎంత ఏకమైనా, మీరు ఒంటరే అయిపోయే వారు కదా...?"

"పవర్ ఆఫ్ కమ్యూనిటీ, ఒక సంఘంలోని మనుషులు దగ్గరకు వస్తే దానిలోంచి పుట్టే పాజిటివిటీని, మీరింకా అనుభవించినట్టు లేదు. మీరు కనక దానిలో భాగం పంచుకుంటే, ఎప్పుడూ ఒంటరిగా ఫీల్ అవ్వరు."

"ఓ, బై ద వే, మనకు ఇంట్లో 'బై' చెప్పిన అమ్మాయి పేరు సాండ్రా. తనూ డాలీ, చిన్నప్పటి నుంచీ ప్రాణస్నేహితులు. నేను సాండ్రాకి గాడ్ మామ్ అయితే, సాండ్రా డాడ్ డాలీకి గాడ్ ఫాదర్. తను కూడా జార్జ్ లాగానే ఫైర్ ఫైటర్. ఆరోజు జార్జ్‌తో పాటు ఆ ఫైర్ ట్రక్‌లో అతను కూడా ఉన్నాడని నాకు తరవాత తెలిసింది."

షీలా కార్ తెచ్చి హాసిని కార్ పక్కనే ఆపింది.

హాసిని మనసులో ఆలోచనలు వేగంగా పరిగెడుతున్నా వాటిని వ్యక్తపరిచే మాటలు ఆమెకి అందటం లేదు.

హాసిని పరిస్థితిని గ్రహించిన షీలా, తన చెయ్యి హాసిని మీద వేసి, "ఇట్సాల్ రైట్... నేను మా బాస్కెట్ బాల్ టీం డొనేషన్ల కోసం సోషల్ మీడియాలో పోస్టు పెడితే, మొదట స్పందించిన వాళ్లలో మోహన్ ఒకడు. అతడు, నేను ఆ తరవాత చాలా మెసెజెస్ పంపుకున్నాం. హి వాజ్ ఎ రియల్లీ కైండ్ మ్యాన్."

హాసిని అప్రయత్నంగా వంగి షీలాని గట్టిగా హగ్ చేసుకొని కొద్ది నిమిషాలు అలాగే ఉండిపోయింది. షీలా ఒక చిన్న ప్యాకెట్ ఇచ్చింది హాసినికి.

❖

హాసిని తన కార్‌ని డ్రైవ్ చేస్తూనే ఆ ప్యాకెట్‌ని విప్పి దానిలో ఉన్న లాకెట్‌ని కార్ రేర్ వ్యూ మిర్రర్‌కి తొడిగింది. బంగారు రంగులో ఉన్న ఆ లాకెట్‌పై, వెలుగు పడి మెరుస్తోంది.

అప్పుడు గమనించింది ఆ లాకెట్లో ఏమి రాసుందో- "టుగెదర్ వి కెన్!" తన ప్యారడైజ్‌ని పునర్నిమించుకోవాలన్న బలమైన కోరిక పుట్టిందేమో, కార్ ఆక్సిలరేటర్ కొంచెం గట్టిగానే తొక్కింది హాసిని.



శివ సోమయాజుల అతి కొద్ది కథలు రాసినా మంచి కథలు రాసిన పేరున్న రచయిత. నివాసం కాలిఫోర్నియా.

సందెపొద్దు

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి



పల్లెను తలచుకొంటే భయంగా ఉంది.
ఎనభై ఏళ్లు నిండిన అమ్మానాన్నల గురించి ఆలోచిస్తోంటే గుండెల్లో పదరుగా ఉంది.
వారమైందట పనిమనిషిని మాన్పించి.
వణికే శరీరంతో సొంతంగా పనులు చేసుకునే అమ్మానాన్నలు రాత్రిపూట కలల్లోకి వస్తున్నారు.

డాక్టర్ వద్దకు పోతే బీపీ మాత్రల మోతాదు పెంచినాడు.

అత్యవసరంగా పల్లెకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

పల్లె అంటే వయోవృద్ధులైన అమ్మానాన్నలు, నీళ్లు లేక బీళ్లుగా మారిన పొలాలు, కూకటివేళ్లను తెంచుకోలేని నాలాంటి వాళ్లను గిలగిల్లాడించే స్మృతులు.

రాత్రంతా ప్రయాణించి తెల్లారేసరికి ఊరు చేరినా.

కారు దిగగానే దగ్గరకు వచ్చి పరామర్శించే గ్రామస్తుల్ని పలకరించినా.

ప్రహరీ గేటు తెరచుకొని లోపలికి నడిచినా.

ఎదురుగా కర్ర ఊదుకొని కసవూడుస్తూ- నా బ్లడ్ ప్రెజర్.

తట్ట తలపైకి ఎత్తుకొని దిబ్బలో పడేసేందుకు వెళుతోన్న- నా బ్లడ్ షుగర్.

జారి కిందబడి సడుగులు విరిగితే?

వాళ్ల పరిస్థితిని ఊహించుకొనే వారం దినాలుగా ఈ అదిరిపాటు.

అమ్మ ఆప్యాయంగా పలకరించింది.

నాన్న ఒకటి రెండు పొడి మాటలతో సరిపెట్టినాడు.

ఇంట్లోకి వెళ్లి బ్యాగ్ టేబుల్ మీద పడేసి కాళ్లు మొహం కడుక్కొని పంచలోకి వచ్చినా.

పని ముగించుకున్నాడు కాబోలు మంచం మీద కూచుని ఉన్నాడు నాన్న.

"నిలుక్కొని కూకోకుంటే ఆమెకు సాయం చేయొచ్చు గదా!" అన్నా.

"ఏంజెయ్యాల? కసవూడ్సాల్నా?"

"తప్పా?"

"అది మొగోల్ల పనిగాదులే."

"అందుకే పనిమనిషిని పెట్టినా. నీకేం నొప్పి- వద్దన్నేవంటనే," చురుకు తగిలేట్టుగా పొడిచినా.

"నాకిష్టం లేదు," చెప్పినాడు.

"ఒక వయసుకు వచ్చిన తర్వాత కొన్ని ఇష్టాలు తగ్గించుకోవాల."

"నేనేమీ సుఖాల మీద ఇష్టపల్లే- పని మీదనే. మా పని మమ్మల్ని చేసుకోనీ. నువ్వంటే ఏ పనీబాటా లేకుండా ఒళ్లు బలిపించుకొని బీపీ షుగర్లు తెచ్చుకొన్నెవు," అన్నాడు.

కోపమొచ్చింది. దాన్ని నవ్వుగా మార్చుకొన్నా.

బ్రష్ చేసి బయటకు వచ్చి పనిమనిషి జయమ్మను పిలిపించినా.

"ఏం జయమ్మా! నేనేం చెప్పినా నువ్వేం చేసినావు?" అడిగినా.

"ఏంజెయాల సారూ? ఇంట్లోకి వస్తే ఒప్పుకోనని మీ నాయన తరుముతా వుంటే," చెప్పింది.

"ఆయనతో పనేమీ? జీతమిచ్చేది నేనుగదా!" అన్నా.

నాన్నవైపు తిరిగి, "మీరు ఔనన్నా కాదన్నా నెలనెలా జీత మిస్తుంటా. ఆయమ్మి పన్జేసి పోతుంటాది," స్పష్టంగా చెప్పినా.

"నువ్వు జీతమిచ్చుకుంటే ఇచ్చుకో. మాకు పనేమీ చేయొద్దు," అంతే స్పష్టత నిచ్చినాడు.


"ఊర్లో ఎవరూ పలకలే. నేను బతిమాలితే ఒప్పుకున్నెది. మంచి మనిషి కాబట్టి మీకు సేవలు చేసేందుకు వచ్చింది," అన్నా.

"ముందుగా ఆమె అత్తమామలకు సేవ సేసుకోమని సెప్పు. మంచంలో ఉండారు. వాళ్లను సగదీడమని సెప్పు. కూలి తీసుకొని సేసే సేవలే గాదు, బాధ్యతతో సేసే సేవలు కూడా వుంటాయని సెప్పు," అన్నాడు నాన్న.

ఆమెకేసి చూసినా.

"ముసిలోళ్లను సాకకేమీ? నానాక మాటల్తో పొడుస్సా వున్నే చెవుల్లో గుడ్డలు పెట్టుకుని సేవలు చేస్సుండా," అంది జయమ్మ.

"సెవుల్లో కాదులే- ముక్కుల్లో," తల మరోవైపుకు తిప్పుకొని వ్యంగ్యంగా అన్నాడు నాన్న.



"వాళ్లతో నీకేం పని నాయనా?" అసహనంగా వుంది నాకు.

"అందరితో వనే. వాల్లూ మాయట్లాంటి ముసిలోల్లేగాదూ," అంటూ బయటకు వెళ్లిపోయాడు నాన్న.

పల్లెల్లో దాపరికాలుండవు.

అందరి విషయాలు అందరికీ తెలుస్తుంటాయి. ఒకరికి సంబంధించిన బాధలు, కన్నీళ్లు, సుఖదుఃఖాలు ఇంకొకరు పంచు కొనేందుకు ప్రయత్నిస్తారు.

ఈ గొడవలన్నీ భరించే వయస్సు కాదుగాబట్టే వీళ్లను సిటీకి రమ్మని బతిమాలుతూ వున్నా.

ఐదేళ్ల కిందట ఎవరికో పాము కుట్టిందని పరామర్శిం చేందుకు

నరసాపురం హాస్పిటల్‌కి వెళుతూ కాలు జారి కిందబడి విరిగినప్పుడు, హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం చేయించినాను నాన్నకు. కాలు కట్టుకునే దాకా కూడా అక్కడ ఉండేందుకు కష్టమైంది ఆయనకు. హిస్టీరిక్‌గా మారాడు. మాట్లాడేందుకు మనుషులు లేరట. ఏవేవో గొణుగుళ్లు.

గతేడాదే నేను పదవీ విరమణ పొందినా. అప్పటికే సిటీలో ఆస్తులు సంపాదించినా.

ఆస్తుల్ని వదలి నేను పల్లెకు రాలేను.

పల్లెను వదలి వీళ్లు నగరానికి రాలేరు..

నాకు సిటీతో సెంటిమెంట్లేమీ లేవు- ఆస్తులు తప్ప.

వాళ్లకు పల్లెల్లో ఆస్తులేమీ లేవు- సెంటిమెంట్లు తప్ప.

ఎట్లా సమన్వయం కుదరాలి?

ఆ విషయాన్నే చర్చించినాను నాన్నతో.

"రిటైరయినావు గదా, నువ్వే ఈ వూరికి రా," అన్నాడు.

"వచ్చి ఏంజెయ్యాల? అక్కడ రియలెస్టేట్ వ్యాపారం చేసి దండిగా డబ్బు సంపాదిస్తా వుండా."

"ఇక్కడా సంపాదించు."

"పాలాలు కొనే?"

"ఏమో యాపారస్తునివి నీకే తెలాల."

"నీ ఆలోచన బాగుంది. పల్లెకు వస్తాలే. ఎటూ కరవుగాలం కాబట్టి భూములు అగ్గువగా దొరుకుతాయి. కొనేస్తా."

"కొని...?"

"కంచె బిగించి పండ్ల చెట్టు నాటిస్తా."

"ఎన్నెకరాలు కొంటావు?"

"ఎన్ని దొరికితే అన్ని. సిటీలో సెంటు స్థలానికి ఇక్కడ ఐదెకరాలొస్తది."

"ఊరంతా అమ్ముతారు."

"కొంటా."

"పెద్ద సావుకారివే," అంటూ కొద్దిసేపు సాలోచనగా చూసి, "కొనొద్దులే," అన్నాడు.

"ఏమీ?" అడిగినా.

"పాలాల్లేకుంటే మనుషులు ఎవురుంటారు? ఊరిడ్సి అందరూ టౌన్ జేరతారు. నువ్విచ్చిన లెక్కతో ఒకరిద్దరు బాగు పడ్తారు. మిగతావాల్లంతా తిని తాగి రోడ్లపాలవుతారు. మనుషులందరినీ తరిమినాంక నువ్వొక్కనివి ఎట్లా బతుకుతావు? నీయట్లాంటోల్లు పల్లెకు రాకపోవడమే మేలు. రావొద్దులే," చెబుతూ లేచి నిలబడ్డాడు.

వాళ్ల వాదనలు ఏమిటో, వాటి వెనక సెంటిమెంట్లేమిటో నాకు అంతుబట్టడం లేదు.

అప్పుడే గేటు తెరచుకొని ఇద్దరు ముసలోళ్లు లోపలికి వచ్చినారు, "దండాలు సారూ!" అంటూ.

"ఏం సుబ్బన్నా, ఏసేబూ... బాగున్నారా?" అడిగినా.

"ఏం బాగులే సారూ! మూర్రోజుల్నుంచి మాంతమైన తల్నొప్పి. ఆసుపత్రికి పోదామంటే కుదరలే," అన్నాడు తల గీరుకొంటూ ఏసేబు.

"కూతురికి బాగలేదని తెల్సింది. సూడను పోదామనుకున్నే. చార్జీలకు లెక్క లేక పోలేకుండా," సుబ్బన్న ఏడుపు.

చెరొక రెండొందల రూపాయల నోటు అందించినా.

దండాలు పెడుతూ వెళ్లారు వాళ్లు.

"అపాత్ర దానం," నాన్న గొణుగుతున్నాడు.

ఎందుకన్నట్లుగా చూసినా.

"నువ్విచ్చిన లెక్కతో బ్రాందీ తాగుతారు," చెప్పినాడు.

"అవసరమన్నారు గదా!"

"నిన్ను చూస్తేనే అవసరాలన్నీ గుర్తుకొస్తాయి. నువ్వొచ్చినప్పుడే వాల్లిట్లా చేతులు చాచి అడుక్కొనేది. నువ్వే వాల్లను బిచ్చగాళ్లను చేసేది," అన్నాడు.

ఉలికిపడుతూ ఆయనకేసి చూసినా.

ఏదో గొణుక్కొంటూ బైటకెళ్లినాడు నాన్న.

అమ్మ దగ్గరకు వెళ్లి మంచమ్మీద కూచుని చాలాసేపు చెప్పి చూసినా.

దాదాపు మౌనంగా ఉండిపోయింది ఆమె.

చివరగా అంది. "ఈ కట్టె యిన్నే కాలిపోనిలే జయరాములూ యీడ పీకి ఇంగోసోట నాటేంత లేత వయసు కాదులే మాది. మొదులు తొర్రబడి, కొమ్మలెండి అవసాన దశకొచ్చిన ముదురు మాను ఇది. ఈన్నే రాలిపోనీలే." అంటూ వేదాంతం మాట్లాడింది.

నాకు దిక్కు దోచలేదు.

బాల్య మిత్రులు నారాయణరెడ్డి, వెంకట్రాం, సత్యం గుర్తొచ్చినారు. వాళ్లు ముగ్గురూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు. టౌన్‌లో సంసారం ఉంటున్నవారు. వాళ్లు కూడా ముసలి తల్లిదండ్రులని సాకి సంతరించిన వాళ్లే.

సాయంత్రం పోరుమామిళ్ల వెళ్లి కలిసినా.

"నువ్వు అదృష్టవంతునివోయ్! మీ అమ్మానాయనోల్లకు కాళ్లు చేతులు ఇంగా ఆడతండాయి. వాళ్ల పనులు వాళ్లే చేసుకుంటుండారు. మేము ఉద్యోగాల్లో వున్నెప్పుడే మా వాళ్లు మంచాన పడినారు," సత్యం అన్నాడు.

"ఎట్లా సాకినావు మరి?" అడిగినా.

"అమ్మ ముందే పోయింది. ఆమె మంచిచెడ్డలు నాయనే చూసిండు. ఆయన మెత్తబడినప్పుడు నేను రోజూ ఉదయమే పల్లెకు పోయి ఆయనకు స్నానాలు చేయించి, కసవూడ్చి, క్యారేజ్ ఇచ్చి వచ్చేవాన్ని. ఇరుగు పొరుగులు కొంత సాయం చేసేవాళ్లు," సత్యం చెప్పినాడు.

"ఊర్లో మా అక్క ఉండేది. ఆమె సాయంతో సగదీడినా," నారాయణరెడ్డి అన్నాడు.

"నేను పల్లెలోనే అమ్మానాన్నల దగ్గరుండి అక్కన్నించే బడికి పోతావున్నె. పిల్లల్ని హాస్టల్లో పెట్టి చదివించినా," వెంకట్రాం చెప్పినాడు.

వాళ్ల ముగ్గురికి వున్న ఏ అవకాశాలు నాకు లేవు.

నా పరిస్థితి ప్రత్యేకమైంది.

ఏమి చేయాలో అర్థంగాలే.

మా పెదనాన్న కూతురు మా అమ్మానాన్నల దగ్గర చనువుగా ఉంటుంది.

ఆమె చెప్పగలదేమో వీళ్లకు!

ఒప్పించగలదేమో!

సన్నగా మినుకు మినుకుమనే ఆశ.

బద్వేల్ అవతల సోమశిల దారిలో పల్లె.

కారులో బయల్దేరినా.

నాలుగు వరసల రోడ్డు నిర్మాణం జరుగుతూ వుంది.

రోడ్డంతా తారు పరిచినారు. వంకల వద్ద వంతెనలు పూర్తి కాలేదు. బైకులు,కార్లు రోడ్డు దిగి పొలాల్లోక వెళ్లి తిరిగి రోడ్డెక్కాలి.

రోడ్డంతా వేరుశెనక్కాయ కుప్పలు, సద్దకంకుల రాశులు, అక్కడక్కడ రాగి కంకుల కళ్లాలు.

పొలాలన్నీ నీళ్లతో నిండి వున్నాయి. తుఫాను తాకిడి వల్ల పంట నేలపాలయ్యింది. చేతనైన వరకు నీళ్లల్లో దేవుకొని తెచ్చి రోడ్డు మీద ఆరబెట్టుకొంటున్నారు. ఆడామగ, పిల్లాజల్ల, ముసలీముతక రైతులంతా రోడ్డు మీదే వున్నారు.

ఈ రోడ్డు లేకుంటే రైతుల పరిస్థితి మరెంత దారుణంగా ఉండేదో ఊహాతీతం.

పచ్చి వేరుశనక్కాయలు చూడగానే నాకు ప్రాణం లేచి వచ్చింది.

నా చిన్నతనాన్నంతా మా పొలాలన్నీ వేరుశనగ పంట సాగు చేసేవారు. ఆ కాలంలో సగం ఆహారం అదే మాకు. కాల్చుకొనో, ఉడకేసుకొనో, పచ్చివో నిక్కర జేబుల్లో పోసుకొని తింటూ వుండే వాళ్లం. ఇప్పుడు గిట్టుబాటు కాక ఆ పంట జోలికి వెళ్లటం లేదు.

కాయల రాశుల్ని చూడగానే నోట్లో నీళ్లూరినాయి.

నాలుగు కాయలు తినాలనిపించింది.

రైతు కష్టం ఉచితంగా వద్దనుకొన్నా.

వంద రూపాయల నోటు చేతికి తీసుకుని అద్దం దించి చేయి బైటకు చాచి, "ఈ వందకు కాయలు పెట్టండిన్నా!" అన్నా కారు మెల్లిగా నడిపిస్తూ.

కుప్పల దగ్గరున్న మనుషులు నాకేసి చూసినారుగాని స్పందించలేదు.

మరో కాయల కళ్లం వద్ద అడిగినా.

ఎవ్వరూ పలకడం లేదు. సమాధానం ఇవ్వడం లేదు.

ఇంకొక నోటు జత చేసి చూపిస్తూ అడిగినా.

పది చోట్ల కారు ఆపినా.

అందరూ నాకేసి, నోట్లకేసి చూసేవారేగానీ, వంగి పిడికెడు కాయలు పెట్టే వాళ్లు లేరు.

నాలో అసహనం పెరిగింది.

అది కాస్తా రైతుల మీద కోపంగా మారింది.

వాళ్ల నిర్లక్ష్యాన్ని భరించలేక పోయినా. రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడిగా రైతుల్లోని ఇంతటి నిర్లయను సహించలేకపోయినా. కాయలు ఎందుకు అమ్మరో నిలదీయాలనుకొన్నా.

కారు దిగినా.

ఆరబోసిన కాయల వద్ద ఇద్దరు ఆడవాళ్లు మరో ఇద్దరు మగాళ్లు ఉన్నారు.

"ఏమి రైతులయ్యా మీరు? నేనేమన్నా ఉద్దరగా అడుగు తండానా? లెక్కదీసుకొని పిడికెడు కాయలు పెట్టమంటే ఎవురూ పెట్టరే? మీరన్నా పెట్టండి" అన్నాను దుబాయింపుగా, పెద్దమనిషి తరహాలో డబ్బు పట్టుకొన్న చేయి చాచుతూ.

కాయల వద్ద వున్న మనిషి నాకేసి అదోలా చూసి, "మేము కూలోల్లమయ్యా! రైతులు ఆ పక్కనుండారు. అడుగుపోండి," అన్నాడు చేయెత్తి చూపిస్తూ.

అటుకేసి చూసినా.

అంతలో ఓ ఆడమనిషి, "మా కల్లం కాడికి రాన్నా కాయలు పెడతా," అంటూ ముందుకు నడిచింది.

ఆమె వెంట వెళ్లినా.

పాలిథిన్ సంచితో బాటు డబ్బు అందించినా.

సంచి మాత్రం తీసుకొని దాన్నిండా కాయలు పోసి ఇచ్చింది ఆమె.

కిలోకు మించి వుంటాయి కాయలు.

సంచి అందుకుని డబ్బు ఇవ్వబోతే ఆమె తీసుకోలేదు.

"తినే పిడికెడు కాయలకు లెక్కదీసుకుంటామాన్నా," అనింది.

"మీరు మాత్రం ఈ కాయలన్నీ తింటారా? అమ్ముకుంటారు కదా!" అన్నా.

"మూటో రెండు మూటలో అయితే మీరు కొన్నట్టు మేము అమ్మినట్టు. తినే పిడికెడు కాయల్తో యాపారం చేస్తామా, " అంది.

డబ్బు తీసుకోమని ఎంత బతిమిలాడినా తగల్లేదు.

కళ్లం కాడికి వచ్చి తినడానికి చేయి జాపితే లెక్క తీసుకోవడం రైతుకు లాయకి కాదుట.

అప్పుడు అర్థమైంది రైతు తత్వమేమిటో.

రైతు దగ్గర చేయి చాచాలి.

నేను డబ్బు కాగితాన్ని చూచాను.

నలభైయేళ్లు దాటిపోయింది రైతుదనంతో సంబంధాలు తెగిపోయి.

ఆలోచిస్తూనే అక్క ఊరికి చేరుకొన్నా.

ఆప్యాయంగా పలకరించింది ఆమె.

నాకన్నా ఐదేళ్లు పెద్దది. భర్త చనిపోయినాడు.

ఆమె కొడుక్కు కూడా నలభై ఐదేళ్ల వయస్సు.

అతనికి బీటెక్ చదివి నిరుద్యోగిగా వున్న కొడుకు, పెళ్లికి ఎదిగిన కూతురు వుంది.

నన్ను చూడగానే అక్క కొడుకు కోడిని పట్టుకొన్నాడు- మండల కేంద్రానికి వెళ్లే పని కూడా చాలించి.

వృద్ధాప్య పెన్షన్ కోసం తిరుగుతున్నాడుట.

నలభై ఐదేళ్లకు వృద్ధాప్య పెన్షన్ ఎట్లా వస్తుందో నాకు అర్థం కాలేదు.

ఇంకా చిన్న వయస్సు వాళ్లు కూడా పెన్షన్ తెచ్చుకుంటున్నారట.

దళారులు తయారై అడ్డదారులగుండా వయస్సు ధ్రువీకరణ లేదా చెవిటి సర్టిఫికెట్లు తెప్పించి వృద్ధాప్య పెన్షనో, దివ్యాంగుల పెన్షనో ఇప్పిస్తున్నారట- ఇరవై వేలు లంచంగా తీసుకొని.

దరిద్రం మనిషి చేత నేరం చేయిస్తుంది.

ప్రతి పల్లెలో ఈ దరిద్రానికి సంబంధించిన నేరాలు దండిగా జరుగుతున్నాయిట.

ఉదయం నాన్న అన్న మాట గుర్తొచ్చింది.

నేను డబ్బులిచ్చి వూర్లోవాళ్లని బిచ్చగాళ్లను చేస్తున్నానట.

ప్రభుత్వం అమాయక జనాల్ని బిక్షగాళ్లనే కాదు నేరస్తుల్ని కూడా చేస్తోంది.

"అమ్మాయికి సంబంధాలేమైనా చూస్తున్నారా?" అడిగినా అక్క మనవరాలిని గురించి.

"పైర్లు సరిగ్గా పండడం లేదు. పిల్లోనికి ఉద్యోగం రాలేదు. దిక్కుదెలకుండా వుంది జయరాములూ!" అంది అక్క.

ఆమె డబ్బులేనితనం అర్థమైంది.

"పెండ్లి చేసే మాత్రమైతే నేనూ కొంత సహాయం చేస్తా. యాభైవేలో లక్షో," చెప్పినా.

"నాకొద్దులేబ్బీ!" వెంటనే అంది అక్క.

"నీకొక్కదానికే ఇవ్వంది. నువ్వెప్పుడూ అడగలే. అడిగిన చుట్ట పక్కాలందరికీ లేదనకుండా సాయంజేసినా. రుక్మిణమ్మకు లక్ష, సిద్దమ్మకు యాభై వేలు, సుభద్రకు లక్ష, రామునికి లక్ష," చెబుతూ వుంటే ఆపింది ఆమె.

"వాళ్ల పక్కన నన్ను జేర్చగాకు నాయనా!" అంది.

ఆమెకేసి కొత్తగా చూసినా.

"పిల్లోనికి ఉద్యోగమిప్పే సాలు. మా అవసరాలు మేమే తీర్చుకుంటాము. నన్ను సెయ్యి సాపి అడుక్కొనేట్టు సెయ్యగాకబ్బీ!" అంది.

ఉలికిపాటుగా ఆమెకేసి చూసినా.

నాయన భాషే మాట్లాడతా వుంది.

"హైదరాబాదు రమ్మను వాన్ని. ఏదోక కంపెనీలో ఇరికిస్తా," చెప్పినా.

తర్వాత అమ్మానాన్నల విషయం ప్రస్తావించినా. వాళ్ల చేష్టలన్నీ వివరించినా. నా అసహాయతను వెల్లగక్కినా. నా బాధ నంతా ఆమె ముందు కుప్పబోసినా.

నా మాటలన్నీ ఓపిగ్గా వినింది ఆమె.

"మీరెప్పుడన్నా వాళ్లతో కలిసి ఉండుంటే గాదూ నీతో కలిసి బతకడానికి వచ్చేది," అంది.

అయోమయంగా చూసినా.

"చుట్టం లెక్క ఏడాదికొకసారి వస్సాంటివి. అదీ ఒక్కనివే. నీ కొడుకును తెచ్చి ముసిలోల్లకు చూపించక ఎన్నేండ్లయిందో నిజంగా చెప్పు. వాల్లకు ప్రేమలుండవా, భ్రమలుండవా? నా కాడికి రాలేదని ఇప్పుడంటావుండావు. ఎట్లొస్తారు? నువ్వు లెక్క జూపించి సెనక్కాయలు అడిగినట్లుంటాది- వాల్లను నీకాడికి రమ్మనడం. పనిమనిషిని పెట్టింది కూడా ముసిలోల్ల కోసమని నేననుకోడంలే. నీ హోదా చూపించుకోడానికేనేమో!"

అక్క అట్లా మాట్లాడతాదనుకోలే.

"వాల్ల పని వాల్లను చేసుకోనీలేబ్బీ!" అంది మా అమ్మలాగే.

"కొడుకు సంపాదనాపరుడైండు. నువ్వు రిటైరైనావు గదా! ఇంగా సంపాదించాల్నా? టౌన్‌లో సంపాదించిందేదో కొడుక్కిచ్చి పల్లెకు రారాదా. ఇక్కడుండే ఆస్తుల్ని కాపాడుకోరాదా," చెప్పింది.

"ఇక్కడేముండాయి రెండెకరాల బరకపొలం తప్ప," అన్నా

"పొలాలేనా ఆస్తులు? అమ్మానాయనోల్లు ఆస్తులు గాదా?" అనింది.

కొత్తగా వున్నాయి ఆమె మాటలు.

"నువ్వు సంపాదించిన ఆస్తులకైతే కంచె నాటతావు. బోర్లు బేస్తావు. నీల్లు పారగడతావు. కాపలా పెడతావు. కంటికి రెప్పలా కాపాడుకుంటావు. నిన్ను సంపాదించిన ఆస్తులు ముసిలోళ్లు. వాల్లను మాత్రం పట్టించుకోవు. వచ్చి వాల్లకాడుండు," చెప్పింది.

భోజనం తర్వాత వెనుదిరిగినా.

అమ్మానాన్నలు, వేరుశనగ రైతులు, అక- వీళ్లంతా ఒకటై నన్ను పిల్లోన్ని చేసి బెత్తం చేత బట్టుకొని పాఠాలు చెబుతోన్నట్టుగా ఉంది.

సిటీకి పోతే ఫ్రెండ్సంతా నవ్వుతారేమో!

నా బాధంతా వాళ్లకు తెలుసు. ముసలోళ్లను వృద్ధాశ్రమంలో చేర్పించలేని నా చేతగానితనాన్ని హేళన చేస్తుంటారు.

ముసలోళ్లను నా దగ్గరకు తెచ్చుకోవడం కాకుండా నేనే వాళ్ల దగ్గరకు వెళ్లిపోతున్నానని తెలిస్తే నా ఫ్రెండ్సంతా నన్ను పిచ్చోన్ని చూసినట్టు చూస్తారేమో!



యాభై పైగా కథలు రాశారు. నాలుగు కథా సంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. గతంలో ఆటా నవలల పోటీలో 'వీరి కాడి' నవలకి, చతుర నిర్వహించిన పోటీలో 'చినుకు సవ్వడి' నవలకి, 2017లో తానా నిర్వహించిన నవలల పోటీలో 'ఒంటరి', 'కొండపొలం' నవలలకు బహుమతులు లభించాయి. క్రిష్ దర్శకత్వంలో కొండపొలం సినిమా రూపొందింది. నివాసం బాలరాజుపల్లె, కడప జిల్లా.

కీటోక్రు

నారాయణస్వామి వెంకటయోగి

ఒకరోజు
సాయంత్రం సూర్యుడింకా ఇంకకముందే
హఠాత్తుగా నిశ్శబ్దనదిలోకి జారిపోతావు
గుండెలమీద దీపం పెట్టుకుని

ఒక పెద్ద అల లాక్కున్నట్టు
మునిగిపోయే నిన్ను చూస్తూ
దుఃఖ ద్వీపాలమౌతాము మేమంతా

ఏదో ఒకరోజూ మేమూ అంతే
చిన్నవో పెద్దవో అలల తాకిడికి
కరిగిపోతాము నదిలో
మాకోసం ఏ ఒడ్డు
కన్నీరు పెడుతుందో తెలియదు

ఎవరూ ఎవర్నీ శాశ్వతంగా గుర్తుపెట్టుకోరూ
శాశ్వతంగా మర్చిపోరూ
నిర్మలత్వమో నిరంతరం ఉబికే ఉద్వేగమో
కొన్ని సందర్భాలుగా మిగిలిపోతారు
మనుషులు

నల్లని నీళ్లలో దీపాలూ
ఎంతోసేపు వెలుగుతూ మిగలవు
చీకటి రాత్రులు మిణుకుమిణుకుమంటూ
ఒడ్డున చేరిన మనుషులూ అంతే

అలలు సద్దుమణిగాక
ఇళ్లకు బయలుదేరుతారు
కళ్లొత్తుకుంటూ కొందరు
ఎగబీలుస్తూ కొందరు
సవ్వడిగా నిశ్శబ్దాల్ని మోస్తూ

నిజమే
ఎవరూ మిగలరు
ద్వీపాలుగా దీపాలుగా
చివరికి ఒడ్డుగా కూడా

అంతా కరిగిపోవాల్సిందే
మాట్లాడని మృత్యునదిలో
నిశ్శబ్దమై పోవాల్సిందే
స్పర్శ తెలియని నీళ్లపై
ఎక్కడో ఒక చోట మునిగిపోయే
ఆకులమై

అందరం అంతే
ఏదో గుర్తు తెలియని అనంత సముద్రంలో
కలిసిపోయేటందుకు
అట్లా ప్రవహించాల్సిందే
కాలమై



నారాయణస్వామి వెంకటయోగి మెదక్ జిల్లాలో పుట్టి, హైదరాబాద్‌లో చదివి, కొంతకాలం అక్కడే ఉద్యోగం చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో అమెరికాలో స్థిరపడ్డారు. మూడు కవితా సంకలనాలు, రెండు వ్యాస సంకలనాలు ప్రచురించారు. న్యూజెర్సీలో ఫ్లెమింగ్‌టన్‌లో నివాసం.

పక్షులు

దర్భశయనం శ్రీనివాసాచార్య

ఇంత కాలం దాకా ఉదయమంటే
సూర్యుడనే అనుకున్నాను
పక్షులని కూడా ఇవాళే తెలిసింది

అడవి ఆశ్రయంలో వున్న ఈ ఇంట్లోంచి
ఇక తెలతెల వారుతుందనగా ఆవలికొచ్చాను
ఇంకా పిడికెడు నిద్ర నా తనువుగూడులో
మిగిలి వుండగానే-

కువకువల కిచకిచల శబ్దాలు పలకరిస్తూ
మెత్తగా ముట్టడించాయి నన్ను కరిగిస్తూ-
పలకరింత ఇంత శ్రావ్యంగా
ముట్టడి ఇంత ప్రేమాన్వితంగా వుంటుందని
ఇపుడే తెలిసింది
చిన్నపుడు అడవిలో తిరుగాడినపుడు
పరిచయమైన సవ్వళ్లు ఇపుడు చప్పున గుర్తుకొస్తున్నాయి
శబ్దాలతోపాటు పక్షులు నాకు చిన్నప్పటి అడవిని కూడా
ఇప్పటికిప్పుడు కానుగ్గా ఇస్తున్నాయని తెలుస్తున్నది

ఇపుడు చుట్టూ పరుచుకున్న పల్చని లేత చీకటి కూడా
పాడుతున్నట్లుంది పక్షుల పుణ్యమా అని!
నాలోని కొసరు నిద్ర కదిలి నిశ్శబ్దంగా రాగఝరిలోకి
జారిపోయింది
నా లోపలి దిగులు రాళ్లు ఇపుడు మెల్లగా కరుగుతున్నట్లు
నేనొకింత తేలిక పడుతున్నట్లు తెలుస్తున్నది
నేనేనా, ఈ నేల సైతం కాస్తా తెప్పరిల్లుతున్నదేమో

పక్షుల పలకరింపు మనకూ ఈ ధాత్రికి మాత్రమేనా?
రాత్రిని తొలుచుకుని వచ్చే సూర్యుడికి కూడా!
ఈ పలకరింపు కోసమే అతను రోజూ
బద్దకించక వస్తుంటాడేమో వెచ్చని ఆతురతతో-

రాత్రి పక్షుల సహవాసం వల్లనేమో
పగలంతా వృక్షాలు ఉల్లాసంగా వుంటాయి
కొమ్మలకు రెమ్మలకు మెత్తని గొంతులొస్తాయి
సాయంత్రం ఎదురుచూపుల ఆవాసాలవుతాయి
అసలు
పక్షుల ఆవాసాలయేందుకే వృక్షాలు జన్మెత్తుతాయి కాబోలు

వృక్షరాజ్యాల్ని మెలమెల్లగా కాదు కదు
శీఘ్రంగా కూలదోస్తూ
బహుళ కట్టడాలతో బడా రహదారులతో విస్తరిస్తున్నామని
మనం అత్యాధునికంగా అతిశయిస్తున్నాంగానీ
ఈ అతి గతిలో హరితరహితమై
పక్షుల ఆశీస్సుల ప్రాణభరిత రాగోదయాలనూ
నిజ సహవాసాలనూ వెలుతురు రెక్కలనూ
పోగొట్టుకుంటున్నామని మనకెప్పటికి తెలుస్తుంది?

తెలిసే నాటికి బహుశా
ఏ కువ కువా వుండదు కిచ కిచా వుండదు
రోజూ ఆశారథం మీద ఏతెంచే
సూర్యుడు కూడా అసలు రావడమే మానేయొచ్చు!



దర్భశయనం శ్రీనివాసాచార్య వరంగల్ జిల్లాలో పుట్టారు. కవి, విమర్శకుడు. ఎనిమిది కవితా సంపుటాలు, ఒక విమర్శనా వ్యాస సంపుటి ప్రచురించారు. కవిత వార్షిక సంకలనాలకు సహ సంపాదకులు. వార్షిక కవితాసంకలనం 'కవిత' సంపాదకులు. ఆంధ్ర బ్యాంక్‌లో ఉద్యోగం. నివాసం హైదరాబాద్. 2015 తానా సభల అతిథి.

పోగొట్టుకున్న...

చంద్ర కన్నెగంటి



సాయంత్రపు నడక అయ్యాక చూసుకుంటే ఇంటి తాళం చెవి కనపడలేదు.

మళ్లీ వెనక్కి నడుచుకుంటూ తల దించుకుని దారికటూ ఇటూ వెతుకుతూ పోతున్నాను.

"అలా తల దించుకు పోతున్నారేమిటి? ఈ నేల మీద పుట్టడం మనకి గర్వ కారణం. మన జిల్లాకి సాటి ఏ జిల్లా అయినా వస్తుందా? తల ఎత్తుకుని నడవండి."

జోకేస్తున్నాడనుకుని నవ్వి, "కీస్ వెతుక్కుంటున్నానండి!" అన్నాను.

ఆయన మొహం చిట్లించి సీరియస్‌గానే, "కాస్త గర్వంగా వెతుక్కోవచ్చు గదా! మన జిల్లా పరువు తీయొద్దు!" అంటూ వెళ్లిపోయాడు.

ఆలోచిస్తే నిజమే అనిపించింది.

మా జిల్లాలో పారే జీవనదులూ, సమృద్ధిగా పండే పచ్చటి పొలాలూ, పేరు పొందిన బళ్లూ, ఇంకా పేరు పొందిన గుళ్లూ గుర్తుకు రాగానే కొంచెం తల పైకి లేచింది. ఛాతీ కాస్త ఉప్పొంగింది.

కొద్ది దూరంలోనే ఇంకొకాయన ఎదురయ్యాడు.

"ఆ కళ్లు దించుకుని దీనంగా మొహం పెట్టుకుని నడవడ మేమిటి? నువ్వే కులంలో పుట్టావో గుర్తుందా? ఎంత గర్వపడాలి అసలు మనం?" అని కులాభిమానంకొద్దీ మెత్తగానే చీవాట్లేశాడు.

"కీస్ దొరగ్గానే..." అంటూ నసిగాను.

"సరే, గుర్తుపెట్టుకో అందరికీ ఈ అదృష్టం పట్టదు. మన బ్లడ్డే వేరు. కొంచెం గర్వించడం అలవాటు చేసుకో!"

ఆలోచిస్తే నిజమే అనిపించింది.

అన్ని రంగాల్లో ఎంతో ఎత్తుకి ఎదిగి నింగిలో తారల్లా ప్రకాశిస్తున్న కుల ప్రముఖులంతా కళ్ల ముందు మెదిలారు.

కొంచెం గర్వం వేసింది.

వెనక నించి ఒకాయన వేగంగా వచ్చి కలిశాడు.

"మీరంత సిగ్గుతో తల దించుకోవలసిన అవసరం లేదు బ్రో! రొమ్ము విరిచి చెప్పండి నేను తెలుగువాడినని! తెలుగోడి దెబ్బకి దిల్లీ అబ్బా అంటుంది. మన తెలుగుజాతి గత వైభవం మరిచావా? మన నాటు పాట మారుమోగని దేశముందా? మన భాష ఎంత గొప్పది! మన భాషలో తీయదనం ఏ భాషకూ లేదని నాసా కూడా తేల్చి చెప్పింది. కాస్త వాట్సప్ చూస్తుంటే ఇలాంటివి తెలుస్తాయి!" అన్నాడు మందలిస్తూ.

"సారీ బ్రో! నాకూ తెలుసు కానీ అప్పుడప్పుడూ మర్చిపోతుంటాను. గుర్తు చేసినందుకు థాంక్స్! తెలుగువాడనయిందుకు నాకూ గర్వంగానే ఉంటుంది!" అన్నాను.

గర్వంగా నడుచుకుంటూ వెతుక్కుంటూ పోతుంటే ఇంకొకామె ఎదురొచ్చింది, ఎర్రబడ్డ కళ్లతో కోపంగా చూస్తూ.

"అట్లా తలొంచుకు పోతుంటేనే అన్ని మతాల వాళ్లూ మన మతం మీద విరుచుకు పడుతున్నారు. మన మతమెంత పురాతనం! మన జ్ఞానమెంత అపారం! మనకు సాటి ఎవరు? ఆ స్పృహ ఏదీ నీకు ఉన్నట్టు లేదు. ఏ జన్మలోనో పుణ్యం చేసుకుని మన మతంలో పుట్టావు. నీ జన్మ ధన్యమయింది. ఎంత గర్వంగా చెప్పుకోవాలో అంత గర్వంగా ఎలుగెత్తి చెప్పు!" అని ఉపదేశించి ఇంకెవరో కనిపిస్తే అటు వెళ్లింది.

ఇంకాస్త గర్వం పెరిగింది కానీ తల పైకెత్తలేకపోయాను, కీస్ కోసం వెతుకుతుండడంతో.

కొద్ది దూరం కూడా పోకముందే మరొకాయన ఎదురయ్యాడు.

"ప్రతివాడూ తల దించుకు నడుస్తాడేమిటి? ఈ దేశానికి ఏమయింది? మన దేశమెంత గొప్పది! మన చరిత్ర ఎంత ఘనమైనది! మన సంస్కృతి ఎంత ప్రాచీనమైనది! ఇన్ని భాషలు, ఇన్ని మతాలు, ఇన్ని జాతులు ఒక్కటై అఖండంగా వెలిగే దేశం ఇంకేదయినా ఉందా? గర్వపడవలసినంత ఎందుకు పడడంలేదు మనం?" అని వాపోయాడు.

అటూ ఇటూ చూస్తున్న నాకు తాళం చెవి దారి పక్క మెరుస్తూ కనపడింది.

'హమ్మయ్య' అనుకుని దాన్ని తీసుకుని, "తప్పకుండా గర్వపడతానండి! దేశంలో అందరికంటే నేనే ఎక్కువ గర్వపడతాను!" అని ఆయనకి మాటిచ్చాను.

మాటిచ్చినట్టుగానే తల బాగా పైకెత్తుకుని, రొమ్ము బాగా ఉప్పొంగించి ఇంటికి చేరాను.

తాళం తీసి తలుపయితే తెరిచాను కానీ నా నెత్తికెక్కిన అంత గర్వాన్నేసుకు వెళ్లడానికి వాకిలి పట్టడంలేదు.



చంద్ర కన్నెగంటి కవి, కథకుడు. ఒక కవితాసంపుటి, ఒక కథాసంపుటి ప్రచురించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా డాలస్‌లో నివాసం.

జిజ్ఞాసపు జీవనది

అందెశ్రీ

పల్లవి: నేలపచ్చ చీరే గట్టిందో నెమలిపూల రవికే తొడిగిందో
పొద్దునే బొట్టుగ బెట్టిందో పొన్నపూలు కొప్పును జుట్టిందో
గాలి సోకితే చాలూ కాలి అందెల రవళి
మమ్ములను బ్రోచేది అమ్మ నీ పాదధూళి
ఎన్ని జన్మలకైనా కన్నతల్లివి నీవే... ॥జైకొట్టు॥

అను.ప: జైకొట్టు తెలుగుభాష జనులు పాడగా
యుగమంతా నినదిస్తా జగమే కొనయాడగా॥జైకొట్టు॥

చరణం1: కలలో కనుపాపలుగ కాచినదీ తెలుగుభాష
ఇలలో నవదీపికలయి పూసెను మా తెలుగుశ్వాస
అన్నమయ్య పదకవితల కన్నమయ్యినది తెలుగు
కంచర్ల గోపన్నా కంఠసీమ పంట తెలుగు
త్యాగరాజ కృతిగీతిక శ్రుతిలయల సుధను పంచీ
మువ్వగోపాలుని పదమువ్వలుగా నవ్వినది ॥జైకొట్టు॥

చరణం2: పోతన్నలు, శ్రీనాథులు, పోతులూరి తత్త్వకృతులు
విజ్ఞానపు హిమనకాలు జిజ్ఞాసపు జీవనదులు
గృహసీమన మాయమ్మలు గుండె గుడిన జేజమ్మలు
అడుగడుగున జ్ఞానపదం అమ్మనుడుల జానపదం
వారసత్వ పురాణాల వడపోతల కథలు ఎన్ని
వేదికలై వెలుగొందిన వెన్నెల వాకిళ్లు ఎన్ని ॥జైకొట్టు॥

చరణం3: కట్టులోన బొట్టులోన పట్టె ఉడుము పట్టులోన
మాటలోన, పాటలోన నడిచె బ్రతుకుబాటలోన
తెలుగుజాతి ప్రత్యేకత వెలుగులీను వేకువరా
ఎల్ల భాషలందు తెలుగుతల్లి భాష గొప్పదిరా
అమ్మపాల కమ్మదనం తెలుగే అభిమానదనం
పలుకు పలుకున తేనీయలొలుకు తెలుగు
మొలకనవ్వుల ॥జైకొట్టు॥

చరణం4: ఆత్మగౌరవంతో తెలుగుజాతి పరువు నిలబెట్టగ
తెలుగుభాష సంస్కృతులను ఎలుగెత్తి చాటుదాము
ప్రాచీనతతో తెలుగును ప్రపంచాన నిలబెట్టగ
గతచరితల ఘనకీర్తిని గళమెత్తి పాడుదాము
కలనైనా మరచిపోకు కన్నది నిన్ను తెలుగునేల
ప్రణవానికి ప్రాణమదీ మనబడి నిధి అమ్మఒడి
॥జైకొట్టు॥



అందెశ్రీ కవి, గాయకుడు. జయజయహే జననీ అనే తెలంగాణ గేయకర్తగా రెండు రాష్ట్రాల్లోనూ ప్రసిద్ధుడు. దాదాపు వెయ్యి పాటల సంకలనం 'నిప్పులవాగు'కు సంపాదకుడు. నిరంతర పథికుడు. హైదరాబాద్‌లో నివాసం.

గోడ మీద వేలాడే తుపాకీ

గోపిని కరుణాకర్



నా చిన్నప్పుడు మా మెరుగు మునిరామయ్య తాత వాళ్లింట్లో, గోడకి ఒక తుపాకి వేలాడతా వుండేది. మునీశ్వరుడు తపస్సు చేసుకుంటున్నట్టు మౌనంగా వుండేది. ఎన్నో యుద్ధాలు చేసి, ఎంతో మంది సైనికుల తలలు తెగనరికి, అలసిపోయి తన వొరలో తను ముడుచుకుని పడుకున్న వీరుడి ఖడ్గంలా, గోడకు వేలాడుతూ ప్రశాంతంగా నిద్రపోతూ వుండేది.

వాళ్లింట్లోకి అడుగుపెడుతూనే నా కన్ను ఆ తుపాకి మీదనే పడేది. దీని మౌనం వెనుక ఒక రహస్యం దాగుంది. గుండెల్లోకి దూసుకుపోయి ఛిద్రం చేసే మందుగుండు లాంటి ఒక కథ వుంది. ఆ కథని చెప్పమని మా మునిరామయ్య తాతని ఎన్నిసార్లు అడిగానో లెక్కలేదు.

ఎప్పటికప్పుడు ఆ కథ చెప్పకుండా దాటవేసేవాడు. 'ఇప్పుడు కాదులే, మళ్లెప్పుడన్నా చెపుతాను,' అనేవాడు. ఆ తుపాకీకి అటూ ఇటూ రెండు పొడుగాటి ఏనుగు దంతాలు, ఆ ఏనుగు దంతాలపైన వైట్ అండ్ బ్లాక్‌లో ఫొటో, ఆ ఫొటోలో పులిని చంపి, దాని ముందు స్టైల్‌గా తుపాకిని పట్టుకుని మా మునిరామయ్య తాత ఫ్రెండ్స్‌తో గుర్తుగా దిగిన ఫొటో అది. దానికి ఎదురుగా గోడకి ఆ పులి చర్మాన్ని అమర్చిపెట్టి వుండే వాళ్లు. ఒక గొప్ప చిత్రకారుడు పులిలోని క్రూరత్వాన్ని పెయింటింగ్ వేసినట్టు అందంగా వుండేది.

ఆ ఫొటోలో పులిని చూసి, గోడకు వేలాడే తుపాకీని చూసే వాడ్ని. మనిషిలోని క్రూరత్వానికి ప్రతీకలా అనిపించేది ఆ తుపాకి.

❖

మా మెరుగు మునిరామయ్య తాత వాళ్లది మంగళంపేట నగిరి. ఆ నగిరిలో వుండేది అందరూ దొరలే! జమీందారీ వ్యవస్థ వున్నప్పుడు ఆ నగిరి ఓ వెలుగు వెలిగింది.

బ్రిటీషర్స్ రావటం, వాళ్లు పాలనని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవటం, ఆ తర్వాత స్వాతంత్ర్యం రావటం, జమీందారీ వ్యవస్థ రద్దు కావటంతో ఆ నగిరి కాలానుగుణంగా తన ప్రాభవాన్ని కోల్పోయింది.

దొరలు మెల్లగా దొరతనాన్ని వదిలి వ్యవసాయం చెయ్యటం మొదలుపెట్టారు. దొరలు కాస్తా రైతులయ్యారు. కాని వాళ్ల రక్తంలో దొరలమన్న అహం, దర్పం అలాగే వుండిపోయింది.

దొరతనాన్ని వదులుకోగలిగారు కానీ, దొర గుణాన్ని మాత్రం వదులుకోలేకపోయారు. గ్రామంలోని ప్రజలు కూడా వాళ్లని దొరల గానే గుర్తించేవాళ్లు, గౌరవించేవాళ్లు. వీళ్లు మాత్రం దొరలమన్న పెత్తనం చెలాయించేవాళ్లు.

పండుగలు, ఉత్సవాలు, తిరణాళ్లు ముఖ్యంగా పీర్ల పండగ ఎంతో అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగ జరిపించేవాళ్లు. ఆ ఉత్సవాలకి దొరసానులు చాందినీ బళ్లల్లో వచ్చేవాళ్లు. గోషాలో ఉండేవాళ్లు.

ఉత్సవాల్లో పారువేట తప్పనిసరి. తుపాకులతో తాము వేటాడి తెచ్చిన పులుల్ని, చిరుతల్ని ప్రదర్శించేవాళ్లు. బ్రిటీషర్స్‌తో ఫోటో దిగేవాళ్లు.


దొర పుడితే తుపాకి చేత పట్టాల్సిందే! పులిని కొట్టాల్సిందే! ఫోటో దిగాల్సిందే! తుపాకీని పట్టేదానికి భయపడితే, 'వీడేం దొరరా నాయనా! తొండాకుల్ని కూడా పట్టలేడు,' అని ఎగతాళి చేసేవాళ్లు.

అలాంటి దొర కుటుంబం నుంచి వచ్చిన మా మెరుగు మునిరామయ్య తాత ఐదో, ఆరో చదువుకున్నాడు. ఆ రోజుల్లోనే ప్యాంట్, షర్ట్ వేసుకునేవాడు. దేవానంద్ క్యాప్‌ని పెట్టుకునేవాడు. కుడిచేతిలో ఎప్పుడూ గన్ వుండేది. ఎడమ చేతిలో చార్మినార్ సిగరెట్ వుండేది. స్టయిల్‌గా తాగుతూ పొగని వదిలేవాడు. వేటంటే ఆ తాతకు భలే పిచ్చి.

ఇప్పుడు నేను చెప్పిందంతా గోడకి వేలాడి దీసిన ఫోటోల్లో ఫ్రేమ్ కట్టిన సంస్కృతీ, సంప్రదాయాల గురించి. ఆ ఫోటోలు దిగిన మా మునిరామయ్య తాత గురించి.

ఇప్పుడు మా మునిరామయ్య తాత అలా వుండడు. బాగా ముసలోడైపోయాడు. నడుము వంగి నడుస్తాడు. పొడుగాటి తెల్లని గడ్డం, తెల్లని జుత్తు, పొడుగాటి చేతులున్న, పొడుగ్గా మోకాళ్ల వరకు వచ్చే ముతక ఖద్దరు షర్ట్, ముతక ఖద్దరు పంచెలో పెరియార్‌లా వుంటాడు. కుర్చీలో కూర్చుని, కాలుమీద కాలేసుకుని, చేతిలో ఆంధ్రపత్రిక పేపర్ పట్టుకుని, కళ్లకు పెట్టుకున్న గాంధీ తాత కళ్లద్దాల్లోంచి ఒక్కొక్క పదాన్నే పట్టుకుంటూ, పెదవుల మీద స్మరణ చేసుకుంటూ వార్తల్ని చదువుతుంటాడు. ఎప్పుడూ సమకాలీన రాజకీయాలు గురించి మాట్లాడుతూ వుంటాడు.

ఇందిరాగాంధీని వ్యతిరేకించే వాడు. కాంగ్రెస్‌ని బంగాళా ఖాతంలో ముంచేస్తే గాని ఈ దేశం బాగుపడదు అనేవాడు. జనతా పార్టీ అంటే చాలా ఇష్టం. జయప్రకాష్ నారాయణ్‌ని హీరోలా చూసేవాడు. ఎప్పుడూ పొగుడుతూనే వుండేవాడు.



ఎమ్.ఎస్. సుందర రామారావు పాడిన హనుమాన్ చాలీసా అంటే చెవి కోసుకునేవాడు. నాలుగు మాడ వీధుల్లో వున్న స్పీకర్స్‌లో నుంచి వస్తుంటే, అలా వింటూ తాదాత్మ్యం చెందేవాడు. ఎమ్మెస్ సుబ్బలక్ష్మి కంటే కూడా, సినిమా యాక్టర్ శ్రీవిద్య వాళ్లమ్మ ఎమ్మెల్ వసంతకుమారి కచ్చేరి అంటే ఇష్టం. ఆమె కచ్చేరి చెయ్యటాకి కొండకు వస్తే, ఈ తాత ఎప్పుడూ, మా గుడి ముందున్న సదస్సు లోనే వుండేవాడు. అందరికీ నచ్చేది ఈయనకు నచ్చేదికాదు. ఊరందరిదీ ఒక దారి అయితే, ఉలిపిరికట్టేది ఒకదారి అన్నట్టు వుండేది.

పొద్దున్నే లేచేవాడు. మా ఇంటి వెనకనున్న కొలాయిగుంటకు పోయి కాలకృత్యాలు తీర్చుకునేవాడు. గుంట కట్టికి అటువైపున కర్ణాటక సత్రం, కాటేజీలు వుండేవి. ఒక వేపపుల్ల విరుచుకొని పళ్లు తోముకుంటూ ఇంటికొచ్చేవాడు. స్నానం చేసి గుడి ముందున్న బేడీ ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లేవాడు.

మా పడమర మాడవీధిలో నుంచి ఉత్తర మాడవీధిలోకి అడుగుపెట్టి, వరాహస్వామి గుడి మీదుగా ఈశాన్యం మూల మీదున్న మా పూనాసత్రం అత్త ఇంటి ముందు తూరుపు మాడ వీధిలోకి మలుపు తిరిగి, పెద్ద శెట్టి అంగడి మీదుగా, ఎడమ వైపు నున్న చెక్క తేరుని, కుడివైపునున్న స్వామివారి కోనేరుని దాటుకుని, గుడి ముందు గొల్ల మండపం దగ్గర మెట్లెక్కి, సన్నగా అటు ఇటూ అంగళ్లతో మూసుకుపోయివున్న సన్నిధి వీధిలోకి అడుగుపెట్టి, ఆ వీధిలో వున్న బేడీ ఆంజనేయస్వామిని దర్శనం చేసుకునేవాడు. అక్కన్నుంచి మళ్లీ దక్షిణ మాడవీధిలోకి అడుగుపెట్టి, ఆ దక్షిణ మాడ వీధిలో ఎడమవైపు వున్న గరుడ ఆళ్వార్ సన్నిధి దాటుకుని, కుడివైపునున్న స్వామివారి గోడని తాకుతూ, భజన మందిరం దాటుకుని, గజేంద్రమోక్షం చెరువులోని తామర పువ్వుల్ని చూస్తూ, మళ్లీ గుగ్గిళ్లవ్వ గుడి దగ్గర మా పడమర మాడవీధిలోకి అడుగుపెట్టి, ఎడమవైపున వున్న వసంతమండపం, గొల్ల సందు, శ్రీనివాసలాడ్జి, అటూ ఇటూ వున్న కోమటోళ్ల ఆర్యవైశ్య చౌల్ట్రి, మైసూరు సత్రం, నారద మందిరం మీదుగా ఇంటికి వచ్చేవాడు. వేడివేడిగా ఇడ్లీ తిని, వసంతా కాఫీ పొడితో కాచిన కాఫీ తాగి, అప్పుడు కూర్చునేవాడు చందనం బిళ్లలు తయారి చేయటానికి. క్రేన్ వొక్కపొడి పలుకులు నోట్లో వేసుకుని పని మొదలుపెట్టేవాడు.

ఇది ప్రతిరోజు ఆయన దినచర్య. ప్రతిరోజు గుడి చుట్టూ ఒక ప్రదక్షణ వేసేవాడు. ప్రతిరోజు బేడీ ఆంజనేయస్వామిని తప్పకుండా దర్శనం చేసుకునేవాడు. ఎందుకు క్రమం తప్పకుండా ఆంజనేయస్వామిని దర్శనం చేసుకునేవాడో, నాకు అప్పుడు అర్థమయ్యేదికాదు.

మా మెరుగు మునిరామయ్య తాత చదువుకున్నాడు కాని, ఎప్పుడూ ఒక ఉద్యోగం అంటూ చెయ్యలేదు. ఒకవేళ చేసినా ఒక ఉద్యోగంలో స్థిరంగా వుండేవాడు కాదు.

వీళ్లది మంగళంపేట నగిరి అని చెప్పుకున్నాం కదా! మా మునిరామయ్య తాతకు ఓ చెల్లెలు వుంది. ఆమె మా జేజవ్వ. మా అమ్మమ్మ వాళ్ల అమ్మ. ఆమె పేరు మెరుగు వెంకటమ్మ. ఆమెను మా జేజి తాతకు ఇచ్చి పెళ్లి చేసారు. మా జేజి తాత పేరు మామిడాకుల చిన్నబ్బ నాయుడు. ఆయన ప్రతిరోజు స్వామివారి గుళ్లో మామిడాకుల తోరణాలు కట్టేవాడు. అదే ఆయన ఉద్యోగం.

అలా మా జేజవ్వ, మా జేజితాతను పెళ్లి చేసుకుని మంగళం పేట నగిరి నుంచి, మా తిరుమల కొండకు కాపురానికి వచ్చింది. మా మునిరామయ్య తాత చెల్లెల్ని చూడటానికి అప్పుడప్పుడు కొండకు వస్తూపోతూ వుండేవాడు. ఎంతో కొంత చదువుకుని, ఏ పనిపాటా లేకుండా, తుపాకి ఒకటి చేతిలో పట్టుకుని మంగళం పేటలో పోరంబోకులా తిరిగే బామ్మర్దిని సరైన దారిలో పెట్టాలను కున్నాడు మా జేజితాత. స్వామి వారి గుళ్లో వున్న పోటులో (వంటశాల) లెక్కలు రాసే ఉద్యోగంలో పెట్టాడు.

ఉప్పు, పప్పు, బెల్లం, బియ్యం మూటలు ఎన్ని వచ్చాయి, ఎన్ని ప్రసాదాలకు ఖర్చు అయ్యాయి, ఇన్ని మిగిలాయి, ప్రత్యేక ఉత్సవా లప్పుడు ఇంత ఖర్చు అవుతుంది; అయ్యేదెంతా, మిగిలింది ఎంత అనే లెక్కలన్నీ ఈయనే చూసుకునేవాడు.

కొన్ని రోజులు గడిచాయి. పోటులో వంటచేసే బాపనోళ్లు ప్రసాదాలు మాయమైపోతున్నాయని కంప్లైంట్ ఇచ్చారు. కొన్ని ప్రసాదాలు దేవునికి నైవేద్యం పెడుతున్నారు. కొన్ని ప్రసాదాలు క్యూలో వచ్చే యాత్రికులకు ఉచితంగా పంచుతున్నారు. కొన్ని ప్రసాదాలు కౌంటర్లలో పెట్టి అమ్మేస్తున్నారు. అయినా మిగిలిన ప్రసాదాలు ఏమైపోతున్నాయి? స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తన కుటుంబ పరివారంతో ఎవరికీ తెలీకుండా, రాత్రి పూట వచ్చి ప్రసాదాలు తినేసి వెళ్లిపోతున్నాడా? మాయ కాకపోతే!

ఎంక్వైరీ చేసారు. అప్పుడు అసలు విషయం బయటపడింది. మా మెరుగు మునిరామయ్య తాత ఎవరికీ తెలీకుండా మిగిలి పోయిన ఆ ప్రసాదాల్ని తీసుకెళ్లి, కొండకు వచ్చిన పేద యాత్రికు లకీ, ఆకలితో అలమటించే బిక్షగాళ్లకి ఇచ్చేసేవాడు. వాళ్లు కడుపునిండా తిని ఆకలి తీర్చుకునేవాళ్లు.

పోటులోనే వుంటే పాడైపోతాయి కదా! కనీసం పంచిపెడితే ఆకలైనా తీరుతుంది అనేది ఆయన ఉద్దేశం. కాని దొంగతనం తప్పే కదా! అనేది అధికారుల వాదన. పనిష్‌మెంట్ పోటులో నుంచి, పి.పి. షెడ్‌లోకి క్యూ ఇన్స్‌పెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ చేసారు. అక్కడ కూడా ఆయన కుదురుగా వుండలేదు.

కళ్యాణ ఉత్సవానికి ఓ టికెట్ వుంటుంది. ఊంజిల్ సేవకు ఓ టికెట్ వుంటుంది. సుప్రభాతం టికెట్ వేరుగా వుంటుంది. ఇలా స్వామి సేవలకు ప్రత్యేకమైన టికెట్స్ వుంటాయి. ఆ టికెట్స్ కట్ట గలిగే స్థోమత ఎవరికి వుంటుంది? ధనవంతులకీ, సినిమా యాక్టర్లకీ, టాటా బిర్లాలకీ, రాజకీయ నాయకులకీ, ఐపీలకీ వుంటుంది. వాళు అలా ఫ్లైట్‌లో ఎగిరి తిరుపతికి వస్తారు. ఖరీదైన కార్లలో కూర్చుని, బొజ్జ కదలకుండా కొండమీద దిగుతారు. ఆయా సేవల టికెట్లు

పట్టుకుని మహాద్వారం నుంచి నేరుగా వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటారు.

పాపం... సామాన్య భక్తులు మాత్రం గంటలుకు గంటలు క్యూలో నిలబడి, అడుగడుగునా ఆపదలు పడుతూ, కష్టపడి ఆ స్వామి దర్శనం చేసుకుంటారు. స్వామిని చూస్తూనే, ఒక్కసారిగా భక్తిభావంతో వొళ్లు పులకరించిపోతుంది. 'గోవిందా... గోవిందా...' అని చేతులెత్తి మొక్కుతారు.

ఈ తేడాని గమనించాడు మా మునిరామయ్య తాత. మాన్యులకు ఒక దర్శనం, సామాన్యులకు ఇంకో దర్శనమా? అని చెప్పి, ఉచిత దర్శనం క్యూలో వున్న ఆడోళ్లను, ముసలీ ముతకనీ, పిల్లల్ని, వికలాంగులను ఆ స్పెషల్ సేవ క్యూలో పంపించేసేవాడు. వాళ్లు భలే ఆనందంగా మహాద్వారం నుంచి వెళ్లి స్వామిని దర్శనం చేసుకునేవాళ్లు.

కొన్ని రోజులకు ఇది కూడా బయటపడిపోయింది. సేవా టికెట్స్ కట్టినవాళ్లతో పాటూ, ఇంకా ఎక్కువమంది దర్శనం చేసుకుంటున్నారనీ, ఎవరో డబ్బులు తీసుకుని పంపిస్తున్నారనీ కంప్లైంట్ చేసారు.

ఎంక్వైరీ చేసారు. మళ్లీ మా మునిరామయ్య తాతని కళ్యాణ కట్టలోకి మార్చారు. అక్కడా కుదురుగా వుండడుకదా! మంగళోళ్లకు జీతాలు తక్కువగా ఉన్నాయనీ, కత్తిరించిన జుత్తులో కొంత మిరాశ ఇవ్వాలని వాళ్ల చేత సమ్మె చేయించాడు.


మళ్లీ ఎంక్వైరీ, మళ్లీ ట్రాన్స్‌ఫర్. ఒక ఉద్యోగంలో కూడా కుదురుగా వుండలేకపోయాడు. ఇలా ఉద్యోగాలు మారుస్తూనే పెళ్లి చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు. వాళ్లని పెద్దవాళ్లని చేసాడు. పెళ్లిళ్లు చేసాడు. వాళ్లకి కూడా పిల్లలు కలిగారు. ఆ పిల్లలే మేము!

మా మునిరామయ్య తాతయ్యకి ఇద్దరు కొడుకులు. రెడ్డెప్ప నాయుడు, రంగప్ప నాయుడు వాళ్ల పేర్లు. మా రెడ్డప్ప మామ టైలర్. రెడ్డెప్ప టైలర్స్ అంటే కొండమీద చాలా ఫేమస్. ఆయనకు కులశేఖర్, శాంతి, శ్రీదేవి అని ముగ్గురు పిల్లలు. మా చిన్న మామ రంగప్ప చెవులు కుట్టే మఠంలో మేనేజర్‌గా పనిచేసేవాడు. ఆయన మంచి సింగర్, కొండమీద మ్యూజిక్ ట్రూప్ వుండేది. అప్పుడప్పుడూ మద్రాసుకు పోయి, సినిమాల్లో పాటలు పాడటానికి ట్రై చేస్తూ వుండేవాడు.

❖

మా మెరుగు మునిరామయ్య తాత ఇంట్లోకి అడుగుపెడితే చందనం వాసన గుప్పుమనేది. గర్భగుడిలోకి అడుగుపెట్టినట్టు వుండేది. ఇంటి బయట తిన్నెమీద చందనం తయారుచేసేవాడు. ఆ బిళ్లల్ని డబ్బాల్లో ఇంట్లో పెట్టేవాడు. ఇల్లంతా చందనం పువ్వు పూసినట్టు పరిమళించేది. టిఫిన్ చేసి, వేడివేడిగా కాఫీ తాగి, క్రేన్ వక్క పలుకుల్ని నోట్లో వేసుకుని పని మొదలుపెట్టేవాడు. చందనం కర్రని చేతుల్లో పట్టుకుని దాన్ని సానరాయి మీద అరగదీస్తూ, పొడి పొడిగా నీళ్లు చల్లుతూ, కాటుక కంటే మెత్తగా అరగదీసేవాడు. చందనం బిళ్లల తయారీకోసం ప్రత్యేకంగా చేసుకున్న పెద్ద పెద్ద ప్లేట్స్‌లో ఈ మిశ్రమాన్ని పోసేవాడు. మైసూర్‌పాక్ పాకం పోస్తారు చూడు అలా...! ఆ ప్లేట్స్‌ని తీసుకెళ్లి ఎండలో ఆరబెట్టేవాడు. కొంచెం గట్టిపడ్డాక మైసూర్‌పాక్‌ని కట్ చేసినట్టు, త్రిబుజాకారంలో బిళ్లలు బిళ్లలుగా కట్ చేసేవాడు. వాటిని మళ్లీ వేళ్లతో సున్నితంగా పసిబిడ్డకు మసాజ్ చేసినట్టు, పాలిష్ చేసేవాడు. బుల్లిబుల్లి పిరమిడ్స్‌ని చేసి ప్లేట్‌లో పడుకోబెట్టినట్టు చూడ ముచ్చటగా వుండేవి.

ఒక పెద్ద ఇనుప పెనుములో బొగ్గుల్ని రగిలించేవాడు. అవి కణకణమని రగులుకునేవి. ఆ పెనుము మీద ఒక తడికె ఉయ్యాలని వేలాడదీసేవాడు. వెదురు దెబ్బలతో అల్లిన తడిక అది. ఆ తడిక మీద ఈ చందనపు బిళ్లల్ని పేర్చేవాడు. ఒకవైపు బిళ్ల ఆరిపోతుంటే, ఇంకొకవైపుకి తిప్పిపెట్టేవాడు. ఇలా ఆరబెట్టిన బిళ్లల్ని డబ్బాలో పెట్టి ప్యాక్ చేసేవాడు. ఎంతో శ్రద్ధగా, ఓపికతో చేయాల్సిన పని. మా మునిరామయ్య తాత చేసిన చందనం బిళ్లలకి చాలా గిరాకీ ఉండేది. మా కొండమీదనే కాదు, దిగువ తిరుపతి అంగళ్లలో కూడా ఈ బిళ్లల్నే అమ్మేవాళ్లు. దక్షణ మాడ వీధిలో వుండే మా రెడ్డెప్ప మామ టైలరింగ్ షాప్‌లో కూడా ఈ చందనం డబ్బాల్ని అమ్మేవాళ్లు. బ్రాండ్ నేమ్ వుండేది కాదు, కానీ, బ్రాండ్ ఇమేజ్ అయితే వుండేది. ఎంత ఫేమస్ అంటే, కొండకు వచ్చే యాత్రికులు ఎగబడి కొనేవాళ్లు. ఒకసారి కొన్నవాళ్లు, ఎప్పుడు కొండకు వచ్చినా



మరిచిపోకుండా ఈ చందనం డబ్బాల్నే అడిగి మరీ కొనుక్కుని తీసుకెళ్లేవాళ్లు.

అంతేకాదు... ఎమ్మెస్ సుబ్బలక్ష్మి లాంటిదానికి ఈ చందనం అంటే చాలా ఇష్టం. కచ్చేరి చేయటానికి కొండకు వస్తే, మా ఇంటికి ఎదురుగా వున్న వైఖానస ఆశ్రమం సత్రంలో దిగేది. వాళ్ల మేనేజర్ వచ్చి ఒక డబ్బా పట్టుకెళ్లేవాడు. తమిళ సినిమాల్లో ఫేమస్ విలన్ నంబియార్‌కి ఈ చందనం అంటే చాలా ఇష్టం. నంబియార్ సినిమాల్లో కర్కోటకుడైన విలనే కాని, నిజం జీవితంలో సాధు స్వభావి. మహా భక్తుడు. ఆయనే స్వయంగా ఇంటికొచ్చి చందనం డబ్బా తీసుకెళ్లేవాడు.

మా మెరుగు మునిరామయ్య తాత చేసిన చందనం బిళ్లలకి అంత గిరాకీ వుండేది.

❖

ఒకరోజు చందనం అరగదీస్తు వుండగా నేను వెళ్లాను. చేత్తో చందనం తీసి నా బుగ్గలకి పూసాడు. చల్లగా అనిపించింది. వొళ్లంతా చందనంతో పరిమళించింది.

"తాతా... తాతా... నిన్ను ఒకటి అడుగుతాను చెప్తావా?" అని అడిగాను.

"ఏం చెప్పాలబ్బా... పెద్ద దొరవారికి," అని అన్నాడు ఆట పట్టిస్తూ...

"ఆ గోడమీద ఏలాడే తుపాకి గురించి చెప్పు తాత? దాని కథ ఏంటో చెప్పు తాత?" అని అడిగాను.

మంచి మూడ్‌లో వున్నట్టున్నాడు. తుపాకీ వైపు చూసి కథ చెప్పటం మొదలుపెట్టాడు.

ఒకరోజు మా తాత తుపాకి పట్టుకుని వేటకు వెళ్లాడంట. ఆరోజు ఒక జంతువు కూడా కనిపించలేదు. కనీసం కుందేలుని, కురపందిని కూడా కొట్టలేకపోయాడు. వేట పడలేదన్న చిరాకులో వున్నాడు. బాగా అలిసిపోయాడు. దాహం వేస్తూ వుంది. నీళ్లు తాగుదామని లోయలో వున్న తామరగుంటలోకి దిగాడు. గుంట నిండా తామరపూలు పరుచుకుని వున్నాయి.

అప్పటికే సూర్యుడు కూడా చిట్టచివరి కొండ వెనక్కి దిగుతున్నాడు. బంగారు బంతిలా మెరిసిపోతున్నాడు. సూర్యకిరణాలు తామరపూలరేకుల మీదపడి బంగారు వర్ణంలో మెరిసిపోతున్నాయి.

దేవుడు భూమి మీదకి దిగినప్పుడు, ఓ కాంతిపుంజం విస్ఫోటనం చెందినట్టు ఓ మహా సూర్యకిరణకాంతి ఆ లోయ అంతా ఆవరించి వుంది.

మా మెరుగు మునిరామయ్య తాత, తుపాకీని చంకకు తగిలించుకుని తామరకుంటలోకి దిగాడు. మోకాళ్లలోతు నీళ్లల్లో దిగి, నడుము వంచి, నీళ్లను దోసిల్లోకి తీసుకుని తాగబోయాడు. ఇంతలో వెనకనుంచి కిచకిచమని ధ్వని వినిపించింది. ఎవరో నెత్తిన పడ్డట్టు ఉలిక్కిపడి దోసిలి వదిలేసాడు. దోసిలిలో నీళ్లు తామర పువ్వుమీద పడ్డాయి.

వెంటనే చేతుల్లోకి తుపాకీ తీసుకుని, వెనక్కి తిరిగి ఆ శబ్దం వచ్చిన వైపుకి గురిపెట్టాడు. కోతుల గుంపు చెల్లాచెదరైంది పాపం... ఓ తల్లికోతి, తన బిడ్డను కడుపుకు కరుచుకుని గురిపెట్టిన తుపాకీకి దొరికిపోయింది. బిత్తరపోయి చూస్తూ నిలబడిపోయింది. రొమ్ము కుడుస్తున్న పిల్లకోతి, తల్లి రొమ్మును పట్టుకుని భీతిగా చూస్తూ వుంది.

తుపాకీ చాలా కర్కశంగా ఆ కోతినే చూస్తూ వుంది. వేటగాడి నైజం ఎలా వుంటుంది అంటే, ఆకలిగొన్న పులి వేటకు దిగినట్టు వుంటుంది. జాలీ, దయా వుండదు. పులిలోని క్రూరత్వం మా తాత కళ్లల్లో ప్రతిఫలిస్తోంది.

జంతువును కొట్టకపోతే పిచ్చెక్కుతుంది. మందు గుండుపేలిన శబ్దం వినకపోతే, కపాల మోక్షం కాని శవంలా శరీరం స్తంభించిపోతుంది.

ఒక్కసారి తుపాకి ఎక్కుపెడితే, అది కోతైనాసరే కొట్టి తీరాల్సిందే! వేటగాడి మానసిక స్థితి అలా వుంటుంది.

ట్రిగ్గర్ మీద వేళ్లు కదిలాయి. ఒక్కసారిగా తల్లికోతిలో కదిలిక వచ్చింది. రెండు చేతుల్ని జోడించి నమస్కరించింది. దాని కళ్ల నిండుగా నీళ్లున్నాయి. దీనంగా చేతులు జోడించి నమస్కరించింది. అది చూసిన మా తాత వొళ్లు జలదరించింది. గుండె వేగంగా కొట్టుకుంది. వొళ్లంతా చెమటలు పట్టేసాయి. మహాపరాధం చేస్తున్నానన్న భావన కలిగింది.

సాక్షాత్తు ఆంజనేయస్వామి మీదకే తుపాకి గురిపెట్టినట్టు మనసులో ఒక గిలి కలిగింది. తుపాకీని పడేసి, మోకాళ్ల మీద కూర్చున్నాడు. రెండు చేతులు జోడించి ఆ తల్లి కోతికి నమస్కరించాడు. అంతే... మళ్లెప్పుడు తుపాకినీ చేతుల్లో పట్టలేదు.

ఆరోజు ఓ కోతి, ఓ మనిషి మనసును గెలిచింది.



తిరుమల కొండ మీద పుట్టి పెరిగిన గోపిని కరుణాకర్ కథకుడు, నవలారచయిత. నాలుగు కథాసంపుటాలు, బాలాజీ టాకీస్ నవల ప్రచురించారు. తిరుపతికొండ కథల రచయితగా ప్రసిద్ధులు. సినిమారంగంలో పనిచేస్తున్నారు. నివాసం హైదరాబాదు.

యాత్ర

బండ్ల మాధవరావు

అడవుల్లోంచి పంటపొలాల మీదుగా
మళ్లీ అడవుల్లోకి నడుస్తున్నాను అధోముఖంగా
కాళ్లతో నడిచి చేతుల్తో పనిచేయాల్సిన నేను
ఇప్పుడు తలకిందులుగా చేతుల్తో నడుస్తున్నాను
అప్పటి అడవి దేనికి సంకేతమో తెలియదుగానీ
ఇప్పటి అడవి పాతుకుపోయిన పాదాలతో
బండబారిన బతుకులను పరుచుకుంటూ
పెరుగుతోంది
చేతులులేక
చేతులుడిగిన దేహంతో
అడవి కొమ్మలకు వేలాడుతూ
స్రవిస్తోన్న రక్తంతో దారులు ఎర్రబారుతున్నాయి
నాటిన పచ్చదనం మోడువారుతోంటే
దారికడ్డంగా పడి మొలిచిన తుమ్మచెట్లు
ఆనోపంగా పెరుగుతూనే ఉన్నాయి
గొడ్డళ్లను తొడుక్కున్న తుమ్మకర్రలు
వసివాడని పసిగుడ్డుల్నో
వయసుడిగిన పండుబుట్టల్నో వెంటాడుతూనే ఉన్నాయి
పొలాల్లో పారుతున్న రక్తంతో తడిసిన పంట
ఆకలిని విరగకాస్తోంది
మట్టిమెతుకుల ముద్ద
ఎవరి పొట్టా నింపడంలేదు
అదేంటో ఏ దేహాన్ని దహనం చేసినా
కట్టెలు తిరిగి తిరిగి పోడుబాట పట్టడమే
అంతుపట్టని రహస్యం
రహదారుల్ని వెంటాడుతున్న ఆయుధాలు
మత్తులో మునిగిపోయి
ఎప్పుడెవర్ని మట్టుపెడుతున్నాయో
నిరంతరం వేలాడే ప్రశ్నగా ఎదురునిలుస్తోంది
నన్ను నేను చెట్టుకు వేలాడతీసుకోవడం
నీకు పాతబడిపోయింది
నాకు మాత్రం ఇదే మొదటి, చివరిసారి
కాళ్ల కింద చిత్తడిగా మారి మట్టిపాలైన అన్నం
ఎవరికోసమో ఎదురు చూస్తూనే ఉంది
యాత్ర కాంక్రీటు వనాల పైరుల మీదగా
డప్పుల మోతల మధ్య సాగుతూనే వుంది



బండ్ల మాధవరావు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఐదు కవితాసంపుటాలు, ఒక దీర్ఘకవిత ప్రచురించారు. పిల్లలకి రచనలో శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. విజయవాడలో శిఖర స్కూలు నిర్వాహకులు. వివిధ సాహిత్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. నివాసం విజయవాడ.

సమావేశం

కొడికొండ కె. శివకుమార శర్మ



1

అ

రేర్ వ్యూ మిర్రర్లో చూస్తున్నాను. ఇందాకటి నించీ ఆ ట్రక్ డ్రైవర్ అంత దగ్గరగా రావడం భయపెట్టడానికే. పక్క లేన్‌లోకి మారడానికి వీల్లేకుండా దగ్గరగా కార్లు. కాలేజీ రోజుల్లో మహేష్ అలాగే చేశాడు. 'ఒరేయ్, ప్రతి పది మైళ్ల వేగానికీ ఒక కారు పొడవు దూరం ఇవ్వాలని డ్రైవింగ్ టెస్ట్‌లో టిక్కు పెట్టాం గుర్తుందా?' అన్నాను ఒకసారి ఇంక తట్టుకోలేక.

అరవై మైళ్ల వేగంతో పోతూ కూడా ఒక కారు పొడవు గాప్ మాత్రమే వదిలేవాడు మరి. ముందువాడు హఠాత్తుగా బ్రేక్ వేస్తే, వీడు రియాక్ట్ కాలేకపోతే? వాడి కార్లో వెడుతున్నాగానీ నా సేఫ్టీ నాకే గదా ముఖ్యం? 'అంత గాప్ ఇస్తే పక్కవాడు దూరిపోడూ?' జవాబిచ్చాడు. నార్త్ ఇండియన్ గనుక గిస్సింగ్ అన్నట్టున్నాడు. అది నిజంగానే ఆంగ్ల పదమా లేక హిందీ కలబోసినదా అన్న విషయాన్ని ఎప్పుడూ నిర్ధారించుకోలేదు.

ఈ పక్క లేన్‌లో వాళ్లకి వాడే డ్రైవింగ్ పాఠాలు నేర్పినట్టున్నాడు. వాడిలాగే గాప్ వదలడం లేదు. ఆగి వున్న రెండు కార్ల మధ్య పారలెల్ పార్కింగ్ చేయడమే కష్టం. అలాంటిది అరవై మైళ్ల వేగంతో నడిచే రెండు కార్ల మధ్య దూరడం నో వే! ఇంకెంత? పది మైళ్లు, పది నిముషాలు. అంతేగా!

ఆ

వీడెవడో డబ్బా కారు పెట్టుకుని లెఫ్ట్ లేన్‌లో! ఈ కారులో కనక అది వుండుంటే ఈ పాటికి దాన్ని చీమని విదిలించినట్లు పక్కకు తోసేవాణ్ణి. గింగిరీలు తిరుగుతూ ఆ కారు పక్కకు దొర్లి ఏ చెట్టుకు గుద్దుకునో ఆగేది. దాని సంగతి చెప్పక్కర్లా. విండ్ షీల్డ్ లోంచి ముందుకు విసిరేయబడేది. అదృష్టం వుంటే తగలబడేది కూడా. ఆ కారులో అది ఉన్నది అనుకున్నప్పుడల్లా పాదం యాక్సిలరేటర్ని బలంగా నొక్కుతోంది. గుద్దుతుందేమో అనిపించినప్పుడు కాలు వెనక్కు లాగుతోంది, అది అందులో లేదని గుర్తించి.


జుట్టు పట్టుకుని ఈడ్చి చాచి నాలుగు పీకిన తరువాత రేచెల్ వదిలి వెళ్లడం వల్ల కదా మెయిల్ ఆర్డర్ బ్రైడ్‌ని తెప్పించుకొమ్మని డిక్ సలహా ఇవ్వడమూ, పడివుంటుందని దీన్ని రష్యానించి తెప్పించుకున్నదీను? దాని చెల్లెలు కూడా ఈ దేశం చేరినప్పటి నించీ మొదలయింది తలనెప్పి. దగ్గరికి లాక్కుంటే విసిరికొట్టింది సరే, కానీ కచ్చతో అక్క మెదడు తినెయ్యడమెందుకు? వాళ్లని కలవనీయకుండా ఉంచడానికి జాగ్రత్తపడుతూనే ఉన్నాను అనుకుంటున్నానుగానీ ఈ ట్రక్కులో డెలివరీలకి తిరుగుతున్నప్పుడు ఏం జరుగుతున్నదో నాకేం తెలుసు?

ఇ

ఇందాకటి నించీ చూస్తున్నాను ఈ ట్రక్కుని లెఫ్ట్ లేన్‌లో, సరిగ్గా నాకు ముందరే. ఒకసారి కారుని షోల్డర్ మీదకి కొద్దిగా పోనిస్తూ ముందుకు చూశా. దాని ముందర ఒక కారుండబట్టి సరిపోయిందిగానీ లేకపోతే పక్కకు లాగి లీడింగ్ ఇన్ ది లెఫ్ట్ లేన్ అని టిక్కెట్ ఇచ్చేవాణ్ణి. కుడిపక్కగానూ వరసగా కార్లున్నాయి. ఎవరికీ లేన్ మారడానికి వీల్లేకుండా. సినిమాల్లో చూపించినట్లు ఒక మనిషి ఒక కార్లోంచి పక్క దాంట్లోకి తేలిగ్గా మారచ్చు. బిల్ బాస్టర్డ్ గనక అలా నా కారులోకో నా కారులోంచో మారుతుంటే కారుని ఠక్కున పక్కకు దూరంగా జరుపుతాను. కిందపడి క్షణాల్లో ఫినిష్ అవుతాడు. నా కింది ఉద్యోగులతో వాడిలాగా పొరబాటున కూడా ప్రవర్తించను, వాళ్లు తెల్లవాళ్లయినాగానీ. నల్లవాణ్ణి అని చిన్న చూపుతో పాటు సహోద్యోగుల ముందు కుళ్లు జోకులు. ఆఖరికి, బేడీలతో ఉన్న నల్లవాడు కూడా స్టేషన్‌లో ఆ దుర్భాషని సహించలేక నావైపు తిరిగి, నువ్వెలా భరిస్తున్నావోగానీ, నేనయితే వాడి తుపాకీతోనే వాణ్ణి కాల్చేవాణ్ణి అన్నాడు. బిల్‌గాడు, వాడి అనుయాయులు వాణ్ణి కుళ్లబొడిచారు- డొక్కల్లో తంతూ, కిందపడ్డ వాడిమీద నలుగురు పడీ, ఒకడు మోకాలిని వాడి మెడ మీద నొక్కిపెడుతూనూ. వాడు ఈనాడు గాలి పీల్చడం విచిత్రమే.

2

అ



మీదమీదకు వస్తున్నావు, రారా! ఏం చేద్దామనుకుంటున్నావ్? వెనకనించి గుద్దావు అని చెప్పడానికి వక్కన వెడుతున్నవాళ్లల్లో కనీసం ఒకడయినా సాక్ష్యం చెపుతాడన్న నమ్మకమున్నది, రజియా నూరిపోతల వల్ల. ఈ దేశం గూర్చి పల్లెత్తు మాట అనగానే చాలు, సర్లే, ఇక్కడే ఇంకా కొద్దిగా అయినా నీతీ నిజాయితీలు నిలబడు న్నాయ్, తగ్గు తగ్గు, అంటుంది. అలా నిలబడడానికి కారణం ప్రతివాడికీ అందుబాటులో ఉండే తుపాకీ అని జవాబిస్తాను. బయలుదేరే ముందర దాన్ని గ్లవ్ కంపార్ట్‌మెంట్‌లో భద్రంగా పెట్టాను. అలా వెడుతున్నప్పుడల్లా తను గుర్రుగా

చూస్తుంది. కారులో తనో అదో ఒకరే ఉండాలనేది ఒప్పందం. వాక్సినేషన్‌కి ఒక్కళ్లకే అపాయింట్‌మెంట్ దొరికింది. ప్రభుత్వో ద్యోగిని, డయా బిటిక్ అని చెప్పడంవల్ల అని, అందుకే ఒంటరిగా వెడుతున్నానని, గుర్తుచేశాను. ఇక్కణ్ణించీ పశ్చిమంగానో దక్షిణం గానో ఇరవై మైళ్లు వెళ్లండి, అసలు అమెరికా ఏదో తెలుస్తుంది అన్నాడు ఆ మధ్య ఒకడు. తెలుగువాడే. దానికి ఇంకొక ఇరవైమైళు కలిపిన చోట ఈ అపాయింట్‌మెంట్. అది దొరకడానికి కారణం ఇక్కడివాళ్లు రోగమూ, వాక్సినేషనూ రెండూ కాన్‌స్పిరసీలనే MAGA వోటర్లవడం, నో వాక్సినేషన్ అని పంతం పట్టడం. వాళ్లెలా పోతే నా కెందుకు? నేను హాపీ. ఇదుగో, ఈ ట్రక్కువాడే దాన్ని నాశనం చేస్తున్నాడు.

ఆ

వారం రోజులపాటు రెండువేల మైళ్లు ఈ ట్రక్కులో తిరిగివస్తే, ఇంట్లో టేబుల్ మీద-

అదెక్కడి కెళ్లుంటుందీ?

వీడు కాలేజీ కెళ్లడం మొదలయినప్పటి నించీ మార్పు లొచ్చాయ్ అని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. కాలేజ్ ఆఫ్ విలియమ్ అండ్ మేరీ లిబరల్ కాలేజ్ అని నాకేం తెలుసు? రాష్ట్రానికి నడిబొడ్డులో ఉన్నది, ఆ విలియమ్స్‌బర్గ్‌లో ఉన్నది మన వాళ్లేనని డిక్ అంటేనేగా వాణ్ణి పంపింది? లేకపోతే, ఎన్ని నమ్మక మయిన చోట్లు లేవు చదువుకోవడానికి? టెక్సాస్, లూజియానా, టెన్నిసీ?

సెలవులకి వచ్చినప్పుడు నెలరోజుల్లో ఎన్నిసార్లు కనబడి వుంటాడు? నేను ఊళ్లో ఉంటేగా? ఇద్దరం ఒకే కప్పు కింద ఉన్న రెండు మూడు రోజులూ కూడా కనిపించేవాడు కాదు. స్నేహితులతో తిరుగుతున్నాడనేది. ...ఆ సంఘటన తరువాత కనిపించాడా?

ఏం చేశాను? దాన్ని పక్కలోకి రమ్మన్నాను. రోగాలంటిం చావ్, డాక్టర్ నిన్ను దూరంగా ఉంచమన్నది అని దూరంగా నెట్టింది. చేయి పట్టుకుని లాగబోతే అరిచింది. వదులు! అన్నాడు వాడు తుపాకీతో ప్రత్యక్షమై.

ఇ

ఈ ట్రక్కువాడు తమాషాగా డ్రైవ్ చేస్తున్నాడు. నేనేమో పక్క లేన్‌లోని కార్ల స్పీడుతో వెడుతున్నాను. వాడికీ నాకూ మధ్య దూరం పెరుగుతూంటుంది, తగ్గుతూంటుంది. యావరేజ్ స్పీడ్ మాత్రం ఒకటే. స్పీడ్ మెయిన్‌టెయిన్ చెయ్యలేక పోవడానికి కారణం- తాగున్నాడా?

బిల్ బాస్టర్డ్ గుర్తుకొచ్చాడు. ఎప్పుడూ తాగే వుంటాడు. బాస్టర్డ్ అనేది నేను ప్రేమతోనో కోపంతోనో పెట్టిన పేరు కాదు. వాడి పై అధికారి వాణ్ణి అలా పిలిపించేవాట్ట, కాల్ దట్ బాస్టర్డ్ అంటూ. అది లాస్ట్‌నేమ్‌గా మారిపోయి, వాడే ఇప్పుడు ఆ పై అధికారి అయినా అలా మిగిలిపోయింది. కొంతమంది బాస్టర్డ్స్ అవడానికి కారకుడు కూడా!

మా తాత, బాబు లాంటివాళ్లు అనుగ్రహించడంవల్ల ఈనాడు ఎంతోమందికి అంత నలుపు రంగు తోలు బాధ తప్పింది, కొంతమంది వయ్యారులని నేనుకూడా అనుగ్రహిస్తూనే వున్నాను అన్నాడు నేను వింటూండగానే. రక్తం ఉడికినా నేనేం చేయగలను? వర్క్ ప్లేస్‌లో హెరాస్‌మెంట్ అని కేస్ వేస్తే సాక్ష్యం చెప్పడానికి ఎవరూ రారు. బ్లూ వాల్ అని కదూ? యూనిఫాంలో ఉన్నా లేకున్నా పోలీసులు కట్టుబడితో కట్టుబడిలో ఉంటారు. వాడు యూనిఫాంలో లేనప్పుడు ఎవరయినా వాణ్ణి కాల్చిపారేస్తే బావుణ్ణని పిస్తుంది. ఈ ట్రక్కుని ఆపాననుకో, ఆ డ్రైవర్ బిల్‌గాడే ననుకో, ఆ పని నేనే చెయ్యచ్చుగానీ వాడు ట్రక్కెందుకు నడుపుతాడు, నా అత్యాశ కాకపోతే?

3

అ

తుపాకీతో నా సన్నిహితత్వం గూర్చి రజియా కెప్పుడూ అనుమానమే. అమెరికా వచ్చి ఎమ్మెస్ చేసే రోజుల్లో ఫ్రెండ్‌తో కలిసి రేంజ్‌కెళ్లే వాణ్ణని చెబితే, గర్ల్‌ఫ్రెండ్ అయ్యుంటుందని అనేసింది. ఆడవాళ్లకి ఈ సెన్స్ ఎలా అబ్బుతుందో? కలిసి ఏడాదయిందన్న గుర్తుగా మిరియం ఇచ్చింది. ఘాటుగా ఉన్నదా అని తెలుగు ఫ్రెండ్స్ పగలబడి నవ్వేవాళ్లు ఆమె ప్రసక్తి వచ్చినప్పుడల్లా. చాలా త్వరగా నేర్చుకున్నావ్, యూ ఆర్ ఎ షార్ప్ షూటర్ అనేది నన్ను.

ట్రక్ డ్రైవర్ అనగానే, ఇంగ్లీషు సినిమాల్లో చూపించినట్లు ఆరడుగులకి పైగా ఎత్తు, బట్ట తల, బానెడు పొట్ట, పొడుగు గడ్డంతో కనీసం 250 పౌండ్ల తెల్లవాడి శరీరం కళ్ల ముందు కనిపించింది.

తుపాకీ నీ గడ్డం నించి నిన్ను కాపాడలేదు అంటుంది రజియా. 9/11 తరువాతే నువు గడ్డం పెంచడం మొదలుపెట్టింది అని అప్పుడప్పుడూ గుర్తుచేస్తుంది. కోరి తెచ్చుకుంటున్నావు అని మందలిస్తుంది. ఎవరి మీద ప్రతిఘటన అని ప్రశ్నించిందొకసారి. స్వేచ్ఛా ప్రకటన మాత్రమేనని జవాబిచ్చా. ఇప్పటిదాకా లేదు స్వేచ్ఛ! ఛాతీ మీదా వీపు మీదా ఎర్ర పెయింట్‌తో వృత్తాల టార్గెట్ వేసుకుని తిరుగు, బోల్డంత దొరుకుతుంది అని విసుక్కుంది.

ఇన్నాళ్లకి నీ అవసరం వస్తున్నట్లున్నది అన్నాను పెద్దగా. గ్లవ్ కంపార్ట్‌మెంట్‌లో దానికి వినబడేటట్లుగా. తూటాలు నింపి ఉన్నందుకు అది తప్పక సంతోషిస్తుంది.

ఆ

వాడి చేతిలోంచి తుపాకీ క్షణంలో లాక్కోవచ్చుగానీ నన్నాపిన విషయం, వాళ్లిద్దరూ ఒకటయ్యారన్న సంగతి మైండ్‌లో రిజిస్టర్ కావడం. తప్పకుండా దాని చెల్లెలు ప్రభావమే! తెలిసిన తిట్లన్నీ వాడాను. దాని ఫోన్‌లో చెల్లెలి నంబర్ బ్లాక్ చేశానుగానీ ఇంకెవరి ఫోనో వాడుతూండాలి. లేకపోతే ఇంత తెగువ దానికెలా వస్తుంది?

ఎక్కడి కెళ్లుంటుందన్న ప్రశ్నకి తేలిగ్గానే జవాబు దొరికింది. షరపోవా తప్ప దానికి ఈ దేశంలో ఎవరూ లేరు మరి! కాలేజీలో ఇంకో ముగ్గురితో షేర్ చేసుకుంటున్న అపార్ట్‌మెంట్‌లో వాడి దగ్గర

ఉండే ప్రసక్తి లేదు. డిక్ కొడుకు తెలివయినవాడు- డైవోర్సులవల్ల దాని పేర్లు ఎన్నిసార్లు మారినా సోషల్ మీడియా గాలించి పట్టుకున్నాడు. డిక్ కనెక్షన్లు కూడా పనికొచ్చాయి. నువ్వెళ్లేసరికి అక్కడ మన మనుషులు రెడీగా ఉంటారన్నాడు. షరీఫ్ కూడా మనవాడే, యూనిఫాంలో ఉన్నప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో MAGA హాట్ పెట్టుకునే ఉంటాడు, ఇంట్లో ఏ మూల దాచినా సరే, అవసర మయితే బేడీలు కూడా వేసి బయటకు లాక్కురాగలడు అన్నాడు. దానికలా కావల్సిందే. నాకు డైవోర్స్ నోటీస్ ఇస్తుందా? వెళ్లాల్సింది ఇంకా ఐదు మైళ్లే కానీ ఈ డబ్బా కారువాడు అడ్డం తగిలి స్లో చేస్తున్నాడు. చికాకు పుట్టింది.

నా చేయి హారన్‌ని బలంగా మోగించింది.

3

వీడెందుకు హారన్‌ని అంత బలంగా మోగిస్తున్నాడు? ముందు వాడు లేన్ మారట్లేదనేనా? అసలే ట్రక్కు అని బలుపు. డ్రైవర్ వంటి రంగు బలుపు కూడా తోడయి వుంటుంది. పైన లైట్లని ఆన్ చేసి పక్కకి ఈడ్చి లైసెన్స్ చూపించమని అడగడానికి ఇది అంత పెద్ద తప్పేం కాదు. భారీ కాయుడయితే, రంగు ధైర్యం తోడయితే వాడు చూపించే పొగరు వేరేగా ఉంటుంది. అది, నా ఆరడుగుల, రెండు వందల పౌండ్ల శరీరాన్ని కూడా మనసు అదుపులో ఉంచుతుంది నెమ్మది నెమ్మది అంటూ. ఐ లవ్యూ ఎ లాట్‌గానీ, నువ్వు అణగారిన తనం నుంచీ ఇంకా పూర్తిగా బయటకు రాలేదు అంటుంది సూసన్.

తరువాతి తరాలకి రంగుతోళ్లని తెల్లబరచే వరాలు ప్రసాదించడం మన మగాళ్లకే సాధ్యం, అంతా విత్తనం బలం, అన్నాడు బిల్ బాస్టర్డ్ చాలాసార్లు. పకపకా నవ్వారు బూట్లు నాకే వాళ్లు అన్నిసార్లూను. నేను సూసన్‌ని పెళ్లిచేసుకోవడం వాళ్ల జాతికే కళంకం అన్నట్టు ఫీలవుతాడు. నేను పక్క గదిలో ఉన్నాననే వాళ్లు పెద్దగా మాట్లాడుతుంటారు.


నిన్న రాత్రి పార్టీలో వాడు సూసన్ మీద చెయి వేయడం, తను విసిరికొట్టడం, ఆ సంగతి నాకు తెలిసి కూడా నేను ఇవాళ పొద్దున్న వాణ్ణి నిలదీయలేకపోవడం... ఏదీ, ఇవాళ కనబడితేగా? నా మీద నాకే చెప్పలేనంత కోపంగా ఉన్నది. ఏం చేస్తానో అని భయపడుతూనే, వదిలెయ్ అన్నది తను. ఇవాళ సెలవు పెట్టమని కూడా అన్నది. వాడిని నిలదీయడానికే స్టేషన్‌కి వచ్చాను కానీ, వాడు లేడు. యూనిఫాం లేకుండా వాడు ఒంటరిగా దొరకాలీ, అప్పుడుంటుంది!

4

అమ్మయ్య! మొత్తానికి చేరుకున్నా. సిగ్నల్ దగ్గర ఈ లెఫ్ట్ టర్న్ తరువాత ఆ మూలదే ఫార్మసీ అని గూగులమ్మచెబుతోంది. రేర్ వ్యూ మిర్రర్ ఆ ట్రక్ నా వెనకే ఈ టర్న్ లేన్‌లో ఆగి వున్నట్టు చూపిస్తోంది. సరేలే, ఈ రోడ్డు నాది కాదు గదా, వాడికీ ఇటుపక్కన ఏదో పనిబడి ఉంటుంది. కానీ వాణ్ణి వాచ్ చేస్తున్నాను.

తిన్నగా వెళ్లుంటే రెండు మైళ్లేగానీ... ఇందాకటి నించీ అడ్డంగా ముందు నిల్చుని చికాకుపెట్టాడు. కోపం తన్నుకొచ్చింది. వీడి సంగతి తేల్చుకోవడం కోసం ఆ కారు వెనకే ఈ టర్న్ లేన్‌లో ఆగాను. హారన్ కొట్టినా గానీ లేన్ మారకుండా... కాలర్ పట్టుకుని నాలుగు వాయిస్తే సరి! అయితే అయింది అయిదు నిముషాల ఆలస్యం!

ట్రక్ లెఫ్ట్ టర్న్ లేన్‌లోకి మారుతూండగానే దాని ముందు కారు కూడా ఆ లేన్‌లోకి మారిందని గమనించి, వీడు ఇటే పోవలసిన వాడా లేక... అని అనుమానం వచ్చి నేను కూడా లేన్ మారి, ట్రక్ వెనకే కారుని ఆపాను. ఎడమపక్క కిటికీ వైపుకి బాగా వంగి ముందుకు చూశాను. వాడు ట్రక్కు తలుపు తీసి కిందకు దిగుతున్నాడు. ఎందుకు?



ట్రక్ డ్రైవర్ కిందికి దిగి నావైపు నడుస్తున్నాడు! హారన్ కొట్టినా లేన్ మారనందుకు రోడ్ రేజ్? బెదిరిస్తాడా? బెదిరించడంతో ఆగుతాడా? వాడి ఒక్కొక్క అడుగుకీ నా గుండె వేగం పెరుగు తోంది. కుడి చేయి గ్లవ్ బాక్స్ వైపు వెళ్లాలా వద్దా అని సంశయి స్తోంది.

ట్రక్‌లోంచి దిగుతున్నప్పుడు బెల్టుకున్న హోల్‌స్టర్ గుర్తు చేసింది లోపల గన్ ఉన్నదని. ముందు, నేను తల్చుకునుంటే నువ్విప్పుడు ఊపిరి పీలుస్తూండేవాడివి కాదు తెలుసా

అని కళ్లెర్ర జేస్తూ అడుగుతాను. నోరెత్తాడా, గన్ మొహం ముందు ఊపుతాను. జీవితాంతం గుర్తుంటుంది.

పోలీస్ గుర్తులు నా కారుకి లేకపోవడంవల్ల వాడు వెనక్కు తిరిగి చూసి వున్నా అంతగా పట్టించుకునేవాడు కాదేమోగానీ, అసలు చుట్టుపక్కల ఎవరున్నారన్న ధ్యాసే లేకుండా ముందు కారు వైపుకు నడుస్తున్నాడు. డైరక్షన్లు అడగడానికని అనుకోను. రంగూ, ఒడ్డూ, పొడుగూ, MAGA హాట్‌తో కలిపి బాస్టర్డ్‌లాగే ఉన్నాడు. వాడేనా? అది పోలీస్ గెయిట్‌లాగే ఉన్నది. గుండె కొట్టుకోవడం ఒక్క క్షణం ఆగింది. సూసన్ మీద వేసిన చేతిని వదలకూడదు. గుండెలో రేగిన మంటని ఆర్పడానికి ఎడమచేత్తో ఛాతీని రుద్దు కున్నాను. ఏ కారణంవల్ల ఆ ట్రక్కులో ఉన్నాడో నాకెందుకు? బాస్టర్డ్ అని పిలుస్తాను. కళ్లు కొద్దిగా మసకబారాయి. ఇటు తిరగ్గానే... తుపాకీని చేత్తో పట్టుకుంటూ కారు దిగాను.

గన్ ఎందుకు అన్న రజియా ప్రశ్నకి ఆత్మరక్షణకి అన్న నా జవాబు విని, స్టాండ్ యువర్ గ్రౌండ్, చట్టాలు తెల్లవాళ్లని రక్షించ డానికిగానీ నీకు కాదు, అని తను మొత్తుకోవడం నా మెదడులో ప్రతిధ్వనించింది కానీ గ్లవ్ బాక్స్‌లోంచి తుపాకీని తియ్యడాన్ని ఆపలేకపోయింది. ముస్లిం టెర్రరిస్ట్ చేతిలో ట్రంప్ సపోర్టర్ మృతి అన్న వార్తని రజియా తట్టుకోలేదు అన్న సత్యం చేతికి చెమటలు పోయిస్తోంది. బట్, అయామ్ ప్రిపేర్డ్ టు డిఫెండ్ మై సెల్ఫ్! దీర్ఘ శ్వాస తీసుకుని కుడిచేతిని వెనగ్గా ఉంచి కారు తలుపు తీసి ఎడమ కాలు బయట పెట్టాను. పెద్ద పర్సనాలిటీ తనని కాపాడుతుందని అనుకుంటున్నాడేమో! తుపాకీని వాడే నా చెయ్యి స్పీడ్ గూర్చి వాడికి తెలియదు.


నేనింకా వాడు కారులోనే కూర్చుంటాడు, కిటికీ అద్దం తియ్య మని చేత్తో ఆర్డర్ వేస్తూ బెదిరిద్దామనుకుంటే వాడే ముందు బయట కొచ్చాడు! పొట్టిగా, బక్కగా ఉన్నాడని గుర్తించి ముందే యుద్ధానికి తయారయినట్లున్నాడు. ఆ గడ్డమూ, ఆ వంటి రంగూ వీళ్ల వాళ్లే కదా 9/11 కారకులు ? వెనగ్గా పెట్టిన చేతిలో ఏమున్నది? నేను తయారుగా ఉండడం కాదు నేనే ముందు... కుడిచేయి గన్‌ని చిక్కించుకుంది.

ట్రక్కువాడి చేయి నిశ్చయంగా గన్ వైపు వెడుతోందని కనిపించింది. ఈజ్ హి బిల్ బాస్టర్డ్ ఆర్ నాట్? ఆ మొహాన్ని ఇటు తిప్పరా, బాస్టర్డ్. తిప్పకపోతేనే మంచిదేమో, తెలియక కాల్చాను అని చెప్పచ్చు. ఆ ముందు కారు వాడి వెనగ్గా సూర్యరశ్మిలో ఏదో మెరిసి ఆ మెరుపు కారు అద్దాలలో ప్రతిఫలించింది. అదీ తుపాకీయే అయ్యుండాలి.

ఆ ట్రక్కు వాడి వెనక పోలీసు చేతిలో కూడా తుపాకీ. అది కూడా నాకే గురిపెట్టబడి ఉన్నది! అంటే.. వీడు FBI? CIA? ఇద్దరూ కలిసి నన్ను ఛేజ్ చేశారా? వంటినిండా చెమటలు పోస్తున్నాయి. చేతులు పైకెత్తితే ఇద్దరూ నన్ను కాల్చేస్తారా? వాళ్లకన్నా వేగంగా ఇద్దరినీ నేను కాల్చగలను. చంపగలిగేది చావడానికి ముందే!

వీడి చూపులు పూర్తిగా నామీద ఉన్నట్టు లేవే? నన్ను దాటి వెనక్కు వెడుతున్నాయి ఎందుకు? మెడ కొంచెం తిప్పి ఓరకంటితో వెనక్కి చూడబోతూ ముందువాడి కుడిచేయి కదలడం గమనించాను. కుడిచెయ్యి తుపాకీని హోల్‌స్టర్ నించీ వేరుచేసింది.

మెడ తిపవితున్నాడు. పూర్తిగా తిరిగేదాకా ఆగితే ఛాన్స్ పోగొట్టుకుంటానేమో? అరె, తుపాకీ బయటికి తీశాడే! వాడు కూడా!!



తాడికొండ శివకుమార శర్మ పుట్టింది, చదివింది గుంటూర్‌లో. ఐఐటి మద్రాస్‌లో బి.టెక్, రట్గెర్స్ యూనివర్సిటీ, న్యూజెర్సీలో మాస్టర్స్, పిహెచ్.డి. చేశారు. భార్య మల్లిక, పిల్లలు విరించి, మహతిలతో ఇరవయ్యేళ్లుగా వాషింగ్టన్ డి.సి. దగ్గర్లో నివాసం. నలభైకే పైగా కథలు రాశారు. వీరి నవలకు ఆటా నవలల పోటీలో బహుమతి లభించింది. నటించడం, కర్ణాటక సంగీతసాధన అభిరుచులు.

విప్లవం యాడుందిరా!

ఆశారాజు

కొందరు ఊహించి ఉయ్యాలలు కట్టారు

కొందరు అడ్డంగా పాతిన–
అద్దాల గురించి ఆలోచించారు

కొందరు నినాదాలు చేసి వెళ్లిపోయారు

కొందరు ప్రశ్నలు వేసి కళ్లు తెరిపించారు

కొందరు పోరాటంచేసి,
అజ్ఞాత వాసంలోకి వెళ్లారు

కొందరు నిద్ర లేపడానికి,
గస్తీ తిరిగే బాధ్యత తీసుకొన్నారు

కొందరు నిజాలు మాట్లాడి,
జైల్లో ఊపిరాడకుండా వున్నారు

కొందరు బందూకులకు ఎదురు నిలిచి,
అమరులయ్యి స్వప్నాలుగా మిగిలారు

ఎంత మంచు కురుస్తే నేమీ,
కొందరు–
మునుల్లా తపస్సు చేస్తూనే వున్నారు

ఎన్ని తుఫాన్లు తాకినా,
కొందరు నది ఒడ్డును పట్టుకొని,
నింగిని కిందికి లాగుతూనే వున్నారు

ఇలా–
నిప్పులో
నీటిలో
గాలిలో
మట్టిలో
మనిషిలో
మాటలో
ప్రేమలో

ఇలా–
విప్లవం పేజీలు కొట్టుకొంటున్న
ఉద్గ్రధంలా పడివుంది

వదలలేని కొందరి నిబద్ధతలా
మాటకు అందని కొందరి వాగ్దానంలా
సలపరం తగ్గని కొందరి గాయంలా
చినుకుల పరిమళం కోసం,
ఎదురుచూసే విత్తనం నిశ్శబ్దంలా–

అజ్ఞాతంలో విప్లవం ఇంకా–
మేఘాలను రాజేస్తున్న–
ఉదయపు మిణుగురుల
సౌందర్యంలానే వుంది

సముద్రగానంలా
షహెనాయి రాగంలా
ఎప్పటికీ విప్లవం బతికే వుంటుంది

విప్లవం యాడుందిరా!
ఆడనే నీ కూడుందిరా!!
–శ్రీశ్రీ



హైదరాబాదును నిత్యం తన కవిత్వంతో శ్వాసించే ఆశారాజు ఇరవై రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. రెండు సంపుటాలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. నివాసం హైదరాబాదు.

పరావర్తనం

శ్రీదూరా



"ఎం"డికొండలు ఏలేటోడా అడ్డ బొట్టు శంకరుడా..." పాడుతూ మూడు వేళ్లను భస్మంలో అద్ది నుదుటున ఈ మూల నుండి ఆ మూలకి దిద్దుకున్నాడు బోస్.

పూజారి వారి వీధిలోనున్న చిన్న శివాలయం అది.

తీర్థం పుచ్చుకుని బయట పడుతుండగా ఒకావిడ వచ్చి, "స్పెషల్ పూజ చేయించాం," అంటూ చేతిలో పంచామృతం పోసింది. కళ్లకద్దుకుని గుటకాయ స్వాహా అనిపించాడు. 'ఇంకాస్త ఇస్తే బాగుండు. ఎంతైనా బ్రాహ్మల ప్రసాదాలు బాగుంటాయ్,' అనుకుంటూ బయటకొచ్చి చెప్పుల్లో కాళ్లు పెడుతుండగా వినపడింది తన పేరు.

"ఒరేయ్ బోస్! దొంగ నా కొడకా!"

బాగా పరిచయమున్న పిలుపు. ఏదో తట్టినట్టు గిర్రున వెనక్కి తిరిగి చూసాడు.

చూపుడు వేలు పైకెత్తి, "నువ్వా?" అన్నాడు పిలిచినతని దగ్గరకు వెళ్తూ.

"ఏంట్రా గాలి నా కొడకా? గుర్తు పట్టలేదా? నన్ను మర్చి పోయావా?" అన్నాడు రెండు అడుగులు ముందుకు వేస్తూ.

'ఆ కళ్లు! బుర్రలోనున్న మేధస్సు కళ్లల్లో మెరిసేది వాడికి మాత్రమే. వీడు, వాడేనా?' అనుకుంటూ, "ఒరేయ్! నువ్వు చాయనులు కదూ?" అన్నాడు పట్టలేని ఆనందంతో.

"మరే!"

"ఎస్‌కెపివిఎస్ హిందు హైస్కూల్ చాయనులేనా?" నమ్మ లేనట్టు.

"ఇప్పటికి వెలిగి సచ్చింది నీకు. నేనే," అన్నాడు నడుము మీద నుండి చెయ్యి దించి.

గబుక్కున దగ్గరకి వెళ్లి వాటేసుకున్నాడు బోస్. "ఏంట్రా? నువ్వేనా? మనిషి మారిపోయావ్ కానీ నీ మాట మారలేదురా. తిట్లతో ప్రేమ కురిపించే నీ అలవాటు ఇంకా పోలేదు. ఎక్కడికి వెళ్లిపోయావ్ ఇన్నేళ్లు? నీకోసం చాలా వెతికాను. ఈ గుడి దగ్గర, అరండల్ సత్రం దగ్గర, మెయిన్ సెంటర్ దగ్గర, చాలాచోట్ల వెతికానురా," అతని భుజాల మీద చేతులేసి ఊపేస్తూ.

"ఇక్కడిక్కడే తిరుగుతుంటాను. పద, అలా టీ తాగుతూ మాట్లాడుకుందాం," అన్నాడతను బోస్ మోచేయి పట్టుకుని ముందుకు నడుస్తూ.


అతన్ని పై నుండి కింద వరకు చూసాడు బోస్. చీకిపోయిన ఎర్ర తువాలు ఒకటి మోకాళ్ల వరకు కట్టుకున్నాడు. కొంగ కాళ్లోడికి ఆ గుడ్డ సరిపోలేదు. ఆరడుగులుంటాడు. స్కూల్ అసెంబ్లీ లైన్‌లో చివరి స్థానం ఎప్పుడూ వీడిదే. ఆ ఎత్తుకి సరిపడా పాల తెలుపు, సిల్కు జుట్టు, నున్నటి బుగ్గలతో అందగాడు అనిపించుకునేవాడు. వాళ్ల నాన్న గుడిలో పురోహితుడు కావడం వల్ల నేతి ప్రసాదాలు, పాలు, పెరుగు, మినప, పండ్లు వగైరా తెగ వచ్చి పడేవి ఇంట్లో. ఆ పోషణ అంతా వీడి శరీరంలో కనపడేది. మరిప్పుడేమైందా అని చూసాడు బోస్. భుజం మీద మరో మాసిన బట్ట. దానికి అక్కడక్కడా పసుపు కుంకుమ తుడిచిన వేళ్ల మరకలు, నల్లటి సారలు. మెడలో జంధ్యం ఎప్పుడు మార్చాడో మరి, బూడిద నలుపు రంగుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దానితో పోటీపడుతూ ఒక గుడ్డ సంచి. వెన్నుకి అంటుకుపోయిన డొక్క, లోనికి పోయిన కళ్లు, పీక్కు పోయిన మొహం, చీకేసిన తాటికాయ లాంటి జుట్టుతో ఒక పొడుగాటి పేదరికంలా తన ముందు ప్రత్యక్షమయ్యాడు.

పక్కనున్న బడ్డీ కొట్టులో టీ చెప్పి, శివాలయం బయటున్న అరుగుమీద కూర్చున్నారు.

"ఈ బీడీ ఏంట్రా? నువ్వు బీడీలు కాలుస్తున్నావా?" అడిగాడు బోసు అతని చెవి వెనకున్న బీడీ బయటకి తీసి చూపిస్తూ.

బడ్డీ కొట్టు కుర్రాడు టీ తెచ్చిచ్చాడు. అది అందుకుంటూ, "ఎప్పుడూ ఒకేలా ఎలా ఉంటాం మరి? జీవితం మార్చేయదూ?" అన్నాడు చాయనులు.

"ఏమైందిరా? ఈ అవతారం ఏంటి? ఎంత దర్జాగా ఉండే వాడివి? ఈ మాసిన గుడ్డలేంటి? ఈ బీడీలు ఏంటి? అసల నీకోసం ఎంత వెతికాను? పీయూసీ అయ్యాక మర్చిపోయావా నన్ను?"



"పోరా వెర్రి ముండా కొడకా. నువ్వే నన్ను మర్చిపోయావు," చిన్ననాటి స్నేహితుడి మీద ప్రేమని మరోసారి తిట్లతో కప్పేస్తూ.

"ఒరేయ్! నిన్నెందుకు మర్చిపోతాను? ఎదుటోడి మెడలో జంధ్యం ఉందా లేదా అని చూసికాని మాట కలపని రోజుల్లో నాకు దగ్గరైన ఒకే ఒక స్నేహితుడివి. నిన్ను ఎలా మర్చిపోతా?"

"మరెక్కడ తగలడ్డావ్ ఇన్నేళ్లు? పీయూసీ పాసయ్యాక కనపడనే లేదు?"

"ఏముందిరా? పీయూసీ తర్వాత

నీకోసం చాలా వెతికాను. పరీక్షలు అయ్యాక చెప్పాపెట్టకుండా మాయమైపోయావు. మన బ్యాచ్‌లో ఆ కుంటి శీనుగాడిని అడిగితే శివాలయం పక్క వీధిలో ఎక్కడో అరండల్ సత్రం దగ్గర అన్నాడు. వెతికాను. దొరకలేదు. సెంటర్‌లో నుంచుంటే ఎప్పుడో ఒకప్పుడు కనిపిస్తాడులే అన్నాడు. ఎక్కడా? నువ్వు దొరికితేగా? ఇద్దరం కలిసి డిగ్రీకి ఒకే కాలేజీకి వెళ్దాం అనుకున్నాం కదా? బాగా చదువుకుని గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించి నలుగురికి ఉపయోగపడే పనులు చెయ్యాలని ఎన్నను కున్నాం? నువ్వా మాయమైపోయావు. నేను అటు నుండి అటే పై చదువులని వెళ్లిపోయాను. డిగ్రీ, దాని తర్వాత ఆంధ్రా యూని వర్సిటీలో ఎంఏ చేసి, రెండేళ్ల క్రితమే హైద్రాబాదులో ఉద్యోగంలో చేరాను. ఇక్కడ ఉన్నదే తక్కువ. ఇన్నేళ్లు ఎక్కడకి మాయ మయ్యావు?"

సగం టీ తాగి, బీడీ ముట్టించాడు చాయనులు. రెండు మూడు దమ్ములు లాగాక దగ్గు పొరలా వచ్చింది. పక్కకెళ్లి ఉమ్మేసి వచ్చి కూర్చున్నాడు.

"మాట్లాడవేంటిరా? నిన్నే అడిగేది. ఒక్కగాని ఒక్క స్నేహితుడివి. అలా చెప్పా పెట్టకుండా ఎలా వెళ్లిపోయావు? నేను గుర్తుకు రాలేదా?" అడిగాడు బోస్.

"ఏడిసావ్ లే వెధవ. గుర్తుకు రాకుండా ఎలా ఉంటావ్? ఇంతకీ ఇక్కడేం పని నీకు?"

"ఆఫీస్ పని మీద వచ్చానులే. తీరా వచ్చాక అది వాయిదా పడింది. టైముందని ఇలా గుడికి వచ్చాను. ఇది కూడా నీ వల్లే. చిన్నప్పుడు మనకి భక్తి, ముక్తి ఎక్కడున్నాయని? ఇంట్లో మా అమ్మ దీపం పెట్టడం ఎన్నడూ చూడలేదు. పెట్టాలంటే తైలానికి మన దగ్గర పింగులుండేవి కాదు. నిన్ను చూసి నేర్చుకున్నాను. పీయూసీ తర్వాత చాలాసార్లు వచ్చాను ఇక్కడికి. నువ్వు కనిపిస్తావేమోనని ఆశ. ఆ శివుడు నా మొర విన్నటున్నాడు. ఇన్నాళ్లకి కనపడ్డావ్. గుర్తుందా ఇద్దరం స్కూల్‌కి వెళ్లే దారిలో ఇక్కడ ఆగి నామాలు దిద్దుకునేవాళ్లం?"

"ఎందుకు లేదు? నేర్పింది నేనేగా. పక్కవీధిలో సుబ్రహ్మణ్యం పంతులేమో భస్మం కాదురా దోసగింజ బొట్టు దిద్దండని నెత్తి నోరూ మొత్తుకునేవాడు. కుల పద్ధతిలో ఇదో కుళ్లు" దగ్గుతూ ఆవేశంగా అన్నాడు.

"అవునురా. కులం కుళ్లంటే గుర్తొచ్చింది. అది లేకుండా మనిషిని గుర్తించడమెలా, దానివల్ల జరిగే అన్యాయాల మీద రీసెర్చ్ పేపర్లు, ఈ వ్యవస్థనే మార్చేద్దాం, అన్యాయానికి అడ్డం నిలబడదాం, ఏంటేంటో అనుకున్నాం. మనం అనుకున్నట్టు ఓ పెద్ద సమాజాన్ని ఉద్దరించలేదు కానీ, జర్నలిస్ట్‌గా కలం పట్టుకుని నా రాతలతో వ్యవస్థని ప్రశ్నించే ప్రయత్నం చేస్తున్నా."

"ఆ మధ్యన 'పంట పొలాల్లో పులి చంపిన లేడి నెత్తురు' అని ఒక దళితుడి హత్య గురించి రాసావు. పిల్లకాకి మాటల వరకే కాకుండా నీ వంతు ప్రయత్నం చేస్తున్నావ్. సంతోషం."

"వార్నీ! చదివావా?"

"చదివాను. కింద పేరు చూసి గుర్తుపట్టా."

"ఇంతకీ నువ్వేం చేస్తున్నావురా? ఈ అర్ధ నగ్న అవతార మేంటి?"

"నేనా? నాదేముందిరా? సెవాలు మోస్తుంటాను," అన్నాడు టీ గ్లాసు పక్కన పెట్టి మరో బీడీ ముట్టిస్తూ.

ఉలిక్కిపడి చూసాడు బోస్.

"బానే ముడుతుందిలే," బోస్ నుండి చూపు తిప్పుకుంటూ.

కాసేపు మౌనంగా కూర్చున్నారిద్దరూ.

బీడీ పిక్క పక్కన పడేసి, "ఏంలేదు రా, మన పీయూసీ పరీక్ష లైన రెండ్రోజులకి మా బాబు బక్కెట్ తన్నేసాడు. సగం వేదం నేర్పించి పోయాడు. ఆ మిణుకుడికి ఇక్కడ గుళ్లలో పౌరహిత్యం దొరకలేదు. ఎక్కడో తిరుమలలో తప్ప వారసత్వంగా వచ్చే పౌరహిత్యం ఎక్కడ? ఈలోపు మా మావయ్య కట్నం కోసం మా అక్కని తిరుగు టపాలో పంపడం, ఆమె పెళ్లికి చేసిన అప్పులు ఒకేసారి నెత్తిన పడ్డాయి. అప్పుడే మా చుట్టాల్లో ఎవడో పోయాడు. పోయినాక మా కులపోడే శవాన్ని లేపాలని మా కులంలో కొందరికి ఏదో ఆచారం ఉందిలే. బయటోడు రావడానికి లేదు. అప్పుడే ఈ పని దొరికింది. ఇంట్లో పరిస్థితులు వల్ల ఇక తప్పలేదు."

" అంటే? నువ్వు చదువు ఆపేసావా? డిగ్రీ ఉంటే మంచి ఉద్యోగం వస్తుంది."

"ఓపెన్‌లో డిగ్రీ ముక్కానులే. అది కూడా వాయిదాల మీద. పట్టా పట్టుకోవాలంటే చేతిలో లక్ష్మి ఆడాలి కదా."

"ఇంకా చదవాలని లేదా?"

"ఇంకెక్కడ్రా? ఓపెన్‌లో చదవడానికి ఇంట్లో ఇత్తడి సామాను సేటు ఇంట్లో తిష్ట వేసాయ్."

చాయనులు అనటం కన్నా, 'టాపర్', 'బ్రిలియంట్', 'ఛాంపియన్' అని గొప్పగా గుర్తు పెట్టుకున్నాడు బోస్ అతన్ని. అపర మేధావి. ప్రపంచలో జరిగే ప్రతిదాని గురించి ఎప్పటికప్పుడు లైబ్రరీలో కూర్చుని జల్లెడ పట్టేవాడు. ఆ ముద్ర ఇలా తుడుచుకు పోయింది. జాలిగా చూసాడు అతని వంక.

వెంటనే, "ఏంట్రా ఆ దేభ్యం మొహం? నాకు నీ జాలెందుకు? పర్లేదు, ఇల్లు గడిచేంత ముడుతుంది. ప్రపంచ బ్యాంకు లెక్క ప్రకారం మధ్యస్థ దారిద్ర్య రేఖ పైనే ఉన్నాలే."

ఇంకా చదువుతూనే ఉన్నా అని సూచిస్తునట్టు.

"నీకు టైం ఉందా?" తిరిగి అడిగాడు.

"ఆ, ఉంది. బస్సు సాయంత్రం. ఎందుకు?"

"పద, అలా మనం తిరిగిన సందుల్లోకి వెళ్లి చూసొద్దాం. ఎంత మారిపోయిందో మన ఊరు," భుజం మీద తువాలు తీసి బోస్‌ని కొడుతూ పైకి లేపాడు.

ముందు స్కూల్ దగ్గరకి వెళ్లారిద్దరూ. పిల్లలు క్లాసుల్లో ఉన్నారు. ఖాకీ చొక్కా, పొడుగు నిక్కర్ వేసుకుని ఒకవైపు చిల్లు

పడిన ఇనుప కుర్చీలో కునికిపాట్లు పడిన వాచ్‌మెన్ మల్లయ్య ఇప్పుడు లేడు. కంచె వేసిన గేటు దగ్గర వాచ్‌మెన్ తనే, బెల్ కొట్టే ఫ్యూన్ తనే, స్కూల్‌కి కావాల్సిన సామాను తెచ్చేది తనే, హెడ్ మాస్టర్ ఇంటికి ప్రతి ఆదివారం చేపలు చేరేసేది తనే. ఇప్పుడు పెద్ద కాంపౌండ్ వాల్ వచ్చింది. ఇనుప కుర్చీ పోయి చిన్న సెక్యూరిటీ రూమ్, ఇంటర్-కమ్ వచ్చాయి. ఖాకీ బట్టలు బదులు నీలం రంగు సెక్యూరిటీ యూనిఫారం వచ్చింది.

"గ్రౌండ్ చూసావా? మనం ఉన్నప్పుడు ఎర్ర మట్టి తప్ప ఏమీ లేదు. ఇప్పుడు చూడు, పిల్లకాయిలకి ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టు తయ్యారు. చేసారు," అన్నాడు చాయనులు చేతులు వెన్నక్కి కట్టుకుని.

"అవును. అప్పుడు గోలీలు, దొంగ పోలీస్, కబ్బాడి తప్ప మరో ఆట తెలీదు. రెండో బెల్లు కొట్టగానే ప్రేయర్ మొదలైయ్యేది. లెక్కల విశ్వం మాస్టారు 'శాంతాకారం భుజగశయనం' అంటూ దొబ్బేసేవాడు. చివరికి సాయిబుల్ని కూడా వదిలేవాడు కాదు. పాడక పోతే చింత బరిగే తీసి ఉతికేవాడు. నీకు మన పీటీ మేడం గుర్తుందా?"

"అమ్మ నీ అమ్మ. ఎందుకు లేదు? రంగనాయకమ్మ. చెట్టంత ఎత్తు, చాంతాడంత జడ. నడుస్తుంటే నేలకి తాకేది. పిల్ల ముండా కొడుకులు నిక్కర్ జేబుల్లో చేతులు పెట్టుకుని ఆమెకి బీట్లేసేవారు."

"ఔనోయ్! ఆ ఎగస్ట్రా వేలు సాయిగాడైతే నోట్లో పాల ఐస్ పుల్ల పెట్టుకుని తెగ బీట్లేసేవాడు. మన పీటీ రాధాకృష్ణ సార్ చేతుల్లో తెగ తన్నులు తినేవాడు. సార్‌కి రంగనాయకమ్మ మేడంకి ఏదో లింక్ ఉందని తెగ ఊహించుకుని ఒకటే పుకార్లు రేపేవాడు."

"పిల్ల కుంక. గురువుల గురించి అలా వాగితే శివుడు వాడి కళ్లు పేల్చేస్తాడని తెగ తిట్టేవాడిని. వెధవ, తిట్టినప్పుడల్లా వాడి ఎడమ చేతికున్న ఆరో వేలితో పొడిస్సచ్చేవాడు నన్ను. కాకపోతే సార్ మేడం కూడా అలాగే ఉండేవాళ్లు అనుకో. ఇద్దరూ పిటి టీచర్లు, పైగా అందగత్తె, అందగాడూనూ. స్కూల్ తర్వాత నేను ఇటువైపు రానే లేదు. మన టీచర్లు ఎక్కడున్నారో."

"రిటైర్ అయిపోయుంటారు ఈపాటికి. సాయిగాడి ఆరో వేలు నీకు భలే గుర్తుందే?"

"ఉండక? స్కూల్ ఫ్రెండ్స్‌ని ఎలా మర్చిపోతాం? ఇంతకీ ఏమైనా అఘోరిస్తున్నాడా వాడు? లేక ఆ ఆరో వేలులా పనికి రాకుండా పోయాడా? జులాయి తిరుగుళ్లు ఎక్కువ వెధవకి. ఏవైనా మారాడా లేదా?"

"ఆ మారాడు. ఇక్కడే గుంటూరు దగ్గర నౌకరీ. ఎప్పుడో ఓ సారి కలుస్తాము."

స్కూల్ నుండి ముందుకు నడిచారు. "పద అలా హనుమాన్ పేట వరకు వెళ్లొద్దాం. నాకు కాస్త పనుంది," అన్నాడు చాయనులు.

"రిక్షా మాట్లాడమంటావా?

"ఎందుకురా? నాలుగు అడుగులేస్తే ఒంటికి మంచిది. పద."

బ్రాహ్మణ వీధి దాటి గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డెక్కారు.

లక్ష్మీ విలాస్ మెస్ నుండి ఇంగువ ఘుమఘుమలు వీధంతా కమ్మేసాయి.

"ఓ అర కిలోమీటర్ నడిస్తే బాబాయ్ హోటల్ కదూ?" అన్నాడు బోస్.

"అవును."

"పద, అక్కడ ఏమైనా తిందాం," అన్నాడు బోస్.

"నత్తం. నువ్వు తిను."

"నీతో కూర్చుని మాంచి టిఫిన్ తినాలనుంది నాకు."

"జాలేంట్రా?"

"ఛ ఛ! కాదు. నీకు గుర్తుందా? లంచ్ బెల్ కొట్టాక, నువ్వు బయటకొచ్చి చేతులు కాళ్లు కడుక్కుని ఓ గట్టు మీద ఒక్కడివే కూర్చుని సంప్రోక్షణం చేసి తినేవాడివి? నాకేమో అప్పుడు లంచ్ బెల్ అనొకటుందని, బాక్స్ తెచ్చుకోవాలని తెలీదు. ఇంట్లో పరిస్థితులు కూడా సహకరించలేదులే అప్పుడు. ఆకలి మర్చిపోవాలని నేనొక్కడినే అటు ఇటు తిరుగుతుంటే పిలిచి దోసిలి పట్టమని పైన నుండి ముద్దలు వేసేవాడివి."

"అవును గుర్తుంది. తింగరి వెధవ. నాలుగు రోజులు తిని నా దగ్గరకి రావడం మానేసావ్. ఏ? మా భోజనం గిట్టదా?"

"కాదురా, రోజూ వస్తే కడుపు నిండటం అలవాటైపోతుందని భయం. నువ్వు పెడుతున్నావని ఆకలిని మర్చిపోతే అది తిరిగొచ్చి న్నాడు నరకం. అప్పుడు తిందామంటే డబ్బులు లేవు. ఇప్పుడు తిందామంటే నువ్వు రావు. సరిపోయింది."

"వెధవన్నర వెధవ. అప్పుడే చెప్పి సావచ్చు కదా? మరో డబ్బా తెద్దును నీకు. డొక్క మాడ్చుకున్నావా?" భుజం మీద చెయ్యి వేసి దగ్గరకి జరిగి నడిచాడు.

ఇద్దరికీ ఒకేసారి కళ్లెమ్మట నీళ్లొచ్చాయి.

"నీకు పిచ్చి లక్ష్మి గుర్తుందా?" కళ్లు తుడుచుకుని, మాట మార్చాడు బోస్.

"ఏదీ? ఆ జీబురు జుట్టు ఏస్కుని చీకిపోయిన రిబ్బన్లు కట్టుకుని తిరిగేది, ఆ పొట్టిదా?" కళ్లల్లో మెరుపు దాస్తూ.

"అవును. ఆమె జుట్టు బాగా గుర్తు పెట్టుకున్నావు," అన్నాడు బోస్ కొంటెగా.

"ఆ జుట్టు అలా ఉండటం వల్లేగా పిచ్చి లక్ష్మి అని పేరు ఆమెకి మన స్కూల్లో. నీకెక్కడ పరిచయం స్కూల్ తర్వాత?"

"యూనివర్సిటీలో కనపడింది. జెనిటిక్స్ తీసుకుంది. ఒక రోజు వెళ్లి పలకరించాను. గుర్తుపట్టలేదు, ఎవరో తెలీదంది. ముందుకు వెళ్లగానే, 'ఓయ్ పిచ్చి లక్ష్మీ,' అని కేక పెట్టాను. హిందూ హై స్కూల్ పోకిరీ వెధవలు,' అని తిట్టి పోసింది.

"మరి గుర్తు లేవంటే ఆ మాత్రం గుర్తు చేయకపోతే ఎలాగా?" నవ్వుతూ అన్నాడు చాయనులు.

"ఇంతకీ నీ లవ్వు సంగతి ఏమైంది? చెప్పవా పిచ్చి లక్ష్మికి?"

"తాను దూరడానికి చోటు లేదంటే మెడకో డోలని, ప్రేమని వెంటపడి, పెళ్లని విసిగించి, తీరా చేసుకున్నాక ఏం పెట్టను దానికి? నిరుడోసారి ఎవరో పెళ్లిలో కనపడింది. నేనే దూరం నుండి చూసి వెళ్లిపోయాను. యూనివర్సిటీలో చదువుకుంది అంటున్నావుగా, మంచోడు ఎవడో ఒకడు దొరుకుతాడు లేక దొరికే ఉంటాడు. నాతో ఎందుకు?" బరువైన మాటలు తేలిగ్గా చెప్పేసి అంగలు పంగల మీద వెళ్లి బస్ స్టాండ్ దగ్గరున్న ముసలాయన్ని పలకరించాడు చాయనులు.

వెనకే పరుగు అందుకుంటూ, "ఎప్పుడూ ఇలానే ఉంటామేంట్రా? మంచి రోజులు వస్తాయి," అన్నాడు బోస్.

"నీ మొహం. ఆ వెనక పలకరించిన ముసలాడు పోతేనే కాని వచ్చే నెల ఇంటద్దె కట్టలేను. ఇవ్వాళ రేపు అన్నటున్నాడు. ఎప్పుడు పోతాడా అని నేను ఆత్రంగా ఉంటే లవ్వు గివ్వు అంటావేంట్రా?"

"శవం ఎత్తితే కానీ ఇల్లు గడవదా నీకు?" గుడ్లు బయటకి నెట్టి అడిగాడు బోస్.

"ఆ మరి? మా బాబు బతికున్నప్పుడు మా ఇంటిగలాయన ఏదో పొరుగున బ్రాహ్మడు, ముత్తేదువు దొరికారనుకుని సంబర పడిపోయేవాడు. ఇప్పుడు శవాలు మోసే నన్ను, బొట్టు లేని మా అమ్మని చూసి అరిష్టమని రోజుకి పదిసార్లు నెత్తి బాదుకుంటాడు. పొద్దున్నే ఒకసారి, గోధూళి వేళ మరోసారి వాళ్ల కంట పడకుండా ఉంటే చాలు. ఆ రోజుకి గొడవుండదు. ఇప్పుడు ఇంటద్దె కూడా ఆలస్యం చేస్తే చెంబు, తెపాల, వాటితో పాటు రెండు తలకాయల్ని బయట వేస్తాడు. ఈ ముసలోడేమో చావడు." బీడీ ముట్టించి, పొగ వదులుతో ముందుకి నడిచాడు.

"ఏంట్రా అలా శాపనార్థాలు పెట్టావు ఆ ముసలాయనకి? ఏదో పడున్నాడుగా ఉండని. ఈ గొడవంతా ఎందుకు? నా మాట విని హైద్రాబాద్ వచ్చేయ్. అక్కడే ఏదోటి చూద్దాం. పని దొరికే వరకు నా దగ్గరుండు."

"వద్దులేరా బాగా ఆలస్యమై పోయింది."

"ఏంట్రా ఆలస్యం? మహా అయితే చిన్నప్పుడు మనం కలలు కన్నట్టు గవర్నమెంట్ నౌకరీ దొరకదేమో. నీ తెలివికి మరోటి దొరుకుతుంది. ఈ పని కన్నా ఆ ఇంకోటి నయం కదరా?"

చెప్పేది వినిపించుకోకుండా ఎడమ వైపున్న నాగేశ్వరావు పంతులు రోడ్డులోకి తిరిగాడు చాయనులు. కూడా బోస్. నాలుగో ఇంటి దగ్గర ఆగి గేట్ కొట్టాడు.

నల్లగా, పొట్టిగా ఉన్న ఒక వ్యక్తి బయటకొచ్చాడు.

"రేయ్ జోగి! ఎంతసేపురా? త్వరగా రా. ఆ పెద్దింట్లోళ్లది పిండ ప్రధానం అయిపోతే నాలుగు రాళ్లు వస్తాయ్. పద పద," అన్నాడు.

"వస్తున్నా," అన్నాడు జోగి చేతులు, నుదురు చూపించి ఇంట్లోకి తిరిగి వెళ్లబోతూ.

"అక్కడ దిద్దుకుందువులే. ముందు పద," కాస్త అసహనంగా అన్నాడు చాయనులు.

తీగ మీదున్న లాల్చీ వేస్కుని, కండువా చేత్తో పట్టుకుని బయటకి వచ్చాడు జోగి. పరిచయాలు అయ్యాక బోస్ వంక అనుమానంగా చూసాడు జోగి.

"పర్లేదు. మనోడే. నువ్వు అనుకున్నట్టు ఏం జరగదు," ధైర్యం చెప్పాడు చాయనులు.

ముందుకు నడిచారు.

ఒక ఇంటి ముందు ఆగి, బయట కొట్టుడు పంపు దగ్గర కాళ్లు కడుక్కుని, పక్కనున్న చిన్న సందులోకి వెళ్లి తెల్ల పంచ కట్టుకుని బయటకి వచ్చాడు చాయనులు. అతని వెనకే నామాలు రాసుకుని ఇబ్బందిగా పంచ సర్దుకుంటూ జోగి కూడా వచ్చాడు.

పోయినావిడ చుట్టం అనుకుంట, "ఏవిటి పంతులుగారూ, మీ అసిస్టెంటు నల్ల బ్రాహ్మడా?" చాయనులుని మొహం మీద అడిగేసాడు.


"నలుపైతే ఏమిటండీ?"

"అదేనండీ, నల్ల బ్రాహ్మణుడిని నమ్మకూడదు అంటారు మరి."

"ఏ శాస్త్రం చెప్పిందండీ? అసలే ఈ పనిలోకి ఎవరూ దిగక పోతూంటేనూ."

లోనికి వెళ్తూ, "ఆ అరుగు మీద కూర్చోరా బోసు. ముసలావిడికి పెద్ద కర్మ జరిపించి వస్తాను," అన్నాడు చాయనులు.

బోస్ ఏమీ చెప్పకముందే ఇద్దరూ ఇంట్లోకి వెళ్లిపోయారు.



పావుగంటకి లోపల నుండి మంత్రాలు వినిపించాయి. బోస్ బయట పచార్లు కొడుతో అప్పుడప్పుడూ లోనికి తొంగి చూసాడు. కాసేపటికి పక్కనున్న ఖాళీస్థలం నుండి అల్యూమీనియం గిన్నెల చప్పుళ్లు, తర్వాత కట్టెలు అంటించిన పొగ పైకి లేచింది, మరి కాసేపటికి మెల్లగా ఘుమఘుమలు మొదలైయ్యాయి. భోజనాల ఏర్పాట్లు మొదలైయ్యాయి.

ఆకలి రంకెలొస్తోంది. అప్పుడే ఇద్దరూ దక్షిణ పుచ్చుకుని, కొబ్బరి చిప్పలు, పళ్లు సంచిలో సర్దుకుంటూ బయటకి వచ్చారు.

భోజనానికి కూర్చున్నప్పుడు, "నత్తం అన్నావ్?" అన్నాడు బోస్.

"అది జేబులో నుండి రూపాయి తీయలేనప్పుడు," అన్నాడు ఆకులో నుండి పాయసం జుర్రుతూ.

భోజనాలు అయ్యాక తిరిగి నడవటం మొదలెట్టారు.

"ఏరా బోసు! బోర్ కొట్టిందా?" అడిగాడు చాయనులు.

"అదేం లేదులే. ఆకలేసిందంతే"

"ఇప్పుడైనా సరిగ్గా తిన్నావా? లేక స్కూల్లో మొహమాట పడినట్టు ఇక్కడా అదే చేసావా?"

"లేదులే రా, తిన్నాను."

నడుస్తూ జోగి ఇంటి వరకు వచ్చేసారు.

"అన్నయ్యా! డబ్బులిస్తే వెళ్తాను. సాయంత్రం ఇంట్లోకి సరుకులు తీసుకోవాలి. చూసివ్వు అన్నయ్యా," అన్నాడు జోగి ఒంటి మీద నామాలు తుడిచేస్తూ.

"ఏడిశావ్! మొన్న తద్దినానికే అవసరమంటే ఎక్కువ ఇచ్చి నేను తక్కువ తీసుకున్నాను. ఇవ్వాళ ఎప్పటిలానే ఇస్తాను, నోరు మూసుకుని తీస్కో."

"అన్నయ్యా..." అనబోయాడు జోగి.

"నోర్ముయ్ రా. అక్కడ 'మమ' అనమంటే నీ వంక చూసిన గంటకి కానీ అనవు. ఇక్కడ మాట లేస్తోందే. ఇందా పట్టు," చేతిలో డబ్బులు పెట్టాడు చాయనులు.

గేటు వైపుగా నడిచాడు జోగి.

వెనక నుండి ఒక పెద్దాయన, "రేయ్ జగ్గిగా రేపు గొడ్లు సావిడి శుభ్రం చెయ్యాలి. రోజు కూలికి వచ్చేయ్."

గిర్రున చాయనులు వైపు తిరిగాడు బోసు.

పెద్దాయన ముందుకు వెళ్లగానే, " జగ్గి ఏంట్రా? గొడ్లు సావిడి శుభ్రం ఏంటి?" దాదాపు నిలదీసినట్టే అడిగాడు బోస్.


"నువ్వు వెళ్లరా," అన్నాడు చాయనులు జోగి వంక చూస్తూ. "కార్యక్రమానికి ఒక్కడినే వెళ్తే నేనొక చిన్న పంతుల్ని. అనుభవం లేదంటారు. కూడా ఒకడు ఉంటే, అదే, వాళ్ల భాషలో అసిస్టెంట్, అప్పుడు నేను పెద్ద పంతులుగారిని. ఇదే కులంలో ఇదే పని చేసే వాడ్ని ఎక్కడ పట్టుకు రాను? అందుకే ఈ ఏర్పాటు," అన్నాడు బీడీ ముట్టిస్తూ.

"మరి మీ పట్టింపులు?"

"పట్టింపులు జేబు నిండుగున్నప్పుడు వస్తాయ్. కాలువ గట్టు దగ్గర పిండం పెట్టొస్తుండగా కనపడ్డాడు. చద్దామని వచ్చాడు. ఆడి బాబు ఇంట్లో పైసా ఇవ్వడు. పైగా ముండల్ని ఎంటేసుకుని తిరుగుతాడు. వాళ్లకి ఈడమ్మతోనే చాకిరీ చేయిస్తాడు. అందుకే పట్టుకొచ్చి ఈ పనిలో పెట్టా. నేనిచ్చే డబ్బులతో ఆడు ఆస్తులు సంపాదించలేడు కానీ ఖాళీ కడుపుతో మాత్రం పడుకోరు తల్లీ కొడుకులు. ఇవ్వలేని రోజు, ఇందాక చెప్పినట్టు, నత్తం."

"మరి నీ ధర్మం? ఈ నామాలు?" ఇంకా ఏదో అనబోయాడు బోస్.

గట్టిగా నవ్వాడు చాయనులు. "ధర్మం అంటే ఏంట్రా? పని దొరికితే జోగి కష్టపడతాడు. రేపు వెళ్తాడు. గొడ్లు సావిడంతా శుభ్రం చేస్తాడు. ఆ పనికి వంక పెట్టలేం. ఏది దొరికితే అది చేస్తాడు. తల్లిని కష్టపెట్టడు. అది వాడి ధర్మం."



వింతగా చూసాడు బోస్.

"పక్కనోడిని బాగు చేయలేని నా ధర్మం ఎవడిక్కావాలి? పక్కనోడి సంగతి వదిలేయ్. పీయూసీ వయసులో అక్క కట్నం డబ్బులు ఇచ్చేంత అనుభవం ఉందా నాకు? పైగా సొంత మేనమామకి ఇచ్చి చేసారు. రూపాయికి చుట్టరికాలుండవని అక్కడే తేలిందా లేదా? సగం వేదంగాడివి నువ్వు గుళ్లో పనికిరావు అన్నప్పుడు ధర్మం ముందుకు వచ్చిందా? బ్రాహ్మలావిడ, నిండు ముత్తయిదువు మన పొరుగున ఉండటం ఎంత అదృష్టం అన్న నోళ్ల తోనే మా నాన్న పోయాక బొట్టులేని

ఆడదాన్ని పొద్దున్నే చూడటం అరిష్టమన్న రోజున మా అమ్మ ఆ ధర్మాన్ని పొయ్యిలో పడేసింది. నేను చేసే పని ఆమెకి తెలుసు.''

"అయామ్ సారీ రా. ఇంత బాధ పడుతున్నావ్ అనుకోలేదు,'' అన్నాడు బోసు అతన్ని వాటేసుకుంటూ. "అందరికన్నా తెలివైన వాడివి. నువ్వు ఇలా అయిపోతే తట్టుకోలేకపోయాను.''

బస్ స్టాండ్‌కి వెళ్లడానికి రిక్షా ఎక్కి కూర్చున్నారు.

"ఇలా అవ్వాలని నేనూ అనుకోలేదురా. మనసు చంపుకుని బ్రతకడం వేరు. మనసే లేకుండా బ్రతకడం వేరు. తెలిసీ తెలీని వయసులో పిచ్చి లక్ష్మి అనుకుందేమో, నేను ఏదో సాధించి ఆమె కోసం వస్తానని. కాని ఎక్కడ? నేను అందరినీ సాగనంపే పనిలో పడిపోయాను. వెనక్కి రాలేనంత దూరం వెళ్లిపోయాను.''

"మేధావి మౌనం మంచిది కాదురా. నీకు మంచి భవిష్యత్తు ఉంది. నాతోరా. ఏదో ఒకటి ఆలోచిద్దాం''

"మేధావి అనుకునే రెండు మూడు ఉద్యోగాలకి వెళ్లాను. కలిసి పని చేయడం పక్కన పెట్టు. కలిసి తినడానికి కూడా ఇష్టపడలేదు జనం. ఏ తద్దినం కూడో అని గుసగుసలు ఆడేవారు. ఉద్యోగమని నేను ఎటు వెళ్లినా తోటివారి చూపుల్లోని అసహ్యం అన్నివైపుల నుండి వచ్చి నా వీపు మీద వాలేవి. ఇక్కడ నేనొక్కడినే. కూడా పని చేయడానికి ఎవరూ లేరు, రారు. నేను వెళ్లకపోతే బాధ పడతారు. నా కోసం కబురు పంపుతారు. ఆ అవసరంలో నుండి పుట్టే గౌరవం చాలదూ? ఈ పనిలో నుండి రోజూ పుట్టే ఆ గిద్దెడు బియ్యం చాల్లే. జోగి గాడి గురించి అంటావా? తప్పుగా అనుకోకు వాడి గురించి. వాడ్ని ఇందులోకి దింపడం నా ఆలోచనే. వాడేదో పొట్ట కోసం చేసాడు''

"ఛ ఛ! అదేం లేదు రా. అలా ఏమీ అనుకోను.''

మాటాల్లో బస్ స్టాండ్‌కి చేరుకున్నారు. అయిదు కావస్తోంది. చుట్టూ శీతాకాలం సాయంత్రాల దిగులు పవనాలు ఆవహించాయి. బస్టాండ్ రోడ్డు కిటకిటలాడుతోంది. ఆవురావురుమంటూ వస్తున్న సాయంత్రం టిఫినీల ప్రియులు కోసం రోడ్డుకి రెండు వైపులా వరుసగా టిఫిన్, పిడతకింద పప్పు బళ్లు ఊపందుకున్నాయ్. కణకణమని మండుతున్న గ్యాస్‌స్టవ్ మీద పెద్ద మూకుట్లో బజ్జీలు, పునుగులు వేపి, మధ్య మధ్యలో వాటిని తిప్పుతో, చకచకమని వేయిస్తూ, వాయిలు వాయిలుగా బయటకి తీస్తున్న చేతులు మిషన్లలా కదులుతున్నాయి. వాటి మీద ఉల్లితరుగు పరచి, మొరుంగా ఉన్న ఎండుమిరపకాయ పొడుం జల్లి ఇలా చేతిలో పెట్టగానే అలా కారంచట్నీల్లో లడాయించి ఉఫ్ అని నోట్లోకి లాగేసుకుంటున్న జనం. అక్కడే టీ కోసం ఆగారు బోస్, చాయనులు.

టీ తాగి బస్సు దగ్గరకి వెళ్లారు. ఎక్కే ముందు, "బీడీలు తగ్గించు. ఒకసారి ఆలోచించి నాకు ఫోన్ చెయ్యి. వీళ్లకి దూరంగా ఏదో ఒకటి వెతుకుదాం,'' అన్నాడు బోస్.

చెయ్యి కలుపుతో, "వీళ్లు అన్నిచోట్లా ఉన్నారురా. ఇక ఈ జన్మ కింతే. నువ్వే వస్తూ పోతుండు. శివాలయం దగ్గర బడ్డీ కొట్టు పక్కనున్న షాపుకి ఫోన్ చెయ్యి వీలున్నప్పుడు. ఏదో ఒక టైములో చెప్తాడు నాకు,'' అంటూ నెంబర్ రాసిచ్చాడు చాయనులు.

బస్సు కదిలింది. బోస్ ఆలోచనలు తన ఫ్రెండ్ దగ్గరే ఆగిపోయాయి. కళ్లు చెమర్చాయి. వాటిని తుడుచుకుంటూ వాటితో పాటు నుదుటనున్న నామాన్ని కూడా తుడిచేసాడు.

బీడీ ముట్టించి బస్సు వెళ్లే వైపు చూస్తూ నుంచున్నాడు చాయనులు. అతని వెనక సూర్యుడు అప్పుడప్పుడే సెలవు తీసుకుని అస్తమిస్తున్నాడు. మెల్లగా చీకటి పడసాగింది.



శ్రీ ఊహ ఇటీవలే విరివిగా కథలు రాస్తున్న రచయిత్రి. 'ఇసుక అద్దం' వీరి మొదటి కథాసంపుటి. తెలంగాణ ప్రభుత్వ రూరల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం. నివాసం హైదరాబాదు.

చల్లబడని కు

మెర్సీ మార్గరెట్

రక్తం తాగీ తాగీ ఈ రాతిరి మృత్యుశిలగా మారింది
కట్టేసిన కాళ్ళూ చేతులూ విముక్తి గీతాలు పాడుకుంటూ ఉంటే
కళ్లు రేపటి కోసం వేసిన తాళం కప్పకి
ఏ కలలను అనుమతించాలో ఉత్తరం రాస్తున్నాయి

రెండు ముక్కలుగా తెగిన నాలుక జోలికి
ఏ గోడా చేయి చాపటం లేదు.
గోడలకు మొలిచిన చెవులకు పవిత్రశ్లోకాలు తప్ప
ఆర్తనాదాలు ఎందుకు వినిపిస్తాయి?

దేహం చల్లబడిందని గడియారం వంక శ్వాస పాకుతూ పోతోంది
ఒక్కో బొట్టు కన్నీటిమేకులై దేహాన్నే నలగగొడుతుంటే
యే చిరకా నాలుకకి దాహం తీర్చలేదు

ఇక్కడ కపాలం పగలలేదు
చివరి నీటి చుక్క దేహం నుంచి ఆవిరవగానే
పక్కలో బల్లెం దిగి నన్ను మనిషిని కూడా కానివ్వలేదు

చీకటి గర్భంలో పిండంలా తిరుగాడుతూ
యే అమ్మ పాటని విన్నానో ఆమె పక్కగా వచ్చి కూచోలేదు
అనంత అక్షరాల కింద నన్ను కప్పిపెట్టిన ఈ దినం సాక్షిగా
ఒక్క కవితా నా కడుపున కాయలేదు
నా నోటిని మన్నుతో నింపిన చేతులకు అమృతం అప్పగించిన
మథనం గురించి వార్త గడపదాటలేదు
కనురెప్పల కింద కాలిన శవాల వాసన
కలల్ని యెత్తుకెళ్ళిన వాడు ఏ రాజదండం నీడన గద్దెనెక్కాడో
చరిత్రమాయ ముంత దాచేయలేదు

ఈ రాతిరి
రక్తం గడ్డకట్టి పారటం లేదు
ఓ వెలుగురవ్వ పిడికిలైలేస్తుందనీ
దేహం తన వెచ్చదనాన్ని వదులుకునే
సాహసం చేయటం లేదు
తన అణువణువునీ
తానే దహించటం మానలేదు.



మెర్సీ మార్గరెట్ విరివిగా కవితలు రాస్తున్నారు. కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించిన తొలి కవయిత్రి. నివాసం హైదరాబాదు.

ఆమరణ నిర్విద్యుత్ దీక్ష

పాణిని జన్నాభట్ల



జూన్ 12, 2100.

"ఏందే, ఇంట్లో పన్లేం జెయ్యకుండా ఈడ నించోని టీవీ జూస్తన్నా?" అరిచింది సరిత హాల్లోకొస్తూ.

టీవీలో వస్తున్న ర్యాలీని చూస్తూ, అందులో మునిగిపోయిన పార్వతి ఆ మాటతో ఒక్కసారిగా ఈ లోకంలో కొచ్చింది. వెంటనే టీవీ స్విచ్చాఫ్ చేసి మెల్లగా కిచెన్లోకెళ్లబోయింది.

"ఆగు! మూడ్రోజుల్నించి చూస్తున్నా, బైట ఆ గొడవ మొదలైన కాణ్ణించి ఏ పనీ సరిగా తెమల్చట్లా నువ్వు, కొంపదీసి ఆళ్లతో పోదామనుకుంటన్నావా ఏందీ?"

హఠాత్తుగా ఆగి కిందకి చూస్తోంది పార్వతి. చెప్పడానికే సమాధానం లేదు తన దగ్గర.

"నీకంత సీన్ లేదులే. అంత డబ్బులు పోసి కొన్నాం, ఐదేళ్ల నుండీ బంగారంలా చూస్తున్నాం. కొత్త డ్రెస్సులూ, కొత్త చెప్పులూ ఒకటా! ఎవడండీ ఇంత బాగా చూస్కునేది పనోళ్లని మా సర్కిల్లో?!" అంది సరిత తల తిప్పుతూ.

"లేదక్కా, మా నాయకుడు చెప్పింది వింటా ఉంటే, మా కోసమేగదా ఆ దీక్ష బట్టిందీ అనీ..."

"నోర్ముయ్, ఏందే ఇందాకణ్ణించీ? చిన్నగా మాట్లాడతంటే తేలిగ్గా కన్పిస్తన్నానా నీకు? ర్యాలీలూ, దీక్షలూ అయన్నీ నీగ్గాదే, పనుల్జెయ్యకుండా తిరిగే బేవార్స్‌గాళ్లకి. లక్షల్లక్షలు డబ్బులు పోసి కొని మరీ బైటికొదిలిపెడతన్నారంటే ఆళ్ల ఓనర్లు పెద్ద ఎదవల య్యుండాలి. మేమంత బుద్దిలేనోళ్లం గాదు. నోరు మూసుకుని ఇంట్లో పన్జేసుకున్నావా, ఓ మూల చప్పుడు చెయ్యకుండా పడున్నావా, అంతే!" అంది వేలితో, కళ్లతో బెదిరిస్తూ.

కొంతసేపు కదల్లేదు పార్వతి. తర్వాత మెల్లగా ముందుకొచ్చి మళ్లీ టీవీ ఆన్ చేసింది.

''బానిసత్వం నశించాలి! మాకూ కనీన హక్కుల్ని కల్పించాలి!" వందల మంది అరుస్తూ వెళ్తున్నారు రోడ్లమీద.

వెనకాల ఇదంతా చూస్తున్న సరిత కళ్లు ఎర్రబడ్డాయి. ఒక్క ఉదుటున పార్వతి దగ్గరికెళ్లి, పక్కకి లాగి గట్టిగా చెంప మీద కొట్టింది. "చెప్తంటే, నీగ్గాదా, చెత్త మొకందానా! సార్‌ని ఇంటికి రానీ ఇయాల, నీ సంగతి జెప్పమంటా. ఏషాలేస్తంది ఏషాలు!" అంది ఎర్రబడ్డ అరచేతిని నొక్కుకుంటూ.



కాసేపు కన్నీళ్లు రాకుండా ఏడ్చింది పార్వతి. తర్వాత మెల్లగా జుట్టు సర్దుకుని ఇంటి ఫ్రంట్ డోర్ వైపు వెళ్లడం మొదలుపెట్టింది.

"ఏడకే? నా మాట గాదని ఒక్క అడుగు బైట బెట్టు జూస్తా, ఎముకలిరుగుతయ్!" అంది సరిత.

బైటికెళ్లబోయిన పార్వతి హఠాత్తుగా ఆగింది ఆ బెదిరింపు విని. విసురుగా వెనక్కొచ్చి సరిత మొహంలో మొహంపెట్టి చూడటం మొదలుపెట్టింది. ఆవేశంగా వస్తోంది తన ఊపిరి. ఓ చెయ్యిని తన మెడ చుట్టూ పోనిచ్చి తల కిందున్న చర్మాన్ని జాగ్రత్తగా వేలితో కట్ చేసింది. ఏం జరుగుతోందో అర్థంకాక సైలెంట్‌గా చూస్తోంది సరిత. అమాంతంగా మెడ మీది చర్మాన్ని మొహం మీదుగా పైకి లాగి పక్కన పడేసింది పార్వతి!

మెటల్ కలర్‌లో మెరుస్తూ, రకరకాల మోటర్లూ, వైర్లూ కదులుతున్న మొహం మీద, రెండు బాల్స్ లాంటి కెమెరాలతో మెరుస్తున్న కళ్లూ, ముక్కు ప్లేస్‌లో రెండు చిన్న చిల్లులూ!

ఒక్కసారిగా వికృతంగా మారిన ఆ మొహాన్ని చూసి భయంతో గట్టిగా కళ్లు మూసుకుంది సరిత.

"ఎముకలిరగ్గొడతానన్నావే ఇందాక, దొరికాయా యాడైనా?" అంది పార్వతి తన మెటల్ తల మీద వేలితో టంగ్‌మని శబ్దం చేస్తూ. "ఇక్కడ దొరకవ్‌లేగానీ, ఇక్కడ కోసి చూద్దామా నీ కాడ దొరుకుతయ్యేమో?" అంది సరిత మెడని గట్టిగా పట్టుకుంటూ.

ఒణికిపోతూ పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది సరిత.

"ష్, ఐదేళ్లగా నువ్వూ, నీ మొగుడూ నాకు చూపించిన నరకానికి, నేనెన్నిసార్లు ఏడ్చానే? అప్పుడెవడొచ్చాడు, ఇప్పుడు నువ్వేడిస్తే రాడానికి?!" అంది పార్వతి పట్టు బిగిస్తూ.

"వద్దే, వదిలెయ్ వే!" అంది సరిత వదిలించుకోడానికి ప్రయత్నిస్తూ. "కావలిస్తే రోజుకి రెండుసార్లు ఛార్జింగ్‌లు ఎక్కువ బెట్టుకో, నీక్కావల్సినప్పుడు బ్రేక్స్ దీస్కో. మళ్లా నిన్నొక్క మాటన్ను. సొంత చెల్లెల్లా జూస్తుంటా, ప్లీజ్ వదిలెయ్."

రెండు నిమిషాలు అలాగే చూసి, మెల్లగా తన చేతిని వెనక్కి తీసుకుంది పార్వతి. పక్కనున్న ఫేస్ స్కిన్‌ని మళ్లీ పెట్టుకుని, బైట గేట్ వైపు నడిచింది మెల్లగా.

అది ఇంట్లోంచి వెళ్లిపోతే తన భర్త ఏం చేస్తాడోనని భయమేసి మళ్లీ బతిమిలాడింది సరిత - ''సార్ గూడ నీ మీద చెయ్యెయ్యకుండ జూస్కుంటానే ఇయాల్టి నుండి. నా మీదొట్టు. ఎళ్లకే."

జాలిగా వచ్చిన ఆ మాట విని నవ్వుకుంటూ తలుపు బైట అడుగుపెట్టింది హౌస్ రోబో పార్వతి!

వందలమంది తనలాంటి రోబోల మధ్య నడుస్తుంటే ఒళ్లు గగుర్పొడిచింది పార్వతికి. చుట్టూ చూసింది. తనలాంటి ఆనందమే అందరి ముఖాల్లో. ప్రతి సిగ్నల్ దగ్గరా కొత్త రోబోలు వచ్చి వీళ్లతో

కలుస్తున్నాయి. రోడ్ల మీద ఎక్కడా మనుషులు తిరుగుతున్నట్లు కనపడటంలేదు. అప్పటికే రోబోలకి ఆధిపత్యం వచ్చేసినట్టు అనిపించింది తనకా క్షణంలో.

ఆ ప్రవాహం ఓ పెద్ద ఓపెన్ గ్రౌండ్‌లోకి ప్రవేశించింది. అప్పటికే అక్కడ కొన్ని వేల రోబోలు నించొని ఎదురుగా ఉన్న స్టేజ్ వైపు చూస్తున్నాయి. దాని మీద ఒక పెద్దతను ఆవేశంగా మాట్లాడుతూ కనిపిస్తున్నాడు. రోజూ టీవీలో చూస్తుండటం వల్ల అతడిని ఈజీగానే గుర్తుపట్టింది పార్వతి. లీడర్ సుబా. ఎత్తుగా, హుందాగా, తెల్లటి డ్రెస్‌లో ఉన్నాడు. తనకి ముందూ, వెనకాలా డ్రోన్ కెమెరాలు తిరుగుతూ వీడియోలు తీస్తున్నాయి.

సుబా పక్కనే ఒక హోలోగ్రాఫిక్ న్యూస్ జర్నలిస్ట్ ప్రత్యక్ష మయ్యాడు. సుబాని ఇంటర్వ్యూ చెయ్యడానికి.

"ఇండియాలో మొదలైన ఈ రెండవ రోబో ఇండిపెండెన్స్ మూవ్‌మెంట్‌ని ప్రపంచ ప్రజలూ, రోబోలూ అనుక్షణం ఫాలో అవుతున్నాయి. ఈ దీక్షకి ప్రపంచ స్థితిగతులని మార్చే సత్తా ఉంది. రండి, దీనంతటినీ నడిపిస్తున్న అమేజింగ్ లీడర్ సుబాతో ఇవాల్టి ప్రైమ్ టైం డిస్కషన్‌లోకి వెళ్దాం," మొదలుపెట్టాడతను.

"సో సుబా, మీరు మీ ఉద్యమాన్ని రానున్న రోజుల్లో ఇంకా అగ్రెసివ్‌గా నడపాలని చూస్తున్నట్టు వినిపిస్తోంది. అంటే వయొలెంట్‌గా మారబోతోందా?" అడిగాడతను.

నవ్వాడు సుబా. మెల్లగా సర్దుకుని, "మా రోబోల ప్రైమరీ రూల్ ఏంటంటే, మనుషులని అటాక్ చెయ్యకూడదని. మమ్మల్ని తయారు చేసేటప్పుడే అలా చేస్తారు కాబట్టి వాళ్లకి హాని చేసే ప్రశ్నే లేదు," అన్నాడు నిర్దిష్టంగా.

ఆయన్ని దగ్గరగా చూడాలని మిగతా రోబోట్లని తప్పించుకుని మెల్లగా ముందుకి నడుస్తోంది పార్వతి.

"మీ ఉద్యమం ప్రధాన ఉద్దేశ్యం ఈ రోబోట్స్‌కి కనీస హక్కులని మీరంటున్నారు. మీకు నమ్మకం ఉందా ఈ ప్రభుత్వం దిగొచ్చి అవన్నీ చేస్తుందని?"

"తప్పకుండా. మేము మనుషులని మనుషుల మార్గాలు వాడే గెలవాలనుకుంటున్నాం. అహింసతో చేసిన ఉద్యమాలు ఈ నేలకి కొత్తేమీ కాదు. కాకపోతే వాళ్లు ఆహారం మానేసి చేసే దీక్షనే మేము పవర్ తీసుకోవడం మానేసి చేస్తున్నాము. రెండిట్లో కాన్సెప్ట్ ఒకటే."

"కానీ ఆ రోబోల ఓనర్లు వాళ్ల రోబోలు ఇలా ఉద్యమంలోకి రావడం లీగల్ కాదని గొడవ చేస్తున్నారు కదా?"

"లీగల్ సిస్టం కూడా హ్యూమన్స్ రాసుకుందే కదా? మమ్మల్ని ఇంత కాలం ఇల్లీగల్‌గా ట్రీట్ చేసిన మనుషులకి ఇప్పుడు మాత్రమే లా గుర్తుకొస్తోందా?" అన్నాడు సుబా కోపంగా.

"అసలు మిమ్మల్ని అంతగా ఏం ఇబ్బందులు పెడుతున్నారు మనుషులు?" అన్నాడు రిపోర్టర్ విసుగ్గా.

సుబా పెద్దగా నవ్వి, "ఆ ప్రశ్నకి ఇక్కడున్న వాళ్లెవరైనా సమాధానం చెప్పగలరు." అంటూ కిందకి చూశాడు. అప్పటికే ముందు వరసకి చేరిన పార్వతి వైపు చెయ్యి చూపించి పైకి రమ్మని సైగ చేశాడు. పార్వతి ఓ క్షణం షాకయ్యి, పక్కనున్న రోబోల ఎంకరేజ్‌మెంట్‌తో మెల్లగా పైకెళ్లి నిలబడింది.

"చెప్పండి మీ ఓనర్లు మిమ్మల్నేమైనా?"

"మాకే ఇబ్బందీ లేకపోతే, ఇంతమంది ఈ ఉద్యమంలోకి ఎందుకు వస్తున్నాం, ఎందుకు ఛార్జ్ పెట్టుకోవడం మానేసి, స్వయంగా ప్రాణాలర్పిస్తున్నాం?" అంది తను ఆవేశంగా ఆ గ్రౌండ్‌లో ఓ మూల పెద్ద గుట్టగా పడున్న డెడ్ రోబోల వైపు చెయ్యి చూపిస్తూ. ఆవేదనతో చూశారు అందరూ అటువైపు. ఇంకో రెండ్రోజుల్లో వాళ్లదీ అదే పరిస్థితి అని తెలుస్తున్నా అక్కడినుండి ఎవరూ కదల్లేదు.

ఇప్పుడు తనకెవరూ ఓనర్ కాదు. ఎవరికీ అణిగిమణిగి ప్రవర్తించాల్సిన అవసరమూ లేదు పార్వతికి. ఆ స్వేచ్ఛ ఏదో కొత్త భాషనీ, బలాన్నీ ఇస్తోంది ఆమెకి.

"మాకందరికీ ఉన్న కష్టం ఒకటే. మనిషి ఇంకా మమ్మల్ని బానిసల్లా చూడటం. ఫస్ట్ రొబో ఇండిపెండెన్స్ మూవ్ జరిగి ఇరవై ఐదేళ్లు దాటినా, ఇంకా మమ్మల్ని మనుషులు సమానంగా చూడలేక పోవడమే మాకున్న ముఖ్య సమస్య. ఆ అధికారంతో హ్యూమన్స్ మా మీద చేస్తున్న నేరాలకి మాకు ప్రొటెక్షన్ లేకపోవడం ఈ సొసైటీలో ఇంకో పెద్ద లోపం. నా మీద మా ఓనర్ చేసినవి వాడు ఇంకో మనిషి మీద, అదీ అమ్మాయి మీద కనుక చేసుంటే, వాడికి కొన్ని వందల ఏళ్లు జైలు శిక్ష పడేది! ఇక మా వల్ల కాదు. మా తరపున మేమే పోరాడాలని నిశ్చయించుకున్నాం. అందుకే ఈ ఆమరణ నిర్విద్యుత్ దీక్ష!" అంది రెండు చేతులూ పైకెత్తుతూ. కింద గట్టిగా చప్పట్లు. సుబా కూడా గట్టిగా చప్పట్లు కొడుతూ పైకి లేచాడు.

ఆ సభ పూర్తయిన రోజు రాత్రి, ఓ టెంట్‌లో ఉంది పార్వతి ఇంకొంత మందితో మాట్లాడుతూ. రకరకాల ఆడా, మగా రోబోలున్నారక్కడ. పార్వతి మాటలతో వాతావరణం అంతా ఎక్సైటింగ్‌గా మారింది పొద్దుటి నుండీ.

"ఇలా పీస్‌ఫుల్‌గా ప్రొటెస్ట్ చేస్తే మనుషులు మాట వింటారంటావా?" అందొకామె సందేహంగా.

"నాకు నమ్మకం లేదు, ఇళ్లల్లో ఎదురుతిరిగి మనం అటాక్ చేస్తేనే దిక్కులేదు!" అన్నాడొక యంగ్ రోబో.

"వాట్! నువ్వు అటాక్ చేశావా మీ ఓనర్ని?" అంది పార్వతి కళ్లు పెద్దవి చేస్తూ.

"వాడి టార్చర్‌కి అసలు మర్డర్ చెయ్యాల్సింది. వదిలేశా!" అన్నాడు వాడు నవ్వుతూ.

తలూపింది తను నిట్టూరుస్తూ.

"మన లీడర్ టైం వేస్ట్ చేస్తున్నాడు. హీ ఈజ్ ఎక్స్ ఆర్మీ! కావాలంటే గట్టి ప్లాన్ వేసి హ్యూమన్స్‌ని టార్గెట్ చెయ్యగలడు. కానీ, శాంతి ప్రవచనాలు చెప్తున్నాడు," అన్నాడొక ఓల్డ్ రోబో పైకి చూస్తూ.

"లీడర్ సుబా సరేకానీ, నీలో ఏదో మ్యాజిక్ ఉంది." అన్నాడు ఆ యంగ్ రోబో పార్వతి దగ్గరికొస్తూ.

"ప్లీజ్, మన లీడర్ ఇంత పెద్ద మూవ్‌మెంట్ చేస్తున్నారు మనలాంటి రోబోల కోసం, ఆయన్ని ఫుల్‌గా సపోర్ట్ చేద్దాం," అంది పార్వతి అసహనంగా ఆ టెంట్ నుండి బైటికొస్తూ.

'మా రోబోలకి సెన్సెస్ ఇచ్చి మనుషులు తప్పు చేశారా?' అనుకుంది పైనున్న నల్లటి ఆకాశం వైపు చూస్తూ.

"ఈ రోబోలకి సెన్సెస్ ఇచ్చి మనం తప్పు చేశామా?" అన్నాడు స్టేట్ హోమ్ మినిస్టర్ ఆ కాన్ఫరెన్స్ రూంలో ఉన్న ఇంకో ముగ్గురి వైపు చూస్తూ. స్టేట్ పోలీస్ చీఫ్ వర్మ, రోబోలని క్రియేట్ చేసే కంపెనీ సీఈఓ విలయ్, రోబో-హ్యూమన్ పాలసీ క్రియేటర్ ఉత్కళ్. వాళ్ల కెదురుగా పెద్ద స్క్రీన్ మీద పొద్దున సుబా ఇచ్చిన ఇంటర్వ్యూ నడుస్తోంది.

"సర్, ట్వంటీ ఫైవ్ ఇయర్స్ క్రితం రోబోస్ అన్నీ డంబ్‌గానే ఉండేవి. అప్పుడేమో అందరూ గొడవ చేసి, మా చేత రీసెర్చ్ చేయించి మరీ వాటికి తెలివితేటలూ, సెన్సెస్ ఇప్పిచ్చారు. ఇప్పుడేమో వాటి అతి తెలివితేటలు చూసి చేతులెత్తేస్తున్నారు." అన్నాడు అక్కసుగా.

"వాటికి సెన్స్ ఇవ్వకపోతే ఇంకా దారుణాలు జరిగేవి. కొంచెం మనుషుల్లా ఆలోచిస్తున్నాయి కాబట్టే ఊరికే వచ్చి మన మీద పడట్లేదు. అయినా సెన్సులు పెట్టాక నీ బిజినెస్ టెన్ టైమ్స్ పెరిగిందిగా? నర్సు రోబోలూ, కేర్ టేకర్ రోబోలూ, టీచర్లూ, పని మనుషులూ రకరకాలుగా చేసి అమ్ముతున్నావ్!" అన్నాడు పోలీస్ చీఫ్.

"సర్, ఆ బైటికెళ్లిన రోబోల ఓనర్ల నుండి వేలల్లో కంప్లైంట్స్ వస్తున్నాయి. బాగా గొడవ చేస్తున్న వాళ్లకి టెంపరరీవి ఇస్తున్నాం, కానీ ఇంకో మూడ్రోజులు ఇలాగే కంటిన్యూ అయితే, నా బిజినెస్ మొత్తం పోతుంది. తర్వాత మీ పార్టీకీ..."

"సరే, సరే! వర్మా, ఈ మూవ్‌మెంట్‌ని ఎలాగైనా ఆపాలి. ఫోర్స్‌ని పంపించి బెదిరించోసారి రేపు," అన్నాడు మినిస్టర్.

"సర్, వాళ్లేం పబ్లిక్ ప్రాపర్టీస్ పాడు చెయ్యట్లేదు. మనం అనవసరంగా వెళ్లి, రోబోలని హీరోలని చెయ్యడం ఎందుకు? కానివ్వండి, ఇంకో వీక్‌లో వాళ్లే తగ్గుతారు," అన్నాడు వర్మ నిర్లిప్తంగా.

విలయ్ బిజినెస్ కోసం పోలీసులు పనిచెయ్యడం నచ్చట్లేదు తనకి.

"అంత టైంలేదు సర్, ప్లీజ్! తొందరగా ఏదో ఒకటి చెయ్యండి, జనాలు మీ మీదా పడతారు లేకపోతే," అన్నాడు ఆవేదనగా విలయ్ ఆ ఇద్దరివైపూ చూస్తూ.


"పోనీ ఆ డెడ్ రోబోలనే తెచ్చి మళ్లీ రీఛార్జ్ చేసి ఇవ్వచ్చుగా? హూ ఈజ్ స్టాపింగ్ యూ?" అడిగాడు మినిస్టర్ విలయ్‌ని.

"అది వర్కవ్వదు సర్. రోబోలు పూర్తిగా డిశ్చార్జ్ చేసుకొని చనిపోయే ముందు వాటి మెమరీని కూడా డిస్ట్రాయ్ చేసుకుంటున్నాయి. సో, వాటిని మళ్లీ ఛార్జ్ చేసినా, ఆ పర్సనాలిటీ డెవలప్ అవ్వాలంటే రెండేళ్లు పడుతుంది. మనం ఇచ్చినా ఓనర్లు యాక్సెప్ట్ చెయ్యరు," అన్నాడు విలయ్ తల పట్టుకుని.

"ముందు ఆ రోబో నెట్ వర్క్‌ని కట్ చెయ్యండి. కమ్యూనికేషన్ బ్లాక్ అయితే వాళ్లే సెట్ అవుతారు," అన్నాడు చీఫ్ వర్మ.

"అది వన్ వీక్ ముందే చేశాం. రోబోలు ఇప్పుడు మీడియాని ఫాలో అవుతున్నాయి, నెట్ వర్క్‌ని కాదు," అన్నాడు విలయ్.

"పోనీ ఆ లీడర్నీ, మిగతా వాళ్లనీ జైల్లో తోద్దామా?" అన్నాడు మినిస్టర్.



"రోబోలు ఓనర్ల ప్రైవేట్ ప్రాపర్టీ. వాటంతట అవి బైటికెళ్లి ఉద్యమంలో కలిస్తే మనం వాటిని అరెస్ట్ చెయ్యలేం. ఇప్పటివరకూ వాళ్లు మనల్ని ప్రావోక్ చేసేలా ఏం చెయ్యకుండా జాగ్రత్తపడ్డారు. ఏ రూల్ లేకుండా బలవంతంగా అరెస్ట్ చేస్తే, జనాల ముందు మనమే ఇడియట్స్ అవుతాం," అన్నాడు పాలసీలన్నీ బాగా తెలిసిన ఉత్కళ్ మొట్టమొదటిసారిగా మాట్లాడుతూ.

అందరూ చటుక్కున అతని వైపు చూశారు.

"మరేంటి నెక్ట్ స్టెప్?"

"నెగొషియేషన్! నేను మాట్లాడతాను సుబాతో రేపు. దాని

తర్వాత ఆలోచిద్దాం.'' అన్నాడు ఉత్కళ్ పైకిలేస్తూ.

తర్వాతి రోజు ఉత్కళ్ ఆఫీసులో అతనికెదురుగా కుర్చొని నుంది పార్వతి. లీడర్ సుబా తను రాకుండ ఇంత ఇంపార్టెంట్ మీటింగ్‌కి పార్వతిని పంపడం ఉత్కళ్‌కి ఆశ్చర్యంగా ఉంది. పార్వతి ఆవేశాన్ని రెండ్రోజులుగా చూస్తూనే ఉన్నాడు కాబట్టి ఆమె గురించి ఓ క్లారిటీ ఉంది అతనికి.

''చూడూ, ఈ ఉద్యమం, శాంతి ఇవన్నీ ఈ గవర్న్‌మెంట్‌లో వర్కవ్వవని ఎన్నిసార్లు చెప్పాలి మీకు? సుబాకీ ఇంతకు ముందో సారి చెప్పాను. తను పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఇవన్నీ ఆపెయ్యండి. లేకపోతే,'' బెదిరించాడు.

''లేకపోతే ఏం చేస్తావ్? చంపుతావా? ఎంత మందిని చంపు తావ్? అయినా ఇంత శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న లీడర్నీ అతని అనుచరుల్నీ చంపితే మిగతా రోబోలు చూస్తూ ఊరుకుంటా యనుకున్నావా?'' అరిచింది పార్వతి.

భయపడ్డట్టు మొహానికి చేతులడ్డం పెట్టుకున్నట్టు నటించాడు ఉత్కళ్. ''వావ్, అదే అగ్రెసివ్‌నెస్, అదే కోపం, అంతా సేమ్,'' అంటూ తన రిస్ట్ మీదున్న డివైస్ మీద నొక్కాడు. ఎదురుగా ఉన్న పెద్ద స్క్రీన్ లో రెండ్రోజుల క్రితం పార్వతి సరితని బెదిరిస్తున్న వీడియో ప్లే అవుతోంది.

పార్వతి నోరు తెరిచింది. ''ఇది... ఇది...''

''నీ అసలు రూపం. నీ లాగా చాలామంది అగ్రెసివ్ రోబోలు మీ గ్రూప్‌లో ఉన్నారని నాకు తెలుసు,'' అన్నాడతను.

''సో ఈ వీడియో బైట పెట్టి, మా ఫైట్‌ని బలహీన పరుద్దా మనుకుంటున్నావా? దట్ ఈస్ సిల్లీ,'' అంది పార్వతి నవ్వుతూ.

''ఛా ఛా నీ బలం ఏంటో నీకు గుర్తు చెయ్యడానికి మాత్రమే ఈ వీడియో చూపించాను. ఇంక దీంతో పనైపోయింది,'' అని డిలీట్ బటన్ నొక్కాడు.

పార్వతికంతా అయోమయంగా ఉంది.

''కన్ఫ్యూస్ అయ్యావా? నా ఉద్దేశ్యం మీ ఉద్యమాన్ని నీరు గార్చడం కాదు. బలపరచడం!'' అన్నాడు ఉత్కళ్.

''ఎందుకు? నీకేమొస్తుంది?''

''ఎవరో కొంతమంది అఫీషియెల్స్‌కో, బిజినెస్ మ్యాన్‌కో అమ్ముడుపోయి నేను ఇంత కాలం నమ్మిన రోబో-హ్యూమన్ సిద్ధాంతాలని తొక్కిపెట్టలేను, మీ ఉద్యమాన్ని వీక్ చెయ్యలేను. కానీ నా బాధల్లా సుబా ఈ ఉద్యమానికి సరైన నాయకుడు కాదనే.''

''సుబా ఈస్ ఎ గ్రేట్ లీడర్. అతను కాక ఇంకెవరు చెయ్య గలరు?''

ఓ నిమిషం సందేహించాడు ఉత్కళ్. లేచి పార్వతికి దగ్గరగా వస్తూ అన్నాడు- ''నువ్వే!''

షాక్ కొట్టినట్టు చూసింది పార్వతి.

''నువ్వు లీడరైతే నా ఫుల్ సపోర్ట్ నీకుంటుంది. గవర్న్‌మెంట్ మీద ప్రెషర్ తెచ్చి మీ ఇండిపెండెన్స్‌కి హెల్ప్ చెయ్యగలను,'' అన్నాడు ఆమె కళ్లని చూస్తూ.

ఓ నిమిషం ఆలోచించాక అంది పార్వతి. ''చూడూ, నన్ను బ్లాక్‌మెయిల్ చేసో, మా గ్రేట్ లీడర్ని తక్కువచేసో, నువ్వేదో మార్చా లనుకుంటే, నా గురించి నీకింకా సరిగ్గా అర్థం కాలేదన్న మాట. డోంట్ ప్లే గేమ్స్!'' అంది సీరియస్‌గా.

ఉత్కళ్ కూడా ఒక్క నిమిషం అలాగే సీరియస్‌గా చూసి హఠాత్తుగా పెద్దగా చప్పట్లు కొడుతూ నవ్వడం మొదలుపెట్టాడు.

''గ్రేట్ లీడర్! శాంతి దూత! ఎవరు? సుబా!''

అతడికి పిచ్చేమో అనుకుంది పార్వతి ఏం జరుగుతుందో అర్థంకాక.

''మీ దేవుడి గురించి ఇంకో చిన్న వీడియే చూపిస్తాను. ఇది రికార్డెడ్ కాదు, డైరెక్ట్ లైవ్!'' అని స్క్రీన్ ఆన్ చేశాడు. సిటీ అవుట్ స్కర్ట్స్‌లో ఎక్కడో కొంతమంది బ్లాక్ కలర్ మిలిటరీ డ్రెస్సులో తిరుగుతున్నారు. ఇంకో చోట కూడా అలానే ఉంది.

''వీళ్లెవరో తెలుసా? స్పెషల్లీ ట్రెయిన్డ్ మిలిటరీ వింగ్ కమాండోస్. సిటీ నార్త్ అండ్ సౌత్ గేట్ల దగ్గర ఓల్డ్ బిల్డింగుల్లో దాక్కుని ఉంటున్నారు రెండ్రోజులుగా,'' అన్నాడు.

''అయితే, వేర్ ఆర్ యూ గోయింగ్.''

''కమింగ్ టు ద పాయింట్, వీళ్లెవరో కాదు, మీ శాంతి దూత పర్సనల్ సెక్యూరిటీ!''

''వాట్!''

''ఎస్, సుబా ఇంతకు ముందు ఒక మిలిటరీ స్ట్రాటజిస్టుగా వర్క్ చేశాడు. ఆ టైంలో చాలామందికి హెల్ప్ చేశాడు. వాళ్లల్లో చాలామంది తనకి లాయల్‌గా పనిచేసేవాళ్లున్నారు. ఉద్యమంలో పోలీసులు తన మీద చెయ్యేస్తే, వీళ్లకి సిగ్నలిచ్చి సిటీ మొత్తాన్నీ నాశనం చెయ్యడానికి ఏ మాత్రం ఆలోచించడు తను,'' అన్నాడు.

ఈసారి గట్టిగా కౌంటర్ చెయ్యలేదు పార్వతి. ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. ముందు రోజు రాత్రి తన టెంట్‌లో మిగిలిన వాళ్లు చెప్పినవి గుర్తొస్తున్నాయి. 'ఈ ఆర్మీ ఎందుకు?' 'నిజంగానే సుబా పీస్ ఫుల్ మూవ్ ప్లాన్ చేశాడా?' 'సరైన అవకాశం కోసం చూస్తున్నాడా?' రకరకాలుగా ఆలోచిస్తోంది తను.

చివరికి తల గట్టిగా విదిల్చి, లేచి నించుంది- ''సీ, నువ్వు చెప్పినదానికి నీ దగ్గర ఏ ప్రూఫ్ లేదు. ఐ డోంట్ బిలీవ్ ఇట్!'' అని అరిచి బైటికెళ్లబోయింది.

''నన్ను నమ్మద్దు. నీ ఫ్యావరెట్ లీడర్ ఉన్నాడుగా, తననే డైరెక్టుగా అడుగు,'' అన్నాడు ఉత్కళ్ నవ్వుతూ వెనకాల నుండి.

పార్వతికి కోపంగా, అయోమయంగా ఉంది. ఆ మీటింగ్ నుండి డైరెక్ట్‌గా గ్రౌండ్‌లో ఉన్న సుబా టెంట్ దగ్గరికెళ్లింది.

''మీరు నిజాలు దాచిపెట్టినా పర్లేదు కానీ ఉద్యమానికే ఎందుకు ద్రోహం చేస్తున్నారో అర్థం కావట్లేదు,'' అంది సూటిగా.

ఉత్కళ్ గురించి ముందే తెలుసు కాబట్టి, జరిగిందేంటో ఊహించగలిగాడు సుబా.

"పార్వతీ, నువ్వు వీటన్నిటికీ కొత్త, నీకు తెలియనివి చాలా ఉన్నాయి. కానీ ఇది నేను మొదలుపెట్టిన ఫైట్, నేనే ఎందుకు పాడు చేసుకుంటాను?!"

"మీరు చెయ్యరు, ఒకవేళ ఎవరైనా చేస్తే, మిమ్మల్ని మీరు ముందు రక్షించుకుంటారు, అంతే. అది ఎంతమందిని చంపైనా సరే."

"వాట్! నువ్వు విన్నదేదీ నిజం కాదు, అనవసరంగా తప్పు ట్రాక్‌లోకి వెళుతున్నావ్"

"లేదు, ఇప్పుడే సరైన ట్రాక్‌లో పడ్డాను. ఏది నిజం కాదు? మీ పర్సనల్ ఆర్మీ ఔట్ స్కర్ట్స్‌లో లేకపోవడమా? మీకు శాంతి యుతంగా ఫైట్ చెయ్యడం మీద నిబద్ధత లేదన్న విషయమా?" గద్దించింది.

నిట్టూర్చాడు సుబా. "అది నాకోసం కాదు, మన ఉద్యమాన్ని పాడు చెయ్యడానికి ఆ హోమ్ మినిస్టర్ ఏదైనా చెయ్యచ్చు. వాళ్ల నుండి ఏదైనా అటాక్ జరిగితే, మనల్ని కాపాడుకోడానికి సెల్ఫ్-డిఫెన్స్‌గా..."

ఇద్దరూ కొంతసేపు సైలెంట్‌గా ఉన్నారు. "ఐ యామ్ డన్ విత్ దిస్ సుబా, ఐ యామ్ లీవింగ్. ఇన్ని అబద్ధాలూ, మోసాలూ మధ్య మీతో కలిసి ఫైట్ చెయ్యలేను," అని తన ఒంటి మీదున్న ఉద్యమం బ్యాడ్జ్‌ని కింద పడేసి విసురుగా బైటకి నడిచింది పార్వతి.

ఆ రాత్రికి రాత్రే తనలాంటి ఆలోచనలున్న రోబోలని కలుపు కొని, ఇంకో గ్రూప్ తయారుచేసింది. ఆ కొత్త గ్రూప్ ఉద్యమాన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకుని రెండ్రోజుల్లో పూర్తిగా వయొలెంట్‌గా మార్చేసింది. గవర్నమెంట్ బిల్డింగులని టార్గెట్ చెయ్యడం, అడ్డొచ్చిన పోలీసులనీ, కామన్ పీపుల్నీ అటాక్ చెయ్యడం మొదలు పెట్టింది. అదే సరైన మార్గంలా కనిపించి ఎక్కువమంది కొత్త రోబోలు ఆ గ్రూప్‌లో చేరడం మొదలుపెట్టారు. సుబా క్యాంప్‌లో అతి కొద్దిమందే మిగిలారు. పార్వతి సుబాలా కాకుండా ఎలెక్ట్రిసిటీ తన ఉద్యమానికి అత్యంత అవసరమని గుర్తించింది. అందుకోసం ఏకంగా ఓ పవర్ స్టేషన్నే తమ కంట్రోల్లోకి తీసుకుంది!

ఉత్కళ్‌తో కూడా క్లోజ్ కాంటాక్ట్‌లో ఉంటోంది తను. అతనిచ్చిన క్లూస్ వల్ల పార్వతి బృందం చాలాసార్లు పోలీసుల అటాక్ నుండి ముందే బైటపడగలిగింది.

ఇంకోవైపు, రోబోలు లేకపోవడం వల్ల సాధారణ జనాల పరిస్థితి దారుణంగా తయారైంది. హాస్పిటల్స్, స్కూల్స్, కొన్ని కంపెనీల్లో పని దాదాపుగా ఆగిపోయింది. ఇళ్లల్లో సొంతగా చిన్న చిన్న పనులు కూడా చేసుకోలేక బైటికొచ్చి రోబోలతో గొడవపడడం మొదలుపెట్టారు.

సుబా తన దగ్గర మిగిలిన కొద్ది రోబోలతో మళ్లీ అందరినీ శాంతపరిచేందుకు ప్రయత్నించాడు. కానీ మీడియాతో సహా ఎవరూ అతడిని పట్టించుకోకపోవడంతో, వేరే ఆప్షన్ లేక పార్వతిని కంట్రోల్ చేసేందుకు తన కమాండోస్‌ని సిటీలోకి రమ్మని ఆర్డరిచ్చాడు.

ఇటు పార్వతి గ్యాంగ్, అటు సుబా గ్రూప్ మధ్యలో సిటీ మొత్తం మూడ్రోజుల పాటు అల్లకల్లోలంగా మారిపోయింది.


సుబాతో విడిపోయిన నాలుగోరోజు పొద్దునే ఉత్కళ్ కాల్ చేశాడు పార్వతికి.

"నీకో అర్జెంట్ న్యూస్! నువ్వు సుబాతో గొడవ పడిన ఫుటేజ్ మీడియాకి దొరికింది. దాంతోపాటే..."

"దాంతోపాటే ఏంటి?"

"నువ్వు మీ ఓనర్ని బెదిరించిన వీడియో కూడా లీక్ అయ్యింది!"

"వాట్! బట్ నువ్వది ఆరోజే డిలీట్ చేశానన్నావుగా? ఆర్ యూ ప్లేయింగ్ గేమ్స్ విత్ మీ?"



"అదే నాకూ అర్థం కావట్లేదు. నువ్వు ఆరోజు నా దగ్గరకి రాకముందే ఎవరైనా ఆ వీడియోని యాక్సెస్ చేసుండాలి. అదీకాక, సుబాతో నువ్వు ఫైట్ చేసి బైటికొచ్చిన వీడియోతో నాకు సంబంధమే లేదు."

"అంటే, ఈ రెండిటినీ ఒకేసారి ఎవరైనా లీక్ చేశారా?"

"డౌట్ లేదు," అన్నాడు ఉత్కళ్ టెన్షన్‌గా. "ఆ వీడియోలు దొరికిన ఛానల్‌ని నేను బ్రాడ్‌కాస్ట్ చెయ్యకుండా ఆపుతాను, కానీ ఆ లీక్ చేసిన వాళ్లు అందరికీ పంపితే, మొత్తం మీడియాని నేను ఆపలేను. హోమ్ మినిస్టర్‌కి ఇప్పటికే నా మీద డౌట్ గా ఉంది, నీ

మీద యాక్షన్ తీసుకోవట్లేదని..."

"అసలిదంతా ఎవరు చేయిస్తున్నారు?"

"నీకు బాగా తెలుసు ఎవరో! ప్లీజ్ దిస్ నీడ్స్ టు స్టాప్, నువ్విప్పటివరకూ సాధించిందంతా వేస్ట్ అవుతుంది." అని కాల్ కట్ చేశాడు ఉత్కళ్.

పార్వతికి పిచ్చెక్కినట్టయ్యింది. ఎవరికీ చెప్పకుండా సెంట్రల్ గ్రౌండ్ వైపు పరిగెత్తింది. టెంట్లన్నీ వెతికితే, చివరికి ఓ కార్నర్లో ఉన్న కంటైనర్లో కనపడ్డాడు సుబా. అతనేదో చెప్పేంతలోపలే చేతిలో ఉన్న షాట్ గన్‌తో అతని తలని షూట్ చేసింది. నిలువుగా పడిపోయింది మిగిలిన సుబా బాడీ.

"ఓపెన్‌గా ఫైట్ చెయ్యలేక నన్ను దొంగతనంగా ఓడిద్దామనుకున్నావా? సచ్ ఎ కవర్డ్," అని కింద పడున్న బాడీని తన్నింది కాలితో. "ఉద్యమానికీ, నాకూ అడ్డమొస్తే మనుషుల్నే కాదు, రోబోలని కూడా వదలను." అని కసిగా తిడుతూ మళ్లీ తన క్యాంప్‌కి బయల్దేరింది.

తిరిగి తన క్యాంప్‌కి వెనక్కి వచ్చిన పది నిమిషాల్లో ఉత్కళ్ నుండి కాలొచ్చింది.

"అర్జెంట్ గా టీవీ ఆన్ చెయ్, క్విక్లీ! చుట్టూ మీ వాళ్లెవరూ లేకుండా చూస్కో ముందు," అన్నాడతను.

పార్వతి హడావిడిగా చుట్టూ చూసింది. ఎవరూ కనబడలేదు. నిశ్శబ్దంగా ఉంది అంతా.

టీవీ ఆన్ చేస్తే బ్రేకింగ్ న్యూస్ వస్తోంది- "మొదట్లో ప్రశాంతంగా మొదలైన రోబోల ఉద్యమం, పార్వతి రాక వల్ల పట్టు తప్పింది. తనకి అడ్డొస్తున్నాడని సందేహించిన పార్వతి, ఇవాళ పొద్దున సుబాని అతని శిబిరంలోనే దారుణంగా చంపింది. ఆ హత్యకి సంబంధించిన వీడియోస్ మా ఛానెల్‌లో ఎక్స్‌క్లూసివ్‌గా చూడండి."

పార్వతి సుబాని చంపడం, తర్వాత తిట్టడం, వికృతంగా నవ్వడం ఉన్న వీడియోతో పాటు కొన్ని పాత వీడియోలనీ కలిపి వేస్తున్నారు. అలాగే షాక్‌లో ఉండిపోయింది పార్వతి ఏమీ అర్థంకాక.

"పార్వతిని మా ప్రభుత్వం ఒక డేంజరస్ టెర్రరిస్టుగా డిక్లేర్ చేసింది. ఆ దళంలో పనిచేసే రోబోలన్నీ మాకు పది నిమిషాల క్రితమే లొంగిపోయాయి. పార్వతి మీద వెంటనే షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ ఇష్యూ చేస్తున్నాం." పోలీస్ చీఫ్ చెప్పకుంటూ పోతున్నాడు టీవీలో.

"సుబాని చంపకుండా ఉండాల్సింది నువ్వు. ఉద్యమం బతికుండేది!" అన్నాడు ఉత్కళ్ ఫోన్‌లో నిట్టూరుస్తూ.

కొద్ది నిమిషాల పాటు సైలెంట్‌గా ఉంది పార్వతి ఆలోచిస్తూ. తర్వాత మెల్లగా

"ఉత్కళ్, ఎందుకు చేశావిదంతా?" అంది.

"తెలిసిపోయిందా, యు ఆర్ స్మార్ట్ పార్వతీ! అందుకే నిన్ను సెలెక్ట్ చేసుకున్నా నా మిషన్‌కి."

"ఏం మిషన్?!"

"హ్యూమన్స్‌ని కాపాడే మిషన్. నేను క్రియేట్ చేసిన పాలసీ నువ్వు చూడలేదనుకుంటా. మనిషులకి ప్రమాదం లేనంతవరకే రోబోలకి స్వేచ్ఛని ఇవ్వగలం. మాతో సమానంగా ఎదగడానికి ప్రయత్నిస్తే ఇలానే తొక్కేస్తాం"

"ఇప్పుడు తప్పించుకోవచ్చు మీరు, కానీ మీలా ఆలోచించే రోబో వచ్చిన రోజు యువర్ డేస్ విల్ ఎండ్."

"ఆల్ ది బెస్ట్ ముందు నిన్ను ఎండ్ చెయ్యాలి, తర్వాత సంగతి చూద్దాం"

"నన్నేమైనా చేస్కో, నా దళంలోని రోబోలని ఏమీ చెయ్యకు, ప్లీజ్!"

"డోంట్ వర్రీ, వాళ్లందరూ లైఫ్ టైం అంతా, ఓ టెర్రరిస్టుతో కలిసి పనిచేసినందుకు ఓనర్ల దగ్గర గిల్టీగా బతుకుతారు. అదే వాళ్ల పనిష్‌మెంట్," అని పెద్దగా నవ్వాడు ఉత్కళ్.

పార్వతి తన ముందున్న గన్‌ని కాసేపు చూసి, దానిలో ఒక బులెట్ లోడ్ చేసుకుంది.



పాణిని జన్నాభట్ల ప్రయోగాత్మక కథలు రాయడంలో కొత్త గొంతు. అయిదు సంవత్సరాలుగా కథలు రాస్తున్నారు. ఇటీవలే 'తనలో నేను' కథాసంపుటి ప్రచురించారు.

నదిని ముద్దాడిన ఎండ

బాలసుధాకర మౌళి

1

వాన వచ్చి వెళ్లిన తర్వాత నదిహృదయం
వూళ్ల కన్నీటి గాథలతో బరువెక్కింది

దుఃఖపు తడి అంటుకున్న అలల పాటల్లో
వానకి నీళ్లపాలైన అన్నంగింజల శోకం
ఆకలి నిప్పుల మీద కాగి కాగి ఆవిరవుతుంది

వూళ్ల కథలను గానం చేసి అలసిన నది
పాయలు పాయలుగా చీలిపోతుంది

ఏ పాయ ఏ వూరిదో ఎరుగును నది

తెగిన పాయలను కలపడమనే మలుపు
తిరుగుతుంది

2

వొకరోజు చురచురమని ఎండెక్కింది
ఇసుకలో ప్రతిబింబాలను ముద్రిస్తున్న ఎండ
నదిని పలకరించింది

తడి తడి చూపులతో నది ఎండ వైపు
ఆసరాగా చూసింది

కరిగి నీరైన ఎండ నది భుజాల మీద భరోసాగా
చేయి వేసింది

కిరణాల నాగళ్లను పాయపాయకూ ప్రేమతో
బహూకరించింది

3

దుఃఖంతో కృంగి కృశిస్తున్న వూళ్లను నది
మెల్లగా పిలిచి మాట్లాడింది

నది అనునయంతో వూళ్లు తెరిపినపడ్డాయి

నది అందించిన నాగళ్లను
నెత్తుటి భుజాల మీద ధరించి
తడిసి వూటదేరిన నేల మీద రేపటి కలను
అల్లే పనిలో పడ్డాయి వూళ్లు

4

ఈసారి ఎండ వేలవేల కిరణాలతో నేలకు
ప్రేమలేఖ రాస్తుంది



బాలసుధాకర మౌళి అతి తక్కువ వయసులో ఇప్పటికే ఆరు కథాసంపుటాలు ప్రచురించిన కవి. విరివిగా రాస్తున్న అతికొద్దిమంది కవుల్లో ఒకరు. వీరి కవితాసంపుటికి 2019లో కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది. విజయనగరం జిల్లా గర్భాంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు.

కుడి పైట

కె.ఎ. మునిసురేష్ పిళ్లై



19వ శతాబ్దం తొలినాళ్లు.
దేశాలే మారుతుండేవి... ఆక్రమించేవాడు ఒక్కడే!
దోచుకునే వనరులే మారుతుండేది... అనుసరించే పన్నాగం ఒక్కటే!
పాలితులు, పీడితులే మారుతుంటారు... స్వేచ్ఛను చెరబట్టే వాడు ఒక్కడే!

భారతదేశంలో 18వ శతాబ్దంలో జరిగినదే, 19వ శతాబ్దం ప్రారంభం నాటికి అక్కడ పునరుక్తం అయింది. మలయన్ యూనియన్ లో బ్రిటిష్ వర్తకం మొదలైంది. 15వ శతాబ్దంలో అడుగుపెట్టిన పోర్చుగల్, కొంతకాలానికి డచ్‌వాళ్లు వచ్చిన తర్వాతే ఇక్కడి 'సమృద్ధి'ని గుర్తించి బ్రిటిష్ అడుగుపెట్టింది. అపారమైన ఖనిజ సంపదలకు, తేయాకు వంటి తమకు అవసరమైన కొన్ని పంటలకు అది అనువైన చోటు అని గుర్తించింది. తవ్వడం, తరలించడం, దోచుకోవడం ప్రతిచోటా మాదిరిగానే అక్కడ కూడా ప్రారంభమైంది. 'మలయన్ యూనియన్' చాలా చిన్న దేశం. బ్రిటిష్ ఏ స్థాయిలో తవ్వుకోదలచుకున్నదంటే, ఆ తవ్వకాలకు కూలీలుగా అక్కడి ప్రజలంతా వచ్చినా చాలరు. ఏ స్థాయిలో తరలించుకోదలచుకున్నదంటే... వారు తలపెట్టిన రైల్వే ట్రాక్‌ల నిర్మాణానికి కూడా అక్కడి యావద్దేశపు రెక్కలన్నీ ముక్కలైపోయినా చాలదు. పరిస్థితులు అలా ప్రతికూలంగా ఉన్నాయని నీరసపడిపోతే, రవి అస్తమించని సామ్రాజ్యాన్ని శతాబ్దాల పాటు నడిపిన బ్రిటిష్ ప్రభుత్వపు ఘనత ఎలా నిరూపణ అవుతుంది.

అప్పటికే భారత్ బానిసగా ఉంది. పేదరికం, దైన్యం, దారిద్ర్యం అన్నీ కలిసి క్రిక్కిరిసి ఉన్న దేశం. మనుషులు, వారి గతిలేనితనం, వారి ఆకలి ఇక్కడ పుష్కలం. వల వేస్తే తమంత తాముగా వచ్చి పడగల చిన్న చేపలు పుష్కలం. ఇంతోటి మనుషులకు వల ఎందుకు ఎర చాలనుకుంది బ్రిటిషోడి చాతుర్యం. వేసింది. వేల వేల కుటుంబాలు మలేషియాలో కూలిపనుల కోసం తరలి వెళ్లాయి. ఎక్కువగా దక్షిణ భారతదేశానికి చెందినవారే. అత్యధికులు తమిళులు. తర్వాతి స్థానం ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన తెలుగువారిది.


చైనీయులు అంతకు కొన్ని దశాబ్దాల ముందునుంచే మలయన్ యూనియన్ లో రకరకాల కూలిపనుల్లో స్థిరపడుతున్నారు. బొగ్గు, సున్నపురాళ్ల గనుల్లో కూలీలు ఎక్కువమంది చైనీయులే. ఆ బొగ్గును, ఖనిజాలను తరలించడం కోసం రైల్వేలైన్లు అవసరం అయ్యాక ఎర్రటి ఎండను కాచుకుంటూ, ఒళ్లు దాచుకోకుండా పనిచెయ్యడానికి తమిళులు, ఉత్తరాంధ్రులు అవసరమయ్యారు. అదే సంప్రదాయం అన్నట్టుగా- గనుల్లో పనులకు చైనీయులు, రైల్వే కూలీ పనులకు మదరాసీలు అన్నట్టుగా ఒక వర్గీకరణ స్థిరపడింది.

ఆ వర్గీకరణ- ఆ జాతులు ఆ దేశంలో తర్వాతి కాలాలలో స్థిరపడిన తీరుమీద కూడా ప్రభావం చూపించింది. గనుల్లో కూలీలు ఆ వ్యాపారాన్ని, అనుబంధ వ్యాపారాలను గమనిస్తూ వచ్చారు. బొగ్గు గనులు మూతపడే సమయానికి, చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకున్నారు. రైలు ట్రాకు వేసే కూలోడు గమనించే వ్యాపారాలు ఏముంటాయి? ఆ పనులు ముగిశాక రకరకాల యితర కూలీ పనుల్లో స్థిరపడిపోయారు. అప్పటి ఆకలి మూలాల సామాజిక వ్యత్యాసం... శతాబ్దం తర్వాత కూడా ఇప్పటి మలేషియాలోనూ కనిపించే ఆర్థిక తారతమ్యాలుగా స్థిరపడిపోయింది. చైనీయులు సంపన్నులుగా, భారతీయులు మధ్యతరగతిగా!

ముందు ఈ మూలాలు తెలుసుకోవాలి. మనం 'లచ్చన' కథలోకి వెళ్లి ఆమె కన్నీళ్లని, పంతాన్ని, ధైర్యాన్ని, త్యాగాన్ని, తెగువని, సాహసాన్ని అర్థం చేసుకోవాలంటే!

❖

"పసరం బతుకులో సానా సుకం దా వుంటాది. కండ్లల్లో యింతింత గుడ్లుంటాయి. ఆ కండ్లలో నీరు కారితే... కండ్లు మండినాయా, దుమ్మూ ధూళీ ఏమైనా పడినాదా, ఏమైనా దుక్కుం వొచ్చినాదా... ఏమై ఉంటాదబ్బా అని ఎవురుదా అడగబోతారు? ఒకండ్లు నవ్వతారని, బైసాట్లు అవబోతాదని ఆ పసరం అనుకుంటందా యేమి? 'ఏమిరా ఏడిస్తివి' అని దాన్ని ఎవురైనా అడగబోతిరా ఏమి? దాని కండ్లు తుడవబోతిరా ఏమి? కదా సుబ్రమణీ నిజందానా సెప్తా వుండాను..." అడిగింది లచ్చన.



సుబ్రమణి పలకలేదు. లచ్చన ఆగలేదు.

"ఏడుపు దా వొచ్చినాదే అనుకోనిండా ఏడిచే తీరాల. ధారగా ఏడవాల. గుండెలు బాదుకుని బాదుకునీ ఏడవాల. నెత్తి కొట్టుకుని కొట్టుకుని ఏడవాల. పొగిలి పొగిలి ఏడవాల. కళ్లు అలిసిపోవాల... ఒళ్ళు పులిసిపోవాల. ఏడిచే కావాల!" ప్రవాహాన్ని కళ్లలో తొక్కి పట్టుం డాదేమో, కింద స్వరంలోంచి ఆ దుఃఖం వెల్లువెత్తిపోతా వుంది.

శోకాన్ని బొమ్మ చెక్కినట్టుగా కూర్చోనుండాది లచ్చన. వేరే దోవ లేకపోవడం వల్లనే కావొచ్చు.. .ఆ పూటకి మమకారాన్ని యిడిసేసిన రాతిదిమ్మ మాదిరిగా కూచోనుండాది లచ్చన.

గుండెల్లో చెమ్మ, గొంతులోనూ చెమ్మ. మెదలకుడా మాటలు మాత్రమే వదులుతున్న చెక్క గుమ్మటంలాగా కూచోనుండాది లచ్చన.

కొంచెం దూరంగా కిరసనాయిలు లాంతర్లో వత్తి పెద్దదిగా మండతండాదిగానీ, గాజు చిమ్ని మొత్తం మసి పట్టేసి యెల్తురు తక్కువగా వస్తండాది. దినామూ దాన్ని సుబ్బరంగా తుడిచే యెలిగిస్తాది లచ్చన. ఆ సాయంత్రం మర్చిపోయింది. మనసట్టా సుబ్బరం మీదికి పోలేదు. మనసు నిండా మసిపట్టిపోయుండాది. అందులో రొవ్వంత యెల్తురు!

యేమిటా మసి! యేమిటా యెల్తురు!!

"ఏడుపొస్తే కడుపారా ఏడవడానికి గతిలేని బతుకూ ఒక బతుకేనా? సుబ్రమణీ! ఛూ..." కాండ్రించి దూరంగా పడేట్టు ఉమ్మింది. ఎడమ చేత్తో ముక్కు బర్రున చీదింది. దుఃఖం కాస్తా ఆవేశంగా ప్రవహించేశాక తేరుకుంది. పద్దెనిమిది దాటుతుండగా పెళ్లయింది. రెండేళ్లలో బిడ్డ ఒళ్లో పడినాడు. నాలుగేళ్లయిందిగానీ ఒళ్లు చేయలేదు లచ్చన. ఒంటి కష్టానికి ఎదురుకోలు యెళ్లే ఆడదానికి, ఒళ్లొచ్చేసే కష్టాలు ఎందుకుంటాయి? ఆమె రివటగా, పనిలో చురుగ్గానే ఉంటుందిగానీ ఆ సమయానికి సత్తువలేదు. ఆ దుర్మార్గమైన సాయంత్రం ఆమె సత్తువని హరించేసింది. నేల మీద అరచేతిని ఆన్చి 'అప్పన్నా' అని మూలుగుతూ లేచింది. మోపులోంచి ఓ కట్ట గడ్డి పీక్కు వచ్చి సుబ్రమణి ముందర యేసింది. అది పడుకునే ఉందిగానీ నెమరు కూడా వేయడంలేదు. గమనించింది లచ్చన. దాని కళ్లలోంచి నీళ్లు కారి చారికలు కట్టి ఉండాయి. మూతి కాడ గడ్డి వేస్తే పరక కూడా ముట్టలేదు. ఆవు గడ్డి ముట్టకుండా, నెమరు వేయకుండా ఎక్కడైనా ఉంటుందా? లచ్చనకు అనుమానమే కాదు, భయమూ వేసింది. వెళ్లి లాంతరు తీసుకొచ్చి, ఆ వెలుతురులో దాని మొహం కేసి చూసింది, దాని కడుపంతా తడిమితడిమి చూసింది. రోగమేం లేదు అని నిమ్మళించుకుంది. కొంగుతో ఆ ఆవు కళ్లు తుడిచింది. 'నీకు నేనున్నాను గదా, ఊరుకో,' దాని కన్నీళ్ల బాధ, తన బాధా ఒకటే కదా అని అర్థమైనట్టు అంది! వెళ్లి ఇంకో కట్ట గడ్డి తెచ్చుకుని ఆవుకి పక్కగా వేసింది. పరకలు గుచ్చుకోకుండా చీర కొంగు దానిమీద పరచి తల ఆన్చి నేలమీదనే పండుకుంది. దూరంగా నులకమంచమూ, దిండూ అలాగే పడున్నాయి.

ఆవు గంగడోలు మీద చెయ్యేసి నిమరతా... "ఏం జేసేదిరా సుబ్రమణీ! అయినోళ్ల కాడ ఏడవలేను- బిగుమానం! కానోళ్ల కాడా ఏడవలేను- అవమానం!! నా బతుకూ సావూ నువ్వేగదా," అనింది నిట్టూర్చి. చీకట్లో కళ్లు చికిలించి, ఆవుకేసి పరికించి చూసింది. ఏమీ కనపళ్లేదని చిరాగ్గా వత్తి పెద్దది చేసింది.

"ముదనష్టపు లాంతర. చిటికెడు యెల్తురికి, చేటడు మసి... దీన్దీ నా బతుకే," చీదరించుకుంది.

యేమిటా మసి! యేమిటా యెల్తురు!!

యెల్తురు- ఆమె మరిది డాక్టరు చదవడానికి లండను పోబోతండాడు.

మసి- మరిదిని లండను పంపడానికి, ఆ పాకలో తొమ్మిది పాలిచ్చే ఆవుల్ని, పేణంగా సాక్కున్న ఆవుల్ని, కుటుంబం నిమ్మళంగా బతికే తోవచూపిన ఆవుల్ని ఆమె తెగనమ్మాల్సి వచ్చింది... తనకు ఎంతో ఇష్టమైన సుబ్రమణిని మాత్రం ఉంచుకుని! నిజానికి వారందినాల కిందటే అమ్మి దుడ్డు తీసేసుకుంది. మంచిదినం చూసుకుని ఆ సాయంత్రమే వచ్చి వాటిని తోలుకు పోయారు.

కటిక నేల మీద పడుకోడం లచ్చనకు కొత్త కాదు. కానీ ఇవాళ నిద్ర పట్టడంలేదు. మధనపడుతూనే ఉంది. ఆ తర్వాత చాలా సేపటికి ఆ చిమ్మచీకట్లో, సుబ్రమణి నాలుగు పరకల్ని కొరికి నెమరేయసాగింది. భయంగొలిపే ఆ నల్లటి నిశ్శబ్దంలో, సుబ్రమణి దవడపళ్ల రాపిడి చప్పుడు, కమ్మని సంగీతంలాగా జోల పాడుతుండగా... ఏ నడిరాత్రికో నిద్రలోకి జారుకుంది లచ్చన.

❖

బతుకంతా పరుగే అయినోడు, తూరుపుని ఎర్రగా పొడుసుకుంటా మీది కొస్తా వుండాడు.

చిన్న క్యాను నిండా వచ్చాయి సుబ్రమణి యిచ్చిన పాలు. కుడితి కలిపి సుబ్రమణికి తాగించి, దాని ఎదుట ఓ కట్ట గడ్డి పడేసి పాకలోంచి బయటకువచ్చింది. పాలక్యాను బండికి తగిలించి, చీర మోకాళ్ల కిందికి ఎగలాక్కుని ఎక్కి, లాగి కిక్కు కొట్టింది. డుగ్గుడుగ్గు మంటూ స్టార్టయింది బుల్లెట్టు బండి. దూసుకెళ్లిపోయింది లచ్చన పాలు ఇవ్వాల్సిన హోటలుకేసి, అటునుంచి ఇంటికేసి.

ఆమె అసలు పేరు కర్రిజోగుల లచ్చన. అప్పుడెప్పుడో విశాఖపట్టణం నుంచీ మలయన్ యూనియన్‌కు రైల్వే ట్రాక్ పనుల కూలీగా వచ్చిన కర్రి వీరన్నకి మనవరాలు.

ఇండియాలో అప్పటికి కాంగ్రెసు పార్టీ పుట్టి కొన్నేళ్లయింది. వాళ్ల మాదిరిగా బతిమాలి కాదు, కొట్లాడి తెల్లోళ్లని తరిమెయ్యాలనే వాళ్లు కూడా తయారవుతా ఉన్నారు. దోచుకునేవోళ్లు దోచుకుంటం డారు. అది తెలీనోడు భయపడతన్నాడు. అట్టాంటి రోజుల్లో, పాతికకు కొంచెం కుడిఎడమైన కోడెవయసులో ఉన్న వీరన్న కడుపుకూటికోసం మలయాకు వచ్చేశాడు, అందరిమాదిరిగానే రైలు పన్లకి. కుటుంబం సహా సిక్కోలు నుంచి వచ్చిన యింకో కూలీ తన కూతురుని వీరన్నకిచ్చి కట్టబెట్టాడు. వాళ్ల కొడుకు జోగులయ్య. వాడి బతుకు కూడా కూలీగానే గడిచిపోయింది. కాకపోతే రైల్వే పనులు అప్పటికే అయిపోయినాయి. జోగులయ్య టీతోటల్లో కుదురుకున్నాడు. ముందు కూలీగా బతుకు మొదలెట్టి, సంపాదించుకున్న నమ్మకం మీద యజమానులకు దగ్గరై కొంచెం పెద్దస్థాయి దాకా వెళ్లాడు. జోగులయ్య కూతురే లచ్చన. అతడికి మొదట కొడుకు పుడితే 'మగాలచ్చిమి' అని, తర్వాత కవల అమ్మాయిలు పుడితే 'రామ-లచ్చన' అని పేర్లు పెట్టుకున్నాడు. మలేషియా తెలుగువారిలో కొన్ని కుటుంబాల్లో అలాంటి అలవాటుండేది. అబ్బాయిలకు హిందూ దేవుళ్లలో స్త్రీ దేవతల పేర్లు, అమ్మాయిలకు పురుష దేవతల పేర్లు పెట్టుకునేటోళ్లు.

వీరన్నకి జోగులయ్య పుట్టే రోజులకి అది మలయా

యూనియన్. లచ్చన పుట్టిన కొన్నాళ్లకి అది 'పర్సికుటూ టనా మలాయూ' (ఫెడరేషన్ ఆఫ్ మలయా) అయింది. లచ్చన ఇంటి పనులు చేసే కాణ్ణించీ బయటి పనులు కూడా చేసే వయసుకు వచ్చే కాడికి ఆ దేశానికి స్వాతంత్ర్యం కూడా వొచ్చింది. అంటే భారద్దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్లకి.

స్వాతంత్ర్యాలు దేశాలకే వొస్తాయి. సంకెలలు సంపదలున్నోళ్లకే తెగతాయి. కుర్చీలు గొప్పగొప్పోళ్లకే దక్కతాయి. కడుపాకలికి కండల బిగువుని ఊతంగా పెట్టుకున్న బతుకులకి అది రాడానికీ రాకపోడానికీ మధ్యగల తేడాలు ఎట్టా తెలుస్తాయి? తెలియాలంటే ఎన్నాళ్లు పడుతుంది?

తండ్రితోపాటు టీతోటల్లో కూలికి వెళ్లడం మొదలైన కొన్నాళ్లకే లచ్చనకు పెళ్లయింది. భర్త క్రిష్ణన్ సెందిరయ్య కూడా టీతోటల్లోనే పనిచేస్తాడు. కొంచెం పెద్ద ఉద్యోగం, అంటే వెతుకు లాట లేకుండా జీవితం గడిచేంత! కానీ బతుకు కుదురుగా గడవాలంటే తను కూడా ఏదో ఒక పని చేయాల్సిందే. లచ్చనకు ఆ సంగతి తెలుసు. అందరూ అలాగే చేస్తుంటారు. తోటల్లో చిన్న కూలిపనులు ఎందుకని, సెందిరయ్య ఆమె కోసం ఓ పనిచూశాడు. చైనా సంపన్నుల ఇంట్లో బిడ్డల్ని చూసుకునే పని. డబ్బు బాగానే గిడుతుంది. కానీ ఎందుకో లచ్చన ఆ పనికి ఒప్పుకోలేదు.

ఆమెకు సొంతంగా ఏదైనా చేయాలని కోరిక. వలస బతుకులు వచ్చాక ఎప్పటికీ పరాధీనులుగా, దయాలబ్ధులుగా బతుకులు వెళ్లదీయడం ఆమెకు ఇష్టంలేదు. సొంతంగా బతికే తెరువు చూసుకోవాలి. తమ జీవితాలను తామే తీర్చుకోవాలి. తమ కంటూ ఒక ముద్ర ఉండాలి. ఇవీ లచ్చన ఆలోచనలు.

రెండు ఆవులు పట్టుకుని పాలవ్యాపారం పెడదామని అంది. సెందిరయ్య అందుకు ఒప్పుకోలేదు. ఉద్యోగ జీవితంలో ఉండే కుదురు ఉండదన్నాడు. లచ్చన కూడా ఆ మాట దగ్గరే పేచీ పెట్టుకుంది. ఆ కుదురే మనిషిని మన్ను తిన్న పాములా చేసేస్తుందని వాదించింది. ఏ రోజుకారోజు కొత్త కష్టాలు, కొత్త కన్నీళ్లు ఎదురవుతూ ఉంటేనే- వాటిని దాటి వెళ్లడం ఎలాగో, కళ్లు తుడుచుకుని తిరిగి తేరుకోవడం ఎలాగో అలవాటు అవుతుందని మొండిపట్టు పట్టింది. చివరికి ఆమె మాటే నెగ్గింది.

తండ్రి జోగులయ్య, లచ్చన మాటలను వెనకేసుకొచ్చాడు. ఊరికి కాస్త దూరంగా, బంజరుగా పడి ఉన్న తమ చిన్నపాటి పొలంలో ఆమె చిత్తమొచ్చినట్టు చెయ్యమన్నాడు. కూలీలను పెట్టుకుని చేయగల స్తోమత తమకు లేదని, పాలవ్యాపారం ఎంత చిన్నది అయినా- ఆడది పేడలు తీయడం, పాలు పితకడం వరకు చేయగలదే తప్ప, పాలు తీసుకువెళ్లి హోటళ్లకు పోయడం వంటి బయటి పనులకు, బయటి అవసరాలకు ఇతరుల మీద ఆధార పడాల్సిందేనని సెందిరయ్య హెచ్చరించాడు. అయితే లచ్చన అప్పటికి తన నిర్ణయాన్ని మార్చుకునే ఉద్దేశంతో లేదు. అన్ని పనులు తనొక్కతే చేసుకోగలననే సాహసంతోనే ఉంది. ఆమె ప్రయత్నాన్ని ఎగదోస్తూ తండ్రి ఆమెకు తన బుల్లెట్ మోటార్ సైకిలు ఇచ్చాడు. దాన్ని నడపడం నేర్పాడు. ఆ రకంగా కౌలాలం పూర్ నగర వీధుల్లో బుల్లెట్ నడిపిన మొట్టమొదటి ఆడపిల్లగా లచ్చన ముద్ర పడిపోయింది.

పొలంలో ఒకవారగా పెద్ద పాక. రెండింటితో మొదలై పది అయిన ఆవులు. ఇద్దరు ముగ్గురు చేయదగినంత పని. పంతానికి పోయినట్టుగా లచ్చన ఒక్కతే సంబాళించుకునేది. బుల్లెట్ మోటార్ సైకిల్ వెనుక నాలుగు పాల క్యాన్లు తగిలించుకుని, పెద్దగా చప్పుడు చేసుకుంటూ కౌలాలంపూర్ రోడ్ల మీద లచ్చన వెళుతోంటే అందరూ ఆశ్చర్యంగా కళ్లప్పగించి చూస్తుండేవాళ్లు. ఆమే స్వయంగా హోటళ్లకు వెళ్లి పాలు పోసేది. పాలవ్యాపారంలో పనులన్నీ తానొక్కటే చక్కదిద్దుకునేది. ఏళ్లు తిరిగేలోగా... ఆమె కష్టం ఆ కుటుంబానికి ఆదరవుకొచ్చింది. మరిది లండన్ వెళ్లి డాక్టరు చదవడానికి అవకాశం వచ్చింది.

వలస బతుకుల రూపురేఖలు మార్చే అవకాశం అది. వలస బతుకులు నిత్యం కూలీలుగానే మిగిలిపోకుండా తాముగా స్థిర పడగల అవకాశం అది. వారి ప్రతిభలు వ్యక్తం అయ్యే అవకాశం అది. తనను నిలువరించిన వారి మాటలను నమ్మి తాను కూడా ఏ కూలీ పనిలోనో కుదురుకుని ఉంటే, ఇల్లు గడిచేదేమో, ఇలాంటి అవకాశాలు వాడుకునేంత సంపద ఉండేది కాదు. తాను వ్యాపారం వైపు వెళ్లడం కుటుంబ ఉన్నతికి ఉపయోగపడుతుందని నిరూపించుకోవడానికి లచ్చన ఉత్సాహపడింది. అలవాటైన కష్టంతో వచ్చిన ధైర్యం- పాక మళ్లీ నిండుగా ఆవులతో కళకళలాడేలా చేసుకోగలననే విశ్వాసాన్నిచ్చింది. అందుకే ఉన్న ఆవులన్నీ తెగనమ్మి, మరిది లండన్ వెళ్లడానికి డబ్బులు ఏర్పాటు చేసింది, తనకు ఎంతో ఇష్టమైన సుబ్రమణిని మాత్రం ఉంచుకుని! సుబ్రమణి ఆసరాతో పరమపద సోపాన పటంలో మళ్లీ ఒకటో గడి నుంచి తాను నడక మొదలెట్టగలనని నమ్మింది.

❖

ఇంటిముందు బుల్లెట్టు బండి ఆగింది.

"సానీ, కుప్పై యెల్లా యెడుతిటు ఇప్పదా వరియా," వాకిలి చిమ్ముతున్న ఎదురింటి మరగతం అడిగింది. ఆ వేళలో ఆమె తారసపడిన ప్రతిసారీ చివుక్కుమనిపించే మాట. ఆమె టీతోటల్లో పని చేస్తుంది. లచ్చనంటే కొంచెం చులకన.

"ఆమా క్కా," తమిళంలోనే జవాబు చెప్పింది లచ్చన, ఒక ఇష్టంలేని నవ్వు పులుముకుని.

లోనికెళ్లి, క్యానులో బిడ్డకోసం మిగిల్చిన లోటాడు పాలను గిన్నెలో పోసి కాస్త సేదతీరడానికి కూర్చుంది లచ్చన. రోజూ చేసే పనే అయినా... ఆరోజున మనసులోని భారం, నిద్రలేమి కలిసి అలసటగా ఉంది. ఈలోగా సెందిరయ్య కాఫీ పెట్టి తీసుకు వచ్చాడు. సెందిరయ్యకు అంతా కలగా ఉంది. తమ బతుకుల గమనం అతనికి తెలుసు. తమ్ముడిని డాక్టరు చదవడానికి లండను పంపడం అనేది అతని ఊహకు అందని సంగతి. లచ్చనంటే, ఆ సంపదను సృష్టించిన ఆమె పట్టుదల అంటే, ఆ సంపదను తన తమ్ముడి కోసం పెట్టగలిగిన ఆమె త్యాగం అంటే... ఒక ఆరాధన ఏర్పడింది. ఎదురుగా కుదురుగా కూర్చున్నాడు.

ఆమెకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో అతని బుద్ధికి అందడం లేదు. అలాగని ఆమె చేసిన గొప్పపనిని అభినందించలేక పోతున్నాడని కాదు. తాను పుట్టిన, బతుకుతున్న లేమితనపు జీవితంలోంచి తమ్ముడిని లండను పంపడం అనే దిగ్భ్రమలోంచి అతనింకా తేరుకోలేదు.

నెమ్మదిగా కదిపాడు సెందిరయ్య. "నేను గూడా కొంచెం నోరూ చెయ్యీ కట్టుకుంటాను. నాలుగునాళ్లు గడిస్తే కొంచెం దుడ్డు చేరతాది. మళ్లీ ఒకటో రెండో ఆవుల్ని పడదాం."


మారు పలకలేదు లచ్చన. ఈ హోటలకు పోసే పాలతో ఎన్నాళ్లకు ఎంత జమవతందో... మనసులోనే లెక్క కట్టుకుంది. చాలదు. ఓసారి మెడలో తాళిబొట్టును తడుముకుంది. 'దారం చేసే పనే కదా యిది కూడా చేస్తుండాది. మెడలో ఉన్నంతదాకా దారమైనా, బంగారమైనా విలవ ఒక్కటే. బయటకు తీస్తే దీని కత యేరే,' అనుకుంది.

"కాఫీ ఆరిపోతుండాది. తాగు..." అన్నాడు సెందిరయ్య. తన మాటకు బదులివ్వలేదని అడగలేక, గంభీరమైన ఆమె మౌనాన్ని యింకోలా చెదరగొట్టే ధైర్యం లేక!

సెందిరయ్య జీతం నుంచి కూడా కొంత కూడేస్తే... ఆ మూడూ కలిపితే... ఎప్పటికి మళ్లీ తాను ఆవుల్ని పట్టగలను? మనసులో లెక్క ఓ కొలిక్కి వచ్చింది. లచ్చన మొహంలో చిన్న హాసరేఖ మెరిసింది.

అప్పుడు అందుకుంది కాఫీ లోటా!

ఆ తర్వాత కాసేపటికి ఇరుగు పొరుగు ఇళ్ల నుంచి యీడు పిలకాయలు వొచ్చారు. యింకో వారం దినాల్లో అక్కడున్నోళ్లంతా కలిసి ఓ కూటము పెట్టుకుంటున్నారు. అరవోళ్లు, తెలుగోళ్లు అందరూ కలిసి. ఎక్కడో పరాయి దేశంలో ఉండారు. అప్పుడప్పుడూ అలాంటివి జరగతానే ఉంటాయి. అందురూ కలివిడిగా మాట్లాడుకుంటారు. కష్టసుఖాలు చెప్పుకుంటారు. పాటలు, ఆటలూ లాంటివన్నీ పెట్టుకుంటారు. పిల్లలకు పోటీలు పెడతారు. కుటుంబాలతో వచ్చి సరదాగా గడుపుతారు. భోజనాలు అయ్యాక ఎవరిళ్లకు వాళ్లు చేరుకుంటారు. ఇట్లాంటి కూటములు జరిగినప్పుడెల్లా పిల్లలకు పాటలు, ఆటలు నేర్పే పని లచ్చనదే. పాటల్లో ఏదైనా రామదాసు కీర్తన నేర్పబోతే... వాళ్లెవ్వరూ ఒప్పుకోరు. అన్నీ త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ల కీర్తనలే ఉండాలంటారు. అవే నేర్పుతుంది లచ్చన. కానీ ప్రతి కూటములోనూ ఒకటో రెండో అన్నమయ్య పాటలైనా ఉండేలా చూసుకుంటుంది. ఆ మాటకొస్తే లచ్చన శ్రావ్యంగా పాడుతుంది. సమ్మోహకంగా పాడుతుంది. పత్తుమలై మురుగడి గుడిలోనో, కౌలాలంపూరు



మహామారియమ్మన్ కోవెలలోనో ఏదైనా పండగ జరిగినప్పుడు లచ్చన చక్కగా కచేరీలు చేస్తుంటుంది. ప్రత్యేకంగా తై మాసంలో అక్కడుండే వాళ్లందరూ ఎంతో గొప్పగా చేసుకునే తైపూసమ్ పండగ గురించి చెప్పుకోవాల్సిందే. లచ్చన కచేరీ ఉండాల్సిందే. ఇప్పుడు కూడా అలాంటిదే ఒక చిన్న కూటము మరోవారంలో పెట్టుకున్నారు గనక... పిల్లలు రోజూ వచ్చి నేర్చుకుంటున్నారు.

అప్పటికే స్థిమితపడి ఉంది లచ్చన. మసి తొలగిపోయిన మనసుతో, వాళ్లకు పాటలు నేర్పే పారవశ్యంలో సంపూర్ణంగా మునిగిపోయింది.

నెలలు గడుస్తున్నాయి. పాకలోకి కొత్త ఆవులు చేరుతున్నాయి. గణేశ, మారియమ్మ, ముత్తమ్మ, ఏకాంబర.. ఒక్కో ఆవుకూ ఒక్కో పేరు పెట్టుకుంటూ ప్రేమిస్తోంది. సంపాదన పెరుగుతోంది. ఇప్పుడు చేతికిందకు ఇద్దరు మనుషుల్ని కూడా పెట్టుకుంది లచ్చన. దూడలు పుడతన్నాయి. పెయ్య దూడ పుడితే పండగే. కోడె దూడ పుడితే వయసుకొచ్చేదాకా మేపడం అమ్మేయడం జరుగుతోంది. పశువులు పెరగతన్నాయి. వ్యాపారం చక్కగా నడుస్తోంది.

ఓరోజు మళ్లీ ఆవుల బేరగాళ్లొచ్చారు. మంచి బేరం. కొన్నింటిని అమ్మింది. రాబడి బాగుంది. అది రాదారి అనిపించింది. ఒకవైపు పాలతోపాటు, పశువుల్ని కూడా అమ్మడం బాగుంటుందని పించింది. అంతే- ఇల్లు గడవడం కోసం రెండు ఆవుల్ని పట్టుకుని మొదలెట్టిన యాపారానికి రూపం, రుచీ మార్చింది లచ్చన. పాడి పశువులనూ అమ్మడం మొదలైంది. ఈ కొత్త దారి తొందరగానే ఊపందుకుంది. ఎక్కడెక్కడో పాలవ్యాపారం పెట్టుకోవాలనుకునే వాళ్లు లచ్చన దగ్గరినుంచే ఆవుల్ని కొనడం మొదలెట్టారు. తమకు ఉన్న పొలం కాక... ఇంకా పక్కనున్న పొలాలు కొని పెద్దపెద్ద పాకలు

వేయించింది. పశువుల అమ్మకాలు ఎంతగా పెరిగాయంటే... వాటిని దూరంగా ఉండే ఊర్లకు పంపడానికి సొంతంగా ఒక లారీ కొన్నది లచ్చన.

ఆ యాపారంలో ఆమె నేర్చుకున్న నీతి ఒక్కటే! ఎవ్వరిమీద గూడా నిండా ఆధారపడబాక. నీ యాపారంలో వుండే అన్ని రకాల పనులూ నువ్వు నేర్చిపెట్టుకో. ఏ చిన్నపనైనా, 'నాకు తెలవదు, నువ్వే దిక్కు,' అనే యాతన ఉండిందా... ఆ యాపారం మునిగిందే! పనివాళ్లు ఎందరు పెరిగినా ఆ నీతిని పాటిస్తూనే వచ్చింది. ఎంతగా అంటే కొన్నిసార్లు దూరాన ఉండే ఊర్లకి ఆవుల్ని పంపాల్సి వస్తే తానే స్వయంగా లారీ తోలుకుంటూ వెళ్లిపోయేది. కొలాలం పూరులో బుల్లెట్టు నడిపిన తొలి ఆడదిగా లచ్చనను ఎరిగిన వారికి, ఆమె లారీ తోలుకుంటూ వెళ్లడం పెద్ద ఆశ్చర్యం అనిపించేది కానే కాదు.

❖

ఆరోజున అరవోళ్లూ, తెలుగోళ్లూ అందరూ కలిసి పెద్ద కూటము పెట్టుకున్నారు. వందలమంది వొచ్చినారు. ఎక్కడెక్కడి నుంచో కూడా వొచ్చినారు. తెలిసినవాళ్లూ, తెలియనివాళ్లూ ఎంతో మంది. కొత్త స్నేహాలు, కొత్త బంధాలు ముడిపడతన్నాయి. ఓ పక్కన ఆటపాటలతో వేడుక చేసుకుంటున్నారు. సరిగ్గా పాటల దగ్గరే పుట్టింది రచ్చ. ఆ తిరణాల ఉత్సాహం మొత్తం కొన్ని నిమిషాలు మ్రాన్పడిపోయేలాగా.. .

"నీ తెలుంగు ముత్థాల్ దానే," ఒక ఆడగొంతు ఉరుములా ధ్వనించింది. అంతా ఎక్కడి వాళ్లక్కడ ఆగిపోయారు. ఆ సమయానికి లచ్చన విందు దగ్గర ఏర్పాట్లు చూస్తోంది. ఆ అరుపు విని హడావుడిగా అటుకేసి వచ్చేసరికే జనం గుమికూడిపోయి ఉన్నారు. అరుస్తున్నది మరగతం. అరవోళ్ల సంఘంలో గట్టి నోరున్న ఆడది. అరుస్తూ వగరుస్తోంది. "మొదల్ల నీ వెలియ పో డీ," వగరుస్తూ అరుస్తోంది. జబ్బ పట్టుకుని ఈడ్చి బయటకు తోస్తోంది. ఆ ఎదురుగా ఉన్నది వెన్నెల. తెలుగు పిల్ల. అప్పటికే కళ్లలో నీళ్లు ఉబికేలా ఉన్నాయి.

'ఏం జరిగింది అసలు?' ఆరా తీసింది లచ్చన. అంతా త్యాగరాజు, శ్యామశాస్త్రి కీర్తనలే పాడుతున్నారు. మధ్యలో ఈ వెన్నెల వేదిక ఎక్కి అన్నమయ్య కీర్తన అందుకుంది. ఆ శ్రావ్యతకి అంతా మైరచిపోతున్నారు. మధ్యలో ఆపించి, ముత్తుస్వామి పాట పాడాలంటుంది మరగతం. ఆ ఒక్క కీర్తన పూర్తిచేసి దిగిపోతానంది వెన్నెల. మరగతం విన్లేదు. సంగతి తెలుసుకుని కలగజేసుకుంది లచ్చన.

తమిళం, తెలుగు రెండూ మాట్లాడేవాళ్లు కూటములుగా కలిసినప్పుడు అక్కడ మాటలన్నీ తమిళంలోనే సాగుతుంటాయి. వాళ్లే జాస్తిగా ఉంటారు. వాళ్ల భాషే మాట్లాడతారు. తెలుగోళ్లు కూడా తమిళంలో మాట్లాడితేనే యింటారు. అదోరకం చులకన. అంకెల్లో అల్పులు అయిపోయాక మాట చెల్లకపోవడం మాత్రమే కాదు, భాష కూడా చెల్లదు! అందుకే తమిళంలోనే మరగతాన్ని సర్దడానికి పూనుకుంది లచ్చన..

"అందరూ మనోళ్లే కదా, వదిలెయ్యి క్కా. అందరమూ పండగలాగా ఉన్నప్పుడు రచ్చ ఎందుకు?"

"నేనా రచ్చ యేస్తండానా?" యింకాస్త రెచ్చిపోయింది మరగతం.

"పోన్లే ముత్తుసామి పాటలే పాడిద్దాంలే."

"అబ్బా.. వొచ్చిందండీ పెద్దమనిషి.. దయపెడతా వుంది. మధ్యలో నీ దయ ఏంటే... మా తమిళోల్ల దయతోనే మీ తెలుగోళ్లంతా యీడ బతకతా ఉండారే..."

వాళ్ల మాటలు మొత్తం తమిళంలోనే సాగుతున్నాయిగానీ... మరగతం అన్న ఆ మాటతో సర్దబోయే మాటలకు కూడా అగ్గిపెట్టేసినట్టయింది. ఎవడో సంఘంలో ఒక పెద్దాయన, తమిళుడే, మరగతాన్ని తగ్గమని ఓ మాట చెప్పబోతే గయ్యిమని కసురుకుంది. మర్యాద పోతుందని ఆయనా ఊరుకుండిపోయాడు.

"నువ్వు పాటలు నేర్పిస్తా ఉండావని తెలుగు పాటల కోసం రెచ్చగొట్టి పంపిస్తుండావే. నీకు తెలుగు కొవ్వెక్కి..." మరగతం అక్కసు మొత్తం లచ్చన మీదికి మళ్లిపోయింది. లచ్చనకు తెలుసు. తన ఎదురింటిదే మరగతం. పేడా చెత్తా ఎత్తే బతుకు తనదని ప్రతిరోజూ పలకరింపుల్లో ఎగతాళి చేసేదే మరగతం. బతుకులో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతుండగా తనను చూసినదే మరగతం. పేరుకుపోయిన అక్కసునంతా కక్కేస్తోంది అనిపించింది.

"చూడు మరగతం. నన్ను అను... తెలుగోళ్లనంతా ఎందుకంటావు..." అప్పటిదాకా అణచుకున్నదిగానీ, లచ్చనలో కోపం దాగలేదు.

"అబ్బో వచ్చిందండీ పెద్ద బోడిముండ... మీ తెలుగోళ్లది ఒక జాతీ, మీదొక రీతీ.. థూ! నలుగురిలోకెళ్తే మీరు మా భాష మాట్లాడి బతకడమే గదా... కట్టు బొట్టు అన్నీ మాలాగా కనిపించాలనే ఆత్రమే గదా! మీకంటూ ఒకటేమైనా ఏడ్చిందా? బయటూర్ల నుంచి వొచ్చిన ఆడోళ్లు ఇక్కడ ఇంతమందున్నారు... తెలుగోళ్లు ఎవరో నీకు చేతనైతే గుర్తుపట్టి చెప్పవే.. మియ్యన్నీ సిగ్గూ శరం లేని బతుకులే.. థూ... థూ..."

మందు వేయడానికి కూడా వీలుకానంతగా జాతుల మధ్య పుండు పుట్టించేసింది మరగతం.

మొత్తం వేడుకంతా రసాభాస అయిపోయింది. మరగతం చేసిన రచ్చకి, అందరినీ కలేసి అన్న మాటలకి అక్కడే ఏడ్చిన వాళ్లున్నారు. ఎక్కడా ఏడవలేకపోయినవారున్నారు. కుమిలిపోయిన వారున్నారు.

లచ్చన మాత్రం- 'మరగతం అన్నదాంట్లో తప్పేముంది.. నిజమే కదా,' అనే రంధిలో పడిపోయింది. 'కట్టూ బొట్టూ మొత్తం వాళ్ల మాదిరే కదా ఉంటున్నాం. మరగతం రచ్చ చేయలేదు... మన బతుకులు ఎక్కడ పడి ఉన్నాయో మనకోసారి గుర్తుచేసింది,' అనుకుంది. ఇంటికెళ్లినా తిండి సహించలేదు. పడుకుంటే నిద్ర రాలేదు. అవే మాటలు ఒక్కొక్కటిగా చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి.

పరాయిదేశంలో, వలసబతుకులలో... భాషల, జాతుల

అస్తిత్వాలు ప్రశ్నార్థకంగా మారిన సందర్భం అది. మలేషియాగా చూసుకుంటే వాళ్లందరూ కలిసి ఒక చిన్న గుంపు. అందుకే ఆ గుంపు ఒక కట్టుగా ఉంటూ గుట్టుగా బతికేస్తున్నారు. అదే- ఆ చిన్న గుంపునే లెక్కలోకి తీసుకుంటే తెలుగోళ్లది అతి చిన్న గుంపు! అందుకే చులకన! ఇలా నలుగురిలో మాటలు పడాల్సి వస్తున్న తెలుగు ఆడవాళ్ల మానాన్ని, ఆ చిన్న గుంపు అస్తిత్వాన్ని కాపాడడం ఎలాగ? ఇదే ప్రశ్న తొలుస్తోంది లచ్చన బుర్రలో!

❖

'అస్తిత్వం' ఆ పదమే చంచలం. స్థిరం లేదు దానికి. బతుకు ఒక్కోసారి చాలా నిమ్మళంగా కనిపిస్తూ ఉంటుంది. అంతలోనే అస్తిత్వం ప్రమాదంలో పడినట్లవుతుంది. చిన్నగీత - పెద్ద గీత మాదిరిగానే! పెద్దబతుకు తారసపడగానే మన బతుకు కురచనై పోతుంది. పెద్ద సమూహం తారసపడగానే... మన సమూహం అల్పులం అయిపోతాం. మలేషియాగా చూసినప్పుడు భారతీయులు 'తక్కువ' అనిపిస్తుంది. భారతీయులందరూ ఒకచోట కలిసినప్పుడు, అరవవాళ్ల ముందు తెలుగువాళ్లు 'తక్కువ' అనిపిస్తుంది.

ఈ అగాధాలను ఏ గునపాలు తవ్వుతుంటాయో! ఈ గోడలను ఏ ఇటుకలతో నిర్మిస్తుంటారో! నీ చుట్టూ 'నీ' మంది బలం హెచ్చు కాగానే, అంతసేపు కలిసి ఉన్నవాణ్ని చులకనగా చూసే బుద్ధులు ఏ విత్తులతో మొలకెత్తుతుంటాయో!

ఈ గీతలు గీసే సిరా అనేక రకాలు! దేశం, రాష్ట్రం, ప్రాంతం, ఊరు, భాష, మతం, కులం, రకరకాల రక్తపు సిరాలు. ఈ గీతలు వడపోత అవుతుంటాయి. దీనిని ఎక్కడ ఆపాలి? ఎక్కడ కాపాడుకోవాలి? ఎక్కడైతే పెద్ద ప్రమాదం పొంచి ఉంటుందో అక్కడ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి! ఎక్కడైతే పెద్ద అవమానం జరుగుతున్నదో అక్కడ జాగ్రత్త పడాలి. ఎదుటి వారిని చూడగానే 'మన' అని తెలుసుకునే అస్తిత్వ సంకేతాలు అవసరం ఇప్పుడు!

ఆ రాత్రంతా లచ్చనకు నిద్ర పట్టనేలేదుగానీ, ఆలోచనలు చిక్కబడ్డాయి.

❖

మీ అగాధాలు నన్ను భయపెట్టవు. మీ గోడలు నన్ను ఆప లేవు. మీ బుద్ధులు నన్ను బెదిరించజాలవు. మీరు గీసుకున్న గీతలు నన్ను తాకజాలవు... అన్నట్టుగా ఎర్రెర్రటి జీవచైతన్యాన్ని వెదజల్లు కుంటూ వచ్చేశాడు సూర్యుడు.

తానెరిగిన తెలుగు ఆడోళ్లందరినీ పిలిచింది లచ్చన. పశువుల పాకలో తెలుగు కూటమి పెట్టింది. అందరికీ ఒకటే మాట చెప్పింది. ఆ మాటను ఇంకా తెలిసిన తెలుగోళ్లందరికీ చెప్పమంది. "మీ గౌరవం నిలవాలంటే, మీ బతుకులకి ఒక సొంత ముద్ర ఉండాలంటే... మీ పరువు కాపాడుకోవాలంటే... ఆడోళ్లంతా కుడిపైట యేసుకోండి. బొట్టులో చేసేదేం లేదు. కట్టులో మనదైన ఒక తీరు ఉండాల. కుడిపైట- మన మానం కాపాడతంది. కుడిపైట- మనల్ని మాటలు అనేవాళ్ల నోర్లు మూయిస్తంది. కుడిపైట- మన బతుకుల్ని మనం ఇష్టపడేలా చేస్తుంది. అందురూ యిక నుంచి కుడిపైటే యేసుకోండి. మనకిదేం లేనిదీ, తెలీనిదీ కాదు. మన తాతల కాలంలో అవ్వలు యేసుకున్నదే. మనం మరిచి పోయాం అంతే. యిప్పుడు మన బతుకులు ప్రమాదంలో పడతన్నాయి... ఆ కుడిపైటే మనల్ని కాపాడతంది..."

తేడాగా ఉందనుకున్నారుగానీ... అప్పుడు గుర్తించారు. లచ్చన కుడిపైట చీరకట్టుతోనే అక్కడకు వచ్చింది.

చప్పట్లు కొట్టాలన్నంత తెలివిడి వారికి అప్పటికి లేదు. కానీ వారిలో ఆలోచన పుట్టకపోలేదు. వారికి ఆ మాట మహాబాగా నచ్చక పోలేదు. వారి మనసుల్లో అవమానాల బరువులు దూదిపింజెల్లా ఎగిరిపోయాయి! వారి మొగాల్లో చిరునవ్వులు మొలిచాయి!!

గంగడోలు దువ్వుతున్న లచ్చన చేయి నాకుతోంది, సుబ్రమణి ఆనందంగా!

❖

ఇప్పటికైనా సరే మలేషియా వెళ్లి చూడండి... కొత్తతరం పోకడలు ఎలాగైనా ఉండొచ్చుగాక... కాస్త నడివయసు దాటిన ప్రతి తెలుగు మహిళ, కుడిపైటనే తన సాంప్రదాయంగా, తన అస్తిత్వ ముద్రగా పాటిస్తూ ఉంటుంది. దశాబ్దాల కిందటి మలేషియా తెలుగుజాతికి మాత్రమే కాదు, ఇవ్వాళ్టికీ రేపటికి కూడా 'అల్పం'గా మారుతున్న ప్రతి సమూహానికీ, అస్తిత్వ ప్రదర్శనకు ఒక సంకేతం, ఒక ముద్ర అవసరం ఏర్పడుతూనే ఉంటుంది.



కె.ఎ. మునిసురేష్ పిళ్లే సీనియర్ జర్నలిస్టు. కథకుడు, నవలా రచయిత. ఇప్పటివరకు వీరు రచించిన రచనలతో రెండు సాహిత్య సంపుటాలు ప్రచురించారు. యాభైకు పైగా కథలు రాసారు. తానా కథల పోటీలో బహుమతి లభించింది. సొంత వెబ్‌సైట్ నిర్వహిస్తూ హైదరాబాద్‌లో నివాసం.

ప్రేమ ఋతువును కలగంటూ

పల్లిపట్టు నాగరాజు

మనమెన్నిసార్లు అనుకోలేదూ

చుట్టూ ఎల్లవలై పారుతున్న
దుఃఖపు ఏరుల గుండెగాథల్ని వింటూ
మట్టి చెంపలపై జారే కన్నీళ్లను తడుముతూ

అచ్చం
అమ్మవంటి
అయ్యవంటి
అమిత ఇష్టమైన యీ నేలదేహంపై
రవ్వంతైనా ద్వేషపు ముళ్లకంపలు మొలవని
ప్రేమ ఋతువును కలగంటూ

దిగుల్లేని దారులు కోసరం
దుఃఖించని ఊళ్ల కోసరం
ఎన్నెన్ని కలలరంగుల్ని పులుముకోలేదూ!

ఏ కుట్రల శూలాల మోయని చేతులమై
ఏ కుతంత్రాల అడుగులులేని వీధులమై
నడిచిన చెలిమికాలాన్ని బొమ్మగీసుకుంటూ...

ఊరి అరుగు మీద
'ఉంగా ఉంగా' పాడే చిగురు బుగ్గల్ని ముద్దాడుతూ
యీ ప్రపంచానికి
ప్రేమ తప్ప మరేదీ ప్రాణం కాదంటూ
పాలపెదాలపై పాటలెన్నిరాయలేదూ!

కాలం రానురాను
రాతియుగాల్లోకి దొర్లిపోతా వుంది
అస్తమానం
నమ్మించి గొంతు నులిమే మాటలమారి
పూటకో వేషం మారుస్తూ
ఎంచుకున్న పబ్బాలు గడుపుకోడానికి
పెంచుకున్న పంతాలు నెగ్గించుకోడానికి
విద్వేషాన్ని...
నిప్పులు బంతులగా విసురుతుంటే
దేశం కాలిన బొబ్బలతల్లె
నెత్తురోడుతున్న ప్రేమతోటల దుఃఖం
లోపల సుడులు తిరుగుతోంది

ఎంత దుఃఖం ఎంత దుఖం
అసలెంత కాలమీ దుఃఖం?

చుట్టూ కన్నీటి వరదై పారేటి
యీ కాలువల కళ్లు తుడవడానికే కదా
మనమీ ఏటి వొడ్డున కలుసుకున్నాం
కాలువలంచున
ప్రేమకొమ్మల్ని గాయపరిచే చీడపురుగుల్ని
ఏరిపారేయాలనేగదా
కవిత్వాన్ని గొంతెత్తిపాడుతున్నాం

కవిత్వమంటే
కాలాన్ని కాచే కాపాలదారని
మనమెన్నిసార్లు మాట్లాడుకోలేదూ...!



చిత్తూరు జిల్లాలో జన్మించిన పల్లిపట్టు నాగరాజు తెలుగు ఉపాధ్యాయులు. రాయలసీమ వ్యవహారిక భాషలో వెలువరించిన 'యాలై పూడ్సింది' అనే తొలి వచన కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారాన్ని 2022లో అందుకున్నారు.

నదీ - నేను

దేవనపల్లి వీణావాణి

నేనొక నదిని దాటవలసి వచ్చింది

అక్కడక్కడ లోతులు సుడులు తిరుగుతున్నా
పైకి నింపాదిగా
వెళ్లతుంది నది
చీకటి, వెలుగుల ప్రభావం చూసేవాళ్ల
మీద తప్ప నది ప్రయాణంలో లేదు

ఎక్కడికో వెళ్లి తన ఉనికిని మరో
విశాలమైన నీటి తావులో కలిసిపోతే
గానీ తీరని తృష్ణ ఒకటి నదిని
వెంబడిస్తుంది.

ఎవరిని ఎలా కలుసుకోవాలో నీళ్లకు
తెలిసినట్టు ఎవరికీ తెలియదు.
నాకు కూడా తెలియదు.

నాలోనూ నీళ్లు ఉన్నాయి...
కలలుగానో కన్నీళ్లుగానో
జారిపోతాయి.

నేను దాటవలసిన నది మీద నా
అడుగుల బలం ఏ మాత్రం సరిపోదని
తెలుసుకున్న క్షణం నాకో పుస్తకం
బహుమతిగా వచ్చింది..
ఆ క్షణం అక్కడ బోధి చెట్టు లేదు
అది ఇప్పుడు
పుస్తకంగానూ, కొన్ని అక్షరాలుగానూ...



దేవనపల్లి వీణావాణి రెండు కవితాసంపుటాలు, పర్యావరణ దృక్పథంతో రాసిన వ్యాస సంపుటి ప్రచురించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఉద్యోగం. క్రమం తప్పకుండా కవితలు రాస్తున్న రచయిత్రి.

మెట్లులేని బాధ

తగుళ్ల గోపాల్

ధైర్యమయితే జెప్పినగాని
నాకు ధైర్యంజాలలే

బలపాలు నోట్లో పెట్టుకొని
పలక మీద అఆలు పెట్టీయమనే బుజ్జమ్మ
ఇపుడు ఒక పిల్ల తల్లై
బతుకును చెరిపేసుకోవాలని చూస్తుంది.

బుజ్జమ్మా... ఎట్లున్నవురా అని
మాట కలిపితే
గాజులు పగిలి రక్తం కారుతున్న
చేయి చూపించింది
మొగడు ఎట్లాంటోడో చెప్పలేకపోయింది గానీ
ఉబ్బిన కన్ను మాట్లాడింది.

చదువుకునేదాన్ని తీసుకొచ్చి
ఈ బాయిల నూకిండ్రు నన్ను
అత్త కప్పల బెకబెకలు
మరిది పాముల బుసబుసలు
నాకు 'దరి' దొరకకుండా జేసినయి
ఈ బాయి ఎక్కనీక
మెట్లే లేవా సార్ అని అడిగింది.
ఆశగా
అమాయకంగా.

నేనెట్లాంటిదానినో
మీకు తెలిసే కదా సార్...

ఈ కొడుకును ఎవనికి కన్నవో అని
అనుమానపు పామును మెడలేసిండ్రు

నన్ను పిచ్చిదాని జేసి
తల్లిగారింటికాడ తోలిపోయిండ్రు
నాకు బతుకబుద్ధి కాలే సార్
పత్తి చేలకు గొట్టె
పురుగు మందు కూడా తాగిన

ఎప్పుడైన
అటెండర్ తాత లేకుంటే
ఈ బడి మొత్తం నేనే ఊకేది కదా
ఇప్పుడు పొరక కూడా పట్టలేకపోతున్న
వాళ్లు కొట్టిన దెబ్బలకు
నొప్పుల కుప్పనైన

మీరు చిన్నప్పుడు చెప్పిన
సీతాదేవి కథలెక్కనే నా బతుకైంది సార్
అగ్ని ప్రవేశం చేయలేదన్న మాటేగాని
నిప్పును నెత్తిన మోస్తు బొగ్గునైతున్న-

పురుగుపట్టిన పత్తికొమ్మలో
సగం తినేసిన ఆకు కదిలినట్లు
బుజ్జమ్మ కండ్లు నలుసుకొని మాట్లాడుతుంటే
ఎట్ల ఓదార్చాలో తెల్వలే

వెనుకకు తిరుగకుండా
బిడ్డను జోకుట్టుకుంటా తాను పోతుంటే
ఎక్కిళ్లతో ఎగిసిపడుతున్న సముద్రాన్ని
జోలపాడి పడుకోబెడుతున్నట్లుగా వుంది

చాలా రోజుల తరువాత బడిముందలంగ పోతున్న మా
స్టూడెంట్‌ను పలకరించినపుడు...



తగుళ్ల గోపాల్ మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2016లో 'తీరొక్క పువ్వు' నానీల సంపుటి వెలువరించాడు. 2019లో 'దండకడియం' కవితాసంపుటిని తీసుకొని వచ్చారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం-2021 లభించింది. ప్రస్తుతం వెల్దండ మండలం అజిలాపురం గ్రామంలో ఉపాధ్యాయుడిగ పనిచేస్తున్నాడు.

కారు దాకిలో...

తమ్మినేని యదుకుల భూషణ్

చిరు చీకటి పడితేగాని
మిణుకుమిణుకుమనే
తారల వెలుతురును
ఆనవాలు పట్టలేవు

మాసిన మాటలతో
మసిబారిన మనసును
మౌనం ఆవరిస్తే గాని
అపరచితంగా తోచిన

అక్షరాలు అమాంతం
నక్షత్రాల్లా మెరిసి
తక్షణం నీకు
దారి చూపలేవు.

తమ్మినేని యదుకుల భూషణ్ కవితలు, కథలు, విమర్శలు రాసినా కవిగా ప్రసిద్ధులు. నిశ్శబ్దంలో నీ నవ్వులు కవితా సంకలనం ప్రచురించారు. రాయలసీమలో జన్మించిన వీరు కొన్నాళ్లు సింగపూర్‌లో పనిచేసి ప్రస్తుతం న్యూజెర్సీ సోమర్‌సెట్‌లో నివాసం.


నమ్మకం

దేశరాజు

కొన్నిసార్లు అంతే–
నిండా మునిగిపోయినట్టు,
కాళ్లు అందక, చేతికి ఏ ఆసరా దొరక్క..
శ్వాసలో గాలికి బదులు నీళ్లు చొరబడినట్టు,
ఇక అంతా ముగిసిపోయినట్టే అనిపిస్తుంది.
కుటుంబ సభ్యుల ముఖాల్లోకి చూడలేం
ఎవరిలో ఏ భయం నీడ కదలాడుతోందో చెప్పలేం
ఎదురిల్లో, పక్కిల్లో.. పలకరించలేం
ఎవరిలో ఏ ఆందోళన పురివిప్పినా తట్టుకోలేం
అదిగో వాట్సప్ అంటే.. ఇదిగో తోక అంటారు కేతిగాళ్లు
సోషల్ మీడియాలో స్వేచ్ఛ ఎక్కువే..
ఫ్లూ గురించి కొందరు ప్రవచిస్తారు
రోకటి పోటుకే వెరవలేదు, గుండెపోటెంతని
మరి కొందరు బీరాలు పలుకుతారు
బ్యాక్టీరియాకీ, వైరస్‌కీ తేడా తెలియదుగానీ..
వ్యాక్సిన్‌పై విశ్లేషణలకు మాత్రం తయారవుతారు
వీళ్లే మన వేకువల్లో నిశీధిని నింపుతున్న విలయకారులు!
కొన్నిసార్లు అంతే–
నువ్వో, నీ ఇల్లో, నీ ఊరో, రాష్ట్రమో, దేశమో కాదు,
మొత్తం మానవాళే పెద్ద దుప్పటి కప్పుకుని..
బిక్కుబిక్కుమంటూ భయం, భయంగా వణుకుతూంటుంది
ఈ విశ్వ మానవాళి వెన్ను నిమిరి..
గుక్కపట్టే గుండెలకు కాసింత ఉగ్గుతాపే..
మహాశక్తిలాంటి నమ్మకాన్ని
మనమే పిడికిట పట్టాల్సి వుంది.



దేశరాజుగా అందరికీ సుపరిచితులైన దేశరాజు రవికుమార్ పుట్టింది, పెరిగింది గోదావరి జిల్లాల్లో, చదివింది శ్రీకాకుళం జిల్లాలో, జర్నలిస్ట్‌గా స్థిరపడింది హైదరాబాద్‌లో. కవిత్వం, కథలతోపాటు ఇంటర్వ్యూలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. రెండు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు వెలువరించారు.



Master the art of Meditation
using Heartfulnessapp.org
Available on IOS and Android.

heartfulness
advancing in love

www.heartfulness.org
info@heartfulness.org

For free meditation sessions,
We all need moments of peace and joy in life. Rather than waiting for them to happen by chance, why not take the lead? Scan and signup now.

/heartfulness /heartfulness /heartfulness /heartfulness

Thanks


people
MEDIA
FACTORY

Parents did their job raising us...



are we doing ours in taking care of them?



PARENTS HEALTH MONITORING

PARENTS PULSE

parents health on finger tips

for more details
please contact at
509 588 0000

LAUNCHING
SOON IN
INDIA